Referred Journal &
Peer Reviewed Journals

RNI No.
APTEL/2003/12253

# భావవీణ

**SPECIAL MAGAZINE**

Web : www.bhavaveena.com

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 23 | Spl. Issue | May 2026 | BHAVAVEENA | ISSN No. 2456-4702 | RNI No. APTEL/2003/12253

## జానపద కళారూపాలు - కళాకారుల వృత్తి జీవన చిత్రణ



సంపాదకులు :
డాక్టర్ యన్. అరుంధతి
డి. రాజు

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253



# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522 034.
Mail : bhavaveena2024@gmail.com
Cell : 99499 29674, 79890 88274.

**BHAVAVEENA**
(SPECIAL MAGAZINE)
Journal - Arts, Literature, Culture and Language Study

Reffered Journal & Peer Reviewed Journals
ISSN No. : 2456-4702
RNI No. : APTEL/2003/12253

| | | |
|---|---|---|
| ముద్రణ | : | **మే - 2026** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 15/-** |
| కాపీలకు | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్ గుంటూరు జిల్లా, సెల్ : 94 94 660 509.** |




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

*Founder :*
Kolla Sri Krishnarao (Late)

*E-mail :*
bhavaveena2024@gmail.com

7989781963
9949929674
☎ 7989088274

# 135-14-716, Dwaraka Nagar,
12th Lane, Nagaralu, Guntur - 522034.

**Vol. 23 - Spl. Issue. 05 - May 2026 - Reffered Journal & Peer Reviewed Journals - Rs. : 15/-**
**| ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253 |**



**EDITORIAL BOARD**

*Honourable Editor*
**Dr. PITTA SANTHI**
*M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),Ph.D.*

*Chief Editor*
**Dr. PAYARDA NAGAIAH**
*M.A.(Tel), M.A(Pol-Sci).,M.Ed.,Ph.D.*
# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**ADVISORY COMMITTEE**

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Former Vice Chancellor,
Dravidian University, Kuppam, A.P.

2. **Prof. G. Yohan Babu,** (Rtd.) M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.

3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.

4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Hyderabad Central University, Hydetabad, Telangana.

5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.

6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD, Dept. of Telugu
Sri A.S.N.M. Govt. Degree College,
Palakollu, West Godavari Dist., A.P.

7. **Prof. T. Rama Prasad Reddy**
Dean, Faculty of Arts & Education,
Yogi Vemana University, Kadapa, Andhra Pradesh.

8. **Dr. T. Swarupa Rani,** M.Sc., M.Ed., M. Phil., Ph.D.
Principal,
St.Joseph's College of Education for Women,
Sambasivapet, Guntur, Andhra Pradesh.

**ASSOCIATE EDITORS**

1. **Prof. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.

2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI,
Tamilnadu.

3. **Dr. D. SESHU BABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Dr. CHINTHAM PRAVEEN KUMAR**
HOD, Dept of Telugu
University Arts & Science College (UASC),
Kakatiya University Subedari - 506001
Hanumakonda,Warangal, Telangna.

7. **Prof. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Prof. N. Eswar Reddy,** M.A., PhD.
Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46,
Hyderabad, Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu
Central University, Gachibowli, Hyderabad,
Telangana.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Associate Professor, Dept. of Telugu
P.G. Centre, Gadwal,
Palamuru University,
Mahabobnagar, Telangana.

**LEGAL ADVISER**

**Pitta Sundara Babu**, ***M.A., B.L.,***
Advocate, Narasapur.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, Guntur - 2. Cell : 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11 Brodipet, Guntur - 522 002, Andhra Pradesh. Cell : 7386529274, 7989781963, E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్

## (స్వయం ప్రతిపత్తి)




## మెదక్ జిల్లా - తెలంగాణ రాష్ట్రం.

# జానపద కళారూపాలు -
# కళాకారుల వృత్తి జీవన చిత్రణ

సంపాదకులు :
డా॥. యన్. అరుంధతి
డి. రాజు

# హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ

## హైదరాబాద్ - తెలంగాణ.



ఆచార్య పి. వారిజారాణి

## ముందుమాట

జానపద విజ్ఞానంలో మౌఖిక జానపద వాఙ్మయం, భౌతిక వస్తు సంస్కృతి, వారి ఆచార వ్యవహారాలు, జానపదుల ప్రదర్శన కళలు/కళారూపాలు ప్రధాన భాగాలు. జానపద వృత్తి కళారూపాలు తెలుగువారి సాంస్కృతిక వారసత్వానికి మూలాలు. ఇవి కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా, ఒక నిర్దిష్ట కులం లేదా వర్గం వారికి జీవనాధారంగా, వారి ప్రధానవృత్తిగా కొనసాగుతున్నాయి.

జానపద వృత్తి కళారూపాలు సాంస్కృతిక వారసత్వాన్ని, తరతరాలుగా మౌఖికంగా సంక్రమించిన జ్ఞానాన్ని, జాతి చరిత్రను, సంప్రదాయాలను కాపాడుతున్నాయి. పూర్వ కాలంలో ఇవి గ్రామీణ ప్రాంతాల్లో ప్రదర్శనల ద్వారా సామాన్య ప్రజలకు నైతిక విలువలను బోధిస్తూ, సామాజిక చైతన్యాన్ని పెంపొందించేవి.

కథాగానాల ద్వారా పురాణ గాథలను, వీర గాథలను, పాటలు, నృత్య ప్రదర్శనల రూపంలో సామాన్యులకు ఆసక్తికరంగా, అర్థమయ్యేలా వివరించడం వీటి ప్రధాన ఉద్దేశం.

ఈ కళలే కొందరు కళాకారులకు ప్రధాన ఆదాయ వనరుగా, జీవనాధారంగా ఉండేవి. ఒక నిర్దిష్ట కులం వారు తమ ఆశ్రిత కులాల కోసం ప్రదర్శనలు ఇచ్చి వారినుండి ప్రతిఫలం పొందేవారు.

**ప్రధాన కళారూపాలు – కళాకారులు**

తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా వృత్తి కళాకారులు ప్రదర్శించే రూపాలు :

- **ఒగ్గుకథ** : యాదవ కులస్తులు తమ కుల దైవమైన మల్లికార్జున స్వామి కథలను చెప్పడానికి ప్రదర్శించే విశిష్ట కళారూపం.
- **పంబకథ** : పంబ అనే వాద్యాన్ని వాయిస్తూ, పంబల వారు ప్రదర్శించేది పంబకథ.ముఖ్యంగా వీరుగ్రామాల్లో ఆయా గ్రామ దేవతల కథలను వినిపించేవారు.

- **రుంజకథ** : విశ్వబ్రాహ్మణుల పుట్టుపూర్వోత్తరాలను తెలిపేందుకు రుంజ వాద్యం సహాయంతో ఈ కథను చెబుతారు.
- **శారదకాండ్రు** : వీరు వీరగాథలను పాడుతూ ప్రజలను ఆనందింపజేస్తారు.
- **చిత్రపట కళాకారులు** : పటాల సహాయంతో పురాణ కథలను వివరించే కాకి పడిగెల వారు, మందెచ్చుల వారు వంటి కళాకారులు తెలంగాణలో ప్రాచుర్యం పొందారు.

తెలుగు సమాజంలో వృత్తి కళాకారులు ఒక ప్రత్యేకమైన సామాజిక వర్గం. వీరి జీవితం ప్రధానంగా తాము నమ్ముకున్న కళ, తమ ఆశ్రిత కులాల చుట్టూ తిరుగుతుంది.

మారుతున్నసామాజిక పరిస్థితులు, అవసరాల దృష్ట్యా మారుతున్న జీవన విధానం, వృత్తి కళాకారుల సామాజిక జీవనవిధానాన్ని, వారి ప్రస్తుత స్థితిగతులను అతలాకుతలం చేస్తున్నది. కళలే వృత్తిగా జీవనం సాగించే బతుకులు ఛిద్రమవుతున్న ఈ సందర్భంలో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని తెలుగు అధ్యాపకులు ''జానపద కళారూపాలు - కళాకారుల ప్రస్తుత వృత్తి జీవితా''న్ని ఆధారంగా చేసుకుని ప్రదర్శన కళలకు, వివిధ వృత్తి కళాకారుల జీవితాలకు సంబంధించిన విలువైన 31 వ్యాసాలను ఏర్చి, కూర్చి నాణ్యమయిన వ్యాసాలను ఎంపికచేసి భావవీణ పత్రిక ద్వారా ప్రచురించాలనే ప్రయత్నం. వారిసంకల్పం ఉన్నతమైంది. ఈ వ్యాసాల సంకలనం నిరాదరణ కారణంగా అంతరిస్తున్న కళారూపాలు, వృత్తికళాకారుల సామాజిక, ఆర్థికపరమైన స్థితిగతులను వ్యక్తీకరిస్తూ, ఆ కళాకారులకు చేయూతనందిస్తూ, కళలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి.

ప్రతి కళారూపం వెనుక ఎందరో వృత్తికారుల జీవితాలు ముడిపడి ఉన్నాయి. పటం కథలు చెప్పటానికి ఒక్కొక్క పటం తయారు చేయటానికి పట్టే సమయం, ఆ పటాలకు రంగులు అద్దే నేర్పరితనం గొప్ప శ్రమ,నైపుణ్యంతో కూడుకున్నది. తోలుబొమ్మలను తయారుచేసే క్రమం వెనుక ఉన్న కష్టం, తోలుబొమ్మలతో కథను చెప్పే విధానం తరతరాలకు కొనసాగింపుగా ఉండే సంస్కృతిగా ముందుతరాలకు అందించాలి. సాంకేతిక పరిజ్ఞానానికి, యాంత్రికతకు ప్రాధాన్యతను ఇస్తూ మానవ వనరులకు, నైపుణ్యానికి విలువ లేకుండా చేస్తున్న యాంత్రిక జీవన విధానానికి స్వస్తి చెప్పి, వృత్తి కళాకారుల నేర్పరితనం, నైపుణ్యాన్ని గుర్తించి, వారి నైపుణ్యానికి తగిన గౌరవం, గుర్తింపు, ప్రతిఫలం అందేలా చూడటం మనందరి బాధ్యత.

కళ అనేది పుట్టుకతో స్వయంప్రతిభగా వచ్చేది. వృత్తిపని చేసేవారు ఒక వస్తువును నైపుణ్యంతో అందంగా మలచడమే కళ. అది అందరికీ రాదు. తోలుబొమ్మలాట, హరికథ, పటంకథ, యక్షగానం వంటి ప్రదర్శన కళలు, వృత్తి కళాకారుల కుటుంబాలలోని వారికి పుట్టుకతోనే నైపుణ్యాన్ని ప్రసాదిస్తాయి. ఆయా వృత్తి కళాకారుల కుటుంబాలలోని యువతరం కూడా చదువుకోవడంతో పాటుగా వారి వారివృత్తులను నేర్చుకుని, కొనసాగిస్తూ వృత్తుల పట్ల గౌరవభావంతో ఉండాలి. ఆయా వృత్తిపనిలో వారి సంతానానికి నైపుణ్యం వంశపారంపర్యంగా అబ్బుతుంది. దానిని అగౌరవంగా, నిర్లక్ష్యంగా చూడకూడదు. చదువుకున్న ప్రతి వ్యక్తీ ఉద్యోగం సంపాదించుకోగలరో లేదో, సంపాదించుకున్న ఉద్యోగంలో ఎంత సంతృప్తి పొందుతారో తెలియదు కానీ ఒక వృత్తిలో నైపుణ్యం కలిగిన వ్యక్తి, తన వృత్తిపట్ల గౌరవంతో, అలసత్వం లేకుండా పనిచేస్తే, మాత్రం సంతృప్తితో పాటు తప్పకుండా ఆర్థిక, సామాజికపరంగా స్వతంత్రంగా నిలదొక్కుకుంటూ మరో పదిమందికి కూడా జీవనోపాధిని కల్పించే స్థాయికి

ఎదుగుతారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్రభుత్వంపైన ఆధారపడే అవకాశమేలేదు. అలాంటప్పుడు మన కళలను వృత్తిగా ఎంపిక చేసుకుని, దాన్ని కొనసాగిస్తూ, దానిని జీవనోపాధిగా మలచుకోవడంలో సంకోచం ఉండకూడదు.

ముఖ్యంగా జానపద వృత్తి కళాకారుల జీవనవిధానాన్ని ఈ క్రింది అంశాల ద్వారా అర్థం చేసుకోవచ్చు :

**సామాజిక సంబంధాలు (ఆశ్రిత వ్యవస్థ)**

పూర్వ కాలం నుండి వృత్తి కళాకారులు ఒక నిర్దిష్ట కులానికి 'ఆశ్రితులు'గా ఉండేవారు. ఉదాహరణకు, యాదవులకు ఒగ్గు కళాకారులు, పద్మశాలీలకు మార్కండేయ పురాణం చెప్పే పటాల వారు, విశ్వబ్రాహ్మణులకు రుంజ వారు ఆశ్రితులుగా ఉండేవారు. ఏటా ఒక నిర్ణీత సమయంలో తమ దాతల (యజమానుల) ఇళ్లకు వెళ్లి, వారి వంశ చరిత్రను, కుల దైవాల కథలను పాడి వినిపించేవారు. దీనికి ప్రతిఫలంగా వారికి ధనం, ధాన్యం, బట్టలు, ఇచ్చేవారు.

**సంచార జీవనం**

చాలామంది వృత్తి కళాకారులు సంచారజీవితం గడుపుతారు. దీనికి కారణం వీరు సంవత్సరంలో సగం రోజులు తమ గ్రామాల్లో ఉంటే, మిగిలిన సగం రోజులు ప్రదర్శనల కోసం ఊరూరా తిరుగుతూ ప్రదర్శనలిస్తూ తమ వాద్యాలు, వేషధారణ సామగ్రిని భుజాన వేసుకుని ప్రయాణించడం వీరి దైనందిన జీవితంలో భాగం.

**ఆర్థిక స్థితిగతులు**

ఒకప్పుడు ఈ కళాకారులకు సమాజంలో గౌరవంతో పాటు ఆర్థిక భద్రత ఉండేది. గ్రామస్తులు ఇచ్చే సంభావనలు వారి జీవనానికి సరిపోయేవి. కానీ, కాలక్రమేణా మారుతున్న సామాజిక పరిస్థితులు, ఆధునిక వినోద సాధనాల కారణంగా వీరి ప్రదర్శనలకు ఆదరణ తగ్గి, వీరికి ఆర్థిక సంక్షోభం మొదలైంది.

**కళాకారుల ప్రస్తుత స్థితిగతులు – సవాళ్లు**

- **వృత్తి మార్పిడి** : కళ మీద వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో, నేటి తరం కళాకారులు వ్యవసాయ కూలీలుగా లేదా పట్టణాలకు వలస వెళ్లి ఇతర పనుల్లో స్థిరపడుతున్నారు.
- **గుర్తింపు కొరత** : ప్రభుత్వాలు వాటిని గుర్తించి ఇచ్చే ప్రోత్సాహకాలు అందరికీ అందకపోవడం ఒక ప్రధాన సమస్య.
- **శిక్షణ లేకపోవడం** : వృత్తికళలు తండ్రి నుండి కొడుకుకు వారసత్వంగా వచ్చేవి. కానీ ప్రస్తుత తరం ఈ కష్టతరమైన వృత్తి పట్ల ఆసక్తి చూపకపోవడంతో ఈ కళలకు వారి కుటుంబసభ్యులే ఆదరించకపోవడంతో ఆయా కళలు అంతరించిపోతున్నాయి.

**సాంస్కృతిక ప్రాధాన్యత**

ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కూడాఈనాటికీ గ్రామాల్లో జాతరలు, పండుగల సమయంలో ఈ వృత్తి కళాకారుల పాత్ర ప్రధానంగా ఉంటుంది. వీరు తమ కళా ప్రదర్శనల ద్వారా గ్రామీణ సంస్కృతిని, భాష, యాసలను సజీవంగా ఉంచడంలో వీరి పాత్ర  మరువలేనిది.

ప్రభుత్వం నుండి వృత్తి కళాకారులకు ప్రోత్సాహకాలను ఇస్తూ, ఇంతకు ముందులాగే ప్రభుత్వ కార్యక్రమాలలో ఈ కళాకారులను, కళలను ప్రదర్శించే అవకాశాలు కల్పిస్తూ, ఆ కళారూపాలపట్ల నేటి తరానికి ఆసక్తిని పెంపొందించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. సామాన్యులు కూడా ముఖ్యంగా యువతరం ఆధునిక వినోద సాధనాలైన

సామాజిక మాధ్యమాలకు బానిసలుగా మారుతూ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా, ఆయా కళల్లో నైపుణ్యాన్ని సాధిస్తూ, యాంత్రిక సాధనాలను వారి వృత్తికి, నైపుణ్యానికి మెరుగులు దిద్దే సాధనాలుగా ఉపయోగించుకుని తెలుగువారి సంస్కృతిలో అంతర్భాగమైన కళారూపాలను కాపాడుకుంటూ, పూర్వ వైభవాన్ని తీసుకుని రావాలని ఆకాంక్ష.

భావవీణ పత్రికా సంపాదకులతో కలిసి వివిధ వృత్తికళాకారుల జీవనవిధానాన్ని గురించి విశ్వవిద్యాలయాల్లో, డిగ్రీ కళాశాలల్లో అధ్యాపనం చేస్తున్న అధ్యాపకులు, పరిశోధకులనుండి వ్యాసాలను సేకరించి, ఇంత మంచి వ్యాససంకలనాన్ని తేవటానికి కృషి చేసిన డా॥. అరుంధతి రాజు గారికి ప్రత్యేకంగా అభినందనలు.

ఈ వ్యాసకర్తలందరూ ఎంతో అధ్యయనం, పరిశోధన చేసి వారి వ్యాసాలను రాసారు. ఆ వ్యాసాల్లో మొదట గ్రామగ్రామాల్లో పట్టపగలు సంచరిస్తూ, వివిధ పాత్రల వేషాలను ధరించి ప్రదర్శించే కళారూపం పగటివేషం. ఆ కళను ప్రదర్శించే కళాకారుల జీవన చిత్రణ చేస్తూ కూచిపూడి కళాకారులు ప్రదర్శించే పగటివేషాలు అత్యంత ప్రజాదరణ పొందాయని, ప్రపంచీకరణ కారణంగా ఈ కూచిపూడి కళ ప్రపంచ ప్రఖ్యాతిని పొందటమే కాకుండా, అంతర్జాలం ద్వారా ఎందరో ఈ కళలో శిక్షణ తీసుకుంటున్నారని వామనమూర్తిగారు చెప్పారు. ప్రజానాట్యమండలి ద్వారా శ్రోతల మనసును రంజింపజేసి, హాస్యరసాన్ని పండించిన జానపద కళారూపం 'పిట్టలదొర'. ఈ కళారూపం ఈనాటి తరానికి తెలియకుండా మసకబారిపోయిందని భావిస్తున్నారు వేణుగోపాలశర్మగారు.

చిందు భాగవతం ప్రదర్శిస్తున్న సమయంలో ప్రేక్షకులకు విసుగు కలుగకుండా బఫూన్ లాంటి వేషధారణ, ప్రవర్తనతో నవ్వుపుట్టించే ప్రధాన హాస్యపాత్రధారి బుడ్డర్ ఖాన్. ఆపాత్ర ప్రత్యేకతను తెలుపుతూ పిట్టలదొర లాంటి వేషంతో నవ్వుతూ, నవ్విస్తూ ఉండే ఈ పాత్ర ప్రస్తుతం కనిపించడం లేదని భావించారు బాశెట్టి లతగారు.

హరికథను జానపదకళారూపంగా చెప్పుకున్నా ఇది ప్రదర్శించినవారు ఎక్కువగా చదువుకున్న విద్వాంసులు, పండితులే. కోటా సచ్చిదానందశాస్త్రి లాంటివాళ్లు నర్తనశాల వంటి ప్రదర్శనలతో శ్రోతలను తమ కథాగానంతో పాటు అభినయం కూడా ప్రదర్శిస్తూ వీక్షకులకు కనువిందు చేసేవారు. అలాంటి ప్రసిద్ధ కళారూపం హరికథను గురించి దివ్యగారు పరిచయం చేశారు. ఇంద్రజాలం ద్వారా తమ చాతుర్యాన్ని, తెలివితేటలను ప్రదర్శిస్తూ, ప్రేక్షకులను ఆహ్లాదపరుస్తూనే, శాస్త్రబద్ధంగా, ఆలోచనాత్మకంగా ఉండి, ఎంతో సాధనచేసి, అబ్బురపరిచే రీతిలో ఇంద్రజాల కళను ప్రదర్శించే సాధనశూరుల ప్రదర్శన విధానాన్ని, వేషధారణను, వృత్తికళా రూపాన్ని, జీవనశైలిని గురించి విలువైన విశ్లేషణ చేశారు అధ్యాపకులు రాజు గారు. అదేవిధంగా పోషకులైన రజకుల ఆశ్రయంలో జీవిస్తూ, వారికి పటం కథలను వినిపిస్తూ, వారి ఆశ్రితులైన మాసయ్య పటం కళాకారుల సామాజిక, ఆర్థిక జీవన విశ్లేషణ చేసారు గడ్డం వెంకన్నగారు. తోలుబొమ్మలాటను గురించి హరితగారు, యక్షగాన కళారూపం - కళాకారుల జీవన విధానాన్ని గురించి తలారి ఢాకన్నగారు వివరించారు. బుడిగె జంగాల జీవనశైలిని గురించి రుద్రంగి రమేశ్ గారు, ఒగ్గుకథలోని తెలంగాణ భాషా సౌందర్యాన్ని - సాంస్కృతిక అభివ్యక్తీకరణను గురించి మహేందర్ రెడ్డి గారు, "రెండు జివునాల మనిషి", "డొక్కల కార్యం", "రాయసంటోడు, లక్కసంటోడు" లాంటి తెలంగాణ భాషాసంపదను విశ్లేషణ చేశారు. చిరుతల రామాయణ కథాగానం - వేషధారణ, ప్రదర్శన విధానం, భజన సంప్రదాయాన్ని గురించి ప్రసిద్ధిపొందిన కళాకారులు లింగా శ్రీనివాస్ గారు గొప్పగా విశ్లేషించారు. వాటితోపాటు గోసంగుల ప్రదర్శన కళను పరిచయం చేశారు నాగరాజు గారు. గట్టు మల్లన్న స్వామి జాతరలో ఒగ్గు కళాకారుల ప్రాశస్త్యాన్ని గురించి మానసగారు తెలియజేశారు.

తెలంగాణ ప్రాంతంలోని యాదవ సమాజానికి సంబంధించిన గొల్లసుద్దుల కళారూపం గురించి తెలిపి కళాకారుల సామాజిక జీవన విధానాన్ని పరిచయం చేస్తూ అరుంధతిగారు ప్రజల్లో నైతిక విలువలను పెంపొందిస్తూ, జాతీయ భావనపట్ల చైతన్యాన్ని, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను విమర్శిస్తూ, ఈ కళ కేవలం వినోదం పంచడానికి మాత్రమే కాకుండా ప్రజల్లో ధర్మం, నీతి, సమానత్వ భావనలను బోధించే సాధనంగా ఈ కళ ప్రజలను చైతన్య వంతులుగా తీర్చిదిద్దుతుంది అని భావించారు.

యక్షగానంలో రసపోషణను గురించి, కోలాటం పాటలు - ప్రదర్శన విధానం, ఒగ్గు కథ కళారూపం - బీరప్ప కథ ప్రదర్శన వైశిష్ట్యాన్ని గురించి, చెంచుల జానపద సంస్కృతిని గురించి తెలుపుతూ ప్రకృతి ఆధారిత జీవనవిధానంలోని గొప్పతనాన్ని విశ్లేషించిన వ్యాసాలు వివరణాత్మకంగా ఉన్నాయి. పగటి వేషాలు - బహురూప నటనలో దాగి ఉన్న సామాజిక అస్తిత్వాన్ని గురించి బొడ్డు భరద్వాజగారు సమగ్రమైన సమాచారాన్ని అందించగా బంజారా వృత్తి కళాకారుల జీవనశైలి నాటికి, నేటికీ ఏ విధంగా మార్పుచెందిందో తెలిపారు కిషన్ గారు. జానపద సాహిత్యంలోని వీరగాథల వైశిష్ట్యాన్ని తెలుపుతూ చరిత్రలో ప్రసిద్ధిపొందిన వీరులను గురించి చిత్రించిన విధానాన్ని, కథాగానం చేసే కళాకారుల జీవన విధానాన్ని పరిచయంచేశారు జ్ఞానానందం గారు. చివరగా సమకాలీన సమాజంలోని కళారూపాలను, కళాకారుల జీవన స్థితిగతులను గురించి విలువైన విశ్లేషణ చేసారు రత్నప్రసాద్ గారు.

మెదక్ ప్రభుత్వ కళాశాల యాజమాన్యం ఇలాంటి మరెన్నో మంచి పనులకు పూనుకుని, ముఖ్యంగా యువతరానికి వివిధ వృత్తుల్లోని వైశిష్ట్యాన్ని, వృత్తి కళాకారులపట్ల గౌరవభావాన్ని పెంపొందించేలా సరైన మార్గనిర్దేశం చేస్తారని ఆకాంక్షిస్తూ.. నాకు ఒక మంచి వ్యాస సంకలనాన్ని గురించి రెండు మాటలు రాసే అవకాశాన్ని ఇచ్చిన అరుంధతికి, కళాశాల యాజమాన్యానికి ధన్యవాదాలు. వ్యాస రచయితలకు అభినందనలు.



**(ఆచార్య పి. వారిజారాణి)**

# తెలంగాణ రచయితల సంఘం



డా॥. నాళేశ్వరం శంకరం
అధ్యక్షుడు

## ముందుమాట

జానపద కళలు మన సంస్కృతికి మూలాధారాలు. అవి కేవలం వినోదానికి పరిమితం కాకుండా, మన పల్లె జీవన విధానాన్ని, సంప్రదాయాలను, భావజాలాన్ని ప్రతిబింబించే వారసత్వ సంపద. ఈ నేపథ్యంలో వెలువడుతున్న "జానపద కళారూపాలు - కళాకారుల వృత్తి జీవన చిత్రణ" అనే వ్యాస సంకలనం మన జానపద ప్రపంచాన్ని సమగ్రంగా ఆవిష్కరించే ఒక విలువైన కృషిగా నిలుస్తోంది.

ఈ గ్రంథంలోని వ్యాసాలు వివిధ జానపద కళారూపాల విశిష్టతను మాత్రమే కాకుండా, వాటిని జీవనాధారంగా ఎంచుకున్న కళాకారుల కష్టసుఖాలను సున్నితంగా చిత్రీకరించాయి. కొన్ని వ్యాసాలు కళల పుట్టుక, అభివృద్ధిని వివరించగా, మరికొన్ని వ్యాసాలు కళాకారుల జీవన పోరాటాన్ని, హృదయాన్ని తాకే విధంగా ఉన్నాయి.

అలాగే ఆధునికీకరణ ప్రభావంతో జానపద కళలు ఎదుర్కొంటున్న సవాళ్లను విశ్లేషిస్తూ కొన్ని వ్యాసాలు ఆలోచింపజేశాయి.

యువతలో జానపద కళల పట్ల ఆసక్తిని పెంపొందించే దిశగా కూడా ఈ సంకలనం ప్రేరణనిస్తుంది. ఈ వ్యాస సంకలనంలోని ప్రతి వ్యాసం ఒక సామాజిక పర్యవేక్షణ మాత్రమే కాకుండా, ఒక భావోద్వేగ ప్రయాణం. పాఠకుడికి కేవలం సమాచారం అందించడమే కాకుండా, మన సంస్కృతిపై బాధ్యతను గుర్తుచేసే లక్షణం ఈ సంకలనం ప్రత్యేకత.

ఈ సందర్భంగా ఈ గ్రంథాన్ని సమకూర్చిన శ్రీమతి అరుంధతి రాజు గారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. అంతరించిపోతున్న జానపద కళలను వెలుగులోకి తీసుకువచ్చి, కళాకారుల వృత్తి జీవనాన్ని సమగ్రంగా ప్రతిబింబించే ప్రయత్నం వారి కృషి, నిబద్ధతకు నిదర్శనం.

ఈ గ్రంథానికి తమ అనుభవాలు, పరిశోధనల ద్వారా ప్రాణం పోసిన ప్రతి రచయితకు నా హృదయపూర్వక అభినందనలు. వారి విశ్లేషణాత్మక దృక్పథం ఈ పుస్తకాన్ని ఒక విలువైన సాహిత్య, సాంస్కృతిక సంపదగా తీర్చిదిద్దింది.

ఈ సంకలనం విద్యార్థులకు, అధ్యాపకులకు, పరిశోధకులకు, సాహిత్యాభిమానులకు మార్గదర్శకంగా నిలిచి, జానపద కళల పట్ల అవగాహనను పెంపొందిస్తుందని విశ్వసిస్తున్నాను. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని కళలకు సంబంధించిన జానపద సంపద వెలువడాలని ఆకాంక్షిస్తున్నాను.

చివరిగా, ఈ పుస్తకంలోని వ్యాసాలు ప్రతి పాఠకుని హృదయాన్ని తాకి, మన జానపద వారసత్వాన్ని సంరక్షించే బాధ్యతను కలిగించి, మన సంస్కృతిపై మరింత మమకారాన్ని పెంచాలని ఆశిస్తూ.....

డా. నాళేశ్వరం శంకరం

(డా॥. నాళేశ్వరం శంకరం)

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)

మెదక్ - మెదక్ జిల్లా - తెలంగాణ.




ప్రొ॥. కె. హుస్సేన్

ప్రిన్సిపాల్


## ముందుమాట

తెలుగు జానపద సంస్కృతి అనేది కేవలం వినోదానికి సంబంధించిన కళారూపాల సమాహారం మాత్రమే కాదు, అది ప్రజల జీవన విధానం, వారి ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు, వృత్తులు, సామూహిక స్మృతులు, అనుభవాల సమగ్ర రూపం. గ్రామీణ జీవితపు మట్టివాసనను, మనుగడ కోసం పోరాడిన వర్గాల ఆత్మగౌరవాన్ని, కాలగమనంలో మారుతున్న సామాజిక నిర్మాణాలను అత్యంత సహజంగా ప్రతిబింబించిన మహత్తర సాంస్కృతిక సంపద జానపద కళలు. ఈ సంపదను సంరక్షించడం, అధ్యయనం చేయడం, భావితరాలకు అందించడం మనందరి బాధ్యత.

ప్రస్తుతం ఆధునికీకరణ, ప్రపంచీకరణ ప్రభావాలతో అనేక జానపద కళారూపాలు కనుమరుగైపోతున్నాయి. ఒకప్పుడు పల్లె జీవితానికి అంతర్భాగంగా ఉన్న ఒగ్గుకథ, హరికథ, బుర్రకథ, చిందు భాగోతం, గంగిరెద్దులా ట,తోలుబొమ్మలాట, పగటి వేషాలు వంటి కళారూపాలు నేడు జీవన పోరాటంలో నిలదొక్కుకోవడానికి కష్టపడు తున్నాయి. కళాకారుల జీవన పరిస్థితులు, వృత్తి సంక్షోభాలు, సామాజిక మార్పులు, సాంకేతిక ప్రభావాలు ఇవన్నీ జానపద కళల భవిష్యత్తుపై గంభీరమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

ఇలాంటి సందర్భంలో వెలువడుతున్న ఈ ప్రత్యేక సంకలనం అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. జానపద వృత్తి కళారూపాలు - కళాకారుల జీవన చిత్రణ అనే ఈ గ్రంథం జానపద కళల వైవిధ్యాన్ని మాత్రమే కాకుండా, ఆ కళల వెనుక ఉన్న కళాకారుల జీవిత సత్యాలను కూడా పరిశోధనాత్మక దృష్టితో ఆవిష్కరించింది. ఈ సంకలనంలోని వ్యాసాలు కేవలం శాస్త్రీయ పరిశోధనలుగానే కాకుండా, ఒక సామాజిక పత్రంగా, సాంస్కృతిక చరిత్రగా నిలిచే విలువను కలిగి ఉన్నాయి.

డా॥. హెచ్. వామనమూర్తి రచించిన "కూచిపూడి కళాకారులు - పగటి వేషాలు - జీవన చిత్రణ" వ్యాసం కూచిపూడి కళాకారుల కళాసాధన, వారి జీవనశైలి, సామాజిక స్థితిగతులను హృద్యంగా ప్రతిబింబించింది. కళ ఒక వృత్తి మాత్రమే కాకుండా జీవన విధానమని ఆ వ్యాసం స్పష్టంగా తెలియజేస్తుంది. అలాగే ఎం. వేణుగోపాల్ శర్మ

రచించిన "ఆదరణ కరువైన జానపద కళారూపం - పిట్టల దొర" వ్యాసం కనుమరుగవుతున్న కళారూపాల పట్ల సమాజం నిర్లక్ష్యాన్ని గంభీరంగా ప్రశ్నిస్తుంది.

డా॥. బాశెట్టి లత గారి "చిందు భాగోతం - బుడ్డర్ ఖాన్ పాత్ర" వ్యాసం జానపద ప్రదర్శనలలో పాత్రల వైవిధ్యాన్ని విశ్లేషిస్తే, డా॥. వై. దివ్య రచించిన "జానపద కళారూపం - హరికథ" వ్యాసం హరికథలోని ఆధ్యాత్మికత, సామాజిక చైతన్యాన్ని శాస్త్రీయ దృష్టితో పరిశీలించింది. డా॥. పావని రాసిన వ్యాసం జానపద కళల ద్వారా ప్రజల్లో చైతన్యం ఎలా వ్యాపించిందో వివరిస్తుంది.

డా॥. పి. హరిత రాసిన "తోలుబొమ్మలాట కళారూపం - కళాకారుల జీవన పరిస్థితులు" వ్యాసం కళాకారుల ఆర్థిక, సామాజిక సమస్యలను ఎంతో మానవీయ కోణంలో ఆవిష్కరించింది. అదే విధంగా డా॥. రేచర్ల శ్రీలక్ష్మి గారి "ప్రసిద్ధ జానపద కళారూపం - హరికథ" వ్యాసం హరికథ ప్రాధాన్యతను చారిత్రక దృష్టితో వివరిస్తుంది.

రుద్రంగి రమేష్ రచించిన "బుడగ జంగాలు - జీవనశైలి" వ్యాసం జానపద వర్గాల జీవన వైవిధ్యాన్ని స్పష్టంగా చిత్రీకరించింది. డా॥. ఆర్. మహేందర్ రెడ్డి గారి "ఒగ్గుకథ భాషా సౌందర్యం - సాంస్కృతిక అభివ్యక్తీకరణ" వ్యాసం ఒగ్గుకథలోని భాషా వైభవాన్ని, ప్రజల భావజాలాన్ని అద్భుతంగా విశ్లేషించింది.

ఈ సంకలనంలోని ప్రతి వ్యాసం పరిశోధకుల అధ్యయన దృక్పథాన్ని మాత్రమే కాకుండా, జానపద కళల పట్ల వారి మమకారాన్ని కూడా తెలియజేస్తుంది. ముఖ్యంగా కళాకారుల జీవితాలను కేవలం పరిశోధనా అంశాలుగా కాకుండా, మన సమాజపు సాంస్కృతిక చరిత్రగా చూడడం ఈ గ్రంథానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది.

ఈ సందర్భంగా ఈ విలువైన సంకలనాన్ని సమకూర్చిన డా॥. అరుంధతి రాజు గారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. జానపద కళల వంటి గంభీరమైన అంశంపై వివిధ పరిశోధకుల వ్యాసాలను ఒకే వేదికపై సమన్వయం చేసి, శాస్త్రీయ ప్రమాణాలతో ఈ గ్రంథాన్ని వెలువరించడం వారి జానపద సాహిత్యాభిరుచి, పరిశోధనా దృక్పథం, సాంస్కృతిక నిబద్ధతకు నిదర్శనం.

అలాగే ఈ గ్రంథానికి తమ పరిశోధనా వ్యాసాలతో సహకరించిన అధ్యాపకులు, పరిశోధకులు, రచయితలందరికీ నా హృదయపూర్వక అభినందనలు. వారి కృషి ఈ సంకలనాన్ని ఒక విలువైన పరిశోధనా గ్రంథంగా తీర్చిదిద్దింది.

జానపద కళలు కేవలం గతానికి చెందిన జ్ఞాపకాలు కావు, అవి మన సమాజపు ఆత్మ. వాటిని సంరక్షించడం అంటే మన సంస్కృతిని, మన గుర్తింపును కాపాడుకోవడం. ఈ గ్రంథం ఆ దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచి, భవిష్యత్ పరిశోధనలకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని విశ్వసిస్తున్నాను.

చివరిగా, ఈ సంకలనం సాహిత్యాభిమానులకు, పరిశోధకులకు, విద్యార్థులకు, జానపద కళలపై ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపయోగకరంగా నిలవాలని ఆకాంక్షిస్తూ...

(ప్రొ. కె. హుస్సేన్)



డా॥. యన్. అరుంధతి రాజు

## కృతజ్ఞతలు

నాకు జన్మనిచ్చి నా ఈనాటి ఉన్నతికి కారకులైన నా తల్లిదండ్రులు కీర్తిశేషులు రామారావు, రాధాబాయి గార్లకు, ప్రతి అంశంలోనూ నన్ను ప్రోత్సహించి సహకరించిన నా జీవన సహచరుడు డి. రాజు గారికి కృతజ్ఞతాభివందనాలు.

అరవై ఆమడల దూరం వెళ్లి హరికథ వినాలి, తొంబై ఆమడల దూరం వెళ్లి తోలుబొమ్మలాట చూడాలి అనే నానుడి జానపద కళారూపాల ఔన్నత్యాన్ని, ప్రాముఖ్యతను తెలుపుతుంది.

యక్షగానం, చిందు బాగోతం, గంగిరెద్దులాట, కాటికాపరులు, ఒగ్గుకథ, హరికథ, బుర్ర కథ, తోలుబొమ్మలాట, కూచిపూడి పగటి వేషాలు, గొల్ల సుద్దులు, తుపాకీ రాముడు మొదలైన జానపద కళా రూపాలు తరతరాలుగా కళాకారుల జీవనాధారంగా కొనసాగుతున్నాయి. ఇవి ప్రధానంగా కులపురాణాలు, గ్రామీణ సంప్రదాయాలు, భక్తి భావాలు ఆధారంగా రూపుదిద్దుకుని ప్రజలకు విజ్ఞానం, వినోదం, మానసిక ప్రశాంతతను అందించేవి.అయితే ప్రపంచీకరణ ప్రభావంతో సమాజంలో విపరీతమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఒకప్పుడు గ్రామీణ జీవితంలో అంతర్భాగంగా ఉన్న ఈ కళలు నేడు క్రమంగా కనుమరుగవుతున్నాయి. పండుగలు, జాతరలలో జానపద ప్రదర్శనల స్థానంలో డీజేలు, ఆధునిక వినోదాలు ప్రాధాన్యం పొందాయి. మొబైల్ ఫోన్లు, టీవీలు పెరగడంతో శ్రామిక గేయాలు, కుటుంబ కథల సంప్రదాయం కూడా తగ్గిపోతోంది.

ప్రభుత్వం, టీవీ చానెల్లు, రేడియో వంటి మాధ్యమాల ద్వారా జానపద కళలను ప్రోత్సహించే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, అవి పరిమితంగానే ఉన్నాయి. ఈ కళలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా, నైతిక విలువలు, ఆధ్యాత్మిక చింతన, గ్రామీణ జీవన సౌందర్యాన్ని ప్రతిబింబించే ముఖ్యమైన సాంస్కృతిక వారసత్వం.

ఇక కుటుంబ వ్యవస్థలో మార్పులు, పట్టణీకరణ, వలసల కారణంగా పిల్లలకు జానపద కథలు, విలువలు చేరవేయడంలో లోపం ఏర్పడింది. ఆధునిక జీవనశైలిలో టెక్నాలజీపై ఆధారపడటం పెరగడంతో పిల్లలలో శారీరక, మానసిక సమస్యలు కూడా పెరుగుతున్నాయి.

అందువల్ల జానపద కళలను సంరక్షించడం, ఆధునిక సమాజానికి అనుగుణంగా మార్పులు చేసి ప్రచారం చేయడం అత్యంత అవసరం. ప్రభుత్వం మాత్రమే కాకుండా నేటి తరం కూడా ఈ బాధ్యతను తీసుకుని భావితరాలకు ఈ గొప్ప సాంస్కృతిక సంపదను అందించాలి. లేకపోతే విలువలతో కూడిన ఒక గొప్ప సంస్కృతి శాశ్వతంగా నశించే ప్రమాదం ఉంది.

ఎంతోమంది ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు జానపద విజ్ఞానం, జానపద కళారూపాల మీద పరిశోధనలు చేశారే తప్ప కళాకారుల జీవన స్థితిగతులకు సంబంధించిన సమాచారం గురించి పరిశోధనలు చేయలేదు.

జానపద కళారూపాలు కళాకారుల వృత్తి జీవన చిత్రణ అనే అంశంపై వ్యాసాలను స్వీకరించి ఒకచోట చేర్చి ప్రచురించే ఈ చిన్న ప్రయత్నం చేశాను. ఇందులో కొన్ని కళారూపాలు చేరలేవు. ఈ ప్రయత్నాన్ని యువ పరిశోధకులు ఇంకా ముందుకు తీసుకెళ్తారని ఆశిస్తున్నాను. ''జానపద వృత్తి కళారూపాలు - కళాకారుల జీవన చిత్రణ'' అనే నా వ్యాస సంకలన కృషికి అమూల్యమైన సహకారం అందించిన వ్యాసకర్తలందరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసు కుంటున్నాను.

ఈ గ్రంథానికి విలువైన ముందుమాట రాసి, తన సాహిత్య దృష్టితో రచనకు మరింత గౌరవాన్ని చేకూర్చిన ప్రొఫెసర్ వారిజ మేడం గారికి నా వినమ్ర అభివందనాలు.

నా పరిశోధనా ప్రయాణంలో మార్గనిర్దేశనం చేస్తూ, విలువైన సూచనలు అందించి, నన్ను సదా ప్రోత్సహించిన నా పీహెచ్.డి. పర్యవేక్షకులు, అదేవిధంగా తమ విశిష్టమైన అభిప్రాయాలతో నా గ్రంథానికి ముందుమాట రాసిన నాళేశ్వరం శంకరం సార్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు. మేము చేపట్టిన ప్రతి కార్యానికి ముందుండి మమ్మల్ని నడిపిస్తున్న మా కళాశాల, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. హుస్సేన్ సార్ గారు నా ఈ పుస్తకానికి విలువైన ముందు మాటలు రాసినందుకు వినమ్ర పూర్వక ధన్యవాదాలు. ఈ ప్రత్యేక వ్యాస సంకలనాన్ని తీర్చిదిద్దడంలో ప్రతి సందర్భంలో మార్గ నిర్దేశనం చేస్తున్న మా తెలుగు విభాగాధిపతి డా॥. హెచ్. వామనమూర్తి గారికి, ఈ సంకలనానికి నాకు ప్రోత్సాహాన్ని అందించిన యమ్. వేణుగోపాల్ శర్మ గారికి, మా కళాశాల ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డా॥. యన్. తిరుమల్ రెడ్డి గారికి, ఎగ్జామినేషన్ బ్రాంచ్ కో-ఆర్డినేటర్ డా॥. శరత్ రెడ్డి గారికి, డాక్టర్ సి. చంద్రశేఖర్ గారికి, డా॥. రాగుల సుధాకర్ గారికి, డా॥. జ్ఞానానందం గారికి, నా ప్రియమిత్రులు, నా తోటి అధ్యాపక బృందానికి, అధ్యాపకేతర బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ అందరి ఆశీస్సులు, ప్రోత్సాహం నా సాహిత్య ప్రయాణానికి మరింత బలాన్ని చేకూర్చాయి.



**(డా॥. యన్. అరుంధతి)**

# Contents (విషయ సూచిక)


| | | |
|---|---|---|
| 1. కూచిపూడి కళాకారులు - పగటి వేషాలు - జీవన చిత్రణ | - డా॥. హెచ్. వామనమూర్తి | 1 |
| 2. మాసయ్య పటం కళాకారులు - సామాజిక ఆర్థిక జీవన విశ్లేషణ | - డా॥. గడ్డం వెంకన్న | 7 |
| 3. చిందు భాగవతం - బుడ్డర్ ఖాన్ పాత్ర | - డా॥. బాశెట్టి లత | 14 |
| 4. "ఒగ్గుకథ భాషా సౌందర్యం - సాంస్కృతిక అభివ్యక్తీకరణ" | - డా॥. ఆర్. మహేందర్ రెడ్డి | 19 |
| 5. జానపద కళారూపం హరికథ | - డా॥. వై. దివ్య | 25 |
| 6. చిరుతల రామాయణం - పరిశోధనాత్మక పరిశీలన | - డా॥. లింగా శ్రీనివాస్ | 29 |
| 7. యక్షగానం - రస పోషణ | - డా॥. కె. సురేశ్ | 36 |
| 8. బంజారా వృత్తి కళాకారులు జీవన చిత్రణ - నాడు, నేడు | - ఆచార్య హెచ్. కిషన్ | 40 |
| 9. యక్షగాన కళారూపం - కళాకారుల జీవన చిత్రణ | - డా॥. తలారి ఢాకన్న | 44 |
| 10. ప్రసిద్ధ జానపద కళారూపం - హరికథ | - డా॥. రేచర్ల శ్రీలక్ష్మి | 47 |
| 11. తోలుబొమ్మలాట కళారూపం-కళాకారుల జీవన పరిస్థితులు | - డా॥. పి. హరిత | 52 |
| 12. సాధన శూరులు వృత్తి కళారూపం - జీవన శైలి | - డి. రాజు | 58 |
| 13. పాలడుగు నాగయ్య బుర్ర కథ - సామాజిక చైతన్యం | - డా॥. బి. నర్సింహ | 64 |
| 14. నిజామాబాద్ జిల్లా గోసంగుల ప్రదర్శనకళ - పరిశీలన | - డా॥. బాదరవేణి నాగరాజు | 70 |
| 15. జానపదుల సాంస్కృతిక అస్తిత్వానికి నిలువుటద్దం గ్రామదేవతలు | - తోట ప్రశాంత్ కుమార్ | 77 |
| 16. నిజామాబాద్ జిల్లా పాండవుల రంగస్థల నాటక పరిశీలన | - బాదరవేణి మహిపాల్ | 80 |
| 17. పగటివేష కళాకారులు - జీవన చిత్రణ | - అరిగె కమలాకర్ | 85 |
| 18. జానపద కళలు - బౌద్ధుల చైతన్యం | - డా॥. ఝాన్సీ పావని మేరుగు | 90 |
| 19. గట్టు మల్లన్న స్వామి జాతర - ఒగ్గు కళాకారులు | - ఎల్లముల మానస | 94 |
| 20. గ్రామ దేవతల అంగరక్షకుడు 'పోతురాజు' | - కర్నె మల్లికార్జున్ | 100 |
| 21. బుడగ జంగాలు - జీవనశైలి | - రుద్రంగి రమేశ్ (మద్నూర్) | 105 |
| 22. జానపద కళావైభవం - కోలాటం | - సుప్పని సత్యనారాయణ | 111 |
| 23. ఒగ్గు కథ కళారూపం - బీరప్ప కథ ప్రదర్శన | - బి. పరమేష్ | 116 |

| | | |
|---|---|---|
| 24. చెంచు జానపద సంస్కృతి - ప్రకృతి ఆధారిత జీవనతత్వం మరియు వృత్తి కళారూపాల సమగ్ర అధ్యయనం | - శాంతి ధనావత్ | 122 |
| 25. ఆదరణ కరువైన జానపద కళారూపం పిట్టలదొర - హాస్యరసము | - ఏం. వేణుగోపాల్ శర్మ | 127 |
| 26. గొల్లసుద్దులు కళారూపం - కళాకారుల సామాజిక జీవన చిత్రణ | - డా॥. యన్. అరుంధతి | 133 |
| 27. పగటి వేషాలు : బహురూప నటనలో దాగి ఉన్న సామాజిక అస్తిత్వం | - బొడ్డు భరద్వాజ | 138 |
| 28. జానపద సాహిత్యము-వీరగాథలు-కళాకారుల జీవన చిత్రణ | - డా॥. పేరాల జ్ఞానానందం | 149 |
| 29. నేటి సమకాలీన సమాజంలో జానపద కళా రూపాలు - కళాకారుల జీవన స్థితిగతులు | - డా॥. ఎలిపి రత్న ప్రసాద్ | 155 |
| 30. జానపద వృత్తి కళ - కాటికాపరుల కళా నైపుణ్యం మరియు వారి జీవన స్థితిగతులు | - సందెనబోయిన ప్రభాకర్ | 163 |
| 31. బుడగ జంగాలు - వృత్తి జీవన చిత్రణ | - డా॥. ఐండ్ల సంధ్య | 167 |

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# కూచిపూడి కళాకారులు - పగటి వేషాలు - జీవన చిత్రణ



- డా॥. హెచ్. వామనమూర్తి
తెలుగు సహాయాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్.

**వ్యాస సంగ్రహం :**

భారతీయ శాస్త్రీయ నృత్య రూపాలలో కూచిపూడి ఒక విశిష్టమైన స్థానాన్ని కలిగి ఉంది. కూచిపూడి భాగవతులు శాస్త్రీయ నృత్యంలో భాగమై జానపద కళారూపంగానే ప్రసిద్ధి చెందినది. ప్రతి కళారూపానికి జానపదమే తొలిమెట్టు. ఇది కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామంలో జన్మించిన నృత్యం మాత్రమే కాదు. అది ఒక జీవన విధానం. ఈ వ్యాసం కూచిపూడి కళాకారుల వృత్తి పరమైన ప్రస్థానం. వారి సామాజిక హోదా మరియు ప్రస్తుత కాలంలో వారు ఎదుర్కొంటున్న సామాజిక స్థితి గతులను స్థాలీపులాక న్యాయంగా చర్చిస్తుంది. కాలక్రమంలో కూచిపూడి కళాకారులు వేసిన వేషములు వారి జీవన విధానము, సామాజిక స్థితిగతులను తెలుసు కోవడం.

**కీలక పదాలు :**

కూచిపూడి, పగటివేషాలు, చిందు, కలాపాలు-పారిజాతాలు, నట్టువమేళం,భాగవతమేళ.

**పరిచయం :**

కళారూపాలు కథావస్తువు, ప్రాంతం, ప్రదర్శన పద్ధతుల వంటివి నేపథ్యాన్ని అనుసరించి పేర్లు సంత రించుకోవటం ఆనాటి నుండి ప్రచారంలో ఉంది. ఈ పద్ధతిలో ప్రదర్శించే సమయం మేరకు పేరును పెట్టుకున్న కళారూపం పగటి వేషం. ఇవి పట్టపగలు ప్రదర్శిస్తారు కాబట్టి పగటి వేషంగా ప్రచారంలో ఉన్నాయి. గ్రామాలలో వీధుల వెంట సంచారులుగా మొదలు పెట్టి వివిధ వేషాలతో తమ చాతుర్యాన్ని వీరు ప్రదర్శిస్తారు. అతి తక్కువ సమయములో ప్రజలకు వినోదాన్ని అందించి ఆనందింప చేసేవిగా ఉండి అందరి మన్నన లను పొందిన కళారూపంగా చెప్పవచ్చు. సాధారణంగా ఇతర కళారూపాలు ఎప్పుడైనా ప్రదర్శిస్తారు గాని పగటి వేషాలు మాత్రం పగలు మాత్రమె ప్రదర్శింపబడతాయి. దీని ప్రదర్శనా కాలం తక్కువ ఉండి ప్రేక్షకులకు వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. ఈ పగటి వేషంలో రంగు రూపాదులను తీర్చిదిద్దుకోవటం వేషమనే అర్థంలో నాటక పాత్రకి సమానార్థకంగా ప్రచారంలో నిలిచింది. ఇంతటి విశేషమైన చరిత్ర కలిగిన పగటి వేషాల కళారూపం గురించి ఈ వ్యాసములో విశ్లేషించనున్నాను.

జానపద కళారూపాల్లో పగటి వేషాలు ఎంతో ప్రసిద్ధిని పొందినవి. ఇవి జానపదులకు ఏకైక వినోద సాధనాలుగా ఉండేవి. జానపద కళారూపాలలో పగటి వేషాలు, బొమ్మ లాటలు వీధి భాగవతాలు యక్షగానాలు వంటివి

ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. వీధి నాటకాలే విడిపోయి పగటి వేషాలుగా రూపుదిద్దుకొని ఉండవచ్చు అనే ఒక వాదం ఉంది. శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి పగటివేషాలను గురించి ఆంధ్రనాటక చరిత్రలోనూ, ఆచార్య గంగప్ప పగటి వేషాలు వ్యాసంలోనూ కూచిపూడి భాగవతులు ప్రదర్శించే వేషాలను పగటివేషాలుగా తీసు కోవడం జరిగింది. పగటి వేషాలను రెండు రకాలుగా వర్గీకరించారు. స్థానిక పగటి వేషాలు, సంచార పగటి వేషాలు. పగటి వేషాలను వృత్తిగా స్వీకరించి ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి సంచారం చేస్తూ జీవనాన్ని సాగించడం ఒకటైతే, మరొకటి స్థానికంగా ఉండే కళాకారులు పగటి వేషాలు వేసుకొని తమ ప్రాంతంలో చుట్టుప్రక్కల ప్రదర్శించడం గమనిస్తాము. సంచార పగటివేషాలకు స్థానిక పగటి వేషాలకు తేడా కనిపిస్తుంది. ఆర్.వి.ఎస్. సుందరం గారు ఆంధ్రుల జానపద విజ్ఞానంలో భామాకలాపాన్ని కూడా కొందరు జానపద కళల్లో చేర్చారు కూచిపూడి భాగవతుల భామాకలాపం జానపద కళ అయినప్పుడు జానపద కళల్లో చేరనిది అంటూ ఏదీ లేదని పేర్కొన్నాడు. పగటి వేషాలను పైటేశాలు, అని పగటేశాలని పేర్కొన్నారు. కర్ణాటక ప్రాంతంలో దీనిని హగలు వేషం అని, తమిళ ప్రాంతీయులు పగల్ వేష అని వ్యవహరిస్తారు. స్థానిక పగటివేషగాళ్ళు జాతరలు, పండుగలు, ఉత్సవాల సందర్భంలో వారి ప్రదర్శనలు ఇస్తారు. సంచార పగటివేషగాళ్ళు వారం రోజులపాటు ఒకే ఊరిలో ఉండి వివిధ వేషాలు వేసివాళ్ళు. ఇచ్చే కానుకలను స్వీకరిస్తారు. ఈ వేషం భీమాంజనేయ వేషం రామలక్ష్మణులు సుందోప సుందులు, మోహిని భస్మాసుర, అర్ధనారీశ్వర, పోలీసు వంటివి ప్రధానమైనవి.

**చారిత్రక నేపథ్యం మరియు వృత్తి పరిణామం :**

తెలుగు జానపద కళారూపాలకు ప్రత్యేక అస్తిత్వం ఉంది. కులవృత్తి కళాకారులు, వృత్తి కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొంటారు. యక్షగానం, భాగవతం, బాగోతం, వీధి నాటకం, బయలాట, గంటెభాగవతం, తూర్పు భాగవతం, కూచిపూడి వారితో సంబంధం ఉన్న కలాపాలు ,పారిజాతాలు ఈ కోవలోకి వస్తాయి.

కూచిపూడి అన్నది ఒక కుగ్రామం. ప్రపంచ పటంలో, చరిత్రలో స్థానాన్ని సంపాదించుకున్న ఈ గ్రామానికి, కుచేలపురి, కుశలవపురి, కూచన్నపూడి,అనే పేర్లు కూడా ప్రసిద్ధిగా ఉన్నాయి.

కూచిపూడి తొలినాళ్లలో 'భాగవతమేళా' గా ప్రసిద్ధి చెందినది. సిద్ధేంద్ర యోగి సంస్కరణల కారణంగా 14వ శతాబ్దంలో ఈ కళను బ్రాహ్మణ పురుషులకు మాత్రమే పరిమితం చేశారు. సిద్ధేంద్ర యోగిని, నారాయణ తీర్థుల శిష్యులుగా చెప్పుకుంటారు. తొలినాళ్లలో భామాకలాపం వంటి అద్భుత ప్రక్రియను ప్రవేశపెట్టారు. కూచిపూడి సాంప్రదాయం చాలామంది కేవలం శాస్త్రీయ నృత్యానికి సంబంధించిందిగా భావించినప్పటికీ, ఇది కూడా జాన పద కళారూపానికి చెందిందిగా ప్రాచుర్యాన్ని పొందినది. ఇంచుమించుగా అన్ని కళారూపాలు జానపద కళా రూపాలుగా ప్రసిద్ధి చెందినవే. కూచిపూడి సాంప్ర దాయంలో వివిధ అంశాలను గురించి భిన్న స్వరాలు వినపడతాయి. కొందరు భుక్తిని ప్రధానంగా చూపిస్తే మరికొందరు సంస్కృతిని ప్రధానంగా చూపించినారు. కూచిపూడి సాంప్రదాయంలో భాగవతులు బహుళ ప్రచారాన్ని పొందినారు. ఇది ప్రజలు ప్రదర్శన స్థలానికి, వచ్చేదానికి భిన్నంగా కళాకారులే ప్రజల వద్దకు వెళ్లి ప్రదర్శించే ప్రయోగాత్మక ప్రక్రియ. అనేక మందితో కూడిన ప్రదర్శన ఉండటం, ఇది సాహిత్యం, సంగీతం, నృత్యం లాంటి ప్రక్రియల సమన్వయం మేరకు ఇది ఒక సమాహార కళాస్వరూపంగా చెప్పబడింది.

భాగవతులుగా అనేక మందితో ఇచ్చే ప్రదర్శనలు క్రమక్రమంగా రూపాంతరం చెంది చాలావరకు పగటి వేషాలు వంటి కళారూపాలుగా మారినవి. ఈ ప్రదర్శన వినోదంతో పాటు, విజ్ఞానాన్ని ఇక సాంఘిక స్పృహను అందించేవిగా మారినవి. ఒకవైపు జానపదం మరొకవైపు శాస్త్రీయం రెండింటిలో సముచితమైన ఉనికిని సంపా దించుకున్నవి. ఆచారాలు అన్యాయాలు, ఎత్తిచూపటం వంటి ప్రత్యేకతలతో ఆదరణను పొందినవి.కూచిపూడి వారు వివిధ వేషాలు ధరించి గ్రామాలలో తిరుగుతూ ప్రదర్శనలు ఇచ్చేవారు. ఒకప్పుడు గ్రామాల వెంట తిరిగి

ప్రదర్శనలు ఇచ్చే సంచార కళాకారులుగా ఉన్న వీరు నేడు అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శనలు ఇచ్చే స్థాయికి ఎదిగినారు. కూచిపూడి వంశీయులైన వేదాంతం, వెంపటి, పసుమర్తి, భాగవతుల మరియు మహంకాళి కుటుంబాలు ఈ కళను వృత్తిగా స్వీకరించి తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్నారు. మొన్న మొన్నటి వరకు కూచిపూడి వారు వేషాలు ధరించి మన చుట్టూ గ్రామాలలో కూచిపూడి అయ్యవారు అనే పేరుతో సంచరించడం ఇప్పటికీ నా స్మృతి పథంలో ఉన్నది.

చందాల కేశవదాసు రచించిన, మీరజాల గలడా నా యానతి.... వ్రత విధాన మహిమన్ సత్యాపతి,, అనే పాట ఎంతో ప్రాచుర్యాన్ని పొందినది. పల్లెటూరులో వేసే వీధినాటకాలలో సత్యభామ పాత్రలో ఈ పాటను తరచూ ప్రదర్శించేవారు. ఆ తరువాత కాలంలో ఈ పాట సినిమా లోకి వెళ్ళింది. సినిమాలో కూడా ఈ పాట ఎంతో ఖ్యాతిని పొందినది. భాగవతులలో భాగంగా గిరిజా కళ్యాణం ప్రదర్శించబడినది. తర్వాతి కాలంలో ఇది యక్షగానంగా, నాటకముగా, మల్లాది రామకృష్ణ శాస్త్రి గారి రచనలో ప్రదర్శించబడినది. ఇది పూర్తి జానపద కళారూపంగా, అంబాపరాకు.... దేవి పరాకు... మమ్మేలు శారదాంబ పరాకు.... మంగళాద్రి నరసింహ... బహుపరా బహుపరా... బంగరు తల్లి కనకదుర్గ.... బహుపరా....అంటూ మొదలై... కూచన్నపూడి భాగవతుల..... అంటూ సాగి..... అవ ధరించరయ్యా.... విద్యల ఆదరించరయ్యా..... ఈశుని మ్రోల.... హిమగిరి బాల...... గిరిజా కళ్యాణం జానపద కళారూపంగా ప్రదర్శించబడినది.

వీధి భాగవతం, యక్షగానం, పగటివేషం, బహు రూపాలు శాస్త్రీయంగా ప్రదర్శించబడుతున్నప్పటికీ వీటికి మౌలిక స్థానం జానపద రంగముగా పరిగణించాలి. జానపద కళలను అనుసరించి సాంఘిక, రాజకీయ, భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ఆవిర్భవించి ప్రచారంలోకి ప్రాచుర్యంలోకి వచ్చాయి. కాల ప్రభావం వల్ల కళారూపాల రూపురేఖల్లో మార్పు రావడం, కొన్ని కనుమరుగైపోవడం మరికొన్ని కొత్త రూపాన్ని సంతరించుకోవడం జరిగింది. కొందరు పరిశోధకుల పరిశోధన అనుసరించి పురాణ ఇతిహాసాల్లోని మారువేశాలను పగటి వేషాలకు మూల కేంద్రంగా చూపించడం జరిగింది. నటరాజ రామకృష్ణ ఇవి పురాణ పురుషులతోనే ప్రారంభమైనవని, సిరియాల చరిత్ర, జరాసంధుని వధ, వంటివి ఉదహరించినాడు. డాక్టర్ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి గారు ప్రస్తావిస్తూ ప్రాచీన కాలం నుంచి ఈ పగటి వేషాలు వేయటం ఆనవాయితీగా వస్తుందని, దశరథుడు సంతానం కోసం పరితపిస్తున్నప్పుడు బుడబుక్కల వేషంలో వచ్చి త్యాగ రహస్యం చెప్పిన విషయం ఉదహరించాడు. అనేక పాత్రలతో ప్రదర్శించినటువంటి ఈ భాగవతులు, నాటకాలు, యక్షగానాలు కాలక్రమంలో మారి, పగలు ప్రదర్శించే పగటి వేషాలుగా మారినవి.

పురాణాలపరంగా కాకుండా ప్రక్రియా పరంగా కూడా కొందరు ఈ వేషాల గురించి వ్రాసినారు. ఆర్.వి.ఎస్. సుందరం గారు. పగటివేషాల ఆవిర్భావాన్ని పగటేషాలని ఈ కళాకారులు దేశదిమ్మరులుగా అన్ని ప్రాంతాలు తిరుగుతూ పగటేషగాళ్లు అని కూడా పిలువబడినారు అని చెప్పినారు. వీరు విప్ర వినోదుల వంటి వారిని కొందరి అభిప్రాయం. దొర, దొరసాని, వడ్డేవాడు, బ్రాహ్మణ వితంతువు వంటి పాత్రలు వేస్తారు. ఏడాదికి ఒకసారి ఊరికి వస్తారు. వేషానికి తగిన దుస్తులు ఉంటాయి. దీనికి తగిన మంచి అనుకరణ ఉంటుంది. హాస్య ప్రియత్వం ఉంటుంది. యక్షగానాల్లోని వేషాలే వివిధ పగటివేష రూపాలుగా వచ్చినవని కొందరి అభిప్రాయం. యక్షగానాలు వీధి నాటకాలు రాత్రివేళ ప్రదర్శిస్తే కొన్ని వేషాలు పగటికి విస్తరించినవి. ఆర్.వి.ఎస్. సుందరం గారి ననుసరించి రాత్రి నాటకాలు వీక్షించని జనాల కోసం కొన్ని అంశాలు విస్తరించబడి పగటి వేషాలుగా రూపు దిద్దుకున్నాయి. ప్రాచీన కాలంలో నట్టువమేళాలు ఉండేవి ఇవి మార్గ పద్ధతికి సంబంధించినవి. నాట్య మేళాలను ప్రచారంలోకి తెచ్చిన వారు కూచిపూడి భాగవతులు. తొలి నాళ్లలో బహుపాత్రమయమై, తరువాత ద్విపాత్రలుగా, ఏకపాత్రలుగా మారి పగటి వేషాలుగా రూపుదిద్దాయి. నూరి సంగమేశం గారి అనుసరించి

భామాకలాపం లోని చిల్లర పాత్రలు పగటి వేషాలుగా రూపుదిద్దబడినాయి.

కూచిపూడి భాగవతుల యక్షగానాలలోని చిన్న చిన్న పాత్రలు పగటివేషాలుగా మార్పు చెందినవి అనేది ఒక వాదం. వీధిభాగవత నాటకాల్లోని పంతులు వేషం, పటాన్ వేషం వంటివి పగటివేషాలుగా ఆవిర్భవించాయని మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి గారు పేర్కొన్నారు. పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలో వివరించిన బహు రూపులు అనే పదం పగటి వేషాలకు సంబంధించినది అయి ఉంటుంది. ఇవి చారిత్రిక అంశాలు, సాహిత్య అంశాలుగా అనేకం ఉంటాయి. జానపదకథల లోని మారువేషఘట్టాలు, ఇంద్రజాల ప్రదర్శనలు కూడా ఈ పరిధిలోకి వస్తాయి. బసవపురాణం, పండితారాధ్య చరిత్రల్లో కళారూపాలను వర్ణించిన తీరు నిదర్శనంగా కనిపిస్తుంది. తెలుగు సాంస్కృతిక చరిత్రలో పగటి వేషాల ఒరవడికి శ్రీకారం చుట్టిన ఊరు గడ్డిపాడు.

ఈ గ్రామంలో యానాది భాగవతం, గంగిరెద్దులాట, గారడీ, కర్రసాము లాంటి కళారూపాలు ఉన్నప్పటికీ, గడ్డిపాడు పగటి వేషాలలో ప్రత్యేకతను సంతరించు కుంది. కూచిపూడి భాగవతులు, గడ్డిపాడు భాగవతులు అని ప్రత్యేకించి పిలువబడినారు. కూచిపూడి వారు పగటి వేషాలు వేయటం వెనుక మూడు ప్రధాన వాదాలు వినిపిస్తాయి. వీటిలో భాగవతాలలో రాణించలేని కళా కారులు తరువాతి రోజులలో పగటి వేషాలు వేసినారని కొందరి అభిప్రాయం. కూచిపూడి భాగవతాలకు అవ కాశాలు తగ్గిన నేపథ్యంలో వారిలో వచ్చిన చీలిక కారణంగా ఉదరపోషణార్థం పగటి వేషాలు ధరించినారని వాదం ఉంది. ఏది ఏమైనప్పటికీ పగటి వేషాలు కూచిపూడి భాగవతుల నుండి మరియు గడ్డిపాడు భాగవతుల నుండి కూడా విస్తరించినవని చెప్పవచ్చు. ఈ పగటి వేషాలు వివిధ ప్రాంతాలలో వివిధ పేర్లతో పిలవబడినవి. సిద్ధేంద్ర యోగి శిక్షణతో ఎంతోమందికి నాట్య అభినయాన్ని సంగీతాన్ని నేర్పాడు. ఆనాటి నుండి వీరి భాగవతాల ప్రదర్శనలకు అంకురార్పణ జరిగింది. సిద్ధేంద్ర యోగి నాట్య గీత అభినయాలను కూచిపూడి కళాకారులకు అంకితం చేశాడు. ఆనాటి నుంచి ఈనాటి వరకు కూచిపూడి నాట్య ప్రదర్శనలు, వారి భాగవతాలు, పగటి వేషాలు ఎంతో ప్రచారాన్ని పొందాయి. కూచిపూడి కళాకారుల్లో ప్రముఖులుగా వేదాంతం లక్ష్మీనారాయణ చింతా శ్రీరామమూర్తి, పసుమర్తి, వెంపటివారని ప్రసిద్ధులు ఉన్నారు. తర్వాతి కాలంలో వేదాంతం రాఘవయ్య, వెంపటి సత్యనారాయణ, పసుమర్తి కృష్ణమూర్తి, వెంపటి సత్యం వంటి వాళ్లు సినిమా రంగంలో నిలిచినారు. స్టేజి నాటకాలు, ప్రదర్శనలు తెలియని రోజులలో తోలుబొమ్మలు, యక్షగానాలు, వీధి నాటకాలు, పగటి వేషాలు వంటి కళారూపాలే ప్రజలకు ఆనందాన్ని వినోదాన్ని పంచిపెట్టాయి. కళారూపాల లక్ష్యం, మూల సూత్రం, నాటకీయం. సంభాషణలు, కథకు రూపకత్వం ఇచ్చి దృశ్యమానం చేయడం. పగటి వేషాలలో పగలు ప్రదర్శించేవేగాక, రాత్రులు ప్రదర్శించే పంతులు, పటానివేషం వంటివి ఎన్నో ఉన్నాయి. ఈ ప్రదర్శనలు సంస్కృత ప్రహసనాలకు దగ్గరగా ఉంటాయి. ఇవి ఉచితంగా ఆరుబయట ప్రదర్శించేవారు.

### కూచిపూడి కళాకారులు - పగటి వేషాలు

కూచిపూడి వారు ప్రదర్శించిన పగటి వేషాలను పరిశీలించిన మూడు తరాల కళాకారులను పేర్కొన్నారు. భాగవతుల రామ్మూర్తి, శ్రీరామశర్మ, భాస్కర శర్మ వంటి వారు నాలుగవ తరానికి చెందినవారుగా పేర్కొనబడి ఉన్నారు. దీనిని బట్టి కూచిపూడి వేషాలకు మూడు శతాబ్దాల చరిత్ర ఉంది అని చెప్పవచ్చు. మొదట 64 పగటివేషాలు ఉండేవని క్రమంగా 33కు తగ్గాయని పరిశోధకులు నిర్ధారించినారు. భాగవతులు చింతలపాటి లక్ష్మీనరసింహ శాస్త్రి గారిని అనుసరించి బైరాగి, పఠాన్ అర్ధనారీశ్వర, పంతులు, జంగము, కోయ, శారదవేశం వంటి 33 పేర్కొన్నాడు. ప్రజానాట్యమండలి తెలుగు జానపద కళారూపాల గ్రంథ రచయిత మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి గారి ప్రకారం కూచిపూడి వేషాలు 43 గా పేర్కొన్నాడు. నాలుగు తరాలుగా సాగిన కూచిపూడి పగటి వేషాల ప్రచారంలో అసమానమైన ప్రతిభ కనబరిచిన కళాకారులను వేషాలను మిక్కిలినేని పేర్కొన్నాడు.

**కళాకారుల జీవన చిత్రణ - సామాజిక కోణం**

కూచిపూడి కళాకారుల జీవితం బాహ్య ప్రపంచానికి రంగుల మయంగా కనిపించినప్పటికీ దాని వెనుక కఠిన మైన క్రమశిక్షణ మరియు త్యాగాలు ఉన్నాయి వీరు బాల్యం నుండే శిక్షణను తీసుకుంటారు. 5, 6 ఏళ్ల వయసులో వీరికి శిక్షణ ప్రారంభం అవుతుంది. దీర్ఘ కాలం పాటు సాగే ఈ శిక్షణలో అభినయం నృత్యం మరియు సంగీతం ప్రధాన భాగాలుగా ఉంటాయి. పూర్వం కేవలం పురుషులకే పరిమితమైన ఈ వృత్తిలోకి తరువాతి కాలంలో మహిళల ప్రవేశం జరిగింది. నాడు ఈ కళాకారు లపై లింగ వివక్షత కొనసాగింది. నేడు మహిళా కళా కారులు కూడా ఈ వృత్తిలో ఎందరో ఉన్నారు. వృత్తి పరమైన సవాళ్లు ఆర్థిక స్థితిగతులు ఇందులో కీలకమైన అంశంగా గుర్తించాలి. కళాకారుల జీవన ప్రమాణాలు వారి ఆర్థిక స్థితిపై ఆధారపడి ఉంటాయి.

**ఆదాయ వనరులు :**

1. ప్రదర్శనల ద్వారా వచ్చే పారితోషికం 2. నృత్య పాఠశాలల నిర్వహణ 3. ప్రభుత్వంఇచ్చే ఫెలోషిప్‌లు.

జానపద విజ్ఞానంలో జానపద కళలు సింహభాగాన్ని కలిగి ఉన్నాయి. జానపద కళలకు సంబంధించిన కథనాలు కూడా అధిక సంఖ్యలో ఉన్నాయి. పూర్వపు రోజుల్లో పురుషులు స్త్రీ పాత్రను ధరించేవారు కాలక్రమేణా ప్రదర్శన విధానంలో మార్పుల కారణంగా స్త్రీ పాత్రని స్త్రీలు ధరించడం ప్రారంభమైంది. గరగలు, బోనాలు లాంటి కళారూపాలు ప్రత్యేకించి స్త్రీలకు సంబం ధించినవి. సోది, బతుకమ్మ, చిందు భాగవతం చెక్కభజన కోలాటం, జట్టి జాము, జడకోపు కోలాటం కళారూపాలలో కొన్ని స్త్రీలకు సంబంధించినవి ఉన్నాయి.

చిందు భాగవతంలో భాగమైన ఒక కళ కేవలం స్త్రీలు మాత్రమే ప్రదర్శిస్తారు. చిందు జోగితలు ప్రదర్శించే కళారూపం ఇది. వీరిని జోగులాంబలని పిలుస్తారు. జోగులాంబ దేవాలయంలో నృత్యం ఆడుతారు. ఎల్లమ్మ ఆట ఆడటం వీరి ప్రత్యేకత.

**ముగింపు :**

కేవలం పండుగలు లేదా ప్రత్యేక సందర్భాలలో మాత్రమే ప్రదర్శనలు ఉండడం వలన అస్థిరమైన ఆదాయం. ప్రభుత్వ పక్షాన అకాడమీల ద్వారా వచ్చే ఆర్థిక సాయం క్షేత్రస్థాయి కళాకారులకు అందదు. ఈ కళా ప్రదర్శనకి ఆహార్యం, మేకప్ మరియు ప్రయాణ ఖర్చులు పెరగడం వలన వీరి ఆదాయం తక్కువగా ఉంటుంది.

ప్రపంచీకరణ వల్ల కూచిపూడి కళకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఆన్‌లైన్ మరియు యూట్యూబ్ తరగతుల ద్వారా కళాకారులు ప్రపంచవ్యాప్తంగా శిక్షణ ఇస్తున్నారు. ఇది కొంతవరకు కొత్త ఆదాయ వనరుగా మారింది. తెలుగు సినిమాల్లో కూచిపూడి ప్రాధాన్యత తగ్గడం వలన కళాకారులకు అవకాశాలు తగ్గినాయి క్షేత్రస్థాయిలో చూసిన కూచిపూడి కళాకారుల జీవన స్థితిగతులు అవగతం అవుతాయి, ఏమైనప్పటికీ కూచిపూడి కళాకారుల స్థితి ఆనాటి కంటే నేడు భిన్నంగా ఉంది. వాళ్ల జరుగుబాటు ఆశించినంత మంచి స్థితిలో లేదు. కూచిపూడికళాకారుల వృత్తిని గౌరవప్రదంగా ఉంచడానికి ప్రభుత్వం వారికి అండగా నిలవాల్సిన అవసరం ఎంతగానో ఉంది. వృద్ధకళాకారులకు గౌరవ ప్రదమైన జీవన భృతిని అందించాలి. ప్రభుత్వపరంగా పెన్షన్లు అందించాలి. పాఠశాలల్లో, కళాశాలలో దీనిని ప్రవేశపెట్టాలి. కూచిపూడి కళకు సంబంధించిన ఉపాధ్యాయుని నియమించడం ద్వారా కళాకారులకు ఉపాధిని అందించిన వారు అవుతారు. ఈ కళాకారుల ఆర్థిక సామాజిక పరిస్థితులు మెరుగుపరుచుటకు ప్రభుత్వం, సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఆధార గ్రంథాలు :**

1. కూచిపూడి పగటి వేషాలు - డా.ఆర్.వాసుదేవ సింగ్.
2. తెలుగువారి జానపద కళారూపాలు - డా.మిక్కిలినేని రాధాకృష్ణ

3. మిసిమి సంచిక - జానపద నాటక సాహిత్యము - ఎన్. భక్తవత్సల రెడ్డి.
4. ఆంధ్ర నాటకరంగ చరిత్ర - శ్రీనివాస చక్రవర్తి.
5. స్త్రీల జానపద ప్రదర్శనలు - టి.జయా మనోహర్.
6. తెలుగు జానపద గేయగాథలు - ఆచార్య నాయని కృష్ణకుమారి.
7. తెలుగు జానపద గేయ సాహిత్యము - ఆచార్య బిరుదురాజు రామరాజు.
8. పగటి వేషాలు - బొమ్మలాటలు - యక్షగానాలు. - డా.పేట శ్రీనివాసులు రెడ్డి.
9. ఆకాశవాణి ఉదయ తరంగిణి - చిరస్మరణీయం.

★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# మాసయ్య పటం కళాకారులు - సామాజిక ఆర్థిక జీవన విశ్లేషణ



- డా॥. గడ్డం వెంకన్న
అసోసియేట్ ప్రొఫెసర్, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞాన పీఠం, ఓరుగల్లు ప్రాంగణం, వరంగల్, తెలంగాణ.

**వ్యాస సంగ్రహం :**

'మాసయ్య పటం కళాకారులు - సామాజిక ఆర్థిక జీవన విశ్లేషణ' అనే వ్యాసం తెలంగాణలోని విశిష్ట జానపద కళారూపమైన మాసయ్య పటం కథా కళారూపాన్ని మరియు ఆ కళను నమ్ముకున్న మాసయ్య కళాకారుల సామాజిక, ఆర్థిక జీవనాన్ని విశ్లేషిస్తుంది. మాసయ్య పటం కాళాకారులు రజర (చాకలి) సామాజిక వర్గానికి ఆశ్రిత కులం. వీరు రజకుల వంశ చరిత్రను, గోత్రనామాలను మరియు వారి కులదైవమైన మడేలు పురాణాన్ని కథా గానశైలిలో పటం ఆధారంగా ప్రదర్శిస్తారు. కుల పురాణంలో పార్వతీ కళ్యానం, దక్షయజ్ఞం, వీరభద్ర విజయం, బసవపురాణం వంటి ఘట్టాలను ప్రదర్శిస్తారు. నాలుగు నుండి ఆరు మంది కళాకారులు ఒక బృందంగా ఏర్పడి రెండు లేదా మూడు సంవత్సరాలకు ఒకసారి తమకు హక్కుగా వస్తున్న గ్రామాలకు వెళ్ళి ప్రదర్శనలిచ్చి త్యాగం వసూలు చేసుకొని జీవిస్తారు. ఈ త్యాగం అనేది ధనరూపంలోను, ధాన్యరూపంలో అందజేసే గౌరవభృతిగా పేర్కొనవచ్చు. ప్రపంచీకరణ నేపథ్యంలో జానపద కళలకు ఏ విధంగా ఆదరణ తగ్గుతుందో ఈ మాసయ్య పటం కళాకారులకు కూడా ఆదరణ అలాగే తగ్గుతూ వస్తుంది. దీనివల్ల వీరి ఆర్థిక పరిస్థితి కూడా దయనీయంగా ఉంది. దీనితో వీరు ఇతర వృత్తులపై ఆధారపడవలసి వస్తుంది. కావున రజకుల సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే మాసయ్య పటం కళారూపం నేడు అంతరించిపోయే దశలో ఉంది. ఈ కళాకారులను ఆదుకోవడానికి ప్రభుత్వ మరియు స్వచ్ఛంద సంస్థల తోడ్పాటుతోపాటు, ధాతృకులమైన రజకుల ప్రోత్సాహం కూడా అవసరం.

**కీలక పదాలు :**

మాసయ్య పటం కళాకారులు, కుల పురాణాలు, హక్కు గ్రామాలు, కట్టడి, త్యాగం, రాగిశాసనం, కట్నాలు.

**ఉపోద్ఘాతం :**

భారతీయ సంస్కృతిలో జానపద కళలు అంతర్భాగం. కేవలం ఇవి వినోద సాధనాలు మాత్రమే కావు, సమాజం యొక్క చరిత్రకు సజీవ సాక్ష్యాలు. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో ప్రచారంలో ఉన్న జానపద కళారూపాలలో పటం కథా సంప్రదాయం విలక్షణమైనది. నకాశీ కళాకారులు చిత్రించే ప్రత్యేకమైన పటం ఆధారంగా రూపొందించిన కుల పురాణ గాధలను కథాగాన శైలిలో పటం కథా కళాకారులు ప్రదర్శనలిస్తారు. ఇలాంటి కళారూపాల్లో మాసయ్య పటం కథా లేదా మడేలు పురాణం ప్రధానమైనది. రజక సామాజిక వర్గానికి ఆశ్రితకులంగా

మాసయ్య పటం కళాకారులు ఉన్నారు. వీరు రజకుల వంశ చరిత్రను, గోత్రనామాలను ప్రదర్శనా పూర్వకంగా ప్రదర్శిస్తూ రజకుల ఔన్నత్యాన్ని చాటిచెపుతున్నారు.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత కాలంలో గ్లోబలైజేషన్, సాంకేతిక విప్లవం ప్రభావం జానపద కళాకారులపై కూడా తీవ్రంగా పడుతున్నది. ఒకప్పుడు గ్రామీణ వ్యవస్థలో గౌరవప్రదమైన స్థానాన్ని పొంది, పటం కథా ప్రదర్శనలే వృత్తిగా స్వీకరించి జీవనం పొందుతున్న మాసయ్య పటం కళాకారులు, నేడు అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నారు. దీనితో వారి జీవనం రోజు రోజుకు దయనీయంగా మారుతుంది. ఈ క్రమంలోనే మాసయ్యల సామాజిక స్థితిగతులు, ఆర్థిక వనరులు గతంలో ఏవిధంగా ఉండేవి? మరియు మారుతున్న కాలంతో పాటు వీరి జీవనశైలిలో ఏ విధమైన మార్పులు వచ్చినాయి? అనే అంశాలను శాస్త్రీయంగా విశ్లేషిస్తూనే, కళాకారుల మనుగడకు భవిష్యత్ ప్రణాళికను రూపొందించాల్సిన ఆవశ్యకతను చర్చించాలనే ఉద్దేశ్యంతో ఈ వ్యాసం రూపొందించబడింది.

**మాసయ్యలు కులోత్పత్తి – చారిత్రక నేపథ్యం :**

దక్షయజ్ఞాన్ని నాశనం చేసి దక్షుడిని సంహరించిన తరువాత వీరభద్రుడు పాలగుండంలో దూకుతాడు. అప్పుడు ఆ గండం నుండి ఇద్దరు ప్రభావకర్తలు జన్మిస్తారు. వారే మడివేలయ్య, మాసయ్యలు. ఈ ఇద్దరు ఒకే అండం నందు జన్మించారు, కాబట్టి త్రిమూర్తులు వీరిద్దరికీ యుక్త వయస్సు వచ్చిన తరువాత ఒకేసారి పెళ్ళి చేయాలని నిర్ణయిచుకుంటారు. ఆ విధంగా మడి వేలయ్యకు సీతలదేవితో, మాసయ్యకు జలయగాందితో పెళ్లి జరిపిస్తారు. ఆ తరువాత వారి జీవనోపాధికి సంబంధించిన వస్తువులైన సర్వ్వగంప, మైలగుడ్డలు ఒక ఇంటిలో, పటం, రాగిశాసనం, మద్దెల, హార్మోనియం, దేవాలయం మరొక ఇంటిలో ఉంటాయి. వీటిలో ఎవరు ఏ ఇంటిని కోరుకుని, దానినే తమ వృత్తిగా స్వీకరించాలి అనే విషయంలో సందిగ్ధత ఏర్పడుతుంది. దీనికై ముందుగా చిన్నవాడైన మాసయ్యను పిలిచి, నీవు ఏ ఇల్లు కావాలో నిర్ణయించుకుంటే అదేపని చేయవలసి

మైలగుడ్డలు, సర్వ్వగంప ఉన్న ఇల్లు తీసుకుంటే మాసిన బట్టలు ఉతుకుతూ బతకాలి, నాకెందుకు ఈ పని అని ఆలోచించి, పటం ఉన్న ఇల్లును ఎంచుకుంటాడు. మిగిలిన సర్వ్వగంప, మైలగుడ్డలు ఉన్న ఇల్లును మడి వేలయ్య తీసుకుంటాడు. ఆ ప్రకారంగా వారి వారికి వచ్చిన వృత్తి పని ఆధారంగా మడివేలయ్య వివిధ కులాల వారి వస్త్రాలను తీసుకుని వచ్చి శుభ్రంగా ఉతుకుతూ వారు పెట్టిన అన్నం, ధాన్యం తీసుకుని బ్రతుకుతుండగా, మాసయ్య దేవునిగుడిలో పూజ చేస్తూ బ్రతుకుతుంటాడు. కాని దేవునికి పూజ చేస్తుండగా అతనికి తినడానికి అన్నం కాని, ఏదీకాని దొరకదు. దీంతో మాసయ్యకు ఆకలి అవుతుంటుంది.

ఒకరోజు మడివేలయ్య బట్టలు ఉతికి అన్నం తెచ్చుకుని తింటుండగా, ఆకలికి ఆగలేకపోయిన మాసయ్య ఆ అన్నాన్ని గుంజుకుని తింటాడు. దీనివల్ల ఇద్దరి మధ్య పంచాయితీ వస్తుంది. దీని పరిష్కారం కోసం మడి వేలయ్య, మాసయ్య ఇద్దరు కలిసి త్రిమూర్తుల వద్దకు వెళతారు. స్వామి! మీరు భాగాలు పంచి యిచ్చారు, కాని మా తమ్ముడు మాసయ్య నేను తింటున్న కంచం గుంజుకుని నా అన్నం తినానడు అని మడివేలయ్య త్రిమూర్తులకు ఫిర్యాదు చేస్తాడు. అపుడు త్రిమూర్తులు, సురా ముప్పది మూడు కోట్ల దేవతలు కూర్చుని ఇలా తీర్మానం చేస్తారు. మడివేలయ్య మాసయ్య, మీరు ఇద్దరు అన్నదమ్ములు, ఒకే అండం నందు జన్మించారు, కాబట్టి మాసయ్య నీ కంచానికి ఎగడబడి తినానడు, వాడు చిన్నవాడు, వాన్ని క్షమించు. వాడు నీ తమ్ముడు కాబట్టి మీ ఇద్దరికి కంచం పొత్తు ఉంటుంది. ఇక నుంచి మాసయ్యకు సంబంధించిన వంశం వారు ఎవరైనా నీకు ఆడబిడ్డలతో సమానం. వారు నీ గురించి, నీ రజక కులం గురించిన కథ చెప్పుకుంటూ ఊరూరు తిరుగుతూ మీరు ఇచ్చే ప్రతిఫలంతో జీవిస్తాడు. ఈ విధంగా నీ గోత్రం చరిత్ర, కుల చరిత్ర చెప్పుకుంటూ నీ దగ్గరికి వస్తే నీ వెంబడి ఉంచుకొని అన్నం, వస్త్రం ఇచ్చి పంపాలని తీర్మానించి మడివేలయ్య మాసయ్యలిద్దరినీ పంపిస్తారు. ఆ ప్రకారంగా మాసయ్య, మడివేలయ్యకు అంటే రజక

లేదా చాకలి కులం వారికి పీఠాధిపతులై కథ చెపుతూ జీవిస్తున్నారు. ఈ విధంగా మడివేలయ్య అనగా రజక కులంకు సంబంధించిన కథను ప్రదర్శనా పూర్వకంగా చెప్పి జీవించే హక్కు మాసయ్యలకు లభించింది. అప్పటి నుండి మాసయ్యలు రజక కులం వారికి ఆశ్రిత కులంగా ఉండి పటం కథలు చెపుతూ జీవిస్తున్నారు.

**మాసయ్యలు - సామాజిక, కళామయ జీవితం :**

మాసయ్య పటం కళాకారుల జీవన విధానం వైవిధ్య మైనది. రజకుల ఆశ్రిత కులంగా పేరొందిన వీరు ప్రతీ రెండు లేదా మూడు లేదా ఐదు సంవత్సరాలకు ఒకసారి తమకు హక్కుగా లేదా కట్టడిగా వస్తున్న గ్రామాలకు వెళ్ళి పటం కథా ప్రదర్శనలు ఇచ్చి త్యాగం వసూలు చేసుకొని జీవిస్తారు. నాలుగు నుండి ఆరు మంది కళా కారులు ఒక బృందంగా ఏర్పడి త్యాగం ఊర్లలో ప్రదర్శిన లిస్తారు. పురుషులే కథలుగా వ్యవహరిస్తారు. దీనిలో ప్రధాన కథకుడుగా ఒకరు ఉంటే, ఇద్దరు వంతకులుగా, మరో ఇద్దరు వాద్య సహాయకులుగా ఉంటారు. ప్రధాన కథకుడు ప్రదర్శనలో భాగంగా కళో వచ్చే ప్రధాన పాత్ర లను లేదా ప్రధాన సంఘటలను చూపుడుకర్ర ద్వారా పటంపై చిత్రించిన బొమ్మలను చూపిస్తూ కథాగాన రూపంలో కథను నడిపిస్తుంటారు. అపుడపుడు పాత్రోచితంగా ప్రధాన కథకుడు పాత్రలో లీనమై పాత్రకు తగిన అభినయం చేస్తూ ప్రేక్షకుల మన్ననలు పొందుతారు.

పటం ఆధారిత కళారూపంగా పేర్కొనబడే ఈ మాసయ్య పటం కళారూపం ప్రదర్శన ముఖ్యంగా రజకులు నివసించే వీధిలో నాలుగు కూడళ్లు ఉన్న ప్రదేశంలో లేదా రజక కులపెద్ద ఇంటివద్ద ప్రదర్శన ఉంటుంది. గతంలో ఐదు రోజులు ప్రదర్శన ఉండగా, ప్రస్తుతం రెండు లేదా మూడు రోజుల్లోనే కథను ముగిస్తున్నారు.

మాసయ్య పటం కళాకారులు ప్రధానంగా ప్రదర్శిం చేది మడేలు పురాణం. దీనిలో శక్తి పురాణం, పార్వతీ కళ్యాణం, దక్షయజ్ఞం, వీరభద్ర విజయం, బసవపురాణం అనే ఐదు ప్రధాన ఘట్టాలు ఉంటాయి. ప్రస్తుతం రజకులు ఎన్ని రోజుల్లో కథను పూర్తి చేయమని చెపుతారో, దానికనుగుణంగా కథను కుదించి ముగిస్తున్నారు. చివరిరోజు మాత్రం రజకులు సుఖసంతోషాలతో, ఆయు రారోగ్యాలతో జీవించాలని మడేలయ్య పండుగను జరుపు తారు. ఈ పండుగలో ఆ గ్రామ రజకులే కాకుండా బంధు మిత్రులను కూడా ఆహ్వానించి వేడుకగా జరుపు కుంటారు. అదేరోజు బలి కార్యక్రమం నిర్వహిస్తారు. రజకుల ఇళ్లపై బలి చల్లుతారు. ఇదే క్రమంలో వీరు హిందువులు జరుపుకునే పండుగలను అనగా తొలి ఏకాదశి, దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది పండుగ లను జరుపుకుంటారు.

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మాసయ్య పటం కళా బృందాలు చాలా తక్కువగా ఉన్నాయి. నిజం చెప్పాలంటే నాలుగు బృందాలు మాత్రమే ఉన్నాయంటే ఈ కళారూపం ఏ స్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కళనే వృత్తిగా జీవిస్తున్న మాసయ్య కళాకారుల సామాజిక, సాంఘీక జీవనం అంతా తమ పోషక కులమైన రజకులను పోలి ఉంటుంది. ఇటీవల కాలంలో మాసయ్యలు సైతం పోషిత కుల ఆదరణ లేకపోవడంతో ఇతర వృత్తులను చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. కథా ప్రదర్శనలు లేని సమయంలో కూలిపనులు చేసుకుంటున్నారు. కొంతమంది వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు.

**మాసయ్యలు - నివాసం :**

పూర్వం నుండి మాసయ్యలు కళా ప్రదర్శనలే వృత్తిగా నమ్ముకుని జీవిస్తున్నారు. రజకుల దగ్గరకు వెళ్లి కథలు చెప్పగా వారు ఇచ్చిన త్యాగంతోనే బతుకును వెళ్లదీసే వారు. గతంలో ఒక గ్రామానికి కథ చెప్పడానికి గాను కుటుంబం అంతా కలిసి వెళ్ళి రోజుల తరబడి, నెలల తరబడి అక్కడే ఉండి రజకులు పెట్టింది తినేవారు. రజకులు చూపించిన ఇళ్లల్లో నివాసం ఉండేవారు. ఒక్క ఊరిలోనే ఐదారు నెలలు ఉండి చుట్టుప్రక్కల గ్రామా లకు కథలు చెప్పడానికి వెళ్లేవారు. ఇలా పూర్వం నుండి కథలు, త్యాగం మీదనే ఆధారపడి ఎలాంటి పనులకు వెళ్లేవారు కాదు. దీనివల్ల మాసయ్యలు స్థిరనివాసం గురించి ఆలోచించలేదు. భూములు, జాగలు సంపాదించ

లేకపోయారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ సంక్షేమ పథకాలలో భాగంగా నూతనంగా ఇళ్లు మంజూరు చేయించుకొని నిర్మాణాలు చేపట్టుకొని నివసిస్తున్నారు. దీంతో కళాకారులకు ఒక స్థిర చిరునామా ఏర్పడినట్లయింది. ప్రస్తుత తరుణంలో రజకుల ఆదరణ తగ్గడం, రజకులు ఉన్న గ్రామాలకు పోయినపుడు మేమే వృత్తిమానుకున్నం, ఆసాముల బట్టలు ఉతకడం లేదు, కూలినాలి చేసుకుని బ్రతుకుతున్నం అంటుండగా మాసయ్యలు ఒప్పించి కొంత ధాన్యం లేదా ధనం రూపంలో తెచ్చుకుంటున్నా అవి ఎటూ సరిపోవడం లేదు. దీంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**మాసయ్యలు – ఇతర వృత్తులు :**

పూర్వం కథలు లేనపుడు ఖాళీగా ఉన్న సమయంలో మాసయ్యలు షికారు అనగా వేటకు వెళ్ళేవారు. వేటలో పిట్టలు పట్టడం, చేపలు పట్టడం వంటివి చేసేవారు. కథలు చెప్పడానికి ఊళ్లమీదికి వెళ్లినపుడు కథలు లేని ఖాళీ సమయంలో కూడా వేటకు వెళ్తారు. గాలం పట్టుకుని చెరువుకుపోయి చేపలు పడుతారు. అలాగే బుట్టి తీసుకుని పోయి పిట్టలు పట్టడం లాంటివి చేసేవారు. ప్రస్తుత కాలంలో మాసయ్యలు షికారు వంటి పనులు చేయడం లేదు. ఎందుకంటే చెరువులలో చేపలు పోసి తెనుగు వారు పెంచుకుంటున్నందున ఇతరులను ఎవరిని కూడా చెరువులలో చేపలు పట్టనివ్వడం లేదు. ఇదేక్రమంలో పూర్వం చెరువుల మీద తెనుగు వారికి ఎంత హక్కు ఉండేదో బట్టలు ఉతికే రజకులకు కూడా అంతే హక్కు ఉండేది. చెరువు లూటిపోగానే తెనుగు వారు చేపలు పట్టుకునేవారు. ఆ తర్వాత రజకులు పట్టుకునేవారు. ఇటీవల రజకులు చెరువులలో బట్టలు ఉతకడం ఆపేశాక చెరువు మీద ఉన్న హక్కు పోయింది. అందువల్ల రజకులను చెరువులలో చేపలు పట్టనివ్వడం లేదు. దీనివల్ల మాసయ్యలకు కూడా చెరువుల్లో చేపలు పట్టే హక్కు పోయింది. అదేవిధంగా పిట్టలు పడితే అటవిశాఖ అధికారులు సైతం వీరిని పట్టుకొని కేసులు పెట్టించడం మరియు చెరువలో చేపలు పడితే తెనుగు వారు దండుగలు వేయడం జరుగుతుండటం వల్ల మాసయ్యలు ప్రస్తుతం షికారు లేదా వేట జోలికి వెళ్లడం లేదు.

**మాసయ్యలు – ఆర్థిక జీవనం :**

మాసయ్య పటం కళాకారులు ఆర్థిక జీవనం అంతా వారి పోషితకులమైన రజక కులం పైననే ఆధారపడి ఉంటుంది. ఒకప్పుడు ఉన్నత విలువలతో జీవించిన మాసయ్య పటం కళాకారులు నేడు దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ముఖ్యంగా వీరి ఆర్థిక జీవనంలో 'త్యాగం' లేదా 'కట్టడి' అనేది ప్రధాన భూమికను పోషిస్తుంది. త్యాగం అనేది పోషిత కులం వారు మాసయ్య పటం కళాకారులకు అందించే ఆర్థిక భరోసాగా చెప్ప వచ్చు. ఈ త్యాగం ధనరూపంలోను, ధాన్యరూపంలోను, వస్తురూపంలోనూ ఉంటుంది. త్యాగం లేదా కట్టడి రూపంలో వచ్చిన డబ్బులు లేదా ధాన్యంతో సంవత్సర మంతా జీవించాలి. పటం కథా ప్రదర్శనలే ప్రధాన వృత్తిగా చేపట్టడం వలన పోషిత కులం ఆదరణ లేకపోవడంతో మాసయ్యలు ఎక్కువగా పటం ప్రదర్శనలపై ఆసక్తి చూపలేకపోతున్నారు. ఈ క్రమంలోనే మాసయ్య పటం కథకులను త్యాగంతో పాటు రజకుల ప్రత్యేక సందర్భాల్లో ఇచ్చే కట్నాలు కూడా ముఖ్య ఆర్థిక వనరులుగా చెప్పుకోవచ్చు.

**త్యాగం / కట్టడి :**

గ్రామాలలో రజకులు వివిధ కులాల వారి బట్టలు ఉతికి ఏవిధంగానైతే కట్టడి ఆడుక్కోవడం జరుగుతుందో, అదేవిధంగా రజకులకు కథలు చెప్పి, వారి నుండి కట్టడి లేదా త్యాగం అడిగే హక్కు కూడా మాసయ్యలకు ఉం టుంది. త్యాగం అనేది తరతరాలుగా వస్తున్న హక్కుగా చెప్పుకోవచ్చు. మాసయ్యలు త్యాగం లేదా కట్టడి కోసం వివిధ గ్రామాలకు వెళ్లేటప్పుడు తమవెంట రాగిశాసనం, పటం, తబల, హార్మోనియం మొదలైనవి తీసుకుని వెళతారు. ఇవి గుర్తింపు కార్డులుగా పనిచేస్తాయి.

మాసయ్య పటం కథకులు ఏదైన ఒక గ్రామానికి వెళ్లిన తర్వాత ముందుగా ఆ గ్రామ పెద్దమనిషిని కలుస్తారు. ఆయన ఎవరి ఇంటిలో ఉండమంటే వారి ఇంటిలో నివాసం ఏర్పాటు చేసుకుంటారు. ఆ తరువాత

రజకుల ఇళ్లిల్లు తిరిగి మేము మాసయ్యలం వచ్చామని తెలియజేస్తారు. వీరు వెళ్లిన తరువాత ఒకటి రెండు రోజులకు రజక కులపెద్ద ఆ గ్రామంలోని రజకులందరినీ తన ఇంటికి పిలిపిస్తారు. అందరు తన ఇంటికి చేరాక చాపలు వేసి కూర్చోమని చెపుతాడు. ఆ తరువాత మాసయ్యలు తాము వచ్చిన విషయాన్ని చెప్పి కట్టడి లేదా త్యాగం అడుగుతారు.

మాసయ్యలు రజకులను అడిగే కట్నం లేదా త్యాగం అనేది రెండు రకాలుగా ఉంటుంది. పటం కథ చెప్ప కుండా మామూలుగా కట్నం లేదా త్యాగం అడగడం ఒకటి. పటం ఆధారంగా కథ ప్రదర్శించి త్యాగం అడగడం ఇంకొకటి. పూర్వం ప్రతీ గ్రామానికి వెళ్లినపుడు తప్పకుండా కథ చెప్పించేవారు. కానీ ప్రస్తుతం ఎక్కువగా కథ చెప్పించడం లేదు, ఎందుకంటే కథ చెప్పిస్తే ఖర్చు ఎక్కువ అవుతుందని భావించడంతో, వారు కేవలం త్యాగం మాత్రమే ఇచ్చి పంపిస్తున్నారు. అయితే ప్రస్తుతం కొన్ని గ్రామాల రకులు మాత్రమే 'మాకు కథ చెప్పాలి' అని అడిగి మరీ చెప్పించుకుంటున్నారు. కథ చెప్పించి నట్లయితే 30 నుండి 50 వేల రూపాయలు, ఒక క్వింటా నుండి రెండు క్వింటాల బియ్యం అడుగుతున్నారు. ఇలా మాసయ్యలు అడిగినంత ఇవ్వడం కాకుండా, రజకులు అందరు కలిసి విచారించుకుంటారు. ఆ తరువాత త్యాగం ఎంత ఇవ్వాలో నిర్ణయించుకుంటారు. దాని ప్రకారం కొంత డబ్బును అడ్వాన్సుగా ఇస్తారు. త్యాగం డబ్బులు మాసయ్యలు ఇళ్లిల్లు తిరిగి అడగాల్సిన పనిలేకుండా రజకులే ఇంటికి ఇంత అని వసూలు చేసి మాసయ్యలకు ఇస్తారు. ఈ మధ్యకాలంలో ఆయా గ్రామాలోని రజక కుల సంఘాలు లేదా రజక కుల సహకార సంఘాల నుండి ఉమ్మడిగా డబ్బుతీసి త్యాగం ఇస్తున్నారు. అయితే కథ లేకుండా త్యాగం నిర్ణయించినట్లయితే మాసయ్యలు పది వేల రూపాయలు అడిగితే రజకులు ఐదువేల వరకు ఇస్తారు.

కథ చెప్పించుకునే మూడు రోజులు మాసయ్యలకు కావల్సిన అన్ని ఏర్పాట్లు రజకులే చూసుకుంటారు. స్టేజి ఏర్పాటు కోసం అవసరమయ్యే కర్రలు, లైట్లు, బెంచీలు, కళాకారులకు మధ్య మధ్యలో టీలు, ఇతర పానీయాలు, వసతి, భోజన సౌకర్యాలు అన్నింటిని రజకులే చూసు కుంటారు.

**వివిధ రకాల కట్నాలు :**

మాసయ్యలకు త్యాగమే కాకుండా రజకులు వివిధ రకాల కట్నాలు కూడా ఇస్తారు. ఆయా గ్రామాలలో కొత్తగా మడేలయ్య, వీధి నాంచారమ్మల గుడులు కట్టు కున్నప్పుడు తప్పకుండా ఆ దేవతలకు సంబంధించిన పండగ చేసుకుంటారు. ఈ పండుగల సందర్భంలోను మరియు చాకలి వాళ్ల ఇళ్లల్లో జరిగే పెళ్లి, చావు వంటి వివిధ సందర్భాలలో కూడా మాసయ్యలను పిలిచి దానికి సంబంధించిన కట్నం ఇస్తున్నారు. ఇది ధన రూపంలో లేదా ధాన్యం రూపంలో ఉండవచ్చు.

రజకులు పూర్వం మడివేలయ్యకు లేదా వీధి నాంచారికి గాని గుడి కట్టాలంటే చెరువు కట్టకు చిన్నగా రెండు పలుచని బండలు పెట్టి సున్నం వేసి వాటినే దేవతలుగా భావించి పూజలు, పండుగలు చేసేవారు. ప్రస్తుతం కుల సంఘాలు ఏర్పడిన తర్వాత రజకులు కలిసికట్టుగా చందాలు వేసుకొని కొత్తగా గుడి కట్టస్తు న్నారు. ఇలాంటి సమయంలో రజకులు మాసయ్యలను పిలిచి పూజ చేయించుకొని, కథ చెప్పించుకొని 40 నుండి 50 వేల రూపాయల వరకు కట్నం లేదా ఇతర వస్తువు లను కానుకగా ఇస్తున్నారు. ఈ సందర్భంగా మాసయ్యలు విగ్రహ ప్రతిష్ట చేసి దేవతలకు బోనం వండి, పటం కథ చెపుతారు. ఇవన్నీ పనులు చేసినందుకు రజకులు మాసయ్యలకు పండగ కట్నం ఇస్తున్నారు.

మాసయ్యలు ఊళ్ల మీదికి త్యాగం కోసం వచ్చిన సమయంలో రజకుల ఇండ్లలో పెళ్లి జరిగితే పెళ్లి కట్నం ఇస్తారు. దీనికై పోలు బియ్యం మరియు వేయి లేదా 2 వేల రూపాయలు పెళ్లి కట్నంగా ఇస్తారు. రజకుల ఇండ్లలో పెళ్లి జరిగిన సందర్భంలో మాసయ్యలు ఊరిలో లేకపోయినా వారికోసం పోలు బియ్యం ప్రక్కకు పెట్టి మాసయ్యలు ఊళ్లోకి వచ్చినపుడు ఇస్తారు.

**ఆర్థిక పంపకాలు :**

మాసయ్యలలో ఒక తండ్రికి నలుగురు కొడుకులు

ఉంటే అందరు కలిసికట్టుగా ఉండి కథ చెపుతూ ఒకే సామగ్రిని అంతా వాడుకునేవారు. అన్నీ పొత్తులనే ఉంటాయి. వారి మధ్య తేడాలు వచ్చి ఒకరంటే ఒకరికి పడకపోతే సామాగ్రినంతటని పంచుకుంటారు. దానికోసం వస్తువులను ధలు నిర్ణయించి పటం ఒకరు, మద్దెల ఒకరు, హార్మోనియం మరొకరు ఇలా తీసుకునేవారు. రాగి శాసనం మాత్రం పొత్తులనే ఉంటది. దాన్ని పంఉకోవలసి వస్తే ధర నిర్ణయం చేసుకుని ఎవరో ఒకరు తీసుకుంటారు. లేదా మిగతా వారు కొత్త శాసనం కోసం రాగి రేకును గాని, పంచలోహాల రేకు గాని కొనుగోలు చేసుకొని దాని మీద తన హక్కు గ్రామాల వివరాలను అచ్చు కొట్టించు కునేవారు. పటం లేనివారు కూడా ధర నిర్ణయం చేసుకొని నకాషి వారితో కొత్తపటం రాయించుకుంటారు.

**మాసయ్యాలు - ప్రస్తుత స్థితి :**

పూర్వం మాసయ్య కుటుంబాలలో ఏ కుటుంబానికి ఆ కుటుంబంలోనే కథ చెప్పడానికి సరిపోయే కళాకారులు ఉండేది. అంటే ఒక కుటుంబంలో సుమారు నలుగురు లేదా ఐదుగురు కళాకారులు ఉండేవారు. వారే ఒక బృందంగా ఏర్పడి కథలు చెప్పేవారు. తర్వాత కాలంలో వారు విడిపోయిన తరువాత, కళాకారుల సంఖ్య తగ్గడంతో ఏ ఊరికి ఆ ఊరుకు సరిపోయేట్టు ఒక బృందం ఏర్పాటు చేసుకునేవారు. రానురాను యువత ఈ కళను నేర్చుకోవడానికి ఆసక్తి చూపకపోవడం, కళాకారులు ముసలివారు కావడం, కొంతమంది చని పోవడం వల్ల ఒక గ్రామంలో ఒక బృందానికి సరిపడ కళాకారులు లేకుండా అయ్యింది. దీని వలన రెండు లేక మూడు గ్రామాలకు చెందిన కళాకారులు ఒక బృందంగా ఏర్పడి కథలు చెపుతున్నారు. ఇలాంటి సందర్భంలో సహాయంగా వచ్చిన కళాకారులకు కూలీ ఇవ్వడం జరుగుతుంది. ఈ క్రమంలో కళాకారుల సంఖ్య తగ్గుతుండటంతో ఇతర కులానికి చెందిన కళాకారులను కూడా వాద్య సహకారానికి ఉపయోగించుకుంటున్నారు.

ఈ విధంగా కళాకారుల సంఖ్య రాను రాను తగ్గి పోతుండటం వలన మాసయ్య పటం కథకులు చాలా వరకు కథలు చెప్పడం తగ్గించారు. కేవలం వారికి హక్కు గల గ్రామాలకు వెళ్లి త్యాగం అడగడం మాత్రమే చేస్తు న్నారు. వీరి పోషణ కూడా భారం కావడంతో రజకులు కూడా కథ చెప్పించుకోవడం తగ్గించారు. దీంతో కొంత మంది కళాకారులు ఊళ్ల మీదికి వెళ్లడం కూడా ఆపేశారు. కళాకారులు తమకు హక్కుగా వచ్చిన ఆ గ్రామాలకు త్యాగం కోసం వెళ్లినపుడు, రజకులు 'మీరు పోయి ఏదైనా పనిచేసుకోండి మేము త్యాగం ఇవ్వం' అని చెప్పడం వలన మాసయ్యాలు ఇళ్ల మీదకు వెళ్లడం మానేశారు. అలాగే తమ పిల్లలకు కూడా కళను నేర్పించడానికి ఇష్టప డుట లేదు. ఆర్థిక కారణాల నేపథ్యంలో మాసయ్యాలు తమ దగ్గర ఉండే పటం, హార్మోనియం, మద్దెల మొద లైన వస్తువులను కూడా అమ్ముకోవడం లేదా ఇతర కళాకారులకు ఇవ్వడం వలన కళాకారులు పూర్తిగా కళను వదిలేసి ఇతర పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు.

కొంతమంది మాసయ్యాలు తమ పిల్లలను ఈ కథల వృత్తిలో కొనసాగించడానికి ఇష్టపడుట లేదు. ఈ కారణం కూడా కొటి కావడంతో యువ కళాకారులు ఈ కళపై ఆసక్తి లేక చదువుకుంటున్నరు, కొందరు వేరే పనిలో నిమగ్నమవుతున్నారు. అందుకే మాసయ్యాలు ఖాళీగా ఉన్న సమయంలో ఎక్కువగా వ్యవసాయ పనులకు కూలీలుగా వెళుతున్నారు. పంట చేలకు నీరు పెట్టడానికి, పురుగుల మందు కొట్టడానికి మొదలైన వ్యవసాయ పనులకే కాకుండా, ఇతర పనులైన రంగులు వేయడం, ఇంటి నిర్మాణం, బీరువాలు కూలర్ల తయారీ వంటి పనులకు వెళ్తున్నారు. కొందరు గొర్రెలు, మేకల పెంపకం వంటి పనులను కూడా చేస్తున్నారు. ఒకవేళ ఊళ్ల మీదికి పోయేవాల్లు ఈ పెంపకం పనులు చేస్తే వెళ్లేటపుడు వేరే వాళ్లకు వాటిని అప్పగించి వెళ్తున్నారు.

ప్రస్తుతం మాసయ్యాలు కథలు లేని సమయంలో ఇంలాంటి ఏదో ఒక పని చేస్తుండటంతో తమ పిల్లలను చదివిస్తూ ఒకచోట స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. ఆడవాళ్లు కూడా పత్తి ఏరడం, కలుపు తీయడం, నాట్లు వేయడం, వరి కోతలు కోయడం వంటి పనులకు వెళ్తున్నారు.

**ఉపసంహారం :**

తెలంగాణలో మాసయ్య పటం కళారూపం కను

మరుగయ్యే స్థితిలో ఉంది. కారణం ధాతృ కులమైన రజకుల ఆదరణ, పోషణ లేకపోవడం ఒక కారణమైతే, నేటి యువ కళాకారులు ఈ ప్రదర్శనలపై ఆసక్తి చూపకుండా ఇతర వృత్తులను చేపట్టడం మరొక కారణం. చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలిచే మాసయ్య పటం కళారూపాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అదేవిధంగా ఈ కళారూపాన్ని ప్రదర్శించే కళాకారులకు ఆర్థిక భరోసా కల్పించి ఆదుకోవాల్సిన ఆవశ్యకత కూడా ఉంది. దీనికై ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాల తోడ్పాటు ఎంతైనా అవసరం. మాసయ్య పటం కళాకారులు సామాజికంగా నిలదొక్కుకోవాలంటే వారి ధాతృకులమైన రజకుల తోడ్పాటు ఎంతైనా అవసరం. అదేవిధంగా రజకుల కులచరిత్రయైన మడేలు పురాణంను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ఆ కులం వారిదే. దీని కోసం మాసయ్య పటం కళాకారులను ప్రోత్సహించే విధంగా ఆయా గ్రామాలలో కళాకారులచే ప్రదర్శనలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. దీనివల్ల కళారూపం మనుగడ సాధించడమే కాకుండా కళాకారులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం ఉంది. ఆ దిశలో ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు అడుగులు వేస్తాయని ఆశిద్దాం.

**ఆధార గ్రంథాలు :**


1. ఆర్వీయస్ సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 1982.
2. బిరుదురాజు రామరాజు, తెలుగు జానపద గేయ సాహిత్యం, ఆంధ్ర రచయితల సంఘం, హైదరాబాద్, 1958.
3. పులికొండ సుబ్బాచారి, తెలుగులో కుల పురాణాలు - ఆశ్రిత కులవ్యవస్థ, ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్, హైదరాబాద్.
4. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, తెలుగు జానపద కళారూపాలు, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 1992.
5. గడ్డం వెంకన్న, పటం కథలు - కథకులు, భగత్ పబ్లికేషన్స్, వరంగల్లు, 2011.
6. ఎన్. భక్తవత్సలరెడ్డి, తెలుగు జానపద విజ్ఞానం, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2012.


★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# చిందు భాగవతం - బుడ్డర్ ఖాన్ పాత్ర



- డా॥. బాశెట్టి లత

అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**వ్యాస సంగ్రహం :**

భారతదేశం అనేక ఆచార, వ్యవహారాలకు, సంస్కృతీ సాంప్రదాయాలకు పుట్టినిల్లు. ఈ గడ్డపై కొన్ని వేల సంవత్సరాల నుండి పండిత, పామరుల్ని అలరింపజేసే రమణీయకళారూపాలు జానపద కళారూపాలు. ఈ జానపద ప్రదర్శన కళారూపాల ప్రత్యేకత ఏమిటి? జానపద ప్రదర్శన కళారూపాల రకాలు గురించి వివరించ బడ్డాయి. ఇందులో చిందు భాగవతుల గురించి విశ్లేషిస్తూ, చిందు భాగవతంలో హాస్యపాత్రధారి అయిన బుడ్డర్‌ఖాన్ గురించి, ఆ పాత్ర ప్రత్యేకతను ఈ వ్యాసంలో వివరించబడ్డాయి. జానపద ప్రదర్శన కళారూపాల్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకతను చెప్పబడింది.

**కీలకపదాలు :**

జనపదులు, ప్రదర్శన కళారూపాలు, చిందు భాగవతం, బుడ్డర్‌ఖాన్, హాస్యపాత్ర, బఫూన్, ఛలోక్తులు.

**జానపద ప్రదర్శన కళల ప్రస్థానం :**

"భారతస్య ప్రతిష్ఠే ద్వే
సంస్కృతం సంస్కృతస్తథా"

అన్నది ఆర్యోక్తి. భారతదేశ ప్రతిష్ఠకు ముఖ్య కారణాలు రెండు. ఒకటి సంస్కృతభాష, రెండవది మన దేశ సంస్కృతి.

భారతదేశం అంటేనే అనేక కులమతాల, ఆచార వ్యవహారాల కలబోత. ఒకప్పుడు భారతదేశంలో ఎక్కువ శాతం మంది వ్యవసాయం చేస్తూ జీవనాన్ని గడిపేవారు. వ్యవసాయానికి పల్లెటూళ్లే పట్టుకొమ్మలు. ఆ పల్లెల్లో ప్రకృతితో మమేకం అయి ప్రశాంత జీవితాన్ని గడిపేవారు. 'జనులు' జీవించే ప్రాంతమే 'జనపదం' అంటే పల్లెటూర్లని అర్థం. ఆ జనపదాలలో జీవించేవారే జానపదులన్నది జగమెరిగిన సత్యం. అటువంటి జానపదుల గురించి తెలిపే సాహిత్యమే జానపద సాహిత్యం.

నిరంతరం ఏదో ఒక పనిభారాన్ని మోస్తూ, చేస్తూ ఉండే జనపదులు ఆ భారాన్ని తగ్గించుకోవడానికి విజ్ఞాన వినోదాలకు స్థానం ఏర్పరచుకున్నారు. అలా ఏర్పడిన ఈ జానపద సాహిత్యంలో గేయాలు, కథలు, కథా గేయాలు, పొడుపుకథలు, సామెతలు మొదలైన అనేక ప్రక్రియలు వచ్చాయి. కాలక్రమేణా జానపదులు సాహిత్యంతో పాటుగా కొన్ని ప్రదర్శన కళలనూ సృష్టించు కున్నారు. జానపదుల ప్రతిభా నైపుణ్యాలకు, మానవ మనోవికాసానికి నిలువెత్తు సాక్ష్యాలు ఈ జానపద కళా రూపాలు.

జానపదులు వారి నైపుణ్యాన్ని సానపెట్టి ఎన్నో ఉపయోగ కళాఖండాలని తయారు చేసుకున్నారు.

ఉదాహరణకి కత్తి, గొడ్డలి, రంపం, సుత్తి, గంపలు, కుండలు అనేక రకాల ఆభరణాలు మొదలైనవి. వీటిని జానపద కళలు అంటాము. వీటితో పాటు ఉదయం నుండి రాత్రి వరకు పనులు చేసి అలసిపోయిన వారికి మానసిక ఉల్లాసం కోసం కొన్ని కళలను ప్రదర్శించేవారు. క్రమంగా అవి ఉత్సవాల సమయాల్లో, ఏదైనా పండుగ సందర్భాల్లో ప్రదర్శన ఇచ్చేవాళ్ళు. వీటినే జానపద ప్రదర్శన కళలు అని పిలవడం జరిగింది.

ఈ ప్రదర్శన కళలపై ఇంకా చాలా పరిశోధనలు చేయాల్సి వుందన్న విషయాన్ని గ్రహించి ఈ సంకలనాన్ని తీసుకొస్తున్న సదస్సు నిర్వాహకులను అభినందించాల్సిందే.

జానపదుల ఆనందోత్సాహాలకు, మానసిక చైతన్యానికి, కల్పనాశక్తికి మూలమైనవే ఈ ప్రదర్శన కళలు. జనపదుల నుండి పుట్టాయి కాబట్టి మనుషుల జీవితాలకు చాలా దగ్గరగా ఉంటాయి. ఈ ప్రదర్శన కళలు జానపదుల జీవితాలు బింబ ప్రతిబింబాలు అనడంలో అతిశయోక్తి ఏమీ లేదు.

తెలుగునేలపై అనేక ప్రదర్శన కళ ఆవిర్భవించాయి. ఉదా : బుర్రకథ, ఒగ్గుకథ, తోలుబొమ్మ లాటలు, గరగలు, గొల్లకలాపం, చెక్కభజనలు, కోలాటం, డప్పులు, పిచ్చుకుంట్లు, పగటి వేషాలు, మొదలైనవి అనేకం ప్రజాదరణలో నేటికీ కన్పిస్తాయి. ప్రపంచీకరం ప్రభావంతో చాలా కళలు, వాటి పేర్లు కూడా వినబడక పోయే ప్రమాదం కన్పిస్తుంది. రేడియో, టీవీ, సినిమాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం నేటి ప్రజా జీవనంపై అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

ఈ ప్రదర్శన కళలు ప్రజలకు సంతోషంతో పాటు, వేగంగా సమాచారాల్ని సందేశాన్ని చేరవేస్తాయి. ఈ ప్రదర్శన కళారూపాల వల్ల ప్రజల్లో మార్పు వస్తుంది. అందువల్ల ఈ కళారూపాలను రక్షించాల్సిన బాధ్యత నేటి ప్రభుత్వాలు తీసుకోవాలి.

**జానపద ప్రదర్శన కళారూపాలు రకాలు :**

జానపదులు రోజంతా శ్రమించి సాయంత్రం పూట వినోదం కోసం వేసిన కళలే జానపద ప్రదర్శన కళలయ్యాయి. జానపదులు సమయం, సందర్భంను బట్టి అనేక రకాలుగా అనేక వేషాలు వేస్తూ ప్రదర్శనలు చేసేవారు. ఈ కళలను ఒకరి నుండి మరొకరు అనుకరించేవారు. వాటినే అనుకరణ నృత్యాలు అన్నారు.

ఉదా : 1. కొమ్ము నృత్యం, 2. ఎలుగుబంటి నృత్యం, 3. నెమలి నృత్యం, 4. అశ్వనృత్యం, 5. కొమ్ము నృత్యం, 6. పెద్దపులి నృత్యం మొదలైనవి.

కొన్ని నృత్యాలను వాయిద్యాలతో ప్రదర్శిస్తారు. వాయిద్యాల్ని బట్టి ఆ నృత్యాలకు ఒక పేరు పెట్టడం కన్పిస్తుంది.

ఉదా : 1. ఉరుముల నృత్యం, 2. డప్పుల నృత్యం, 3. గొరవయ్యల నృత్యం, 4. తప్పెటగుళ్ల నృత్యం, 5. గరిడీ నృత్యం

ఈ ప్రదర్శనల్లో ఆరాధన ప్రధానమైన నృత్యాలు కూడా ఉన్నాయి. అవి :

1. గరగనృత్యం, 2. ఆసాదుల నృత్యం, 3. జ్యోతి నృత్యం, 4. వీరనాట్యం, 5. యామయ్య స్వాముల నృత్యం.

వీటిలోనే వినోదం ప్రధానంగా గల నృత్యాలున్నాయి. అవి :

1. లంకిణీ నృత్యం, 2. నామాల సింగని నృత్యం, 3. గొబ్బినృత్యం, 4. జక్కి నృత్యం

పై విధంగా నృత్యాలతో పాటు బొమ్మలాటలు, వీధి నాటకాలు, యక్షగానం, వీధిభాగవతాలు, పగటివేషాలు, కలాపాలు, భజనలు, కథాగానాలు, అద్భుత విద్యలు, సాముగరిడీలు, ఆశ్రితకుల గాథాగాయకులు, ఉత్సవాలలో ప్రదర్శనలు సుద్దులు మొదలైనవి జానపద ప్రదర్శన కళారూపాలుగా నేటికీ నిలిచి ఉన్నాయి.

**చిందు భాగవతం విశిష్టత :**

చిందు భాగవతం వీధిభాగవతాలులో అంతర్భాగము. కళాకారులు వీధినే ఆధారంగా చేసుకొని కళారూపాన్ని ప్రదర్శించేవారు కాబట్టి దీన్ని వీధిభాగవతం అనేవారు. ఇందులో భాగవత కథతో పాటు చారిత్రక, పౌరాణిక, సాంఘిక ఇతివృత్తాలను కూడా ప్రదర్శించేవారు. ఈ వీధి

భాగవతులలో గంటె భాగవతులు, జేగంట భాగవతులు, గొల్ల భాగవతులు, మాల భాగవతులు కపట్రాల భాగవతులు, కోటకొండ భాగవతులు, గొంధళే వీధి భాగోతాలు, గొంధళీల కథాగానం, గొంధళీల వీధి భాగోతం, చిందు భాగవతం, చిరుతల భాగవతం, తందనాన భాగవతం, జాలరి భాగవతం, తూర్పుకట్టు భాగవతం, నక్కల భాగవతం, భూమి భాగవతం, యానాది భాగవతంలు కలవు.

చిందులు వేయడం వల్ల వచ్చిందే చిందు భాగవతం. దానికో పద్ధతి కూడా ఉంది. పల్లెల్లో ఏవైనా పండగలు, జాతరలు జరిగేటప్పుడు చేసే డప్పుల, డోళ్ళ శబ్దాలకు ఊపందుకున్న ప్రజలు ఈలలు వేస్తూ చిందులేయడం చూస్తాము. ఒక్కోసారి శాస్త్రీయ పద్ధతిలో గంతులు వేయకపోయినా, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని, కాళ్ళను నేలమీద కొడుతూ లేదా తాకిస్తూ, ముందుకు, వెనక్కి వంగుతూ ఈలలేస్తూ చిందులు తొక్కుతూ కన్పించడం వలన 'చిందు' అనే నాట్య విశేషంగా పేరు పొందింది. ప్రారంభంలో ఏమీ తెలియని జానపదులు వేసిన అడుగులే తర్వాత 'చిందు'లయ్యాయి. దీనికి ఒక కథను జోడించినందుకు ఒక కళారూపంగా పరిణమించింది. అదే 'చిందు భాగోతం' కళారూపంగా పిలువబడింది. ఇందులో కేవలం భాగవతం అంటే కృష్ణుని గాథలే కాకుండా, అనేక రకాల ఇతివృత్తాలు కన్పిస్తాయి.

ఈ చిందు భాగవతం ప్రస్తుతం నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో, హరిజనుల్లో ఒక తెగ అయిన మాదిగలు ఆడతారు. అందువల్లే వీరిని చిందు మాదిగలు అని కూడా పిలిచేవారు. ఈ చిందు భాగవతాన్ని వివిధ ఉత్సవాలప్పుడు ప్రదర్శించేవారు.

ఉదా : శ్రీకృష్ణ జన్మాష్టమి, శ్రీరామనవమి, హనుమజ్జయంతి, వినాయకచవితికి మొదలైనవి. చిందు భాగవతం పది పన్నెండు ప్రదర్శనలు వేశాక, చివరిగా తప్పనిసరిగా 'ఎల్లమ్మ' కథను ప్రదర్శించేవారు. చివరికీ ఆ ఊరిలోని వాళ్ళంతా వాళ్ళ వాళ్ళకు తోచింది ధాన్య, ధన, వస్త్ర, పశువుల, భూమి రూపంగా దానాలు చేసే వాళ్ళు. ఇప్పటికీ నిజామాబాద్‌లో ఈ ప్రదర్శనలు చేసే వాళ్ళున్నా, తర్వాత తరాలు కూడా ఆసక్తితో ముందుకు రావాలంటే ఈ కళారూపాలు కనుమరుగు అవ్వకూడదంటే వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిది, అలాగే ప్రతీ కళాహృదయులది కూడాను.

**బుడ్డర్‌ఖాన్ హాస్యపాత్ర :**

ప్రదర్శన జరుగుతున్న సమయంలో చూసేవాళ్ళకు విసుగురాకుండా, మధ్యమధ్యలో కడుపుబ్బా నవ్విస్తూ ఉండే పాత్రనే బుడ్డర్‌ఖాన్ పాత్ర. ఇతన్నే 'బఫూన్', 'మంత్రి', 'సారథి' అనే పేర్లతో కూడా పిలువబడుతుంది. ఇతడు తన విచిత్రమైన వేష, భాషలవల్ల, హావభావాలవల్ల చూసేవాళ్ళకు చూడగానే నవ్వొచ్చేలా వ్యవహారం ఉంటుంది. మధ్యమధ్యలో ప్రేక్షకుల మధ్యలోకి వెళ్ళి ఎవరో ఒకర్ని తెలిసినవాళ్ళలాగానే ఛలోక్తులతో మాట్లాడిస్తాడు. అది చూసిన ప్రేక్షకులంతా గొళ్ళున నవ్వుతారు. ఈ ప్రదర్శనలో కూడా మొట్టమొదటిగా బుడ్డరిర్‌ఖానే స్టేజీ మీదకి వస్తాడు. ప్రదర్వనలో ఇతర పనులన్నింటికి సమన్వయకర్తగా, సూత్రధారుడిగా పనిచేస్తుంటాడు. ఇతని ప్రధాన పని ఛలోక్తులతో, హాస్యోక్తులతో వెటకారంగా మాటలు రువ్వుతూ నవ్వులు చిందించేలా చెయ్యడమే. ప్రధాన పాత్రలు కాసేపు విశ్రాంతి తీసుకోవడం కోసం, లేదా వేరే పాత్రలు సంసిద్ధం అయ్యే కొద్ది సమయం దొరికినప్పుడల్లా ఈ హాస్యపాత్ర రంగ ప్రవేశం చేస్తుంది. బుడ్డర్‌ఖాన్‌కి తోడుగా బాలకిష్ట వేషం కూడా రంగప్రవేశం చేస్తాడు. ఈ చిందు భాగవతుల కళాకారుల చిన్న పిల్లల రంగస్థల ప్రవేశం ఈ బాలకిష్ట వేషంతోనే మొదలు పెడతారు. అలా వేస్తూ వేస్తూనే ప్రధాన పాత్రల వరకూ ఎదుగుతారు.

తెలంగాణా జానపద కథల్లో హాస్యానికి, చమత్కారానికి చాలా ప్రాముఖ్యత కన్పిస్తుంది. ఈ హాస్యపాత్రల ద్వారా సామాజిక పరిస్థితులను, సమాజంలో నేడు మనుషుల తీరులను సులభంగా అర్థం చేసుకునేలా హాస్య పాత్రలు ఆవిష్కరిస్తాయి.

బుడ్డర్‌ఖాన్ అనే పేరు రావడానికి కారణం, ఆ రోజుల్లో ఈ పౌరాణిక నాటకాల్లో ముస్లింలు కూడా చూసేవారుండేవారు. వారికీ విసుగు రాకుండా ఈ బుడ్డర్‌ఖాన్ పాత్రను

ప్రవేశపెట్టేవారు. ఇతను తన మాట, పాటలతో కాసేపు నవ్వించేవాడు.

ఉదా :
"సునో మేరా గానా"
తెలంగి సమఝ్ జానా'
చావల్‌కు బోల్తే బియ్యం
షైతాన్‌కు బోల్తే దయ్యం 'సునో'
ఔరత్‌కు బోల్తే అడ్డీ
గధేకు బోల్తే గాడ్డి 'సునో'

ఈ బుడ్డర్‌ఖాన్ చూడడానికి పొట్టిగా (బుడ్డోడుగా) ఉండి, నక్క తెలివి, అతివినయం తన చేష్టల్లో కన్పించే సరికి చూడగానే నవ్వొచ్చేస్తుంది. ఆయా ప్రాంతాల్ని బట్టి ఈ బుడ్డర్‌ఖాన్ తన వేషాన్ని మారుస్తాడు. మన పల్లెటూళ్లల్లో అప్పుడప్పుడు కన్పించే పిట్టలదొర వేషంలాగా ఉంటుంది ఇతని వేషం. సాధారణంగా కన్పించే చొక్కా, ప్యాంటు, ఆ ప్యాంటు ఒక కాలు పైకి మడతబెట్టి మరొక కాలు ప్యాంటుని కిందికి వేలాడేలా ధరించేసరికి, ఆ రూపమే మనకు నవ్వు తెప్పిస్తుంది. ముఖంకు రకరకాల రంగులతో తెలుపు, నలుపు, ఎరుపులతో మేకప్ వేసు కుంటాడు. ఆ ముఖం చూడగానే నవ్వొస్తుంది. తలపైన పిట్టలదొర టోపీ, కోటు కూడా వేసుకుంటాడు. ఆ కోటు చాలా వదులుగా ఉంటుంది తనది కాదు అన్నట్లు. ఈ వేషధారణ అంతా ప్రేక్షకులలో ఉత్తేజాన్ని నింపుతుంది.

బుడ్డర్‌ఖాన్ తను హాస్యపాత్రనని ఎక్కడా చెప్పుకోడు. పైగా తానే అందరికన్నా పెద్దవాడిలా బిల్డప్ ఇస్తాడు. తను రాజునని, రాజకుమారుడినని, వందలకోట్లకు అధిపతినని, ఇంటినిండా విమానాలే అని, తిన్నా తరగని ఆస్తి ఉందని, తానే మంత్రినని, దేశాధినేతనని.. మొద లైనవి నోటికొచ్చిన పరిచయం చేసుకుంటూ, సమకాలీన అంశాల్ని జోడిస్తూ సెటైర్లు, ఛలోక్తులు వేస్తూ కడుపుబ్బా నవ్విస్తాడు. ఈ పాత్రల ఆధారంగానే గురజాడ కన్యాశు ల్కంలోని గిరీశం పాత్ర, మొక్కపాటి నరసింహశాస్త్రి - బారిష్టర్ పార్వతీశం పాత్ర, గాలి వెంకట్రావు పాత్ర, పానుగంటి లక్ష్మీ నరసింహారావు - సాక్షి వ్యాసాలు, ముళ్ళపూడి వెంకటరమణ - ముత్యాలముగ్గులు, హాస్యబ్రహ్మ జంధ్యాల రచనల్లోని పాత్రలు, మాటల్లో హాస్యం ఒకటే కాకుండా సమాజంలోని మూఢవిశ్వాసాన్ని, వికృత పోకడలను ఎత్తి చూపిస్తూ ప్రజలను చైతన్య వంతుల్ని చేస్తాయి. ముస్లిం నవాబుల పాలన వల్ల ఈ బుడ్డర్‌ఖాన్ మాటల్లో పాటల్లో ఎక్కువగా ఉర్దూ పదాల ప్రభావం కన్పిస్తుంది. 'మై జోర్ జోర్ వాల టోపి కాకునావాల"...

ఉదా : "మై చార్మినార్‌కే రాజాహు మొన్ననే రాజైంది!"

అరే! అది ఎవరుబై? నాకీ అడ్డం వస్తుంది. నేనెవరో తెలుసురా నీకు? అంటూ తెలంగాణ యాసతో మాట్లాడ్డం ప్రేక్షకులకు నవ్వుని తెప్పిస్తుంది. సందర్భోచితంగా ఆశు వుగా పదాల్ని అల్లేస్తూ ప్రేక్షకులకు నవ్వు తెప్పించడమే ఈ పాత్ర ముఖ్య లక్షణం. ఈ విధంగా చిందు భాగవతంలో బుడ్డర్‌ఖాన్ పాత్ర చాలా విశేషం కలదిగా పేరు తెచ్చుకుంది. నవరసాలలో హాస్యరసము కూడా ప్రధానమే అని ఆనాడే భరతుడు చెప్పినది గ్రహించాలి.

'నవ్వడం ఒక భోగం'
'నవ్వించడం ఒక యోగం'
'నవ్వలేకపోవడం ఒక రోగం' అన్నది సామెత. నాటి నుండి నేటివరకు అందరికీ శారీరక, మానసిక ఆరోగ్యం చాలా అవసరం దానివల్ల అన్నీ సానుకూల ప్రభావాలే ఏర్పడుతాయి అనడం అక్షరాలా సత్యం.

"సర్వే జనాస్సుఖినో భవంతు"

**ఆధార గ్రంథాలు :**


1. మోహన్, జి.యస్. 2001, జానపద విజ్ఞానాధ్యయనం - శ్రీలక్ష్మీ ఆర్ట్ ప్రింటర్స్, బెంగుళూరు.
2. సుందరం, ఆర్వీయస్. 2018, ఆంధ్రుల జానపద విజ్ఞానం - పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

3. సాంబశివరావు, గుమ్మా - 2021, తెలుగు జానపద ప్రదర్శన కళారంగం - ఎస్.ఆర్. పబ్లికేషన్స్, విజయవాడ.
4. భవానీలింగ విభూతి, 1999, పగటివేషాలు - వాటి ప్రాచీనత - పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
5. రాధాకృష్ణమూర్తి మిక్కిలినేని, తెలుగువారి జానపద కళారూపాలు - 2019 - పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
6. హరికృష్ణ మామిడి - 2017, కళాతెలంగాణం, కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్.
7. మోడన్‌రావు గడ్డం. 2024, చిందోళ్ల చరిత్ర సాహిత్యం సంస్కృతి - చిందు పబ్లికేషన్స్, హాజీపూర్


★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# "ఒగ్గుకథ భాషా సౌందర్యం - సాంస్కృతిక అభివ్యక్తీకరణ"



- డా॥. ఆర్. మహేందర్ రెడ్డి
తెలుగు సహాయాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), గజ్వేల్.

**వ్యాస సంగ్రహం :**

తెలంగాణ ప్రాంతానికి చెందిన విశిష్ట కళారూపం ఒగ్గుకథ. ఇది సంగీతము, సాహిత్యము, నృత్యం సమ్మిళితంగా ప్రదర్శించబడే జానపద ప్రదర్శన కళ. కథాసూత్రాన్ని అనుసరించి ఆశువుగా అప్పటికప్పుడు అల్లుకుంటూ చెప్పే ఒగ్గుకథలలో విస్తృతమైన భాషా, సాహిత్యం కనిపిస్తుంది. వస్తువైవిధ్యంతో పాటు అలంకారాలు రసపోషణ వంటి సంవిధాన నైపుణ్యాలు ఒగ్గుకథలో ఉన్నాయి.

భాష అభివ్యక్తి మరియు విషయగ్రహణకు తోడ్పడే ప్రాథమిక అంశం. ఒగ్గుకథ పూర్తిస్థాయిలో స్థానిక మాండలిక భాషలో గానం చేయబడుతుంది. అందుకని ఇది నేటికీ విశేషంగా జనాదరణ పొందగలుగుతుంది. ప్రపంచీకరణ, సాంకేతికసాధనాలు విరివిగా అందుబాటులోకి రావడం వంటి కారణాల వలన భాషలో ఎన్నో మార్పులు సంభవిస్తున్నాయి. తద్వారా తెలంగాణ భాషలోని అపురూపమైన నుడికారాలు క్రమంగా కనుమరుగైపోతున్నాయి. ఒక భాషకు ప్రత్యేకమైన నుడికారాలు ఇప్పటికీ ఒగ్గు కథలో నిలిచి ఉండడం విశేషం. అమ్మకోడలు, రెండు జివునాల మనిషి, మక్కిమక్కని పండ్లు వంటి పలుకుబళ్లు ప్రాంతీయ సంస్కృతిని వ్యక్తం చేస్తాయి. కథాగానసందర్భంగా ప్రయోగించబడే ఒగ్గుకథలోని నుడికారాలను పలుకుబళ్ళ విశేషాలను అవి వ్యక్తం చేసే తెలంగాణ భాషా సౌందర్యాన్ని తెలియజెప్పడమే ఈ వ్యాస ఉద్దేశం.

**కీలక పదాలు :**

ప్రదర్శన కళ, ఒగ్గుకథ, జాతీయాలు, పలుకుబళ్ళు, ప్రాంతీయసంస్కృతి, మాండలికభాష, అమ్మకోడలు, మొక్కుడుకోడెలు, అలతేరడం.

**ఉపోద్ఘాతం :**

తెలంగాణలో విశిష్టకళారూపంగా గుర్తింపు పొందిన ఒగ్గుకథ ప్రదర్శన కళారూపం. ఇది ఉత్తర తెలంగాణ ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తుంది. కథాగాన ప్రదర్శన కళారూపమైన ఒగ్గుకథాగానం మాండలికభాషలోనే గానం చేయబడుతుంది. ఇందులో కథాసందర్భాలకు అనుగుణంగా ప్రయోగించే సామెతలు, పలుకుబళ్ళు కథాగతమైన అంశాన్ని సాధారణీకరణం చేస్తాయి. స్థానికభాషను ఉపయోగించడం వల్ల ఇతివృత్తం ఏదైనప్పటికీ ప్రేక్షకులు దాన్ని స్వీయ అంశంగా భావించి తాదాత్మ్యం చెందుతారు. కథాగానంలో ప్రయోగించే ప్రాసాత్మక పదజాలం ఒగ్గుకథాగానానికి లయాత్మకతను, చక్కని తూగును కలిగిస్తుంది. వీటివల్ల కథకునికి గానంలో సహజవిశ్రాంతి లభించడంతో పాటు కథాగానానికి నాదమాధుర్యం

కలుగుతుంది. కథాగానంలో ఉపయోగించే భాష, పలుకుబళ్లు స్థానిక సాంస్కృతిక జీవన విధానాన్ని ఆచారసంప్రదాయాల్ని వెల్లడిస్తాయి.

పలుకుబళ్ళు, సామెతలు భాషకు సజీవతను కలిగిస్తాయి. వీటి ద్వారా ఆయా ప్రాంతాల ప్రత్యేక సంస్కృతి సంప్రదాయాలు అభివ్యక్తమవుతాయి. తెలంగాణ పలుకుబడికి ఆత్మీయత ఎక్కువ. వీటి వ్యుత్పత్తిలో సహేతుకత, అర్థంలో ఆత్మీయతతో పాటు శబ్దంలో సహజమైన ప్రాస కనిపిస్తుంది. నేటి జనవ్యవహారం నుండి కనుమరుగైపోతున్న ఎన్నో అపురూపమైన పలుకుబళ్లు, సామెతలు నేటికీ  ఒగ్గుకథగానంలో నిలిచి ఉన్నాయి. ఒగ్గుకథలో కనిపించే అలాంటి నుడికారాల గురించి తెలుసుకుందాం.

**"అమ్మకోడలు " :**

నేటి వ్యవహారం నుండి కనుమరుగైపోతున్న విలక్షణ పలుకుబడి అమ్మకోడలు. తెలంగాణ గ్రామీణ సంస్కృతిలో  అందరి ముందు తన భర్తను 'ఇతను నా భర్త' అని చెప్పడానికి అలాగే భార్యను 'ఈమె నా భార్య' అని చెప్పడానికి  కొంత బిడియపడతారు. అలాంటిస్థితి నుండి "అమ్మకోడలు" అనే విలక్షణమైన పలుకుబడి ఏర్పడింది. మా అమ్మకోడలు/అవ్వకోడలు అంటే భార్య అని అర్థం. భార్యను అమ్మకోడలు అని చెప్పడంతో పాటు "హంసలంటాడోశిడ్లు అమ్మకోడండ్లు"అని హంసతో పోల్చడంలో ఆత్మీయ ఆకర్షణ అభివ్యక్తం అవుతుంది. ఒగ్గుకథల్లో పెళ్లి సందర్భాన్ని వర్ణించే సమయంలో పాడే కొట్నంపాటలో ఈ పలుకుబడి ప్రయోగం ఉంది.

**"కూరాడు పులిసింది" :**

బియ్యం కడిగిన నీరు కురాడులో పోసి పులిసిన తర్వాత వాటిని వంటకు ఉపయోగించడం ఒక నాటి సాంప్రదాయం. కురాడు పులిసింది అంటే వంట చేయడానికి నీరు సిద్ధంగా ఉందని అర్థం. మల్లన్న ఒగ్గుకథలో పద్మావతిదేవి రజస్వల అయిందని వన్నె లక్కమ్మ చెప్పినప్పుడు నీలమ్మ సంతోషిస్తుంది. అదే విషయాన్ని కొడుకు మల్లయ్యతో "కొడుకా నీ కూరాడు పులిసింది కుతికెల పూలు వడ్డయి నేను ఇప్పుడే దేవగిరి పోయి నీ భార్య పద్మాక్షిని త్వరగా తీసుకొని వస్తాను" అని చెప్పింది.  పూర్వం బాల్యవివాహాలు జరిగినప్పుడు పెళ్లి తర్వాత అమ్మాయి రజస్వల అయ్యేంతవరకు తల్లి గారి ఇంటి దగ్గరే ఉంచేవారు అనంతరం వేడుక జరిపి అత్తవారింటికి తోలుకొని వచ్చేవారు. నీ భార్య సాంసారిక జీవితానికి సిద్ధంగా ఉందని చెప్పడాన్ని కూరాడు పులిసింది అని సభ్యోక్తితో సూచించడం ఒగ్గుకథలోని భాషా సౌందర్యాన్ని వినూత్నమైన అభివ్యక్తీకరణలో తెలుపుతుంది.

**"నెత్తిలిత్తులు దులపడం" :**

నెత్తిలో ఇత్తులు అంటే తల మీది అక్షతలు, తలంబ్రాలు అని అర్థం. విత్తు/ విత్తనం అనే శబ్దం శబ్ద పరిణామం పొంది ఇత్తుగా మారింది. వివాహ సమయంలో బియ్యం, జొన్నలు అక్షతలు తలంబ్రాలుగా వధూవరుల తలమీద పోస్తారు. వివాహ వేడుకలు పూర్తయ్యేవరకు అందరూ ఆశీర్వదించడం వలన తల వెంట్రుకలలో ఈ ధాన్యం అలాగే ఉంటుంది. పెళ్లి పూర్తయిన తరువాత వెంట్రుకలలో చిక్కుకున్న బియ్యం, జొన్నలు దులిపివేసి తలస్నానం చేస్తారు. నెత్తిలిత్తులు దులపడం అంటే పెళ్లి వేడుక పూర్తి కావడం అని అర్థం. మల్లన్న ఒగ్గుకథలో "నెత్తిలిత్తులు దులిపి నెలవారము వెళ్ళింది" అనే పద ప్రయోగం కనిపిస్తుంది. తల మీద అనడానికి బదులు నెత్తి మీద అని చెప్పడంలో మాండలిక భాష సొగసు ఆవిష్కృతమైంది.

**"సత్యవంతుడు సావాన ధీరుడు" :**

ఒగ్గుకథలో నాయకుల వీరత్వాన్ని వర్ణించే సందర్భంలో ఈ విశేషణం కనిపిస్తుంది సత్యవంతుడు అంటే అబద్ధం ఆడని వాడు, సావానదీరుడు అంటే యుద్ధంలో గొప్ప ప్రతాపం కలవాడు అని అర్థం. నాయకుడు మానసిక స్థిరత్వం, శారీరక దృఢత్వం కలిగిన వాడు అని చెప్పడానికి ఈ ప్రయోగం వాడుతారు. సావాన అనే పదం శబ్ద పరిణామం చెందడం వల్ల ఏర్పడిన పదం సమరమున అనే పదంలో  లోపదీర్ఘత రావడం వల్ల  సమరాన అనే పదం ఏర్పడి వ్యవహారంలో సావనగా మారి ఉంటుంది.

**"మొక్కుడు కోడెలు[5]" :**

స్త్రీకి అత్తింటి వారి పట్ల బాధ్యతలు, పుట్టింటి మీద

ఆత్మీయ అనురాగాలు ఎక్కువ. పిల్లలకు కూడా తమ ఇంటి కన్నా అమ్మ పుట్టినిల్లు అయిన అమ్మమ్మ గారి ఇంటి మీద అవ్యాజమైన ప్రేమానురాగాలు ఉంటాయి. పుట్టినింటి వారితో సత్సంబంధాలు కడదాకా సాగాలనే తాపత్రయంలోనే మేనరికం, ఒడిబియ్యం వంటి సాంప్ర దాయ ఆచారాలు ఏర్పడ్డాయి. పిల్లలకు బాల్యంలో తల్లి దండ్రుల తర్వాత మేనమామల దగ్గరే అంతటి ఆదరణ లభిస్తుంది. మేనమామలు కూడా చెల్లి/ అక్క కొడుకు లకు తమ బిడ్డలను ఇచ్చి సంబంధం కలుపుకోవాలని భావిస్తారు. అందుకే మేనల్లుడిని ప్రేమగా ఆదరిస్తారు. ఆడబిడ్డకు పెళ్లి సమయంలో అరణంగా పశువులను, ఆవుల్యాగలను పంపినట్లు మేనల్లుండ్రు కొంతకాలం మేనమామ దగ్గర ఉండి తిరిగి తమ పట్టణానికి బయలు దేరే సమయంలో మేనమామలకు నమస్కరిస్తారు. తమను గౌరవించినందుకు బదులుగా మేనల్లులకు ప్రేమగా కొల్యాగలను బహుమతిగా ఇస్తారు. వీటిని ''మొక్కుడుకోడెలు'' అంటారు. మేనమామలకు మొక్కి నందుకు ఇచ్చే కోడెలు కాబట్టి ఇవి మొక్కుడు కోడె లయ్యాయి. కనుమరుగైన ఈ సంప్రదాయ సంబంధిత పదబంధం గురించి మల్లన్న ఒగ్గుకథలో వర్ణించబడింది. రారాజు మల్లయ్య మేనమామల పట్నం కళ్యాణపట్నం నుండి బయలుదేరి వచ్చేటపుడు వారి నుండి మొక్కుడు కోడెల కింద రామన్న-లచ్చన్న అనే జోడు కోల్యాగలను బహుమతిగా పొందాడని చెప్పబడింది.

**"మక్కీ మక్కని పళ్ళు మాట సక్కదనం" :**

కసుగాయల కన్నా, బాగా మగ్గిన పండ్ల కన్నా దోర మాగిన పండ్లు రుచిగా ఉంటాయి. అలాగే ఏమీ తెలియని బాల్యదశలోని మాటల కన్నా, అన్నీ తెలిసిన వయోజనుల మాటల కన్నా తెలిసి తెలియని కౌమారదశ లోని పిల్లల మాటలు వినసొంపుగా ఉంటాయని చెప్పే సందర్భంలో ఈ ప్రయోగం కనిపిస్తుంది. పన్నెండేండ్ల బాలుడు రారాజు మల్లయ్య మేనమామలను మెప్పించి అనేక సంపదలను గ్రహించాడు. మక్కీ మక్కని పండ్లు మాట చక్కదనంతో మేనల్లుడు మల్లయ్య మాటలకు మురిసిపోయి కళ్యాణపు రాజులు అడిగింది కాదనకుండా ఇచ్చారు అని చమత్కార మైన మాటల్ని పండ్లతో పోల్చిన సందర్భంలో ఈ పలుకుడి ప్రయోగం కనిపిస్తుంది. అరమగ్గిన దోరమగ్గిన అనే శిష్టసాహిత్యశబ్దం కన్నా మక్కీమక్కని అని అసమాపక క్రియలతో ఏర్పడిన పదబంధం ఎంతో అర్థవంతంగా ఉంది.

**"కూరాట్ల చెయ్యి పెట్టిన కుద్దాడిబిడ్డ" :**

తెలంగాణ సాంస్కృతిక చిహ్నాలలో 'కురాడు' ఒకటి, రెండు మూడు దశాబ్దాల కిందటి వరకు కురాడు కలిని వంటకు ఉపయోగించేవారు, అందుకే కురాడును చాలా శుచిగా, శుభ్రంగా కాపాడుకునేవారు. కాలక్రమంలో కలిని ఉపయోగించడం మానేసినప్పటికి కూరాడును ప్రతి శుభసందర్భానికి అలంకరించడం ఆచారంగా ఏర్పడింది. తెలంగాణ ప్రాంతంలో కూరాడును ఆడబిడ్డతో సమాన గౌరవాన్ని ఇస్తారు. ఆడపిల్లను అత్తవారింటికి పంపే సమయంలో కూరాడులో చేయి పెట్టించి చేతికంటిన కలినీళ్ళను కన్నతల్లి కొంగుకు తుడవడం ఇక్కడ ఆచారం. కూరాడులో చెయ్యి పెట్టే అధికారం ఇంటి ఆడబిడ్డకు మాత్రమే ఉండడం విశేషం. ''కుద్దు'' అనే పదం కుద్ అనే ఉర్దూ పదం నుండి వచ్చి ఉండవచ్చు. కుద్ అంటే సొంత, తన అనే అర్థం వస్తుంది. ఇక్కడ కుద్దు అనే పదం సొంతవారు, ఇంటివారు అనే అర్థంలో ఉపయో గిస్తారు. ఎల్లమ్మ ఒగ్గుకథలో జాంబవంతుడు రేణుక ఎల్లమ్మను పరశురాముని వెంట పంపే సమయంలో ఆమెను "కూరాట్ల చేయి పెట్టిన కుద్దాడుబిడ్డ"గా భావించి ఓడివాలు పోసి పంపించాడని వర్ణిస్తారు. అలాగే తెలుగుకు సంబంధించి ఇతర మండలికాలలో ''ఆడపడుచు'' అనే వ్యవహారానికి ఒగ్గు కథల్లో ''ఆడబిడ్డ'' పదాన్ని సమానార్థకంగా ఉపయోగిస్తారు. పడుచు అనే పదం కన్నా బిడ్డ అనే పదం వ్యక్తీకరణలో ఆత్మీయత గౌరవభావాలు కనిపిస్తాయి.

**"డొక్కల కార్యం" :**

సాధారణంగా ఒక మనిషికి సంబంధించిన భావోద్వేగా లను మెదడు గ్రహించి స్పందిస్తుంది. నిజానికి ఆలోచనాత్మకంగా స్పందించేది మనస్సే అయినప్పటికీ వ్యవహారంలో దాన్ని హృదయానికి ఆపాదించి చెబుతారు.

మనసుకు హృదయం అనే పదాన్ని పర్యాయపదంగా వాడతారు. ఇదే విషయాన్ని ఒగ్గుకథలో కార్యానికి (కాలేయం అనే పదం శబ్ద పరిణామం చెందగా ఏర్పడిన పదం కార్యం) ఆపాదించడం విశేషం. డొక్కలకార్యం అంటే కడుపులో ఉన్న కాలేయం అని అర్థం. మిక్కిలి బాధకు గురి అయ్యే పని జరిగినప్పుడు హృదయం ద్రవించింది అనడానికి బదులుగా ఒగ్గుకథలలో "డొక్కలకార్యం దొల్లాడ వట్టే" అనే పదప్రయోగం కనిపిస్తుంది. మన శరీరంలో హృదయంలాగే కాలేయానికి ప్రాధాన్యత ఎక్కువ. పరిమాణంలో కూడా గుండె కంటే పెద్దగా ఉండడం వలన ఈ పలుకుబడి ఏర్పడి ఉండ వచ్చు. దానితోపాటు భరింపరాని దుఃఖాన్ని గురించి తెలిపినపుడు హృదయం తల్లడిల్లింది వంటి ప్రయోగంకి బదులుగా వారి దుఃఖాన్ని చూస్తుంటే "కడుపులో పేగులు అవిసిపోతున్నాయి" అనే విలక్షణమైన పలుకుబడి ప్రయోగం కూడా ఒగ్గుకథలో కనిపిస్తుంది.

**"అలతేరడం" :**

అలతేరడం అంటే పదే పదే గుర్తుకు తెచ్చుకొని దుఖించడం. "తల్లి మీద పడిన నింద విన్న పరుశరాముడు ఆంబోతోలె అలతేరిండు" అని ఎల్లమ్మ ఒగ్గుకథలో పరశురాముని దుఖవర్ణనలో ఈ ప్రయోగం కనిపిస్తుంది. నీటివనరులలో తరంగాలు/అలలు నిరంతరం కదులుతూ ఉంటాయి. ఆ విధంగా ఏదైనా ఒక విషయం మనసును స్థిరంగా ఉండనీయక పదేపదే ఇబ్బంది పెట్టినప్పుడు ఆ విషయం గుర్తుకు వచ్చి  మిక్కిలి ఆవేదన చెందడాన్ని అలతేరడం అంటారు. ఒగ్గుకథగానంలో నాయకుల దుఃఖాన్ని వర్ణించడంలో అలతేరడం కనిపిస్తుంది.

**"రెండు జివునాల మనిషి" :**

ఒగ్గుకథలోని వినూత్నఅభివ్యక్తీకరణకు, అర్థ పరిణామంలోని సభ్యోక్తికి ఈ పలుకుబడి చక్కని నిదర్శనం. గర్భవతి, నెలతప్పింది, నీలాడింది వంటి సభ్యోక్తుల కన్నా "రెండుజీవునాల మనిషి" అని చెప్పడం సహేతుకంగా కనిపిస్తుంది. గర్భవతి అయిన స్త్రీకి రెండు ప్రాణాలు, ఒకటి తనది, రెండు కడుపులో ఉన్న బిడ్డది. ఈ రెండు ప్రాణాలు ప్రధానమే. వీటిలో ఒక ప్రాణానికి ఇబ్బంది కలిగితే మరో ప్రాణం తల్లడిల్లుతుంది. రెండు ప్రాణాలు విడివడి, బిడ్డ భూమ్మీద పడేంత వరకూ ఆ స్త్రీని జాగ్రత్తగా చూసుకుంటారు. సాధారణ మానవులు ఒకే ప్రాణాన్ని కలిగి ఉండగా గర్భవతి అయిన స్త్రీలు రెండు ప్రాణాలను కలిగి ఉంటారు కావున ఈ పలుకుబడి ఏర్పడింది. బీరప్ప ఒగ్గుకథలో చంద్రగిన్నెపట్టణం నుండి వచ్చిన పద్మశాలీలు సూరమ్మ గర్భవతి అని చెప్పడానికి బదులు నాగులకొండ నరభూపతితో "రాజా నీ చెల్లెలు రెండుజీవునాల మనిషి" అని చెప్తారు. ధ్వన్యమైన అర్థంలో ప్రయోగించిన ఈ పలుకుబడిలో విలక్షణత కనిపిస్తుంది.

**"రాయసంటోడు లక్కసంటోడు" :**

మనిషికి శారీరక దృఢత్వం కన్నా మానసిక స్థిరత్వం చాలా అవసరం. మానసిక స్థిరత్వాన్ని చెప్పడానికి ఈ ప్రయోగం వాడుతారు. రాయసంటోడు అంటే స్థిరచిత్తం కలవాడు, ఎన్నిఅడ్డంకులు ఎదురైనా అనుకున్నపని చేయాలనే సంకల్పం కలవాడు. లక్కసంటోడు అంటే చపలచిత్తం కలవాడు, ఎవరు ఏది చెప్పినా విని మనసు మార్చుకున్న వాడు అని అర్థం. బీరప్ప ఒగ్గుకథలో కామరతిని ఎత్తుకొని వచ్చి పెళ్లి చేసుకుంటానని స్థిర చిత్తంతో ఉన్న బీరయ్య కామరతి మాటలు నమ్మి ఆమెను నాగులకొండకు పంపిస్తాడు తన మాటలతో రాయివంటి గట్టి వాడిని లక్కలాగా కరిగించి తప్పించుకు పోయింది అని చెప్పే  కథనాత్మక వ్యాఖ్యానంలో ఈ పలుకుబడి కనిపిస్తుంది స్థిరచిత్తంగా బీరప్ప మనసు రాయి వంటిదని, కామరతి మాటలకు కరిగిపోయిన బీరప్ప మనసు లక్క వంటిదని అర్థం.

**"గోటికి మీసమందే యాల్ల" :**

యుక్త వయస్సుకు వచ్చినవాడని చెప్పడాన్ని సొగసుగా వ్యక్తీకరించిన ఈ పలుకుబడి రంభరంపాల ఒగ్గుకథలో కనిపిస్తుంది. పాండవ పుత్రుడైన నకులుడి కొడుకు రంపాలరాజు. గొప్పవీరుడు, అందగాడు. యువకుడైన రంపాలరాజుకు పెళ్లీడు వచ్చిందని చెప్పడానికి బదులు గొటికి మీసమందే యాల్ల అని చెప్పడం కనిపిస్తుంది. కౌమారదశలో, పదహారేళ్ల ప్రాయంలో అప్పుడే వస్తున్న మీసాలను చూసుకొని సంబరపడిన పురుషుడు తాను

పెద్దవాడినయ్యాననే గర్వంతో మొలుస్తున్న మీసాలను మునివేళ్ళతో పట్టుకొనే ప్రయత్నం చేస్తాడు. అటువంటి చర్య నుండి ఈ పలుకుబడి ఆవిర్భవించింది. గోటికీ అంటే చేతివేళ్ల కొనలకు మీసాలు అందేటువంటి సమయం. నూనుగు మీసాల యుక్తవయస్సును సూటిగా "గోటికి మీసమందేయాల్ల" అని సహజ సుందరంగా వ్యక్తీకరించడం జరిగింది.

**"మేకసండ్లోలె తల్లికి మేమిద్దరం" :**

పూర్వపురోజుల్లో సంతానం ఎక్కువగా ఉండడంకూడా సంపదగా భావించేవారు. అలాంటి రోజుల్లో ఒకరో, ఇద్దరో సంతానం ఉంటే వారిని మరింత అపురూపంగా చూసుకునేవారు. వరరచ్చమల్లన్న కథలో మల్లన్న తన చెల్లె ఆకుమంచిదేవికి ఆపద వచ్చినప్పుడు బాధపడే సమయంలో "మేక సండ్లోలే మాతల్లికి మేమిద్దరం ...." అని చెప్పడం కనిపిస్తుంది. పాలిచ్చే పశుగణాల్లో ఆవుకు, బర్రెకు నాలుగు స్తనాలుండగా, మేకకు రెండు మాత్రమే ఉంటాయి. సృష్టిలో రెండు మాత్రమే ఉండే విశేషణాలెన్నో ఉన్నప్పటికీ ఈ విశేషాన్ని వాడడానికి కారణం ఒగ్గుకథకుల వృత్తిజీవనమే అని చెప్పవచ్చు. ఉపమాలంకారయుక్తమైన ఈ పలుకుబడి ఒగ్గుకథ సహజమైన భాషా సౌందర్యంతో పాటు సంస్కృతిని అభివ్యక్తం చేస్తుంది. ఇలాంటి పలుకు బళ్లతో కూడిన కథాగానం జానపదేతరులకు కొంత అశ్లీలంగా అనిపించవచ్చు కానీ ఇక్కడ భాష కన్నా భావమే ప్రధానం. ఆచార్య కె. రుక్నుద్దీన్ గారన్నట్లు " జానపదుల భాష అశ్లీలం అగునేమో కానీ భావం మాత్రం కాదు.[14]"

**"కుప్పవాడు, కూలివాడు" :**

బంగారుగొర్రె ఒగ్గుకథలో పార్వతీదేవి మల్లన్నకు సవలక్ష గొర్లమందను అప్పగించి బయ్యన్నతో కలిసి మందను సవరించాలని చెబుతుంది. మందను అప్ప గించే సమయంలో కుప్పవాడు బయ్యన్న, కూలి వాడు మల్లన్న అని చెబుతోంది. ఇక్కడ కుప్ప అంటే సంపద అని అర్థం. కుప్పవాడు అంటే సంపదకు అధికారి, మందపై అధికారం కలవాడని, కూలివాడు అంటే చెప్పిన పని చేసేవాడు అని అర్థం. ధాన్యపురాశి అనే అర్థంలో ఉపయోగించే కుప్ప అనే అచ్చతెలుగుపదాన్ని గొర్రెల మంద అనే అర్థంలో ఉపయోగించడం విశేషం.

**"అడ్డ బట్టకట్టిన ఆడది" :**

మాంధాత ఒగ్గుకథలో ప్రయోగించబడిన ఈ పలుకు బడిలో నూటయిన అభివ్యక్తీకరణ కనిపిస్తోంది. యవనాశ్వుని గర్భం నుండి జన్మించిన వీరాధివీరుడు మాంధాత. పురుష అహంకారంతో శక్తి దేవత అయిన విధిని ధిక్కరిస్తాడు. ఆ సమయంలో 'అడ్డబట్ట కట్టిన ఆడది' అని విధినాంచారిని తక్కువ చేసి మాట్లాడతాడు. ఈ మాటలు పురుషుడు బట్ట కట్టకుండా జంకు లేకుండా తిరుగ గలడని, స్త్రీ మాత్రం తన మానాభిమానాలు కాపాడుకోవడానికి అడ్డుగా బట్ట కట్టుకోవాల్సి, విధినాం చారి శక్తిదేవత అయినప్పటికీ స్త్రీ అని, తాను పురుషుడినని పైగా స్త్రీ తో సంబంధం లేకుండా మగవాడి గర్భంలో జన్మించాననే పురుషాహంకారం ఈ పలుకుబడిలో వెల్లడవుతుంది. సమాజంలో మాతృస్వామ్య వ్యవస్థను దిక్కరించి పితృస్వామ్య వ్యవస్థ బలపడుతున్న సమయంలో ఈ పలుకుబడి ఏర్పడి ఉండవచ్చు.

**"ఉడికే వరకు ఊకున్నవు గానీ సల్లారే వరకు చచ్చి పోతున్నవా" :**

లౌక్యంతో కూడిన వెటకారం ధ్వనించే ఈ సామెత మాంధాత ఒగ్గుకథలో ప్రయోగించబడింది. సుబ్బిశెట్టి బారి నుండి తప్పించుకోవాలని ప్రయత్నించిన మాంధాత భార్య విమలాంగిదేవి సుబ్బిశెట్టిపై కపటప్రేమ ప్రదర్శి స్తుంది. "నన్ను కాపాడలేని భర్తను వదిలి నిన్ను పెళ్లి చేసుకోవాలని ఉంది. నీలాంటి వాడు దొరికితే పార్వతీ దేవి నోము నోచుకుంటననుకున్నాను. నోము పూర్తికాగానే నిన్ను పెళ్ళాడతా" అని అబద్ధం చెప్తుంది. ఆ సందర్భంలో అనుమానం వ్యక్తంచేసిన సుబ్బిశెట్టితో "ఉడికే దాకా ఊకున్నవ్ గాని సల్లారే వరకు సచ్చిపోతున్నవ" అని వెటకారంతో కూడిన కపటప్రేమ చూపిస్తుంది. అన్నం ఉడకడానికి ఎక్కువ సమయం పడితే అది చల్లారడానికి కొద్ది సమయమే పడుతుంది. ఈ నేపథ్యంలో ఏర్పడ్డ ఈ మాటల్లో అనుకున్నది అందుబాటులోకి వచ్చే దాకా ఓపిక పట్టావు కానీ అనుభవించే సమయం దాకా ఎందుకు

ఆగడం లేదు అని అర్థం దాగి ఉంది. 'చల్లారే వరకు చచ్చిపోతున్నవా' అనే పదం ప్రాసాత్మకంగా ఉంటూనే కాకువును వ్యక్తీకరిస్తుంది.

వీటితో పాటూ "సోలెడు బియ్యానికి పొంగులు ఎక్కువ, చెల్లని రూపాయికి గీతలెక్కువ, కొంచెపోనికి మాటలు ఎక్కువ", "మ్యాన వారి పిల్ల మ్యాకల్ల కుక్క", "ఎలంకర వెడితేనే ఎన్న", "అవ్వ కరువైతే బువ్వ కరువు" అనే నుడికారాలు సామాజిక వాస్తవ జీవన చిత్రాలను ఆవిష్కరిస్తాయి.

"కోట్లశ్రీమంతం ఉన్న కొంపలోనే ఉంటది, కానీ కాట్లె పెట్టినాడు కాసుగవ్వ తోడురాదు", "సిరి పోయినంక సింగారం ఎందుకు, భర్త పోయినంక భాగ్యం ఎందుకు, బోరెమొలే మొగుడు పొంగా బొంత చింపులకేడ్చు డెందుకు", "భర్త లేని ఆడదానికి బదునాములు ఎక్కువ-భార్య లేని మగవాడికి బాధలు ఎక్కువ", "శాట్ల వడ్డ నాటి రాత - కాట్లె పడేదాక తప్పదు" వంటి మాటల్లో శ్మశాన వైరాగ్యాన్ని తాత్వికంగా తెలియజెప్పబడింది.

అసాధ్యాన్ని సుసాధ్యం చేసిందనడానికి "అరచేత బెల్లం పెట్టి మోచేత నాకించడం" అని చెప్పడంలో, "కోట్ల ధనమున్న కోకరైకదాన్ని, లక్షల ధనం ఉన్న లాగటావు దాన్ని" అని ఆడబిడ్డకు పుట్టింటి వారితో ఉండే ఆత్మీయ సంబంధాన్ని తెలిపే మాటల్లో, బాల్యపు సున్నితత్వాన్ని తెలిపే "ముక్కుపచ్చలారని మూగలాగె", వశపడని సమస్యను వ్యక్తంచేసే "ముక్కుల ఏదుకొయ్య" వంటి పదబంధాలు ఒగ్గుకథ గానానికి లయాత్మకతను అందించడమే కాదు తెలంగాణ ప్రాంతీయ సంస్కృతిని, సామాజిక జీవన విధానాన్ని వెల్లడిస్తాయి.

**ముగింపు :**

ఒగ్గుకథ స్థానికమాండలికంలో అలవోకగా, ఆశువుగా గానం చేయబడుతుంది. కథాగానంలో అలంకారికంగా కనిపించే సామెతలు, పలుకుబళ్ళ విశేషంగా కనిపిస్తాయి. సాంస్కృతిక, వృత్తిజీవనంలో అనుభవపూర్వకమైన స్థితినుండి ఏర్పడ్డ ఈ పలుకుబళ్ళు కథాగాన సందర్భంలో ఇతివృత్తం సులువుగా అర్థమయ్యేటట్టు సాధారణీకరణం చేస్తాయి. అంతేకాకుండా ఒగ్గుకథలో వినిపించే ఈ నుడుకారాలు ఇక్కడి ప్రాంతీయ అస్తిత్వాన్ని సంస్కృతి సాంప్రదాయాల్ని వెల్లడిస్తాయి.

కళాకారుని భావాలను ప్రేక్షకుని మనస్సులో స్థిరపరచి తత్సంబంధమైన రసాస్వాదన చేయించడంలో భాష ప్రధానపాత్ర పోషిస్తుంది. ఒగ్గుకథా గానంలో వర్ణించే పలుకుబళ్లలో ఎక్కడా కృత్రిమత్వం కనబడదు. పోలికలో, పదనిర్మాణంలో సహజ సౌందర్యం వెల్లడవుతుంది. ఈ పలుకుబళ్ళు కథాగానంలో నిసర్గమైన తెలంగాణ భాషా సౌందర్యాన్ని వెల్లడించడంతో పాటు స్థానిక సాంస్కృతిక జీవన విశేషాలను, ఆచార వ్యవహారాలను వ్యక్తీకరిస్తాయి. అనేక రకాల కారణాలతో జానపద కళారూపాలతో పాటు కనుమరుగైపోతున్న ఇలాంటి పలుకుబళ్లను, సామెతలను ఇప్పటికైనా పరిరక్షించి మన భాషాసౌందర్యాన్ని సాంస్కృతిక విశేషాలను తర్వాత తరాలకు అందజేయాల్సిన అవసరం ఉంది.

**ఆధారాలు :**


1. (1,2,3,4,5,6 పదాలు) చుక్క సత్తయ్య, మల్లన్నఒగ్గుకథ, శ్రీవేంకటేశ్వర క్యాసెట్సెంటర్, హైదరాబాద్
2. (7,8,9 పదాలు) మిద్దె రాములు, ఎల్లమ్మ ఒగ్గుకథ, డిస్కో రికార్డింగ్ కంపనీ, హైదరాబాద్
3. (10,11 పదాలు) చుక్క సత్తయ్య, బీరప్ప ఒగ్గుకథ శ్రీవేంకటేశ్వర క్యాసెట్ సెంటర్, హైదరాబాద్
4. (12 పదం) చుక్క సత్తయ్య, రంభ రంపాల రాజు కథ, శ్రీవేంకటేశ్వర క్యాసెట్ సెంటర్, హైదరాబాద్
5. (13 పదం) మిద్దె రాములు, వరరచ్చ మల్లన్న ఒగ్గుకథ , డిస్కో రికార్డింగ్ కంపనీ, హైదరాబాద్
6. (14) రుక్నుద్దీన్.కె జానపదసాహిత్యంలో అలంకార విధానం
7. (15 పదం) మిద్దె రాములు, బంగారుగొర్రె ఒగ్గుకథ , డిస్కో రికార్డింగ్ కంపనీ, హైదరాబాద్
8. (16, 17 పదం) చుక్క సత్తయ్య , మాంధాత ఒగ్గుకథ, శ్రీవేంకటేశ్వర క్యాసెట్ సెంటర్, హైదరాబాద్. ★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# జానపద కళారూపం హరికథ



- డా॥. వై. దివ్య

తెలుగు అధ్యాపకులు, డీకే ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం), నెల్లూరు.

**వ్యాస సంగ్రహం**

ఈ వ్యాసంలో జానపద కళారూపమైన హరికథ యొక్క స్వరూపం, ప్రాముఖ్యత మరియు అభివృద్ధి క్రమాన్ని వివరించాను. హరికథ సంగీతం, సాహిత్యం, నాట్యం వంటి లలిత కళల సమ్మేళనంగా ఉండి, భక్తి, నీతి, జ్ఞానం, వైరాగ్యాలను ప్రజలకు బోధించే మహత్తర సాధనం. గేయప్రబంధ రూపంలో గానం ప్రధానంగా ఉండే ఈ కళలో భావవ్యక్తీకరణకు విశేష స్థానం ఉంది. హరికథ రచయితకు కవితా ప్రతిభతో పాటు సంగీత జ్ఞానం అవసరమని, సరళమైన భాషలో లోతైన భావాలను వ్యక్తపరచగలగడం ముఖ్యమని స్పష్టం చేయబడింది. హరికథ మహారాష్ట్ర ప్రాంతం నుండి దక్షిణ భారతానికి వ్యాపించి, ఆంధ్రప్రదేశ్‌లో యక్షగానం ప్రభావంతో అభివృద్ధి చెందినదనినిరూపించాను. భక్తి సాహిత్యంలో విష్ణు సంబంధ కథలు ఎక్కువగా ఉండటంతో "హరికథ" అనే పేరు ఏర్పడినది. యక్షగానం మరియు హరికథల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాన్ని కూడా నేను చర్చించాను. ఆధునిక కాలంలో ఈ కళకు ఆదరణ కొంత తగ్గినప్పటికీ, సంస్కృతి పరిరక్షణలో ఇది ఇంకా కీలక పాత్ర పోషిస్తుందని నమ్ముతున్నాను. కాబట్టి నేటి యువతకు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా హరికథను పరిచయం చేసి, ఈ విలువైన వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉంది.

**కీలక పదాలు**

హరికథ, జానపద కళారూపం, గేయప్రబంధం, భక్తి పరబోధం, నీతి బోధన, సంగీతం, సాహిత్యం, నాట్యం, యక్షగానం, ఆంధ్ర జానపద సాహిత్యం, మహారాష్ట్ర ప్రభావం, హరికథ రచన, కవితా ప్రతిభ, సాంస్కృతిక వారసత్వం, భక్తి సాహిత్యం, దశావతార కథలు, రామాయణం భాగవతం కథలు, హరిదాసులు, సమాజ మార్గదర్శనం.

**ఉపోద్ఘాతం**

హరికథ కళలకు సంబంధించింది. సృష్టిలోని 64 కళల్లో కవిత్వము గానము నాట్యము శిల్పము చిత్ర లేఖనము అన్నవి లలిత కళలు ఈ కళలను అధ్యయనం చేసే వారిని కళాకారులు అంటారు. కళ జీవితమునకు ఆనందం ఇచ్చును. కళా జీవితమనేదిదైవానుగ్రహం వలన ప్రాప్తిస్తుంది. కళారహిత జీవితం వ్యర్థము,పశుతుల్యము. కళాకారుడు తానభ్యసించిన కలల ద్వారా కళామయుడగు సృష్టి స్థితి లయ కారణభూతులకు సర్వేశ్వరుని సాక్షాత్కారమును సులభంగా పొందగలడు అట్టి దైవసాక్షాత్కారం పొందుటకు సులభ సాధనమైన సంగీత సాహిత్య నృత్య

వాద్య సమ్మేళన మైన హరికథ కళలలో గొప్పదని చెప్పవచ్చు. హరి కథను గేయ ప్రబంధమని పిలుస్తారు. మానవునికి గానము ఆనందాన్నిస్తుంది. తన భావాలను వ్యక్తపరచుటకు మనిషి గేయమును ఆశ్రయించును. రసభరితమగు గాన సమ్మిళితమైన భావమే గీతమగును గీతమే గేయము. గేయ ప్రధాన మైన కథా వర్ణనమే హరికథ.

**హరికథా నామౌచిత్యం**

హరికథను మన తెలుగు ప్రాంతంలో కొందరు శివ సంబంధమగు హరికథలను రచించినప్పుడు హర కథలని నామకరణం చేసియున్నారు కానీ ఈ హరి కథ అను నామం ప్రారంభ దశలో కథా వస్తువును బట్టి కాక కథ సరళిని బట్టి పెట్టబడినది. పార్వతీ కల్యాణమైన సీతా కళ్యాణమైన రెండిటికి హరికథ అని పేరు పిలవడం జరుగుచున్నది. ప్రధానంగా హిందూ సంబంధ కథల్లో విష్ణు సంబంధ చరిత్రలో ఎక్కువగా ఉన్నాయి భారత భాగవత రామాయణాది చరిత్రలు దశావతార కథలు మరియు వాటిని వర్ణించిన రామదాసు త్యాగరాజు పురందరదాసు సక్కుబాయి మీరాబాయి మొదలగు భక్తులు విష్ణు సంబంధమైనవే ఎక్కువగా రచన చేయడం, త్యాగరాజ కీర్తనలు, రామదాసు కీర్తనలు, అన్నమాచార్య కీర్తనలు, క్షేత్రయ్యపదములు, జయదేవుని అష్టపదులు మునగనవి విష్ణు సంబంధమైనవే అయి ఉన్నవి అందుచే ప్రారంభ దశలో విష్ణు కథలు చెప్పుచు అట్టి కథలను హరికథలను పిలువుట చేత హరికథ అనే పేరు ఉత్పన్నమై ఉండి ఉండవచ్చు.

**హరికథ రూపగుణ విశేషాలు**

హరికథ ప్రధాన ఉద్దేశం భక్తి ప్రబోధంనీతి జ్ఞాన వైరాగ్య ప్రబోధం. హరికథ అంటే మానవుని పాపము హరింపజేయునట్టుకథఅని భావించవచ్చు. అది విష్ణు కథ కావచ్చు లేక శివుని కథ కావచ్చు మరి ఏ ఇతర కథ అయినా కావచ్చును ఆ కథ యొక్క ముఖ్య ప్రయోజనం పాపమును హరింప చేయుట అని శ్రీ నృసింహ కవి రచించిన కృష్ణ శతకం నందు పద్యము తెలియ జేయుచున్నది.

"హరియను రెండు అక్షరములు
హరించును పాతకంబు అంబుజనాభా
హరి నీ నామ మహత్యము
హరిహర పొగడంగా వశమే హరి శ్రీకృష్ణా!

జానపద గేయములు దేశీ కవితకు చెందినవి. జానపద గేయములతో కూడిన రచన అయినటువంటి హరికథ దేశీ కవితకు చెందినది. కథకు భావమే ప్రధానము కానీ భాష ప్రధానం కాదు జానపద గేయముల వంటి దేశీ రచనలు దరువులు రగడలు కీర్తనలు యక్షగానం నందు రాయబడినవి అని దివాకర్ల వెంకటావదాని గారు పేర్కొన్నారు. దేశీ వాఙ్మయం చాలావరకు ఈ కవిత్వము నకు సంబంధించినదే అయి ఉంటుంది.

హరికథారచన క్లిష్టమైనది హరికథా రచయితకు కవితా శక్తితో పాటు సాహిత్య జ్ఞానము సంగీత ప్రతిభ కలిగి ఉండుట చాలా ముఖ్యము సంగీత జ్ఞానం లేని వాడు కీర్తనలను లయబద్ధంగా రాయలేడు రచన సులభశైలిలో ఉండి మాధుర్యంతో ఉన్నచో ప్రజా బాహుళ్యంలో మిక్కిలి ప్రచారం పొందును. ఎక్కువ విషయమును తక్కువ రచన చేయగల సామర్థ్యం కలిగి ఉండుట హరికథా రచయతలకు ముఖ్య అవసరం.

హరి కథా యక్షగానముకు చెందిన ఒక రూపమని, హరికథ తెలుగులో స్వతంత్ర ప్రక్రియని రెండు భావనలు కలిగి ఉన్నవి అయితే ఏకపాత్రాభినయంనకు అనువైన సాహిత్య రూపం ఇది దేశ కవితా శాఖకు చెందినది అయిన ప్రచార సాధనముగా భక్తి ప్రబోధముకు ఎంత గానో ఉపకరించి జనులను ఆకర్షించినటువంటి ప్రక్రియ. మహారాష్ట్ర నుంచి దక్షిణ దేశమునకు వచ్చిన ఈ ప్రక్రియ మరింత సుందరముగా రూపుదిద్దుకొని తిరిగి మహారాష్ట్రకు చేరినది అని భావించుట ఎంతైనాసబబుగా ఉంటుంది.

హరికథ రచనలలో హాస్యరస పోషణకై,పాత్రోచిత పోషణ కొరకై ఇంగ్లీషు ఉర్దూ తమిళం మొదలగు భాషల్లోని పదాలను వాడుడం అధికంగా కనిపిస్తుంది.

**తెలుగు ప్రాంతంలోని హరికథల వైశిష్ట్యం**

తెలుగులో మొదటి హరికథ 1770వ సంవత్సరంన

శ్రీ మునిపల్లి సుబ్రహ్మణ్య కవి గారు రచించిన ఆధ్యాత్మిక రామాయణం అని సుప్రసిద్ధ ఆంధ్ర వాగ్గేయకారులు శ్రీ బాలాంత్రపు రజనీకాంత రావు గారు, ఆర్ వి ఎస్ సుందరం గారు భావించారు. అయితే పోతన గారి భాగవతంలో నైమిశారణ్యమున సత్రయాగ సందర్భంలో శౌనకాదిమునులు సూతమహామునిని హరికథలు చెప్పండని అడిగినట్లు రాయబడినది కనుక దానిని ఆధారం చేసుకుని హరికథలు పూర్వం నుండి మన దేశంలో వాడుకలో ఉన్నవని అభిప్రాయపడుదురు కానీ అవి భాగవతంలోని విష్ణు కథలు మాత్రమే జానపద కళారూపమైన హరికథ కాదని చెప్పవచ్చు. తెలుగు సాహిత్య చరిత్రను పరిశీలించిన ద్విపద, జానపద, గేయ, దండక, శతక నాటక యక్షగానములు వాఙ్మయ భాగము లను చర్చించారు కానీ యక్షగానమును పోలిన హరికథ వాఙ్మయమును గురించి అందులో పేర్కొనలేదు కాబట్టి హరికథ పూర్వపు తెలుగు ప్రాంతమున లేదు అది మహారాష్ట్ర నుండి మన దేశమునకు వచ్చిందని శివాజీ ప్రభువు కాలంలో సమర్థ రామదాసు గారి వలన హరికథలు ప్రచారమైనవని భావించవచ్చు. మహారాష్ట్రలోని మొరోపంత్, వామన పండితుడు,తుకోబాయి మొదలైన పండితులు హరికథకు ఉత్తమ గతి కల్పించారు. మహారాష్ట్ర నుంచి హరికథ కళారూపము దక్షిణ దేశము నకు దిగుమతి అయినదేకాని నేరుగా మన ఆంధ్ర ప్రాంతానికి రాలేదు. ఆంధ్ర ప్రాంతంలోని హరికథా పద్ధతి యక్షగానం నుండి ఆవిర్భవించినది. ఈ హరికథల్లో యక్షగానం వంటి దరువుల కీర్తనలు గలవుఆంధ్రప్రాంత హరికథలు అన్య రాష్ట్ర ప్రభావం తక్కువ అని చెప్పుటకు ఆధ్యాత్మిక రామాయణం దృష్టాంతంగా పేర్కొనవచ్చు ఇది అభ్యాసశైలిలో సాగినది.. యక్షగానము హరికథ ఒకటే అనుటకు నిదర్శనంసిద్ధేంద్రుని భామాకలాపంలో "జనులారా వినుడీ హరికథ" అని ప్రారంభించబడినది.

సింగరి దాసు రచించిన రామదాసు చరిత్రను మహారాష్ట్ర అభిరుచితో కూడిన ఇతివృత్తపు కూర్పు, ఆంధ్రుల అభిరుచిని అనుసరించిగేయ చందస్సులను కూర్చినాడు. సాధారణంగా హరిదాసులు హరికథలు చెప్పేటప్పుడు మధ్యలో ప్రసక్తానుకూలంగా ఇతర గ్రంథము నుండి ఇతర గ్రంథకర్తల కృతులనుండియు భాగములను గ్రహించి కీర్తన చేస్తూ శ్రోతలను హరికథా శ్రవణతత్పరులను చేయును. అదేవిధంగా సింగరి దాసు కూడా తన రామదాసు చరిత్రను తన పూర్వవులైన నారాయణ తీర్థులువితల దాసు ముకుంద మాల గ్రంథ కర్త కుల శేఖరాళ్వార్మొదలైన హరిభక్తి పరాయణులైనటు వంటి వారి గ్రంథము నుండి గేయము లను మానస బోధ శతకం జానకీపతి శతకం భావ నారాయణ శతకం దాశరధి శతకం వంటి గ్రంథము నుండి పద్యములను గ్రహించి రామదాసు చరిత్ర నందు పొందుపరిచారు.

బాలాంత్రపు రజనీకాంత్ రావు గారు వాగ్గేయకారుల చరిత్ర నందు యుగ విభజన చేసిన క్రమమును గమ నించినట్లయితే సామ గాన యుగం, గాంధర్వ యుగం, అభ్యాస యుగం, ధ్రువగాన యుగం, రాగ కార్య యుగం, గీతా గోవింద యుగం, దేశభాగ సంకీర్తన యుగం, యక్షగానయుగం, దాతుసంకల్పనపరిణామ యుగం, సభా సంప్రదాయక యుగం, హరికథా యుగంఅని విభజన చేశారు. దీనిని అనుసరించి 13వ శతాబ్దంలో యక్షగానము 16వ శతాబ్దంలో దాత కల్పన పరిణామ యుగం 17వ శతాబ్దంలో హరికథా యుగం వెలసిలి నట్లుగా చెప్పవచ్చు.

హరికథలు తమిళనాడు ప్రాంతంలో కూడా కలవు కానీ వారి హరికథకాలక్షేపంలో సంగీత ప్రాధాన్యం ఎక్కువ. కన్నడ దేశమున హరికథలు తెలుగువారి హరికథలను పోలి కనిపించును.

**హరికథ - యక్షగానం**

హరికథను, బుర్రకథను యక్షగానమనిపిలుస్తారు యక్షగానము దేశీ సాహిత్య ప్రక్రియలోకెల్లా తలమానిక మైనది ఇది ఒట్టి సాహిత్య ప్రక్రియ కాదు. సంగీతము మరియు అభినయ కళ్ళతో కూడుకున్నది. మలయాళ ప్రాంతం తప్ప మిగతా యావత్ దక్షిణ భారతం మంతయు వ్యాప్తి చెందినది ఆంధ్రత ముద్రతో భద్రపరచ బడినది. యక్షగానము 18వ శతాబ్దంలో తమిళ దేశమున

రాజసంబంధమైన యక్షగానములు వెలిసినవి. యక్ష గానమును మొదట మత ప్రచారంనకు ఉపయోగించారు. పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్ర నందు యక్షగాన ప్రస్తావన కనిపిస్తున్నది. తరువాత శ్రీనాధుడు తన భీమఖండంలోని ద్రాక్షారామ ప్రశంస సందర్భం కీర్తి గాంధర్వులు గాంధర్వమున యక్షగాన శరణి అని సీస పద్యంలో యక్షగాన ప్రశస్తి కనిపించును యక్షగానమునకు పుట్టినిల్లు ఆంధ్రదేశము మొదటి యక్షగానము క్రీస్తు శకం 15వ శతాబ్ది ఉత్తరార్ధమున చెన్నశౌరి రచించిన సౌబరి చరితము కానీ ఇది ఆలభ్యం తరువాత కందుకూరి రుద్రకవి రచించిన సుగ్రీవ విజయం మొదటి యక్షగానముగా చెప్పబడుచున్నది 19వ శతాబ్దంలో యక్షగాన రచనలు అధికముగా జరిగినవి. బాగేపల్లి అనంత చార్యులు, ఆదిభట్ల నారాయణదాసు గారు తమ హరికథలను యక్షగానములను పేర్కొన్నారు తెలంగాణ ప్రాంతంలో 19వ శతాబ్ది ఉత్తరభాగంనందు యక్షగాన నాటక రచన ఆరంభం అయింది. జక్కులనే తెగవారుదృశ్య కావ్యములను ప్రదర్శించుట వలన ఈ జక్కులే యక్షులై యక్షగానం అనే పేరు వచ్చినదని వేటూరి ప్రభాకర శాస్త్రి గారు పేర్కొన్నారు. తంజావూరు యక్షగానకర్తలు తమ యక్షగానాలలో హాస్యం కొరకు కొరవంజలను ప్రవేశపెట్టారు కురవంజి అనునది తమిళ పదము దీనికి ఎరుకల సాని అని అర్థం. ఆంధ్ర యక్షగానములలో కురవంజి ప్రసక్తి లేదు. ఈ స్థానంలోని కురవంజి సోది చెప్పడం ప్రసక్తిగా కనిపిస్తుంది. తంజావూరు యుగంలో యక్షగానములు పాడే స్థితి నుంచి ఆడే స్థితికి మారినవి. పాల్కురికి సోమనాథుడు శ్రీశైలమున బొమ్మలాటలాడుచుండును అని చెప్పెను. ఆ బొమ్మలాటలే యక్షగానములు చెందినవి. ఇవి క్రమేనా తంజావూరు లోని విజయ రాఘవని కాలమున నాటకములుగా మారినవి. యక్షగానమునే కొన్ని మార్పులతో కుదించి క్లుప్తపరిచిన హరికథలుగా మారినవని గ్రహించవచ్చు. వ్యుత్పత్త్యర్థమును బట్టిచూసినచో యక్షులు అనగాదేవతాశ్రేణికి చెందినవారు. యక్షగరుడ గంధర్వ కిన్నెర కింపురుషాది దేవతా సమూహము సంగీతారాధన శ్రేణికి సంబంధించినవి.అందుచే దైవ సంబంధము గేయ రచనలను యక్షగానమని పేరు సంభవించినది. దేవతల పేర్లు మనుషులకు పెట్టినట్లుగా, చెవికింపైన గానమును గంధర్వ గానం అన్నట్లుగా, దైవ లీలలను కీర్తించు గేయ ప్రబంధ రచనకు యక్షగానమనే పేరు ప్రసిద్ధమై ఉండి ఉండవచ్చునని ఊహించవచ్చు.

**ముగింపు**

హరికథ ఒక సంప్రదాయ కళారూపమే కాకుండా సమాజానికి విలువలను బోధించే మహత్తర సాధనం. ప్రస్తుత కాలంలో కూడా ఈ కళ తన ప్రాముఖ్యతను పూర్తిగా కోల్పోకుండా కొనసాగుతున్నప్పటికీ, ఆధునిక వినోద సాధనాల ప్రభావంతో దీన్ని ఆస్వాదించే వారి సంఖ్య కొంత తగ్గింది. అయినప్పటికీ భక్తి, నీతి, సంస్కృతి పరిరక్షణలో హరికథ కీలక పాత్ర పోషిస్తూనే ఉంది. నేటి యువతకు ఈ కళను కొత్త పద్ధతుల్లో పరిచయం చేయడం అత్యంత అవసరం. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో హరికథలను మరింత విస్తృతంగా ప్రచారం చేయవచ్చు. హరికథను మన సంస్కృతిని కాపాడే విలువైన వారసత్వంగా భావించాలి. అందరూ కలిసి ఈ కళారూపాన్ని ప్రోత్సహిస్తే భవిష్యత్ తరాలకు అందించగలుగుతాము.

**ఆధార గ్రంథాలు :**


1. తెలుగు హరికథా సర్వస్వం-తూమాటిదొణప్ప-తెలుగు అకాడమీ 1978.
2. ఆంధ్ర హరికథా వాఙ్మయం -వాడరేవుసీతారామాంజనేయ భాగవతార్-ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1976.
3. హరికథా ప్రక్రియ -సామాజిక ప్రయోజనాలు- డా. డి శారద- శ్రీ వెంకటేశ్వర పబ్లికేషన్స్1974.


★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# చిరుతల రామాయణం - పరిశోధనాత్మక పరిశీలన



- డా॥. లింగా శ్రీనివాస్
లోక కళా వికాస పరిషత్తు, హైదరాబాద్.

తెలంగాణ జానపద ప్రదర్శన కళలలోని అన్నింటికన్నా అధిక జనాదరణ పొందిన కళారూపం ఇది. సంగీతం, నృత్యం, రూపకాలను కలగలుపుకొని నవరసాభినయాలతో అన్ని హంగులను మేళవించుకొన్న అద్భుత కళాఖండం ఇది. వీధి భాగవతం, యక్షగానం వంటి కథా గేయాలను కూడా తనలో నింపుకున్న వినూత్న కథాగానం ఇది. గ్రామాలలో నేటికీ ఆబాల గోపాలాన్ని అలరిస్తోన్న ఔత్సాహిక కళా రూపమిది.

**కీలక పదాలు :**

చిరుతల భజన - చిరుతల రామాయణం, - నామౌచిత్యం - వివిధ భజనలు - రకాలు - కథా వస్తు వైవిధ్యం - ప్రదర్శనా వైభవం - వేదిక - రంగస్థలం - నృత్యం - సంగీతం, ఆహార్యం - ప్రదర్శనా విశేషాలు.

**పరిచయం :**


జానపద సంగీతంలోని వాద్య సంగీతం, గాత్ర సంగీతం, వచనం, సాహిత్యంతో కూడిన కథాగానాలు, నృత్య విభాగానికి చెందిన వ్యష్టి నృత్యం, సమిష్టి నృత్య లక్షణాలు, స్త్రీల నృత్యాలు, వాద్య సంబంధ నృత్యాల లక్షణాలు, కలుపుకొని, రూపకాన్ని కూడా (కాల్పనిక విశేషాలను సాహిత్యంతో కావ్యరూపం దాల్చిన వాచకానికి తగిన పాత్రలను జోడించి దృశ్య రూపానికి తీసుకొని రావటమే "రూపకం".) జోడించుకున్న నవరసాభినయ భరితమైన భజన సంప్రదాయ కళారూపం "చిరుతల రామాయణం".

జానపద రూపకాలైన వీధి భాగవతాలు, యక్షగానాలు, వీధి నాటకాలు, కలాపాలు, బొమ్మలాటలు మొదలైన ప్రదర్శనలన్నింటి కన్నా, ఎక్కువ జనాదరణ పొందిన కళారూపం ఇది.

భజన సంప్రదాయాలలో ప్రాంతాల వారీగా పలు రకాలు కలవు. తాళ భజన, సప్త తాళ భజన, చెట్టు భజన, జ్యోతి భజన, అడుగుల భజన, చిరుతల భజన మొదలగునవి. వీటిలో కొన్ని గాత్ర ప్రధానమైనవి కాగా, మరి కొన్ని గాన, నృత్య ప్రధానమైనవి. అన్నింటిలోకెల్లా ప్రత్యేకమైన లక్షణాలు కలిగి వాద్య, గాన, నృత్య, అభినయ ప్రధానమైన అపురూప కళారూపం ఈ చిరుతల రామాయణం.

చిరుతల భజనను రాయలసీమలోనూ, కోస్తాంధ్ర లోనూ చెక్కభజన, కులుకు భజనగా పిలుస్తారు. తెలంగాణ ప్రాంతంలోనూ చిరుతల భజన కలదు.

ఈ చిరుతల రామాయణం వివిధ కళారూపాలలోని అనేక ప్రక్రియలను కలుపుకొని ఒక సరికొత్త రూపంగా ఆవిర్భవించిందని ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు ఒక రేఖా చిత్రం ద్వారా వివరించారు.




తద్వారా చిందు కళారూపం, భజన, అడుగుల భజన, చెక్కభజన, కలాపం, యక్షగానం, వీధి భాగవతం మరియు గోంధళే వీధి భాగవతం మొదలైన అన్ని కళారూపాల నుండి ఎన్నో అంశాలను గ్రహించుకొని ఆవిర్భవించిన సరికొత్త కళా రూపమని ఘంటాపథంగా చెప్పవచ్చు.

శ్రవణం కీర్తనం విష్ణో స్మరణం పాదసేవనం
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనం.

భగవంతుని చేరేందుకు గల భక్తి మార్గాలు అనేకం ఉన్నాయి. అన్నింటికన్నా శ్రేష్ఠమైనది కీర్తనం అనే పద్ధతి ద్వారా మానవుడు తమలోని సృజనాత్మకతను, భక్తిని జోడించి, సాహిత్యం, సంగీతం, నృత్యాలను నివేదన చేసి సేవించుకున్నాడు. సర్వజనులచే ఆచరణ యోగ్యమైన ఈ భజన కూడా ప్రాంతీయతను బట్టి వైవిధ్యాన్ని సంతరించుకుంది.

కీ.శే. భజన పుల్లయ్య గారు తమ ఇంటర్వ్యూలో వివరించిన విధంగా భజనలలో (1) అఖండ భజన, (2) అడుగుల భజన, (3) ఊరి భజన, (4) ఏకాంత భజన, (5) కులుకు భజన, (6) కోలాట భజన, (7) పండరి భజన, (8) తాళ భజన, (9) సప్తతాళ భజన, (10) చెట్టు భజన మొదలగునవి కాకుండా ఈ మధ్య సాయి భజన, గణపతి, అయ్యప్ప భజనలు కూడా అవసరాన్ని బట్టి కనిపిస్తున్నాయి.

అనంతరంగం శ్రీవైకుంఠం రాజేమంతా రాంభజన
రాజేమంతారం భజన మన దేశమంతా రాంభజన॥అ॥
ఏమిర నరుడా ఏలన జేతువు మాటలు గాదిది రాంభజన
మాటలు గాదిది రాంభజన, సయ్యాటలు గాదిది రాంభజన

(సేకరణ : కీ.శే. భజన పుల్లయ్య గారు ప్రఖ్యాత చెక్క భజన గురువు)

శ్రీరామ రాముడోయ్ - రాంభజన
మా రామన్న రాముడోయ్ - రాం భజన
మా ఊరి దేముడోయ్ - రాంభజన
మా లోకాభి రాముడోయ్ - రాం భజన

(ఇంటర్వ్యూ : గుండ భవానీ (70), జగిత్యాల)

దాదాపు మనుగడలో ఉన్న భజనలలో ఎక్కువ శాతం బృందమంతా కూర్చొని గానం చేసేవే చూస్తాం. కానీ, చెక్క భజన, చిరుతల భజనలు కొంత విభిన్నంగా కనిపిస్తాయి. ఇందులో భజన పరులు అందరూ చిరుతల (చెక్కలు) వాయిస్తూ, అడుగులు వేస్తూ లయానుగుణంగా చేసే పద్ధతిని రాయలసీమలో చెక్కభజన అని, తెలంగాణ ప్రాంతంలో చిరుతల భజన అని పిలుస్తారు.

చిరుతల రామాయణంపై అన్నింటికీ భిన్నంగా, సంగీతం, సాహిత్యం, నృత్యం, వాచకం, అభినయం, రూపకం, కలాపం వంటి అనేక లక్షణాలను కలుపుకొని వెలుగొందిన ప్రఖ్యాత సమిష్టి నృత్యం. దీనిని వీధి మధ్యలో ప్రదర్శిస్తారు. కావున వీధి భాగవత లక్షణాలు కూడా కలుపుకుందని చెప్పవచ్చును.

**నామౌచిత్యం**

భజన సంప్రదాయంగా ఆవిర్భవించిన ఈ కళా రూపంలో కలాపం, యక్షగానం, వీధి భాగవత లక్షణాలను కూడా చూడవచ్చు. ఒక వైపు నాటకాన్ని, భజన, నృత్యాన్ని, తమలో పలకించుకున్న ఈ కళారూపం యొక్క ప్రధాన కథా వస్తువు రామాయణం కావడమే కాకుండా ప్రదర్శనకు ముఖ్యంగా ఉపయోగపడే వాద్యాలైన చిరుతలను ప్రాధాన్యత చేసుకొని "చిరుతల రామా యణం"గా ప్రాచుర్యంలోనికి వచ్చిందని చెప్పవచ్చును.

ఆహా రామా! అయోధ్య రామా!!
పావన నామా! పట్టాభిరామా!!

జయ జయ రామా! జానకి రామా!!
శ్రీ రఘు రామా! సీతారామా!!

**ఔత్సాహిక కళారూపం**

చిరుతల రామాయణం ఒకే కులానికి సంబంధించిన - కళారూపం మాత్రం కాదు - మిగతా జానపద కళా రూపాలు ఆయా కులా వారీగా ప్రదర్శించుట మనకు కనిపిస్తుంది. అది ఆయా కుల, ఉపకులం అనగా ఆశ్రిత కులాల వారిచే ప్రదర్శించబడే వృత్తి కళారూపం వలె కాకుండా గ్రామంలో ఉత్సాహవంతులైన పౌరులు ఎవరైనా దీక్షగా గురు ముఖంగా నేర్చుకొని ప్రదర్శిస్తారు. వీరికి శిక్షణనిచ్చే గురువు గారిని "చిరుతల పంతులు" అని పిలుస్తారు. వీరు కూడా ఏ కులం వారైనా ఉండ వచ్చును.

చిరుతల రామాయణంలో వివిధ ఘట్టాలు సమయానుకూలంగా క్రమంగా ప్రదర్శింప బడతాయి. రామాయణ కథా నేపథ్యమే కాకుండా ఇతర కథలను సాహిత్యం మీద పట్టు గల పండితులు, కవులు రచించిన కావ్యాలు, నాటకాలు కూడా ప్రదర్శింపబడతాయి. కానీ అన్ని చిరుతల రామాయణం శైలిలోనే ఉంటాయి.

ఉదా : 1976లో శ్రీ మల్లికార్జున పబ్లికేషన్స్ వారు "చిరుతల సుగ్రీవ విజయం" ను ముద్రించారు. రచయిత శ్రీ చెర్వీరాల భాగయ్య కవి, ముషీరాబాద్ నివాసి. ఇలా చిరుతల మైరావణ చరిత్ర (1984 - శ్రీ రామకృష్ణ బుక్ డిపో), చిరుతల లవకుశ నాటకం (1987) శ్రీ రామకృష్ణ బుక్ డిపోను సదాశివ నగరి వాసుడైన శ్రీ వేంకటేశం పంతులు రచించారు. ప్రతి నాటకానికి ముందుగా చిరుతల .... అని పేరు పెట్టడం ప్రత్యేకంగా కనిపిస్తుంది.

**కథా వస్తు వైవిధ్యం :**

చిరుతల రామాయణం ప్రదర్శనలలో రామాయణం లోని వివిధ ఘట్టాలు మాత్రమే కాకుండా భాగవత సంబంధమైన ఇతివృత్తాలైన చిరుతల పద్మవ్యూహం (శ్రీ అంబేదరాజు వీరప్పగారి రచన) చిరుతల వీర ఘటోత్కచం (చెర్వీరాల భాగయ్య గారి రచనలు చిరుతల శ్రీకృష్ణ లీలలు, చిరుతల మోహినీ రుగ్మాంగద, చిరుతల దశావతారాలు, భైర భీరప్ప గారు రచించిన చిరుతల బాణాసుర గర్వభంగం మొదలైనవి కలవు. ఇవి కాకుండా పురాణేతి వృత్తాలైన నాటకాలు కూడా ఎక్కువ జనాదరణ పొందినాయి. వాటిలో ఇప్పలపల్లి పురుషోత్తం కవి రచించిన చిరుతల మార్కండేయ విలాసం, మేరుగు మల్లయ్య గారి చిరుతల వీరభద్ర విజయం, బైర బీరప్ప గారి చిరుతల దక్షయజ్ఞం, భాగయ్య గారి చిరుతల సత్య హరిశ్చంద్ర వంటి పుస్తకాలు నేటికీ మార్కెట్‌లో లభ్యమవు తున్నాయి. అంతే కాకుండా జానపద కథలకు సంబంధిం చిన ఇతివృత్తంతో కూడా మరికొన్ని నాటకాలు కలవు. వాటిలో కె.వి. రాజు గారి చిరుతల సారంగధర నాటకం, ఇప్పల పురుషోత్తం గారి చిరుతల గుణసుందరి నాటకం, చెర్వీరాల భాగయ్య గారి చిరుతల బాలనాగమ్మ, వేముల లక్ష్మీరాజం గారి చిరుతల కనకతార నాటకం, చిరుతల బీరప్ప చరితం, చిరుతల హరిదాస చరితం మొదలైనవి కలవు. జనాదరణను బట్టి రామాయణ, భాగవత కథలే కాకుండా జానపద, సాంఘిక కథలను విజయవంతంగా ప్రదర్శించుట చిరుతల రామాయణ కథావస్తు వైవిధ్యానికి ప్రతీక.

**ప్రదర్శన విశేషాలు :**

చిరుతల రామాయణం ఎక్కడ ప్రదర్శించినా పండిత పామర జనరంజకం కావడానికి, ముఖ్యంగా నాటకంలో గల జానపద లక్షణాలే కారణమని చెప్పవచ్చు. శాస్త్రీయ నాటకాలు, యక్ష గానాలు, ప్రదర్శించినప్పుడు ఒకింత హాస్యం ఉన్ననూ, ప్రధాన విషయానికీ, సాహిత్యానికీ, సంగీతానికే ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తారు. కానీ చిరుతల రామాయణంలోని కళాకారులు హాస్యమునే కాకుండా నిజ జీవితానికి కూడా తగిన స్థానాన్ని కల్పిస్తారు. ఒక వైపు వీరోచితమైన డైలాగులూ, పద్యమూ నడుస్తుండగా, అకస్మాత్తుగా నిజ జీవితంలోని సన్నివేశమును దర్శింపజేస్తారు.

ఉదాహరణకు ఒక రాజు రథంపై ప్రయాణిస్తుండగా ఏమీ! నా రథము ఆగిపోయినది? అనగానే... ప్రభూ! పెట్రోలు అయిపోయింది కాబోలు''. ఇటువంటి మాటలు, కళాకారుల సమయస్ఫూర్తికి నిదర్శనములు. అంతేకాకుండా, తెర వెనుక చేయవలసిన పనులు

అన్నియూ రంగస్థలం క్రింది భాగంలో అందరికీ కని పించేలా చేయుట జానపద కళాకారుల స్వేచ్ఛకు నిదర్శనములు. ఉదాహరణకు, బీడీలు కాల్చడం, అందులోనూ స్త్రీ పాత్రధారి వద్ద మరొక పాత్రధారి చొరవతో బీడీలు అంటించుకోవడం, తాంబూల చర్వణం సర్వసాధారణం. అది కూడా ఒకింత గ్రామీణ జీవనానికి నిదర్శనమే. కావున చెప్పక తప్పటం లేదు.

చిరుతల రామాయణంలో చుట్టూ భజన కళాకారులు గానం, నృత్యం చేస్తూ ప్రదర్శించగా, మధ్యలో పాత్రలే స్వయంగా వచ్చి పాడుట ఒకింత ప్రత్యేక ఆకర్షణ. అదియూ గాక, రాముడు పాడునప్పుడు మిగతా లక్ష్మణుడు, సీత, రావణుడు, హనుమంతుడు, ఇలా అక్కడ ఉన్న మిగతా  కళాకారులందరూ వంతలుగా పాడుట ప్రత్యేక లక్షణం అనే చెప్పాలి.

ముఖ్యంగా శ్రీరామనవమి పండుగ సందర్భంగా ప్రదర్శించుట విశేషం. ఈ నాటకంలో ముఖ్యంగా సూత్రధారి, హాస్యగాడు మరియు సందర్భానుసారంగా వివిధ పాత్రలు ప్రధానంగా కనిపిస్తాయి. చిరుతల పంతులు పాత్ర విశిష్టమైనది. భజన చేస్తూ పాడే వంతలకు, పాత్రధారులకు, అవసరాన్ని బట్టి పాటలను అందించుట, తాళం నడిపించుట, కట్నాలు, కానుకలు ఇచ్చిన వారిని కీర్తించుట వంటి కీలకమైన పాత్ర పోషిస్తాడు. అలాగే ప్రదర్శనలో వంతలది కూడా విశిష్ట స్థానమే.

భజన సంప్రదాయంలో సాగే పాటలకు వంతలు ఒక వైపు చిరుతలను వాయిస్తూ మరో వైపు కాళి గజ్జెలు ఘల్లుఘల్లుమనగా లయాత్మకంగా అడుగులు వేస్తూ రసరమ్యంగా సాగుతుంది.

**వేదిక :**

సాధారణంగా గ్రామాలలో వీధి భాగవతం, చిందు భాగవతం వంటి ప్రదర్శనల వలెనే చిరుతల రామా యణం కూడా విశాలమైన రంగస్థలం కలిగి ఉంటుంది. గ్రామాలలోని ఏదైనా విశాలమైన స్థలం, ఎడ్ల అంగడి (సంత) జరుగు స్థలం, లేదా నాలుగు తోవల కూడలి (చౌరస్తా)  వంటి ప్రదేశాన్ని వేదికగా ఎన్నుకుంటారు. దొరలు, రెడ్లు వంటి ధనవంతుల ఇంటి ప్రాంగణాలు కూడా సమయాన్ని బట్టి ఎంపిక చేసుకుంటారు. చాలా వరకు ఈ వేదికలు వర్తులాకార స్థలంలో ఒక పెద్ద మంటపం నిర్మించి, ఒక వైపు వేదిక, మిగతా అన్ని వైపులా ప్రేక్షకులు ఉండవచ్చును. లేదా వర్తులాకార వేదిక మంటపంలో మధ్యలో పంతులు, వంతలు, వివిధ పాత్రలూ ఉండి, చుట్టూ ప్రేక్షకులు ఉండేలా కూడా వేదిక ఏర్పాటు జరుగుతుంది. ఒక్కోసారి ప్రక్కనే సహ వేదిక లేదా చిన్న వేదిక నిర్మాణం కూడా చేసే అవకాశం ఉంటుంది. దానిని సమయానుకూలంగా ఉపయో గించడం వీధి నాటకాలలో దేశ వ్యాప్తంగా గల వేదికలలో చూడవచ్చును. తెలంగాణ ప్రాంత కళారూపాలలో ఒక్క చిరుతల రామాయణానికే చెల్లుతుంది.

సహ వేదికలను సమయానుకూలంగా అవసరాన్ని బట్టి మాత్రమే ఉపయోగిస్తారు. ఉదాహరణకు లంకాదహనం, హనుమంతుడు సంజీవిని పర్వతాన్ని తీసుకురావడం, వారధి వద్ద సమావేశాలు, యుద్ధం జరుగుట వంటి సందర్భాలలో చూడవచ్చు.

**వివిధ పాత్రలు - ఆహార్యం :**

చిరుతల రామాయణంలో చిరుతల పంతులు, హార్మో నియం, మద్దెల, తాళాలు వంటి వాద్యకారులు మధ్యలో కూర్చొని వాయిస్తూ ఉండగా, చుట్టూ చిరుతలు పట్టుకొని తాళానుగుణంగా నృత్యం చేస్తూ వంతలు పాడే భజన పరులు ఉండగా, మధ్యలోకి వివిధ పాత్రల రంగ ప్రవేశం జరుగుతుంది. ఆయా పాత్రలకు సంబంధించిన వేష భూషణాలు, కత్తి, గద, విల్లు మొదలైన ఆయుధాలు, కిరీటాలు, దుస్తులు వారి వారి స్తోమతను బట్టి సమ కూర్చుకోవడం జరుగుతుంది. ఇప్పుడు కొన్ని ప్రదేశాలలో ఆభరణాలు, ఆయుధాలు రెడీమేడ్‌గా దొరుకుతున్నం దున ఇత్తడి లేదా ఇనుముతో చేసినవి లభ్యమవు తున్నాయి. లేనిచో కొన్ని సంవత్సరాల క్రితం వరకూ కిరీటాలు, భుజకీర్తులు, ఆయుధాలు అన్నీ అట్టతో చేసినవే, చెక్కవి కూడా వాడుకలో ఉండేవి. అది వారి ఆర్థిక స్తోమతను బట్టి కూడా ఉండగలదు.

**ముఖ రచన :**

మేకప్ కూడా గ్రామాలలోని పరిస్థితులు అవకాశాన్ని బట్టి కనిపిస్తుంది. దాదాపు 25 సంవత్సరాల క్రింద ఉన్న పద్ధతులు ఇప్పుడు లేవు. ఒకప్పుడు రంగులు, కళాకారులు లేదా చిరుతల పంతులే స్వయంగా తయారు చేసుకునేవారు. కొంత కాలానికి, జింక్ మరియు కొబ్బరి నూనె విధానం ద్వారా రంగులను తయారు చేసుకునే వారు. ఆధునిక కాలంలో వివిధ రకాల పాన్ కేక్ (అబిద్వీబిదిలి) లు రకరకాల రంగులోనూ, షేడ్‌లలోనూ లభ్యం అవుతున్నాయి. కావున ఇప్పటి కళాకారులకు కొంత శ్రమ తగ్గినట్లే. ముఖ రచన (ఖబిదిలితిచీ), ఆయా పాత్రలను బట్టి రంగులు కలవు.

ప్రత్యేకంగా రాముడు నీలంరంగులో, లక్ష్మణుడు ఎరుపు రంగులో, హనుమంతుడు ఆకుపచ్చని రంగులోనూ ఉండడం తప్పనిసరి. ప్రత్యేకంగా సీత వేషధారి నిజ జీవితంలోనూ మీసాలు పెంచుకోడు. అలాగే విగ్గులు లేని కాలం నుండి కూడా వివిధ పాత్రలు పోషించేవారు. జీవితాంతం వెంట్రుకలు పెద్దగానే ఉంచుకోవడం వారికి కళల పట్ల గల మమకారాన్ని చూపిస్తుంది. మీసాలు, గడ్డాలకు అవసరాన్ని బట్టి గొర్రె బూరు, కొబ్బరి తాళ్లు, జనుము వంటివి వాడుకునే వారని, ఇటీవలి కాలంలో అన్నీ రెడీమేడ్‌గా లభ్యం అవుతున్నాయని చెబుతున్నారు. (ఇంటర్వ్యూ : కొమురవెల్లి లక్ష్మీనారాయణ గారు (70) జగిత్యాల, సీనియర్ మేకప్‌మెన్).

**వస్త్రాలంకరణ :**

ప్రదర్శనలో వివిధ పాత్రలకు అనుగుణంగా వారి వేషభూషణాలు కూడా చాలా అందంగా మెరిసి పోతుంటాయి. దశరథ మహారాజు, రాముడు, లక్ష్మణుడు వంటి పాత్రలకు మెరిసే పట్టు వస్త్రాలు, బాజుబందులు, భుజ కీర్తులు, కిరీటాలు, కంఠాభరణాలు ఉపయోగిస్తారు. ముని కుమారులు, ఋషులు వంటి పాత్రలకు తెలుపు లేదా కాషాయ వస్త్రాలు, రుద్రాక్షమాలలు, యోగదండం వంటివి వాడుతారు. అవసరాన్ని బట్టి వివిధ హారాలు, కర్ణకుండలాలు, పూసలతో తయారు చేసుకుంటారు. కానీ, విధిగా ధరిస్తారు. వివిధ పాత్రల యొక్క అలంకరణ విధానంలో ప్రత్యేకత కూడా ఉన్నది.

**వాద్య సంగీతం :**

ఈ ప్రదర్శనలో హార్మోనియం, తబలా, డోలక్, తాళాలు మొదలైన వాద్యాలు వాడుతారు. ఇటీవల అవసరాన్ని బట్టి కాంగోడ్రమ్స్, రిథం ప్యాడ్స్, డప్పు వంటి ఇతర వాద్యాలు కూడా వాడుకలో కనిపిస్తున్నాయి. కానీ, ప్రదర్శనలో మట్టుకు ఏ వాద్య ప్రత్యేకత ఆ వాయిద్యానికే కలదు. చిరుతల పంతులు గారు శిష్య బృందానికి కొన్ని నెలలుగా నేర్పించిన పద్యాలు, పాటలు, సందర్భోచితమైన రాగాలలో అద్భుతంగా పొందుపరచబడుతాయి. తబలా లేదా మద్దెల దరువులు కూడా వివిధ సందర్భాలలో రసానుభూతిని కలిగిస్తాయి. రాత్రిళ్లు సాగే ఈ ప్రదర్శనలో సమయానుకూలమైన దరువులు, వివిధ రాగాలు ప్రముఖపాత్ర వహిస్తాయని ఖచ్చితంగా చెప్ప గలము. భజన బృందం వారు వాడే మువ్వలు, చిరుతలు, పంతులు గారి విజిల్ కూడా వాద్య సంగీతంలో భాగమే.

**ప్రదర్శనా విధానము :**

జానపద ప్రదర్శనలోని అన్ని కళా రూపాలకు తమ తమ ప్రత్యేక శైలి ఉన్నట్లే, చిరుతల రామాయణం ప్రదర్శనలో కూడా కొన్ని సంప్రదాయాలు జానపద శైలిలో ఆచరిపబడుతాయి. శాస్త్రీయ నృత్యాలు, యక్షగానాలు వలె ప్రదర్శనకు పూర్వం తెర వెనుక జరిగే రంగస్థల పూజ, ప్రార్థనల వలెనే, ఈ ప్రదర్శనలోనూ కొన్ని పద్ధతులు కనిపిస్తాయి. అందులో మొదటగా నాటకం ప్రారంభం కాక పూర్వము కళాకారులంతా పంతులు గారిచే గజ్జెలు కట్టుకొనే సమయంలో గురువు గారి ఆశీస్సులు తీసుకోవడం, వేదిక మంటపానికి గల స్తంభాలకు పసుపు, కుంకుమలతో అలంకరించి ప్రారంభానికి ముందే హారతి ఇవ్వడం, పాత్రలు అందరూ భక్తి శ్రద్ధలతో పాల్గనడం అనుష్ఠానాలు లేని జానపద సంప్రదాయం. పల్లెవాసుల నిష్కల్మషమైన భక్తికి నిదర్శనం.

**గణపతి ప్రార్థన :**

సనాతన భారతీయులలో ముఖ్యంగా హిందూ మతస్తులు ఏ పని మొదలు పెట్టినా విఘ్న నాయకుడైన గణపతిని ప్రార్థించుట పరిపాటి. తరువాత గ్రామ దేవతలను స్తుతించుట. ఆయా బృందాల పంతుళ్లను, కళాకారు

లను బట్టి ఉంటుంది. మంటపంలో కళాకారులు వర్తులా కారంలో నిలబడి పూజ చేయడంతో ప్రార్థన ముగుస్తుంది.

విఘ్నరాయ నీకు శరణు ఇపుడే జేతు బ్రోవుమయా!
వేగ వేగ బ్రోవుమయా ఏకదంత మేలుమయా!
నాగ వాసులైన నీకు నమ్మి మొక్కులిడువ వలెను!
రాజా మా రాజ నిర్మల రాజ వేంకట రమణ రారా!
భాద్రపద శుద్ధ చవితి భక్తితో నిను గొలిచెదము!
బలరాముని దయ తోడ బాలనంబు జేయువాడా
॥ విఘ్న ॥

(సేకరణ : చిరుతల రామాయణం కల్పగూడు)

అటు పిమ్మట సరస్వతీ పూజ లేదా గ్రామ దేవతల కీర్తనలతో ప్రారంభమౌతుంది.

**పాత్రల ప్రవేశము :**

నాటకం ప్రారంభమవగానే సూత్రధారునితో ప్రారంభమై హాస్యగాడు లేదా బుడ్డరిఖాన్‌లు కథను రంజుగా నడిపిస్తారు. చిరుతల రామాయణంలో వినూత్నంగా పాత్రలే స్వయం పరిచయం చేసుకొంటూ ప్రవేశిస్తాయి. భోలో శ్రీరామచంద్ర మూర్తికీ జై ! వేణుగోపాల స్వామికీ జై!! అంటూ పాత్రలు తాము స్వీయ పరిచయం గావించుకొనుట చిరుతల రామా యణం ప్రత్యేకత. ఇది ఒకింత చిందు భాగవతంలోనూ కనిపిస్తుంది.

ఇలా కథ నడుస్తుండగా ముఖ్యమైన పాత్రలకు గుమ్మడికాయ లేదా కొబ్బరికాయతో హారతి తీసి ఆహ్వానించే ప్రత్యేక ఆచారం కూడా కలదు.

ఒక్కో పాత్రకు పాత్రోచితమైన రాగాలతో దరువులతో గానం చేస్తూ కథను రక్తి కట్టించుట మరో అందం.

బుడ్డరిఖాన్ యొక్క హాస్యపు చెణుకులు, వివిధ పాత్రల రసానుగుణ భావ ప్రకటనల ద్వారా, కథ రస రమ్యంగా సాగుతుంది. హాస్యము, క్రోధము, బీభత్సము వంటి నవరసాలను పలికిస్తూ, రాత్రిళ్లు సాగే ఈ నాటకం ఆద్యంతము ఆబాల గోపాలాన్నీ అలరిస్తుంది. ప్రతి సన్నివేశంలోనూ సంగీతం, సాహిత్యం, పద్యం, రాగం, ఆహార్యము, అభినయము, అడుగులు, నృత్యం ఏ కోణంలో చూసినా అద్భుతమైన ఫలశృతిని కలిగించు ఈ కళారూపం నేటికీ గ్రామాలలో అన్ని కులాలు, వర్గాల వారినీ అలరిస్తూ ఆదరింపబడుతుంది.

**ముగింపు :**

కాలానుగుణంగా వచ్చే మార్పులలో భాగంగా రామాయణ, భాగవత, జానపద కథలే కాకుండా సాంఘిక జీవనంలో సామాజిక రుగ్మతలను రూపుమాపుటకు, సమాజ చైతన్యం కోసం అనేక కథా వస్తువులను కలుపుకొని సరికొత్త రూపంలో ప్రజలకు చేరువై తరతరాలు విజయ వంతంగా ప్రదర్శింప బడుతున్న ఈ కళారూపం జానపద ప్రదర్శన కళలలోకెల్లా విశిష్టమైనదని ఘంటాపథంగా చెప్పవచ్చును. అంత వైభవంగా ప్రదర్శింపబడిన ఈ ప్రదర్శన నేడు ప్రపంచీకరణ నేపథ్యంలో కనుమరు గౌతోంది. మరికొన్ని గ్రామాలలో ప్రదర్శనకు నోచుకోవడం లేదు. అందుకు కారణాలను వెతుక్కోవడం కన్నా పునర్నిర్మాణానికై సరికొత్తగా ఆలోచించాలి.

వృత్తికళలు కేవలం ఒకే కులానికి చెందిన పురాణాన్ని గానం చేయడానికి వినియోగింప బడతాయి. కానీ ఇది ఔత్సాహిక కళ. ఈ కళారూపం అన్ని కులాలు, మతాల వారిచే ఆదరింపబడింది. కావున, నేటికీ అంతరించకుండా సజీవంగా మనుగడ సాగించగలదు. అందుకే భావి తరా లకు, ముఖ్యంగా విద్యార్థి లోకానికి, కళావిద్య ద్వారా పరిచయం చేయడంతో, కాలానికి అనుగుణంగా సరికొత్త కథా వస్తువులను సమకూర్చుకొని తరగతి గది ద్వారా లోక ప్రకాషితం కాగలదు.

**ఉపయుక్త గ్రంథసూచిక :**

1. కృష్ణదాసు, కల్పగూరు : చిరుతల రామాయణం, దాచేపల్లి కృష్ణయ్య అండ్ సన్స్, 1991
2. కృష్ణకుమారి, నాయని
   1. తెలుగు జానపద గేయగాథలు : నాగలక్ష్మీ ఆర్ట్ ప్రింటర్స్, 1977
   2. తెలుగు జానపద విజ్ఞానం, సమాజం- సంస్కృతి సాహిత్యం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2000.

3. కృష్ణారెడ్డి చిగిచర్ల 1. ధర్మవరం తాలుకా జానపద గేయాలు, ఎం.ఫిల్. పట్టాకై శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి సమర్పించిన గ్రంథం, 1984. ప్రచురణ: జానపద కళాభారతి, సుబ్బారావు పేట, ధర్మవరం, అనంతపురం

4. బాగయ్య, చెర్విరాల

   1. చిరుతల రామాయణం, శ్రీ మల్లికార్జున పబ్లికేషన్స్, 1955
   2. చిరుతల వీరఘటోత్కచం అను శశిరేఖా పరిణయం, శ్రీ మల్లికార్జున పబ్లికేషన్స్, 1985
   3. చిరుతల బాలనాగమ్మ నాటకం, రామకృష్ణ బుక్ డిపో, 1984
   4. చిరుతల భీష్మ ప్రతిజ్ఞ, దాచేపల్లి కృష్ణయ్య అండ్ సన్స్, 1969
   5. చిరుతల సుగ్రీవ విజయం, శ్రీ మల్లికార్జున పబ్లికేషన్స్, 1976

5. మోహన్.జి.ఎస్. : జానపద విజ్ఞానాధ్యయనం, శ్రీనివాస పబ్లికేషన్స్, చంద్రా లేఅవుట్, బెంగళూరు 2001

6. రామరాజు, బిరుదురాజు : తెలుగు జానపద గేయ సాహిత్యము, జానపద విజ్ఞాన ప్రచురణలు, హైదరాబాద్ - 1990

7. సుందరం, ఆర్వీయస్

   1. ఆంధ్రుల జానపద విజ్ఞానం, తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాద్ - 1992.

★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# యక్షగానం - రస పోషణ



- డా॥. కె. సురేశ్
తెలుగు సహ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి జిల్లా.

**వ్యాస సంగ్రహం :**

యక్షగాన శబ్దానికి యక్షులు చేసేగానం అని అర్థ స్ఫురిస్తుంది. యక్షులంటే దేవతల్లోని ఒక జాతిగా వేదాల్లో ప్రస్తావించబడింది. ఆర్ష సంప్రదాయానికి సంబంధించిన యజ్ఞక్రతువును వివరిస్తున్న యజుర్వేదంలో ఆర్షక్రతువుల్లో ఒకటిగా 'తాళమద్దెల' అనే యక్షగాన శైలి జరపటం మనం గమనిస్తాం. ఈ ప్రక్రియ కేవలం గానప్రక్రియగా దేవాలయ అర్చకులు నిర్వహిస్తూ ఉండేవారు. అయితే కాలానుగుణ మార్పులు, రాజాదరణకు పాత్రమైన దేవాలయాలు అటు రామనాట్టం, కృష్ణనాట్టం మొదలైన కేరళ సంప్రదాయ నృత్యాల ప్రభావం, నాట్యకళకు రాజాదరణ పెరిగిన కారణాన అర్చకుల్లోని కొంతమంది ప్రదర్శనా ప్రక్రియగా చేపట్టడం చేత సాంప్రదాయక యక్షగాన నాటక ప్రక్రియగా పరిణితి చెందిందని తెలుస్తోంది. శ్రవ్య కావ్యాలంకార పద్ధతినే స్వీకరించు యక్షగానాలలో ధీరోదాత్తులైన నాయకులు, వీర, శృంగారరస ప్రధానములైన ఇతి వృత్తములు పద్య, గద్య రాగయుక్తములై అలరించును. యక్షగానములలో వీర, శృంగార, కరుణ రసములలో ఒకటి ప్రధాన రసముగా ఉండును. అక్కడక్కడ అద్భుతము, శాంతములు కూడా ప్రధానముగా ఉండవచ్చును.

**కీలక పదాలు :**

ఆర్షక్రతువు, యక్షగానశైలి, నాట్యకళ, ధీరోదాత్తుడు, శృంగారరసము.

**ఉపోద్ఘాతం :**

తెలుగులో మొదట యక్షుల ప్రస్తావన వారి ఆట పాటల గురించి పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్ర పర్వత ప్రకరణంలో కనబడుతుంది. అది శ్రీశైల యాత్ర శివరాత్రి జాగరణ సందర్భం. ఆ వేళ అక్కడ చేరిన యాత్రికుల వినోద కాలక్షేపములు వర్ణింపబడ్డాయి.

"ఆదట గంధర్వ యక్ష విద్యాధ
రాదులై పాడెడు నాడెడు వారు
విధమున బ్రచ్ఛన్న వేషముల్ దాల్చి
యధికోత్సవము దులుకాడునట్టాడు"

అని యక్షులు ప్రశంసింపబడ్డారు. తరువాత శ్రీనాథుని భీమేశ్వర పురాణంలో మొదటిసారిగా 'యక్షగానం' పూర్తిపదం కనిపిస్తుంది.

"కీర్తింతురెద్దాని కీర్తిగంధర్వులు
గాంధర్వమున యక్షగాన సరణి"

ఆ గంధర్వులు 'యక్షగానసరణి'లో పాడిరనగా, ఆనాడు అది ఒక ప్రత్యేక గానశైలిగా ఉండి యుండ వచ్చును. నాటికి యక్షగానం రూపొందినదో లేక

స్తుత్యాత్మక గీతంగా పరిణమించి ఇంకా రూపక భేదమును పొందుచుండవచ్చును. కన్నడ వాఙ్మయంలో కూడా యక్ష ప్రశస్తి 12వ శతాబ్దం నుండి కనిపిస్తుంది. మల్లినాథ పురాణంలో యక్షాందోళనమను నాట్య ప్రస్తావన ఉంది.

తెలుగులో కూడ కొండజాతి, కొరవజాతి, జక్కులజాతి తదితర శబ్దాలున్నాయి. ఇవన్నీ కుల వర్గ వాచకాలే. అందువల్ల జక్కులజాతి, యక్షజాతి అనే శబ్దాలకు ఈ ఆటపాటలాడే కళాకారుల వృత్తికులమనే అర్థంలో ప్రయోగం జరిగిందని భావించాలి. 'ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర'లో యక్షులే జక్కుల జాతిగా పరిగణింపబడ్డారని డా॥ యస్వీ జోగారావు పేర్కొన్నారు.

**యక్షగానాలలో రస ప్రాధాన్యత :**

యక్షగానం విభిన్న కళల సమిష్టి సమాహార కళారూపం. శ్రవ్య కావ్యాలలోని శబ్ద సౌకుమార్యం, దృశ్యకావ్యాలలోని అభినయ రసమాధుర్యం కలగలిసిన విలక్షణమైన రసప్రబంధం. సంగీత, సాహిత్య, నృత్య, అభినయ రంగాల కలబోతయైన యక్షగానం, యక్షగాన ప్రబంధమని, యక్షగాన నాటకమని సంబోధించబడింది. నాటక లక్షణాలన్నియు యక్షగానానికి అన్వయించినా, పూర్తిగా గానయోగ్యమైన, నృత్యవిశేషము కలిగి యక్షగానము ప్రత్యేకతను సంతరించుకున్నది.

యక్షగానములో స్వీకరించు కథావస్తువు ప్రఖ్యాత కావ్యములు, ప్రబంధములు, పురాణ, ఇతిహాసముల నుండి గ్రహించబడి నాయకానుగుణముగా దానిని మలచుటకు ప్రయత్నించుచుందురు. సహజముగానే రామాయణ, భారత, భాగవతములలోని కథా సంవిధానములు రసరంజితములై సామాజికుల దృష్టిలో అజరామరమై నిలిచియుండును. అంతకు ముందే శ్రవ్య కావ్యములలో, పురాణ పఠనములో, ఇతర కథాగానముల ద్వారా సుపరిచితములైన కథావస్తువు అందలి పాత్ర చిత్రణ నవరసభరితములై పాఠకులను అలరించి యుండును. అలాంటి కథావస్తువు యక్షగాన సరళిలో మరింత రాటుదేలి సంగీత, నృత్య శైలులతో విభిన్నమైన రాగము, తాళము, దరువులతో ప్రేక్షకులను మురిపించును.

అపార కావ్య సంసారమును సృజించు కవిని అపర బ్రహ్మగా కీర్తించవచ్చును. కవి కల్పించు అనేక విధములైన కావ్యకళాశిల్పముతో కూడిన కథా వస్తువులెన్నో యక్షగానమున మరపురాని కళాఖండాలుగా నిలిచిపోయాయి. రామాయణగతములైన సుగ్రీవవిజయము, సీతా కళ్యాణము, కౌసల్యా పరిణయము, లవకుశ చరిత్రము, మండోదరి పరిణయము, శ్రీరామ విజయం మొదలైన యక్షగానాలలో వాల్మీకి కథాగుణములైనవి, అవాల్మీకాంశాలు కూడా పొందుపరచబడినవి. నన్నయాదిగాగల కవులు రచించిన తెలుగు కావ్యాలు, ప్రబంధాల నుండి కోకొల్లలుగా గ్రహించిన ఇతివృత్తాలతో అందులోని వీర, శృంగార, కరుణ రస ప్రధానమైన యక్షగానాల రస పోషణలో తెలంగాణ యక్షగానాలు జానపద శైలులతో శాస్త్రీయ రాగ ఛాయ కలిగిన తాళప్రస్తారాలతో రసప్రధానమైనవి. అలాగే మహాభారత, భాగవత, శైవప్రధాన కథావస్తువుతో రాగరంజితమైంది. గరుడాచల నాటకం, చెంచులక్ష్మి పరిణయం, ప్రహ్లాదచరిత్ర, తారకాసురవధ, సుభద్రాపరిణయము, రుక్మిణీకళ్యాణము, కాళింగ మర్దనము, శంబరాసురవధ మొదలైన యక్షగానాలలో రసపోషణకు మిక్కిలి అవకాశము కలదు.

**యక్షగానాల్లో శృంగార, హాస్య, కరుణ రసములు :**

శృంగార రస ప్రధానమైన యక్షగానాలు విరివిగానే ఉన్నాయి. సృష్టిలో శృంగారమంత తీయనిది లేదు. అంత బలవత్తరమైన శక్తి లేదు. అది ఒక మధురమైన మానసిక విక్రియ. అందుకే ఆనందవర్ధనుడు "శృంగార ఏవ: మధురం పర ప్రహ్లాదనోరస:" అన్నాడు. అందుకే వినోద దాయకము, ఉల్లాసాన్ని కలిగించే విధంగా రచయితలు అనేక యక్షగానాల్లో ప్రధాన కథతో పాటు, సన్నివేశపరంగా సందర్భానుసారంగా శృంగార రస ప్రధానమైన వాద సంవాదములు, సంభాషణలు, దరువులు సృష్టించారు. నాయికా, నాయకుల శృంగారభరిత సంవాదాలు, విచ్చలవిడి పదగుంపనాలు, అమలిన శృంగార భావనలు, జానపద జావళీలు విరివిగా కనిపిస్తాయి. చుక్కాపురి

కాళింగమర్ధనలో, శ్రీకృష్ణలీలలు, గోపికల ప్రణయ కేళి పచ్చి శృంగారాన్ని ఒలకబోస్తాయి. అలాగే అల్లీరాణిచరిత్ర, కనకతార, ఉషాపరిణయము, చంద్రహాసచరిత్రము, రంభరంపాల చరిత్రము, తారాశశాంక నాటకం మొదలగు యక్షగానాల్లో సంపూర్తిగా శృంగార రసం తొణికిస లాడుతుంది.

యక్షగానాల్లో ప్రత్యేకించి హాస్య ప్రధాన ఇతివృత్తాలు లేకపోయినా సందర్భానుసారంగా ప్రతి యక్షగానంలో ఏ కథ అయినా సరే హాస్యాన్ని కల్పించుటకు కొన్ని ప్రత్యేక పాత్రలు, సన్నివేశాలు కల్పించడం వాటిని ఆసాంతం కొనసాగించడం జరుగుతుంది. రామాయణం, భారతం వంటి కావ్యేతిహాసములలో అక్కడక్కడ హాస్యము కనిపించినను దానికి అంత ప్రాధాన్యం లేదు. "మన కావ్యములలో హాస్యమెప్పుడును అంగరసము" అని విమర్శకుల అభిప్రాయం. యక్షగానాల్లో కూడా హాస్యము అంగరసముగానే కొనసాగింది.

శోక స్పర్శ లేని జీవితానుభవం లేదు. అనుభవం కరుణాభావ స్పష్టములు అయితే గాని జీవితం పరిపూర్ణత పొందదు. సుఖమయ జీవితాన్ని ఆశించిన మానవుడు జీవిత ప్రయాణంలో అనుకోకుండా సంభవించిన సంఘటనల ద్వారా కొన్నిసార్లు దు:ఖపడవలసి వస్తుంది. ఒక వస్తువును ఆశించుటలో ఆనందం, అది దూరమై నప్పుడు కలిగే దు:ఖం ఈ రెండు మానవ జీవితంలో అవశ్యముగా అనుభూతి చెందుతాము. రామాయణ, మహాభారతం వంటి ఇతిహాసాలైనా చారిత్రక, కాల్పనిక, పౌరాణిక యక్షగానాల్లో కరుణ రసానికున్న ప్రత్యేకత మరే దానికి లేదంటే అతిశయోక్తి కాదు. "ఏకో రస: కరుణ ఏవ" అని భవభూతి ప్రతిపాదించినట్లుగా కథలన్నీ కరుణ రస ప్రధానమై ప్రేక్షకుల్ని కట్టి పడేసి కంటతడి పెట్టిస్తాయి. హృదయాన్ని ద్రవింప చేస్తాయి. బాలనాగమ్మ చరిత్ర, కుశలవ నాటకము, హరిశ్చంద్ర నాటకము, పద్మవ్యూహం, బొబ్బిలి చరిత్ర మొదలైనవి కరుణ రసామృతములు.

యక్షగానాల్లో రౌద్ర, వీర, భయానక రసములు: యక్షగానాల్లో రౌద్రరసము, అంగరసముగానే కొనసాగు తుంది. కథానుగుణంగా యుద్ధ సన్నివేశాలలో కోపోద్రిక్తు లగు పాత్రలందు రౌద్రము గోచరమగును. ఇష్టజన పరివారము, బంధువర్గము, పుత్రమిత్రాదులకు శత్రువుల చేత అపకారము, వినాశము జరిగినప్పుడు క్రోధము కట్టలు తెంచుకొనుట సహజము. అన్యాయముగా తమ రాజ్యమును, సంపదను ఆక్రమించి దోచుకున్నప్పుడు కోపావేశమున చేసే ప్రతిజ్ఞలు , శపథములు వాటి కోసమై ప్రతీకారము తీర్చుకొనే ఘట్టాలు యక్షగానాల్లో రచయితలు పొందుపర్చడం జరిగింది. మహాభారత గాథలెన్నిటినో యక్షగానాలుగా మార్చిన కవులు, రచయితలు యుద్ధ సన్నివేశాలు అనేకం చిత్రించినారు.

యక్షగానాల్లో వీర రసముదే అగ్రస్థానము. జీవన సంఘర్షణలో మంచి చెడుల మధ్య పోరాటం సహజమే. అంతిమ విజయం మంచిదే ఉండాలని అందరి ఆకాంక్ష. ఉత్సాహము ఉత్తములందు దీపించు సత్త్వగుణము. భారత, రామాయణ కథా సన్నివేశాలలో, యుద్ధ ఘట్టా లలో వీరుల ఉత్సాహం ఉరకలేస్తుంది. యక్షగానాలలో వీరము అంగిరసము అనగా ప్రధాన రసముగానే పోషింపబడింది.

యక్షగానాల్లో భయానక రసము అంగరసముగానే ఉన్నను అంతర్లీనంగా కథాకథనములో బహుగా రక్తి కట్టించుటకు తోడ్పడింది. సత్యహరిశ్చంద్ర నాటకములో భేతాళుని ప్రవేశ సమయంలో అరణ్యములో వారికేమి సంభవించునోయని ఉత్సుకత పెరుగును. సుగ్రీవ విజయంలో మాయాసురుని చంపుటకు వెళ్ళిన వాలి తిరిగి రానందున సుగ్రీవుడు పారిపోయి వచ్చిన తరువాత జరిగిన సంఘటనలు సుగ్రీవునికి కంటి మీద కునుకు లేకుండా చేస్తాయి.

**యక్షగానాల్లో బీభత్స, అద్భుత, శాంత రసములు**

సహృదయునకు రోత పుట్టించు ఏ విషయమైనా బీభత్సరసమును జనింపజేయును. యుద్ధభూమిలో శత్రువులను హింసించు వీరులకు సైతం రోతకలుగునట్లు రక్తాన్ని ప్రవహింపజేయును గనుక అర్జునునికి బీభత్సుడని పేరు. పద్మవ్యూహం యక్షగానంలో అభిమన్యుడు హతుడైన తరువాత అర్జునుడు దివిటీ పట్టుకొని కొడుకుని వెతుకుటకు వెళ్ళినపుడు అక్కడ దృశ్యాలు అతి

జుగుప్సాకరంగా వర్ణించబడ్డాయి. కీచకవధలో కీచకుని వికృత చావు, సీతాస్వయంవరంలో తాటకి విశ్వామిత్రుని యాగశాలను పాడు చేసిన తీరు, మైరావణ చరిత్ర, పరుశు రామ విజయంలో బీభత్సరస ప్రధాన సన్నివేశాలు కన బడుతాయి.

అద్భుతమైన విషయమంతయు నాటకీకరణకు ఎంతో పనికి వచ్చును. అతిమానుష చర్యలు ఆశ్చర్యం కలిగిస్తాయి. ఆ చర్యలను విశదముగా వర్ణించుట అద్భుత రసమును సృష్టించుటయే. వస్తు సంవిధానమును ఆశ్చర్యజనకముగా చేయి తిరిగిన రచయితలు సృష్టించ గలరు. అల్లిరాణి చరిత్రలో అర్జునుడు స్త్రీ వేషంలో చూపిన చేష్టలు, కాళింగమర్ధనలో గోవర్ధనగిరి నెత్తిన కృష్ణుని చూసిన రేపల్లెవాసులు, జనం ఆశ్చర్యంతో తిలకిస్తారు. వాల్మీకి చరిత్ర, శశిరేఖా పరిణయము, కృష్ణగారడి మొదలైన యక్షగానాల్లో అద్భుత సన్నివేశాలు పాఠక, ప్రేక్షకులను సమ్మోహన పరుస్తాయి.

యక్షగానాలలో వేదాంతసారం, భగవత్ గుణ సంకీర్తనం ఉపదేశరూపమున చెప్పబడింది. సంసార తాపమును పోగొట్టి జీవులకు ఉపశమనం కలిగిస్తుంది. సత్యహరిశ్చంద్ర నాటకంలో హరిశ్చంద్రుడు కాటికాపరిగా ఉన్నప్పటికీ స్థితప్రజ్ఞుడు. హరిశ్చంద్ర పాత్ర రాగద్వేషాలకు అతీతంగా కన్నకొడుకును దహనం చేయడానికి కూడా సుంకం అడిగిన తీరు పాఠక, శ్రోతల, ప్రేక్షకుల హృదయా లను నిర్వేద స్థితికి చేరుస్తుంది. పోతులూరి వీరబ్రహ్మం గారి చరిత్రలో పూర్తిగా తత్త్వజ్ఞాన చింతన, జీవిత పరమార్థం, చావుపుట్టుకలు, పరమపదం, కాలజ్ఞానం పారమార్థిక చింతనవైపు నడిపిస్తుంది.

**ముగింపు :**

పండితులైనా, పామరులైనా, అక్షరాస్యులైనా, నిరక్ష రాస్యులైనా యక్షగానాలను చదివి, మౌఖికంగా విని, ప్రదర్శనా కళగా చూసి ఆనందించేవారని తెలియుచున్నది. అంతేకాకుండా జానపదులందరూ కంఠస్థం చేసి పాడుతూ జనజాగృతం చేశారు. గుళ్ళలో జరిగే భజనల్లో గాని, బృందాలుగా ఏర్పడి తమ ఇళ్ళల్లో యక్షగానాలను గానకళగా సాధన చేసినారని తెలుస్తుంది. ఈ విధంగా యక్షగానాలు నవరస భరితములై ప్రజల హృదయాల్లో విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్నాయి. కావ్యం, దృశ్య రూపకం వలన అలౌకికానందం కలుగుతుంది. యక్షగాన కళాకారులను ఆదుకొని కళను నిలబెట్టాలి. నేటి సామాజిక సమస్యలతో పాటు, మానసిక వికాస అంశాలను పొందు పరచి మరుగున పడిపోతున్న యక్షగాన కళరూపాన్ని భావితరాలకు అందించాలి.

**ఆధార గ్రంథాలు**


1. ఆంధ్రయక్షగాన వాఙ్మయ చరిత్ర., ఎస్వీ జోగారావు.
2. ఆంధ్రుల సాంఘిక చరిత్ర., సురవరం ప్రతాపరెడ్డి
3. తెలంగాణలో యక్షగానం రచన - ప్రయోగం., పొద్దుటూరి ఎల్లారెడ్డి.


★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# బంజారా వృత్తి కళాకారులు జీవన చిత్రణ - నాడు, నేడు



- ఆచార్య హెచ్. కిషన్

తెలుగుశాఖ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), బేగంపేట, హైదరాబాద్.

**సంగ్రహ వ్యాసం :**

బంజారా కళాకారులు వివిధ తండాల్లో తిరుగుతారు. బంజారా సంస్కృతీ, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు వీరికి తెలిసినంత సమాచారం మరొక బంజారా నాయకులకు తెలియదు. బంజారా ప్రజలకు తెలియని విషయాలను తెలియజేస్తారు. మంచి, చెడు లేదా ఏదైన కార్యం చేయాలనుకుంటే భాట్, ఢాడీ బంజారా, డఫ్డియాలను పిలిపించుకుంటారు. ముఖ్య నాయకుల చరిత్రలను వారి చరిత్రలను పుట్టు పూర్వోత్తరాలను, గోత్ర నామాలను వారి ద్వారా పాడి వినేవాళ్ళు. నేడు అక్కడక్కడ ఇంకా బంజారా వృత్తి కళాకారులు ఉన్నారు. బంజారా చరిత్రను పాడి వినిపిస్తున్నారు. ఆ కొద్ది మంది బంజారా వృత్తి కళాకారుల జీవన విధానాన్ని తెలియజేయడమే ఈ వ్యాసం యొక్క ముఖ్యోద్దేశం.

**కీలక పదాలు :**

భాట్ కళాకారులు, ఢాడీ కళాకారులు, డాలీయా కళాకారులు, డప్పు కొట్టే కళాకారులు, ముగింపు, ఆధారగ్రంథాలు.

**పరిచయం :**

బంజారాలు అనేక శతాబ్దాల నుండి తమదైన ప్రత్యేక సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ జీవనం సాగిస్తూ వస్తున్నారు. వీరి సంస్కృతీ విలక్షణమైన రీతిలో ఆకట్టుకోనే విధంగా ఆకర్షణీయంగా ఉంటుంది. వీరు సాధారణంగా గుంపులు గుంపులుగా ఊరికి దూరంగా చిన్న చిన్న నివాసాలు ఏర్పాటు చేసుకొని ఉంటారు. ఆ నివాసాలను తండాలని పిలుస్తారు. ఆ తండాల్లో ఈ వృత్తి కళాకారులు ఉంటారు. ఈ కళాకారులు బంజారాల చరిత్రను వారి మూలాలను బోధిస్తారు. బంజారా వృత్తి కళాకారుల జీవన విధానాన్ని ఈ క్రింద తెలియజేస్తాను.

**భాట్ కళాకారులు :**

భాట్ అనగా భట్రోజు అని అర్థం. వీరికి ఒకప్పుడు పూర్వ మంత్రియా భాట్ అనేవాడు ఢాడీ కళాకారులకు తన కవిత్వం నేర్పి ప్రయోజనం లేదని అనుకొని భాట్ తెగ వారికి కవిత్వం నేర్పించాడు. ఆ విధంగా భాట్ తెగవారు ఏర్పడ్డారు. బంజారాల్లో ఒక తెగ వారైన భాట్ కులస్థులు బంజారా వాళ్ళకు ఆశ్రిత కులం. వీరు బంజారా తండాలోనే ఉంటారు. వివిధ బంజారా తండాలకు పోయి కథలు చెప్తారు. కథాగానానికి అనుకూలంగా తాళాలు రబాబ్‌లనే వాయిద్యాలను వాడుతారు. రబాబ్ కిన్నెర ఆకారంలో ఉండే ఒక వాయిద్యం. దీని క్రింది భాగం కర్రతో చేయబడి పై భాగం మేక తోలుతో కప్పబడి ఉంటుంది. దీనికి నాలుగు తీగలు అమర్చబడి ఉంటాయి. బంజారాల ఇంటి చావడిలోను, కొట్టంలోను

ఎక్కడ కూర్చోమంటే అక్కడే కూర్చొని కథలు చెప్తారు. ముగ్గురు సభ్యులతో బృందంగా ఏర్పడి కథలు చెప్తారు. కథకుడు తలకు ఎర్రటి తలపాగా చుట్టుకొని కథను ప్రారంభించి పాడుతాడు. ఆ సభ్యుల్లోని మిగిలిన ఇద్దరు తాళాలు రబాబ్ వాయిస్తూ వంత పాడుతారు.

పండుగలు, భవానీ పూజలు, వివాహాలు, చావులు మొదలైన సందర్భాలలో వీరు సాధారణంగా కథలు పాడి వినిపిస్తారు. ఎవరైనా మంచి పనులు చేసి మరణించిన వారిపై బంధువులు, కుటుంబ సభ్యుల అంగీకారంతో అందరిని ఒకే చోట కూర్చుండబెట్టి వారి సమక్షంలోనే కథను అల్లి పాడి వినిపిస్తారు. వేరే తండాకు వెళ్లినప్పుడు ఆ తండా నాయకులు అడిగితే అక్కడే వెంటనే జ్ఞాపకం తెచ్చుకొని పాడి వినిపిస్తారు. బంజారా నాయకులు పుట్టు పూర్వోత్తరాలను వంశ చరిత్రలోని ముఖ్యమైన నాయకులు పృథ్వీరాజ్ చౌహన్, అమర్ సింగ్ రాథోడ్ మొదలగు వారి గురించి పాడి వినిపిస్తారు. కథ దాదాపు మూడు నుండి ఐదు గంటల వరకు పాడి వినిపిస్తారు. అందరు ఆసక్తితో శ్రద్ధగా నిశ్శబ్దంగా వింటారు. కథ చెప్పేటప్పుడు కథకుడు మిగతా ఇద్దరు కల్లు, లేదా గుడుంబా తాగుతూ పాడేవారు. ఇప్పుడైతే బ్రాండి తాగి పాడుతున్నారు.

వీరికి తండానాయకులు భోజనం, దుస్తులు, పారి తోషికం ఇస్తారు. సకల గౌరవ మర్యాదలు ఇస్తారు. సాగ నంపేటప్పుడు కూడా గౌరవంగా మళ్ళీ రావాలని, మమ్ము లను మరచిపోవద్దని చెప్పి పంపిస్తారు. ఈ వృత్తి వంశ పారంపర్యంగా తాత తండ్రుల నుండి నేర్చుకొని ఆన వాయితీగా వచ్చే సంప్రదాయం బంజారా నాయకుల కథ లను చెప్పడమే వీరి వృత్తి. ఇదే వీరి జీవనాధారం. భాట్ కళాకారులు ప్రస్తుతం భాట్ రంజోల్ బృందం భట్టుపల్లి తండా, భూపాల్‌పల్లి జయశంకర్ జిల్లాలో నివాసం ఉం టున్నారు. వీరు బంజారా నాయకుల జీవిత చరిత్రను పాడి వినిపిస్తున్నారు. వీరికి జ్ఞాపకశక్తి ఎక్కువగా ఉం టుంది. అన్ని గుర్తు పెట్టుకొని ఉంటారు. బంజారాలకు పురోహితులుగా వ్యవహరిస్తారు. వీరు చాల ప్రతిభా వంతులు.

భాట్‌లలో ప్రధానంగా పన్నెండు గోత్రాలు కలవు. అవి :

1. డాంగీ భాట్
2. సోటాభాట్
3. దేయాత్ భాట్
4. దేదావత్ భాట్
5. రోత్వాణ్ భాట్
6. సోడియా భాట్
7. కేరాళ్ భాట్
8. సనార్ భాట్
9. పితావత్ భాట్
10. తర్‌సింగ్ భాట్
11. అస్వాల్‌భాట్
12. చడ్డాయి భాట్

ఈ పన్నెండు గోత్రాలలో వీరి సంస్కృతి, సంప్రదా యాలు, ఆచార వ్యవహారాలు విలక్షణమైన రీతిలో ఉంటాయి. కులపరమైన పాత్రను పోషిస్తాయి. అంతేగా కుండా వీరి మధ్య వివాహ సంబంధాలు, కులగోత్రాల ఆధారంగా జరుగుతాయి. ఏది ఏమైన వీరి గోత్రాలను ఒదలిపెట్టకుండా, వీరి మధ్యలోనే సంబంధాలు జరుపు కుంటారు.

**ఢాడీ కళాకారులు :**

ఢాడీ బంజారా కళాకారులు ఒక తండా నుండి మరొక తండాకు వెళ్తారు. ఒక తండా సమాచారాన్ని మరొక తండాకు అందిస్తారు. కన్యలు పెరిగి పెండ్లి వయస్సు వచ్చిన అమ్మాయిల సమాచారాలను సేకరించి వారి గోత్ర నామాలను తెలుసుకొని పెళ్ళి సంబంధాలు కుదర్చడం మొదలుకొని పెళ్ళి చేయించే వరకు అన్ని బరువు బాధ్యతలు వీరు తీసుకొని వహిస్తారు. అనగా బంజారా తెగకు పురోహితుడిలాగా ఈ ఢాడీ కళాకారులు వ్యవహరిస్తారు.

ఢాడీ కళాకారులు వివిధ తండాలకు బంజారా మూల పురుషుల రాజుల జీవిత చరిత్రలను గానం చేస్తూ తండాలలో భాట్ కళాకారుల వలే వారి సారంగి (తుంబర) పై పాడి కథలను వినిపిస్తారు. వీరు బంజారా సమాజం లోని వివిధ తండాలలోని సందేశాలను అందిస్తారు.

బంజారా నాయకుల కథాగేయాలను గానం చేయడమే వీరు వృత్తిగా స్వీకరిస్తారు.

ఢాడీ బంజారా కళాకారులు పొగడ్తలకు, స్తోత్రాలకు ఎంత పెద్ద తెలివైన బంజారా నాయకుడైనా వీరి గానానికి విని లొంగిపోవాల్సిందే. ఈ కళాకారులు గానం పాడి విని పించిన తర్వాత తండా నాయకుణ్ణి పొగడ్తలతో ఉక్కిరి బిక్కిరి చేసి మాయమాటలతో నచ్చచెప్పి కావల్సినంత పారితోషికాన్ని అడిగి తీసుకుంటారు. ఇదే వీరి జీవనాధార మైన ఈ వృత్తితోనే తన కుటుంబ పోషణ ఆధారపడి ఉంటుంది. నాడు ఈ వృత్తితోనే జీవితాన్ని కొనసాగించే వారు. ఇది వీరి వంశపారం పర్యంగా వచ్చిన వృత్తి కాని నేడు కాలం తెచ్చిన మార్పువల్ల ప్రపంచీకరణ ప్రభావంతో ఢాడీ బంజారా వృత్తి కళాకారుల ఆదరణ తగ్గిపోతుంది.

**ఢాలియా కళాకారుడు :**

ఢాడిభాట్ కళాకారులతో పాటే ఢాలియాభాట్ కళా కారుడు డప్పు నగరవాయించడానికి వీరితో పాటే వెళ్తాడు. ఇతను వివిధ బంజారా తండాలలో శుభ, అశుభ కార్యక్రమాలకు వెళ్తాడు. రెండు మూడు రోజులు అక్కడే ఉండిపోతాడు. సాయంకాలం కల్లు లేదా గుడుంబా తాగడానికి పోస్తారు. మర్యాదగా చూసుకుంటారు. తండా వాసులందరిని ఒకచోట చేర్చడానికి డప్పు శబ్దం ఉప యోగపడుతుంది. ఇతన్ని పంపేటప్పుడు ఖాళీ చేతులతో పంపకుండా తినడానికి ధాన్యం, బట్టలు, చేతిలో డబ్బులు ఇచ్చి గౌరవంగా పంపుతారు. మళ్ళీ రమ్మని చెప్పి తండానాయకులు పంపిస్తాడు.

**డప్పుకొట్టే కళాకారుడు :**

డప్పుకొట్టే బంజారా కళాకారుడు తండాలలో శుభ అశుభ కార్యాలు జరిగేటప్పుడు ఇతడు డప్పును చంకలో పెట్టుకొని వెళ్ళిపోతాడు. తన భార్యను పిల్లలను చూసు కోమని చెప్పి వెళ్ళిపోతాడు. ఏ తండాలోనైనా ఏదైన శుభకార్యం అవుతుందంటే ఆ వార్త తెలిసిన వెంటనే ఆ తండాలో వెళ్ళిపోతాడు. ముందుగా తండా నాయకుణ్ణి కలుస్తాడు. నేను వచ్చానని తెలియడానికి నాయకుని అంగీకారంతో డప్పు శబ్దం చేస్తాడు. ఆ శబ్దాన్ని విన్నా తండా వాసులందరు డప్డియా వచ్చాడని అనుకుంటారు. కన్యలు, స్త్రీలు, పురుషులందరు తొందరగా భోజనాలు చేసి కార్యం జరిగే చోట వచ్చేస్తారు. అందర్ని డప్పుతో స్వాగతం చెప్తాడు. తండాలోనున్న అందరు డప్డియా యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటారు. ఇతనికి తండా వాసులందరు సొంత కుటుంబ సభ్యుడి వలే చూసు కుంటారు. అతిథి మర్యాదలు, గౌరవం కూడా ఇస్తారు.

ఈ కార్యం పూర్తి అయ్యేవరకు రెండు, మూడు రోజులు ఇక్కడే ఉండి కుటుంబంలో ఒకరు అయి పోతాడు. రాత్రి పూట భోజనాలు చేసిన తర్వాత డప్పు కొడ్తాడు. ఆ శబ్దం విని అందరు వచ్చేస్తారు. యువతి, యువకులు, అమ్మాయిలు డప్పు శబ్దంతో నృత్యం చేస్తారు. యువకులు, నాయకులు కోలాటం ఆడుతారు. స్త్రీలు సామూహికంగా పాటలు పాడుకుంటూ డప్పు శబ్దంతో నృత్యం చేస్తారు.

వీరి నృత్య బృందంలో పది నుండి ఇరువై మంది వరకు సంప్రదాయ దుస్తులు ధరించి డప్పు శబ్దానికి అనుగుణంగా నృత్యం చేస్తారు. అనేక రకాల పాటలు పాడుకుంటూ నృత్యం చేస్తారు. అందరు నిలబడి ముందుకు వంగి చేతులు పైకి ఎత్తుకుంటూ పాడుతారు. ఈ క్రింద తమ గురువైన సేవలాల్ గురించి పాడుతూ నృత్యం చేసిన క్రింది పాట.

**ఉదా :**

కోయినారియే కోచళో సోసో
కోయి నారియే కూణిన చోడో
కోయి నారియే శంక్రన చోడో
కోయినారియే కోయ్ అంకుదీచ
కోయినారియే రవియ్యదీచ
సుమసోతితి జోర జానలిజో

**భావం :**

సేవాభావ చాలా అందంగా ఉన్నాడు. ఎదురుగా అతని కళ్ళు సూర్యుని వలె ప్రవేశిస్తున్నాయి. కొద్ది దూరం వెళ్ళి కలవండని పాటలో పాడుతున్నారు.

ఇలా గిర్రున తిరుగుతూ, శరీరాన్ని కిందికి పైకి వంచుతూ లేస్తూ చేతుల్ని పైకెత్తి చప్పట్లు కొడుతూ

గుండ్రంగా తిరుగుతూ సేవభావను వర్ణించుకుంటూ ఒకరు పాడుతుండగా మిగిలిన వారంత కోరస్‌గా పాడుతారు. తండా నాయకులందరు కూర్చొని కార్యానికి సంబంధించిన మంచి చెడులు మాట్లాడుకుంటారు. నిద్ర వచ్చేవరకు అందరు ఇక్కడే ఉంటారు. బంజారా డప్డియా ఉన్నన్ని రోజులు ఆ తండావాసులను తన డప్పు శబ్దంతో రంజింప చేస్తారు. ఇతడు వెళ్ళేటప్పుడు కొంత డబ్బులు ఇస్తారు. ధాన్యాలు ఇచ్చి గౌరవంగా సాగనంపుతారు. మళ్ళీ రావాలని చెప్పి పంపిస్తారు. ఇతని రాకకోసం భార్య పిల్లలు ఎదురుచూస్తుంటారు. ఎందుకంటే వాళ్ళకోసం డబ్బులు, ధాన్యాలు తీసుకొస్తాడు. ఇదే వీరి జీవనాధారం. డప్పుకొట్టే వాడు గొల్ల బుద్దారం తండాలో నివాసం ఉండేవాడు. కాని నేడు ఈ వృత్తికి ఆదరణ తగ్గింది. ఎందుకంటే డిజేలు వచ్చేసాయి. కాబట్టి వీరు తమ వృత్తికి దూరమై వ్యవసాయం, కూలి, జీతం ఉంటూ బ్రతుకుతున్నారు. ఇలా నేడు డప్పుకొట్టే బంజారా తెగవృత్తి కనుమరుగై పోవడానికి కారణం ప్రపంచీకరణ ప్రభావంతో కాలం తెచ్చిన మార్పుగా చెప్పవచ్చు.

**ముగింపు :**

నేడు ప్రపంచీకరణ ప్రభావంతో కాలం తెచ్చిన మార్పువల్ల బంజారా వృత్తి కళాకారుల్లో కూడా మార్పు వచ్చింది. వీరు అడవికి మైదాన ప్రాంతంలో నివసించి జీవనాన్ని కొనసాగించే బంజారా కళాకారులు నగరానికి వలస వచ్చి స్థిరపడిపోతున్నారు. అందరు చదువుకుంటున్నారు. అన్ని విషయాలను తెలుసుకుంటున్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వివిధ రంగాలలో కూడా ఎదుగుతున్నారు. ఎంత ఎదిగిన తమ వృత్తి కళలను మరచిపోకుండా కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి బంజారా యువతపైన ఆధారపడి ఉంది. నేడు ఏదైన తంతు జరుపుకుంటున్నాం అంటే ఢాడీ, భాటో, డప్డియా కళాకారులను పిలిపించుకొని బంజారా చరిత్రను మూలాలను తాతలు, ముత్తాతలు మరియు వారితో పాటు యువకులు కూడా తెలుసుకునేవారు. నాడు యువత తెలుసుకోలేక పోతున్నారు. వీరి వృత్తి కళలు రాబోయే బంజారా ప్రజలకు తెలియకుండా కనుమరుగైపోయే ప్రమాదంలో ఉంది. కాబట్టి ఇప్పుడున్న భాట్ రంజోళ్ లాంటి కళాకారుడిని గుర్తించి ప్రభుత్వం జీవనోపాధి కల్పిస్తూ రాబోయే తరానికి తెలియజేయడానికి వారి వారసత్వాన్ని నేర్పించే అవకాశం ఉంటుంది. అప్పుడు బంజారా చరిత్రను బతికించినట్లు అవుతుంది. చదువుకుంటున్న ప్రతి బంజారా యువకులు ఆలోచించండి. బంజారా చరిత్రకు సంబంధించిన వంశ మూలాలను, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందాం.

**ఆధార గ్రంథాలు :**


1. జానపద గిరిజన విజ్ఞానం - జాతీయ సదస్సుల పత్రాలు, జానపద గిరిజన విజ్ఞాన పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, భద్రి ట్యాంక్‌బండ్, వరంగల్లు, 2012.
2. జానపద సాహిత్యం - ఎం.ఏ., తెలుగు, సెమిస్టర్ -1, డా. బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
3. చీనియా నాయక్ బి. బంజారా చరిత్ర సంస్కృతి - ప్రగతి
4. రాధాకృష్ణ మిక్కిలినేని, తెలుగు వారి జానపద కళారూపాలు - కళాప్రపూర్ణ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 2011.
5. శంకరయ్య జనపాల, కరీంనగర్ జిల్లా లంబాడీల ఆచార వ్యవహరాలు, 1995.
6. భాట్ రంజోళ్, వయస్సు 60 సం॥లు, భట్టుపల్లి తండా, భూపాల్‌పల్లి జయశంకర్ జిల్లా, చరవాణి ద్వారా మౌఖిక సమాచారం, సేకరణ తేది : 22.2.2026.
7. ఔటోతు సమ్మయ్య, వయస్సు 65 సం॥లు మల్లయ్యపల్లె తండా, ములుగు జిల్లా, మౌఖిక సమాచారం, సేకరణ తేది : 26.2.2026.


★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# యక్షగాన కళారూపం-కళాకారుల జీవన చిత్రణ



– డా॥. తలారి శాకన్న

యక్షగాన నటుడు, రచయిత.

**వ్యాస సంగ్రహం**

యక్షగాన కళారూపం భారతదేశంలోని ప్రాచీన నాట్య సంప్రదాయాలలో ఒకటి. ఇది సంగీతం, నృత్యం, సంభాషణ, వేషధారణల సమ్మేళనంగా అభివృద్ధి చెందింది. ప్రారంభ దశలో ఇది మతపరమైన కథలు, పురాణ గాథలు, భక్తి అంశాలను ప్రజలకు చేరవేయడానికి ఉపయోగపడింది. కాలక్రమేణా యక్షగానం ప్రజల జీవితా లతో మమేకమై సామాజిక, సాంస్కృతిక అంశాలను ప్రతిబింబించే కళగా మారింది.

తెలంగాణలో యక్షగానానికి ప్రత్యేక స్థానం ఉంది. 18వ శతాబ్దం నుండి ఈ కళ విస్తరించి గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా ప్రాచుర్యం పొందింది. యక్షగాన ప్రదర్శనల్లో పాటలు, సంభాషణలు, నాటకీయత ప్రధాన పాత్ర పోషిస్తాయి. కళాకారులు వివిధ పాత్రలను ధరించి కథలను జీవంతో నింపుతారు.

యక్షగాన రచనలో భాష సులభంగా, ప్రజలకు అర్థమయ్యే విధంగా ఉంటుంది. ఇందులో భక్తి, వీరరసం, శృంగారరసం వంటి రసాలు ప్రధానంగా కనిపిస్తాయి. కథాంశాలు సాధారణంగా పురాణాలు, ఇతిహాసాల నుండి తీసుకోబడతాయి.

మొత్తంగా యక్షగాన కళ ప్రజలలో నైతిక విలువలు, ధార్మిక భావనలు పెంపొందించడమే కాకుండా వినోదాన్ని కూడా అందిస్తుంది. ఇది తెలుగు సంస్కృతిలో ఒక ముఖ్యమైన సంప్రదాయ కళారూపంగా నిలిచింది.

**కీలక పదాలు**

యక్షగానం, కళారూపం నాట్య సంప్రదాయం, సంగీత నృత్యం, సంభాషణ, తెలంగాణ గ్రామీణ సంస్కృతి, పురాణ గాథలు, భక్తి, సామాజిక అంశాలు, వేషధారణ, ప్రజాకళ

**పరిచయం**

ప్రాచీన మానవుడి ఆనందకేరింతల్లో నుండి పాట పుట్టింది. పాటలోని ధ్వనులకు అనుకూలంగా ఆట పుట్టింది. అలా వివిధ ప్రక్రియలకు అనుగుణంగా వివిధ రకాల ఆటలు, పాటలు ఉద్భవించాయి. ఆటపాటల్లో మానవుడి ఆనందానుభూతి వ్యక్తమౌతున్నది.

ఒక్కొక్క ప్రక్రియకు ఒక్కొక్క సాంప్రదాయం, రచనా వైవిధ్యం వేరు వేరుగా ఉంటాయి. 'సంగీత సాహిత్య నాట్య ప్రక్రియల మిళితమైంది యక్షగానం. ఇది ప్రాచీన కాలంలో వినోద కాలక్షేపం కొరకే ఉపయోగపడింది. రానురాను ఒక ప్రత్యేక సాహిత్య ప్రక్రియగా రూపాంతరం చెందింది. సంగీత సాహిత్య, అభినయ రూపంతో దేశీ సంస్కృతిని నిలుపుతుంది. క్రమంగా యక్షగాన కళారూపం

దక్షిణ భారతదేశ సామాన్య జనావళిలో యక్షగానంగా వ్యాపించింది.

దేశీ సాహిత్య ప్రక్రియలలోకెల్ల తలమానికం యక్షగానం. అది సంగీత సాహిత్య, సమాహార కళారూపం పాల్కుర్కి సోమ నాథుని పండితారాధ్య చరిత్ర పర్వత ప్రకరణంలో (క్రీ.శ. 1280-1340) కనబడుతుంది. శ్రీశైలయాత్ర శివరాత్రి జాగరణ సందర్భంలో

'ఆదట గంధర్వ యక్ష విద్యాధ
రాదులై పాడెడు నాడెడు వారు (రీ)
విధమున ప్రచ్ఛన్న వేషముల్ దాల్చి
యధికోత్సవము దులుకాడు నట్లాడు'' అని
వర్ణించాడు.

క్రీ.శ 1430 ప్రాంతంలో రచింపబడ్డ భీమేశ్వర పురాణంలో కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు, గాంధర్వమున యక్షగాన సరణి' అని కనిపిస్తున్నది. యక్షగానమును సమస్త పదమొక విశిష్టార్థంలో శ్రీనాథుని భీమేశ్వర పురాణంలో కనిపిస్తుంది.

యక్షగాన కళాప్రావీణ్యానికి పెట్టింది పేరు గంధర్వులు. వారి పేరనే గాంధర్వ వేదం వెలువడింది. అటువంటి గంధర్వులు 'యక్షగాన సరణి' పాడిరనగా అది శ్రీనాథుని కాలంనాడు ఒక ప్రత్యేక గాన శైలిగా స్థిరపడిందనే విషయంగా చూడవలసి వస్తుంది. 16వ శతాబ్ది ప్రబంధమైన ప్రవరుడు హిమాలయ పర్వత ప్రాంతంలో గంధర్వ యక్షగాన ఘూర్ణితమగు నొక్కకోన నుగనియే'' అని ఉన్నది. పారిజాతపహరణంలో యక్షగ్రామ వాస్తవ్యులు నిర్జరీ జనతా నృత్త సహాయ లాలసులనీ యక్షులు 'మేళముగూడి పాడుచుందురు దిక్పాలసభల' అని ఉంది. రామాభ్యుదయమున ''గరుడ గంధర్వ కిన్నర, కింపురుష యక్షగానంబులనూనంబులై బైరయ'' అని పేర్కొనబడింది.

**తెలంగాణ యక్షగాన కళారూపం :**

క్రీ.శ. 18వ శతాబ్ది ఉత్తరభాగం నుండి తెలంగాణలో యక్షగాన రచన చేసినట్లు తెలుస్తుంది. 1780 ప్రాంతంలో వెలసిన శేషాచల కవి ధర్మపురి రామయాణం. రాపాక శ్రీరామకవి ఆధ్యాత్మ రామాయణాలను తెలంగాణలో మొదటి యక్షగానాలుగా గుర్తించారు. క్రీ.శ. 1800 సం॥ ప్రాంతంలో వెలసిన వీరశైవ యక్షగానాలు రెండు లభించాయి. అవి కానూరి వీరభద్రకవి బసవ మహిమామృత విలాసం, చెల్వురు సన్యాసకవి బసవ కళ్యాణం. 19వ శతాబ్ది పూర్వ భాగంలో యక్షగానాలు ప్రముఖంగా వెలువడినట్లు తెలుస్తున్నది.

ఆత్మకూరు సంస్థానాధీశుడు ముక్కర సీతారామ భూపాల ఆశ్రితుడైన రామదాసకవి తారాశశాంకం, భీమసేన విలాసం అనే యక్షగానాలు రచించాడు. జడ్చర్ల దేశ్‌పాండ్యా పట్వారీల ప్రోత్సాహంతో గోవర్ధనం వెంకట నరసింహాచార్యులు అజామిళోపాఖ్యాన యక్షగానాన్ని ఆంధ్రదేశ ఫక్కీలో రచించాడు.

తెలంగాణ ప్రాంతంలో 18వ శతాబ్దం నుండి ఇప్పటి వరకు నిత్యం ఎక్కడో ఒక గ్రామంలో యక్షగానాలు ప్రదర్శింపబడుతూనే ఉన్నాయి. 20వ శతాబ్దిలో యక్షగానాల సంఖ్య శతాధికమైనది. యక్షగాన కవులలో పేరెన్నిక గన్నవాడు శ్రీ చెర్విరాల భాగయ్యగారు. ఈయన 34 యక్షగానాలు రచించాడు. భాగయ్యగారు తన రచన లన్నిటిని యక్షగానాలు అని వ్యవహరించారు. కొన్ని రచనలకు భాగవతము, నాటకం అను పర్యాయ పదాలను వాచకాలుగా, సమానార్థకాలుగా వాడినాడు.

**యక్షగాన రచనా విధానం :**

యక్షగాన రచనలలో ముఖ్యంగా వస్తు వైవిధ్యం వస్తువును గమనిస్తే ప్రసిద్ధమైన పౌరాణిక, ఇతిహాస ఇతివృత్తాలు కనిపిస్తాయి. ఇవేగాక జానపద వృత్తికి సంబంధిన సాహస వీరుల చరిత్రలు కనిపిస్తాయి. ఇవేకాక ఆరె మరాఠీలు, కాంభోజ రాజుకథ, బాలనాగమ్మ మొదలగు ప్రచార రూపంలో ఉన్న కథలను గ్రహించి రాశారు. యక్షగానాలలో ముఖ్యంగా రాజు పాత్ర మొదలుకొని కులవృత్తులకు సంబంధించిన ఎఱుకల సాని, దొమ్మరి, చాకలి, కోమటి మొదలగు పాత్రలు కూడా ఉంటాయి. పాత్రల సంభాషణలలో తెలంగాణ మాండలిక వ్యవహారం నుడికారం పాత్రోచితంగా కని పిస్తుంది. యక్షగానం మొత్తానికి సభారంజకంగా

ఉంటుంది. యక్షగానాలను ఇప్పటికి వీధిభాగవతాలుగా నాటకాలుగా కూడా పిలుస్తారు.

**కళాకారుల జీవన చిత్రణ :**

తెలంగాణలో యక్షగానాలను ఎక్కువగా ప్రదర్శించుటకు కారణం ఊరూర కొన్ని “మేళాలు” ఏర్పడ్డాయి. ఉదా: ‘చిరుతల’ నాట్యమండలి.

కళాకారులు అందరు గ్రామలలో నివసించేవారు. పండుగ సమయాల్లో జాతర సమయాల్లో లేదా ఊర్లో పెద్ద దొరలు, పటేలు, కరణం ఇలా కొంతమంది పెద్ద మనుషులు వారి పేరుమీద మేళం వారిని పిలిచి ఆడించేవారు. ఇప్పుడు మాత్రం గ్రామాల్లో యక్షగానాలను కొంతమంది పాత్రదారులు ఎవరి పాత్రను వారే నేర్చుకొని పంతులు సహాయంతో ప్రదర్శిస్తున్నారు.

ఇప్పుడు కూడా కళాకారులు వారి డబ్బులను వారే ఖర్చు పెట్టుకొని పంతులును పిలిపించుకొని నేర్చుకొని గ్రామాలలో ప్రదర్శించుకుంటున్నారు. యక్షగానాలకు ప్రత్యేకంగా కళాకారులు అంటూ ఎవ్వరూ లేరు. గ్రామంలో ఉన్న వారే కులమతాలకు అతీతంగా కూడా స్థానికంగా ఉన్న ప్రజలే కొన్ని రోజులు నేర్చుకొని ప్రదర్శిస్తు న్నారు.

ఒకప్పుడు మేళాలు ఉండేవి. కాని యక్షగాన కళాకారులకు ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహాలు ఇవ్వక పోవటం వలన కూడా యక్షగాన రచన, ప్రదర్శనలు నిరాదరణకు గురైనాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విప్లవాత్మకమైన మార్పుల వల్ల కూడా రచనలు చేసేవారు, నేర్పేవారు లేకుండా పోయారు. సినిమా ప్రభావం కూడా చాలామట్టుకు యక్షగాన కళాకారులపై పడింది.

**ముగింపు :**

ఏది ఏమైనా నేటికీ తెలంగాణ ప్రాంతంలో 18వ శతాబ్దం నుండి ఇప్పటి వరకు యక్షగానాలు ఏదో ఒక గ్రామంలో ఇప్పటికీ ప్రదర్శిస్తూనే ఉన్నారు. ప్రజలు ఆదరిస్తూనే ఉన్నారు. ప్రభుత్వాలు సహకరించకపోయినా వారి వారి పాత్రధారులే చాలా ఇష్టపూర్వకంగా ప్రదర్శిస్తూనే ఉన్నారు. గ్రామంలో యక్షగానాలను ‘ఆట’ అని కూడా పిలవటం కనిపిస్తుంది. జాతర సమయాల్లో ప్రత్యేకించి యక్షగానాలు, ఇప్పటికీ నిత్యం ప్రదర్శింపబడుతున్నాయి.

**ఆధార గ్రంధాలు :**

1. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర - ఎస్. వి జోగారావు
2. తెలుగు జానపద గేయ సాహిత్యం - బిరుద రాజు రామరాజు
3. యక్షగాన ప్రదర్శన రీతులు - శ్రీదేవి
4. తెలుగు వారి జానపద కళారూపాలు - మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
5. రంగారెడ్డి జిల్లా యక్షగానాలు - సమగ్ర అధ్యయనం - తలారి ఢాకన్న
6. నిజామాబాద్ జిల్లా యక్షగానాలు - సమగ్ర అధ్యయనం - డా. యన్. అరుంధతి

★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# ప్రసిద్ధ జానపద కళారూపం - హరికథ



- డా॥. రేచర్ల శ్రీలక్ష్మి
తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శృంగవరపుకోట.

**వ్యాస సంగ్రహం**

జానపద కళారూపాలు అనేవి గ్రామీణ ప్రాంతాల్లో ఉద్భవించిన కళారూపాలు. ఇవి స్థానిక ప్రజల జీవనశైలి, ఆచారాలు, సంప్రదాయాలు, మరియు వారి భావోద్వేగాలను ప్రతిబింబిస్తాయి. జానపద కళారూపాల్లో పాడటం, నాటకం, నృత్యం, వాయిద్యాలు వంటి విభాగాలు ఉంటాయి. ఈ కళారూపాలు గ్రామీణ ప్రజల సంస్కృతికి మరింత మానసిక శక్తిని ఇవ్వడమే కాకుండా వారి సమస్యలను, సంతోషాలను వ్యక్తీకరించడానికి ఒక మాధ్యమంగా నిలుస్తాయి. అటువంటి వాటిలో గాన కళారూపశీగా ప్రసిద్ధి పొందినది హరికథ.

హరికథ అన్నది తెలుగువారి సంప్రదాయ కళారూపం. హిందూమతపరమైన భక్తి కథలు, ప్రధానంగా హరి లీలలను సంగీత, సాహిత్యాల సంగమంగా చెప్పడాన్ని హరికథ అంటారు. హరికథకు తెలుగు సాహిత్యంలో చాలా ప్రాముఖ్యత ఉంది. నారదుడు మొదటి హరిదాసు అంటారు. దానిని ఒక విశిష్ట కళారూపంగా తీర్చిదిద్దిన వారు ఆదిభట్ల నారాయణ దాసు గారు. హరికథ గానం రామాయణం, భారతం, భాగవతం మొదలైన ఆధ్యాత్మిక సంబంధమైన కథల గురించి ఉంటుంది. సంపూర్ణ రామాయణం, సంపూర్ణ భారతం, భాగవతం మొదలైన కథలు వరుసగా పదిహేను రోజులూ, నెలరోజుల వరకూ గూడా సాగుతాయి. పట్టణాలలోనూ గ్రామాల్లోనూ పనులు తరుణం ఐపోయాక హరికథ కాలక్షేపం ఉండేది. అరవై దశాకాల్లో హరికథ ఎంతో ఉచ్ఛస్థితిలో ఉండేది. దేవాలయాల ఉత్సవాలలో, వినాయక చవితి, దేవి నవరాత్రుళ్ళు, శ్రీరామనవమి వంటి పర్వదినాలను పురస్కరించుకుని హరికథలు ఏర్పాటు చేసేవారు. ఆనాటి కాలాన ఆధ్యాత్మిక విషయ ప్రచారవాహికగా హరికథ విలసిల్లింది. హరికథ అనేది సర్వకళా సమాహారం. హరికథ గానం / ప్రసంగం చేసే వారిని హరిదాసులు అంటారు. హరిదాసు ఒక్కడే హరికథ చెప్తాడు. కథకుడు కేవలం అతని ప్రతిభ వల్లనే ప్రేక్షకులను హరికథతో రంజింపజేయగలడు. హరికథకుని వేషధారణ కూడా సామాన్యమే. చేతిలో చిరతలు, కాలికి గజ్జెలు, పట్టు ధోవతి పంచకట్టు, పట్టు కండువా నడుముకు కట్టి, మెడలో ఒక పూలహారం ధరించి చక్కగా తిలకం దిద్దుతాడు. హరికథ చెప్పే దాసు గారికి సాహిత్యం, సంగీతం క్షుణ్ణంగా వచ్చి తీరాలి. రామాయణ, భారత, భాగవతాదులు కరతలామలకంగా వుండాలి. కోద్దో గొప్పో నాట్యం తెలిసి వుండాలి. వీటన్నింతో పాటు సమయస్ఫూర్తి, చతురత, రక్తి కట్టించే సామర్థ్యం అవసరం. అభినవ పురాణ దైవ సంబంధ కథలు, గాథలు ప్రసంగించడం, రాత్రిపూట హరికథా గానం జరగడం, కాలక్షేపంతో పాటు ఆధ్యాత్మిక, దైవిక

చింతనతో సన్మార్గ ఆచరణకు దోహదపడటం హరికథా లక్షణాలు. హరికథా ప్రక్రియ ఇతర భారతీయ భాషల లోనూ ఉంది. తమిళుల కథాకాలక్షేపము సంగీత ప్రధాన మైనది, కన్నడ హరికథ ప్రవచనా భరితమైనది, మరాఠీ కీర్తనలు భక్తి ప్రధానమైనవి. కానీ తెలుగు హరికథ సంగీతం, సాహిత్యం, నృత్యాల మేళవింపు. హరికథ ప్రక్రియని సృజించి హరికథా పితామహ" అనే బిరుదంతో ప్రఖ్యాతిగాంచి, సంస్కృతాంధ్రాలలో అనేక రచలు చేసిన రచయిత, కవి, బహుభాషా కోవిదుడు, తాత్వికుడు, లబ్ధ ప్రతిష్టులు, తెలుగునాటనే కాక ఇతర రాష్ట్రాలలో కూడా హరికథా ప్రదర్శనలిచ్చి, ప్రజల మన్ననలను పొందిన కళాకారుడు శ్రీమత్ అజ్జాడ నారాయణ దాసు గారు, అమ్ముల విశ్వనాథ భాగవతార్, చొప్పల్లి సూర్య నారాయణ, బాలాజీదాసు, చేవూరి ఎరుకయ్య దాసు, పాణ్యం సీతారామభాగవతార్, ప్రయాగ సంగయ్య, కోడూరు భోగలింగదాసు వంటివారు సామవేదం కోటేశ్వర రావు, వడ్లమాన నరసింహదాసు, ఉమాకాంతదాసు మొదలగువారు హరికథకులుగా రాణించారు. గతంలో కేవలం పురుషుల మాత్రమే హరికథాగానం చేసేవారు. ప్రస్తుత కాలములో స్త్రీలు కూడా హరికథా గానం చేయడం పరిపాటియైనది. గొల్లపూడి కళ్యాణిలు స్త్రీలు అయినప్పటికీ హరికథకులుగా రాణించారు. మహిళా హరికథకుల్లో 14 ఏళ్ల నుంచి హరికథకే తన జీవితాన్ని అంకితం చేసిన డి. ఉమామహేశ్వరి గారు గొప్పవారు. సంస్కృతంలోనూ హరికథ చెప్పగలిగిన ఏకైక మహిళ హరికథ కళాకారిణి. హరికథకు విశేష సేవ చేసిన వారిగా తూర్పు గోదావరి జిల్లా కపిలేశ్వరం జమిందారు సత్య నారాయణ గారి కృషి గుర్తించదగినది. ఆయన, వారి తండ్రి బులుసు సర్వరాయ గారి పేరు మీద హరికథ పాఠశాలను ఏర్పాటు చేశారు. శ్రీ సర్వరాయ హరికథ గురుకులం ఎందరినో హరికథా కళాకారులుగా తీర్చిదిద్ది హరికథకు ఎనలేని సేవ చేసింది. హరికథ ఒక ప్రజాదరణ పొందిన జానపద కళారూపమే కాదు ఇది ప్రజలకు సాంస్కృతిక, విద్యా మరియు మతపరమైన విలువలను అందించడంలో సహాయపడింది.

**కీలక పదాలు**

హరికథ, జానపద కళారూపం, భక్తి కథనం, పౌరాణిక ఇతిహాసాలు, సంగీతం, గానం, నైతిక విలువలు, కథకుడు, గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయ కళలు, సాంస్కృతిక వారసత్వం, ఆధునిక ప్రభావం.

**పరిచయం**

జానపద కళారూపాలు అనేవి గ్రామీణ ప్రాంతాల్లో ఉద్భవించిన కళారూపాలు. ఇవి స్థానిక ప్రజల జీవన శైలి, ఆచారాలు, సంప్రదాయాలు, మరియు వారి భావోద్వేగాలను ప్రతిబింబిస్తాయి. జానపద కళారూపాల్లో పాడటం, నాటకం, నృత్యం, వాయిద్యాలు వంటి విభాగాలు ఉంటాయి. ఈ కళారూపాలు గ్రామీణ ప్రజల సంస్కృతికి మరింత మానసిక శక్తిని ఇవ్వడమే కాకుండా వారి సమస్యలను, సంతోషాలను వ్యక్తీకరించడానికి ఒక మాధ్యమంగా నిలుస్తాయి.అటువంటి వాటిలో గాన కళా రూపశీగా ప్రసిద్ధి పొందినది హరికథ.

హరికథ అన్నది తెలుగు వారి సంప్రదాయ కళారూపం. హిందూ మతపరమైన భక్తి కథలు, ప్రధానంగా హరిలీల లను సంగీత, సాహిత్యాల సంగమంగా చెప్పడాన్ని హరికథ అంటారు. హరికథకు తెలుగు సాహిత్యంలో చాలా ప్రాముఖ్యత ఉంది. నారదుడు మొదటి హరిదాసు అంటారు.దానిని ఒక విశిష్ట కళారూపంగా తీర్చి దిద్దినవారు ఆదిభట్ల నారాయణదాసు.

"దేవకథా కథనము లోకమున హరికథ నామముగా ప్రసిద్ధముగా ఉన్న నాట్యకళ" - (ఆదిభట్ల నారాయణ దాసు ప్రత్యేక సంచిక - ఫిబ్రవరి, 1965,పు.25) అని జమ్మలమడక మాధవరాయశర్మ నిర్వచించాడు.

తంగిరాల సుబ్రహ్మణ్యశాస్త్రి హరిని కీర్తించుటయే 'హరికథ'... 'క' బ్రహ్మము, 'థ' ఉండునది. అనగా దేనియందు బ్రహ్మ ఉండునో, దేనియందు బ్రహ్మము తెలియబడునో, దేనియందు బ్రహ్మమును పొందునో దానిని కథయందురు. దీనిని గానము చేయుటయే కథాగానము. అని నిర్వచించాడు. నాట్యకళ - (ఆదిభట్ల నారాయణదాసు ప్రత్యేక సంచిక - ఫిబ్రవరి, 1965 పు. 33,34)

ఆదిభట్ల నారాయణదాసు - "ఆస్తిక్యమును, ధర్మాధర్మములను, సర్వజనమనోరంజనముగ నృత్యగీత వాద్యములతో నుపన్యసించుట హరికథ యనబరగును. అట్టి ఉపన్యాసకుడు కథకుడనబడును. దైవభక్తియు, సత్యము, భూతదయు హరికథయందలి ముఖ్యాంశములు (నారాయణదాసు జయంతి సంచిక - ఫిబ్రవరి, 1965,పుట 5) అని వచించారు.

హరికథ గానం రామాయణం, భారతం, భాగవతం మొదలైన అధ్యాత్మిక సంబంధమైన కథల గురించి ఉంటుంది. సంపూర్ణ రామాయణం, సంపూర్ణ భారతం, భాగవతం మొదలైన కథలు వరుసగా పది హేను రోజులూ, నెలరోజుల వరకూ గూడా సాగుతాయి. పట్టణాలలోనూ గ్రామాల్లోనూ పనుల తరుణం ఐపోయాక హరికథ కాలక్షేపం ఉండేది. అరవై దశకాల్లో హరికథ ఎంతో ఉచ్ఛ స్థితిలో వుండేది. దేవాలయాల ఉత్సవాలలో, వినాయక చవితి, దేవి నవరాత్రుళ్ళు, శ్రీరామ నవమి పందిళ్ళలో, పెద్ద స్థితిమంతుల ఇళ్ళల్లో జరిగే శుభ కార్యాలలో హరికథా కాలక్షేపాలు ఉండేవి. మధ్య మధ్యలో వేసవికాలంలో కూడా గ్రామస్తులు అంతా కలసి రామాయణమో, మహా భారతమో కొన్ని రోజుల పాటు చెప్పించుకొనేవారు. సాంస్కృతిక కార్యక్రమాలు నెలనెలా నిర్వహించే గాన సభల్లో కూడా ఏడాదికి ఒకసారి అయినా హరికథ పెట్టించే వారు. "హరికథా గాన కళ ఒక ప్రభల ప్రచార సాధనంగా పేర్కొనవచ్చు" అని డి. శారద, (హరికథ ప్రక్రియ..,1994) అభిప్రాయ పడినట్లు హరికథ ఆనాటి కాలాన ఆధ్యాత్మిక విషయ ప్రచారవాహిక.హరికథ అనేది సర్వ కళాసమాహారం. హరికథ గానం/ ప్రసంగం చేసే వారిని హరిదాసులు అంటారు. హరిదాసు ఒక్కడే హరికథ చెప్తాడు. కథకుడు కేవలం అతని ప్రతిభవల్లనే ప్రేక్షకులను హరి కథతో రంజింప జేయగలడు. హరికథకుని వేషధారణ కూడా సామాన్యమే. చేతిలో చిరతలు, కాలికి గజ్జెలు, పట్టు దోవతి పంచకట్టు, పట్టు కండువా నడుముకు కట్టి, మెడలో ఒక పూల హారం ధరించి చక్కగా తిలకం దిద్దుతాడు. హరికథ చెప్పే దాసు గారికి సాహిత్యం, సంగీతం క్షుణ్ణంగా వచ్చి తీరాలి. రామాయణ, భారత, భాగవతాదులు కరతలామలకంగా వుండాలి. కొద్దో గొప్పో నాట్యం తెలిసి వుండాలి. వీటన్నితో పాటు సమయస్ఫూర్తి, చతురత, రక్తి కట్టించే సామర్థ్యం అవసరం. అభినయ కళ తెలిసివుండడం కూడా ముఖ్యం. హరి కథలు చెప్పే దాసుగారిని భాగవతార్ అని కూడా పిలుస్తారు. హరికథకి వయోలిన్, మృదంగం పక్క వాయిద్యాలు. దాసుగారు కుడిచేతిలో చిడతలు పట్టుకొని కీర్తనలు పాడేటప్పుడు తాళం వేస్తూ వుండే వారు. హరి దాసుగారు తనతో ఎప్పుడూ తీసుకు వెళ్ళేది శ్రుతి పెట్టె. హరికథా కళారూపంలో ఒకే ఒక పాత్ర ధారి మూడు గంటల కాలం కథా గానం కావిస్తాడు. హరిదాసు ఒక్కరే అన్ని పాత్రల్లోనూ జీవించి, రసవత్తరంగా నటిస్తాడు. నోటితో వాచికం చెపుతూ, మృదుమధురమైన గానం పాడుతూ, ముఖంలో సాత్వికమూ, కాలితోనృత్యమూ చేతులతో ఆంగికమూ గుప్పిస్తూ ఆకర్షణీయమైన ఆహార్యంతో ఏకకాలంలో అభినయిస్తాడు.

- పురాణ దైవ సంబంధ కథలు, గాథలు ప్రసంగించడం
- రాత్రి పూట హరికథా గానం జరగడం
- కాలక్షేపంతో పాటు ఆధ్యాత్మిక, దైవిక చింతనతో సన్మార్గ ఆచరణకు దోహదపడటం హరికథా లక్షణం.

హరికథ వేదాలనుండి పుట్టిందని కొందరు భావిస్తారు. జమ్మలమడక మాధవరాయశర్మ కథాగానము యొక్క మూలము సామగానమేనని అభిప్రాయం వెలిబుచ్చాడు. మరికొందరు లవకుశుల రామాయణ పారాయణము నుండే హరికథ ఉద్భవించిందని భావిస్తున్నారు. మరి కొందరు నారద భక్తిసూత్రము హరికథ యొక్క మూలమని భావించారు. ఇంకొందరు యక్షగానమే హరికథగా రూపాంతరం చెందిందని భావిస్తున్నారు.

హరికథల స్వరూపం వేద కాలం నాటిదనీ, సర్వజ్ఞలయిన మహర్షులు ఈ హరి కథా శిల్పాన్ని ప్రప్రథమంగా సృష్టించారనీ పండితులు నిర్ణయించారు. బ్రహ్మ మానస పుత్రుడైన నారదుడు భక్తి సూత్రాలను ఉపదేశిస్తూ హరికథా గానం చేస్తూ వుంటాడని ప్రతీతి. వేద విభజన చేసినా, అష్టాదశ పురాణాలను లిఖించినా మనశ్శాంతి పొందనేరని, శ్రీ వ్యాసునకి శ్రీ మద్భాగవతం రచించి

హరికథామృతాన్ని పంచిపెడుతూ మానవోద్ధరణ గావింపుమని నారదుడు ఆదేశించాడు. తరువాత శుకదేవుడు, శౌనకాది మహర్షులు, సూతుడూ హరికథా రూపకమైన భాగవతాన్ని భారతదేశం అంతటా ప్రచారం చేశారని పాతూరి ప్రసన్నంగారు 1965 ఫిబ్రవరి నాట్యకళ సంచికలో వివరించారు.

హరికథా ప్రక్రియ ఇతర భారతీయ భాషలలోనూ ఉంది. తమిళుల కథాకాలక్షేపము సంగీత ప్రధానమైనది, కన్నడ హరికథ ప్రవచనాభరితమైనది, మరాఠీ కీర్తనలు భక్తి ప్రధానమైనవి. కానీ తెలుగు హరికథ భక్తి, సంగీత, సాహిత్య, అభినయాల మేలుకలయిక అని తూమాటి దోణప్ప వివరించాడు. హరికి సంబంధించిన కథలేగాక, భారతరామాయణాది ఇతివృత్తాలేగాక, క్రమంగా పోతనవంటి కవులూ, త్యాగయ్యవంటి వాగ్గేయకారులూ, గాంధీమహాత్ముని వంటి నాయకుల జీవితవిశేషాలు హరికథలుగా చెలామణి కాజొచ్చాయి. సంఘశ్రేయస్సుకు, తన్మూలంగా దేశశ్రేయస్సుకు ఉపకరించేలా భక్తి ప్రాధాన్యంగా ఉండి జనతకు వినోదంతోపాటు విజ్ఞానాన్ని అందించగలదిగా ఉండడం ఎంతైనా అవసరం. ఆంధ్ర దేశంలో అన్ని జానపద రూపాలతోపాటు వర్ధిల్లి ప్రజాభిమానాన్ని చూరగొన్న కళారూపాల్లో ముఖ్యమైంది హరికథా గానం." (ఆంధ్ర నాటకరంగ చరిత్ర: 308) అని మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిగారు వచించారు. హరికథను 5వేలకు పైగా హరికథలు, హరికథపై 200 మందికి పైగా రచయితలు వ్రాసిన దాదాపు వెయ్యి పుస్తకాల వాఙ్మయము కలిగిన ఏకైక కళారూపం హరికథ.

సంగీతం, సాహిత్యం, నృత్యాల మేళవింపుతో హరికథ ప్రక్రియని సృజించి హరికథా పితామహ" అనే బిరుదంతో ప్రఖ్యాతిగాంచి,సంస్కృతాంధ్రాలలో అనేక రచనలు చేసిన రచయిత, కవి, బహుభాషా కోవిదుడు, తాత్వికుడు. తెలుగునాటనే కాక ఇతర రాష్ట్రాలలో కూడా హరికథా ప్రదర్శనలిచ్చి, ప్రజల మన్ననలను పొందిన కళాకారుడు శ్రీమత్ అజ్జాడ నారాయణ దాసు. బెంగాలీ, తమిళం, హిందూ, ఉర్దూ, ఇంగ్లీష్, అరబిక్, సంస్కృతం మరియు తెలుగు వంటి ఎనిమిది భాషలలో ప్రావీణ్యం కలిగిన భాషావేత్త. కాళిదాసు మరియు షేక్స్పియర్ రచనలపై తులనాత్మక గ్రంథం రాసిన ఏకైక సాహితీవేత్త; ఋగ్వేద సూక్తాలను తెలుగులోకి అనువదించి, వాటికి సంగీతం సమకూర్చిన ఏకైక రచయిత-సంగీతకారుడు మరియు 90 కర్ణాటక రాగాలతో కూడిన గీతామాలికను రచించిన ఏకైక రచయిత-సంగీతకారుడు. మొత్తం 72 కర్ణాటక రాగాలలో సంగీతం సమకూర్చిన సంగీత కళానిధి. విజయనగరం మహారాజు 1919లో స్థాపించిన 'శ్రీ విజయ రామ గాన పాఠశాల' అనే సంగీత, నృత్య కళాశాలకు ఆయన మొదటి ప్రధానోపాధ్యాయుడు. వాస్తవానికి, రెండు చేతులు, రెండు పాదాలు మరియు తలతో తాళం వేస్తూ ఐదు విభిన్న తాళాలలో పాడగల ఆయన సామర్థ్యానికి గాను, సంగీత ప్రపంచంలోని దిగ్గజాలు ఆయనను లయ బ్రహ్మ మరియు పంచముఖి పరమేశ్వర వంటి బిరుదులతో సత్కరించారు. ఆయన పంచముఖి రాగాన్ని ప్రదర్శించగా చూసిన మైసూరు మహారాజు శ్రీ చామరాజ వడియార్ గారు మైసూర్ ఆస్థాన విద్వాంసుడిగా సేవలందించమని కోరగా సున్నితంగా తిరస్కరించారు. హరికథా ప్రదర్శనమప్పుడు ఐదుగురు వేర్వేరు సంగీత కారులు ఆయనకు తాళం వేసేవారు. ఆయన హిందుస్థానీ భైరవి రాగాన్ని ఆలపించిన తీరుకు ఉత్తేజితుడైన రవీంద్ర నాథ్ ఠాగోర్, పశ్చిమ బెంగాల్లోని శాంతి నికేతన్లో ఉన్న విశ్వ-భారతి విశ్వవిద్యాలయంలోని తన సంగీత కళాశాలలో నారాయణ దాస్ అనుసరించిన పాఠ్య ప్రణాళికను ప్రవేశపెట్టడానికి ప్రయత్నించారు.

అమ్ముల విశ్వనాథ భాగవతార్, చొప్పల్లి సూర్య నారాయణ, బాలజీదాసు, చేవూరి ఎరుకయ్యదాసు, పాణ్యం సీతారామ భాగవతార్, ప్రయాగ సంగయ్య, కోడూరు భోగలింగదాసు వంటి వారు సామవేదం కోటేశ్వర రావు, వడ్లమాన నరసింహదాసు, ఉమాకాంతదాసు, బాలబ్రహ్మనందిదాసు, బులుసు పాటి వెంకటప్పయ్య, బెజవాడ లింగమూర్తి మొ.న వారు హరికథ కులుగా విశేష ఖ్యాతిని ఆర్జించారు.

గతంలో కేవలము పురుషులు మాత్రమే హరికథా గానం చేసేవారు. ప్రస్తుత కాలములో స్త్రీలు కూడా

హరికథ గానం చేయడము పరిపాటియైనది. వీరికి తిరుమల-తిరుపతి దేవస్థానము వారు కూడా తమ వంతు సహకారాన్నిస్తుండడముతో హరికథా కళాకారిణులు బహుముఖముగా అభివృద్ధి చెందుతున్నారు. ఉదా.. కాళ్ళ నిర్మల, గొల్లపూడి కళ్యాణిలు స్త్రీలు అయినప్పటికీ హరి కథకులుగా రాణించారు. మహిళా హరికథకుల్లో 14 ఏళ్ల నుంచి హరికథకే తన జీవితాన్ని అంకితం చేసిన డి. ఉమామహేశ్వరి గారు గొప్ప వారు, సంస్కృతంలోనూ హరికథ చెప్పగలిగిన ఏకైక మహిళ హరికథ కళాకారిణి. వీరు రాష్ట్రపతి చేతుల మీదుగా సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని పొందారు. వేములవాడ దేవస్థానంలో 30 ఏళ్ల పాటు నాదస్వర వాదన చేసిన లాలాజీ రావు గారి కూతురు. హార్వార్డ్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ వేదిక్ కాన్ఫరెన్స్లో సంస్కృత హరికథ చెప్పి హరికథ ను అంతర్జా తీయ స్థాయికి తీసుకువెళ్లారు. హరికథకు విశేష సేవ చేసిన వారిగా తూర్పుగోదావరి జిల్లా కపిలేశ్వరం జమీం దారు సత్యనారాయణ గారి కృషి గుర్తించదగినది. ఆయన వారి తండ్రి బులుసు సర్వరాయ గారి పేరు మీద ఒక నాట్య శాల ఏర్పాటు చేయదలచుగా నటరాజ రామకృష్ణ గారు అంతరించిపోతున్న హరికథ పాఠశాలను ఏర్పాటు చేయమని కోరగా రామకృష్ణ గారి కోరికపై శ్రీ సర్వరాయ హరికథ గురుకులాన్ని స్థాపించారు. ఎందరో హరికథా కళాకారులు ఇక్కడ హరికథను అభ్యసించిన వారు ఉన్నారు. ఉమా మహేశ్వరి గారు ఈ గురుకులం ముద్దు బిడ్డనే. చాగంటి శేషయ్య గారి రాధా మాధవం,ఆంధ్ర కవితరంగిణి, సుగ్రీవ విజయం ముద్రింపజేసిన సర్వా రాయ గారు ఈ సత్యనారాయణ గారి తండ్రి గారే. సత్య నారాయణ గారు హరికథా గురుకులాన్ని కపిలేశ్వరంలో స్థాపించి అంతరించిపోతున్న హరికథను విశ్వవ్యాప్తం చేయడానికి ఎంతో కృషి చేశారు. ఆ గురుకులంలో అభ్యసించిన కళాకారులు ఎందరో ఇప్పటికీ హరికథ ఉనికిలో, వ్యాప్తి లో తమదైన ముద్ర ను వేస్తున్నారు.

**ముగింపు :**

హరికథ ఒక ప్రజాదరణ పొందిన జానపద కళా రూపమే కాదు ఇది ప్రజలకు సాంస్కృతిక, విద్యా మరియు మతపరమైన విలువలను అందించడంలో సహాయ పడింది. ప్రజల మనస్సులలో సత్యం మరియు ధర్మాన్ని నింపడం, వారిలో భక్తి బీజాలను నాటడం, చైతన్య పరచడం, ఆత్మ జ్ఞాన దిశగా ఆలోచన పురికొల్పడం వంటి అంశాల మేళవింపుగా భాసిల్లింది.

**ఉపయుక్త గ్రంథ సూచి :**


1. ఆదిభట్ల నారాయణ దాసు జయంతి సంచిక, 1965
2. ఆదిభట్ల నారాయణ దాసు ప్రత్యేక సంచిక, 1965
3. డా.డి.శారద - హరికథా ప్రక్రియ సామాజిక ప్రయోజనాలు: శ్రీ వెంకటేశ్వర పబ్లికేషన్స్, భీమవరం:1994
4. తుమాటి దోణప్ప - తెలుగు హరికథా సర్వస్వం- తెలుగు అకాడమీ,హైదరాబాద్:1976
5. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి - తెలుగు వారి జానపద కళా రూపాలు, నాగార్జున ఎంటర్ ప్రైజెస్, 1965


★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# తోలుబొమ్మలాట కళారూపం - కళాకారుల జీవన పరిస్థితులు



- డా॥. పి. హరిత

అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్.


## వ్యాస సంగ్రహం

ఈ వ్యాసంలో తోలుబొమ్మలాట అనే ప్రాచీన జానపద కళారూపాన్ని సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక కోణాల్లో సమగ్రంగా విశ్లేషించబడింది. ఈ కళారూపం భారతీయ జానపద సంప్రదాయాలలో ఒక ముఖ్యమైన భాగంగా నిలిచి, పౌరాణిక కథలను ప్రజలకు చేరవేసే సాధనంగా పనిచేసింది. వ్యాసంలో తోలు బొమ్మలాట ఉద్భవం, నిర్మాణం, ప్రదర్శన విధానం, సంగీతం, పాత్రల ప్రతీకాత్మకత వంటి అంశాలను వివరంగా పరిశీలించ బడింది. అలాగే, ఈ కళారూపాన్ని కొనసాగిస్తున్న కళా కారుల జీవన స్థితిని గతం మరియు వర్తమానం అనే రెండు దశల్లో విశ్లేషించి, వారి ఆర్థిక, సామాజిక సమస్య లను వివరించబడింది. ఆధునిక మీడియా ప్రభావం, గ్లోబలైజేషన్, తరాల మధ్య వ్యత్యాసం వంటి అంశాలు ఈ కళపై ఎలా ప్రభావం చూపుతున్నాయో పరిశీలించ బడింది. చివరగా, తోలు బొమ్మలాట పునరుజ్జీవనానికి అవసరమైన వ్యూహాలు, ప్రభుత్వ విధానాలు, సమాజ పాత్ర వంటి అంశాలను సూచిస్తూ, ఈ కళారూపాన్ని భవిష్యత్తు తరాలకు పరిరక్షించాల్సిన అవసరాన్ని స్పష్టం చేయబడింది.



**కీలక పదాలు**

తోలు బొమ్మలాట, జానపద కళ, నీడల నాటకం, కళాకారుల జీవన స్థితి, సాంస్కృతిక వారసత్వం, సామాజిక విశ్లేషణ, ఆర్థిక సమస్యలు, గ్లోబలైజేషన్ ప్రభావం, పునరుజ్జీవన వ్యూహాలు, జానపద సంస్కృతి.


## పరిచయం

చిత్రం, సంగీతం, నాట్యం, సాహిత్యాలతో కూడిన ప్రాచీన జానపద కళారూపం తోలు బొమ్మలాట. మానవుడు తన మేధస్సుతో సృష్టించుకున్న తొలి దృశ్య కావ్యం తోలుబొమ్మలాట. తోలుబొమ్మలాట అనేది తెలుగు ప్రాంతాలలో ప్రసిద్ధి చెందిన తోలు బొమ్మలతో చేసే నీడల నాటకం. ఇది భారతదేశంలో అత్యంత ప్రాచీన జానపద కళారూపాలలో ఒకటి. ముఖ్యంగా రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలను గ్రామీణ ప్రజలకు వినోదాత్మకంగా, ప్రబోధాత్మకంగా అందించడానికి ఉపయోగపడుతుంది. ఇది అతి ప్రాచీన జానపద కళగా భావించబడుతుంది. హరికథలు, బుర్రకథలు రాక ముందే పల్లెల్లో వినోదం అందించింది. తను స్వయంగా అనుకరించలేని జనపదులు కావ్యాల్లోనూ, పురాణాల్లోనూ వర్ణించబడిన పాత్రల ఆహార్య విశేషాలను స్వయంగా సృష్టించుకున్నాడు. తన భాషతో ఆ మూగ చిత్రాలకు ప్రాణం పోశారు. రకరకాల విన్యాసాలను వాటి చేత చేయించారు.తాను స్వయంగా వెనుక నుండి ఈ పాత్రలను కదిలించారు. కదులుతున్న ఆ

జీవము లేని బొమ్మలతో జీవన బద్ధమైన ఒక దృశ్యాన్ని ప్రదర్శించడంలోనే జానపదం దాగి ఉంది.

ఈ కళ శాతవాహన, పల్లవ, చాళుక్య, కాకతీయ రాజుల ఆదరణను పొంది తంజావూరు రాజుల కాలంలో ఉన్నత దశకు చేరుకొని, విదేశాలకు వెళ్ళిన భారతీయులతో పాటు ఆగ్నేసియాలోకి ప్రవేశించింది. నేటి ఇండోనేషియా, జావా ద్వీపల్లోని తోలుబొమ్మలాటలకు మాతృక తెలుగువారి బొమ్మలాటలే అనేది చరిత్రకారుల అభిప్రాయం. తోలు బొమ్మలాట అనేది కేవలం వినోద కళ మాత్రమే కాదు, ఇది ఒక సాంస్కృతిక సంభాషణా మాధ్యమం. గ్రామీణ సమాజంలో ఇది జ్ఞానం, ధర్మం, నైతిక విలువలను తరతరాలకు అందించిన సాధనంగా నిలిచింది.

## పూర్వ పరిశోధనలు

ఆచార్య యస్వీ. జోగారావుగారు తన ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర అనే పిఎచ్.డి. గ్రంధంలో బొమ్మలాట, యక్షగానాల పూర్వాపరాలు చర్చించారు. ఆచార్య తూమాటి దొణప్పగారు తెలుగు విజ్ఞాన సర్వస్వంలో బొమ్మలాట పైన ఒక వ్యాసం రాశారు. డాక్టర్ నేలటూరి వెంకట రమణయ్య గారు తమ మధుర - తంజావూరు నాయకరాజుల నాటి ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో బొమ్మలాట ప్రదర్శనపై సవిమర్శక ప్రతిపాదనలు చేశారు. డా. యం. కృష్ణమాచార్యులుగారు వారి సంస్కృత వాఙ్మయ చరిత్రలో బొమ్మ లాట గురించి ప్రస్తావించారు. ఆంధ్ర పత్రికలో మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు జావా ద్వీపవాసులు వినోదాలు అనే పేరుతో వాయింగ్ ఆటలు అనే వ్యాసం రాశారు. జావాలోని ఈ వాయింగ్ ఆటకు బొమ్మలాట అని అర్థం.

డా. బిట్టు వెంకటేశ్వర్లు తెలుగునాట బొమ్మలాటను గూర్చి, ఆచార్య మొదలి నాగభూషణశర్మ గారు ఇంగ్లీషులో తోలుబొమ్మలాట అనే పేరుతో ఒక పుస్తకం రాశారు. దాన్ని కేంద్ర సంగీత నాటక అకాడమీవారు ప్రచురించారు.బొమ్మలాటపై విశేష కృషి జరిపిన యం.వి. రమణమూర్తిగారు తోలు బొమ్మలాటలపై నాట్యకళ అనే మాసపత్రికలో అనేక వ్యాసాలను ప్రకటించారు. ఇంకా మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిగారు, వేలూరు రామ లింగారెడ్డి గారు, ఎల్లోరా గారు, సి.ఆర్. ఆచార్య గారు, శ్రీ కూర్మా వేణుగోపాలస్వామి గారు నాట్యకళ మాస పత్రికలో వ్యాసాల్ని ప్రచురించారు.

## తోలు బొమ్మలాట అర్థం

తోలు బొమ్మలాట అనేది ఒక ప్రాచీన జానపద కళారూపం. ఇందులో తోలుతో (జంతువుల చర్మంతో) తయారు చేసిన బొమ్మలను వెలుతురు సహాయంతో తెరపై నీడల రూపంలో కదిలిస్తూ కథలు చెప్పడం జరుగుతుంది.

## తోలు బొమ్మలు - చారిత్రక నేపథ్యం

మహారాష్ట్ర ప్రాంతంలో ఒక దుర్మార్గుడైన రాజుతో ఏర్పడిన శత్రుత్వం వల్ల కొందరు అడవుల్లోకి పారిపోయి అజ్ఞాతంగా జీవిస్తుంటారు. వారికి ఆహారం దొరకనందున జంతువులను చంపి తినడం తప్పనిసరైంది. క్రమంగా అడవులలో, అడవులను ఆనుకొని ఉన్న మానవ సమాజాలతో వీరి పరిచయాలు ఏర్పడిన తర్వాత రాజు దుర్మార్గాలను, దురాగతాలను వారికి చెప్పేవారు. అయితే పాటలు, మాటలే కాకుండా రాజు నిజరూపం కళ్ళకు కట్టినట్టు చూపించాలంటే, అప్పటివరకు జంతువుల తోళ్ళను పారవేస్తున్న వీరు వాటితో బొమ్మలను తయారు చేయాలనే ఆలోచనకు వచ్చారు. ఆ విధంగా తోలు బొమ్మలాటకు రూపకల్పన జరిగిందని, దీనిద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి, దుర్మార్గుడైన రాజును ఓడించారనే ఈ కథ ప్రచారంలో ఉంది.

## తెలుగు సాహిత్యంలో తోలు బొమ్మలాట ప్రస్తావన

భారతాది కథల జీరమరిగి- నారంగ బొమ్మల
నాడించువారు
గడు నద్భుతంబుగ గంబ సూత్రంబు- నడరంగ
బొమ్మల నాడించువారు.

అని పాల్కూరికి సోమనాథుడు తన పండితారాధ్య చరిత్రలో పేర్కొన్నారు. శ్రీనాథుడు పల్నాటి వీర చరిత్రలో ప్రతిమలాడగా బట్టిన యట్లు అని వివరించారు.నాచన సోమన ఉత్తర హరివంశంలో

"యంత్రకుడాడించు యవని ద్రోచిన వ్రాలు
బొమ్మలగతి రథ పూగములును" అని యుద్ధ భూమిని వర్ణించినప్పుడు బొమ్మలాటల ప్రసక్తి చేశాడు.

"ఇంచుక నేర్పు చాలక విహీనత జెందిన నా కవిత్వమున్
మించు వహించె నీ కతన మిక్కిలి యెట్లన తోలుబొమ్మలన్
మంచి వివేకమని తెరమాటున నుండి ప్రశస్తి రీతి నా
డించిన నాడదే? జనుల డెందము నింపవే ప్రీతి భాస్కరా"

అని భాస్కరుడు తన రచనను తోలుబొమ్మల ఆటలతో పోల్చి చెప్పాడు.

"మదనుడను బొమ్మలాటగాఁడ దనెఱింగి
రాజునెదుటికిఁ దెరలోన రహిఁ జెలంగు
మెచ్చు బంగారు ప్రతిమను దెచ్చెననఁగ
వచ్చె బెండ్లి కుమారి చెల్వంబు మీఱి" అంటూ కుమార ధూర్జటి కృష్ణరాయ విజయంలో "బొమ్మలాట గాడు" అనేపద ప్రయోగం చేశారు.

"బొమ్మలాట వాడు బొమ్మలనాడించు
భువిని జనులు చూడ పొరుపు మీర
తాను మరిగియుండు దైవమాడించురా
విశ్వదాభిరామ వినురవేమ" అని వేమన భగవంతుని సూత్రధారునితో పోల్చారు.

**తోలు బొమ్మల తయారీ – శిల్పకళా విశ్లేషణ**

తోలు బొమ్మలాటలో బొమ్మల తయారీ ఒక ముఖ్యమైన శిల్పకళ. ఇది కేవలం వస్తువు తయారీ కాకుండా, కళాత్మక నైపుణ్యం, సాంప్రదాయ జ్ఞానం, సృజనాత్మకత కలయికగా నిలుస్తుంది. ఈ ప్రక్రియలో శిల్పి తన కళాత్మక ప్రతిభను ప్రతిబింబిస్తూ, పాత్రలకు జీవం పోస్తాడు.

తోలుబొమ్మలు తయారీ చాలా శ్రమతో కూడుకున్న పని. వీటి తయారీకి జింక, లేడి లేదా దుప్పి, మేక మొదలైన మూడు రకాల జంతువుల తోళ్ళను వాడతారు. చైనాలో గాడిద చర్మంతోను, గ్రీకుదేశంలో ఒంటె చర్మంతోను తోలుబొమ్మలను తయారు చేస్తారు. పచ్చితోళ్ళను పరిమితమైన వేడి నీటిలో నానబెట్టి బండమీద లేదా చదునైన చాపమీద పరచి తోలుపై ఉన్న వెంట్రుకలను తొలగిస్తారు. ఆ తర్వాత తోలుకు మిగిలి ఉన్న పల్చటి చర్మపు పొరను పదునైన కత్తి సహాయంతో తీసివేసి మరోసారి వేడినీటిలో వేసి ఉప్పుతో శుభ్రపరుస్తారు. శుభ్రపరిచిన తోలును మేకుల సహాయంతో చతురస్రాకారపు చెక్కకు బిగించి ఆరవేస్తారు. ఈవిధంగా చేయడం వల్ల మిగిలిన కొద్దిపాటి నలకలు ఉంటే అవి పోతాయి. ఇన్ని దశల్లో శుభ్రపరచిన తోలు పలచని పొరగా, పారదర్శకంగా తయారై దీపపుకాంతి ప్రసరించే విధంగా అవుతుంది.

జింక చర్మాలను దేవతలు, పౌరాణిక కథానాయకుల లాంటి ముఖ్యమయిన పాత్రల బొమ్మలని తయారు చెయ్యడంలో ఉపయోగిస్తారు. లేడి చర్మం బాగా మన్నిక గలది కనుక వీటిని భీముడు, రావణుడు లాంటి యోధుల బొమ్మలని తయరు చెయ్యడానికి ఉపయోగిస్తారు. రాక్షస పాత్రలకు, దుష్టపాత్రులకు, హాస్య పాత్రల వంటి మిగిలిన బొమ్మల కోసం సులభంగా దొరికే గొర్రె చర్మాన్ని ఉపయోగిస్తారు. సాధారణంగా ఒక్కొక్క బొమ్మ తయారు చెయ్యడానికి ఒక చర్మం సరిపోతుంది. కానీ రావణుడు వంటి కొన్ని బొమ్మల తయారు చెయ్యడానికి ఎక్కువ చర్మం అవసరమవుతుంది. రావణుడి బొమ్మని తయారు చెయ్యడానికి కనీసం నాలుగు చర్మాలు అవసరమౌతాయి. శరీరం కోసం ఒక చర్మం, కాళ్ళకోసం ఒక చర్మం, రెండు జతల చేతుల (ఒక్కొక్కటి ఐదు చేతులు) కోసం రెండు చర్మాలు. ఎంపికచేసుకున్న బొమ్మలకు రేఖాచిత్రాల ఆధారంగా ప్రకృతిసిద్ధమైన కరక్కాయ, చింతగింజల పొడి, అన్నభేది మొదలైన రంగులచే తోలుబొమ్మలకు ఇరువైపుల రంగులు వేస్తారు. రంగుల్ని అద్ద టంలో కూడా పాత్ర ఔచిత్యాన్ని బట్టి రంగుల్ని చిత్రిస్తారు. ప్రథమ, మధ్యమ, ఉత్తమ పురుష లక్షణాల తోనూ, పద్మిని, శంకిని మొదలైన నాయకి, నాయకులకు ఉండే బేధాలను రంగుల్లో చిత్రిస్తారు. ప్రస్తుతం ఆధునికులు పారదర్శకమైన రంగులను ఉపయోగిస్తున్నారు.

రంగులతో సిద్ధమైన తోలుబొమ్మలు తల, మొండెము కలసి ఒక భాగంగాను, చేయిని మూడు భాగాలుగాను, కాలును రెండు భాగాలుగాను తీర్చిదిద్ది అన్నింటిని ఒక దగ్గరకు చేర్చి సూత్రం (దారం) ద్వారా కలుపుతారు. అదేవిధంగా ఈ బొమ్మలను ఆడించడానికి వీలుగా బొమ్మకు నిలువుగా ఒక ఈతబద్దను పైనుండి క్రింద వరకు అమర్చి రెండుకాళ్ళ మధ్యభాగంలో పిడికెడు బద్దను వదులుతారు. ఈవిధంగా వదిలిన బద్దను పట్టుకుని ఆడిస్తారు. ప్రదర్శనకు కావలసిన పరికరాలను, మిగిలిన రథాలు, గుర్రాలు, అంబులు, బాణాలు, గదలు, ఈటలు, సైన్యం మొదలైన వాటిని కూడా తయారు చేసుకుంటారు. ఇవి 20 సంవత్సరాల వరకు చెక్కుచెదరకుండా ఉంటాయి.

**రంగస్థలం - ప్రదర్శన రీతులు**

ఈ బొమ్మలాట ప్రదర్శకులు సంచార జీవులు ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి ప్రయాణం చేస్తూ ఉంటారు. తోలుబొమ్మలు ప్రదర్శించే గ్రామానికి వెళ్లి పెద్దల్ని కలిసి వారి సహకారంతో అందరూ కూర్చోవడానికి అణువుగా ఉన్న విశాలమైన స్థలం ఉన్న ప్రదేశంలో రంగస్థలం నిర్మించుకుంటారు. కళాకారులు రంగస్థలాన్ని నైపుణ్యంగా చతురస్రాకారంలో నిర్మించుకుంటారు. బహిరంగ స్థలంలో పందిరి ప్రారంభించి మూడు ప్రక్కల మూయబడి ఒక ప్రక్కన తెర కట్టడానికి వీలుగా పందిరి వేస్తారు. ఈ పందిరి కొంచెం ముందుకు వాలి ఉండేటట్లు కడతారు. ఇలా కట్టడం వల్ల వారు ఆడించే బొమ్మలు జారిపోకుండా ఉంటాయి. పందిరి లోపలి భాగంలో వారి మొత్తం సామాగ్రి పిల్లలు, భార్యలు సంసారమంతా అందులోనే ఉంటారు. ఆముదపు దీపాలను మరియు పెట్రోమాక్స్ లైట్లను వాడతారు. ప్రస్తుతం కరెంట్ బల్బులు వాడుతున్నారు.

**తోలు బొమ్మలాట - ఇతివృత్తం**

ముఖ్యంగా వీరు ప్రదర్శించే కథ భారత రామాయణ గాథలకు సంబంధించినవి. రామాయణంలో శ్రీరామ జననం, ఆంజనేయ జననం, తాటక సంహారం, సీతారామ కళ్యాణం, కిష్కింద కాండ, సుందరకాండ, లంకా దహనం, లక్ష్మణ మూర్ఛ రామాయణ యుద్ధం, లవకుశ మొదలైనవి. భారతంలో శశిరేఖ పరిణయం, ఉత్తర గోగ్రహణం, దక్షిణ గోగ్రహణం, కీచక వధ, భీష్మ, ద్రోణ, కర్ణ పర్వాలు మొదలైనవి ప్రదర్శిస్తారు. భాగవతంలో గజేంద్రమోక్షం, భక్త ప్రహ్లాద చరిత్ర,మైరావణ చరిత్ర, ఇంద్రజిత్తు వద, రంగనాథ రామాయణం మొదలైనవే కాక, దేశీయ కథలైన దేశింగు రాజు కథ, పల్నాటి వీర చరిత్ర, కుమార రాముని కథ మొదలైనవి తీసుకొని ప్రదర్శిస్తారు.

**తోలుబొమ్మలాటలో పాత్రలు**

తోలుబొమ్మలాట అంటే చాలు కేతిగాడు, బంగారక్క, జుట్టు పోలిగాడు వంటి హాస్యపాత్రలు ప్రధానంగా వస్తాయి. ఈ పాత్రలు గ్రామీణుల మనస్సులపై విశేషా దరణ చూపాయి. తోలుబొమ్మలాటలో ప్రధాన కథకు ఎంత ప్రాముఖ్యతవుండేదో, ఈ హాస్యపాత్రలకు అంతే ప్రాధాన్యత ఉండేది. ఈ పాత్రలను సామాజిక స్థితిగతు లకు దర్పణంగా నిలిపి, పాత్రల ద్వారా సమాజంలో ఉండే దురాచారాలను, మూఢనమ్మకాలను ఎండగట్టే వారు. ఇందులో సామెతలు, లోకోక్తులు, పొడుపులు, నీతికథలు మొదలైనవి చోటు చేసుకుంటాయి. అదేవిధంగా అభినయాలకు స్వభావానుగుణంగా తేల్చ డానికి వాద్యాలు కూడా ప్రధాన భూమికను నిర్వ హిస్తాయి. వాద్యానికి సంబంధించి హార్మోనియం, తాళాలు, తొక్కుడుబిల్ల, మద్దెల, డప్పు, గజ్జెలు వంటివి ఉంటాయి. తోలుబొమ్మల ప్రదర్శనలో రామాయణం, భారతంలకు సంబంధించిన కథా వస్తువులు ఉంటాయి. లంకా దహనం, సతీసులోచన, యయాతి, అంగద రాయబారం, మైరావణవధ, విరాటపర్వం పద్యవ్యూహం, ఉత్తరగోగ్రహణం వంటి కథలతో తోలు బొమ్మలను ప్రదర్శిస్తారు.

**సూత్రధారుడు**

నాటకానికి, సినిమాకు దర్శకునిలాగా తోలుబొమ్మ లాటకు సూత్రధారి ప్రధాన బాధ్యత తీసుకొంటాడు. అతను చాలా విషయాలలో ప్రజ్ఞాశాలి కూడా అయి ఉంటాడు. మిగిలిన వారందరూ అతనిని అనుసరిస్తూ

ఉంటారు. సూత్రధారుడు కథను చాలా వివరంగానూ, చాకచక్యంగానూ చెబుతుంటాడు. అవసరమైనంతవరకు అర్థాలను విడమరచి వివరిస్తాడు. పాత్రల ఔచిత్యాను సారం గొంతు మారుస్తుంటాడు. ప్రేక్షకుల ఆదరణను, విసుగును గమనిస్తూ, సమయానుకూలంగా మార్పులు చేస్తాడు. ఇతర పాత్రలను ప్రవేశపెడతాడు.

**జుట్టు పోలిగాడు, బంగారక్క**

ఈ రెండు పాత్రలూ తమ హాస్యం ద్వారా ఇంత పొడవాటి ప్రదర్శనలో ప్రేక్షకులను నవ్విస్తూ నిద్రమత్తు వదలగొడుతూ ఉంటాయి. మధ్యమధ్యలో వారి విసుర్లు, పనులు సమాజంలో దురాగతాలను ఎండగడుతూ ఉంటాయి.ఎక్కువగా బంగారక్క గడసరి పెళ్ళాంగా ఉంటుంది. పోలిగాడితో కయ్యానికి దిగుతుంది, మోటు సరసమాడుతుంది.

**అల్లాటప్పగాడు, కేతిగాడు**

పోలిగాడు తెరమీదనుండి తప్పుకున్నపుడు అల్లాటప్ప గాడు ప్రత్యక్షమై బంగారక్కకు లైను వేస్తుంటాడు. వారిద్దరూ మంచి రసపట్టులో ఉన్నపుడు హఠాత్తుగా కేతిగాడు వూడిపడతాడు. అన్నిబొమ్మలకంటే కేతిగాని బొమ్మ చిన్నది. పానకంలా పుడకలా తెరపై ఎక్కడో ఒకచోట ప్రత్యక్షమై శృంగారఘట్టంలో ఉన్న అల్లాటప్ప గాడిని టకీమని ఒకదెబ్బ కొడతాడు కేతిగాడు. వెంటనే అంతర్ధానమౌతాడు అల్లాటప్పగాడు. ఇక కేతిగాడు బంగారక్కను ను ఏడిపిస్తాడు. ఈ విధంగా ఈ రెండు పాత్రలు ఈ ఆటకు ఎంతో చక్కటి వన్నె తీసుకొస్తాయి.

**తెలంగాణలో తోలుబొమ్మలాటలు**

ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని జాతరలు, ఆలయ ఉత్సవాలు మరియు శివరాత్రి వంటి పండుగల సమయంలో ప్రదర్శిస్తారు. ముఖ్యంగా తాండూర్ పరిసర ప్రాంతాలు మరియు నల్గొండ జిల్లాలోని కొన్ని గ్రామాల్లో ఈ కళారూపం ఇప్పటికీ సజీవంగా ఉంది.కళాకారులు తరచుగా రాత్రి సమయాల్లో తెరపై దీపాల వెలుగులో రామాయణ, మహాభారత కథలను ప్రదర్శిస్తారు. తాండూరు (వికారాబాద్ జిల్లా), నల్గొండ జిల్లాలోని గ్రామాలు మరియు కొన్ని దక్షిణ తెలంగాణ జిల్లాల్లో ఈ ప్రదర్శనలు ఎక్కువగా కనిపిస్తాయి. గ్రామ దేవతల జాతరలు, శివరాత్రి పండుగ, మరియు ఇతర పల్లె పండుగలలో తోలుబొమ్మలాట, అంటే 'బొమ్మలాటల వాళ్లు' ప్రదర్శిస్తారు.ఈ ప్రాచీన కళారూపాన్ని ముఖ్యంగా ఆరె కాపు కులానికి చెందినవారు, వంశ పారంపర్యంగా వస్తున్న వారసత్వ కళగా ప్రదర్శిస్తున్నారు.

**తోలుబొమ్మలాట - చలనచిత్రాలు**

తోలుబొమ్మలాట మరియు చలనచిత్రాలు (సినిమా) రెండు వేర్వేరు కాలాలకు చెందిన దృశ్య కళారూపాలు అయినప్పటికీ, వీటిలో ఒక అంతర్గత సంబంధం ఉంది. రెండింటి ప్రధాన లక్ష్యం ప్రేక్షకులకు కథను దృశ్య రూపంలో అందించడం. తోలుబొమ్మలాటలో నీడల ద్వారా కథ చెప్పబడితే, చలనచిత్రాలలో కెమెరా మరియు తెర ద్వారా కథ ప్రదర్శించబడుతుంది. సినిమా అనేది 19వ శతాబ్దం చివరలో అభివృద్ధి చెందిన ఆధునిక కళారూపం. ఇది కెమెరా, ఫిల్మ్ రికార్డింగ్, ప్రొజెక్షన్ టెక్నాలజీ సహాయంతో కథలను ప్రదర్శిస్తుంది. రెండింటి లోనూ కథను చూపించడం ప్రధాన లక్ష్యం. తోలు బొమ్మలులో బొమ్మల రూపంలో పాత్రలు ప్రదర్శిస్తే సినిమాలో నటుల రూపంలో పాత్రలు ప్రదర్శిస్తారు. తోలుబొమ్మలాటలో నీడల కోసం వెలుతురును ఉపయోగిస్తే సినిమా చిత్రీకరణలో ప్రొజెక్షన్ కోసం కాంతిని ఉపయోగిస్తారు.

తోలుబొమ్మలాట కథ చెప్పే విధానాన్ని ప్రభావితం చేసింది. పాత్రల నిర్మాణానికి ప్రేరణ ఇచ్చింది. విజువల్ ఎఫెక్ట్స్‌కు మూలంగా నిలిచింది. కొన్ని సినిమాలలో నీడల వినియోగం, యానిమేషన్ రూపకల్పన తోలుబొమ్మల శైలిని గుర్తు చేస్తాయి. శంకరాభరణం, భారతీయుడు, స్వాతిముత్యం చిత్రాలలో భారతీయ సంప్రదాయ కళలకు ప్రాధాన్యం ఉంది. కొన్ని సందర్భాల్లో జానపద కళల ప్రస్తావనతో పాటు నీడల నాటక శైలిని సూచించే అంశాలు, గ్రామీణ జీవన విధానం, సంప్రదాయ కళలు ప్రతిబింబించబడినాయిజానపద కళల నేపథ్యంతో తోలుబొమ్మలాటకు సంబంధించిన సూచనలు కనిపిస్తాయి. గ్రామీణ సంస్కృతి, కళల పరిరక్షణపై దృష్టి

జానపద కళల ప్రాధాన్యాన్ని చూపించే సన్నివేశాలు ఉన్నాయి. బాహుబలి ది బిగినింగ్ ప్రారంభ టైటిల్స్‌లో అనిమేషన్ రూపంలో నీడల శైలిని ఉపయోగించారు. తోలుబొమ్మలు మరియు చలనచిత్రాలు కాల పరిమాణంలో వేర్వేరు అయినప్పటికీ, వాటి లక్ష్యం ఒకటే కథను దృశ్యరూపంలో చెప్పడం. తోలుబొమ్మలాట వంటి సంప్రదాయ కళలు లేకపోతే, సినిమా వంటి ఆధునిక కళారూపాల అభివృద్ధి అంత సులభం కాకపోయేది.

**జీవన పరిస్థితులు**

గతంలో కళాకారులు గౌరవప్రదమైన స్థానం పొందే వారు, ఆర్థికంగా స్థిరంగా ఉండేవారు. సమాజంలో ప్రాధాన్యం కలిగి ఉండేవారు. ప్రస్తుత జీవన పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఆదాయం తగ్గింది.ప్రదర్శనలు తగ్గాయి. జీవన స్థాయి పడిపోయింది. స్థిరమైన ఆదాయం లేకపోవడం, కళకు మార్కెట్ లేకపోవడం, ప్రభుత్వ సహాయం తక్కువగా ఉండటం వల్ల ఆర్థికంగా సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రజల అభిరుచులు మారాయి. జానపద కళలపై ఆసక్తి తగ్గింది. యువత ఈ కళను కొనసాగించడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో ఈ కళ అంతరించిపోవడానికి ప్రమాదం ఉంది. కొన్ని పథకాలు ఉన్నప్పటికీ సరైన అమలు లేదు. కళాకారులకు పూర్తిగా లాభం చేరడం లేదు. ఈ కళను పాఠశాలల్లో ప్రవేశపెట్టాలి. డిజిటల్ ప్రమోషన్ చేయాలి. కళాకారులకు ఆర్థిక సహాయం అందించాలి. పండుగల్లో ప్రదర్శనలు పెంచాలి.

**ముగింపు**

తోలుబొమ్మలాట భారతీయ జానపద సంస్కృతిలో ఒక అపూర్వమైన కళారూపం. ఇది కేవలం వినోదానికి పరిమితమైనది కాకుండా, సమాజానికి నైతిక విలువలు, సాంస్కృతిక అవగాహన మరియు చరిత్రను అందించే శక్తివంతమైన మాధ్యమంగా నిలిచింది. పురాతన కాలంలో రాజుల ఆదరణతో వికసించిన ఈ కళ, కాలక్రమేణా ఆధునికీకరణ, గ్లోబలైజేషన్ ప్రభావాలతో క్రమంగా పతన దశను చేరుకుంది. ప్రస్తుతం తోలుబొమ్మలాట కళా కారులు అనేక ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కొం టున్నారు. ప్రదర్శనల కొరత, ఆదాయ లోపం, ప్రభుత్వ సహాయం సరైన స్థాయిలో అందకపోవడం, యువతలో ఆసక్తి తగ్గడం వంటి అంశాలు ఈ కళారూపం భవిష్యత్తుకు సవాలుగా మారాయి. ఒకప్పుడు గౌరవప్రదమైన స్థానం పొందిన ఈ కళాకారులు నేడు జీవనోపాధి కోసం ఇతర మార్గాలను అన్వేషించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, ఈ కళ అంతరించిపోకుండా కాపాడటం సమాజం, ప్రభుత్వం మరియు విద్యా వ్యవస్థల సమిష్టి బాధ్యత. పాఠశాల స్థాయిలోనే జానపద కళలపై అవగాహన కల్పించడం, డిజిటల్ మీడియా ద్వారా ప్రాచుర్యం పెంచడం, పండుగలు మరియు సాంస్కృతిక కార్యక్రమా లలో ప్రాధాన్యం ఇవ్వడం, కళాకారులకు ఆర్థిక సహాయం మరియు ప్రోత్సాహకాలు అందించడం వంటి చర్యలు తీసుకుంటే ఈ కళ పునరుజ్జీవనం పొందే అవకాశం ఉంది. తోలుబొమ్మలాట మన సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన అమూల్యమైన సంపద. ఈ కళను సంరక్షించడం ద్వారా మన సంస్కృతిని, సంప్రదాయాలను భావితరాలకు అందించగలుగుతాము. కళాకారుల జీవన స్థితిని మెరుగుపరచడం ద్వారా మాత్రమే ఈ ప్రాచీన కళారూపం చిరస్థాయిగా నిలుస్తుంది.

**ఆధార గ్రంథాలు**


1. పండితారాధ్య చరిత్ర- పాల్కురికి సోమనాథుడు
2. తెలుగు వారి జానపద కళారూపాలు మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
3. ఆంధ్రుల తోలుబొమ్మలాట- డాక్టర్ బిట్టు వెంకటేశ్వర్లు
4. జానపద కళారూపాల్లో వృత్తి పురాణాలు- ప్రొఫెసర్ ననుమాస స్వామి.
5. జానపద నాటకాలు- ఆచార్య బాల అరుణకుమారి
6. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర- ఎస్వీ జోగారావు


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# సాధన శూరులు వృత్తి కళారూపం-జీవన శైలి



- డి. రాజు

తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, దౌల్తాబాద్.

**వ్యాస సంగ్రహం :**

సాధన శూరులు అనే ప్రత్యేక కళారూపం, దాని ప్రాముఖ్యత మరియు కళాకారుల జీవన విధానం గురించి వివరించబడింది. ఇంద్రజాలం ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేసే ఒక వినోదాత్మక కళ. ఇందులో కళాకారులు తమ చేతి చాతుర్యం, తెలివి, సాధన మరియు ప్రత్యేక పద్ధతుల ద్వారా అద్భుతమైన ప్రదర్శనలు చేస్తారు. ఈ వ్యాసంలో సాధన శూరుల కళ యొక్క చరిత్ర, అభివృద్ధి మరియు సమాజంలో దాని ప్రాముఖ్యతను కూడా వివరించబడింది. కళాకారులు తమ కళను అభివృద్ధి చేయడానికి ఎన్నో సంవత్సరాల పాటు కష్టపడతారు. వారి జీవితంలో అనేక సవాళ్లు ఉన్నప్పటికీ వారు తమ కళను ప్రేమతో కొనసాగిస్తూ ప్రజలకు ఆనందాన్ని అందిస్తారు. వీరి ప్రదర్శనలు కేవలం వినోదాన్ని మాత్రమే అందించవు. అవి ప్రజల్లో ఆసక్తిని పెంచడంతో పాటు శాస్త్రీయ ఆలోచనను కూడా ప్రోత్సహిస్తాయి. ఈ వ్యాసం ద్వారా కళాకారుల కృషి, వారి సాధన, మరియు సమాజంలో వారి పాత్ర గురించి సమగ్రంగా తెలియజేయబడింది.

**కీలక పదాలు :**

సాధన శూరులు, ఇంద్రజాల ప్రదర్శన, కళాకారులు, చేతి చాతుర్యం, సాధన, వినోదం, శాస్త్రీయ ఆలోచన, కళారూపం, ప్రేక్షకులు.

**పరిచయం :**

మనిషి సహజ స్వభావంలో ఆశ్చర్యాన్ని చూడాలనే ఆసక్తి చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ ఆసక్తిని తీర్చే కళలలో సాధన శూరులు ఒక ప్రత్యేకమైన కళారూపం. ప్రేక్షకుల ముందు అద్భుతమైన, అసాధారణమైన చర్యలను చేసి వారిని ఆశ్చర్యానికి గురిచేసే కళనే ఇంద్ర జాలం అంటారు. ఇంద్రజాల ప్రదర్శనలు చూస్తున్నప్పుడు మనకు అవి నిజమైన మాయలుగా అనిపిస్తాయి. కానీ వాస్తవానికి అవి కళాకారుడి తెలివి, చేతి చాతుర్యం, సాధన, శాస్త్రీయ పద్ధతుల ఫలితం. అందుకే ఈ కళా రూపం ఒక వినోదాత్మక కళ మాత్రమే కాకుండా ఒక సృజనాత్మక విజ్ఞాన కళగా కూడా భావించబడుతుంది. సాధన శూరులు అనేది ఒక రకమైన ప్రదర్శన కళ. ఇందులో కళాకారుడు ప్రత్యేకమైన పద్ధతులు, యుక్తులు ఉపయోగించి ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాడు. ఒక వస్తువును కనిపించకుండా చేయడం, మళ్లీ కనిపించేలా చేయడం, ఒక వస్తువును మరో వస్తువుగా మార్చడం వంటి ఎన్నో వినూత్న కార్యక్రమాలు ఇందులో ఉంటాయి. ఇది నిజమైన మాయ కాదు. ఈ కళలో ఉపయోగించే పద్ధతులు సాధన, శాస్త్రీయ సూత్రాలు, మరియు చేతి

వేగం మీద ఆధారపడి ఉంటాయి. అందుకే ఈ కళను ఒక కళగా కూడా, ఒక శాస్త్రీయ వినోదంగా కూడా పరిగణిస్తారు.

**సాధన శూరుల ప్రస్తావన :**

శ్రీ హర్షిని రత్నావళి నాటకం, పాల్కురికి సోమనాధుని పండితారాధ్య చరిత్ర, కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక వంటి ప్రాచీన కావ్యాల్లో వీరి ప్రస్తావన కనిపిస్తుంది. సాధనా శూరులు అనే పదానికి సాధన అంటే మల్ల విద్య అని, శూరుడు అనే పదానికి ధైర్యంగా కలవాడు, బలం కలవాడు, పరాక్రమము కలవాడు అని అర్థాలు ఉన్నాయి. నిజానికి వీరు ధైర్యం కలవారు. ఎందుకంటే.. పద్మశాలి కులాన్ని రక్షించడం కోసం ధైర్యంతో సాహసం చేసి వారిని హింసించిన రాజును సంహరించడంతో సాధనా శూరులుగా పిలువబడ్డారు.

**సాధనా శూరుల ఆవిర్భావం వెనుక ఉన్న ఆసక్తికరమైన నేపథ్యం**

పూర్వం శ్రీకృష్ణ గంధర్వ రాజు అనే వ్యక్తి 50 రాజ్యాలను ఏలుతుండేవాడు. అతను చావులేని వరం కోసం కాళికాదేవిని పూజించేవాడు. దానికి ప్రతిఫలంగా రోజుకో మనిషిని బలి ఇచ్చేవాడు. రాజు అరాచకాలు భరించలేక పద్మశాలీలు తిరుగుబాటు చేశారు.చెరసాల నుండి తప్పించుకుని, మార్కండేయ గుడిలో సమావేశమై రాజును సంహరించాలని నిశ్చయించుకున్నారు. రాజును చంపాలంటే అతని అరచేతిలో ఉండే కత్తితోనే చంపాలి. ఈ ప్రమాదకరమైన పనికి గంజి, బండారి, ఆడెపు, భీమనపల్లి, వంగరి, చింతకింది అనే ఇంటిపేర్లు గల వారు ధైర్యంతో ముందుకు వచ్చారు. ప్రాణాలకు తెగించి, సాహసంతో ఆ దుష్ట రాజును సంహరించినందుకు వీరిని 'సాధనా శూరులు' అని పిలవడం ప్రారంభించారు. ఈ విజయానికి గుర్తుగా నేటికీ పద్మశాలీల ఇళ్లలో పెళ్లి జరిగితే, వీరికి మొదటి బొట్టు పెట్టి గౌరవిస్తారు. అలాగే ప్రతి ఏటా వీరు ఆయా గ్రామాలకు వెళ్లి తమ ప్రదర్శనలు ఇస్తారు. సాధనా శూరులు ప్రధానంగా పద్మశాలి కులాన్ని ఆశ్రయించి బ్రతికే ఆశ్రిత కులస్థులు. వీరి పుట్టుక మరియు విద్యల వెనుక శివపురాణానికి సంబంధించిన గాథలు ప్రచారంలో ఉన్నాయి.

**1. మార్కండేయ పురాణంతో సంబంధం**

పద్మశాలీల మూలపురుషుడు భావనా రుషి. పురాణాల ప్రకారం, భావనా రుషి అసురులతో యుద్ధం చేస్తున్నప్పుడు, ఆయనకు సహాయపడటానికి తన శరీరం నుండి కొంతమంది వీరులను సృష్టించాడని, వారే ఈ 'సాధనా శూరులు' అని ఒక నమ్మకం. వీరు తమ అద్భుత శక్తులతో శత్రువులను మోసం చేసి, యుద్ధంలో విజయం సాధించడంలో తోడ్పడేవారని చెబుతారు.

**2. శివుని అనుగ్రహం మరియు సాధన**

వీరు ప్రదర్శించే విద్యలు కేవలం ట్రిక్కులు మాత్రమే కావని,అవి శివుని అనుగ్రహంతో పొందిన మంత్ర తంత్రాలని వీరి విశ్వాసం. పూర్వం మునులు, యోగులు అడవుల్లో కఠినమైన 'సాధన' చేసి అణిమాది అష్టసిద్ధులను పొందే వారు. అదే తరహాలో, ఈ కళాకారులు కూడా ఏకాగ్రతతో, నియమ నిష్టలతో విద్యలను అభ్యసిస్తారు కాబట్టి వీరికి 'సాధనా కూరులు' అనే పేరు వచ్చింది.

**3. పద్మశాలీలతో అనుబంధం - పురాణ నేపథ్యం**

పురాణ గాథల ప్రకారం, లోకానికి వస్త్రాలను అందించే క్రమంలో భావనా రుషికి సహాయం చేసినందుకు గాను, పద్మశాలీలు వీరిని తమ 'బిడ్డలు'గా స్వీకరించి, వారి పోషణ బాధ్యతను చేపట్టారు. అందుకే ప్రతి ఏటా పద్మశాలీలు ఉన్న గ్రామాలకు వెళ్లి, వారి గోత్ర నామాలను చదువుతూ, పురాణ గాథలను ప్రదర్శిస్తూ వారి నుండి సంభావనలు అందుకుంటారు.

**4. అద్భుత శక్తుల ప్రదర్శన**

వీరి పురాణ గాథల్లో ముఖ్యంగా ఇంద్రజాలం ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకప్పుడు రాజుల కొలువులో ఇతర దేశాల యాత్రికులను ఓడించడానికి వీరు తమ 'సాధన' విద్యలను ప్రదర్శించేవారని కథలు ఉన్నాయి. వీరు ప్రదర్శించే 'గాలిలో తేలడం', 'శరీరాన్ని ముక్కలు చేయడం' వంటి విద్యలు పురాణ కాలం నాటి మాయా యుద్ధ తంత్రాలకు ప్రతీకలుగా భావిస్తారు.

ముఖ్యంగా ఈ గాథలు తరతరాలుగా నోటి మాట ద్వారా అందుతూ వస్తున్నాయి. నేటికీ వీరు ప్రదర్శన ప్రారంభించే ముందు తమ కుల దైవాలను, పూర్వీకులను తలచుకుంటూ ఈ పురాణ నేపథ్యాన్ని పద్యాల రూపం లోనో లేదా పాటల రూపంలోనో వినిపిస్తారు.

**ప్రదర్శనలో ఉపయోగించే వస్తువులు**

వీరు ఉపయోగించే వస్తువులు చాలా సామాన్యంగా కనిపిస్తాయి, కానీ వాటితో చేసే మాయలు అసాధారణంగా ఉంటాయి. చేతిలో ఒక కర్ర లేదా దండం ఉంటుంది. దీనిని ఆడిస్తూ మంత్రాలు చదువుతున్నట్లు నటిస్తూ వస్తువులను మాయం చేస్తారు. ఖాళీ తువ్వాలులో నుండి నిప్పును, పూలను లేదా పండ్లను రప్పించడం వీరి ప్రత్యేకత, సాహస కృత్యాల కోసం పదునైన కత్తులను, నాలుకకు లేదా శరీరానికి గుచ్చుకునే శూలాలను ఉపయోగిస్తారు. భుజానికి ఒక సంచి ఉంటుంది. ప్రదర్శన ముగిసిన తర్వాత పద్మశాలీల నుండి బియ్యం లేదా పారితోషికాలు తీసుకోవడానికి దీనిని వాడతారు. పద్మశాలీల గోత్ర నామాలు, వంశ చరిత్ర ఉన్న పటాలను వెంట ఉంచుకుని, వాటిని చదువుతూ వారి పూర్వీకుల గొప్పతనాన్ని వివరిస్తారు.

**విలక్షణమైన వేషధారణ**

సాధనా శూరుల వేషధారణ ప్రేక్షకులలో భక్తిని, భయాన్ని మరియు కుతూహలాన్ని కలిగిస్తుంది. వారి రూపం ఒక రకమైన 'తాంత్రిక' రూపాన్ని పోలి ఉంటుంది. వీరు తలకు పెద్ద తలపాగా చుట్టుకుంటారు. ఇది వారి గంభీరతకు చిహ్నం. సాధారణంగా వీరు కాషాయ రంగు లేదా ముదురు ఎరుపు రంగు దోవతులు, అంగీలు ధరిస్తారు. ఈ రంగులు 'శక్తి'కి ప్రతీకలుగా భావిస్తారు. ముఖంపై పెద్దగా విభూతి రేఖలు లేదా గంధం బొట్టు పెట్టుకుంటారు. కళ్లకు కాటుక పెట్టుకుని చూడగానే ఆకట్టుకునేలా ఉంటారు. మెడలో పెద్ద పెద్ద రుద్రాక్ష మాలలు, తామర గింజల దండలు ధరిస్తారు. ఇవి వారు చేసే 'సాధన'కు గుర్తులు.

**సాధనా శూరుల ప్రదర్శన విశేషాలు**

వీరి ప్రదర్శనలో సంగీతం కూడా ముఖ్య భూమిక పోషిస్తుంది. చిన్న డమరుకం వాయిస్తూ లయబద్ధంగా మంత్రాలు పఠిస్తారు. ప్రదర్శన మధ్యలో హాస్యం, పురాణ నీతులు చెబుతూ ప్రేక్షకులను కట్టిపడేస్తారు. వీరు కేవలం ఇంద్రజాలమే కాకుండా జలస్తంభన, వాయు స్తంభన మరియు అగ్నిస్తంభన వంటి అసాధారణ విద్యలను ప్రదర్శిస్తారు. వీరి ప్రదర్శనలో హాస్యం, భయానకం వంటి రసాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. ప్రదర్శన ప్రారంభానికి ముందు కాళికాదేవిని పూజించి, గురువు బృంద సభ్యులందరికీ మంత్రించిన తాయత్తు లు కడతారు. అష్టదిక్పాలకులను బంధించి ప్రదర్శన మొదలు పెడతారు. నగారాల మోత మధ్య ఒక్కొక్కరుగా వచ్చి గురువు ఆజ్ఞ మేరకు తమ కత్తి సాము మరియు ఇతర సాహస కృత్యాలు ప్రదర్శిస్తారు. ఈ కళా ప్రదర్శనలో సాధారణంగా 10 నుండి 12 మంది కళాకారులు ఉంటారు. ఇందులో గురువు ప్రధాన పాత్ర పోషిస్తూ ప్రదర్శనను నడిపిస్తారు. హాస్యగాడు తన చేష్టలతో ప్రేక్షకులను అలరిస్తూ సందేహాలను తీరుస్తాడు. ప్రదర్శన సమయంలో ఒకరికొకరు సహకరించుకోవడానికి వీరు కొన్ని రహస్య పదాలను ఉపయోగిస్తారు.

ప్రదర్శనలో సాధనా శూరులు జలస్థంభన, వాయు స్తంభన, అగ్నిస్తంభనతో పాటుగా మరి కొన్ని విద్యలు ప్రదర్శిస్తారు. ప్రేక్షకుల ముందు ప్రదర్శించేటప్పుడు కళాకారులు నాటకీయ ఫక్కీలో హాస్యం భయానకం వంటి అంశాలతో ప్రేక్షకులను ప్రదర్శనాద్యంతం రంజింప చేయడం వీరి ప్రత్యేకత. ప్రదర్శన ప్రారంభంలో కాళికాదేవి పూజచేసిన గురువు బృందం లోని సభ్యు లందరికీ మంత్రించిన తావిత్తులు కడతాడు. ఆ తర్వాత అష్టదిక్పాలకులను బంధించి ప్రదర్శన మొదలు పెడతాడు. ప్రారంభంలో నగారాలు వాయిస్తుండగా మొదట బృందం సభ్యులు ఒక్కొక్కరుగా గురువు ఆ దేశాన్ని బట్టి కర్ర సాము ప్రదర్శిస్తారు.

ప్రదర్శనలో కళాకారులు నీటిని స్తంభింపచేసి తమ ఆధీనంలోకి తెచ్చుకొని ఆతర్వాత నియంత్రించుకుని ప్రదర్శనాంశానికి అనుకూలంగా మార్చుకుంటారు. దీనినే జలస్తంభన అంటారు. ఇందులో భాగంగా ముక్కు

రంధ్రాలలోని ఒక రంధ్రం నుండి నీటిని పంపి మరొక రంధ్రం నుండి నీటిని బయటికి తీయడం, అలాగే నీటిలో పసుపు కుంకుమ కలిపి వాటిని యధావిధిగా బయటికి తీసి ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తారు.

ప్రదర్శనలో కళాకారులు అగ్నిని స్తంభింపజేసి ప్రదర్శించే అంశాలు ప్రత్యేకమైనవి. ఇటువంటి అంశాలలో కాగితం మరియు దారాన్ని కాల్చి మళ్లీ సృష్టించడం, మనిషి తలపై పొయ్యిపెట్టి పూరీలు చేయడం, అగ్గిలో కాల్చిన పారని చేతితో పట్టుకోవడం ప్రధానమైనవి.వీరు ప్రదర్శించే కీలకాంశాల్లో తల మీద పొయ్యిపెట్టి పూరీలు చేయడం, ఇందుకోసం ప్రేక్షకుల నుండి ఒక వ్యక్తిని పిలిచి అతని తలపై మట్టితో చేసిన పొయ్యిని ఉంచి దాని మీద మూకుడు పెట్టి పూరీలు కాలుస్తారు. ఈ ప్రదర్శనాంశంలో ప్రేక్షకులకు కలిగే సందేహాలను గురువును అడుగుతూ నేను చేస్తానని, ప్రగల్భాలు పలుకుతూ హాస్యాన్ని పండిస్తూ రక్తి కట్టిస్తాడు హాస్యగాడు

సాధనా శూరులు నీటిని, అగ్నిని తమ ఆధీనంలోకి తెచ్చుకొని ప్రదర్శించినట్లు గానే, గాలిని కూడా స్తంభింప చేసి, చిలక కట్టడం, చొప్పల పల్లకిలో కూర్చుని ఊరేగడం వంటి అంశాలు ప్రదర్శిస్తారు. ఇందులో చిలుక కట్టుట ప్రదర్శనాంశంలోమొదట గురువు ప్రదర్శించే అంశాన్ని ప్రేక్షకులకు వివరించిన తర్వాత బృందంలోని వ్యక్తి ఒకరు వెదురు కర్రను తీసుకువచ్చి భూమిపై నిలబెట్టి పట్టుకుంటాడు. ఆ తర్వాత ఒకరు చెక్కతో చేసినచిలుక బొమ్మను తీసుకువచ్చి దాని నడుము భాగాన్ని కర్రపై ఉంచి కదలకుండా పట్టుకుంటాడు. అప్పుడు ఒక కావడి బద్దను తీసుకువచ్చి దానికి రెండు వైపులా బరువులు వేసి ఆ కావడిని చిలక పై భాగంలో ఉంచుతారు. గురువు చిలుక పై మంత్రించిన నీళ్లు చల్లి వేదంతో మూడు సార్లు మంత్రించి కర్రపై చిలుకను పట్టుకున్న వ్యక్తిని వదిలి వేయ మంటాడు. అప్పుడు ఏ ఆధారం లేకుండా చిలుక ఒక కర్రను ఆధారం చేసుకొని ,బరువుగల కావడిని మోస్తుంది. ఈ రకంగా గురువు చిలక ముక్కు మీద అట్లాగే చిలక తోకను మాత్రమే కర్రకు ఆనించి కావడిని మోపించటం ప్రేక్షకులు మంత్రమో తంత్రమో తెలియక సాధనా శూరుల మాయ అంటూ ఆశ్చర్యానికి లోనవుతారు.

ప్రదర్శనలో కళాకారులు అగ్నిని స్తంభింపజేసి ప్రదర్శించే అంశాలు ప్రత్యేకమైనవి. ఇటువంటి అంశాలలో కాగితం మరియు దారాన్ని కాల్చి మళ్లీ సృష్టించడం, మనిషి తలపై పొయ్యిపెట్టి పూరీలు చేయడం, అగ్గిలో కాల్చిన పారని చేతితో పట్టుకోవడం ప్రధానమైనవి.

వీరు ప్రదర్శించే విద్యల్లో చొప్పల పల్లకి చాలా ప్రత్యేకమైంది. చాలా సున్నితంగా ఉండే చొప్పబెండ్లతో కూర్చునేలా పల్లకి తయారు చేసుకొని, దాని మీద గురువు కూర్చుండగా బృందం సభ్యులు ప్రేక్షకుల మధ్యలో తిప్పుతారు. అలా తిరుగుతున్నపుడు హాస్యగాడు తనదైన శైలిలో హాస్యం పండిస్తూ ఉంటాడు. అలాగే ప్రదర్శనలో భాగంగా చాతిపై బండను పెట్టుకొని పగలగొట్టించుకోవడం, కరెంటు బుగ్గలను నోట్లో వేసుకొని నమలడం, మాయ బొమ్మకు చేసిన అలంకరణ గుడారంలో కట్టేసిన వ్యక్తికి కనిపించడం వంటి అదృశ్యకరణ విద్యలని ప్రదర్శిస్తారు. అంతేకాకుండా వీరు ప్రదర్శించే విద్యలో అద్భుతంగా చెప్పుకునేది గుడారంలో ఒక స్తంభానికి కట్టేసిన వ్యక్తి మిగతా స్తంభాలకు మారటం, ఈ అంశాన్ని ప్రదర్శించేటప్పుడు ప్రేక్షకులే వ్యక్తికి బేడీలు వేసి చేతులకు కాళ్ళకు కట్లుకట్టి ఆ తర్వాత అతన్ని గుడారంలో గుంజకు కూడా విప్పుకోవడానికి వీలు లేకుండా కడతారు. అయినప్పటికీ వ్యక్తి గుడారంలో ఏ గుంజకు మారమంటే ఆ గుంజకు మారటం విశేషంగా చెప్పుకోవచ్చు. ఇవే కాకుండా మరొక అద్భుతమైన అంశం గుడారంలోకి వెళ్లిన వ్యక్తి వికృత రూపంలో బయటికి రావడం, గురువు బృందంలోని సభ్యులు ప్రేక్షకులు చూస్తుండగానే గుడారంలోకి మామూలుగా పంపించి పరదా కప్పేస్తాడు. ఆ తర్వాత తన చేతిలో ఉన్న వేదంచే మంత్రించి కాళికా దేవిని తలచుకొని వేపాకు గుడారంపై చల్లి గుడారం మీది పరదా తీయ మంటాడు. అప్పుడు గుడారంలోకి వెళ్లిన వ్యక్తి మాయమై ప్రేక్షకుల మధ్యలో వికృత రూపంలో ప్రత్యక్షమై, అందర్నీ చెల్లా చెదురు చేస్తూ భయాన్ని కలిగిస్తాడు. అలాగే మరొక అద్భుత అంశం లో

దేవతల విగ్రహాలను సృష్టించడం, గురువు ముందుగా ఒక వ్యక్తిని గుడారంలోకి పంపి గుడారం పరదా కప్పేస్తాడు. ఆ తరువాత గురువు బయటనుండి రాళ్లను పసుపు బియ్యాన్ని మంత్రించి గుడారంలోకి పంపగా, రాళ్లన్నీ దేవతల విగ్రహాలు గాను, పసుపు బియ్యం పులిహోర గాను మారుతుంది. ఇవే కాకుండా గాలిలో నిమ్మకాయలు ఎగురవేసి కత్తితో ముక్కలు చేయడం, కడుపు మీద జిల్లేడు ఆకులువేసుకుని ముక్కలు చేయడం, బండికి కత్తి కట్టి తలతో నెట్టటం, రేకుపళ్ళాలు గాల్లో ఎగిరి కొట్టుకోవడం మొదలైన అంశాలను ప్రేక్షకులను అలరిస్తూ, హాస్యాన్ని జోడించి ప్రదర్శిస్తారు.

ఈ కళారూపంలోని కనికట్టు విద్యలు ప్రదర్శించడానికి కళాకారులు పది నుండి పన్నెండు మంది వరకు ఉంటారు. వీరిలో ఒక్కొక్కరు ఒక్కొక్క కనికట్టు విద్యలో నైపుణ్యం కలిగినవారు. ప్రదర్శన మొత్తం రక్తికట్టించడానికి ఒకరు గురువు మరొకరు హాస్యగాడు ప్రముఖ పాత్ర వహిస్తారు. ప్రదర్శనమొత్తం గురువు ఆధీనంలోనే జరుగుతుంది. ఇతనికి ప్రదర్శన అనుభవంతో పాటు కనికట్టు విద్యలు సంపూర్ణంగా తెలిసి ఉంటాయి.

బృందంలోని ఇతర సభ్యులు ప్రదర్శనలో తప్పు చేస్తే రహస్య భాషా పదాలను ఉపయోగిస్తూ ప్రదర్శనకు అంతరాయం కలగకుండా ప్రయత్నిస్తాడు. వీరు ఉపయోగించే రహస్య భాషా పదాలలో ఉదాహరణకు పచ్చ- పసుపు, మిల్క్ పెట్టె- అగ్గిపెట్టె, పాండ్యాలు- నీళ్లు, మస్కాలు- విగ్రహాలు, పొల్లు-ఇటుక పొడి, దారుకం-దారం, పత్రులు-రాళ్లు, మొకిరలు-పూరీలు, తైరు- నూనె, సోర్ -అన్నం, పచ్చ-తావిత్తు, పొంత-పొయ్యి, మీటకం-సంభావన, తెల్లోడు-సుద్ద మొదలైన పదాలను ఉపయోగిస్తూ ఒకరికొకరు ప్రదర్శనలో సహకరించుకుంటూ ప్రదర్శిస్తారు. ప్రదర్శనలో గురువు తర్వాత ప్రదర్శనను రక్తికట్టించడంలో, ప్రేక్షకులను ఆనందింపచేయడంలో, సిద్ధహస్తుడు హాస్యగాడు. ఇతని వేషధారణ హావభావాలు ప్రేక్షకులకు ఆనందాన్ని కలిగిస్తాయి. అంతేగాకుండా ప్రేక్షకులకు కలిగే సందేహాలను తీరుస్తూ, అవసరమైతే గురువు చేత దెబ్బలు తింటూ నటిస్తాడు. ఇతను ప్రదర్శనలో పూర్తి స్వేచ్ఛతో బృందం సభ్యులను గురువును అవసరమైతే ప్రేక్షకులను కూడా సమాజంలోని సంఘటనలను గుర్తు చేస్తూ తిట్టడం లేదా పొగడటం ఇతని నైజం. కళాకారులు ప్రదర్శనాద్యంతం రక్తి కట్టించడంలో రెండు నగారాలను వాయిస్తూ బృందం సభ్యులకు, ప్రేక్షకులకు ఉత్సాహాన్ని కలిగిస్తారు. వీరు చేతిలో అధర్వణవేదం పట్టుకొంటారు. దీన్నే మంత్రదండం అని పిలుస్తారు. దీనితో మాయ మంత్రాలు ఉన్నట్టు భ్రమింపచేస్తారు కానీ మాయలు మంత్రాలు లేవని చెట్ల క్రియలు ఉన్నాయి. కాబట్టే ఇంద్రజాల విద్యలు చేయగలుగుతున్నామని కళాకారులు అంటారు. అందుకే గ్రామాల్లో విద్యలు ప్రదర్శించే సందర్భంలో ఆ గ్రామంలో మంత్రగాళ్ళు ఉంటే మేం చేసే విద్యలకు అంతరాయం కలిగించమని ధైర్యంగా సవాలు విసురుతూ ఉంటారు.

**జీవనశైలి**

వీరు తమ కళను ఒక తపస్సులా భావిస్తారు. "సాధన" చేయడం ద్వారానే ఈ విద్యలు అబ్బుతాయి కాబట్టే వీరికి 'సాధనా శూరులు' అనే పేరు వచ్చింది. వీరు గ్రామాలలోని రచ్చబండల వద్ద లేదా పద్మశాలీల ఇళ్ల ముందు తమ ప్రదర్శనలు ఇస్తారు. వీరి వేషధారణ చాలా గంభీరంగా, నాటకీయంగా ఉంటుంది, ఇది ప్రేక్షకులలో కుతూహలాన్ని పెంచుతుంది. తరతరాలుగా ఈ విద్యలు తండ్రి నుండి కొడుకుకు వారసత్వంగా అందుతున్నాయి. వీరు కేవలం కళాకారులు మాత్రమే కాదు, తెలంగాణ సామాజిక నిర్మాణంలో ఒక అంతర్భాగం. ఇతర కులాల వారిని కూడా తమ ప్రదర్శనలతో మెప్పించి, అందరి ప్రశంసలు అందుకుంటారు. టీవీలు, స్మార్ట్ ఫోన్లు మరియు సినిమా వంటి వినోద సాధనాలు పెరగడంతో, ఈ వీధి ప్రదర్శనలకు ఆదరణ తగ్గిపోతోంది. కేవలం పద్మశాలి కులస్థులపైనే ఆధారపడి జీవించడం వల్ల, మారుతున్న కాలంతో పాటు వీరి ఆదాయం కూడా తగ్గిపోయింది. దీనివల్ల నేటి యువత ఈ వృత్తిని వదిలి ఇతర పనుల వైపు వెళ్తున్నారు. సాధనతో కూడిన ఈ కఠినమైన విద్యలను నేర్చుకునే వారు క్రమంగా తగ్గిపోతున్నారు.

తెలంగాణ ప్రభుత్వం వీరిని గుర్తించి 'డాక్యుమెంటేషన్' చేయడం వల్ల ఈ కళ భవిష్యత్తు తరాలకు తెలిసే అవకాశం ఉంది. కళాకారులకు పెన్షన్లు మరియు ప్రదర్శనలకు వేదికలు కల్పించడం ద్వారా వీరిని ఆదుకోవచ్చు. ఈ కళారూపం అంతరించిపోయే ప్రమాదానికి దారితీస్తోంది.

**ముగింపు :**

ఆధునిక మెజీషియన్లకు ఏమాత్రం తీసిపోని విధంగా, వీరు నేటి కాలంలో కూడా తమ సాంప్రదాయ పద్ధతులతో, నాటకీయ శైలిలో ప్రదర్శనలు ఇస్తూ గ్రామీణ ప్రజలను అలరిస్తున్నారు. తరతరాలుగా వస్తున్న ఈ కళను కాపాడుకుంటూ వస్తున్నారు. పద్మశాలి కులాన్ని ఆశ్రయించి ప్రదర్శనలు ఇచ్చే వీరు, తమ కళా నైపుణ్యంతో అందరినీ ఆకట్టుకుంటున్నారు.ప్రస్తుత ఆధునిక యుగంలో ఈ కళాకారుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. ఈ క్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వీరి విద్యలను గుర్తిస్తే భవిష్యత్తు తరాలకు జానపద కళల పునర్జీవం లభిస్తుంది. సాధనా శూరులు తెలంగాణ గడ్డపై పుట్టిన అరుదైన కళాకారులు. వీరి ఇంద్రజాల విద్యలు మన సాంస్కృతిక వారసత్వానికి చిహ్నాలు. ఈ కళను ఆదరించడం మరియు కళాకారులను ప్రోత్సహించడం మనందరి బాధ్యత.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు వారి జానపద కళారూపాలు- మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
2. జానపద వృత్తి పురాణాలు - ప్రొ. నను మసాస్వామి
3. తెలుగు జానపద గేయ గాథలు - నాయని కృష్ణకుమారి
4. తెలుగు ప్రజానాట్యాలు - డా. చాగంటి సోమయాజులు
5. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్వీఎస్ సుందరం
6. ప్రజా కళారూపాలు - డాక్టర్ జయధీర్ తిరుమల రావు

★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# పాలడుగు నాగయ్య బుర్ర కథ - సామాజిక చైతన్యం



- డా॥. బి. నర్సింహ

తెలుగు సహాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్‌నగర్.

**వ్యాస సంగ్రహం :**

ఒకప్పుడు ప్రజలందరినీ ఆనందింపజేసిన జానపద కళలు నేడు అంతరించిపోతున్నాయి. నేడు జానపద కళలకు ఆదరించే పోషకులు లేరు. వీక్షించే ప్రేక్షకులు లేరు. కళాకారులు బ్రతుకుదెరువు కోసం ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయిస్తున్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో, నిజాం వ్యతిరేక పోరాటంలో ప్రజల్ని సంఘటితం చేయడానికి, సామాజిక చైతన్యం కలిగించడానికి జానపద కళలు ప్రముఖపాత్ర పోషించాయి. ముఖ్యంగా బుర్రకథ ద్వారా వీర, కరుణ, హాస్యరసాలతో ప్రేక్షకులను ఉర్రూత లూగించారు. బుర్రకథకు భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో గల ఇతర పేర్లను తెలియజేయడం. బుర్ర కథలో ఉపయోగించే వాయిద్యాలైన తంబూర, డక్కీ, బుర్ర, గుమ్మెటలను తెలియజేయడం. పాలడుగు నాగయ్య నేపథ్యాన్ని తెలియజేయడం. నిమ్నవర్గాలపై కొనసాగిన దాష్టికాలను తెలియజేయడం. భారతదేశంలో అసాంఘిక కార్యక్రమాలైన వెట్టిచాకిరిని, అణచివేతను, అవమానాలను తొలగించడానికి అంబేద్కర్ పోరాడిన విధాన్ని బుర్రకథ ద్వారా తెలపడం. అంబేద్కర్ గారికి కూడా అడుగడుగునా అవమానాలు ఎదురైనాయి. వాటిని అధిగమిస్తూ విద్యాభాసాన్ని కొనసాగిస్తూ, దళితుల సముద్ధరణకు నడుంగట్టి రాజ్యాంగపరమైన రక్షణలు కల్పించడం మొదలైన విషయాలను తెలియజేయడం. అంబేద్కర్ భావజాలాన్ని సామాన్యులకు బుర్రకథ ద్వారా అందించడానికి పూనుకున్న పాలడుగు నాగయ్య ముందు చూపును తెలియజేయడం ఈ వ్యాస ఉద్దేశ్యం. సామాన్యులకు జ్ఞానబోధ చేయడానికి, సామాజిక చైతన్యం కలిగించడానికి బుర్రకథ ఎలా ఉపయోగ పడిందో అర్థం చేసుకోవడానికి ఈ పరిశోధక వ్యాసం ఉపయోగపడుతుంది.

**కీలక పదాలు :**

జానపద కళలు, బుర్రకథ, జంగంకథ, శారదకాండ్రు తంబూర, వంతలు, వెట్టిచాకిరి, వర్ణవ్యవస్థ, దరువు.

**ఉపోద్ఘాతం :**

తెలుగు సాహిత్యం మార్గ, దేశి అనే రెండు శాఖలుగా ప్రారంభమైంది. నన్నయ కంటే ముందే తెలుగులో ఊయలపాటలు. గౌడు గీతాలు, కథలు వ్యాప్తిలో ఉన్నాయని పరిశోధకులు నిరూపించారు. అలాగే తెలుగులో లిఖిత సాహిత్యం, మౌఖిక సాహిత్యం కూడా ఉంది. మౌఖిక సాహిత్యాన్నే జానపద సాహిత్యమని అనవచ్చు. జనపదం నుంచి వచ్చిందే జానపదమని తెలుస్తుంది. ఈ జానపద సాహిత్యాన్ని జానపద విజ్ఞానం అని పిలుస్తారు. జానపద విజ్ఞానాన్నే ఆంగ్లంలో Folklore (ఫోకలోర్ ) అని పిలుస్తారు. ఈ జానపద సాహిత్యానికి

సంబంధించిన విశేషాలు ప్రాచీన సాహిత్యంలో హాలుని గాథాసప్తశతిలో, బౌద్ధ సాహిత్యంలో, నన్నెచోడుని కుమార సంభవంలో, నన్నయ మహాభారతంలో, శ్రీనాథుని పలనాటి వీరచరిత్రలో, జాయప సేనాని నృత్య రత్నావళిలో, పాల్కురికి సోమన బసవపురాణంలో, పండితారాధ్యచరిత్రలో అనేకం ఉన్నాయి.

''మానవ కళ్యాణానికి కారణభూతమైంది కళ'' అంటాడు టాల్‌స్టాయ్ మహాశయుడు. జానపద సాహిత్యంలో జానపద కళలకు ప్రత్యేక స్థానం ఉంది. జంగం కథలు, శారదకథలు, పిచ్చికుంట్లకథలు, బుర్ర కథలు, ఒగ్గుకథలు, జముకుల కథలు, కిన్నెర కథలు, పల్లె సుద్దులు, కోలాటం, డప్పు నృత్యం, తోలుబొమ్మ లాటలు, యక్షగానం, పగటి వేషాలు, చిరుతల రామాయణం, గంగిరెద్దులాట, పిట్టలదొర మొదలైన జానపద కళారూపాలు ప్రజలను విశేషంగా అలరించాయి. వీటన్నింటిలోకెల్లా బుర్రకథ ప్రత్యేకమైంది.

బుర్రకథకు ఆ పేరెలా వచ్చిందని పరిశీలిస్తే 'ఈకథల్లో ప్రధాన కథకుడు తంబురాను ఉపయోగిస్తాడు. ఆ తంబురాకు ఉపయోగించే బుర్రను బట్టి దీనికి తంబురా కథ అనీ, బుర్రకథ అనీ పేరు వచ్చింది. ఈ కథలో ఉపయోగించే గుమ్మెట్లను డక్కీలనీ, బుర్రలనీ వ్యవహ రించడం వల్ల ఈకథలకు డక్కీ కథలు, బుర్రకథలు అనే పేర్లు సార్థకమై ఉండవచ్చునని కొందరి అభిప్రాయం.' ..'నాడు బహుళ ప్రజాదరణ పొందిన జంగం కథలనే నేడు బుర్రకథలని' పిలుస్తున్నారని జానపద కళా రూపాలలో యస్వీ జోగారావు వివరించారు. జంగం కథలను ఎక్కువగా జంగాలే చెప్పడం వలన ఈపేరు వచ్చిందని చెప్పవచ్చు. జానపద కథలలో హరికథలు బుర్రకథలు అని రెండు రకాలున్నాయి. ప్రధానంగా హరికథలు వైష్ణవ మత సంబంధమైనవిగానూ, బుర్ర కథలు వీరశైవ మత సంబంధమైనవిగానూ చెప్పవచ్చు. 'తందాన తాన' తందాన దేవనందనాన' ' వినరా భారత వీర కుమార విజయం మనదేరా' ఓ భారతీయుడా ఓవీర యోధుడా' అంటూ వంతలు చరణాలను పాడటం బుర్రకథలో కనిపించే ప్రత్యేకత. ఈబుర్రకథలో ముగ్గురు వ్యక్తులు ఉంటారు. ప్రధాన కథకుడు మధ్యలో ఉండి కథను నడిపిస్తాడు. ప్రధాన కథకుడి రెండు ప్రక్కల ఇద్దరు వంతలు గుమ్మెటలు భుజాలకు తగిలించుకొని దరువు వేస్తూ కథకుడిలో ఉత్సాహాన్ని నింపుతారు.

**కవి పరిచయం :**

పాలడుగు నాగయ్య జూలై 19 1943లో ఖమ్మం జిల్లా రామాపురంలో ఈరమ్మ తిర్నమ్మ దంపతులకు జన్మించాడు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే ఆలిండియా రేడియో, దూరదర్శన్‌లలో ఆర్టిస్టుగా సేవలందించారు. ఏప్రిల్ 10 1982లో మరణించాడు. కేవలం 39 సంవత్స రాలు మాత్రమే జీవించాడు. ఈకాలంలోనే జానపద గేయాలు, భక్తిగీతాలు, బుఱ్ఱకథలు ఎన్నో చెబుతూ ప్రజలను చైతన్యపరిచాడు. 'పద్య గేయ వచన కవిగా అనేక సాహిత్య ప్రక్రియలలో ప్రతిభా పాటవాలు వాగ్గేయ మెళకువలు కలిగిన అతి అరుదైన నాణ్యమైన కళా కారుడు. ఆయనతో పాటుగా అనేక మందిని కళారంగం వైపు నడిపించి ఎందరికో స్ఫూరిగా నిలిచాడని' జూలూరి గౌరీశంకర్ (పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం ముందుమాట) అన్నారు.

**అంబేద్కర్ బుర్రకథ విశ్లేషణ :**

డా॥ అంబేద్కర్ బుర్రకథను 1972లో రాశాడు. అక్షరాస్యులు అంబేద్కర్ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నిమ్న జాతుల సముద్ధరణ మొదలైన విషయాలు చదివి అర్థం చేసుకోగలరు. కానీ నిరక్షరాస్యులు అంబేద్కర్ అణగారిన వర్గాల హక్కులకోసం చేస్తున్న పోరాటాలు ఎలా తెలుసుకుంటారు. 1990వ దశకం నాటికి అక్షరాస్యత సుమారు 50శాతం మాత్రమే. అణగారిన వర్గాలను చైతన్యపరచడానికి అణగారిన వర్గాల నుంచి వచ్చిన అనేకులు కృషి చేశారు. '' ఆధిపత్య వర్గాలను ధిక్కరిస్తూ మౌళిక సాహిత్యాన్ని తెలుగులో మనకు అందిస్తున్న వాళ్లు దళితులు. వీళ్ళు ఎనకటి నుంచి ప్రజల నోళ్లలో నానుతూ ఉన్న వాటిని పదాలుగా జానపద గేయాలుగా కథలుగా, గాథలుగా ఒక తరం నుంచి ఇంకో తరానికి అందిస్తున్నారు. వీరగాథలను గానం చేసే శారదగాండ్రు, దండదాసర్లు దళితులే. దళితులు పాతవి రికార్డు

చేయడమే గాదు కొత్తవి తాము చేస్తున్న పని తెలియ కుండా ఉండేందుకు కైగడుతున్నారు'' అని ప్రముఖ పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్ (పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం ముందుమాట) అన్నారు.

సమాజంలో పాతుకుపోయిన ఆధిపత్య భావజాలాన్ని ప్రశ్నిస్తూ 'గుడులు కాదు బడులు కావాలె, పూజలు కాదు పుస్తకాలు కావాలె బైబిల్ ఖురాన్ భగవద్గీత కాదు, భారత రాజ్యాంగం అమలు కావాలె. రాజ్యాధికారమే కావాలి. ఇది ఇప్పుడిప్పుడే బలపడుతున్న దళిత బహుజన డిమాండు. ఒక జానపద వాగ్గేయకారుడు, నటుడు, కవి కళాకారుడు అయిన పాలడుగు నాగయ్య గారు అర్ధ శతాబ్దం కిందనే ఎవరిది ఎక్కువ కులము, ఎవరిది తక్కువ కులము అని ఒక సూటి ప్రశ్న వేశాడు. కులానికి వ్యతిరేకంగా పోరాడిన బ్రహ్మనాయుడు, తుకారాం, యోగివేమన, బుద్ధదేవుడు, ఏకనాథుడు. జినదేవుడు, పోతులూరి వీరబ్రహ్మంగారు, రామానుజుడు, రాజారామమోహన రాయ్, వివేకానందుడు శ్రద్ధానందుల యొక్క స్ఫూర్తి' నాగయ్య గారిలో ఉంది అని డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి (పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం ముందుమాట) అన్నారు.

అంబేద్కర్ బుర్రకథలో అస్పృశ్యత, మహద్ చెరువు నీటి సమస్య, గాంధీతో హక్కులకోసం పోరాటం లండన్‌లో న్యాయవాద విద్యనభ్యసించి ముంబయిలోనే మేటి లాయరుగా పేరుగడించిన విషయాలన్నిటిని వరుసగా వివరించాడు. ''హరిజనులకు గిరిజనులకు మానవత్వపు విలువలనుండి వెలివేయబడ్డ పీడిత కులాలవారికి అంబేద్కర్ సందేశం ఒక ఆశాదీపం. ఆయన జీవితగాథను, ఆయన అమూల్య భావపరిమళాలను ప్రజాస్వామ్యానికి అందించవలసిన ఆవశ్యకత నేడు ఎంతైనా ఉంది. అట్టి ప్రయత్నానికి శ్రీపాలడుగు నాగయ్య బుర్రకథ రూపంలో చేసిన ఈ కృషి ప్రశంస నీయం. పీడిత వర్గాల జీవన వేదన ఇందులో ప్రతిధ్వనిస్తు న్నది. కవితావేశం, సంఘ సంస్కరణాభినివేశం ఇందులో అడుగడుగున పొంగిపారుతున్నది. భాషాదోషాలను మన్నించగల సహృదయులు ఈ యువకవి ఆశయదీప్తిని ఆనందిస్తారని ఈ బుర్రకథ సమర్థులైన బుర్రకథకుల ఆదరణకు పాత్రమై ఆంధ్రదేశమంతటా అంబేద్కర్ సందేశాన్ని పంచటానికి దోహదం కల్గిస్తుందని ఆశిస్తు న్నాను'' జె. బాపురెడ్డి గారు అంబేద్కర్ బుర్రకథ ముందుమాటలో చక్కగా తెలిపారు.

బుర్రకథ ప్రారంభంలో ప్రార్ధనా గీతం ఉంటుంది. సరస్వతీ దేవిని శారదగా కీర్తిస్తారు. కానీ అంబేద్కర్ బుర్రకథలో భారతదేశాన్ని కీర్తిస్తూ ..

'వినరా భారత వీరకుమార విజయము మనదేరా
॥ తందాన॥
పూర్వము నుండి భారతదేశము పుణ్యభూమి యండి
॥ తందాన॥
అనాది నుండి భారతదేశం ఆర్త రక్షణండి
॥ తందాన॥
శరణన్న వారికి చోటునిచ్చిన శమము భూమియండి
॥ తందాన॥
కూర్మి ధర్మముల పుణ్యము కలిగి కళ్యాణ భూమి'
॥ తందాన॥ (పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం పుట 146 )

అని ప్రధాన కథకుడు కథను ప్రారంభించగా వంతలు అతడు ఆడుతూ పాడిన దానిని శ్రోతలకు వివరంగా చెప్తూ ముందుకు నడిపిస్తారు. 'భారతదేశం నాగరికత ప్రపంచంలోని దేశాలన్నింటికంటె పురాతనమైనదని చరిత్రకారులు తెలిపినారు. ఆనాటి నుండి భారతీయ సంఘ వ్యవస్థలో కులాలు అనేవి లేనేలేవు. ఆర్యుల దండయాత్రతో ఈ పరిస్థితి తారుమారైనది. ఈనవ వ్యవస్థలో వృత్తి విభజన ప్రారంభమైనది. అది కొంత కాలానికి వంశపారంపర్యమై వర్ణవ్యవస్థకు దారితీసింది. ఈవిధంగా కత్తి పట్టిన వానిది ఒక కులమైతే, కలం పట్టిన వానిది మరియొక కులమైనది' (పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం పుట 146) అని వివరించారు.

బంగారు పంటల భారతమాతకు బాధలు కల్గాయా
॥ తందాన॥
కులమత కక్ష వర్గ భేదాలతో కుమిలిపోయినాదా
॥ తందాన॥

అల్లకల్లోలము దేశమంతట అలజడి రేగిందా
॥ తందాన॥
గడ్డు సమస్యలు భారత వృద్ధికి అడ్డుగ నిలిచాయా
॥ తందాన॥
(పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం పుట 146)

అంటూ కుల మత వర్గ భేదాలు భారతమాతను అల్లకల్లోలము చేశాయని దానితో దేశమంతా అలజడి రేగిందని ప్రధాన కథకుడు చెప్పగానే వంతలు అనేక అనుబంధ ప్రశ్నలు వేస్తూ కథ ముందుకెళ్ళడానికి శ్రోతలకు వివరంగా చెప్పడానికి తోడ్పడతారు. దేశంలో కుల సమస్య తీవ్రతను అనుభవిస్తూ కూడా గుర్తించలేని వారికి, ప్రశ్నించలేని వారికి కనువిప్పు కలిగే విధంగా సామాన్య ప్రజలలో చైతన్యం కలిగే విధంగా కథను నడిపించారు.

కుల, మత, వర్గ భేదాలకు పరిష్కారమే లేదా అని వంతలు ప్రశ్నించగానే అణగారిన వర్గాల ఆశాజ్యోతి అయిన అంబేద్కర్ జన్మించాడని...

భీమ భీమ భీమయ్య ॥ తందాన॥
అస్పృశ్యులకు ఆడలేకుండగ ॥ తందాన॥
అంటరాని వారని అనుచు వారలను ॥ తందాన॥
గుడులకు బడులకు రానియ్యకుండ ॥ తందాన॥
కూడు లేకుండగ చేశారు వార్ని ॥ తందాన॥
నీడ కలుగకుండ చేశారు వార్ని ॥ తందాన॥
గూడు లేకుండగా బాధించి వార్ని ॥ తందాన॥
ఊరికి వెలుపల ఉంచారు వార్ని ॥ తందాన॥
(పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం పుట 147)

అంబేద్కర్ 'కుల నిర్మూలన'లో పేర్కొన్నట్లుగా అస్పృశ్యులు గ్రామాల్లోకి వివిధ అవసరాలకోసం వస్తే వారి వీపుకు చీపురు కట్టుకొని వారు నడుస్తూ వెళ్తుంటే వారి ధూళిని వారే ఊడ్చుకోవాలని, అలాగే వారు వస్తుంటే అగ్రవర్ణాల వారికి సూచనగా గంట వాయించుచూ గట్టిగా చప్పుడు చేయాలని, వారికి ఉమ్మి వస్తే మెడకు ఉమ్మి ముంత ధరించి ఉండాలని కట్టడి చేసేవారు. పురుషులకు మూరెడు గోచి ఆడవారికి బారెడు చీరె కూడా ఉండని దుస్థితి ఉండేదని వివరించారు.

అగ్రవర్ణాల ఆగడాలను ఇలా...
అగ్రజాతులు పెట్టు ఇక్కట్లకు అలమటించారా
॥ తందాన॥
అస్పృశ్యులై అగచాట్లకు ఆరిపోయినారా
॥ తందాన॥
ఆకలి మంటతో ఆది జనావళికి అన్యాయమె జరిగె
॥ తందాన॥
రెండు వేయిల వత్సరముల రంపపుకోతాయె
॥ తందాన॥
రత్నాల గడ్డ భారతావనికి చిచ్చు లేపినారు
॥ తందాన ॥
(పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం పుట 147)

ఇలా అంటరానివారి అగచాట్లు, మొరాలకించి దానిని తుద ముట్టించడానికి భారతదేశంలో అనేక మంది మహనీయులు అంబేద్కర్ కంటే ముందు జన్మించారని వారిని కొనియాడాడు.

బుర్రకథ ప్రత్యేకత ఏమిటంటే వీర రసాన్ని కరుణ రసాన్ని అద్భుతంగా పలికించగల కళ. ఇందులో అనేక సంఘసంస్కర్తలు చేసిన పోరాటాలను కీర్తిస్తూ ...

బ్రహ్మనాయుడు లేచెరా సై భగ్గు భగ్గున మండెరా సై
తూకారాము లేచెరా సై తప్పులు వలదని పలికెరా సై
వేమన యోగి తెలిపెరా సై వద్దు వద్దు కుల భేదము సై
బుద్ధదేవుడు లెచెరా సై బోధనలె బోధించెరా సై
ఏకనాథుడు లేచెరా సై ఐక్యతనే చూపించెరా సై
పెద్దలెల్లరు తప్పులు వలదని ఫలితము చూపారా
(పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం పుట 148)

బ్రహ్మనాయుడు, తూకారాం, వేమన, బుద్ధుడు, ఏకనాథుడు, మొదలగు పెద్దలు అస్పృశ్యతను తొలగించి సమాజంలో నూతనోత్తేజాన్ని కలిగించటానికి ప్రయత్నిస్తున్న తరుణంలో భారతదేశానికి మరొక ఎదురుదెబ్బ విదేశీ

యుల రూపంలో ఆంగ్లేయ పాలన ఆరంభమైందని తెలిపాడు. భారతీయులలోని అనైక్యతను గమనించి నిమ్న వర్గాల వారిని సైన్యంలో చేర్చుకుని, క్రైస్తవ మతము లోనికి మార్చుకుని వారికి సంఘములో గౌరవమును కలిగించారు. ఆవిధంగా భారతీయులను దెబ్బ తీయడా నికి ఒక ఆయుధాన్ని మనమే ఇచ్చామని హిందువులు గుర్తించలేకపోయారు. 'కుల వ్యవస్థ ఏ మత నమ్మకాలపై నిర్మించబడిందో ఆ మత నమ్మకాలను పూర్తిగా నాశనం చేస్తేనే గానీ కులాన్ని నిర్మూలించడం సాధ్యం కాదు' (కుల నిర్మూలన, పుట 33) అంబేద్కర్ ఆలోచనను పాలడుగు నాగయ్య బుర్రకథలో చక్కగా వివరించాడు. 'వర్ణానాం బ్రాహ్మణో గురు:' అనేది ఆర్యోక్తి. అనగా గురువుగా ఉండే అర్హత ఒక్క బ్రాహ్మణుడికే ఉందని దాని అర్థం. కానీ ఆధునిక కాలంలో జ్ఞానవంతుడినే గురువుగా గుర్తిస్తారు.

అంబేద్కర్ జననాన్ని పాలడుగు నాగయ్య తన బుర్రకథలో ఇలా కొనియాడాడు.

'కొంకణ ప్రాంతములో ॥ భళి భళి॥
కవులు పుట్టిన గడ్డలోన ॥ భళి భళి॥
రత్నగిరి జిల్లాలోన ॥ భళి భళి॥
రత్నమో ఉదయించినాడు ॥ భళి భళి॥
అంబవాడ గ్రామమందు ॥ భళి భళి॥
అవతారుడు జనియించె ॥ భళి భళి॥
ఆది జన వీరుడె పుట్టాడా
అస్పృశ్యత బాధ బాపాడా ॥ ఓ॥
రాంజి భీమబాయిలకు ॥ భళి భళి॥
బాబసాయెబు జననమాయె ॥ భళి భళి॥
(పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం పుట 149)

అని యుగ పురుషుడు అయిన బాబాసాహెబ్ అంబేద్కర్ జననాన్ని ఇలా కీర్తించాడు.1891వ సంవత్సరం ఏప్రిల్ 14వ తేదీన రాంజీ, భీమబాయి పుణ్య దంపతు లకు 14 వ సంతానంగా జన్మించాడు.

బాబాసాహెబ్ అంబేద్కర్‌కు బాల్యంలో ఎదురైన అవమానాలను వరుసగా వివరించాడు. ఒక రోజు తన సోదరుడితో వక్క గ్రామమునకు కాలినడకన వెళ్ళుచుండగా దాహమేసింది. కొంతదూరంలో బావి కనిపించింది. అక్కడికి వెళ్ళి అక్కడున్నవారిని నీళ్ళు అడగగా వారు కులమేమిటని ప్రశ్నించి కులం తెలుసు కొని దోమలు ఈగలు వాలిన మురికిగుంటలో నున్న నీటిని త్రాగుమనగా

దాహ బాధలో వారు దారి సాగారా ॥ తందాన॥
దడ దడ మని గుండె కొట్టుకోసాగిందా ॥ తందాన॥
తడబడుచు వారలు అడుగు వేయుచును ॥ తందాన॥
నడవజాలక వారు కడ సమయములో ॥ తందాన॥
ఎడ్ల బండిని ఆపి ఎదుటకు పోయి ॥ తందాన॥
(పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం పుట 151)

బండి వానికి కొంత పైకం ఇస్తామని బండి ఎక్కినారు కొంత దూరము వెళ్లిన పిదప బండి వాడు కులము తెలుసుకొని ఒక్క తోపుతో నెట్టి వేశాడు. ఇలాంటి కష్టసమయంలో కూడా అంబేద్కర్ ప్రాథమిక పాఠశాలలో తరగతి గది వెలుపల కూర్చొని చదువు కొనసాగించాడు. ఉపాధ్యాయుడు తన పుస్తకమును ముట్టకపోయినా అంబేద్కర్ చదువులో ముందుండే వారు. 1898లో ప్రైమరి, 1907లో మెట్రిక్, 1912లో బి.ఏ. పరీక్షలో పాసై 1913లో రాజా వారి ఆర్థిక సహాయంతో కొలంబియా విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం కొనసాగించాడు.

'వినరా భారత వీరకుమార విజయము మనదేరా ॥ తందాన॥
బిరబిరమంటూ బడుల విద్యలను బాగుగ నెరిగాడు ॥ తందాన॥
పరుగుపరుగున పాఠాలన్నీ పరుగున నేర్చాడా ॥ తందాన॥
అభ్యాసంబె కూసు విద్యయని ఆదర్శమునెరిగి ॥ తందాన॥
ఆలోచించి యోచన పెంచి అన్ని విద్యలెరిగి ॥ తందాన॥

అలా చదువులో ముందుండేవాడు అంబేద్కర్.

'భళానంటి భాయి తమ్ముడా మేలు భళానోయి దాదానా
గుండె నిబ్బరము పొందాడా లండను విద్యల నెరిగాడా '

అంటూ విదేశీ విద్యనభ్యసించిన మొదటి అస్పృశ్యుడుగా రికార్డు నెలకొల్పాడని బుర్రకథలో వివరించాడు. ఇలా తన జ్ఞానముతో నిమ్న జాతుల సముద్ధరణ కోసం హిందూమతాన్ని త్యజించి 1956లో నాగపూర్ పట్టణంలో 5 లక్షల మందితో బౌద్ధమతం స్వీకరించాడు అని బుర్రకథను ముగించాడు నాగయ్య గారు.

**ముగింపు :**

పాలడుగు నాగయ్య అంబేద్కర్ బుర్రకథను రాయడం ద్వారా అణగారిన వర్గాలకు అంబేద్కర్ భావజాలాన్ని చేరువ చేశాడు. పాలడుగు నాగయ్య బుర్రకథ 'నిజానికి తెలంగాణలో అంబేద్కర్ భావజాలాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకుపోవడానికి తన వంతు కృషి చేసిన తొలి సాహితీవేత్తగా నాగయ్యని గుర్తించాలి. కమ్యూనిస్టు భావజాలమే ప్రగతిశీల సాహిత్యంలో చోటుచేసుకుంటున్న సమయంలో వర్గాన్ని కాదని అట్టడుగు వర్గాల ప్రజల కోసం పరితపించి సాహిత్యాన్ని సృజించిన స్ఫూర్తి ప్రదాత నాగయ్య' అని సంగిశెట్టి శ్రీనివాస్ వివరించాడు. (పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం పుట19)

**ఆధార గ్రంథాలు :**


1. జానపద విజ్ఞానాధ్యయనం - డా. జి.యస్. మోహన్ - ద్రావిడ విశ్వ విద్యాలయం - 2010.
2. తెలుగు వారి జానపద కళారూపాలు - కళా ప్రపూర్ణ డా. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి - తెలుగు విశ్వవిద్యాలయం - 1992.
3. పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం -సంపాదకులు- శ్రీమతి పాలడుగు సరోజినీదేవి, శ్రీ గద్ద నర్సింగరావు - పాలడుగు నాగయ్య కళాపీఠం - 2024.


★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# నిజామాబాద్ జిల్లా గోసంగుల ప్రదర్శనకళ - పరిశీలన



- డా॥. బొదరవేణి నాగరాజు

స్కూల్ అసిస్టెంట్, తెలుగు,నిజామాబాద్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

**వ్యాస సంగ్రహం :**

గోసంగులకు ఎంతో చారిత్రక ప్రాశస్త్యం ఉంది. శ్రీకృష్ణదేవరాయలు సైతం గోసంగిని మహాత్మా అని సంబోధించినట్లు ఆముక్తమాల్యద పేర్కొంటున్నది.వీరికి గోసికె వారు, గోసంవారనే పేర్లు వ్యవహారంలో ఉన్నాయి. సిరాజుల్ హాసన్ లాంటి చరిత్రకారులు వీరు భారత సైన్యంలో పనిచేసినట్లు తెలిపాడు. ఇంతటి చారిత్రక ప్రాధాన్యత కలిగిన గోసంగులు నిజామాబాద్ జిల్లాలో ఎలాంటి స్థితిలో ఉన్నారు వారు ప్రదర్శించిన కళా రూపాలు ఏమిటి? అనే విషయాలు ఈ వ్యాసంలో ఉన్నాయి. జిల్లాలో గోసంగి వారి చరిత్రను, చరిత్ర పరిశోధకులు కందకుర్తి యాదవ రావు గారు శాసనాల ద్వారా నిరూపించగా, గనిశెట్టి రాములు జిల్లాలోని గోసంగుల సామాజిక సాంస్కృతిక కళా రంగ చరిత్రను సేకరించాడు. గోసంగి కళాకారుల ఇంటర్వ్యూలతో సామాజిక అధ్యయనంగా, పరిశోధనాత్మక పద్ధతిలో ఈ వ్యాస రచన సాగింది.

**కీలక పదాలు :**

గోసంగము, కిన్నెర, శారదకాండ్రు, గుడిసెలు వారు, గోసంగి బంటులు, కోసంగి,చెక్క బొమ్మలాట, గోసంగి వేషం.

**ప్రవేశిక :**

'సంగీత ఫలంబుగో/ సంగీ! సగమైన దయ పొసగ నీవే''(6-64) అంటూ శ్రీకృష్ణ దేవరాయలు తన ఆముక్త మాల్యద గ్రంథంలోని పద్యంలో ప్రతిరోజూ ఉదయాన్నే మంగళకైశికి రాగంతో, భగవానున్ని కీర్తించే వాడిని ''ఆ సంగీత ఫలంలో సగమైనా ఇవ్వు'' అని బ్రహ్మరాక్షసుడు అడిగే సందర్భంలో అతన్ని ''గోసంగీ'' అని సంబోధించి నట్లు రాశాడు. శ్రీహరి నిఘంటువు (పుట.286) 'గోసంగము' అను పదానికి ప్రాత:కాలము అనే అర్థాన్ని చ్చింది. ఈ అర్థాన్నిబట్టి చూస్తే గోసంగము వేళ వచ్చి, తన మధురమైన గానంతో, నిద్రపోతున్న వారిని నిద్ర నుండి మేల్కొలిపే వాడికి 'గోసంగి' అనే పేరు వచ్చి ఉంటుంది. సూర్యరాయాంధ్ర నిఘంటువు (12వ సం. పుట. 895). 'గోసము' అను పదానికి 'ప్రభాతము', 'వేకువ' అనే అర్థాలనిచ్చింది. ఈ అర్థాలను బట్టి చూస్తే గ్రామాల్లో గోసము (ప్రభాతము, వేకువ) వేళలో భుజాన కావడి మోస్తూ చేతిలో కందిలీ పట్టుకొని గంట మ్రోగిస్తూ, ప్రతీ ఇంటి వారిని నిద్ర నుండి మేల్కొల్పుతూ,పాటలు పాడుతూ భిక్షం అడుక్కునే వారికి గోసము/గోసం వారని పేరు వచ్చి ఉంటుంది.

ఆంధ్ర భాషార్ణవము శూద్ర వర్గంలో ''... గోసంగీ మాదిగ గూబరి యన మాతంగుడగు'' (2-289)[1] అని

గోసంగిని మాదిగ వాడిగా తెలిపింది.సూర్యరాయాంధ్ర నిఘంటువు (2వసం. పుట. 875) 'గోసంగి' అనే పదానికి 'మాదిగ వాడు' అని అర్థం తెలిపింది. "గోసంగి పదము మాలనికినిం గవులు ప్రయోగింతురు... అమరమందును 'చండాలప్లవమాతఙ్గ దివాకీర్తి జనఙ్గమా:'"అని చండాల(= మాల), మాతంగ(= మాదిగ) పదములను పర్యాయము లుగానుం బఠితములు ఇందువలన ఆ రెండు జాతుల భేదము ప్రాకృతమున అవివక్షితమని యేనియుం దలంపనగు"[2] అని వేదం వేంకటరాయ శాస్త్రి గారు తెలిపారు. 'ఓ భారతి కరుణామతి. భళి/శారద కరుణానిధి" అనే మాటలు వీరి ఊతపదాలుగా ఉండుటచే వీరికి శారదకాంన్రనే పేరు వచ్చిందేమోనని[3] బిరుదురాజు రామరాజు గారు ఊహించారు. వీరు బుర్రకథలను చెపుతున్నప్పుడు "ప్రధాన కథకుడు ధరించే కిన్నెరను వీరు 'శారద' అని పిలుస్తారు. శారద వాయిస్తూ కథ చెబుతారు కాబట్టి వీరిని శారదకాంన్రని అంటారని.[4] మరొక వాదన.

గోసంగీలను గోసం వారు, గోసికె వారు. గుడిసెల వారు, శారదకాండ్లు, కాటిపాపల, భౌరూపుల, బాలసంతు వారుగా వ్యవహరిస్తారు.[5] *Gosangi(gao,cow and hansaka,killer)* (The casts and tribes of H.E.H The Nizam's Dominions,vol.I.The Times press Bombay.1920.p.409) అని సిరాజుల్ హసన్ పేర్కొన్నాడు. ఇంకా "గోసంగి బంటులు"అను పేరుతో కొంతమంది మాదిగలు భారత సైన్యంలో పనిచేసినట్లు కూడా ఇదే పుస్తకంలో (పుట.420) తెలిపాడు.

1869 నాటి విశాఖపట్నం మాన్యువల్ లో గోసంగుల గురించి *"beggars who style themselves descendants of Jambavanta... The Gosangis are considered to be illegitimate descendants of Madigas, and a curious thing about them is that their women dress up like men, and sing songs when begging. As mendicants they are attached to the madigas"*(Thurston Edgar. Castes and Tribes of Southern India. vol. II. Government press. Madras. 1909. P. 298)అని వర్ణన ఉన్నట్లు ఎడ్గార్ థర్స్ టన్ తన గ్రంథంలో పేర్కొన్నాడు.ఇందులో మాదిగకు పర్యాయ పదంగా 'కోసంగి' అనే పదాన్ని 1901 వ సంవత్సరంలో మద్రాస్ సెన్సెస్ రిపోర్ట్ లో రికార్డ్ చేశారని కూడా తెలిపాడు. చిఙ్ఞావూరు నాగభూషణాచార్యులు గోసంగులని బహురూపధారులని (సంచారజాతులు. దీనాతి దీనుల చరిత్ర పరిశోధన కేంద్రం, సరసరావు పేట.1977.పుట.33) అన్నారు. ఈ గోసంగిలు ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలోని కంఠం, జలాల్ పూర్ గ్రామాల్లోని గ్రామ జనాభాలో 50% మంది వారే ఉన్నారు. లంగ్డాపూర్ గ్రామంలో 75% మంది గోసంగి వారే ఉన్నారు. నిజామాబాద్, మాక్లూర్, బోధన్, నవీపేట్, నందిపేట్, మండలాల్లో గోసంగిలు అధిక సంఖ్యలో ఉన్నారు. భీంగల్, కమ్మర్ పల్లి, మోర్తాడ్, వేల్పూర్ మొదలైన మండలాల్లోనూ వీరు విస్తరించి ఉన్నారు.గోసంగులని, పైన పేర్కొన్న విధంగా వివిధ పేర్లతో పిలవడం వలన నిజామాబాద్ జిల్లాలో వీరి కులం ఏమిటో వారికే తెలియని సందిగ్ధ పరిస్థితి ఏర్పడింది.

కాలం మారడంతో కళారూపాల్ని ప్రదర్శించే తరం తర్వాతి తరం వారు కళారూపాల్ని పక్కనపెట్టి ఇతర పనులు చేసుకోవడం మొదలు పెట్టారు. మరికొందరు ఉన్నత చదువుల కోసం సిద్ధపడగా వీరికి కుల ధ్రువీకరణ పత్రం పొందడం కష్టమైంది. చివరికి ఎన్నో వినతుల తర్వాత ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ కమీషనర్ ఉ డైరెక్టర్ గారు నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కి రాసిన లేఖ (RC.NO. 3232/89/Sc Research dated.... -7-89)లో *"Gosangi is one of the sub castes of the scheduled caste and wether "Gosem" and "Gosangi"are one and the same ... 'Gosangi' and 'Gosam' are identical it may be verified. if Gosam only a colloquial aberration of the word 'Gosam'"* [6]అని తెలిపాడు.

ఆ తర్వాత సాంఘిక సంక్షేమ శాఖ కమీషనర్, కామారెడ్డి ఆర్డీవోకి రాసిన లేఖ (RC. No. 13009/91/ SCR &T) dt 20-3-92)లో "Gasangi people are mendicant (beggars) attached to "madigas" This caste constitutes small group population. These

people are considered to be untouchbles in rural areas" [7]అని తెలిపాడు. దాంతో ఈ జిల్లా గోసంగులు ఎస్.సి కుల ధ్రువీకరణ పత్రాలను పొందగలిగారు. జిల్లాకు చెందిన గోసంగి గంధం విజయలక్ష్మి గారు 'గోసంగుల జీవన విధానం కళారూపాలు-ఒక పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. ఈ పరిశోధన గ్రంథంలో "గోసంగులు అనువర్తనం చేసుకున్న కళల్లో వీధి నాటకాలు కూడ ఉన్నాయి" (పుట.185). అని తెలిపారు. కానీ వాటి వివరాలేవీ ఇవ్వలేదు. గోసంగుల చారిత్రక పూర్వాపరాలను చర్చిస్తూ, నిజామాబాద్ జిల్లాకు చెందిన గోసంగులు కథాగానాలతో పాటుగా, కులవృత్తి నాటక కళాకారులుగా జానపద నాటకాల్ని ప్రదర్శించారని తెలుపుతూ నిజామాబాద్ జిల్లాలో వారు ప్రదర్శించిన నాటక కళారూపాన్ని గురించి పరిచయం చేయడమే ఈ వ్యాస ప్రధానోద్దేశం.

**విషయ వివరణ :**

నిజామాబాద్ జిల్లాలో గోసంగుల ప్రస్తావన చారిత్రక అంశాలతో ముడిపడి ఉంది. తా.19 మాహె సవాల్ 1202 హిజరి (1778 షా ఆలం-II కాలం) లో ఆనాటి ధర్మాబాద్ జహగీర్ లో మరాఠి మోడి లిపిలో కాటికాపరుల కోసం వ్రాయబడిన 30cm x 20cm కొలతలు గల తామ్రపత్ర శాసనం రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామంలో లభించింది. దీన్ని కందుకుర్తి యాదవరావు గారు వెలుగులోకి తెచ్చారు. ఈ శాసనాన్ని మొదట 1691లోనే ఔరంగజేబు కాలంలో జారీ చేశారు. దాన్ని కాటికాపరులు పోగొట్టుకోగా తిరిగి 1788లో జారీ చేసినట్లు కందకుర్తి యాదవరావు గారు(చరిత్ర పరిశోధన వ్యాసావళి. ఇతిహాస సంకలన సమితి(భారతీయ) ఇందూర్, 2006.పుట.50) పేర్కొన్నారు. ఈ తామ్రపత్ర శాసనంలో కాటికాపరుల కార్యక్రమాల రుసుముల వివరాలు ఉన్నాయి, ఇంకా కాటికాపరులని 'స్వర్గ వీర' అని సంబోధించినట్లు ఉందని (పుట.51),వారిని గోసమొల్లు, సంచార జాతుల వారు, గ్రామ గోసాయి అని అంటుంటారని (పుట.53) పేర్కొన్నారు. ఈ తామ్రపత్ర శాసనం ఇప్పటికీ సాటాపూర్ లోని గోసంగి మోటం రాములు వద్ద ఉందని (విజయలక్ష్మి గంధం, గోసంగుల జీవన విధానం-కళారూపాలు ఒక పరిశీలన,2019,పుట.73) తెలుస్తున్నది. బాసర్ లో దొరికిన తామ్ర పత్ర శాసనంలో మాహుర్ లోని దేవిగిర్ మహారాజ్ మఠం వారు బాసర్ గ్రామస్తుడు గంగాగిర్ మహారాజ్ కి ఇచ్చిన కొన్ని అధికారాలు, దానాలు పొందే హక్కుల గురించిన సమాచారం ఉంది. ఈ గిర్ సాధువులు కూడా మఠాన్ని కలిగిన ఒక రకం గోసంగులే (పుట.222)అని తెలుస్తున్నది. దశనామ సాధువుల్లో గిర్ లు ఒకరకమైతే గోసంగులు ఒక రకం. వీళ్ళకి ఆధ్యాత్మిక కేంద్రాలు ఉండేవి. వీటిని ఖండాలు, కూటాలు అంటారు. బీదరికం వల్ల వీళ్లు భిక్షకులయ్యారని. (పుట. 223) కందకుర్తి యాదవ రావు గారు తెలిపినట్లు గంధం విజయలక్ష్మి గారు పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాకి చెందిన గనిశెట్టి రాములు జిల్లా అంతటా పర్యటించి, గోసంగుల సామాజిక సాంస్కృతిక కళారంగ చరిత్రను సేకరించాడు. గోసంగిల చరిత్రను తెలుసుకోవడానికి లంగ్డాపూర్ కి చెందిన రాసరి సాయన్న అనే గోసంగి వృద్ధుడిని ఇంటర్వ్యూ చేసి, ఎన్నో విషయాలు సేకరించాడు. అంతేకాకుండా గోసంగుల గురించి వివరించే 'చీకటి బ్రతుకుల్లో గోసంగిలు(2004)' 'గోసంగిలు ఎవరు?(2005)' అనే పుస్తకాలను రాసి, జిల్లా గోసంగిల్లో చైతన్యం తీసుకువచ్చాడు. (డా. నాగరాజు. బి, నిజామాబాద్ జిల్లా రంగస్థల నాటకం -ఒక అధ్యయనం, అముద్రిత సిద్ధాంత గ్రంథం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2022, పుట. 95). గోసంగులు వృత్తి నాటక కళాకారులుగా నాటకాలని ప్రదర్శించేవారని ఇదివరకే తెలుసుకున్నాం. వారు ఈ నాటకాల్ని ప్రదర్శించడానికి ముందు, చెక్క బొమ్మల ద్వారా కథా ప్రదర్శన చేస్తూ జీవనం సాగించేవారు.

**1. గోసంగుల చెక్కబొమ్మలాట :**

గోసంగులు కొన్ని గ్రామాలను వతన్ (వంశపారంపర్య హక్కు)గా నిర్ణయించుకొని ఆయా గ్రామాలలో జానపద కళల్ని ప్రదర్శించేవారు.ఈ హక్కుని వారు పూర్వం నుంచి వస్తున్న ఆనవాయితీగా భావించేవారు.[8] యాదవులకు యాదవ కథలను చెప్పేటప్పుడు ఒక్కో చెక్క బొమ్మని చూపిస్తూ కథను చెప్పేవారు. ఇంకా యాదవుల

పూర్వీకుల కథలను కూడా చెప్పి హక్కుగా గొర్లను తీసుకునేవారు. నిజామాబాద్ జిల్లాలోని లంగ్డాపూర్ గ్రామానికి చెందిన గోసంగి ఈర్నాల వీరన్న ఈ చెక్క బొమ్మల్ని చూపిస్తూ, కథ చెప్పడంలో ప్రసిద్ధుడు. ఇతను జగదాంబ మహారాజు కథ, బాలనాగమ్మ కథ, ఇతర యాదవ కథలను చెప్పేవాడు.

ఈ చెక్కబొమ్మల్లో ముఖ్యంగా యాదవులకు సంబంధించిన శ్రీకృష్ణుడు, సత్యభామ మొదలైన వారి చెక్కబొమ్మలు ఉండేవి. ఈ గోసంగులు స్థానికంగా దొరికే కలపతో తగినన్ని చెక్కబొమ్మల్ని తయారుచేసుకుని కథలు చెప్పేవారు. కొన్ని సందర్భాల్లో వీరు ఈ బొమ్మల్ని మట్టితో కూడా తయారు చేసుకుని వాటికి రంగులు వేసి ప్రదర్శించే వారని గనిశెట్టి రాములు ఈ వ్యాసకర్తతో తెలిపారు.

ఈ కథను ప్రదర్శించేటపుడు ప్రదర్శించే వ్యక్తి, తన ముందు బొమ్మలని పెట్టుకొని కథా క్రమాన్ని అనుసరించి ఒక్కో బొమ్మని తీసి, దాన్ని అందరికీ చూపిస్తూ, ఆ బొమ్మకి సంబంధించిన కథను చెప్పేవాడు. ఇతని కథనానికి అనుగుణంగా వెనక నుండి వీరి సభ్యులు డప్పుని, ఇతర వాయిద్యాలను వాయిస్తూ, వంత పాడేవారు. ఈ చెక్క బొమ్మల ప్రదర్శన ద్వారా ప్రజలకు నైతిక విలువలను, ధర్మాన్ని, న్యాయాన్ని తెలిపేవారు. వీరు ఈ బొమ్మలన్నింటినీ ఒక పెట్టెలో పెట్టేవారు. ఈ బొమ్మల్ని పెట్టెలో నుండి తీసేటప్పుడు గాని, పెట్టేటప్పుడు గాని, ఎంతో నిష్టగా పూజ చేసేవారని. పెట్టెను విప్పేటప్పుడు ఎల్లమ్మ తల్లికి సంబంధించిన పాటలు పాడేవారని, 1964 ప్రాంతంలో ఈ జిల్లాలో వీటిని విస్తృతంగా ప్రదర్శించారని, మహారాష్ట్రలో చాలా చోట్ల ప్రదర్శించారని గనిశెట్టి రాములు ఈ వ్యాసకర్తతో తెలిపారు. ఆ తర్వాతి కాలంలో గోసంగులు కథాగానాలని తగ్గించి నాటక ప్రదర్శనలపై దృష్టి పెట్టారు.

### 2. గోసంగుల నాటక ప్రదర్శనలు :

#### 1. గోసంగి నాట్య మండలి - బాద్గుణ :

గోసంగుల రంగస్థల నాటకాల గురించి పూర్తి వివరాలు సేకరించడానికి నేను(వ్యాసకర్త) తేది: 07-05-2019 రోజున బాద్గుణ గ్రామంలోని పత్తిరి నారాయణ (95), మిర్యాల లింగన్న (65), మిర్యాల పెద్ద సాయన్న (60), మిర్యాల గంగాధర్, నేరడిగొండ సాయన్న, నేరడి గొండ లస్మన్న, మిర్యాల చిన్న సాయిలు అనే గోసంగి కులస్తులను ఇంటర్వ్యూ చేసి, ఎన్నో వివరాలు సేకరించాను. ఈ ఊరిలో 95 సంవత్సరాల గోసంగి వృద్ధుడు పత్తిరి నారాయణ గారు ఆ వయసులో కూడా గోసంగి వేషం ధరించి భిక్షాటన చేస్తున్నాడు. అతను చెప్పిన వివరాల ప్రకారం ఈ బాద్గుణ గోసంగి నాట్య మండలిలో పత్తిరి నారాయణ, నేరడి కొండ ఎల్లప్ప (గంగారాం), నడ్పి గంగారం (స్త్రీ పాత్రధారి), చిన్న నడ్పోడు, మిర్యాల ఎల్లప్ప (హాస్య పాత్ర ధారి), సాయిలు, భోజన్న, మిర్యాల లింగన్న, శెట్టన్న, గుడ్డం పల్లి సాయన్న (స్త్రీ పాత్ర ధారి), కుంటాల ఎల్లప్ప (స్త్రీ పాత్రధారి) మొదలైన వారు సభ్యులుగా ఉండేవారు. "ఒక్క కథా గానంతోనే తృప్తి పడని వీరు, తాము చెప్పే కథలనే యక్షగాన ఫక్కీలోనికి మార్చుకొని ప్రదర్శనలిచ్చేవారు"[9] అని డా.చాట్ల నర్సయ్య గారు గోసంగుల నాటక ప్రదర్శనల గురించి చెప్పిన విషయం ఈ బాద్గుణ గోసంగి నాట్య మండలి వారికి సరిగ్గా సరిపోతాయి. ఎందుకంటే వీరు కూడా అంతకు ముందు గాన రూపంలో చెప్పిన కథలకే సంభాషణలు చేర్చి, నాటకాల రూపంలో ప్రదర్శించేవారు. నాగిరెడ్డి కథ, రంగంపేట సదాశివరెడ్డి కథ, శంకరమ్మ కథ, ఆరె హట్కరోల్ల కథ, కొండ్రాయుడు కథ, బాలనాగమ్మ కథ, లక్ష్మీ కథ మొదలైన ఈ కథలన్నింటినీ నాటక రూపంలో మార్చుకుని రంగస్థలంపై ప్రదర్శించేవారు. ప్రదర్శన కోసం గ్రామ పెద్దల నుండి వీరికి అనుమతి లభించగానే గ్రామంలోని ముఖ్యమైన ప్రదేశంలో రంగస్థలాన్ని ఏర్పాటు చేసుకొని, చుట్టూ పరదాలు కట్టుకొని డేరాలు వేసి, రాత్రిపూట బిజిలీల వెలుతురులో నాటకాల్ని ప్రదర్శించేవారు. వీరు తలా కొన్ని డబ్బులు వేసుకొని డేరాల్ని, పరదాల్ని కొనుక్కున్నారు. వీరు రంగస్థలంపై గిరకల పరదా ఏర్పాటు చేసుకుని ఆ పరదా వెనుక నుండి ఒక పాత్ర, పాట పాడుతూ ఉండగా దాన్ని పైకి తిప్పుతు, ఆ పాత్రని రంగస్థలంపై ప్రవేశపెట్టేవారు. వీరు తర్వాతి

కాలంలో టికెట్టు ప్రదర్శనలు ఇచ్చారు. పత్తిరి నారాయణ గారు నాటకాల్ని ప్రదర్శించే తొలి నాళ్ళలో టికెట్టు ధర 5 మరియు 10 పైసలు ఉండేదట, ఆ తర్వాత అది 25 మరియు 50 పైసల వరకు పెరిగిందట. ఆ తర్వాతి కాలంలో టికెట్ ధర ఒక రూపాయి మరియు రెండు రూపాయలు ఉండేదని ఈ సమయంలోనే తాము విస్తృత ప్రదర్శనలు ఇచ్చామని పత్తిరి నారాయణ గారు ఈ వ్యాసకర్తతో తెలిపారు.

**2. బండ మీది పెద్ద మల్లయ్య నాటక బృందం - కంఠం:**

ఈ నాటక బృందం జిల్లాలోని నందిపేట్ మండలం లోని 'కంఠం' గ్రామానికి చెందినది. ఈ బృందం బండ మీది పెద్ద మల్లయ్య అతని తమ్ముడు బండ మీది నడిపి మల్లయ్య ఆధ్వర్యంలో పనిచేస్తుంది. వీరిద్దరూ స్త్రీ వేషధారులు. విషాద స్త్రీ పాత్రల్ని నడ్పి మల్లయ్య పోషించగా, ఛల్తీ మీద సాగే స్త్రీ పాత్రల్ని పెద్ద మల్లయ్య పోషించేవాడు. తన తండ్రి బండ మీది గంగారాం నుంచి మల్లయ్య నటనని నేర్చుకున్నాడు. ఈ గంగారం గారు 90సం క్రితం ఎన్నో నాటకాల్లో అద్భుతమైన పాత్రలు పోషించారు. ఈ గంగారం బృందంలో ఆనాడు గంధం గంగారం, సుగుణాకర్, మల్లయ్య, సుంకు రామన్న, గంధం ఎర్రన్న, జడల మల్లయ్య మొదలైన నటులు ఉండేవారు. ఈ నాటక బృందం ఆధ్వర్యంలో హరిశ్చంద్ర, భక్త ప్రహ్లాద, భక్త తుకారాం, భక్త కన్నప్ప, శశిరేఖ పరిణయం, ఘటోత్కచ, పాండవ వనవాసం, రామాయణం మొదలైన ఈ నాటకాల్ని ప్రదర్శించి ఎందరినో మెప్పించారు.ఇదే వారసత్వాన్ని అందుకున్న మల్లయ్య బృందం కూడా హరిశ్చంద్ర, భక్త ప్రహ్లాద, భక్త పుండరీక, భక్త కన్నప్ప, కనకతార, మాణిక్యాల దేవి, నల చక్రవర్తి, మాంధాత, సారంగధర, సత్యవర్మ, చంద్రసేన, ఉగ్రసేన, విజ్ఞావతి దేవరాజు, జగన్మోహిని, శివ కుమారుడు, ధర్మాంగ మహారాజు, శ్రీదేవి పెద్దమ్మ, మల్లన్న ఆట, నల్ల పోశమ్మ ఆట, ఎల్లమ్మ ఆట మొదలైన జానపద రంగస్థల నాటకాల్ని ప్రదర్శించారు. వీరు నల్ల పోశమ్మ, ఎల్లమ్మ నాటకాల్ని ప్రదర్శించేటప్పుడు మాంసానికి దూరంగా ఉండేవారు. ఈ నాటక సమాజంలో 1. బండ మీది పెద్ద మల్లయ్య 2. బండి మీది నడ్పి మల్లయ్య 3. కళ్ళెం లక్ష్మణ్, 4. పంతులు గంగన్న (సీనియర్),5. పంతులు గంగన్న (జూనియర్), 6. రేవెల్లి పెంటన్న (హాస్య పాత్రధారి), 7. గంధం లస్మన్న (హాస్య పాత్ర ధారి), 8. గంధం పోశెట్టి (హాస్య పాత్ర ధారి), 9. కళ్ళెం చిద్రం గంగ మల్లు,11. జడల మల్లయ్య, 12. నజీర్ (తబలిస్ట్), 13. జంగం నాగార్జున (తబలిస్ట్), 14. పత్రి నడిపి గంగారం, 15. గంధం జలాల్ (ధర్మారం). మొదలైన వారు సభ్యులుగా ఉండేవారు. వీరంతా ప్రదర్శనకి అవసరమైన సామాగ్రి, ఆహార్యం గల పెట్టెలని తలపై పెట్టుకుని ఊరూరా తిరుగుతు, ప్రదర్శనలిచ్చేవారు. నిజామాబాద్ జిల్లా మొత్తం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో చాలా చోట్లలో మరియు మహారాష్ట్రలోని చాలా చోట్లలో వీరు నాటకాల్ని ప్రదర్శించినట్లు, వెళ్లిన ప్రతీ గ్రామంలో యాచిస్తూ, వీళ్లే స్వయంపాకం చేసుకుని జీవనం సాగించే వారని. తాను కొంత కాలం పాటు సీతారాంపల్లి గౌడశెట్టి రంగస్థల నాటక బృందం ప్రదర్శించే నాటకాల్లో నటించానని. పెద్ద మల్లయ్య ఈ వ్యాసకర్తతో తెలిపారు.[10]

**3. కళ్ళెం లక్ష్మణ్ నాటక బృందం - లింగాపూర్ :**

ఈ నాటక బృందం జిల్లాలోని నవీపేట్ మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందింది. ఇది కళ్ళెం లక్ష్మణ్ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. కళ్ళెం లక్ష్మణ్ తండ్రి కళ్ళెం పోశెట్టి మంచి నటుడు. ఈయన మొదట్లో కథలు చెప్పేవాడు. ఆ తర్వాత వేషాన్ని ధరించి కథలు చెప్పాడు. ఆ రోజుల్లో దాసరి వాళ్ళు ఊరూరా తిరుగుతూ రంగస్థలం ఏర్పాటు చేసుకుని వేషాలు ధరించి జానపద నాటకాలు ప్రదర్శించడం చూసి, తాను సాధారణంగా చెప్పే కథని నాటకంలా మార్చి రంగస్థలంపై ప్రదర్శిస్తే ఎక్కువమంది ఆదరిస్తారు కదా! అనే ఆలోచనతో తాను చెప్పే కథలనే నాటకీకరణ చేశాడు. ఇలా నాటకీకరణ చేసిన ఆ కథలు వారు వంశపారంపర్యంగా చెప్తున్న కథ కాబట్టి, వాటిలో కొద్ది మార్పులతో చేసిన సంభాషణలను వారి కుమారులకి నేర్పడం మొదలుపెట్టాడు. "మా తండ్రి పోశెట్టి, రాజు వేషం ధరిస్తూ, తన కుమారులైన మాచేత స్త్రీ వేషాలు ధరింపజేస్తూ, ఈ మాటని ఇలా పలకాలి, ఇక్కడ ఇలా

నడవాలి, ఇక్కడ ఇలా చూడాలి, ఇలా నటించాలి, అంటూ 15 రోజుల పాటు ప్రతి రోజు రాత్రి పూట మా ఇంట్లోనే తర్ఫీదు నిచ్చాడని."[11] కళ్ళెం లక్ష్మణ్ ఈ వ్యాస కర్తతో తెలిపారు. ఇలా వీరు మొదటగా అభ్యసించిన నాటకం "సత్యసేన మహారాజు కథ" దీన్ని మొట్టమొదటగా తమ స్వగ్రామం లింగాపూర్ లోని గ్రామ పంచాయతి వద్ద ప్రదర్శించారు. ఆ తర్వాత ఇదే నాటకాన్ని నిజాంపూర్, తుంగిని, నాళేశ్వర్, గ్రామాల్లో ప్రదర్శించారు .కళ్ళెం పోశెట్టి, ఇలా చాలా కథలను నాటకాలుగా మార్చుకుని తన కుమారుల చేత ప్రదర్శింపజేశాడు. ఇతను అంతకుముందే ఆంద్రాసి గంగారం, కంఠం గ్రామానికి చెందిన కళ్ళెం గంగాధర్, బండమీది మల్లయ్య, సంకు రామన్న మొదలైన నటులతో కలిసి చాలా నాటకాల్ని ప్రదర్శించాడు. ఈ నాటక సమాజంలో కళ్లెం లక్ష్మణ్, గంధం రాములు, గంధం జలాల్ సాయన్న, ఈర్నాల ఎర్రన్న, బండ మీది మల్లయ్య, పత్రి గంగాధర్, ఆంద్రాసి గంగారం (బుడ్డర్ ఖాన్) మొదలైన వారు సభ్యులుగా ఉండేవారు.ఈ నాటక సమాజం వారు గంధపురి మహారాజు కథ, మైనావతి కథ, హట్కరోల్ల (ముగ్గురు అన్నదమ్ముల కథ), ఎర్రగొల్ల కాంభోజరాజు కథ, యజ్ఞవతి దేవల మహరాజు కథ, నాగిరెడ్డి కథ, హరిశ్చంద్ర, భక్త పుండరీక, ధాత మాంధాత చరిత్ర, సూర్య చంద్ర మహారాజు కథ, శంకరమ్మ కథ, నవభోజరాజు కథ, ధర్మాంగ మహారాజు కథ, మహాలక్ష్మి దేవి కథ, సత్యవతి కథ, మొదలైన నాటకాల్ని ప్రదర్శించే వారు. వీటిని వీరి పూర్వీకులు కథాగానాల రూపంలో ప్రదర్శించే వారు. వీరు ఆ కథాగానాలలో చెప్పే వాటినే నాటకీకరించు కొని నాటకాలుగా ప్రదర్శించారు.

**ఉపసంహారం :**

ఈ గోసంగులు ఒకప్పుడు విచిత్ర భాష(తమకు మాత్రమే అర్థమయ్యే రహస్య భాష)ని మాట్లాడుతూ, యాచనే వృత్తిగా, విద్యాహీనులై దేశ దిమ్మరులుగా ఉంటూ తమ కళలని ప్రదర్శిస్తూ జీవనం గడిపేవారు. ముఖ్యంగా రామాయణ కథ, మహాభారత కథ, బొబ్బిలి యుద్ధం కథ, జగదేక వీరుని కథ, కాంభోజరాజు కథ, బాలనాగమ్మ కథ, గాంధీ నెహ్రూ కథ. మైనావతి కథ, లక్ష్మీకథ, నాగిరెడ్డి కథ, వీరసేనా కథ, నలచక్రవర్తి కథ, కొండయ్య కథ, మాంధాత కథ, సత్యసేనా మహారాజు కథ, ముక్కంటి మహారాజు కథ, కాటమరాజు కథ, శంకరమ్మ కథ, మొదలైన కథలను జానపద గాన రూపంలో, బుర్రకథల రూపంలో చెప్పేవారు. ఆ తర్వాత ఇవే కథలను నాటకీకరించుకొని, వేషాలు వేసుకొని రంగస్థలంపై జానపద నాటకాలుగా ప్రదర్శించారు. సమకాలీన సమాజంలో ఇతర కులవృత్తి నాటక కళాకారు లిచ్చే పోటీని తట్టుకోవడం కోసం, ఇంకా చెప్పాలంటే తమ ఉనికిని కాపాడుకోవడం కోసం వంశపారంపర్యంగా వస్తున్న కథాగానాలని నాటకీకరించుకోవడం అనేది వీరు అనుసరించిన గొప్ప వ్యూహం. ఇలా నిజామాబాద్ జిల్లా గోసంగి కళాకారులు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని తాము బతుకుతూ, ప్రదర్శన కళారూపాలని బతికించారు.

**పాద సూచికలు :**


1. వెంకనార్యుడు కోటి. ఆంధ్ర భాషార్ణవము. వావిళ్ళ రామస్వామి శాస్త్రులు ౘ సన్స్. మద్రాస్. 1931. పుట.80
2. వెంకటరాయశాస్త్రి.వేదము.ఆముక్తమాల్యద సంజీవని వ్యాఖ్య,వేదము వేయటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్. మదరాసు.1964.పుట.607
3. రామరాజు బిరుదురాజు. తెలుగు జానపద గేయ సాహిత్యము. తెలుగు అకాడమి. హైదరాబాదు.2015.పుట.649
4. నర్సయ్య చాట్ల. పనస హనుమద్దాసు రచనలు పరిశీలన. చాట్ల ప్రచురణలు.కామరెడ్డి. 2008.పుట.242
5. రాములు గనిశెట్టి. చీకటి ప్రతుకుల్లో గోసంగిలు. జిల్లా గోసంగి సంఘం. నిజమాబాద్. 2004. పుట. 6
6. రాములు గనిశెట్టి, చీకటి బ్రతుకుల్లో గోసంగిలు. జిల్లాగోసంగి సంఘం. నిజామాబాద్.2004.పుట.45

7. రాములు గనిశెట్టి, చీకటి బ్రతుకుల్లో గోసంగిలు. జిల్లాగోసంగి సంఘం. నిజామాబాద్.2004.పుట.45
8. రాములు గనిశెట్టి, చీకటి బ్రతుకుల్లో గోసంగిలు, జిల్లా గోసంగి సంఘం నిజామాబాద్, 2004, పుట.10
9. నరసయ్య చాట్ల, పనస హనుమద్దాసు రచనలు పరిశీలన, చాట్ల ప్రచురణలు, కామారెడ్డి , 2008, పుట.242
10. తేది : 01- 06-2019 నాటి, 'కంఠం'కి చెందిన 'గోసంగి కులవృత్తి నాటక కళాకారుడు' పెద్ద మల్లయ్య గారి ఇంటర్వ్యూ ఆధారంగా రాసింది.
11. తేది:29-05-2019 నాటి, లింగాపూర్ కి చెందిన 'గోసంగి కులవృత్తి నాటక కళాకారుడు' కళ్ళెం లక్ష్మణ్ గారి ఇంటర్వ్యూ ఆధారంగా రాసింది.

**ఆధార గ్రంథాలు :**


1. నాగభూషణాచార్యులు చిఙ్ఞాపూరు, సంచార జాతులు. సరసరావు పేట : దీనాతి దీనుల చరిత్ర పరిశోధన కేంద్రం, 1977
2. డా. నాగరాజు. బి, నిజామాబాద్ జిల్లా రంగస్థల నాటకం - ఒక అధ్యయనం, అముద్రిత సిద్ధాంత గ్రంథం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్,2022
3. డా.నర్సయ్య చాట్ల. పనస హనుమద్దాసు రచనలు పరిశీలన. కామరెడ్డి: చాట్ల ప్రచురణలు. 2008
4. రామరాజు బిరుదురాజు. తెలుగు జానపద గేయసాహిత్యము. హైదరాబాదు: తెలుగు అకాడమి. 2015
5. రాములు గనిశెట్టి. చీకటి ప్రతుకుల్లో గోసంగిలు. నిజమాబాద్: జిల్లా గోసంగి సంఘం. 2004
6. Siraj ul Hasan Syed. The casts and tribes of H.E.H The Nizam's Dominions,vol.I. Bombay: The Times press, 1920.
7. Thurston Edgar. Castes and Tribes of Southern India. vol.II. Madras : Government press. 1909.
8. వెంకనార్యుడు కోటి. ఆంధ్ర భాషార్ణవము. మద్రాస్ : వావిళ్ళ రామస్వామి శాస్త్రులు & సన్స్. 1931
9. వెంకటరాయశాస్త్రి.వేదము.ఆముక్తమాల్యద సంజీవని వ్యాఖ్య, మదరాసు : వేదము వేయటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్. 1964.
10. డా.విజయలక్ష్మి గంధం, గోసంగుల జీవన విధానం-కళారూపాలు ఒక పరిశీలన,హైదరాబాద్ :పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2019
11. యాదవరావు కందకుర్తి,చరిత్ర పరిశోధన వ్యాసావళి. ఇతిహాస సంకలన సమితి(భారతీయ)ఇందూర్,2006.


★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# జానపదుల సాంస్కృతిక అస్తిత్వానికి నిలువుటద్దం గ్రామదేవతలు



- తోట ప్రశాంత్ కుమార్

Ph.D (తెలుగు), సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్.

**వ్యాస సంగ్రహం :**

గ్రామదేవతలు జానపదుల సాంస్కృతిక అస్తిత్వానికి, సామాజిక ఐక్యతకు మరియు ప్రాచీన మాతృస్వామ్య నమ్మకాలకు ప్రతీకలుగా నిలుస్తారు. ప్రకృతి ఆరాధన, గ్రామ రక్షణ, మౌఖిక సాహిత్యం మరియు కులమతాలకు అతీతమైన ఉత్సవాల ద్వారా ఈ దేవతలు గ్రామీణ సంస్కృతిని సజీవంగా ఉంచుతున్నారు.గ్రామదేవతల ఆరాధన తెలుగు వారి జానపద సంస్కృతి, సామాజిక ఐక్యత మరియు ప్రకృతి ఆరాధనకు నిలువుటద్దం. ఈ వ్యాసం జాతరలు, జానపద కళలు మరియు స్థానిక కథల ద్వారా జానపదుల అస్తిత్వాన్ని, ఆధునిక కాలంలో ఆ సంప్రదాయాల పరిరక్షణ ఆవశ్యకతను విశ్లేషిస్తుంది.

**కీలక పదాలు :**

జానపదులు, గ్రామదేవతలు, సంస్కృతి, ఆచారం, వీరగల్లు, అస్తిత్వం, పండుగలు.

**పరిచయం :**

భారతీయ సంస్కృతిలో జానపద విజ్ఞానం అత్యంత ప్రాచీనమైనది. జానపదుల సాంస్కృతిక అస్తిత్వానికి మట్టిమనుషులతో, మరియు మౌఖిక సంప్రదాయాలతో అంతర్లీనమై ఉంటుంది. ఈ జానపద అస్తిత్వాన్ని కాపాడుకోవడంలో గ్రామదేవతల ఆరాధన అనేది మూలస్తానం. మరీ ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో గ్రామదేవతల ఆరాధన అనేది కేవలం ఒక మతపరమైన నమ్మకం మాత్రమే కాదు, అది ఒక సామాజిక జీవన విధానం. జానపదులు ప్రధానంగా వ్యవసాయం, పశు పోషణ మరియు కులవృత్తులపై ఆధారపడి జీవిస్తారు కాబట్టి వారి అస్తిత్వం వారి శ్రమతో ముడిపడింది. అందు లోనే వారి సాంస్కృతిక జీవితం అంతర్గతంగా ఉంది. వారు చేసే పొలం పనులలో భాగంగా శ్రమను మరవటా నికి అప్రయత్నంగా పాడే పాటలు (జానపద గేయాలుగా), వారు పండించిన పంట చేతికి వచ్చినప్పుడు ఆనందంతో జరుపుకునే జానపద పండుగలు (సంక్రాంతి, ఉగాది) వంటివి వారు శ్రమకు ఇచ్చే గౌరవానికి అసలైన నిదర్శనం. జానపద సంస్కృతిలో 'ఊరు' అనేది ఒక కుటుంబంలా ఉంటుంది.గ్రామాన్ని దుష్టశక్తుల నుండి, వ్యాధుల నుండి రక్షించే 'శక్తి'గా 'అమ్మ'గా గ్రామదేవత అనే పేరుతో కొలుస్తారు. జానపదుల ఆచారాలు, కళలు, కట్టుబాట్లు మరియు వారి అస్తిత్వానికి ఈ దేవతలే మూల ఆధారం.

గ్రామదేవతకు చేసే ఆరాధన, జాతరలలో ప్రతివృత్తి పేరుతో ఏర్పరడిన జనసమూహానికి (కులం) ఒక ప్రత్యేక బాధ్యతతో కూడిన గౌరవం ఉంటుంది. ఈ పరస్పర ఆధారిత జీవన విధానమే జానపదుల అసలైన సామాజిక

అస్తిత్వానికి మూలం. ఇదే ఊర్లమద్య (గ్రామాల) సామాజిక ఐక్యతను ప్రతిబింబిస్తుంది.

**గ్రామదేవతల సాంప్రదాయం అస్తిత్వం :**

జానపదుల యొక్క ఆచారాలు, సాంప్రదాయాలు, నమ్మకాలు మరియు కళలు అనేవి గ్రామీణ సామాజిక జీవన విధానంతో ముడిపడి అంతా ఈ గ్రామదేవతల చుట్టే నిర్మితమై ఉంటుంది. ఒక్కో గ్రామదేవత వెనుక ఒక్కో స్థానికమైన కథ నిర్మించబడి ఉంటుంది. ఈ కథలన్ని ఆయా ప్రాంతాలలోని పోరాటాలను, త్యాగాలను మరియు చరిత్రను భవిష్యత్ తరాలకు అందిస్తున్నాయి. గ్రామదేవతలు దాదాపు అందరూ స్త్రీ మూర్తులే ప్రధానంగా ఉంటారు. దానికి ప్రధానమైన కారణం లేకపోలేదు. ఎందుకంటే ఇది ప్రాచీన కాలం నుండి సమాజంలో స్త్రీ శక్తికి, తల్లికి ఇస్తున్న గౌరవాన్ని మరియు మరీ ముఖ్యంగా మాతృస్వామ్య వ్యవస్థను సూచిస్తుంది. నాడు తల్లే కుటుంబ పెద్దగా ఉండి సంసారభారాన్ని నడిపించేది. అందుకని మాతృసామ్యయుతమైన సమాజం నాడు రూపొందించబడింది.

**గ్రామదేవతల చారిత్రక నేపథ్యం :**

గ్రామ దేవతలను ఆరాధించడం అనేది ఆర్యుల రాకకంటే ముందునండే ఉన్నట్టు మనకు చారిత్రక ఆధారాలు లభించాయి. అందులో ముఖ్యమైన ఖచ్చిమైన ఆధారం సింధు నాగరికత తవ్వకాలలో బయలుపడిన అమ్మతల్లి, పశుపతి, సూర్యుడు, చంద్రుడు, పశువులు మొదలైన వాటిని దేవతల రూపంలో ఆనాటి ప్రజలు పూజించినట్లు చరిత్ర చెబుతోంది. ఇది మాతృస్వామ్య వ్యవస్థకు ప్రతీక. గాలి, నీరు, అగ్ని, భూమి వంటి ప్రకృతి శక్తులను కూడా దేవతలుగా భావించి పూజించడం అనేది జానపదుల యొక్క ప్రత్యేకత. సాధారణంగా గ్రామ దేవతలలో స్త్రీదేవతలుగా 101 మంది అక్కాచెల్లెళ్లని, వీరికి తోడుగా 'పోతురాజు' అనే తమ్ముడు ఉంటాడని జానపద మౌఖిక కథలు వివరిస్తాయి.

గ్రామదేవతల వెనుక ఒక స్థానిక పోరాట చరిత్ర ఉంటుంది. గ్రామం కోసం ప్రాణత్యాగం చేసిన వీర వనితలను దేవతలుగా కొలవడం కనిపిస్తుంది. వీటికి చారిత్రకఆధారం ఉంది అనేక ప్రాంతాలలో వీటికి సంబందించి బయల్పడిన "వీరగల్లులు" సాక్ష్యం.ఇవి ఆయా ప్రాంతాల భాషా ప్రయోగాలను, చరిత్రను తరతరాలకు అందిస్తుంది.

గ్రామ దేవతలకు మరియు శాసనాలకు మధ్య ఉన్న సంబంధం మన సంస్కృతి, చరిత్రను అర్థం చేసు కోవాలంటే చాలా కీలకమైనది. శాసనాల ద్వారా గ్రామ దేవతల ప్రాచీనత, ఆనాటి సామాజిక పరిస్థితుల గురించి విలువైన సమాచారం లభిస్తుంది. అనేక శాసనాల్లో స్థానిక దేవతలకు రాజులు భూదానాలు చేసినట్లు, గుళ్ల కట్టించి నట్లు ఆధారాలు ఉన్నాయి. అలాగే కాకతీయుల కాలంలో 'కాకతి' అనే గ్రామదేవతను పూజించినట్లు శాసనసంబంధ ఆధారాలు ఉన్నాయి. దీనికి సంబందించిన సమాచారం ప్రస్తుత వరంగల్ (ఓరుగల్లు) లో కాకతమ్మ దేవాలయం ఉన్నట్లు క్రీడాభిరామం వంటి గ్రంథాలతో పాటు శాసన సాక్ష్యాలు కూడా ఉన్నాయి. అదేవిధంగా గ్రామదేవతలు గ్రామాలకు రాజవంశాలకు రక్షణ దేవతలుగా ఉన్నట్లు శాసనాలలో ఆధారాలు లభించాయి.

**గ్రామదేవతలు కొన్ని శాసన ఆధారాలు :**

రాజులు, సామంతులు గ్రామదేవతల ఆలయాల నిర్వహణ కోసం, నిత్య ధూపదీప నైవేద్యాల కోసం భూములను దానంగా ఇచ్చినట్లు అనేక శాసనాలు పేర్కొంటున్నాయి. కొన్ని ఉదాహరణలు ఈ క్రింది విధంగా

- ప్రకాశం జిల్లా పాలట్ల అనే గ్రామంలోని 'పోలేరమ్మ' దేవాలయం వద్ద 16వ శతాబ్దానికి చెందిన రెండు తెలుగు శాసనాలు లభించాయి. ఇవి ఆ కాలంలో గ్రామదేవతలకు ఉన్న ప్రాముఖ్యతను, భక్తులు సమర్పించిన కానుకలను గురించిన సమాచారాన్ని తెలియజేస్తున్నాయి.
- నెల్లూరులో కొలువైన 'ఇరుగాళమ్మ' నిజానికి ఒక జైన శాసన దేవత అని, కాలక్రమేణా ఆమెను గ్రామదేవతగా పూజించడం మొదలుపెట్టారని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.
- వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి ఆలయంతో పాటు ప్రాచీనమైన బద్ది పోచమ్మ ఆలయం కూడా

ఉంది, దీనికి సంబంధించిన ప్రస్తావనలు స్థానిక చారిత్రక ఆధారాలలో కనిపిస్తాయి.

**గ్రామదేవతలు కొందరు :**

పోలేరమ్మ : గ్రామాన్ని రోగాల నుండి రక్షించే దేవత.

ముత్యాలమ్మ : వర్షాల కోసం, పంటల కోసం పూజిస్తారు.

గంగమ్మ : జలవనరుల దేవతగా ఆరాధించ బడుతుంది. అలాగే ఈదమ్మ, పోచమ్మ, అంకాలమ్మ, ఎల్లమ్మ, ఊరడమ్మ, మొదలగు దేవతలు జనపదాలలో ప్రధానంగా కొలవబడుతున్నారు.

పోతురాజు : 101 దేవతలందరికీ ఏకైక తమ్ముడిగా పరిగణించబడతాడు.గ్రామానికి దుష్ట శక్తులు రాకుండా అడ్డుకుంటు ఊరు భయట ఉంటాడు.

**గ్రామదేవతల పూజలు :**

గ్రామదేవతల పూజావిధానాలు అనేవి వేదోక్తంగా కాకుండా, జానపద సంప్రదాయాల ప్రకారం, జంతు బలులు మరియు డప్పు వాయిద్యాలతో జరుగుతాయి. గ్రామ దేవతలకు నిత్యపూజల కంటే ఏడాదికి ఒకసారి లేదా రెండేళ్లకొకసారి జరిగే 'జాతర' లేదా 'కొలుపులు' పేరుతో ఉత్సవాలు జరుపుతారు. సాధారణంగా వేసవి కాలంలోనో లేదా అంటువ్యాధులు ప్రబలకుండా ఉండాలనో, పంటలు చేతుకి వచ్చినప్పుడో ఈ పూజలు చేస్తారు. అయితే ఈగ్రామదేవతల పూజారులు బ్రాహ్మణులు కాకుండా వెనుకబడిన తరగతులకు (BC, SC) చెందిన వారు తరతరాలుగా వంశపారంపర్యంగా ఈ పూజలు నిర్వహిస్తారు. భక్తులు కొత్త కుండలో అన్నం, పాలు, బెల్లం కలిపి వండి, పైన వేప కొమ్మలు, దీపం ఉంచి దేవతకు నైవేద్యంగా సమర్పిస్తారు. గ్రామ దేవతలు ఉగ్ర దేవతలు కాబట్టి,వారిని శాంతింపజేయడానికి కోళ్లు, మేకలను బలి ఇస్తారు.

**ముగింపు :**

సమాజంలోని నమ్మకాలకు, సంస్కృతి సంప్రదాయాలకు గ్రామదేవతలు నిలువుటద్దం. ప్రాచీన కాలం నుండి నేటి వరకు మారుతున్న కాలంతో పాటు జానపద సంస్కృతిని సజీవంగా ఉంచడంలో గ్రామదేవతల ఆరాధన కీలక పాత్ర పోషిస్తోంది. అలాగే శాసన ఆధారాలు వీరి చరిత్రను చాటిచెబితే, జాతరలు మరియు కొలుపులు ప్రజల మధ్య ఐక్యతను, సామాజిక సమరసతను చాటుతున్నాయి.

ప్రకృతిని దైవంగా భావించి పూజించడం వెనుక ఉన్న గొప్ప శాస్త్రీయ దృక్పథాన్ని, మాతృస్వామ్య వ్యవస్థ పట్ల ఉన్న గౌరవం, గ్రామదేవతల పూజల్లో స్పష్టంగా కనిపిస్తాయి. గ్రామదేవతలు కేవలం భక్తికి చిహ్నాలు మాత్రమే కాదు, జానపదుల జాతి సాంస్కృతిక వారసత్వానికి, జానపద కళల మనుగడకు బలమైన పునాదులు. గ్రామదేవతలు జానపదుల జీవన విధానం. అందుకే ఈ సంస్కృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యత.

**ఆధార గ్రంథాలు :**


1. సురవరం ప్రతాపరెడ్డి - ఆంధ్రుల సాంఘీక చరిత్ర
2. మిక్కిలి నేని రాధాకృష్ణమూర్తి- జానపద కళారూపాలు
3. డా.తంగిరాల వెంకటసుబ్బారావు-తెలుగునాట గ్రామదేవతలు
4. ఆర్వీయస్ సుందరం-జానపద విజ్ఞాన ధోరణులు
5. ఆరుద్ర-తెలుగు సాహిత్య చరిత్ర


★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# నిజామాబాద్ జిల్లా పాండవుల రంగస్థల నాటక పరిశీలన



- బాదరవేణి మహిపాల్
పి.జి.టి తెలుగు అతిథి ఉపాధ్యాయుడు, తెలంగాణ ఆదర్శ పాఠశాల ధర్పల్లి.

**వ్యాస సంగ్రహం :**

పాండవులకు ఎంతో చారిత్రక ప్రాశస్త్యం ఉంది మహాభారతంలోని పాండవుల కథలను చెప్పడం వల్ల వీరిని అందరు పాండవులు అని పిలుస్తారు తాము ఆదివాసి గోండ్ జాతికి చెందిన వారమని తమది ఏ కులానికి ఆశ్రిత కులం కాదని చెబుతారు ఇంతటి చారిత్రక ప్రాధాన్యత కలిగిన పాండవులు నిజామాబాద్ జిల్లాలో ఎలాంటి స్థితిలో ఉన్నారు వారు ప్రదర్శించిన కళారూపాలు ఏమిటి? అనే విషయాలు ఈ వ్యాసంలో ఉన్నాయి జిల్లాలో పాండవుల చరిత్ర పరిశోధనలు నరసయ్య చాట్ల పనస హనుమాన్ దాసు రచనలు పరిశీలన ద్వారా నిరూపించారు, లక్ష్మీపతి .జి గారు నిజామబాద్ జిల్లా జానపద కళ చిందు భాగవతం ఒక పరిశీలన ద్వారా చక్కగా వివరించారు ముఖ్యంగా కళా కారులు నాటకాలని ప్రదర్శించిన నందిపేట్, బజార్ కొత్తూరు మాక్లుర్ గుండారం కొత్తూరు సిరిపురం గాదేపల్లి అన్నారం ల గ్రామ పాండవ కళాకారుల ముఖా ముఖితో సామాజిక అధ్యయనంగా ఈ వ్యాసం రచన సాగింది ఈ కళాకారులు కథాగానాలను జానపద రంగస్థలంపై నాటకాలుగా రాత్రి పూట దివిటీల వెలుగులో గ్రామాలలో సంచారం చేస్తూ ప్రదర్శించేవారు.

**కీలక పదాలు :**

నాటక సమాజం, సంచార జీవనం, ఆశ్రిత కులం, ఆదివాసి గోండ్, కట్టడి, గాధలు, కిన్నెర తెగ, తాళగతులు, పారమార్థిక, వంశాచారం, జీవనోపాధి, పాత్ర పోషణ, అజ్ఞాతవాసం, ట్రూవ్, గస్తీ, యక్షగానం, బుర్రకధ, ఆహార్యం.

**ప్రవేశిక :**

పాండవులను వారు వారి తాతల తరాలనుండి ఆ వంశస్తులంతా మహా భారతంలోని పాండవుల కథలను చెప్పడం చేత వీరిని అంతా "పాండవులు" అని పిలిచారు. ఈ కుటుంబంలోని స్త్రీలు పచ్చబొట్లు పొడిచి జీవనం సాగియడం చేత వీరిని పచ్చబొట్లు [1] వారని కూడా పిలుస్తారు.

తాము ఆదివాసి గోండ్ జాతికి చెందిన షెడ్యూల్డ్ జాతికి చెందిన ఆదివాసి తోటి కులస్తులమని. తమది ఏ కులానికీ ఆశ్రిత కులం కాదని మాదాపూర్ గ్రామానికి చెందిన పాండవుల తోటి కళాకారుడు తోటి మడావి పెద్ద గంగారాం తెలిపాడు.

వీరిది మొదటి నుండి సంచార జీవనమే... వీరు ఇంట్లో మాట్లాడేభాష గోండు భాషకు సమీపంగా ఉంటుంది కాబట్టి వీరు మధ్య ద్రావిడ కుటుంబానికి

చెందిన వారు కావచ్చునని, కావచ్చునని[2] చాట్ల నర్సయ్య గారు అభిప్రాయ పడ్డారు.

అయితే తోటి వారు లేదా కొర్రాజుల వారు అనబడే ఓ కులం నాయక పోడు/ పద్మ నాయకులకు ఆశ్రిత కులంగా ఈ తోటి కులం వారు ప్రతి రెండేళ్ళకోసారి తమ కట్టడి గ్రామాల్లో త్యాగం అడుక్కోని పటం ఆధారంగా పాండవులకు సంబంధించిన వివిధ ఘట్టాలను చెప్పి ప్రతిఫలం పొందుతారని[3] తెలుస్తున్నది.

**విషయ వివరణ :**

**1. బజార్ కొత్తూర్ పాండవుల రంగస్థల నాటకం**

**1. కొడ్ పాల్ సాయన్న/భీమన్న నాటక సమాజం**

నందిపేట్ మండలం బజార్ కొత్తూర్ గ్రామానికి చెందిన పాండవుల వారు జిల్లా అంతటా నాటక ప్రదర్శన లిచ్చారు. వీరి పూర్వీకులది నిర్మల్ జిల్లా లోకేశ్వరం. అక్కడి నుండి బజార్ కొత్తూరు గ్రామానికి పాండవుల కథలు చెప్పడానికి వచ్చిన పాండవులని కొత్తూరు గ్రామస్తులు ఇక్కడే ఉండి కథలు చెప్పుకోండి అని చెప్పగా అప్పటి నుండి వీరు ఈ బజార్ కొత్తూర్ లోనే స్థిరపడ్డారు.ఈ గ్రామంలోని పాండవులలో కొడ్ పాల్ హన్మంతు గారి కొడుకుం, కొడ్ పాల్ సాయన్న. కొడ్ పాల్ హన్మంతు గారి తమ్ముడైన కొడ్ పాల్ గోపాల్, గారి కొడుకు కొడ్ పాల్ భీమన్న వీరిద్దరూ అద్భుతమైన నటులు. కొడ్ పాల్ సాయన్న రాజు వేషం వేశాడంటే నిజంగా రాజు లాగే కన్పించేవాడట. నిజామాబాద్ జిల్లాతో కలిపి చుట్టు పక్కలున్న నాలుగు జిల్లాల్లో ఇలాంటి రాజువేషధారి లేడనే వారట ఆనాటి వాళ్ళు. ఈయన దాదాపు 32 నాటకాల్లో ప్రధాన పురుష పాత్ర (మేటి)నే ధరించే వాడట ఈయన ఖాళీ సమయాల్లో తంబురా పట్టుకొని పాండవుల కథాగానం చేస్తు భిక్షాటన చేసేవారని. ఈయన 08-05-1996లో మరణించారని, చౌడమ్మ కొండూర్ గ్రామంలో స్థిరపడిన పాండవుల కొడ్ పాల్ సాయన్న కొడుకు, కొడ్ పాల్ సాయన్న(తండ్రి కొడుకులిద్దరిదీ ఒకటే పేరు) మరియు బజార్ కొత్తూర్ కి చెందిన కొడ్ పాల్ భీమన్న తెలిపారు.

కొత్తూర్ గ్రామంలో స్థిరపడిన పాండవులు వారి వంశాచారంగా వస్తున్న పాండవుల కథా గాన పద్ధతిలోనే కథలు చెప్తుండగా ఆ ఊరి వాళ్ళు 'మీరు కథా గానాన్ని చేసే బదులు ఆ కథలనే నాటకాలుగా ప్రదర్శించండి. మీకు ఆర్థికంగా సహాయం చేస్తాం.' అని అన్నారట.

ఆ మాటల్ని ప్రేరణగా తీసుకున్న కొడ్ పాల్ సాయన్న, ఆత్రం గంగారాం, తమకు నాటకాలు నేర్పే తగిన గురువు కోసం వెతుకుతుండగా వారికి కరీంనగర్ ప్రాంతం నుండి ఈ జిల్లాకి జీవనోపాధికై వచ్చిన, ఇదివరకే నాటక నటనాను భవం కలిగిన తంబలాయన అని పిలువబడె కొమ్ముల లక్ష్మణ్ గారు కనిపించారు. ఆయన్ని ఈ విషయమై అభ్యర్థించగా అతను ఒప్పుకొని 1961వ సంవత్సరంలో వీరికి లవకుశ, అజ్ఞాతవాసం అను రెండు నాటకాల్ని నేర్పించారు. ఈ నాటకాల్ని నిజామాబాద్ జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో కూడా ప్రదర్శించామని కొడ్ పాల్ భీమన్న చెప్పాడు.

"కొమ్ముల లక్ష్మణ్ గారు మాతో పాటు లక్ష్మణుడి పాత్రను, చాకలివాని పాత్రను, కుశుని పాత్రను మొత్తం మూడు పాత్రల్ని పోషించారు[7]. ఆయన అద్భుతమైన నటుడు, పాత్రలోకి పరకాయ ప్రవేశం చేసేవారు. అయితే నాటకంలోని లవుడి పాత్రని నేనే చేయాలని కొమ్ముల లక్ష్మణ్ నిర్ణయించాడు.

నిజానికి అది చాల పెద్ద పాత్ర. అప్పటికి నా వయసు 12 సంవత్సరాలు. మిగతా సభ్యులందరూ నావల్ల కాదన్నారు. లక్ష్మణ్ గారు మాత్రం "వస్తే ఈ పిల్లగానితోనే నాకు పేరు రావాలా! పోతే నా పేరు పోవాలా!" అని పట్టుబట్టి నాకే ఆ పాత్రను ఇచ్చి, గొప్పగా శిక్షణనిచ్చారు. నాటక ప్రదర్శన తరువాత అద్భుతంగా నటించావు. అని నన్ను మెచ్చుకున్నాడు. ఆ తర్వాత మాకు అజ్ఞాతవాసం (సింహబల వధ) నాటకాన్ని 15 రోజుల్లోనే నేర్పించాడు. అని ఆనాటి సంగతుల్ని కొడ్ పాల్ భీమన్న తెలిపాడు.

ఆ తర్వాత కొత్తూరుకు చెందిన పాండవుల కళా కారులు కొడ్ పాల్ సాయన్న గారి పర్యవేక్షణలో ఈ నాటక సమాజం వారు ఎన్నో నాటకాల్ని నేర్చుకొని ప్రదర్శించారు. వీరు ప్రదర్శించిన నాటకాలు 1. భక్త ప్రహ్లాద 2. లవకుశ 3, శశిరేఖా పరిణయం 4 బాలనాగమ్మ 5. కనకతార

6.సుగుణావతి 7. హరిశ్చంద్ర 8. బభ్రువాహన 9. రుక్మాంగద 10.ప్రమీలార్జునీయం 11. కిరాతార్జునీయం 12. రామాంజనేయ యుద్ధం, మొదలైనవి. నాటక సమాజంలో 1.కొడ్ పాల్ హన్మంతు (హాస్యపాత్రధారి) 2. కొడ్ పాల్ సాయన్న (ప్రధాన పురుష పాత్రధారి) 3. కొడ్ పాల్ భీమన్న (ప్రధాన పాత్రధారి) 4. ఆత్రం గంగారాం (స్త్రీ పాత్రధారి) 5. పెందూర్ భీమన్న 6. ఆత్రం గోవింద్ 7. కుమ్రం నారాయణ 8.కుమ్రం లింబాద్రి. 9. ఆత్రం నారాయణ 10. ఆత్రం మాణిక్యం (తబలిస్ట్) 11.ఆత్రం హన్మంతు (తబలిస్ట్) 12.యాకర్‌పల్లి ఆత్రం లస్మన్న (తబలిస్ట్) సభ్యులుగా ఉన్నారు.

**2. కుమ్రం పోశెట్టి నాటక సమాజం**

మోవ్రాకి చెందిన కుమ్రం పోశెట్టి మంచి నటుడు[8]. ఓసారి ధర్మపురిలో నాటకం ప్రదర్శిస్తున్నప్పుడు రావణుడి పాత్ర పోషించగా ఆయన నటన చూస్తున్న పోలీసు అధికారి "వాహ్ నువ్వు రాజువేనయ్యా....ఇప్పుడు నేను ఎంతనో కిరీటం పెట్టినప్పుడు నువ్వు అంత". అంటూ గొప్పగా ప్రశంసించాడని కుమ్రం పోశెట్టి తెలిపాడు.

వీరి నాటక సమూహంలో ఉన్న నటులు 1. కుమ్రం పోశెట్టి (మోవ్రా) 2. ఆత్రం మాణిక్యం - స్త్రీ పాత్రధారి (లక్ష్మాపూర్) 3. బజార్ కొత్తూర్ కొడ్ పాల్ భీమన్న (పురుష పాత్రధారి) 4, ఆత్రం రాములు-తబలిస్ట్ (మాదాపూర్) 5. మడావి గంగారాం-ప్రధాన పాత్రధారి(మాదాపూర్) 6.ఆత్రం భూమయ్య- స్త్రీ పాత్రధారి 7. కుమ్రం నారాయణ (స్త్రీ పాత్ర ధారి) 8. ఆత్రం హన్మంతు (తబలిస్ట్) 9. కొడ్ పాల్ సత్తయ్య- సికింద్రాపూర్ 10.పండరి(హాస్య పాత్రధారి) వీరితోపాటు ఆత్రం తబల లస్మయ్య మరియు ఆత్రం హన్మంతు అనే ఇద్దరు తబలిస్టులు ఉండేవారు వీరిద్దరూ తబలను తొమ్మిది రకాలుగా వాయించేవారట. నడిచే వారిని నృత్యం చేసేలా వాయించే వారని కుమ్రం పోశెట్టి తెలిపాడు. వీరు 1. సత్యహరిశ్చంద్ర 2. రామదాసు 3.భూకైలాస్ 4.శ్రీకృష్ణ తులాభారం 5.జలంధర 6. అల్లిరాణి 7. మాంధాత 8. సత్యవర్మ అను నాటకాలను ప్రదర్శించారు.

**3. చౌడమ్మ కొండూర్, కొడ్ పాల్ సాయన్న నాటక సమాజం**

కొడ్ పాల్ సాయన్న (జూనియర్), తండ్రి కొడ్ పాల్ సాయన్న (సీనియర్) బజార్ కొత్తూర్ నుండి వచ్చి, చౌడమ్మ కొండూర్‌లో స్థిరపడ్డాడు. అందుకే కొడ్ పాల్ సాయన్న (జూనియర్) చౌడమ్మ కొండూర్‌లోనే ఉంటు, నాటక ప్రదర్శనలిస్తున్నాడు. ఈయన కాంతామతి, ధర్మాంగద, సత్యవర్మ, గౌడపురాణం వంటి దాదాపు 12 యక్షగాన నాటకాల్లో 2 స్వదేశీ నాటకాల్లో పాత్ర పోషణ చేశాడు.

వీరి బృందంలో కొడ్ పాల్ సాయన్న (చౌడమ్మ కొండూర్), 2.ఆత్రం హన్మంతు (బజార్ కొత్తూర్) 3. మడావి గంగాధర్ (చౌడమ్మ కొండూర్) [9]అర్జున్ (సందిపేట్) మొదలైన సభ్యులున్నారు.

చాకలివాడుగా, అవుసలి కిష్టయ్య వాల్మీకి మరియు సూత్రధారిగా, అవుసలి గంగాధర్ శతృఘ్నుడు మరియు చాకలివాడుగా, దూదేకుల మౌలాసాబ్ వశిష్టుడు మరియు సీత దాసిగా, కుశ భోజన్న హనుమంతుడుగా, ఖాజామియ, వనబాలకుడి పాత్రతో పాటు బుడ్డర్కాన్ పాత్రని పోషించాడు. ఈ నాటక ప్రదర్శనకి మాల సిద్దన్న మరియు ద్యావత్ రాజేశ్వర్ తబల, తాళం విభాగాన్ని నిర్వహించారని కొడ్ పాల్ సాయన్న తెలిపాడు.

కొడ్ పాల్ సాయన్న (జూనియర్), చౌడమ్మ కొండూర్‌లో రెండు నాటకాల్ని ప్రదర్శించాడు. ఒకటి కనకతార, ఇందులో కనకసేనుడి పాత్ర పోషించాడు. మరొకటి లవకుశ, దీంట్లో లవుడి పాత్ర పోషించాడు. లవకుశ నాటకాన్ని సాయన్న (సీనియర్) గారు నేర్పించి తేది:29-09-1987న చౌడమ్మ కొండూర్ లోని హన్మాన్ మందిరం వద్ద ప్రదర్శింపజేశాడు. ఈ ప్రదర్శనకి ఆత్రం గంగారాం మరియు కొడ్ పాల్ సాయన్న (సీనియర్) మేకప్ చేశారు. ఈ లవకుశ నాటకంలో కొడ్ పాల్ సాయన్న లవుడిగా, మంగలి సాయన్న కుశుడిగా, వంజరి లక్ష్మణ్ రాముడిగా, శ్రీహరి సీతగా, వంజరి వాసుదేవ్ లక్ష్మణుడు మరియు చాకలివాడుగా, అవుసలి కిష్టయ్య వాల్మీకి మరియు సూత్రధారిగా, అవుసలి గంగాధర్ శతృఘ్నుడు

మరియు చాకలివాడుగా, దూదేకుల మౌలాసాబ్ వశిష్టుడు మరియు సీత దాసిగా, కుశ భోజన్న హనుమంతుడుగా, ఖాజామియ, వనబాలకుడి పాత్రతో పాటు బుడ్డర్ఖాన్ పాత్రని పోషించాడు. ఈ నాటక ప్రదర్శనకి మాల సిద్దన్న మరియు ద్యావత్ రాజేశ్వర్ తబల, తాళం విభాగాన్ని నిర్వహించారని కొడ్ పాల్ సాయన్న తెలిపాడు.

### 4.పాండవుల పెందుర్ మల్లయ్య నాటక సమాజం

పాండవుల పెందూర్ మల్లయ్య నందిపేట్ మండలం లోని, బజార్ కొత్తూర్ కొడ్ పాల్ సాయన్న (సీనియర్)9, మడావి భోజన్నలను తన గురువులుగా భావిస్తాడు. ఈయన తారాచంద్రలో బృహస్పతిగా, చంద్రకళలో నారదుడిగా, ప్రభావతిలో హంసధ్వజుడిగా, గౌడ పురాణంలో శంకరుడిగా, అల్లిరాణిలో కృష్ణుడిగా, మాయా సుభద్రలో కృష్ణుడిగా పాత్రల్ని పోషించాడు.

వీరి నాటక సమూహంలో 1. మడావి పెద్ద గంగారాం (మాదాపూర్) 2. పెందూర్ మల్లయ్య(బజార్ కొత్తూర్) 3. ఆత్రం మాణిక్యం (లక్ష్మాపూర్) 4. అత్రం భూమయ్య (లక్ష్మాపూర్) 5. ఆత్రం చిన్నయ్య(లక్ష్మాపూర్) 6. మడావి గంగాధర్ (చౌడమ్మ కొండూర్) 7. ఆత్రం హన్మంతు (చౌడమ్మ కొండూర్) (తబలిస్ట్) మొదలైన వారు ఉండేవారు.

పాండవుల కళాకారులు ఏర్పాటు చేసుకునే రంగస్థలం ముఖం తూర్పు, ఉత్తరంగా ఉండేటట్లుగా ఆ స్థలంలో ఇల్లు ఉంటే ఇంటి మూల రంగస్థలానికి కలవకుండా ఉండేటట్లు వాస్తు చూసి, రంగస్థలం ఏర్పాటు చేసుకునే వారమని కొడ్ పాల్ భీమన్న తెలిపాడు.

నిజామాబాద్ జిల్లాలోని పాండవుల కళాకారులలో మాక్లూర్ మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన మడావి పెద్ద గంగారాం అద్భుతమైన నటుడు.[10]

1. మాయా సుభద్ర 2.కనక తార 3.బభ్రువాహన 4. శ్రీకృష్ణ తులాభారం (భద్రాద్రి అంకితం) 5.సతీ తులసి జలంధర (మరుకుక్కు అంకితం) 6. మాంధాత (మశు రాబాదు అంకితం) 7. తారాశశాంక (చెల్లాపురి అంకితం) 8.భక్త పుండరిక (చింతల చెరువు అంకితం) 9. భక్త రామదాసు (భద్రాద్రి అంకితం) 10. కుమారస్వామి (నందమ్మ పౌరి అంకితం) 1.భూకైలాస్ (ఝాన్సీ లింగాపూర్ అంకితం) 12. ధనుంజయ (తిమ్మక్క పల్లి అంకితం) 13. అల్లి రాణి (గుమ్మడిదల అంకితం) 4. హరిశ్చంద్ర (నింబాద్రి అంకితం) 15. కాంతామతి (వడ్డేపల్లి అంకితం) 16. సత్యవర్మ (మిట్ట దొడ్డి అంకితం) 17. చంద్రకళ (మల్యాల అంకితం) 18. ప్రభావతి (మిట్టదొడ్డి అంకితం) మొదలైన నాటకాల్లో తాను ప్రధాన పాత్ర పోషించాడని మడావి గంగారాం తెలిపాడు.

**ఉపసంహారం :**

పాండవులు ఒకప్పుడు వీరిది సంచారా జీవనమే వీరు ఇంట్లో మాట్లాడే భాష గోండ్ భాషకు సమీపంగా ఉంటుంది కాబట్టి వీరు మధ్య ద్రావిడ కుటుంబానికి చెందినవారు కావచ్చు అని అభిప్రాయపడడం జరిగింది అయితే తోటి వారు లేదా కుర్రాజులు వారు అనబడే ఒక కులం నాయకపోడు పద్మనాయకులకు ఆశ్రిత కులం ఈ తోటి కులం వారు ప్రతి రెండేళ్లకు ఓసారి తమ కట్టడి గ్రామంలో త్యాగం అడుక్కొని పటం ఆధారంగా పాండవులకు సంబంధించిన వివిధ ఘట్టాలను చెప్పి ప్రతిఫలం పొందుతారని తెలుస్తుంది పాండవులనే వారు మహాభారతంలోని గాధలను తప్ప మరే గాధలను గానం చేయరని వీరు ఒక తెలంగాణ తప్ప మరి ఇతర ప్రాంతాలలో ఎక్కడ కనిపించరు ఈ నిజామాబాద్ జిల్లాలో పాండవుల కళాకారులు ఎడ్ల పొలాల అమావాస్య అయ్యిందంటే ఇంటి నుండి బయలుదేరి సంచారం చేస్తూ నాటకాన్ని ప్రదర్శిస్తారు మరే అవకాశం లేకపోతే భిక్షాటన చేస్తారు పాండవుల కళాకారులు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని తమ జీవితాలను నిలదీస్తూ ఇలాంటి ప్రదర్శన రూపంలో సజీవంగా కాపాడారు.

**పాద సూచికలు :**

1. నర్సయ్య చాట్ల. పనస హనుమద్దాసు రచనలు - పరిశీలన, చాట్ల ప్రచురణలు. కామారెడ్డి 2008, పుట.239

2. అదే పుట . . 240
3. రాష్ట్రస్థాయి జానపద కళోత్సవాలు ప్రత్యేక సంచిక. జానపద గిరిజన విజ్ఞాన పీఠం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. వరంగల్. 2001. పుట. 107.
4. రాధాకృష్ణమూర్తి మిక్కిలినేని తెలుగు వారి జానపద కళా రూపాలు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం హైదరాబాదు 2011. పుట 598
5. రామకృష్ణ నటరాజ ఆంధ్ర నాట్యం గిరిజన జానపద నృత్యాలు ,పేరిణి ఇంటర్నేషనల్ ,హైదరాబాద్ .1987. పుట 13
6. లక్ష్మీపతి. జి. నిజామాబాద్ జిల్లా జానపద కల చిందు భాగవతం ఒక పరిశీలన, ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసం(అముద్రితం)1991 పుట 34
7. తేది:22-05-2019 నాటి, బజార్ కొత్తూర్ కి చెందిన 'పాండవుల కులవృత్తి నాటక కళాకారుడు' కొడ్ పాల్ భీమన్న గారి ముఖాముఖి ఆధారంగా రాసింది.
8. తేది: 08-06-2019 నాటి, మోస్రా కి చెందిన 'పాండవుల కులవృత్తి నాటక కళాకారుడు' కుమ్రం పోశెట్టి గారి ముఖాముఖి ఆధారంగా రాసింది.
9. తేది: 27-05-2019 నాటి, చౌడమ్మ కొండూర్‌కి చెందిన 'పాండవుల కుల వృత్తి నాటక కళాకారుడు' కొడ్ పాల్ సాయన్న గారి ముఖా ముఖి ఆధారంగా రాసింది.
10. తేది: 23-10-2020 నాటి, మాదాపూర్ కి చెందిన 'పాండవుల కులవృత్తి నాటక కళాకారుడు', మడావి పెద్ద గంగారాం గారి ముఖాముఖి

**ఆధార గ్రంథాలు :**


1. నరసయ్య చాట్ల పనస హనుమద్దాసు రచనలు -పరిశీలన, కామారెడ్డి: 2008.
2. రాధాకృష్ణమూర్తి మిక్కిలి నేని తెలుగువారి జానపద కళారూపాలు, హైదరాబాద్: 2011.
3. రాష్ట్రస్థాయి జానపద కళోత్స వాలు ప్రత్యేక సంచిక ,వరంగల్: జానపద గిరిజన విజ్ఞాన పీఠం, 2001.
4. రామకృష్ణ నటరాజ ఆంధ్ర నాట్యం గిరిజన నృత్యాలు, హైదరాబాద్: 1987.
5. లక్ష్మీపతి. జి నిజామాబాద్ జిల్లా జానపద కళ చిందు భాగవతం ఒక పరిశీలన (అముద్రిత సిద్ధాంత) వ్యాసం,1991.
6. డా. నాగరాజు బాదరవేణి నిజామాబాద్ జిల్లా రంగస్థలం నాటకం ఒక అధ్యయానం , (అముద్రిత సిద్ధాంత గ్రంథం),2022.


★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# పగటివేష కళాకారులు - జీవన చిత్రణ



- అలిగె కమలాకర్

తెలుగు సహ ఉపాధ్యాయులు (జిపఉపా), బేగంపేట.

**వ్యాస సంగ్రహం :**

పగటి వేషాలు ప్రజా వినోదం ప్రధాన ఆశయంగా ప్రజల ఆశలకు,ఆశయాలకు దర్పణంగా మన దేశంలో బహుళ ప్రజాదరణ పొందాయి. పగటిపూట ప్రదర్శించడం వల్ల వీటికి పగటి వేషాలు అనే పేరు వచ్చింది. అలాంటి పగటివేష కళ చారిత్రక అంశాలు వారి జీవన విధానం ఆచార విశ్వాసాలను, మతాచారాలను, జీవన విశేషాలను తెలియజేయడమే ఈ వ్యాసం యొక్క ముఖ్యఉద్దేశం. వీరి ఆహార్యం ద్వారా ప్రజలలో ఉన్న మూఢ నమ్మకాలను, మతాచారాలను, ప్రజాపీడనను హాస్య ధోరణిలో విమర్శిస్తూ ఎలా తెలియజేయడం జరిగిందో ఈ వ్యాసం వివరిస్తుంది. గ్రామాలలో మున్సబులు, పెత్తందారులు, కరణాలు, వర్తకులు, లంచగొండి అధికారులు వారి మోసాలను ప్రజలకు వారి భాషలో తెలియజేయడం వారి గుట్టురట్టు చేయడం పగటివేషగాళ్ళకు వెన్నతో పెట్టిన విద్య. రాజుల కాలంలో గూఢచారులుగా మారువేషాలు ధరించి వర్తమానాలు చేరవేయడం, కోటలలో చేరి రాజుల బలాలు, బలహీనతలు తెలుసుకోవడం వంటి వివరాలు తెలియజేయడం జరిగింది. ప్రపంచీకరణ ప్రభావం వలన ప్రజాదరణ తగ్గుతున్న పగటివేష కళను భవిష్యత్తు తరాలకు అందించాల్సిన అవసరం ఉంది.

**కీలకపదాలు :**

పగటి వేషాలు, బహురూపులు, జంగాలు, గూఢ చారులు, గనెం పెట్టె, దేవర పెట్టె.

**ప్రవేశిక :**

జనజీవన నిర్మాణంలో జానపద కళారూపాలకు ఒక ప్రత్యేక స్థానం ఉన్నది. ఆది నుండి జన సమూహానికి వినోదాన్ని, తరతరాల అనుభవ విజ్ఞానాన్ని, సాంస్కృతిక పరంపరను అందిస్తున్నాయి. అలాంటి కళారూపాలలో పగటి వేషాలకు ప్రత్యేక స్థానం ఉన్నది. సాధారణంగా కళారూపాలకు పేర్లు ఆ కళలు ప్రదర్శించే కులాలను బట్టి, కథవస్తువును బట్టి, సహకార వాయిద్యాలను బట్టి వస్తాయి. కానీ ప్రదర్శించే సమయాన్ని బట్టి కళకు పేరు రావడంలోనే దీని వైవిధ్యత తెలుస్తుంది. ఎక్కువగా జానపద కళారూపాలు రాత్రి సమయంలోనే ప్రదర్శించే వారు కానీ కేవలం పగటిపూట మాత్రమే ప్రదర్శించే వేషాలు కావడం వలన వీటికి "పగటి వేషాలు" అనే పేరు వచ్చింది. ఈ వేషాలు వేసే కళాకారులను "పగటి వేషగాళ్ళు", "పగటి వేషకులు" గ్రాంథికంలో "పగటేసి గాళ్ళు" అనే పేర్లతో పిలుస్తారు.

పగటి వేషాలు ఇతర కళారూపాల్లో మాదిరిగా ఒకేసారి ప్రదర్శింపబడక రోజుకు అనేకసార్లు ప్రదర్శిస్తారు.

వీరికి ప్రత్యేక వేదిక అంటూ ఏమీ లేదు ఇంటిముందు, రోడ్ల కూడలిలో, దుకాణాల ముందు, ఎలాగైనా, ఎప్పుడైనా ప్రదర్శిస్తారు. పగటి వేషాలలో రోజుకు ఒక వేషం వేస్తుండడం వల్లనే పూర్వం వీటిని "బహురూపు"లని పిలిచేవారు.ఈ బహురూప ప్రస్తావన భరత కోశంలో ఉంది. ''దేశీ నృత్యం, నానావేషధారణం బహురూప మితిరిమ్'' వీటిని పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో పేర్కొన్నాడు. పగటివేషదారులు రూపంతో, అభినయంతో, వాక్చాతుర్యంతో పండిత పామరులను ఒప్పించి మెప్పించగలరు.

**విషయ వివరణ :**

జానపద కళారూపాలను పరిశీలించినప్పుడు కొన్ని లక్షణాలు అన్నింటికీ సామాన్యంగా కనిపిస్తాయి. జానపద కళారూపాలు మతానికి సంబంధించినవిగాను, కులానికి సంబంధించినవిగాను కనిపిస్తాయి. అలాంటి వాటిలో బుర్రకథ, వీధి నాటకం, యక్షగానం మొదలైనవి. అందులో పగటి వేషాలు కూడా ఒకటి. వీటికి కూడా మతపరమైన సంబంధం కనిపిస్తుంది. శ్రీశైలం క్షేత్రాన్ని దర్శించే యాత్రికులకు అలసట పోగొట్టేందుకు ఒకప్పుడు పగటివేషం ఉపయోగపడిందని తెలుస్తుంది. వీటిని శివరాత్రి ఉత్సవాలలో ప్రదర్శించే వారిని పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలో పేర్కొన్నాడు. పగటి వేషాలలో ముఖ్యంగా గమనించవలసిన విషయమేమిటంటే వారి వేషధారణతో వివిధ పాత్రల ద్వారా సంఘంలో ఉండే మూఢనమ్మకాలను, మతాచారాలను, ప్రజాపీడనాన్ని హాస్యధోరణిలో ఎక్కుపెట్టి ఎవ్వరికి నొప్పి కలగకుండా విమర్శించడం ప్రధానంగా కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పెత్తందారులు, కరణాలు, మున్సబులు, వర్తకులు, లంచగొండి ఉద్యోగులు మొదలైన వారంతా ప్రజలను ఎలా మోసం చేసేవారు వీరి వేషాల ద్వారా తగిన అభినయంతో వ్యంగ్యంగా ఆయా ప్రాంతాల భాష యాసలను ఉపయోగించి తెలియజేస్తారు.

ఉదా : గొర్రెలు కాచే గొల్లల పాత్రలు ధరించి సుద్దులు చెబుతూ అక్షరాల గొర్రెల కాపరులను గుర్తు చేసేవారు.

పగటి వేషదారులు వివిధ ప్రాంతాలకు సంచరిస్తూ ఉండడం వల్ల ఆ ప్రాంతపు అన్ని కులాలు,జాతుల భాషలను యాసలను ఆకళింపు చేసుకునేవారు. అందువల్ల వారు ప్రదర్శిస్తున్నప్పుడు ఆ ప్రాంతపు భాషలోని యాసను ఉపయోగిస్తూ ఉచ్చారణకు తగిన ఆటపాటను, సాహిత్యాన్ని జోడించి ప్రదర్శించేవారు. అలా ఆ జన సమూహంలో ఒకరుగా కలిసిపోయెవారు. పగటి వేషాలలో చతుర్విధ అభినయాలు ప్రాముఖ్యం వహిస్తాయి. వీరు ఆహార్యం, అలంకరణ పట్ల శ్రద్ధ వహించే వారు. పగటి వేషాలు ప్రదర్శన ఒక ఊర్లో నెలలపాటు కొనసాగుతుంది ఒకరోజు శూర్పణఖ, ఒకరోజు కాళికా మాత, బేతాళుడు, మాయల పకీరు, బైరాగి, వీరబాహు, లంబాడి ఇలా రోజుకొక వేషం వేసేవారు. కానీ ప్రస్తుతం ఐదు రోజులు మాత్రమే ప్రదర్శిస్తున్నారు ఇందులో చివరి రోజు ఇంటింటికి తిరిగి సంభావనలు తీసుకుంటూ దీవెనలు ఇస్తారు.

''ఏ వేళ చూసిన ఇందిరానందమై
ఆనందమై ఉండు నీ మందిరమ్ము
ఏ వేళ చేసిన ఇష్టాన్ని దానమై
మంచిగను ఉండు నీ మందిరమ్ము
ముట్టింది ముత్యమై
పట్టింది పగడమై, బంగారమై''
..... అంటూ సాగుతుంది''.

**చారిత్రక నేపథ్యం :**

పురాణ కాలం నుంచి ఈ పగటి వేషాలు వేయడం ఆనవాయితీగా వస్తుందని పెద్దలు అభిప్రాయపడ్డారు. జానపద కళారూపాలకు కాల నిర్ణయం చేయడం అనేది సాధ్యం కాదు. అయితే ఆంధ్రదేశానికి సంబంధించినంత వరకు పగటి వేషల (బహురూపులు అనే పేరుతో) ప్రస్తావన శాతవాహన రాజైన హాలుని గాథసప్తశతిలో అలాగే పాల్కురికి సోమనాథుడు రాసిన బసవ పురాణంలో "అటుగాక సాంగభాషంగా క్రియంగ పటునాటకంబుల నటించువారు'' అని పేర్కొన్నాడు. యథా వాక్కుల అన్నమయ్య తన సర్వేశ్వర శతకంలో

అమరంగ స్ఫుట భక్తి నాటకము భాషాంగ క్రియాంగాభి, ర
మ్యముగా జూపిన మెచ్చి మీరలుపురేయన్నంత కున్యో నిగే
హములన్ రూపులు పన్నుకొంచును నటుండై వచ్చి సంసార రం
గములోనన్ బహురూపమాడు వెలయంగా జీవి సర్వేశ్వరా

(సర్వేశ్వర శతం. 20 వ పేజి)

దీనిని బట్టి పగటి వేషాలు చాలా ప్రాచీనమైనవని ప్రజాదరణ కలిగినవని చెప్పవచ్చు. భారతదేశాన్ని అనేక మంది రాజులు, సామంత రాజులు పరిపాలించిన సమయాలలో అనేక చిత్ర విచిత్రమైన వేషాలు వచ్చాయని పరిశోధకుల అభిప్రాయం. అందులో ప్రధానంగా గూఢచారులుగా మారువేషాలు ధరించి వర్తమానాలను రాజులకు చేరవేసే చారులుగానూ, రత్నాలు, పచ్చలు, కెంపులు, అమ్మే వ్యాపారులుగానూ, రాణులు ధరించే ఖరీదైన చీరల వర్తకులు గానూ, వేషాలు ధరించి రాజుల కోటలలో ప్రవేశించి వారి రహస్యాలనూ, బలహీనతలను తెలుసుకొని ఆ రాజు పై యుద్ధం ప్రకటించడం రాజ్యాలను జయించడం జరిగిందని అవే పగటిషాలుగా మారాయి అని పేర్కొన్నారు. అలా పగటివేష కళాకారులు రాజుల ఆశ్రయాన్ని కూడా పొందారు. కళాకారులు రాజుల ఆశ్రయాన్ని పొందడం సహజమే కానీ రాజూకు ఆశ్రయం కల్పించడం ప్రత్యేకమైన విషయం.

**కథ :**

వేములవాడ భీమకవి, కళింగ రాజు బాల్య స్నేహితులు. ఒక సందర్భంలో భీమకవి కళింగరాజు ఆశ్రయం కోరి వెళ్లి బంగపడడం జరుగుతుంది. అప్పుడు భీమకవి కళింగరాజు కూడా రాజ్యభ్రష్టుడయేటట్లు శపించి వెళ్లిపోయాడు. శాపం వల్ల రాజ్యాన్ని కోల్పోయిన కళింగ రాజు పిచ్చివాడై ఊరు వాడ తిరుగుతూ పగటి వేషగాళ్ళ గుడారాలు చేరుతాడు. వీళ్లు అతడికి ఆశ్రయమిచ్చి కాపాడుతారు. రాజు వారి వద్ద సేవకుడిగా చేరుతాడు అలా కాలం గడుస్తుంది. ఒకరోజు కొత్తగా వచ్చిన కళింగ రాజు సభలో పగటివేషగళ్ళు 36 వేషాలు ప్రదర్శించి రాజును మెప్పిస్తారు. రాజు సంతోషించి కలింగరాజు (కొత్తరాజు) వేషం వేయమని ఆజ్ఞాపించాడు. కళాకారులు ఎలా అని మదనపడకుండా సేవకుడు (పాత కళింగ రాజు) తాను ఈ వేషం వేస్తానని చెప్పాడు. కళాకారులు అన్ని హంగులను ఏర్పాటు చేశారు. రాజు వేషం ధరించి గుర్రాన్ని అధిరోహించి సభకు వెళ్తాడు అందరూ పగటివేషగాడు అనుకుంటారు అంతలోనే ఆ వేషంలో ఉన్న రాజు సింహాసనం పైకి దూకి రాజును కొత్త రాజు సంహరిస్తాడు. అలా సింహాసనం అధిరోహించి పగటి వేషగాళ్ళను రాజు సత్కరించి పంపుతాడు. (పగటివేష కళాకారులు సాంస్కృతిక జీవనం, పుట 102). ఇలా చాలా రకాల కథలు ఉన్నాయి.

ఉదా. సంబేట గురువ రాజు కథ, శివాజీ సింహగడ విజయగాథ, విజయనగర రాజుల కథలు.

**పగటి వేషాలు - భేదాలు :**

పగటి వేషాలు ప్రదర్శించే కళాకారుల్లో ప్రస్తుతం జంగాలు ముఖ్యంగా గణాయత జంగాలు మాత్రమే పగటివేషాలను జీవనోపాధిగా చేసుకొని జీవిస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో విశ్వబ్రాహ్మణులు, సాతానులు కూడా పగటి వేషాలు వేస్తారు. వారి కంటే ముందు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని కూచిపూడి అగ్రహార భాగవతులు పగటి వేషాలను వేసేవారు ఇప్పుడు వీరిలో కేవలం గణాయత జంగాలు మాత్రమే వీటిని కొనసాగిస్తున్నారు. "జంగమ" అంటే ఒక ప్రాంతంలో స్థిరంగా ఉండని వాడు అని అర్థం. అందువల్ల పగటివేషాలను సంచారి పగటి వేషాలని, స్థానిక పగటివేషాలని విభజించారు. సంచార పగటి వేషాలవారు సంచరిస్తూ ప్రదర్శనలు ఇస్తారు. పగటివేష కళాకారులు తెలంగాణ ప్రాంతంలో నర్సంపేట, వరంగల్, కరీంనగర్, చేర్యాల, మంచిర్యాల,అదిలాబాద్, మక్తల్, గద్వాల, నారాయణఖేడ్, మహబూబు నగర్, ప్రాంతాల్లో విరివిరిగా స్థిరపడినారు. పగటి వేషాలు మొత్తం 64 ఉన్నాయని పరిశోధకుల అభిప్రాయం. అవి సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక కారణాలవల్ల వాటిలో 32 వేషాలు మాత్రమే మనకు లభిస్తున్నాయి.

1.ఆది బైరాగి వేషం 2. బుడబుక్కల వేషం 3. మందుల వాళ్ళు వేషం 4.సోమయాజులు - సోమి దేవమ్మ వేషం 5. ఫకీర్ వేషం 6. లంబాడి వేషం 7. బోడు బ్రాహ్మణస్త్రీ వేషం 8. వీరబాహు వేషం 9. చాత్తాది వైష్ణవులు వేషం 10. గొల్ల బోయ వేషం 11. బట్రాజు వేషం 12. కోయ వేషం 13. కోమటి - లింగ బలిజ వేషం 14. దేవర పెట్టె వేషం 15. దేవాంగుల వేషం 16. అత్తరు సాయిబు వేషం 17. శిద్ధి కంచిని వేషం 18. కారువా సోమయాజి వేషం 19. ఎరుకల సోది వేషం 20. పిట్టల దొర వేషం 21. వడ్డీ అప్పిర వేషం 22. కొమ్ము దాసరి వేషం 23. కాశి కావిళ్ళ వేషం 24. చిట్టి పంతులు - పతని వేషం 25. జంగం దేవర వేషం 26. హరిదాసు వేషం 27. పాములోళ్ళ వేషం 28. గంగిరెద్దుల వేషం 29. అర్ధనారీశ్వర వేషం 30. శక్తి వేషం 31. రంభ - శుకముని వేషం 32. శారదా వేషం. ఈ 32 వేషాలలో రోజుకు ఒక వేషం కట్టి చివరి రోజు శారదా వేషం వేసి సంభావనలు వసూలు చేసుకుంటారు. ఈ పగటివేషాలకు సంబంధించి కొన్ని ఇతిహాసాలు హాస్యాస్పోరకంగా, వినోదాత్మకంగా విజ్ఞాన గర్భితంగా ఉంటాయి. ప్రస్తుతం కేవలం ఐదు వేషాలు మాత్రమే ప్రదర్శిస్తున్నారు.

**దేవర పెట్టే మహిమలు :**

పగటి వేషాలలో దేవరపెట్టే వేషం ఇంద్రజాలం కలిగిన వేషం. ఈ ప్రదర్శనకు ప్రేక్షకులు విపరీతంగా హాజరయ్యే వారు. ఈ ప్రదర్శనలో మంత్ర తంత్రాలు, మ్యాజిక్లు మహాజోరుగా చేస్తారు. ఇది ఎంతో మహిమలు కలిగిన పెట్టగా భావించి వీరి దేవతలను కొలుస్తుంటారు. ఇందులో అగ్నిస్తంభన, జలస్తంభన, ఖడ్గ స్తంభన,వాయు ధారణ, పాములు, తేళ్ళను, కప్పలను తయారుచేసి చూపిస్తారు. పసుపు, కుంకుమను నీటిలో వేసి దానిని తడవకుండా మళ్లీ పొడిగా బయటకు తీయడం వంటి ఇంద్రజాలక విద్యలు ప్రదర్శిస్తారు.

"గజకర్ణ, గోకర్ణ
టక్కు టమాయీలు
గల్ల తల్లి దిగుముగతల్లే దిగుముగతల్లే"

(మిక్కిలినేని రాధాకృష్ణ మూర్తి - తెలుగువారి జానపద కళారూపాలు పు.ట 207)

అంటూ కొండలు మొదలుకొని దేవతల పేర్లు, చెట్లు పుట్టల పేర్లు అన్ని గుక్క తిరగకుండా వల్లించి దేవర పెట్టి నుంచి అనేక విద్యలు ప్రదర్శిస్తూ దాని మహిమలను చూపిస్తారు.

**ఆహార్యం (వేషధారణ) :**

పాత్రలకు అనుగుణంగా ఆహార్యం సమకూర్చు కోవడంలో వీరు నేర్పరులు. పగటి వేషాలకు ఆహార్యమే ప్రధాన ఆకర్షణ కాబట్టి కొన్ని సాదాగా ఉంటే మరికొన్నిం టికి ఆర్భాటంతో ఉంటాయి. వేషాలు వేసుకోవడానికి ముందు కులదేవతకు మొక్కి దీవెనలు తీసుకుంటారు. తర్వాత గనెం పెట్టెకు కొబ్బరికాయ కొట్టి వేషాలు ప్రారంభిస్తారు. గనెం పెట్టెలో వేషాలకు వాడే రంగు పదార్థాలు, పిన్నీసులు, సూదులు, పుల్లలు మొదలైనవి ఉంటాయి. వేషానికి ముందు తల స్నానం చేసి కురులు ఆరిన తర్వాత వేషం వేయడం ప్రారంభిస్తారు. గనెం పెట్టె తాకి మొక్కి కుడి చేతిని కాళ్ల వద్ద ఉంచి దైవాన్ని తలచి నుదుట బొట్టు పెట్టుకుంటారు. బ్రాహ్మణులు, కోమట్ల వద్ద నుండి వస్త్రాలను "మకుటాలని" తీసుకుంటారు. ఇది ప్రత్యేక వస్త్రంగా భావిస్తారు. అలాగే అట్టలపై రంగులు వేసి కిరీటాలను, చేతి పట్టీలను తయారు చేసు కుంటారు. వీరు జుట్టును అలంకరించుకునేందుకు వాడే విగ్గును "టోపాన్స్" అంటారు. ఈ టోపాన్సును వీరే స్వయంగా తయారు చేసుకుంటారు. దీని తయారీ కోసం "గురుమేకం" అనే అడవి జంతువు వెంట్రుకలను ఉపయోగిస్తారు.

**ఆచార - సాంప్రదాయాలు :**

పగటి వేష కళాకారుల జీవనం రెండు విధాలుగా కొనసాగుతుంది. ఒకటి సామాజిక జీవనం అయితే రెండోది కళామయ జీవనం. జానపద కళాకారులు కావడం వల్ల వీరి మత విశ్వాసాలు ప్రజల ఆచారాలతో స్థానిక సంప్రదాయాలతో బలంగా అనుసంధానమై ఉంటాయి. సంస్కృతిలో భాగంగా పగటివేషదారులు తమ పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చిన విలువలు, నియమాలను ప్రదర్శనల ద్వారా చూపడమే కాకుండా ప్రజలకు తెలియ జేస్తారు. వీరు ఎక్కువగా జాతరలు, ఉత్సవాలలో

ప్రదర్శించేవారు కాబట్టి ఆ దేవుడి యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తూ చెడును అంతం చేయడం వంటి మంచి విలువలను పెంపొందిస్తారు.

ఉదా. పోలేరమ్మ, సుంకులమ్మ, గణికమ్మ, ఎల్లమ్మ, మారమ్మ, భైరవ స్వామి.

సంక్రాంతి సమయంలో గంగిరెద్దును ఆడించడం వల్ల మానవుని జీవితంలో జంతువుల భాగస్వామ్యాన్ని, మానవులకు జంతువులకు మధ్య అవినాభావ సంబంధాలను తెలియజేస్తారు. ప్రకృతిలో లభించిన మూలికలలో వైద్య గుణాలు కలిగిన మొక్కలతో వైద్యం చేసుకోవడం వీరికి అనాదిగా వస్తున్న ఆచారం. వీరికి అడవిలో లభించే మూలికలు, ఔషధాలపై అవగాహన ఉంటుంది. అలాగే మహమ్మారి రోగాలను మంత్రాల చేత నయం చేయవచ్చని భావించేవారు. రోగాలను నయం చేయడానికి దవా (మందు) ఒకటే కాదు, దువా (భగవంతుని ఆశీస్సులు) కూడా కావాలంటారు.

వీరు ఆహారంగా జొన్న సంకటి, జొన్నన్నం, రాగి సంకటి, సద్ద సంకటి, సద్ద రొట్టెలు, జొన్న రొట్టెలు, రాగి రొట్టెలు మొదలైనవి తీసుకుంటారు.ఎర్ర వడ్లను దంచి గంజి కార్చి తింటారు. జ్వరం వచ్చినప్పుడు మాత్రం వరి అన్నం తింటారు.

**ముగింపు :**

ఈ విధంగా పగటి వేషాలు సామాజిక వ్యవస్థతో ముడిపడి ఉండి సమాజంలోని మూఢత్వాన్ని, వ్యక్తుల మోసపూరిత స్వభావాలను, వ్యంగ్యంగా హాస్య ధోరణితో తమదైన పద్ధతిలో విమర్శిస్తూ ప్రజలకు వినోదాన్ని విజ్ఞానాన్ని పంచుతున్న సమాహార కళ. ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకుపోవడం వల్ల ప్రజాపక్ష కళారూపంగా విలక్షణమైనది. పగటి వేషాలు భాష, మాట, యాస ఉచ్చారణను పాటిస్తూ ప్రతి వేషంలో సహజత్వంతో ప్రజల్లో మమేకమై సమాజ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి.

ప్రపంచీకరణ ప్రభావం వలన పగటివేషకళలు రోజు రోజుకు అంతరించిపోయే దశకు చేరుకున్నాయి. ఏళ్ల చరిత్ర ఉన్నటువంటి ఈ కళారూపాన్ని కాపాడుకోవాల్సిన అవసరం మనందరి పైన ముఖ్యంగా ప్రభుత్వాలపైన కూడా ఉంది. పగటివేష కళను రికార్డు చేసి భవిష్యత్ తరాలకు అందించవలసిన అవసరం ఉన్నది. కనుక విశ్వవిద్యాలయ స్థాయిలో పగటి వేష కళ రూపాలపై మూలాలకు వెళ్లి పరిశోధనలు చేయవలసిన అవసరం ఉన్నది.

**పాదసూచికలు :**

1. పగటివేష కళాకారులు సాంస్కృతిక జీవనం 2010, పుట.102.
2. కూచిపూడి భాగవతులు 1983, పుట.13.
3. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి - తెలుగు వారి జానపద కళారూపాలు 2019, పుట.207.

**ఆధార గ్రంథాలు :**


1. పగటి వేషాలు - వాటి ప్రాచీనత , పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ 1999.
2. "విద్వాన్" చింతలపాటి లక్ష్మీ నరసింహ శాస్త్రి,కూచిపూడి భాగవతలు, త్రివేణి ప్రెస్ మచిలీపట్నం, 1983.
3. 169 తెలుగువారి సాంప్రదాయాలు నిత్ర పబ్లికేషన్.
4. జానపద కళ సౌరభాలు, భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ.
5. చైతన్య స్రవంతి తెలుగు నాట తానా కార్యక్రమాల సంచిక, 2006.
6. మన ఆటపాట (ABR TV) యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూ.


★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# జానపద కళలు - బౌద్ధుల చైతన్యం



- డా॥. ఝాన్సీ పావని మేరుగు

తెలుగు ఉపాధ్యాయురాలు, మోడల్ స్కూల్, ముల్కనూర్, చిగురుమామిడి, కరీంనగర్, తెలంగాణ.

**వ్యాస సంగ్రహం**

"జానపద కళలు - బౌద్ధుల చైతన్యం" అను అంశంలో తెలుగు ప్రాంతాన్ని పరిపాలించిన చక్రవర్తులు, బౌద్ధమతాన్ని ఆదరించిన విధానం, జానపద కళలను ప్రోత్సహించిన అప్పటి పరిస్థితులు, శాతవాహనులు బౌద్ధ మత ప్రచారం కోసం జానపద కళలను ప్రోత్సహించుట, సర్వమత ప్రాధాన్యత, సామాన్య ప్రజలు బౌద్ధ మతాన్ని ఆదరించిన విధానం, బౌద్ధ మతానికి త్వరగా ఆకర్షితులు కావడానికి కారణాలు, జానపద కళాకారులు, కళా రూపాలను ప్రదర్శించు విధానం, స్వాతంత్ర్యోద్యం నాటి జానపదకళలు, క్రైస్తవులు - జానపదకళల యొక్క కృషి ఈ వ్యాస పరిధిలోకి వస్తాయి.

**కీలక పదాలు**

శాతవాహన రాజులు, బౌద్ధ మత ప్రచారం, బౌద్ధ ఆరామాలు, స్వసమానత్వభావన, నర్తకీమణులు, ఆరు బయట రంగస్థలాలు, జానపదకళారూప ప్రదర్శన, బౌద్ధ సాహిత్యం, మహాభారత, రామాయణ, భాగవత ఇతి వృత్తాలు, స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి జానపద కళలు, క్రైస్తవులు, జానపద కళలు.

21వ శతాబ్దంలో కొత్త ఆవిష్కరణల ద్వారా మానవుడు వేగంగా ముందుకు వెళ్తున్నాడు. ఆధునిక పరికరాలు మనిషి జీవితాన్ని మరింతగా ప్రభావితం చేస్తున్నాయి. నేడు మన చేతిలో ఉండే చరవాణి సహాయంతో ప్రపంచంలోని ఎక్కడో జరిగిన వింతలు, విశేషాలు వాణిజ్యపరమైన అంశాలన్నిటినీ వీక్షిస్తున్నామంటే అది మానవుని మేధోసంపత్తికి తార్కాణం. ఈ దృశ్య, శ్రవణ పరికరం ద్వారా మనిషి మానసికోల్లాసాన్ని పొందు తున్నాడు. అయితే వందల సంవత్సరాలకు ముందు మనకు ఏ విధమైన ప్రసార సాధనాలు లేనప్పుడు ప్రజలకు మానసికోల్లాసాన్ని కలిగించేవి ఏమిటి? అని ఆలోచించి నట్లయితే మనకు కనిపించేవి జానపద కళారూపాలు.

ఒక్కో ప్రాంతానికి వారి చారిత్రక, భౌగోళిక పరిస్థితు లకు అనుగుణంగా జానపద కళారూపాలు ఉద్భవించా యని చెప్పవచ్చు. జానపదులు తమదైనందిన జీవితంలో అలవోకగా పాడుకునే పాటలు, అలసటను పోగొట్టు కొనుటకు ఆలపించే కూనిరాగాలు జానపద గీతాలయ్యాయి. పండుగల నాడు పాడే ప్రత్యేకపాటలు, బిడ్డ జన్మించినప్పటినుండి మరణించేవరకు జరిగే తంతులలో ఆలపించే గేయాలు మన జానపద సాహిత్య మయ్యింది. పగలంతా వ్యవసాయపనుల్లో, తీరికలేకుండా కష్టపడుతూ, సాయంత్రం వేళల్లో, ఆహ్లాదంగా జానపద కళారూపాలను వీక్షించడానికి గ్రామాల్లోనే ఆరుబయట స్థలాలను ఏర్పాటు చేసుకున్నారు.

జానపద కళారూపాలు అనగా గ్రామంలోని జాన పదులు పాడుకునే పాటలు, ఆటలు, నృత్యరూపకాలు అన్నీ కళారూపాల క్రిందికి వస్తాయి. ఒక సమాజంలోని ఆచారాలు, కట్టుబాట్లు కళారూపాలలో నిక్షిప్తమై ఉంటాయి. ఈ విధమైన గేయాలు, నృత్యాలు, జానపద సంగీతం, వీధి నాటకాలు, తోలుబొమ్మలాటలు, బుర్ర కథలు, యక్షగానాలు, జముకుల కథలు, పిచ్చుకుంటుల కథలు, పగటి వేషాలు ఇలా అనేక రకాలైన జానపద కళారూపాలు ప్రజలకు ఆనందాన్ని చేకూర్చేవి. జానపద సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చి దానిపై పరిశోధనలు చేసిన సాహితీ వేత్తలు మనకు అరుదుగా కన్పిస్తారు వారిలో ముఖ్యులు టేకుమళ్ళ అచ్యుతరావు, టేకుమళ్ళ కామేశ్వర రావుగారు, చిలుకూరి నారాయణరావుగారు, అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులు, సురవరం ప్రతాపరెడ్డి, వేటూరి ప్రభాకర శాస్త్రిగారు, మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు, చింతాదీక్షితులుగారు, శివశంకర శాస్త్రిగారు, శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు, దేవులపల్లి రామానుజరావుగారు, ఇల్లిందల సరస్వతీదేవిగారు, ఎల్లోరా వారు, నాయని కృష్ణకుమారిగారు, డా. ఆర్వీయస్ సుందరం గారు, బిరుదురాజు రామరాజు గారు మొదలైనవారు పరిశోధన చేసి, విమర్శనాత్మక వ్యాసాలను వెలువరించారు. ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రాంతం మొత్తం తిరిగి గేయాలు, గ్రంథాలు శిలాశాసనాలను సేకరించడం జరిగింది.

తెలుగు దేశాన్ని పరిపాలించిన చక్రవర్తులలో మొదటి వారు శాతవాహనులు, దాదాపు నాలుగు వందల సంవత్స రాల వరకు ముప్పై మంది శాతవాహన రాజులు ప్రతిష్టాన పురాన్ని రాజధానిగా చేసుకుని హైద్రాబాద్ సంస్థానంతో సహా కృష్ణా గోదావరి మండలం వరకు ఉన్న ప్రాంతాన్ని పరిపాలించారు. శాతవాహన రాజులు జానపద కళలను అభివృద్ధి చేయడం జరిగింది. జానపద కళారూపాలను ప్రదర్శిస్తూ బౌద్ధమతాన్ని ప్రచారం చేశారు.

**శాతవాహనులు - బౌద్ధమతం**

శాతవాహన రాజులు హిందూ మతాభిమానులైనా, దేశంలో బౌద్ధ మతాన్ని ఎక్కువగా వ్యాప్తి చెందించారు. సామాన్యులు, వ్యాపారస్థులు, కర్షకులు అనేక వృత్తుల వారు చాలా వరకు బౌద్ధ మతాన్ని ఆదరించారు. అగ్ర వర్ణాల వారు హిందూ మతాన్ని, హిందూ దేవుళ్ళను ఎక్కువగా ఆరాధించారు. శాతవాహన చక్రవర్తులు మాత్రం సర్వమతాలను సమాన దృష్టితో చూశారు. నాటి సమాజంలో అగ్రవర్ణ ఆధిపత్య ధోరణి ఎక్కువగా ఉండేది కాబట్టి సామాన్యులు బౌద్ధమతాన్ని అవలం భించటం జరిగింది. బౌద్ధ మతంలో ఆరాధనా విధానం తక్కువ ఖర్చుతో కూడుకొని ఉంది. సర్వసమానత్వ భావనను ప్రచారం చేస్తూ బౌద్ధులు అనుసరిస్తూ వచ్చారు. సమాజంలోని సామాన్యులు, వివిధ వృత్తులవారు బౌద్ధ మతం మీద అభిమానాన్ని చూపారు. ముఖ్యంగా శిల్పులు బుద్ధునిపై గల భక్తిభావాన్ని తెల్పటం కోసం బౌద్ధ విగ్రహాలను చెక్కి పూజించటం జరిగింది. సంగీత, నృత్యా లతో వారు బుద్ధుని ఆరాధించటం జరిగింది. నాగార్జున కొండ దీనికి ఆలవాలమయ్యింది. అక్కడ సంగీతం, నాట్యం నేర్పబడేది. బౌద్ధ ఆరామాలు లలితకళలను పోషించేవి. ఆరుబయట ప్రదర్శనలు జరిగేవి. నాగార్జున కొండ బౌద్ధులకు, బౌద్ధ మతానికి కేంద్రస్థానమయ్యింది.

బౌద్ధ యుగంలో బౌద్ధ ప్రచారకులు కర్మకాండలను నిరసిస్తూ, వ్యయప్రయాసలతో కూడిన విధానానికి స్వస్థి పలుకుతూ బౌద్ధ బౌద్ధమతాన్ని ప్రచారం చేయడం జరిగింది. త్వరగా ఈ మతాన్ని ప్రజల చెంతకు చెర వేయటం కోసం అనేక రూపకాలు వెలిశాయి. రాజుల ఆస్థానంలో నర్తించే నర్తకీమణులు బౌద్ధమతాన్ని అవలం భించారు. వారు తమ కళాకౌశలంతో బౌద్ధ మతాన్ని అభినయిస్తూ ప్రచారం చేసేవారని బౌద్ధ జాతక కథలలో తెల్పటం జరిగింది.

శాతవాహన రాజులలో పధ్నాలుగవ వాడైన 'హాలుడు' తన ఆస్థానంలో కవి, పండిత, గాయక శిల్పులను ఆద రించినట్లు చెప్పవచ్చు. హాలుడు రచించిన 'గాథాసప్తశతి' ద్వారా అనేక విషయాలు తెలుస్తున్నాయి. దీనిని పాకృత భాషలో రచించాడు. తెలుగు వారికి సంబంధించిన అనేక జానపద కళారూపాలను వివరించారు. తెలుగువారి సాంఘిక జీవనం తెలుసుకోవడానికి ఇదే ఆధారం

మృదంగం, మురజ, వీణ మొదలైన వాద్య విశేషాలు ప్రచారంలో ఉన్నాయని దీని ద్వారా విశదీకరించారు. తర్వాత బౌద్ధ మత వ్యాప్తిని ఇక్ష్వాకులు తమ కళా రూపకాల ద్వారా ప్రజల చెంతకు తీసుకువెళ్ళారు.

ఇక్ష్వాకుల రాజులలో పేర్కొనదగినవారు మొదటి మహేంద్రవర్మ ఇతడు కళాప్రియుడు, సంగీత విద్యలో దిట్ట ఈయన కాలంలో వివిధ జాతులకు చెందినవారు వారి వారి కులాచారాలను, సంప్రదాయాలను అను సరిస్తూనే బుద్ధుని స్వీకరించారు. సంగీత, నృత్యాలతో వారు తమ ఆనందాన్ని వ్యక్తపరిచేవారు. ఆరుబయట రంగస్థలాలలో ఈ రూపకాలు ప్రదర్శింపబడేవి. నైపుణ్య మున్న కళాకారులు వివిధ జానపద కళారూపాలను అక్కడ ప్రదర్శించేవారు. పండుగలనాడు, స్థానిక కళా కారులు, జానపద కళారూపకాలను ప్రదర్శించి ప్రేక్షకుల మనసు దోచుకునే వారు. కొన్ని సందర్భాలలో స్థానికేతర కళాకారులను తెప్పించుకొనేవారు. వారికి కొంత ప్రోత్సాహ రుసుమును ఇచ్చి ప్రదర్శనను తిలకించేవారు. నవరస భరితంగా రెండు, మూడు గంటలు ప్రదర్శనలు జరిగేవి. ప్రేక్షకుల మెప్పు పొందడానికి వారు కృషి చేసేవారు. వారి దుస్తులు, అలంకరణ, ఆకర్షణగా, ప్రత్యేకంగా ఉండేది. గంటలకొద్దీ వారు అలంకరించుకునేవారు. ముచ్చట గొలిపే నగుమోముతో ప్రేక్షకులను ఆకర్షించేవారు. వారి ప్రదర్శనలో ఇతిహాసాల ప్రాముఖ్యతతో పాటు, బౌద్ధ సాహిత్యం ఎక్కువగా ఉండేది. రామాయణ, మహా భారత, భాగవతాలలోని ఇతివృత్తాలను తీసుకునేవారు. వీరి ద్వారా సాహిత్యం పామరుల చెంతకు వెళ్ళిందని చెప్పవచ్చు. తర్వాత సామాన్యుల వద్ద పుక్కిట పురాణా లుగా ప్రసిద్ధి చెందాయి. తర్వాత బౌద్ధ సాహిత్యం, బుద్ధుని జీవిత చరిత్ర బౌద్ధ ధర్మ కథలు ప్రదర్శించేవారు వాటిలో వీధి నాటకాలు, తోలు బొమ్మలాటలు, బుర్రకథలు, యక్షగానాలు, జముకుల కథలు, పిచ్చుకుంటుల కథలు, పగటివేషాలు ఇలా అనేక రకాలైన జానపద కళారూపాలు నాటి జానపదులకు మానసికోల్లాసాన్ని ఆనందాన్ని కలిగించేవి.

## స్వాతంత్ర్యోద్యం నాటి జానపదకళలు

రాజులు తర్వాత విదేశీయులు, మన దేశాన్ని పరిపాలించారు. వారిలో మహ్మదీయులు, క్రైస్తవులు ముఖ్యులు. విదేశీయులను మన దేశం నుండి పార ద్రోలడానికి స్వాతంత్ర్యోద్యమం ఉద్భవించింది. స్వాతం త్ర్యోద్యమ కాలం నాడు కళారూపాలు ఉచ్ఛస్థితిలో ఉన్నాయి అని చెప్పవచ్చు. కళాకారులు సామాన్య ప్రజా నీకాన్ని ఉద్యమం వైపు మొగ్గు చూపించటం కోసం, జానపద కళలు, గేయాల్ని అనుకరిస్తూ వారి ఆదరాభి మానాలను చూరగొన్నారు. అక్షరాస్యత లేని పామరులకు నాటి రాజకీయ, సామాజిక పరిస్థితులు ఏమిటో తెలియవు. సరికదా అవగాహన చేసుకొనే జ్ఞానం లేదు. రాత్రి సమయాల్లో తమ కష్టాల్ని మరచిపోవడానికి కోలాటం, చెక్క భజనలు, బుర్రకథలు, హరికథలు వంటి జానపద కళలు అభ్యసించటమో లేక ఇతరుల చేత పాడించటమో చేసేవారు. ఈ విధంగా వారికి ఇష్టమైన కళారూపాల ద్వారా ప్రజల్లో జాతీయోద్యమ స్ఫూర్తిని పెంపొందించారు.

జాతీయోద్యమ కాలం నాడు జానపద కళలు అందరూ అలవోకగా పాడుకునే విధంగా ప్రజలకు అతి దగ్గరగా వెళ్ళాయి.

## క్రైస్తవులు - జానపదకళలు

ఆంగ్రేయులు వ్యాపారం కోసం వచ్చినప్పటికీ, భారత దేశంపై ఆధిపత్యం చెలాయించటం కోసం, మత ప్రచారం కోసం వారు ఎక్కువగా కృషి చేశారు. మన సంస్కృతికి ఆచార సంప్రదాయాలకు వ్యతిరేకంగా క్రైస్తవ మతాన్ని ప్రచారం చేయలేమని గ్రహించారు. అప్పటికే కుల వివక్ష ఎదుర్కొంటున్న దళితులు సమాజంలో చిన్న చూపు చూడబడే వారిని మాత్రమే తమ మతం వైపుకు ఆకర్షించగలిగారు. దళితులు సులభంగా క్రైస్తవ మతం లోకి వెళ్ళగలిగారు. అప్పటివరకు దళితులకు ఆలయ ప్రవేశం లేదు. అక్షరాస్యత లేదు. ఆంగ్లేయులు వారికి ఉచిత విద్య, వైద్యంతో పాటు ప్రత్యేక సదుపాయాల కల్పన దళితులను ఆకర్షించాయి. ఫలితంగా దళితులు అత్యధిక సంఖ్యలో క్రైస్తవ మతంలోకి మారడం జరిగింది. ఈ విధంగా క్రైస్తవులు భారత దేశ సంస్కృతికి అను

గుణంగా తమ మతాన్ని ప్రచారం చేయడం కోసం ప్రజాభిమానాన్ని చూరగొన్న జానపద కళల్ని ఎంచుకున్నారు. వాటిలో హరికథ, బుర్రకథ, భజనలు, కోలాటాలు వంటివి ముఖ్యమైనవి. నేటికీ ఈ కళారూపాలు ప్రదర్శింపబడుతున్నాయి. కళాకారులు తమ జీవితాన్ని చాలా దయనీయస్థితిలో గడుపుతున్నారు.

**ఉపసంహారం**

నాడు సామాన్య ప్రజానీకాన్ని ఆనందపరవశంలో తేలియాడేటట్లు చేసిన జానపదకళారూపాలు నేటి ఆధునిక కాలంలో నిరాదరణకు గురవుతున్నాయని చెప్పవచ్చు. కళాకారుల యొక్క జీవన స్థితిగతులు అంత మెరుగ్గా లేవు. నేడు పండుగలనాడు, తెలుగుదేశంలో కొన్ని చోట్ల మాత్రమే ప్రదర్శింపబడుతున్నాయి. తద్వారా వారికి జీవనోపాధి తగ్గుతుంది. కళాకారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కరువయ్యాయి. తెలుగు ప్రభుత్వాలు కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. మన జానపదకళలు అంతరించకుండా, కాపాడ వలసిన బాధ్యత అందరిపై ఉంది. తరతరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను చేరవేయాల్సిన అవసరం అందరిది.

**ఆధార గ్రంథాలు**

1) తెలుగు జానపద విజ్ఞానం సమాజం - సంస్కృతి - సాహిత్యం ఆచార్య నాయిని కృష్ణకుమారి పిఎస్‌టియు - 2000 - హైదరాబాద్
2) జానపద విజ్ఞాన సమాలోచన - తెలుగు విశ్వవిద్యాలయం - ఆచార్య యన్. భక్తవత్సలరెడ్డి - 1995
3) మన జానపద సంగీతం - పుట్టు పూర్వోత్తరాలు - పిఎస్‌టియు - వింజమూరి సీతాదేవి - 2004.
4) తెలుగువారి జానపద కళారూపాలు - కళా ప్రపూర్ణ - డా. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి - 1992 - తెలుగు విశ్వ విద్యాలయం - నాంపల్లి, హైదరాబాద్.
5) తెలుగు సాహిత్య విమర్శ దర్శనం 11 వ సంపుటం - 2016 పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
6) జానపద కళారూపాలు - సాహిత్యం, డా. కొల్లాగుంట ఆనందన్ - 1999 తిరుపతి.

★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# గట్టు మల్లన్న స్వామి జాతర - ఒగ్గు కళాకారులు



- ఎల్లముల మానస

పరిశోధక విద్యార్థిని, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**వ్యాససంగ్రహం :**

జానపద విజ్ఞానంలో ప్రాచీనకాలం నాటి సంప్రదాయాలు నిక్షిప్తమై ఉంటాయి. జానపదంలో జాతరలు మరియు వృత్తి కళారూపాలు ఒక భాగం. ఇవి జానపదులకు ఉల్లాసాన్ని, ఆనందాన్ని కలిగిస్తాయి. అలాగే ప్రజల జీవితాన్ని సుఖమయం చేస్తాయి. ముఖ్యంగా జాతరలు సామూహికంగా జరగడం వల్ల ఎంతోమంది వృత్తి కళాకారులకి జీవనోపాధి లభిస్తుంది. అలాగే సమాజంలోని సభ్యుల మధ్య బంధాలని బలపరుస్తాయి. ప్రస్తుత వ్యాసం తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని వేలాల గ్రామంలో జరిగే గట్టు మల్లన్న స్వామి జాతర గురించి, అలాగే ఆ జాతరలో ప్రముఖ పాత్ర వహించే ఒగ్గు కళాకారుల గురించి తెలియజేస్తుంది. ఈ అధ్యయనం వల్ల పదిమందికి ఈ జాతర గురించి తెలియడమే కాకుండ జాతరలలో ఒగ్గు కళాకారుల విశిష్టత గురించి తెలుస్తుంది. అలాగే భవిష్యత్తు పరిశోధకులకు లోతైన పరిశోధన చేయటానికి కొత్త అవగాహనను కల్పిస్తుంది. ఈ వ్యాసం ఎక్కువగా క్షేత్ర పర్యటన మీద ఆధారపడినది.

**కీలక పదాలు :**

జాతర, కళాకారులు, గట్టు మల్లన్న, భీముని పాదాలు, కొల్లుకుంట, పాండవులు, ఒగ్గు జగ్గు.

**పరిచయం :**

జాతర అనే పదం యాత్ర అనే శబ్దం నుంచి వచ్చింది. అంటే చుట్టుపక్కల వారందరూ కలిసి ఒకచోటికి యాత్ర లాగా వెళ్లి ఉత్సవాన్ని జరుపుకోవడమే జాతర అని చెప్పవచ్చు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల జీవితాల్లో జాతరలు ఒక భాగం. జానపదులు ఎప్పుడు విశ్రాంతి లేకుండా నిత్యం పనులు చేస్తూ ఉంటారు. పండుగలు, జాతరలు జానపదులకు ఆనందాన్ని, ఉత్సాహాన్ని, కొత్త శక్తిని ఇస్తాయి. రోజంతా పనులతోనే జీవనం గడిపే జానపదులకు ఈ సమయంలో తమ దగ్గరి బంధువులను, దూరపు బంధువులను కలుసుకునే అవకాశం లభిస్తుంది. ఈ జాతరలను జరుపుకోవడం వల్ల ప్రాచీన కాలంలోని ఆచారాలు సంప్రదాయాలు ప్రజల నమ్మకానికి సంబంధించిన అనేకమైన విషయాలు కాలగర్భంలో కలిసి పోకుండా ఉంటాయి. ఈ జాతరలో ముఖ్యపాత్ర వహించే టటువంటి వారు ఒగ్గు కళాకారులు. వీరు ఒగ్గు కథలో పాడేటువంటి ప్రార్థనలు, దరువులు, వచనాలు, సంవాదాలు, మంగళాలు మొదలగునవి అన్ని ప్రజలను ఆకర్షించే విధంగా ఉంటాయి. భారతీయ హిందూ సమాజంలో హిందువులు పండగలకు ముందుగా గణపతిని పూజిస్తారు. కాని ఒగ్గు కళాకారులు గంగ ప్రార్థనతో ఒగ్గు కథను ప్రారంభిస్తారు. గంగమ్మని వారు

శాంభవి రాణి అంటారు."శరణు శరణు మాయమ్మ రాణి శాంభవి రాణి శాంభవి రాణి, కరుణ చూడు మముకన్న తల్లి గంగా భవాని దేవి భవాని" అంటూ పాడుతారు.

గోదావరి స్నానాలతో ప్రారంభమయ్యే జాతర, స్వయంభుగా వెలసిన విగ్రహ ప్రాముఖ్యత, ఆ గిరిపైన ఉండే చారిత్రకమైన గుర్తులు, ఒగ్గు కళాకారుల ప్రాముఖ్యత, వారు ఉపయోగించే వాయిద్యాలు, శివుని భక్తులైన శివసత్తులు, పంచముగ్గులతో వేసే పట్నాలు, బోనాలు మొదలైన అంశాలను వివరిస్తాను.

**స్వయంభుగా వెలసిన విగ్రహం :**

వేలాల గట్టు కేవలం ఒక జాతర మాత్రమే కాదు, అది ద్వాపర యుగానికి సజీవ సాక్ష్యం. పాండవులు తమ అరణ్యవాస సమయంలో ఈ ప్రాంతానికి వచ్చి, నివసించడం కోసం ఒక సొరంగ మార్గాన్ని ఏర్పాటు చేసు కున్నారని పురాణాలు చెబుతున్నాయి. వారు శివుడిని పూజించడం కోసం క్రౌంచీయ (క్ర్యొంచ) పర్వతంపై మందిరాన్ని నిర్మిస్తుండగా, పరమేశ్వరుడు స్వయంగా లింగ రూపంలో ఉద్భవించాడని ఇక్కడి స్థానికుల నమ్మకం.

"కుమారస్వామి తనకంటే ముందు గణేశునికి వివాహం చేశారనే కారణంగా తల్లిదండ్రుల మీద కినిసి క్రౌంచ పర్వతాన్ని ఆశ్రయించుకొని ఉంటూ వచ్చాడు. పుత్రప్రేమచే పార్వతీ పరమేశ్వరులు కుమారునికి నచ్చచెప్పి తమ కైలాసానికి తోడ్కొని వద్దామనే సంకల్పంతో క్రౌంచ పర్వతం దగ్గరకు వెళ్ళారు. వారు వస్తున్నారని తెలిసి షణ్ముఖుడు ఆ పర్వతాన్ని విడిచి మూడు యోజనాల దూరం వెళ్ళి అక్కడున్నాడు. పార్వతీ పరమేశ్వరులు అప్పటి నుండి ఆ క్రౌంచ పర్వతం మీద జ్యోతిస్స్వరూపులై నిల్చి ఉన్నారు. వారు కుమారుని చూచుటకై అమావాస్యనాడు శంభుడు, పూర్ణిమనాడు పార్వతి స్వయంగా వచ్చి ఆ పర్వతం మీద ఉంటారు. ఆనాటి నుండి ఆ గిరి మీద మల్లికార్జున లింగం వెలసి ముల్లోకాలలో విఖ్యాతమైంది"[1].

మరొక కథనం ప్రకారం.. ఒకరోజు వేలావతి అనే వృద్ధురాలు శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించు కోవడానికి అడవి మార్గంలో వెళ్తుండగా, స్నానమాచరించి వస్తున్న పాండవులు ఆమెకు కనిపిస్తారు. అంత దూరం ప్రయాణించలేదని భావించిన పాండవులు.. ఈ కొండపైనే మల్లికార్జున స్వామి ఆలయం ఉందని, అక్కడే నిత్య పూజలు నిర్వహించుకోమని ఆమెకు సూచిస్తారు. ఆ వృద్ధురాలి పేరు మీదుగానే ఆ గ్రామానికి 'వేలాల' అనే పేరు వచ్చిందని స్థానికుల కథనం.

**పశువుల కాపరి :**

కలియుగ ప్రారంభంలో వేలావతి పేరు మీద గ్రామం వెలిసిన సమయంలో ఆ గ్రామానికి చెందిన నరహరి గోవుల పుల్లయ్య అనే పశువుల కాపరి పశువులను మేపుతూ గుట్టపైకి వెళ్తాడు. అక్కడ మల్లికార్జున స్వామి మరియు నరహరి గోవుల పుల్లయ్య రోజు మాట్లాడు కుంటూ, ఆటలు ఆడుతుండేవారు. ఒకరోజు పుల్లయ్య కనిపించకపోగా గ్రామస్థులందరూ వెతుకుతారు, అయి నప్పటికీ పుల్లయ్య కనిపించకపోవడంతో తిరిగి వెళ్ళి పోతారు. రాత్రి సమయంలో మల్లికార్జున స్వామి కలలో కనిపించి పుల్లయ్య తన దగ్గరే ఉన్నాడని ఒగ్గు జెగ్గు సప్పుల్లతో, (శివుని ఢమరుకాన్ని జానపదులు ఒగ్గు జెగ్గు అని పిలుస్తారు) పట్నాలు, బోనాలతో పండుగ జరిపించ మని, కోరిన కోరికలు తీరుతాయని స్వామి స్వయంగా చెప్పాడని మరొక స్థానిక కథనం ఉంది.

**కోనేరు (దొన) :**

ఈ కోనేరు గుట్ట పైన ఉంటుంది. ఏ కాలంలోనైనా దీంట్లో నీళ్ళు ఎండిపోవు. అలా నిత్యం ప్రవహిస్తూ ఉన్నందువల్ల దీనిని నిత్య గంగా జలధార అంటారు. గోదావరి నది కింద పారుతుంటే ఆ నది నీటి మట్టానికి కొన్ని వందల అడుగుల ఎత్తులో ఉన్న ఈ కొండ పైకి నీరు ఎలా వస్తుందో? దీని మూలం ఏమిటో? ఎవరికి తెలియదు.ఈ నీటిని ప్రజలు దొనలోని నీళ్ల అంటారు. జాతరకు వచ్చిన భక్తులందరూ ఆ నీటిని తీర్థంగా తీసుకుంటారు. అలాగే తమ తలపై, ఇంట్లో, పంట పొలాల్లో, పశువుల పై చల్లుకుంటారు. అలా దొనలోని నీళ్లు చల్లడంవల్ల దీర్ఘకాలిక వ్యాధులు నయమవు

తాయని, పంటలు బాగా పండుతాయని, పశువులు ఆరోగ్యంగా ఉంటాయని నమ్ముతారు.

**భీముని పాదాలు :**

ఈ చిత్రంలో మొదటిది పులిరాజు దొన , రెండవది పెద్దగా కనిపించే పాదం భీమునిది అని నమ్ముతారు. భీముని పాదాలు పులిరాజుదొనతో (పులి రాజుదొన అంటే మల్లికార్జున స్వామి తన మ్యాకలకు (మేకలు) కావలిగా పులిని పెట్టాడని అంటారు) పాటు మ్యాకలదొడ్డి, చీపురు దిబ్బ, మేకకాళ్ల అచ్చులు మనకి ఆ గుట్టపైన కనిపిస్తాయి.

**కొల్లుకుంట (కుంట) :**

మల్లికార్జున స్వామి మేకలు మేపుతుండగా అక్కడి నుండి వెళ్తున్న ఒక స్త్రీ ప్రసవిస్తుంది. ఆ సమయంలో స్వామి తన పేరు చెప్పి ఆమెని అక్కడే ఉంచి, పుట్టు పుట్టుమని పిరికెడు బండారు (పసుపు) తీసుకొని చల్లగానే కొల్లు కుంట పుట్టిందని స్థానికుల కథనం. అయితే ప్రస్తుతం ఈ కొల్లుకుంటలో సంతానము లేని వారు అందులో కూర్చుంటే సంతానం కలుగుతుందని అక్కడి ప్రజల నమ్మకం.

కొల్లుకుంటలో కూర్చునే స్త్రీతో పాటు అక్కడికి ఒక ఒగ్గు కళాకారుడు మరియు శివసత్తులు వస్తారు. ఆ కుంటలో కూర్చునే స్త్రీ తన కొంగుని తలపై నుండి కప్పుకొని, ముఖానికి పసుపు రాసుకొని, రెండు చేతులు జోడించి పట్టుకుంటుంది. ఒగ్గు కళాకారుడు జగ్గు మోగించగా శివసత్తులకు శిగం వస్తుంది. ఆ స్త్రీ కుంట చుట్టు తిరిగి కుంటలో కూర్చుంటుంది. తర్వాత సిగం వచ్చేవారు ఆ స్త్రీకి కొన్ని నియమ నిబంధనలు పాటించ మని చెప్తారు. కొంత సమయానికి ఆ కుంటలో కూర్చున్న స్త్రీ లాలిపాట పాడుతుంది. అలా పాడితే వారికి పిల్లలు పుడతారని, అలా కాకుండా ఏడుస్తే వారికి పిల్లలు పుట్టరని అంటారు.

**కచ్చీరు బండ :**

ఈ బండ గుట్ట ఎక్కే ప్రారంభంలో ఉంటుంది. ఈ బండ మీద కూడా ఒక శివలింగం ఉంది. పూర్వం మల్లికార్జున స్వామి ఈ బండ దగ్గరికి వచ్చి తన భక్తుల కోసం ఎదురుచూసేవాడని స్థానికుల కథనం.

**జాతర జరుగు విధానం :**

ఈ జాతరకు కరీంనగర్, జగిత్యాల, ఆదిలాబాద్, మహారాష్ట్ర ప్రాంతాల నుండి వేల సంఖ్యలో భక్తులు వస్తారు. ఇక్కడ ముఖ్యంగా రెండు దేవాలయాలు ఉన్నాయి. ఒకటి గుట్ట మీద చిన్న గుహలో వెలసిన స్వయంభూ మల్లన్న దేవాలయం, మరొకటి భక్తుల నిత్య పూజల కోసం కింద ఊరిలో నిర్మించిన దేవాలయం. ఇక్కడ పట్నాలు, పూజలు ప్రత్యేకమైనవి. ఈ గుట్ట ఊరి నుండి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ ఆలయం ఊరికి దూరంగా ఉండటం వల్ల గతంలో సరైన వసతులు ఉండేవి కావు. అందుకే పూర్వం ఈ జాతర కేవలం మహాశివరాత్రి పర్వదినాన మాత్రమే జరిగేది. కానీ ప్రస్తుతం గుట్టపైన అన్ని వసతులు అందుబాటులోకి రావడంతో శివరాత్రితో పాటు కార్తీక మాసంలో, శ్రావణ మాసంలో మరియు సట్టి (మార్గశిరమాసంలో శుద్ధ పంచమి నుండి ఏడు వారాలని సట్టి వారాలు/ సట్టేడు వారాలు అంటారు) రోజులలో కూడా వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.

“జానపద విజ్ఞానంలో మల్లన్న దేవుడు ఒక విలక్షణ మైన దేవుడు. మనం జాగ్రత్తగా పరిశీలిస్తే వీరశైవ మత ప్రచారం జానపద ప్రపంచాన్ని ఎంతగానో ప్రభావితం చేసిందని ఈ మల్లన్న జాతరవలన తెలుస్తుంది”[2].

మహా శివరాత్రి సమయంలో ఈ జాతర మూడు రోజులు జరుగుతుంది. చిన్నపిల్లలు మినహా పెద్ద వారందరూ ఒక్కపొద్దులు ఉంటారు.జాతరకు వచ్చే భక్తులు ముందు రోజు సాయంత్రం వేలాల గ్రామానికి చేరుకొని ఒక ప్రదేశంలో ఉంటారు. రాత్రికి అక్కడే ఉండి తెల్లవారు జామున అక్కడ ఉన్న గోదావరి నదిలో స్నానం చేసి, స్వామికి బోనం సమర్పించడానికి గుట్ట పైకి వెళ్తారు. గుట్ట పైకి వాహనాలని పంపించరు కాబట్టి తప్పనిసరిగా నడుచుకుంటూ వెళ్ళాలి. రాళ్ళతో ఉండే ఆ దారిలో కొండపైకి ఎక్కేటప్పుడు కష్టం అనిపించకుండా దేవుని నామస్మరణ చేస్తూ వెళ్తారు.పెద్ద పెద్ద చెట్లు, గడ్డితో జంతువులతో ఉన్న ప్రదేశాన్ని భక్తులు శుభ్రం చేసుకొని ఉంటారు. ముందుగా కొబ్బరికాయ, పసుపు, కుంకుమ

మొదలగు వాటిని తీసుకుని దేవుని దర్శనం చేసుకున్నాకా బోనం తయారు చేస్తారు.

**బోనం తయారీ :**

ఈ బోనం చేయటానికి గోదావరి నీటిని మాత్రమే ఉపయోగిస్తారు. ఇత్తడి బిందె (దీనినే బోనం బిందె అంటారు) లేదా కొత్త కుండ తీసుకొని దానిలో తగినన్ని నీళ్లు పోసి, నీళ్లు వేడి అయ్యాక బెల్లం వేస్తారు, కొద్ది సమయం తరువాత బియ్యం వేసి (వీటిని కడగకూడదు) ఉడికిన తరువాత కిందికి దింపి, దానికి అంటుకున్న మసిని కడిగి, చుట్టూ పసుపు పెట్టి తెల్ల పిండితో బొట్టు పెడతారు.అలాగే బోనం కోసం చేసే కూరలో మూడు లేదా ఐదు రకాల కూరగాయలను కోసి, అందులో ఉప్పు, కారం వేసి కొన్ని నీళ్లు పోసి ఉడకబెట్టి దేవునికి పెడతారు. ఇందులో తాలింపు వేయరు. ఈ కూరని మరో చిన్న కుండలో పెట్టి ముందుగా వండిన నైవేద్య కుండపై పెడతారు. దీనిపైన ఒక మూకుడు పెట్టి అందులో నూనె పోసి దీపం పెడతారు.

**ఒగ్గు కథకులు :**

ఒగ్గు కథ చెప్పే వారిని ఒగ్గోళ్ళు లేదా ఒగ్గు కళాకారులు అంటారు. వీరు కురుమ, గొల్ల కులానికి చెందినవారు. సాధారణంగా వీరి వృత్తి గొర్రె బొచ్చుతో కంబళ్ళు నేయడం. "వీరిలోరెండు తెగలున్నాయి. ఒక తెగవారిది 'పత్తి కంకణం, మరొక తెగవారిది 'ఉన్ని కంకణం"[3] వీరు మల్లన్న, బీరన్నలను ఆరాధ్య దైవాలుగా భావిస్తారు. ఈ మల్లన్న, బీరన్నలు శివుని వంశం వారు. ఒగ్గువాళ్ళు ప్రధానంగా మల్లన్న , బీరన్నల కథలు మాత్రమే చెప్పేవారు. కాలక్రమంలో వీరి పరిధి దాటి అదే బాణీలో ఇతర కథలను చెబుతున్నారు. దీనికి కారణం కేవలం మల్లన్న, బీరన్న కథలను చెప్పడం వల్ల జీవనోపాధి లభించకపోవడం అని భావించవచ్చు. ఒగ్గు కళాకారులు ఒక బృందంగా ఒగ్గు కథను చెప్తారు. కథ చెప్పే సమయంలో వీరు ఢమరుకం, తాళాలు, డోలు, సన్నాయి మొదలగు వాయిద్యాలను ఉపయోగిస్తారు. వీరి బృందంలో తప్పనిసరిగా నలుగురు లేదా ఐదుగురు ఉంటారు. ఒకరు డోలు కొడుతూ కథని రాగయుక్తంగా పాడుతారు. మరొకరు తాళం కొడుతూ వాళ్లకు వంత పాడుతారు. ఇంకొకరు స్త్రీ వేషంలో ఉండి వంత పాడుతారు. అలాగే స్త్రీ వేషంలో ఉన్నవారు కాళ్లకు గజ్జెలు కూడా కట్టుకుంటారు.

- ఢమరుకం - విశిష్టత : "శివుని చేతిలో ఉండే ఢమరుకాన్ని జానపదులు జగ్గు, జెగ్గు, ఒగ్గు అని అంటారు. తెలుగు నిఘంటువులు 'చర్మ విశేషం' అని చెప్పాయి"[4]. దీనిని కురుములు, గొల్లలు మల్లన్న, బీరప్ప పండగలకు, పట్నాలకు జాతరలకు మొదలగు వాటిలో ఉపయోగిస్తారు.
- డోలు - వాయిద్యం : ఒగ్గు కళాకారులు ఉపయోగించే డోలు ఒక నీటి డ్రమ్‌ని అడ్డంగా వేస్తే ఎలా ఉంటుందో అలా ఉంటుంది. కాని నీటి డ్రమ్స్ కంటే కొంచెం చిన్నగా ఉంటుంది. దీనిని ఇత్తడితో తయారుచేస్తారు. దీనికి రెండు వైపులా మేక చర్మాన్ని అతికిస్తారు. ఒగ్గు వాళ్లు కథ ప్రారంభం డోలుతోనే చేస్తారు.
- తాళాలు : వీటిని కూడా ఇత్తడితో తయారు చేస్తారు. కథ చెప్పే సమయంలో వీటిని ఎక్కువగా ఉపయోగిస్తారు.

**జాతరలో ఒగ్గు కళాకారులు :**

సాధారణంగా జాతరలలో పోతురాజులు, గంగిరెద్దు లొళ్ళు, పెద్దమ్మలొళ్ళు మొదలగు వృత్తి కళాకారులు కనిపిస్తారు. కానీ ఈ గట్టు మల్లన్న స్వామి జాతరలో ఒగ్గు కళాకారులు కూడా కనిపిస్తారు. ఈ జాతరలో ప్రముఖ పాత్ర వహించేది ఒగ్గు కళాకారులే అని చెప్పవచ్చు. వీరు జాతరలో మనకి తెలుపు లేదా పసుపు రంగు చొక్కా, మోకాళ్ల వరకు ఉండేలా పంచెను (ధోవతిని) కట్టుకొని, మెడలో కండువని వేసుకొని, నుదిటి మీద బండారు పెట్టుకొని, చేతిలో ఢమరుకం, భుజానికి ఒక జోలెతో (ఈ జోలెలో బండారు ఉంటుంది) కనిపిస్తారు.

**శివసత్తులతో ఒగ్గు కళాకారులు :**

శివశక్తికి భక్తులుగా మారిపోయిన వారు శివ (సతులు) సత్తులు. వీరు నుదిటిన చారెడంత బండారు రాసు కుంటారు. కుటుంబ సభ్యులలో శివసత్తులు (శిగం

వచ్చేవారు) ఉంటే వారి కాళ్లకి పసుపు రాసి, గజ్జెల్లాగులు (కాళ్లకు గజ్జెలు, తలకు గవ్వలతో కూడిన కుల్ల, గజ్జెలతో కూడిన లాగు, చేతిలో ఈరగోల) వేస్తారు. ఒగ్గువారు ఢమరుకం మోగించగానే వీరిలో శివశక్తి ఆవహిస్తుంది. ఆ ఢమరుకం నుండి వచ్చే ధ్వనికి అనుగుణంగా శివసత్తులు నృత్యం చేస్తారు. అలాగే మరికొంత మంది భక్తులు మెడలో రుద్రాక్ష, చేతిలో త్రిశూలం ధరిస్తారు. వీరిని కొన్ని ప్రాంతాల్లో దేవుని పేరుమీద "దార్నం" చేయించుకున్న వారని అంటారు. అంటే దీక్ష తీసుకోవటం. వీరు కూడా నుదుటిన బండారు బొట్టు పెట్టుకుంటారు, కాళ్లకి పసుపు రాసుకున్నారు.

**ఒగ్గు కళాకారులు - పట్నం వేయటం :**

గుట్ట మీద రాత్రి జాగారం చేసి, (గుట్ట మీద దీపావళి పండుగ జరుగుతున్నట్టే ఉంటుంది) తెల్లవారు జామున గుట్ట కిందికి వచ్చి, (వేలాల గ్రామంలోకి) గోదావరిలో స్నానం చేసి వచ్చేటప్పుడు నైవేద్యం చేయటానికి గోదావరి నీటిని తెస్తారు.గుడికి దగ్గరలో ఒక ఖాళీ స్థలం చూసి వారికి సంబంధించిన వస్తువులు అన్ని ఒక చోట పెట్టి గుడిలో పట్నం వేయడానికి కావలసిన పూజ సామాను తీసుకొని వెళ్తారు. దేవుడి దర్శనం చేసుకొని పట్నం వేసే దగ్గరికి వెళ్తారు. ఒగ్గు వారు ఈ పట్నం పంచముగ్గులతో (బండారు, చందనం, తెల్లపిండి, పచ్చరంగు "తంగేడు ఆకులతో చేసింది", నీలం రంగు) మల్లన్న స్వామి కళ్యాణం పాటలు పాడుతూ, పాటకి అనుగుణంగా ఢమరుకన్ని ఉపయోగిస్తూ, మరొకరు డోలు వాయిస్తూ పట్నం వేస్తారు. తర్వాత ఎవరైతే పట్నం వేయిస్తున్నారో ఆ కుటుంబంలోని సభ్యులందరికీ కుడి చేతి భుజం పైన పట్నం వేసే పలకతో ముద్ర వేస్తారు. (పలక అంటే చెక్క. చెక్క పైన ఉండే అచ్చులో బండారు వేసి దానితో ముద్ర వేస్తారు) ఈ ముద్ర వేసుకునే ఆచారం జానపదులందరిలో ఉండదు, కొన్ని కుటుంబాలలో మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత ఒగ్గు వారికి కట్నం సమర్పించుకుని తాము ఉన్న స్థలానికి వెళ్తారు.

**ఒగ్గు కళాకారులు - మల్లన్న స్వామికి అనసత్ర (అన్నసత్రం) పోయటం :**

మల్లన్న స్వామికి అనసత్ర పోయటానికి భక్తులు వారు ఉన్న స్థలంలోనే నైవేద్యం చేస్తారు. అలాగే తెల్లన్నం, పప్పు చారు చేస్తారు. వండటం పూర్తి చేసిన తర్వాత ఒక ఒగ్గు కళాకారుడిని తీసుకొని వస్తారు. ఒగ్గు కళాకారుడు ఒక తెల్లని వస్త్రాన్ని కింద పరిచి దానిలో వండిన తెల్లన్నం మొత్తం పెట్టి పై నుండి వస్త్రాన్ని కప్పి, ఆ వస్త్రం పైన వారు బండారుతో ముగ్గు వేస్తూ మల్లన్న పాట పాడు తాడు. అతను ముగ్గు వేస్తున్న సమయంలో కుటుంబ సభ్యులు చుట్టూ నిల్చొని రెండు చేతులు జోడించి పట్టుకుంటారు. తర్వాత ఒగ్గు వారికి దేవుని పేరు మీద ఉస్కులు వేస్తారు. (ఉస్కులు వేయటం అంటే ఒక్కో దేవుని పేరు చెప్తూ తోచినంత పైసలు ఇస్తే ఒగ్గు వారు ఆ దేవుని మీద, పైసలు ఇచ్చిన వారి పేరు మీద పాటలు పాడుతారు.) చివరిగా వారికి తోచినంత కట్నం సమర్పించుకుని ఒగ్గువారిని పంపిస్తారు.ఈ ఆచారం కూడా కొన్ని కుటుంబాలు మాత్రమే పాటిస్తాయి. తర్వాత భోజనం చేసి జాతర మొత్తం తిరిగి తమకి కావలిసినవి కొనుక్కొని వెళ్తారు.

**ఇతర అంశాలు :**

జాతరలో చిన్నపిల్లలని మాత్రమే కాకుండా పెద్దవారిని సైతం ఆకర్షించే రంగురంగుల బొమ్మలు, అలంకార వస్తువులు, పూజ సంబంధిత సామాగ్రి, దేవుని ప్రసాదాలు మొదలగునవి అన్ని ఒకరి పక్కన మరొకరు పెట్టుకొని ఉంటారు. అలాగే వినోదకరమైన ఆటలు, పోతరాజులు, పెద్దన్నలోళ్ళు, గంగిరెద్దులోళ్ళు, లక్ష్మీదేవరల విన్యాసాలతో, ఒగ్గు, డప్పు సప్పుల్లతో, పట్నాలతో, శివసత్తులతో, భక్తుల రద్దీతో కళకళలాడుతూ ఉంటుంది. చిన్న పిల్లలకి రకరకాల వేషాలు వేసి ప్రజల నుండి డబ్బులు అడుగుతారు. కొంతమంది చిన్న పిల్లలని గాంధీ తాతలాగా తయారు చేసి ఒక స్థలంలో నిల్చోపెడతారు. అక్కడి నుండి వచ్చిపోయేవారు తమకి తోచినంత ఇస్తారు. కాళ్లు, చేతులు లేనివారు గుడి ముందు కూర్చొని ఉంటారు. వీరికి కూడా భక్తులు తమకి తోచినది ఇస్తారు.

**ముగింపు :**

జానపద సాంఘికాచారాలలో భాగమైన జాతరలను, తమ వృత్తులనే జీవనోపాధిగా భావించే జానపద కళాకారులని గుర్తించి వాటిపై తగు స్థాయిలో పరిశోధనలు

చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. తెలంగాణ ప్రాంతంలో వివిధ జిల్లాలలో కనిపించే జాతరలు, వాటి వెనక ఉన్న చారిత్రకతను వెలికి తీయాలి. అలాగే మన సంస్కృతి సంప్రదాయాలను వాటి వెనక ఉన్న ఆచారాలను కాపాడుకుంటూ వాటిపైన ఆధారపడే ఎన్నో కుల వృత్తుల వారికి, జానపద కళాకారులకు జీవనోపాధిని కల్పించాలి. జానపద కళా సంస్కృతికి సంబంధించిన అనేక విషయాలు కాలగర్భంలో కలిసిపోకుండా, దాని విశిష్టతను గుర్తించి, భావితరాలకు పరిచయం చేయడం, అందజేయడం మన విధి.

**పాద సూచికలు :**

1. శ్రీ శివ మహా పురాణం. శ్రీ విశ్వనాథం సత్యనారాయణ మూర్తి, పుట:447 ,448
2. నల్లగొండజిల్లా జాతరలు - పరిశీలన. చింతల యాదయ్య, పుట:60
3. తెలుగు జానపద విజ్ఞానం- సమాజం సంస్కృతి సాహిత్యం. నాయని కృష్ణకుమారి, పుట 202.
4. తెలుగు జానపద విజ్ఞానం- సమాజం సంస్కృతి సాహిత్యం. నాయని కృష్ణకుమారి, పుట 207.

**ఉపయుక్త గ్రంథ సూచిక:**


1. కమలాకర శర్మ, సాగి(సంపా). ఆలోకనం. హైదరాబాద్ : శ్రీ సాయి ప్రాసెస్,2017.
2. కృష్ణకుమారి, నాయని(సం.పా) తెలుగు జానపద విజ్ఞానం- సమాజం సంస్కృతి సాహిత్యం (ద్వితీయ ముద్రణ). హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం,2019.
3. జయప్రకాష్, ఎస్. పరిశోధన విధానం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లికేషన్స్,2003.
4. యాదయ్య, చింతల. నల్లగొండజిల్లా జాతరలు - పరిశీలన. హైదరాబాద్:హరిప్రచురణలు,1995.
5. రాధాకృష్ణమూర్తి, మిక్కిలినేని.తెలుగు వారి జానపద కళారూపాలు (తృతీయ ముద్రణ). హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం,2019.
6. వాసుదేవ్ సింగ్, ఆర్. ఒగ్గు కథ - అభినయ సమన్వయం. హైదరాబాద్: ఆకృతి గ్రాఫిక్స్, 2008.
7. సత్యనారాయణ మూర్తి, విశ్వనాథం.శ్రీ శివ మహా పురాణం. హైదరాబాదు: రామకృష్ణ మఠం, 2013.
8. సుందరం, ఆర్వీయస్. ఆంధ్రుల జానపద విజ్ఞానం (ఆరవ ముద్రణ). హైదరాబాద్: ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి. 2024.


★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# గ్రామ దేవతల అంగరక్షకుడు 'పోతురాజు'



- కర్నె మల్లికార్జున్
పరిశోధక విద్యార్థి, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

**వ్యాస సంగ్రహం :**

తెలుగువారి జానపద సంస్కృతిలో గ్రామదేవతల ఆరాధన అత్యంత ప్రాచీనమైనది. ప్రతి గ్రామదేవత ఆలయం వద్ద అంగరక్షకుడిగా, సోదరుడిగా, సహాయ కుడిగా భక్తులచే పూజలందుకునే విశిష్ట పురుష దేవత 'పోతురాజు'. గ్రామదేవతల వ్యవస్థలో పోతురాజుకు ఉన్న ప్రాముఖ్యతను, ఆయన విగ్రహ రూపాల్లోని వైవిధ్యతను, వివిధ ప్రాంతాల్లో ప్రచారంలో ఉన్న భిన్న మైన జానపద గాథలను విశ్లేషించడంతో పాటు, మౌఖిక జానపద విజ్ఞానంలో పోతురాజు యొక్క ప్రాముఖ్యతను వివిధ కోణాల్లో వివరించడం ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశం. పోతురాజు కేవలం ఒక జానపద దేవత మాత్రమే కాక, మాతృస్వామ్య వ్యవస్థలో స్త్రీ దేవతలకు రక్షణగా నిలిచే శక్తి స్వరూపుడని, కాలక్రమేణా వైదిక, శైవ ఆరాధన ప్రభావాల వల్ల ఆయన రూపంలో, ప్రాముఖ్యతలో మార్పులు వచ్చాయని ఈ వ్యాసంలో ఊహను తెలియ జేస్తున్నాను. ఈ పరిశోధన కోసం క్షేత్రస్థాయి పరిశీలనలు (రాజమండ్రి, నెల్లూరు, విశాఖపట్నం జిల్లాల ఉదా హరణలు), చారిత్రక శాసనాలు (విజయనగర శాసనాలు), మరియు జానపద గేయాలు, సామెతల వంటి మౌఖిక ఆధారాలను విశ్లేషించే వర్ణనాత్మక, విశ్లేషణాత్మక పరిశోధన పద్ధతులను అనుసరించడం జరిగింది. ఈ వ్యాసం ద్వారా పోతురాజుకు, గ్రామదేవతలకు మధ్య ఉన్న సోదర-భర్త సంబంధాలలోని వైవిధ్యాన్ని స్పష్టం చేస్తూ, అలాగే, విగ్రహం లేని చోట రాయి లేదా కొయ్యను పూజించే ప్రాచీన సంప్రదాయం నుండి నేటి ఆధునిక ఆలయ నిర్మాణాల వరకు జరిగిన మార్పులను అర్థం చేసు కోవడానికి ఈ పరిశోధన వ్యాసం తోడ్పడుతుంది.

**కీలక పదాలు :**

పోతురాజు, గ్రామదేవతలు, అంగరక్షకుడు, ముదర గడ, జాతర, సప్తమాతృకలు, కొయ్య విగ్రహం, జానపద గాథలు, మాతృస్వామ్య వ్యవస్థ, కొలుపులు, వికృత చేష్టలు, పోతు, బలి, పొలిమేర.

**ఉపోద్ఘాతం :**

తెలుగువారి సాంఘిక, సాంస్కృతిక జీవనంలో గ్రామ దేవతల ఆరాధన ఒక విశిష్టమైన ఘట్టం. ప్రాచీన కాలం నుండి పల్లె ప్రజలు ప్రకృతి శక్తులను, మాతృదేవతలను తమ గ్రామ రక్షకులుగా భావించి పూజిస్తూ వస్తున్నారు. ఈ గ్రామదేవతల వ్యవస్థలో 'పోతురాజు' పాత్ర అత్యంత కీలకమైంది. అమ్మలగన్న అమ్మలకు ముద్దుల తమ్ముడిగా, అంగరక్షకుడిగా, సహాయకుడిగా పోతురాజు ప్రతి గ్రామదేవత ఆలయం వద్ద దర్శనమిస్తాడు. సాధారణంగా వైదిక మత ప్రభావం లేని జానపద దేవతల

గుడులలో భర్త విగ్రహం ఉండదు. అక్కడ స్త్రీ దేవతలకు రక్షణగా పురుష రూపంలో పోతురాజు మాత్రమే ఉంటాడు. ముఖద్వారానికి ఎదురుగా నిలబడి దుష్ట శక్తులు గ్రామంలోనికి ప్రవేశించకుండా కాపాడే 'పొలిమేర కాపలాదారు'గా ఆయనను భక్తులు విశ్వసిస్తారు. ఈ పరి శోధన వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశం ఏమిటంటే మారుతున్న కాలంతో పాటు పోతురాజు రూపం, ఆయన చుట్టూ అల్లబడిన కథలు, వివిధ ప్రాంతాల్లో ఆయనకు జరుగుతున్న వైవిధ్యభరితమైన పూజా విధానాలను సమగ్రంగా విశ్లేషించడం.

పూర్వ పరిశోధనలను పరిశీలిస్తే, హెన్రీ వైట్ హెడ్ వంటి పాశ్చాత్య పరిశోధకులు తమ 'విలేజ్ గాడ్స్ ఆఫ్ సౌత్ ఇండియా' గ్రంథంలో పోతురాజును సప్తమాతృకల సోదరుడిగా, కొయ్య విగ్రహ రూపంలో వర్ణించారు. అలాగే సి.పి. బ్రౌన్ పోతురాజును ద్రావిడ దేవతగా, పోలేరమ్మ భర్తగా లేదా సోదరుడిగా పేర్కొన్నారు. అయితే, ప్రాంతీయ భేదాలను బట్టి పోతురాజు పాత్ర మారుతూ ఉండటం గమనార్హం. కోస్తాంధ్రలో సోదరుడిగా పూజలందుకునే ఈయన, విశాఖ ఏజెన్సీ ప్రాంతాల్లో దేవతకు భర్తగా చైత్రశుద్ధ మాసంలో జరిగే జాతరలలో గౌరవించ బడతాడు. విజయనగర కాలం నాటి శాసనాలలో 'పోతురాజు రాయి' ప్రస్తావన ఉండటం ఈ ఆరాధన యొక్క ప్రాచీనతను వెల్లడిస్తోంది. పాండవుల అరణ్యవాస కథలతోనూ, శైవ సంప్రదాయంలోని వీరభద్రుని అంశ తోనూ పోతురాజును ముడిపెడుతూ అనేక జానపద పురాణాలు ప్రచారంలో ఉన్నాయి. ఈ వ్యాసం అటు శాసన ఆధారాలను, ఇటు మౌఖిక కథలను సమన్వయం చేస్తూ పోతురాజు యొక్క సామాజిక మరియు మతపరమైన ప్రాముఖ్యతను లోతుగా చర్చిస్తుంది.

**'పోతురాజు' వ్యుత్పత్తి - చారిత్రక ఆధారాలు :**

'పోతురాజు' అనే పదం ప్రధానంగా 'పోతు', 'రాజు' (లేదా రాశి) అనే రెండు పదాల కలయికతో ఏర్పడింది. జానపద కథల ప్రకారం, పాండవులు అరణ్యవాసానికి వెళ్తూ తమ కోటల రక్షణ కోసం ఈయనను నియమించి నప్పుడు, ప్రతిఫలంగా ఆయన "తాడిచెట్టంత పోతును (ఎనుబోతు), కొండంత అన్నపు రాశిని" కోరుకున్నాడు. 'పోతు'ను, అన్నపు 'రాశి'ని పొందిన వాడు కాబట్టి 'పోతు రాశి' అని, కాలక్రమేణా అది 'పోతురాజు'గా రూపాంతరం చెందిందని పరిశోధకుల అభిప్రాయం. మరో కోణంలో, 'పోతు' అనేది పౌరుషానికి, శక్తికి చిహ్నం. గ్రామదేవతల సమూహంలో ఏకైక పురుష రక్షకుడు కాబట్టి ఆయనను 'పోతులకు రాజు' లేదా శక్తివంతుడైన రాజుగా పరిగణిస్తారు.

**చారిత్రక ఆధారాలు :**

పోతురాజు ఆరాధన కేవలం నమ్మకం మాత్రమే కాదు, దీనికి బలమైన చారిత్రక ఆధారాలు ఉన్నాయి. విజయనగర సామ్రాజ్య కాలం నాటి శాసనాల్లో పోతురాజు ప్రస్తావన కనిపిస్తుంది. ఉదాహరణకు, నెల్లూరు, రాయలసీమ ప్రాంతాల్లో లభించిన శాసనాలలో (I.A.P.N. 21 C 6) "బోదువాని సల్లె పోతురాజు రాతికి ఉత్తరాన..." అనే వాక్యం కనిపిస్తుంది. దీనిని బట్టి గ్రామాల సరిహద్దుల్లో లేదా పొలిమేరల్లో 'పోతురాజు రాయి'ని ప్రతిష్ఠించే ఆచారం వందల ఏళ్లుగా ఉన్నట్లు స్పష్టమవుతోంది.

**చారిత్రక ప్రాధాన్యత :**

చారిత్రక విశ్లేషణ ప్రకారం, పోతురాజును మాతృ స్వామ్య వ్యవస్థలో స్త్రీ దేవతలకు అంగరక్షకుడిగా చిత్రిం చారు. ఈయన ధన, ధాన్య, పశు సంపదలకు రక్షకుడిగా ఉంటాడని, తనకి బలి ఇచ్చే వరకు ఆ సంపదలను గ్రామ పొలిమేర దాటనీయడని ప్రజల విశ్వాసం. గ్రామ రక్షణ వ్యవస్థలో భాగమైన ఈ ఆరాధన, ద్రావిడ సంస్కృతిలోని వీరారాధనకు నిదర్శనంగా నిలుస్తుంది.

**ఆలయ నిర్మాణం - ప్రతిష్ఠా రూపాలు :**

సాధారణంగా గ్రామదేవతల గుడులు వైదిక ఆలయాల వలె భారీగా ఉండవు. ఇవి సుమారు అయిదారు అడుగుల ఎత్తు, అంతే వెడల్పుతో కూడిన చిన్నపాటి గదులుగా ఉంటాయి. గ్రామ పొలిమేరల్లో, చెరువు కట్టల మీద లేదా వేప, మర్రి వంటి చెట్ల కింద ఈ గుడులు కనిపిస్తాయి. అయితే, పోతురాజుకు ప్రత్యేకంగా ఆలయం ఉండటం అరుదు. ఈయన

ఎప్పుడూ అమ్మవారి ముఖద్వారానికి (సింహద్వారం) ఎదురుగా అంగరక్షకుడిగా నిలిచి ఉంటాడు. అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తులు ముందుగా ఈ కాపలాదారుని అనుమతి కోరడం లేదా నైవేద్యం సమర్పించడం ఆచారంగా వస్తోంది.

**ప్రతిష్ఠా రూపాలు :**

పోతురాజు విగ్రహ రూపాల్లో వైవిధ్యం మెండు. వైట్ హెడ్ వంటి పరిశోధకుల ప్రకారం, మూడు అడుగుల ఎత్తు గల కొయ్య విగ్రహం, ఒక చేతిలో కత్తి, మరో చేతిలో నిమ్మకాయతో ఉండటం ఒక పద్ధతి. విగ్రహం లేని చోట్ల నిలువుగా పాతిన రాయిని లేదా చెక్కను పోతురాజుగా భావిస్తారు. కొన్ని గ్రామాల్లో తాడిచెట్టు లేదా వేపచెట్టునే ఈయన స్వరూపంగా పూజిస్తారు.

**ముదరగడ సంప్రదాయం :**

జాతరల సమయంలో పోతురాజుకు ఇచ్చే ప్రాధాన్యత విశిష్టమైనది. ఊరేగింపులో ఒక లావుపాటి వెదురు బొంగుకు చివర తెల్లటి గుడ్డను చుట్టి, దానిని గ్రామమంతా తిప్పుతారు. దీనిని 'ముదరగడ' అంటారు. కొన్ని ప్రాంతాల్లో ఈ బొంగు చివర చెంబును బోర్లించి ఊరేగిస్తారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం కంటే ముందే ఈ ముదరగడ సాగడం ఆయన రక్షక ధర్మాన్ని సూచిస్తుంది. ఈ విధంగా నిరాడంబరమైన రాతి రూపం నుండి ఉత్సవాల్లోని ముదరగడ వరకు పోతురాజు ప్రతిష్ఠా రూపాలు జానపద సంస్కృతిలోని సహజత్వాన్ని ప్రతిబింబిస్తాయి.

**పోతురాజు - సామాజిక వరుసలు :**

తెలుగు రాష్ట్రాల్లోని మెజారిటీ ప్రాంతాల్లో పోతు రాజును గ్రామదేవతల సోదరుడిగా (ముద్దుల తమ్ముడు) భావిస్తారు. సప్తమాతృకలైన పోలేరమ్మ, ఎల్లమ్మ, పోచమ్మ, నూకాలమ్మ వంటి దేవతలకు రక్షణగా శివుడు ఈయనను పంపాడని జానపద పురాణాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయన ప్రతి ఆలయం ముందు అంగ రక్షకుడిగా నిలుచుంటాడు. అమ్మవారు గ్రామ రక్షణ బాధ్యత చూస్తే, పోతురాజు ఆమె ఆజ్ఞలను అమలు చేసే సహాయకుడిగా, దుష్టశక్తులను తరిమికొట్టే కాపలా దారుగా వ్యవహరిస్తాడు. జాతరల సమయంలో 'ముదర గడ' రూపంలో అమ్మవారి కంటే ముందే సాగుతూ మార్గాన్ని సుగమం చేయడం ఆయన రక్షక ధర్మానికి ప్రతీక. సాధారణంగా పోతురాజును సోదరుడిగానే చూసి నప్పటికీ, ఉత్తరాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా విశాఖ జిల్లా ముంచంగిపుట్ మండలం సుజనకోట వంటి గ్రామాల్లో భిన్నమైన సంప్రదాయం కనిపిస్తుంది. ఇక్కడ గంగాదేవి జాతరలో పోతురాజును దేవికి భర్తగా భావిస్తారు. ఈ ఉత్సవంలో భాగంగా గంగాదేవికి, పోతు రాజుకు అత్యంత వైభవంగా 'కళ్యాణం' జరిపిస్తారు. గిరిజన ప్రాంతాల్లోని ఈ సంస్కృతిలో భక్తితో పాటు శృంగార రసానికి కూడా ప్రాధాన్యత ఉంటుంది. ఈ భిన్నత్వం జానపద సంస్కృతిలోని స్వేచ్ఛను సూచిస్తుంది. మాతృస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్న చోట ఆయన 'సోదరుడు-రక్షకుడు'గా ఉంటే, కొన్ని నిర్దిష్ట తెగలలో లేదా ప్రాంతాల్లో 'సమతుల్యత' కోసం ఆయనను 'భర్త'గా ప్రతిష్ఠించారు. ఈ వరుసలు ఏవైనప్పటికీ, గ్రామ రక్షణలో పోతురాజు పాత్ర అనివార్యమైనది.

**జానపద పురాణాలు - గాథలు :**

ఒక కథ ప్రకారం, పార్వతీదేవికి వరుసగా ఏడుగురు ఆడపిల్లలు (సప్తమాతృకలు) జన్మించిన తర్వాత, ఒక మగ సంతానం కావాలని పరమేశ్వరుడిని ప్రార్థిస్తుంది. ఆమె కోరిక మేరకు శివుడు ప్రసాదించిన వరపుత్రుడే పోతురాజు. ఆదిదంపతులు లోక కల్యాణం కోసం నిష్క్రమించే సమయంలో, తమ ఏడుగురు కుమార్తెలకు తోడుగా, సంరక్షకుడిగా పోతురాజును నియమించినట్లు జానపద పురాణాలు చెబుతున్నాయి.

**మహాభారత గాథ :**

జానపద మహాభారతంలో పోతురాజు ప్రస్తావన వస్తుంది. పాండవులు అరణ్యవాసానికి వెళ్లేటప్పుడు తమ కోటలను రక్షించడానికి ఒక వీరుడు కావలసి రాగా, పోతురాజు ఆ బాధ్యతను స్వీకరిస్తాడు. అయితే, అందుకు ప్రతిఫలంగా ఆయన కొండంత అన్నపు రాశిని, తాడి చెట్టంత ఎనుబోతును కోరతాడు. అరణ్యవాసం ముగిశాక భీముడికి, పోతురాజుకు మధ్య యుద్ధం జరిగిందని, ఆ

యుద్ధంలో ఓడిపోయిన పోతురాజు భీముడి శరణు వేడగా, భీముడు తన కాలి అందెను గుర్తుగా ఇచ్చి, కలి యుగాంతం వరకు ధరించమని ఆదేశించాడని కథనం.

**నెల్లూరు క్షేత్ర గాథ :**

నెల్లూరులోని పోతురాజు విగ్రహం వెనుక ఒక భయం కరమైన గాథ ఉంది. మోహిని అనే సుందరిని పెళ్లాడమని పోతురాజు కోరగా, ఆమె ఒక షరతు విధిస్తుంది. “నీ తల్లిదండ్రుల శిరస్సులు తెస్తేనే, నేను నిన్ను వరిస్తాను” అని చెబుతుంది. మోహవశుడైన పోతురాజు వారి శిరస్సులు తెచ్చి చూపిస్తాడు. కానీ మోహిని, “తల్లి దండ్రులనే చంపినవాడివి రేపు నన్ను కూడా చంపుతావు” అని చెప్పి వెళ్లిపోతుంది. అందుకే నెల్లూరులో ఒక చేతిలో కత్తి, మరో చేతిలో తండ్రి శిరస్సు పట్టుకుని, తల్లి శిరస్సును కాలి కింద తొక్కిపెట్టిన ఉగ్ర రూపంలో పోతురాజు కనిపిస్తాడు. ఈ కథలన్నీ పోతురాజు వ్యక్తిత్వంలోని శక్తిని, పౌరుషాన్ని మరియు ఆయన చుట్టూ ఉన్న జానపద కల్పనలను అద్భుతంగా ఆవిష్కరిస్తాయి.

**ఆచారాలు - పూజా విధానాలు, జాతరలు :**

గ్రామదేవతల ఉత్సవాలలో పోతురాజుకు జరిగే పూజా విధానాలు, ఆచారాలు అత్యంత శక్తివంతంగా, ఉత్సాహభరితంగా ఉంటాయి. సాధారణంగా పోతు రాజుకు ప్రత్యేక అర్చకులు ఉండరు. గ్రామదేవతకు సమర్పించే చలిమిడి, వడపప్పు వంటి నైవేద్యాలనే ఈయనకూ సమర్పిస్తారు. అయితే, పోతురాజుకు ‘పానకం’ (బెల్లం నీరు) అత్యంత ప్రీతికరమైనదిగా భావిస్తారు. జాతర సమయంలో పోతురాజు విగ్రహంపై లేదా ప్రతీకగా ఉన్న రాయిపై పానకాన్ని పోసి భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటారు. జాతరలలో పోతురాజు వేషధారణ ప్రధాన ఆకర్షణ. ఎర్రటి ధోవతి కట్టి, ఒళ్లంతా పసుపు రాసుకుని, కాలికి గజ్జెలు, చేతిలో కొరడా పట్టుకుని ఒక వ్యక్తి పోతురాజుగా కనిపిస్తాడు. డప్పు వాయిద్యాల హోరులో ఈ వ్యక్తి ‘శివం’ (ఆవేశం) పూని ఊగి పోతుంటాడు. మేక పోతును రెండు చేతులతో కాళ్ళు పట్టుకొని, తన పళ్ళతో మేకపోతు గొంతును, శరీరాన్ని వేరుచేసి, రక్తం తాగుతూ, ఈ స్థితిలో ఆయన దుష్ట శక్తులను తరిమికొట్టే రక్షకుడిగా భావించబడతాడు. కొన్ని గ్రామాల్లో (ఉదా: ఉండూరు) పోతురాజు శివం పట్టిన వ్యక్తి, అమ్మవార్ల గణాచారులను “నా అనుమతి లేకుండా గ్రామంలోకి ఎందుకొచ్చారు?” అని అడ్డగించడం వంటి నాటకీయ సన్నివేశాలు జానపద సంస్కృతిలోని పౌరుషాన్ని ప్రతిబింబిస్తాయి. పొట్టేళ్లు, మేకపోతుల బలికి పోతు రాజుకు దగ్గర సంబంధం ఉంది. “పోతురాజు ఇష్టమా? పొట్టేలు ఇష్టమా?” అనే సామెత దీని నుండి పుట్టిందే. గ్రామాన్ని, పశుసంపదను కాపాడటం కోసం ఈయనకు జంతు బలి ఇవ్వడం ఒక ప్రాచీన ఆచారం. నెల్లూరులో ధర్మరాజు-ద్రౌపది గుడి వద్ద, అనకాపల్లిలో నూకాలమ్మ జాతరలో, మరియు తూర్పుగోదావరి జిల్లా మారేడుమిల్లి వంటి గిరిజన ప్రాంతాల్లో పోతురాజుకు ప్రత్యేక పండుగలు నిర్వహిస్తారు. అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు బయలుదేరడానికి ముందే పోతురాజు ‘ముదరగడ’ బయలుదేరడం ఇక్కడి ప్రత్యేకత.

**జానపద మౌఖిక సాహిత్యాలలో పోతురాజు :**

తెలుగు జానపద సాహిత్యంలో, ముఖ్యంగా మౌఖిక సాహిత్యంలో పోతురాజు పాత్ర కేవలం దైవంగానే కాకుండా, సామాజిక జీవనంలో ఒక అంతర్భాగంగా కని పిస్తుంది. జానపద గేయాలు పోతురాజును శక్తివంతమైన రక్షకుడిగా అభివర్ణిస్తాయి. గ్రామదేవతల కథలు పాడేటప్పుడు, “అమ్మవార్లకు తోడుగా, పొలిమేర కాపరిగా” పోతురాజు పరాక్రమాన్ని కొనియాడుతారు. ఏడుగురు అక్కలైన సప్తమాతృకలకు ఈయన అండగా ఉంటాడని, తన చేతిలోని కత్తితో గ్రామానికి వచ్చే గ్రహాలను, భూతాలను తరిమికొడతాడని జానపద గీతాలు వర్ణిస్తాయి.

**సామెతలు - లోకోక్తులు :**

ప్రజల నోళ్లలో నానిన అనేక సామెతలు పోతురాజు పాత్రను వివిధ కోణాల్లో ఆవిష్కరిస్తాయి. “పోలేరమ్మ పెళ్లిలో పోతురాజు పెత్తనం” సందర్భం లేని చోట అనవసరంగా జోక్యం చేసుకునే వ్యక్తిని ఉద్దేశించి ఈ సామెత వాడతారు. “దేవుడు లేని ఊరిలో మంచపు కోడే పోతురాజు” సరైన నాయకత్వం లేని చోట అల్పులే

గొప్పవారిగా చలామణి అవుతారని దీని అర్థం. "కుక్కలుండే ఊరికి నక్కే పోతురాజు" ఇది కూడా పైన చెప్పిన అర్థంలోనే, స్థాయి లేని చోట జరిగే అధికార చలామణిని సూచిస్తుంది. సామాజిక సంభాషణల్లో 'పోతురాజు' పేరును వెటకారానికి కూడా వాడుతుంటారు. ఏ పనీ చేయకుండా తిని తిరిగే సోమరులను "పనికి పోతురాజు" అని వెక్కిరించడం తెలుగువారిలో సర్వ సాధారణం. అలాగే, జాతరలో పూనకం వచ్చిన వ్యక్తి అదుపు తప్పి ప్రవర్తిస్తే, అతడిని విమర్శించడానికి కూడా ఈ పేరును వాడుతుంటారు. ఈ విధంగా, పోతురాజు కేవలం గుడికి పరిమితం కాకుండా, తెలుగు వారి నోళ్ళల్లో, నిత్య జీవితంలోని హాస్యంలో మరియు విమర్శల్లో ఒక జీవకళగా నిలిచిపోయాడు.

**ముగింపు:**

ఈ పరిశోధన వ్యాసం ద్వారా 'పోతురాజు' కేవలం ఒక జానపద దేవత మాత్రమే కాక, గ్రామ రక్షణ వ్యవస్థలో ఒక అనివార్యమైన శక్తి అని తేలుతోంది. ప్రాంతాల వారీగా ఆయన పాత్ర సోదరుడిగా, అంగరక్షకుడిగా, కొన్ని చోట్ల భర్తగా మారినప్పటికీ, ఆయన ప్రాథమిక ధర్మం 'రక్షణ' అని స్పష్టమవుతోంది. విజయనగర శాసనాల నుండి నేటి జాతరల వరకు పోతురాజు ఉనికి నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది. మాతృస్వామ్య వ్యవస్థలో పురుష దేవతగా కనిపించినా, ప్రాచీన మాతృస్వామ్య సమాజంలో స్త్రీ దేవతలే (అమ్మవార్లు) సర్వోన్నత శక్తులు. అటువంటి వ్యవస్థలో పురుష దేవత అయిన పోతురాజుకు 'అంగ రక్షకుని' హోదా కల్పించడం గమనార్హం. ఇది స్త్రీ శక్తికి పురుష పౌరుషం తోడై గ్రామాన్ని కాపాడుతుందనే సమన్వయ సిద్ధాంతాన్ని సూచిస్తుంది. ప్రధాన ఆలయం బయట, ప్రకృతితో మమేకమై ఉండే ఆయన రూపం, జానపద ధర్మం యొక్క నిరాడంబరతను చాటి చెబుతోంది. నేడు పట్టణీకరణ ప్రభావంతో గ్రామదేవతల గుడులు వైదిక ఆలయాలుగా మారుతున్నాయి. ఈ క్రమంలో పోతురాజు వంటి విలక్షణ జానపద కళా రూపాలు, ఆచారాలు మరుగున పడే ప్రమాదం ఉంది. 'ముదరగడ' ఊరేగింపులు, జాతరల్లోని పోతురాజు వేషధారణలు, ఆయన చుట్టూ ఉన్న సామెతలు మన సంస్కృతిలో భాగం. ఈ మౌఖిక సాహిత్యాన్ని, ఆచారాలను డాక్యుమెంట్ చేయడం ద్వారానే మన జానపద అస్తిత్వాన్ని కాపాడుకోగలము. పోతురాజు ఆరాధన కేవలం మతపరమైన ప్రక్రియే కాదు, అది తెలుగు వారి సామాజిక చరిత్రకు ఒక సజీవ సాక్ష్యం.

**ఆధార గ్రంథాలు :**


1. రామకృష్ణ, యం. 1997. తూర్పుగోదావరి జిల్లా - గ్రామ దేవతలు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్.డి. పరిశోధన గ్రంథం.
2. ప్రభాకరరెడ్డి, కె. (సంపాదకుడు). 2005. కృష్ణాజిల్లా గ్రామదేవతలు. కృష్ణాజిల్లా: కృష్ణాజిల్లా న్యూ మాన్యువల్ కమిటీ.
3. నరసింహారెడ్డి, పాపిరెడ్డి. 1983. తెలుగు సామెతలు జన జీవనం. తిరుపతి: శ్రీనివాస మురళీ పబ్లికేషన్స్.


★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# బుడగ జంగాలు - జీవనశైలి



- రుద్రంగి రమేశ్ (మద్నూర్)
స్కూల్ అసిస్టెంట్ (జీవశాస్త్రం), జిల్లా పరిషత్ హైస్కూల్ (బి) పెద్ద మల్లారెడ్డి, భిక్నూర్ మండలం, కామారెడ్డి.

**వ్యాససంగ్రహం :**

బుడగ జంగాలు అనే ప్రత్యేక కులం. వీరి వృత్తి కళారూపం, జీవనశైలి గురించి సంక్షిప్తంగా వివరించబడింది. వీరు చెప్పే బుర్రకథ అద్భుతమైన కళారూపం. ఈ వ్యాసంలో బుడగజంగాలు కులం పేరు ఎలా వచ్చింది? కళారూపం, పద్ధతులు, జీవనశైలి, వీరు నివసించే ప్రాంతాలు, వీరి జనాభాలో చాలా తక్కువ అయినప్పటికి వీరి పెద్దలు సూచించిన బాటలో నడుస్తూ, కళను ప్రపంచానికి తెలియచేస్తూ దయనీయస్థితిలో కాలం వెళ్ళదీస్తున్నారు. వీరు చెప్పే బుర్రకథ అనాటి కాలం, ప్రజల స్థితిగతులను, ఆచార సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. వీరిపై వచ్చిన పుస్తక సాహిత్యాన్ని పరిశీలన చేసి, రచయితలు తెల్పిన మనోభావాలను గౌరవిస్తూ పొందుపరచడం జరిగింది.

**కీలకపదాలు :**

బేడ జంగం, కథకుడు, గుమ్మెట, బుర్రకథ, వీరశైవం, వేట, తంబూరా, శారదాకాండ్రు, దాసరులు, పెద్ద గోశాయి, సంచార జీవితం, లింగాయతులు.

**కులం అంటే ఏమిటి?**

తెలుగులో "కులం" అనేది చాలా విస్తృత రూపమైన పదం. తెలుగులో కులం అందమైన పదానికి అనేక పర్యాయ పదాలు, మరియు నానార్థాలు ఉన్నాయి. జాతి, తెగ, వంశం, గోత్రం మరియు వర్గం అని వివిధ నామాలున్న సమాజపరంగా వీటిని సామాజిక వర్గమని పేరుతో పిలుస్తారు. జాతి అనగా ప్రజల సమూహమని, వంశమని అర్థాలు. తెగ అనగా ఒకే రకమైన ఆచారాలు కలిగిన సమూహమని, వంశమనగా వంశపారంపర్యంగా వచ్చే కుటుంబ వ్యవస్థని గోత్రం అనగా వారి పూర్వీకుల ఆధారంగా నిర్ణయించే వర్గమని పిలుస్తారు.

"కులం" అంటే వారి వారి పుట్టుకతోనే నిర్ణయించబడే, వంశపారంపర్యంగా చేసే వృత్తి, సామాజిక వృత్తిని నిర్ణయించే ఒక సాంప్రదాయ సామాజిక వర్గం.

ఇది ప్రజలను సామాజికంగా, సమూహాలుగా విభజిస్తుంది. ఫలానా కులంపేరు చెబితే వారు చేసే వృత్తిని చెప్పవచ్చు. అనాది నుంచి నేటివరకు కులవ్యవస్థ బాగా నాటుకుపోయింది. ముఖ్యంగా కులవృత్తులు చేసే కులాలు ఉన్నాయి. నేటి యుగంలో శాస్త్ర సాంకేతికత బాగా అభివృద్ధిచెందడం, మనుషుల కార్యకలాపాల భాగస్వామ్యం బాగా తగ్గి, యంత్రాల, వస్తువుల భాగస్వామ్యం, ఆధిపత్యం పెరిగి కులవ్యవస్థ చాలా ప్రమాదకరమైన స్థితిలో ఉంది.

కులం యొక్క ప్రధాన లక్షణాలు ఏమనగా వంశాన్ని

వృద్ధిచేయడం, వంశపారంపర్యతను కొనసాగించడం మరియు ఎవరి కులం అమ్మాయి, అబ్బాయిలను ఆ కులం వారే పెళ్ళి చేసుకోవడం. ఇది హిందు సమాజంలో మనకు బాగా కనిపిస్తుంది. కులం పుట్టుకతో వస్తుంది. మార్చుకోవడానికి వీలులేదు.

కర్మభూమి, ధర్మభూమి అయిన మనదేశంలో ఎన్నో కులాలు ఉన్నాయి. వాటి అర్హత, స్థాయి, సమాజపరంగా ప్రాధాన్యతను బట్టి ఓసి, బిసి, ఎస్సీ, ఎస్టీలుగా విభజించారు. వీటిలో ఇంకా కొన్ని కులాలు పైవాటికి అనుబంధంగా ఉన్నాయి.

**బేడజంగాల ప్రస్తావన :**

ఒకప్పుడు ఒక వెలుగు వెలిగి పల్లెలో ఏ పనికైన ముందుగా గుర్చొచ్చే కులం ఏదైన ఉందంటే అది బేడ జంగం, బేడ జంగాలు (బుడగ జంగాలు) అని పిలుస్తారు. నేటికిని ఈ కులం సమాజానికి చాలా సేవలు అందిస్తుంది. ఇలాంటి సమాజసేవకే అంకితమైన బుడగ జంగాల గురించి తెలుసుకుందాము.

కథకునికి ఇరుప్రక్కలా వున్న వంతగాళ్ళు ఒక్కొక్కరూ తమ గుమ్మెటను చంకకు తగిలించుకుంటారు. కుడిచేతి వేళ్ళతో చర్మముపైన వాయిస్తూ రెండవ ప్రక్క మూస్తూ గుంభనగా శబ్దాన్ని తెప్పిస్తారు.

కథ చెప్పే బుడిగె జంగం నిలువటంగీ తొడిగి, తలపాగాచుట్టి, కాళ్ళకు గజ్జెలు, మువ్వలు కట్టుకుని భుజం మీద తంబురాను ధరించి, చేతి వ్రేలికి అందెలు తొడిగి, వాటిని తంబురాకు తట్టుతూ రెండవ చేతిలో తంబురా తీగను మీటుతూ కథను ప్రారంభిస్తారు. కథకునికి వంతలుగా వున్నవారు గుమ్మెటలు ధరించి కథకునికి పాడుతూ, పాట వరుస ననుసరించి గమ్మెటలను వాయిస్తూ మధ్య మధ్య హాస్యగాడు ఛలోక్తులతో హాస్యాన్ని కుమ్మరిస్తూ, ప్రేక్షకుల్ని నవ్విస్తూ వారి మెప్పు పొందుతాడు. జంగం కథలు ఈనాడు, బుర్రకథలుగా పిలువబడుతున్నాయి.

**నేపథ్యం :**

ఒకనాడు మత ప్రబోధానికి, దేశభక్తికీ, దైవభక్తికి ప్రతిబింబంగా నిలబడిన జంగం కథా కళారూపం రాను రాను యాచనకూ, ఉదరపోషణకు ఉపయోగపడి తిరిగి ఈనాడు నిజ దేశభక్తిని ప్రబోధిస్తూ, ప్రజాసమస్యలను చిత్రిస్తున్నది.

జంగం కథలను ఎక్కువగా జంగాలే చెప్పడం వల్ల వీటికి జంగం కథలనే పేరు వచ్చింది. ఈ కథలను సిరికి జాంగాలూ, బుడిగె జంగాలూ, సెట్టి బలిజెలూ, సెట్టి ఫణిజెలూ, ఈతముక్క జంగాలూ, వంశపారంపర్యంగా ప్రచారంలోకి తీసుకువచ్చారు. జంగాలందరూ శైవభక్తులు కావడం వల్ల, శైవ వైష్ణవ మతాల మధ్య వచ్చిన సంఘర్షణ కాలంలో శైవమత ప్రచారానికి ఈ కథలను ఉపయోగించారు. వీరశైవ మతం బాగా వ్యాప్తిలోకి వచ్చే నాటికి, అంటే సా.శ.1150 నాటికే ఈ కథలను జంగాలు పాడుతూ వుండేవారు. వీరు ఈ కథలతోపాటు పగటివేషాలను కూడా ప్రదర్శించేవారు. బైజరాజు వేంకటనాథకవి పంచతంత్రంలో కడివోని తెర నాటకపుటూరి జంగాలు అని ఉదాహరించాడాన్ని బట్టి, జంగాలు నాటకాలను కూడా ప్రదర్శించే వారని తెలుస్తుంది.

దాసరులందరూ వైష్ణవ భక్తులైనట్లే జంగాలందరూ శైవభక్తులు. వీరు చెప్పే కథలకు జంగం కథలని పేరు. వీరికే బుడిగె జంగాలు అనే పేరు కూడా వాడుకలో ఉంది. అందకు కారణం వారు కథలో ఉపయోగించే వాయిద్యానికి బుడిగె అనేపేరును బట్టి బుడిగె జంగాలనే పేరు సార్థక నామమైంది. ఈ బుడిగెనే డక్కీ అని, డిక్కి అనీ, గుమ్మెటనీ అనేక రీతులలో ఆయా ప్రాంతాలలో ఉదహరిస్తున్నారు. బుడిగెలు మామూలు గుమ్మెట్ల కంటే చిన్నవి. ఇవి ఇత్తడితోనో లేదా కంచుతోనో చేయబడి ఉంటాయి.

ప్రపంచ జానపదదినోత్సవ వేడుకల్లో భాగంగా 2019 ఆగస్టు 31న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ నిర్వహించిన జానపద జాతర సాంస్కృతిక కార్యక్రమంలో శారద కథలు (శారదకాండ్రు).

**కళాకారులు ప్రదర్శన**

జంగాలు ప్రారంభంలో శైవకథలనే ప్రచారం చేసేవారు. తరువాత శైవేతరం కథలైన దేసింగు రాజు,

విరాటపర్వం భల్లాణ, సిరియాల, దేవయాని, వామన విజయం అంబరీషోపాఖ్యానం మొదలైన కథలను కూడ ప్రచారంలోకి తెచ్చారు. జంగాలు వీర శైవ ప్రచారకులు కావడం వల్ల వారి కథలన్నీ వీరావేశంతో చెప్పబడుతూ వుండేవి. ధేనువు కొండ వెంకటయ్య గారి విరాటపర్వం జంగం కథలో జంగాల యొక్క వేషధారణ వాయిద్యాల వర్ణన వుంది.... అడిదము సూరకవి జంగాలు పాలు దేవాంగుల విత్తంబు అని వర్ణించడం వల్ల, దేవాంగులైన సాలెవారిని యాచిస్తారని తెలుస్తూ ఉంది. ఆంధ్రదేశంలో శారదకాండ్రు అనే ఒక జాతివారు, ఒక తెలంగాణలో తప్ప మరెక్కడా అంతగా కనిపించరనీ, జానపద గాయకులుగా, భిక్షకులుగా వుండేవారిలో కూడా వీరే ఎక్కువనీ, మున్నూరు, ముతరాసి మొదలైన కులముల నుండి ఉద్భవించిన జాతుల్లో శారదకాండ్ర జాతి ఒకటని జానపద వాఙ్మయంలో..... బి.రామరాజుగారు ఉదహరించారు. ఓ భారతీ, కరుణామలే, శారదా, కరుణానిధి, అనే వంత పాట పాడటం వలన కూడా వీరికి శారదకాండ్రనే పేరు వచ్చి వుండవచ్చు. అంతే కాక, వీరు ఉపయోగించే వాద్యంలో భుజము మీద ధరించే తంబురాకు శారద అని పేరు. బుర్రకథలో ఉపయోగించే తంబురాకు దీనికి ఏమీ తేడా లేదు. శారదను ఒక భుజం మీద ధరించి వాయిస్తారు. శారద అంటే సరస్వతి. విద్యల తల్లి, సరస్వతి పేరును వారుపయోగించే తంబురా వాయిద్యానికి మారుపేరుగా శారద అని నామకరణం చేశారు. వీరి కథ శారదాదేవి స్తోత్రంతో ప్రారంభమౌతుంది. ముఖ్యంగా వీరి జట్టులో పురుషుడు కథ చెపితే అతని ఇద్దరు భార్యలూ వంత పాడతారు.

తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ నిర్వహించిన జానపద జాతర సాంస్క ృతిక కార్యక్రమంలో బుర్రకథ కళాకారుల ప్రదర్శన :

**కథా వస్తువులు :**

వీరి కళలు ఇంతకు ముందు జంగం కథలుగా ఈనాడు, బుర్రకథగా పిలువబడుతున్నాయి. ఒకనాడు మత ప్రబోధానికి, దేశభక్తికీ ప్రతిబింబంగా నిలబడిన జంగంకథా కళారూపం రాను రాను యాచనకూ, ఉదరపోషణకూ ఉపయోగపడి తిరిగి ఈనాడు దేశభక్తిని ప్రబోధిస్తూ, ప్రజా సమస్యలను చిత్రిస్తున్నది. జంగం కథలు చెప్పే వారిని బుడిగె జంగాలని పిలుస్తారు. బుడిగెను కంచుతోగానీ ఇత్తడితో గానీ తయారుచేస్తారు. గుమ్మెటకు ఒక వైపున బెత్తపు చత్రాన్ని బిగించి, తోలుతో మూస్తారు. రెండవ ప్రక్కన కూజా మూతిలాగా, అనాచ్ఛాతీతంగా వుంటుంది. కథకునికి ఇరు ప్రక్కలా వున్న వంత గాళ్ళు ఒక్కొక్కరూ తమ గుమ్మెటను చంకకు తగిలించు కుంటారు. కుడిచేతి వ్రేళ్ళతో, చర్మముపైన వాయిస్తూ రెండవ ప్రక్క మూస్తూ, దాసరులందరూ వైష్ణవ భక్తులైనట్లే జంగాలందరూ శైవభక్తులు. వీరు చెప్పే కథలకు జంగం కథలని పేరు. వీరికే బుడిగె జంగాలు అనే పేరు కూడా వాడుకలో ఉంది. అందుకు కారణం వారు కథలో ఉపయోగించే వాయిద్యానికి బుడిగె అనే పేరును బట్టి బుడిగె జంగాలనే పేరు సార్థక నామమైంది. ఈ బుడిగెనే ఢిక్కి అని డిక్కి గుమ్మెటనే గుమ్మెట్ల కంటే చిన్నవి. ఇవి ఇత్తడితోనో లేదా కంచుతోనో చేయబడి వుంటాయి.

మధ్యయుగాలలో వీరశైవం ముందుకు తెచ్చిన సాంఘిక సమానత్వ భావనకు ఆకర్షితులైనది. వీరశైవం శివుడిని 'జంగమ దేవర'గా పేర్కొనడమే కాక శైవమతాన్ని ఆచరించే వారందరినీ 'జంగములు'గా పరిగణించి గౌరవించింది. ఆ విధంగా మధ్యయుగాలలో మాల, మాదిగ, బేడ, బుడగ వంటి అణగారిన, వెనుకబడిన కులాలు, సంచార జాతులు 'జంగమ' అనే కుల సమూహంలో చేరి 'మాల జంగం', 'మాదిగ జంగం', 'బేడ బుడగ జంగాలు'గా ఎంతో కొంత గుర్తింపును గౌరవాన్నీ పొందాయి. వైష్ణవ మత శాఖ ప్రభావంతో ఏర్పడిన దాసరి అనే సామాజిక మత వర్గం కూడా ఇలాంటిదే. 13వ శతాబ్దం నాటికే 'జంగమ' శబ్దం కుల వాచకంగా గుర్తింపు పొందింది. అగ్రకులాల ప్రభావానికి గురైన వీరశైవ శాఖ క్రమంగా తన ఉనికిని కోల్పోయినప్పటికీ అది సృష్టించిన 'జంగమ' కులాలు మాత్రం అవే పేర్లతో మనుగడ సాగిస్తున్నాయి. వివిధ కులాల నుంచి జంగములుగా పరిణామం చెందిన వారిలో కూడా తిరిగి సామాజిక అంతరాలు తలెత్తాయి. కర్ణాటకలో

'లింగాయతులు' కూడా 'జంగమ' అనే వర్గానికి చెందిన వారే అయినప్పటికీ వీరు మిగిలిన వారి కంటే సామాజిక హోదాలో పై ఎత్తున ఉండి శివాలయాలలో పూజారులుగా బ్రాహ్మణుల కంటే కాస్త తక్కువ స్థాయిని పొందుతున్నారు. సంచార జాతుల్లో 'బుడగ' లేదా 'బేడ' జంగాలు అనేవారు ప్రత్యేక సామాజిక వర్గంగా మధ్యయుగాల నుంచీ ప్రసిద్ధికెక్కారు. ఒకప్పుడు వీరశైవం ప్రబలంగా వ్యాప్తి చెందిన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ ప్రాంతంలో 'జంగమ' పేరుతో 'జంగాల పల్లె', 'జంగం పేట', 'జంగాల కండ్రిగ' అనే పేర్లతో ఒక్కో జిల్లాలో పదుల సంఖ్యలో గ్రామాలు ఉండడం వారి ప్రాచుర్యానికి గుర్తుగా భావించవచ్చు.

అణగారిన, వెనుకబడిన శూద్రకులాల నుంచి వచ్చిన జంగాలలో 'బేడ' లేక 'బుడగ' జంగం కులం సంచార జాతులలో ప్రధానమైనదిగా గుర్తింపు పొందింది. 'బేడ', 'బుడగ' జంగం అనేవి రెండు వేరు సామాజిక వర్గాలని కొందరు భావిస్తున్నప్పటికీ వారిద్దరూ ఒకరేనని ఆ కులానికి చెందిన వ్యక్తులు ప్రకటిస్తున్నారు. 'బేడ' వారు చనిపోయిన వారికి దహన సంస్కారం చేసేటప్పుడు 'బోడి బాపనమ్మ', 'బాలసంతులు', వంటి వేషాలు వేసుకుని ఆయా కథలు చెబుతారు. వారు చెప్పే కథల్లో 'శారద కథలు' ముఖ్యమైనవి. కాబట్టి వారిని ప్రజలు 'శారదగాళ్ళు' అంటారు. 'తోలుబొమ్మలాటలు', 'పగటివేషాలు', 'కాటిపాపల వేషాలు', 'మందెచ్చు'ల వేషాలు కూడా ప్రదర్శిస్తారు. మగవాళ్ళు కూడా ఎక్కువగా జుట్టు పెంచుకుని కొప్పు పెట్టుకుంటారు. అది వారికి తమ కళాప్రదర్శనలో వేషానికి బాగా ఉపయోగపడుతుంది. తమ వేషాలకు కావల్సిన చీరలు, ఇతర వస్త్రాలు, కిరీటాలు, ఆభరణాలు యాచనలో సంపాదిస్తారు. వారి ప్రదర్శన చూసిన జనం ఎంతో కొంత ధాన్యం, చిల్లర డబ్బులు కానుకగా ఇస్తారు. పై కులాల జంగములు చనిపోయినప్పుడు బుడగ జంగాలు పాట పాడి కథ చెప్పడం అలవాటు.

**వీరు ఉండే ప్రాంతాలు :**

బుడగ జంగమ కులం తెలంగాణా, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలలో షెడ్యూలు కులంగా రికార్డుల్లో నమోదైతే తెలంగాణలో 2025లో షెడ్యూల్డ్ కులాల గ్రూప్-1లో 3వ వరుసలో 1,11,710 జనాభా 2% ఉన్నారు.

**జీవనశైలి :**

ఇతర ఆదిమ ద్రావిడ తెగల మాదిరిగానే బుడగ జంగాలు కూడా మాతృస్వామిక వ్యవస్థనే అనుసరిస్తున్నారు. పెళ్ళిలో వరుడి తల్లిదండ్రులు వధువుకు ఇచ్చే కానుక 'వోలి' ఆచారం వారిలో వుంటే తతంగాలలో బ్రాహ్మణ పురోహితుడి పాత్ర ఉండదు. వారి కులపెద్దలే పౌరోహిత్యం చేస్తారు. మంత్రాలకు బదులు పెళ్ళి ప్రమాణాలు చెప్పించి సాదా, సీదాగా పెళ్ళి తతంగాన్ని ముగిస్తారు. అయితే ఆదిమ తెగల వలే బుడగ జంగాల కులపంచాయితీ చాలా బలమైనది. పెళ్ళి సందర్భంగా ఇరువైపుల పెద్దలకు మద్యం తాగించి విందు చెయ్యడం అనేది తప్పనిసరిగా పాటిస్తారు. వివాహం, విడాకులు వంటి విషయాలలో కుల పంచాయితీ చర్చించి నిర్ణయాలు తీసుకుంటుంది. పోలీసులు, కోర్టుల జోక్యాన్ని కులపెద్దలు అంగీకరించకపోవడం విశేషం. వ్యక్తులు కులపరమైన రివాజులను అతిక్రమిస్తే వారికి కుల పంచాయితీ జరిమానా విధించడం పరిపాటి. బుడగ జంగాల విషయంలో కుల సమాజం అంటరానితనాన్ని పాటించదు. వారికి హిందూ దేవాలయ ప్రవేశార్హత గుర్తించబడుతుంది. కానీ వారు మాత్రం సాటి జంగములైన మాల, మాదిగలను సమానంగా చూడక వారి కంటే తాము పై స్థాయి వారమని భావించడం గమనార్హం. చనిపోయిన వారిని ఇతర శూద్రకులాల జంగాలు కూర్చోబెట్టి స్మశానానికి తీసుకెళ్తే బుడగ జంగాలు మాత్రమే పాడె కట్టి తీసుకెళ్ళి దహనం చేస్తారు. చనిపోయిన మూడో రోజు దినాలు చెయ్యడం వారి సంప్రదాయం.

బుడగ జంగాల మతాచారాలు ఇతర హిందువుల కంటే కొంత మేరకు భిన్నంగా వుండడం విశేషం, జంగాలని అంటారు. ప్రధానంగా శైవభక్తులే కాక ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైల క్షేత్రం పేరు వారి పాత పేరులో ఉంటుంది. 'శివ జంగాలు', 'శ్రీ జంగాలు', 'సిరి జంగాలు' అనే పేర్లు వారి మతాన్ని సూచించేవే. వారు పిరికివారనే

అభిప్రాయం ఇతరులలో వుండడం వలన 'పిరికి జంగాలు' అని కూడా ఒక పేరు వారికుంది.

**జీవనోపాధి :**

ఒకప్పుడు వేట ప్రధాన వృత్తిగా సంచార జీవితం గడిపిన బేడ / బుడగ జంగాలు క్రమంగా వేటాడటం తగ్గించి, జీవనోపాధి కోసం అనేక వృత్తులను అవలంభిస్తున్నారు. ఈతాకు చాపలు అల్లి అమ్మడం, దువ్వెనలు, అద్దాలు వంటి చిల్లర సామాన్లు అమ్మడం, చేపలు పట్టి, అరుదుగా ఉడతలు, పిల్లులు, తాబేళ్ళు వంటి జంతువులను ఆహారం కోసం వేటాడడం వంటి వృత్తులను చేస్తూ, సంచార, అర్ధ సంచార జీవితాన్ని గడుపుతున్నారు. స్త్రీలు ఎక్కువగా చాపలు అల్లుతారు. చాపలు అల్లడంతో స్త్రీ పురుషులిద్దరూ పాల్గొన్నప్పటికీ స్త్రీలు ఇతర పనులు చేసుకుంటూ కూడా చాపల్ని నైపుణ్యంగా అల్లడం విశేషం. చాపలు అల్లడానికి కావల్సిన ఈతాకు సేకరించడానికి స్త్రీ పురుషులిద్దరూ వెళ్తారు. ఈతాకుకు మట్ట నుంచి ఆకును వేరుచేసి మధ్యలో వుండే కర్రని 'బరిగె' అంటారు. ఆ బరిగెను యెరుకల వారు తీసుకుని వాటితో బుట్టలు అల్లుతారు. ఈతాకు సేకరణలో వారికి కల్లు గీత వారి నుంచి వ్యవసాయదారుల నుంచి ఆటంకాలెదురైతే కొన్ని సార్లు వాళ్ళను బతిమాలుకుని మరొకొన్నిసార్లు దొంగతనంగా కోసుకొస్తారు. ఈతాకు సేకరించడం పైన కూడా వారు పాటలు అల్లుకుని పాడుకుంటారు. వాటిని అమ్మితే వచ్చే డబ్బుతో సుఖంగా బతుకుతాం అనే భరోసా ఆ పాటల్లో కనిపిస్తుంది.

తెలంగాణలో, ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వరంగల్, నల్గొండ జిల్లాలో ఉన్నారు. ప్రధానంగా సంచార జాతిగా గుర్తించబడిన బుడగ జంగాలు గ్రామాలలోని స్మశాన స్థలాలలోనూ, కాలువ గట్లపైన పోరంబోకు స్థలాలలోనూ, గుడిసెలు వేసుకుని జీవిస్తూ తమ అవసరాలకు అనుగుణంగా తమ నివాస ప్రాంతాలను మార్చుకుంటూ వలస వెళ్తారు. బుడగ జంగాలలో అక్షరాస్యత చాలా తక్కువ. పదో తరగతి కంటే పైన చదువుకున్న వారు దాదాపు లేరంటే అతిశయోక్తి కాదు. వారి భాష తెలుగే తమ భాష తెలుగే అయినా కన్నడ, సంచార బతుకుతో సమ్మిళితమైన తెలుగుగా మారిపోయింది. ఆ భాషకు లిపి లేదు.

**ఉదాహరణకు కొన్ని పదాలు:**

| తెలుగు | బుడగ జంగమ భాష |
|---|---|
| ఇల్లు | మెత్తి, ఘరా |
| అన్నం | భండారి |
| తినడం | మెసగడం |
| అమ్మాయి | పింక |
| అబ్బాయి | పింకుడు |
| తాబేలు | కుముగాడు |
| పిల్లి | జంగాస్క |
| దెయ్యం | కాసికం |
| ఉడత | తోర్పిగాడు |
| నక్క | నర్సిగాడు |
| ఉడుం | వోలింగాడు |

ఇతర ఆదిమ ద్రావిడ తెగల మాదిరిగానే బుడగ జంగాలు కూడా మాతృస్వామిక వ్యవస్థనే అనుసరిస్తున్నారు. 'బెడ' అనే పదం వారు చనిపోయినవారికి దహన సంస్కారం చేసేటప్పుడు కథలు చెప్పినందుకు రుసుముగా రెండణాలు అనగా 'బేడ' తీసుకోవడం వలన వచ్చిందనే అభిప్రాయం పరిశోధకులలో ఉంది. అయితన 'బేడ' అనే పదానికి 'వేట' అని అర్థం వుంది. వీరి ప్రధాన వృత్తి వేట కాబట్టి 'బేడ' అనే పేరు వీరి పరంగా వాస్తవమై వుండొచ్చు. ఎడ్గర్ థర్ స్టన్ అనే మానవశాస్త్ర పరిశోధకుడు బోయలు 'బేడ జంగాలు' ఒకరేనని పేర్కొన్నారు. వారు ప్రదర్శించే కళలల్లో వారు ధరించే పాత్రలైన తోలు బొమ్మలాటలు, పగటి వేషగాళ్ళు, బహురూపులు, భాగోతులు, శారదగాళ్ళు, కాటిపాపలు, బాలసంతులు, బైరాగులు, కోయదొరలు, కొండ రాజులు, మందెచ్చులు, గురప్పలు అనేవి వుండడం వలన వీరిని వేరు వేరు సామాజిక వర్గాలుగా భావిస్తున్నారు. కానీ వీరంతా ఒకరేనని బుడగ జంగాలపై పరిశోధన చేసిన ఎన్.ఆర్. వెంకటేశం తమ సిద్ధాంత గ్రంథంలో పేర్కొన్నారు. సంచార జీవితం వలన, వారు చేపట్టిన వివిద వృత్తుల వలన

రకరకాల పేర్లు వారికి వచ్చి ఉండొచ్చు. వీరు తమ కళాప్రదర్శనలో ఉపయోగించే 'బుడిగె' అనే వాద్య పరికరాన్ని బట్టి వారికి 'బుడగ' జంగాలనే పేరు వచ్చిందని భావించవచ్చు. బుడగ జంగాలు నివసించే ప్రాంతాన్ని బట్టి, వారి స్వభావాన్ని బట్టి తిరిగి వారిని ఊర జంగలు, గణాయత జంగాలు, ఈతముక్కల జంగాలు, శివ జంగాలు, శ్రీ లేదా సిరి జంగాలు, పిరికి జంగాలు అనే విభజన వీరి పరంగా వొచ్చింది. ఒక గ్రామంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవించే వారిని 'ఊర' లేదా 'గణాయుత' జంగాలని అంటారు. వారు ప్రధానంగా శైవభక్తులే.

బుడగజంగాల మతాచారాలు ఇతర హిందువుల కంటే కొంత మేరకు భిన్నంగా వుండడం విశేషం. వారు మాతృ దేవతలైన యెల్లమ్మ, పోచమ్మ, వనదేవతలు వంటి స్త్రీ దేవతను ఆరాధిస్తారు. వారి కంటే పితృదేవతలను యెంతో నిష్టతో పూజిస్తారు. పితృదేవతలను 'పెద్దగోశాయి' అంటారు. వారి కొరకు పూజలు చేస్తూ నైవేద్యంగా పందిని గానీ, కోడిని గానీ కోసే ఆ మాంసాన్ని ప్రత్యేక పద్ధతిలో వండుతారు. కూరలో మసాలా దినుసులు, ఉల్లి పాయలు, నూనె వెయ్యకుండా ఉప్పు, కారం, కల్లు లేక సారా కలిపి వండుతారు. వండిన మాంసాన్ని ఆకుల్లో పెట్టి భూమి మీద మూడుసార్లు పెట్టి సారా లేదా కల్లును కూడా పోస్తారు. పితృదేవత అయిన పెద్ద గోశాయికి పెట్టే నైవేద్యాన్ని 'నల్ల పట్టు' అంటారు. బుడగ జంగాల ఇంటి పేర్లు కూడా ప్రత్యేకంగా ఉంటాయి. అవి 'ఇంగువ', 'టేకు', 'బయల్పాటి', 'ముగ్గు', 'సింగిడి', 'ప్రసాదం', 'కళ్యాణి', 'గోటూరి', 'పస్తం', 'మోటూరి' మొదలైనవి.

బుడగ జంగాల సామాజిక జీవనంలో వైయుక్తికత కంటే సామూహికత ఎక్కువ. స్త్రీ, పురుషులిద్దరూ వివిధ కళారూపాలనుగాను చెయ్యడం ప్రధానంగా ఉంటుంది. వాటిలో చారిత్రక గాథలైన 'బొబ్బిలి యుద్ధం', 'తిమ్మరాజు కథ', 'బాలనాగమ్మ కథ', 'ఆరెమరాఠీలు', 'దేశింగురాజు కథ' మొదలైన వాటిని తంబుర, బుడిగె వాయిస్తూ గానం చేస్తారు. ప్రధాన గాయకుడు తంబుర మీటుతూ కథ చెబితే పక్క నుండే వంతలు బుడిగె వాయిస్తారు. 'తుపాకి రాముడు', 'బోడి  బాపనమ్మ', 'బాలసంతులు' వంటి వేషాలు వేసుకుని ఆయా కథలు చెబుతారు. వారు చెప్పే కథల్లో 'శారద కథలు' ముఖ్యమైనవి.

**ముగింపు :**

జంగమ కులాలలో పై అంతస్తులో వుండేవారు. 'లింగాయతులు' లేదా 'జంగమ దేవరలు'. వారు వీరశైవ మతాచారం ప్రకారం లింగధారణ చేసి ఆదాయవనరులు బాగా ఉండే పెద్ద పెద్ద శివాలయాలలో పూజారులుగా ఉంటారు. వారికి బుడగ జంగాలకీ పెద్దగా సంబంధాలు వుండవు. అందరూ వీరశైవ సంప్రదాయంలోనివారే అయినప్పటికీ లింగాయతులకీ ఇతర జంగాల కులాలకు కూడా కంచం పొత్తు, మంచం పొత్తు వుండవు. వీరశైవం సమానత్వాన్ని బోధించినప్పటికీ కాలక్రమంలో ఆ మతం ద్వారా ఆవిర్భవించిన జంగమ కులం కూడా కుల వ్యవస్థలోని అసమానతలు, వివక్ష వంటి అవలక్షణాలకు మినహాయింపు కాలేక పోయిందనడానికి ఇదే తార్కాణం.

**ఆధార గ్రంథాలు / ఉపయుక్త గ్రంథసూచి :**


1. తెలుగునాటక వికాసము - పి.యస్.ఆర్ అప్పారావు
2. తెలుగు జానపద గేయగాథలు - నాయని కృష్ణకుమారి
3. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చిత్ర - యస్వీ జోగారవు
4. జానపద కళా సంపద - తూమాటి దొణప్ప
5. పల్లె పదాలలో ప్రజాజీవనం - యెల్దండ రఘుమారెడ్డి
6. ఆంధ్ర నాటకరంగ చరిత్ర - మిక్కిలినేని రాధాక్రిష్ణమూర్తి
7. తెలుగు జానపదగేయ సాహిత్యం - ఆచార్య బిరుదురాజు రామరాజు
8. బుడిగె జంగాలు (భాషా సాహిత్య సాంస్కృతికాంశాల పరిశీలన) - డాక్టర్ ఎన్.ఆర్. వెంకటేశం ★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# జానపద కళావైభవం - కోలాటం



- సుప్పని సత్యనారాయణ

తెలుగు అధ్యాపకులు, అధ్యక్షులు: భీమన్న సాహితీ పీఠం - బాన్సువాడ, గ్రామం: కోనాపూర్
మం: బాన్సువాడ, కామారెడ్డి జిల్లా - తెలంగాణ.

**వ్యాస సంగ్రహం :**

జానపద కోలాటం అనాది నుంచి వస్తున్న ప్రాచీన కళ. ఈ కళలోని గొప్పతనం అంతా ఇంతా కాదు. ప్రాంతాలవారీగా, రాష్ట్రాలవారీగా (మీరు తెలుగు రాష్ట్రాలలో) ఈ కళ వైభవం అధిక ప్రాధాన్యత సంతరించుకున్నది. పురాణ కాలం నుంచి కూడా ఈ కళకు మంచి ప్రాధాన్యత ఉన్నది. పూర్వకవి పరంపరలో కూడా ఈ కళ గురించిన ప్రస్తావన చాలా ఉన్నది. కాలానుగుణంగా వస్తున్న పరిణామాలకు తగ్గట్టుగా ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. అందులో భాగంగానే జెడకొప్పులు, కోలాటం వంటివి ఏర్పడ్డాయి. కోలాటంలో మరొక భాగమే ఈ జెడ కొప్పులు. ఇందులో వేషధారణ, పాత్రధారుల యొక్క హావ భావాలు, నృత్యం అన్ని ప్రజలను ఆకర్షించే విధంగా ఉంటాయి. అంతేకాకుండా కోలాటం పాత్రధారులు ఉపయోగించే సామాగ్రి అందెలు, గజ్జలు వంటివి ఎక్కువగా ఉంటాయి. ఇందులోని పాటలు కూడా భిన్నంగా ఉండి, పదాలలోని పొందిక చమత్కార వంతంగా ఉంటుంది. ఈ కళ లోని గొప్పతనాన్ని, కనుమరుగవుతున్న జానపద వైభవాన్ని మళ్లీ పొందే విధంగా, ఔత్సాహికులకు ఈ వ్యాసం తప్పనిసరిగా ఉపకరిస్తుంది.

**కీలక పదాలు :**

ఇందులో...గజ్జలు, అందెలు, మువ్వలు, సంగడి కోలలు, కోలలకు రంగుల అద్దకం, కల్లేటికొప్పులు, శ్రీకృష్ణ కొప్పులు, పెబ్బే, ఉద్ది, జత, తబలా, తాళాలు, పద్మజడ, ముద్ద జడ, పంతులు, వంతకాడు వంటివి కీలక పదాలు.

**ప్రవేశిక :**

ఇరు తెలుగు రాష్ట్రాలలో జానపద కళారూపాలకు కొదువ లేదు. ఆయా ప్రాంతాల ఆచార వ్యవహారాలను, సంస్కృతి సంప్రదాయాలకు తగ్గట్టుగా అనేక జానపద కళారూపాలు కొన్ని జీవనదిలా ప్రవహిస్తూ ఉంటే, మరికొన్ని కాలక్రమేణా కనుమరుగైపోయాయి. బహుళ జనాదరణ పొందిన కళారూపాలలో తెలుగు నేల అంతటా, నేటికీ మిక్కిలి జనాదరణ పొందుతున్న కళారూపం ఏదైనా ఉన్నది అంటే అది కేవలం కోలాటం అని ఘంటాపథంగా చెప్పవచ్చు. అందులో ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాలలో గమనిస్తే తెలంగాణలో మిక్కిలి జనాదరణ పొందింది అని చెప్పవచ్చు. అంతేకాక నేటికీ కొనసాగుతూ, రసిక జన రంజకంగా ముందుకు వెళుతున్న కళారూపంగా ఈ కోలాటం, జడ కొప్పు లను పరిగణించవచ్చు.

**విషయ వివరణ :**

సర్వజనరంజకమైన ఈ కోలాటం పుట్టుపూర్వోత్తరాలను

గమనిస్తే, కొన్ని ప్రాంతాలకు గాని, కొంతమంది కళాకారులకు గాని తెలియదు. కొంత పూర్వ చరిత్రను పరిశీలించినట్లయితే కొంత నేపథ్యాన్ని గమనించవచ్చు. 15 నుంచి 16 వ శతాబ్దం కంటే ముందటి నుండి ఈ కళ జనాబాహుల్యంలో ఉన్నది. అందుకు తగిన ఆధారాలు కూడా లేకపోలేదు.

తెలంగాణ ఆదికవిగా పేరుగాంచిన పాల్కురికి సోమనాథుడు తన పండితారాధ్య చరిత్రలో అనేక ప్రాచీన కళారూపాలను గురించి వర్ణిస్తూ, అందులో కోలాటాన్ని ప్రత్యేకంగా చెబుతూ, దీనిని.. గొడియా గా అభివర్ణించడం జరిగింది. అలాగే అన్నమయ్య పదాలలో కూడా కోలాటం యొక్క ప్రస్తావన కనిపిస్తుంది. విజయనగర సామ్రాజ్య కాలంలో ఈ కళారూపం విశేషంగా జనం చేత ఆదరణ పొంది బాగా ప్రసిద్ధి చెందినట్లు విదేశీయాత్రికుడైన అబ్దుల్ రజాక్ ఎంతో గొప్పగా ఈ కోలాటాన్ని అభివర్ణించడం జరిగింది. ఈ కోలాటం ప్రత్యేకత మరింత విశేషంగా చెప్పాలంటే విజయనగర శిథిల శిల్పాల గోడల మీద, శ్రీశైలం దేవాలయ ప్రాకారపు గోడల పైన కోలాటం వేసి నర్తకీమణుల శిల్పాలు ఎంతో రమణీయంగా చెక్కబడ్డాయి.

**కోలాటం నిర్వచనం :**

కోల + ఆట = అని రెండు దేశ్యాలైన విశేష శబ్దాల కలయిక వలన ఏర్పడిన పదమే ఈ కోలాటం. కోల అంటే కర్ర, పుల్ల అని అర్థమని, కట్టియ, పుడక, కట్టే అని పర్యాయపదాలని, ఆట శబ్దానికి, తాండవం, నటనమ్, నృత్యం, నాట్యం, లాస్యం, నర్తనం అని అర్థాలుగా చెప్పవచ్చు. అంటే రెండు చేతులతోనూ, కర్ర ముక్కలను పట్టుకుని, ఏ పదాలు పాడుతూ, గుండ్రంగా తిరుగుతూ, లయకు అనుగుణంగా అడుగులు వేస్తూ, ఒకరి చేతి కర్రను, మరొకరి చేతి కర్రతో తాకుతు, శబ్దానికి తగినట్టు నాట్యం చేస్తూ, కోలలను వాయించడం కోలాటం" అని.... డాక్టర్ బిట్టు వెంకటేశ్వర్లు గారు జానపద కోలాటం ప్రక్రియను చక్కగా వర్ణిస్తూ వారి "జానపద విజ్ఞానం" అనే గ్రంథంలో వివరించారు. వారి పరిశోధన కూడా ఎంతో విశేషమైనది అని చెప్పవచ్చు.

కోలాటమును ప్రదర్శించే బృందంలోని వాళ్లు అందరూ సరి సంఖ్యలో ఉంటారు. ఒకరు ఉద్ది అయితే, మరొకరు పెబ్బే, లేదా పెన్నుద్ది అంటారు. అలా ఈ ఇద్దరికి మరో ఇద్దరూ ఎవరు జోడి అయితే వారు మొదట కోలలు ప్రారంభం చేసి ఆడటంతో ముందుకు వెళుతారు. అలాగే వారు ఉపయోగించే కోలలు చాలా అందంగా వాటిని అలంకరించుకుని, వాటికి గజ్జెలు, లేదా అందెలు వంటి వాటిని జత చేసుకుంటారు. అలా చేసుకుని కోలాటం ఆడటం వల్ల, పదాలను అనుకుంటూ, లయాత్మకంగా చేసి నృత్యం వల్ల వీనుల విందుగా ఉంటుంది. మనసుకు ఆనందాన్ని ఇవ్వడం కాదు, శరీరంలో తెలియని ఉత్సాహం, ఉల్లాసం కూడా వస్తుంది.

ఇక కోలాటం ప్రదర్శించే కళాకారులు ఉద్ది ఒక రకమైన వేషధారణ, పెబ్బే ఒకరకమైన వేషధారణలో ఉండడం వల్ల చూపరులకు ఆసక్తిని రేకెత్తించే విధంగా ఉంటుంది. అంతేకాకుండా ప్రతి కళాకారుని కాళ్లకు గజ్జెలు కట్టుకొని ఆడుతుండడం వలన, లయాత్మకంగా సాగే మువ్వల సవ్వడి వినసొంపుగా ఉంటుంది. ఒకరు మధ్యలో కూర్చుండి తబలా, లేదా డోలు, మృదంగం వంటి వాయిద్యాన్ని వాయించడం, మరో గాయకుడు శృతి బద్దంగా కోలాటం పాటను శ్రావ్యంగా ఆలపించడం, అంతే శృతిబద్ధంగా కళాకారులందరూ ఏకకంఠంతో పాడటం, ఆ అనుభూతిని వర్ణించడానికి మాటలు చాలవు.

**జెడకొప్పు విశిష్టత :**

కోలాటం ప్రదర్శించే విధానం తెలుగు రాష్ట్రాలలో కొన్నిచోట్ల ఉన్నప్పటికీ, జెడ కొప్పు (అంటే త్రాడులను పట్టుకుని పాటలకు తగ్గట్టుగా తిరుగుతూ ఆడడం) చాలాచోట్ల కనపడదు. అయితే ఈ విధానం కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమైంది. ముఖ్యంగా ఉమ్మడి నిజామాబాద్, కోరుట్ల, జగిత్యాల, కరీంనగర్, నల్లగొండ, తూర్పుగోదావరి జిల్లాలలో గల కొన్ని ప్రాంతాలలో ఈ కోలాటం, జెడకొప్పు ప్రదర్శించడం జరుగుతుంది.

ఈ విధానం కోలాటంలో ప్రత్యేక ప్రదర్శనగా చూపరులకు పరమానందాన్ని కలిగిస్తుంది. ఇందులో పెబ్బె ఒకరకం త్రాడును, ఉద్ది ఒక రకం త్రాడును పట్టుకొని కోలకు, పాటకు తగ్గట్టుగా ఒకరి వెనకాల నుండి మరొకరు కొన్ని సందర్భాలలో, ఒకరి ముందరి నుండి మరొకరు తిరగడం ద్వారా పందిరి పైన ఉంచిన త్రాడుల సమూహం జడ మాదిరి అల్లికగా తయారవడం జరుగుతుంది. దీనిని రెండు రకాలుగా.. ఒకటి "పద్మజడ, మరొకటి ముద్దజెడ" గా చెబుతారు. అయితే కొన్ని చోట్ల ఒక్కోరకమైన కొప్పుకు ఒక్కోరకంగా తిరగడం, అంతే కాకుండా అదే తరహాలో జెడను అల్లడం కూడా ఉంది.

జెడకొప్పును ప్రదర్శించేముందు సరి సంఖ్యలు త్రాడులను జత చేసి, చింత చెట్టు కొమ్మకు కట్టి ప్రదర్శించేవారు. తదనంతర కాలంలో గ్రామంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద పచ్చటి పందిరి వేసి, మామిడి తోరణాలు కట్టి, అందులో అందంగా ముగ్గులు వేసి, త్రాడులను బిగించిన చెక్క మధ్యలో, శ్రీకృష్ణుని ప్రతిమ నుంచి, పూలతో అల్లిన తొట్లెను కట్టి భక్తితో నమస్కరించడం జరుగుతుంది.

ఇది లయబద్ధంగా ప్రదర్శన ఇచ్చే సందర్భంలో తప్పులు, పొరపాట్లు జరగడం అనేది సహజమే. అలా ఒక కోలా తప్పిన మొత్తం ప్రదర్శన అంతా చిక్కుబడి పోతుంది. జెడ అల్లే క్రమంలో సక్రమంగా తిరిగినట్లుగానే, విప్పేటప్పుడు కానీ, ఎవరైనా కోలా తప్పిపోయినప్పుడు కానీ అదే వక్ర దిశలో, అదే వ్యతిరేక దిశలో తిరగడం వలన ఆట సక్రమంగా ముందుకు సాగుతుంది. అంటే ముందు తిరిగి జెడ అల్లినట్లే, విప్పేటప్పుడు అది వరుసలో వెనుకకు తిరుగుతూ జెడను విప్పడం జరుగుతుంది. బహుశా! ఇంత ప్రామాణికంగా జానపద కళారూపాలను మరే ప్రదర్శన ఉండకపోవచ్చు.

**కోలాటం పాటలది ప్రత్యేక శైలి :**

జానపద కళారూపాలకు ఒక్కో కళకు ఒక్కో బాణి ఉంటుంది. అది కేవలం అనాది నుంచి వస్తున్న ఆ కళను నమ్ముకున్న వాళ్లకు మాత్రమే ఆ పాటలు సులభంగా అర్థమవుతాయి. మిగతా వారికి కేవలం చూసి ఆనందించే పాత్ర మాత్రమే ఉంటుంది. కోలాటం పాటల విషయానికి వస్తే.. వివిధ గతులతో, లయబద్ధమైన జతులతో ఈ పాటలు భాగవతం లోని శ్రీకృష్ణుని కొన్ని ఘట్టాలకు అందించినవి ఉంటాయి.

**కొప్పులు పలు విధాలు :**

ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో ఈ జెడ కొప్పుల విధానం ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. ఎందుకంటే ఈ ప్రాంతంలో యక్షగాన కళా ప్రదర్శన అధికంగా ఉంటుంది. అందువలన దానికి దాదాపు అత్యంత సామ్యంగా ఉండే కళారూపం కోలాటం, జెడ కొప్పులు. ఇందులో ప్రధానంగా "గణపతి కొప్పు, శారదాంబ కొప్పు, దువ్వెర కొప్పు, మందగమన కొప్పు, కంస కొప్పు, గొల్లభామల కొప్పు, కోల్ కోల్ కొప్పు, చిలుక కొప్పు, తానాయకపు, కాముని కొప్పు, బాలింత కొప్పు, పర్ణశాల కొప్పు, ఎరుకలి కొప్పు, బంగారయ్య కొప్పు, ఇందువదన కొప్పు,..... వంటి పలు రకాల కొప్పులను, పలు రకాలుగా ప్రదర్శనలతో తిరుగుతూ లయాత్మకంగా ఆడడం జరుగుతుంది. ఈ కోలాటంను ప్రదర్శించే సమయంలో వీరికి పంతులు దగ్గరుండి అన్నింటిని వారికి మార్గ నిర్దేశకునిగా చేస్తూ సూచనలు ఇస్తూ ఉంటాడు.

కొన్ని ప్రాంతాల్లో కేవలం పాటలతో కోలలను ప్రదర్శిస్తే, మరికొన్ని చోట్ల ఒంటికోలతో, ఒక చేత తాడు మరొక చేత కోలను పట్టుకొని ప్రదర్శనలో భాగస్వాములు అవుతారు. ఈ విధంగా కూడా కొన్ని ప్రాంతాల్లో కోలాటం ప్రదర్శన ఇవ్వడం జరుగుతుంది. వారు ఆలపించే పాటలకు అనుగుణంగా, లయబద్ధంగా వాళ్లు ఆ పాటలలో లీనమై మైమరిచిపోయి ఉల్లాసంగా ఆడుతూ ఉంటారు.

ప్రతి వ్యక్తికి అంటే ప్రదర్శించే వారికి కోలను కొట్టే విధానం, ఆడే విధానం, తిరిగే విధానం దగ్గరుండి చూయించడం, తానే పాటను పాడడం, లేదా మరే ఇతర గాయకుల చేత పాడించడం, దానికి అనుగుణంగా మిగతా వారందరూ వంత పాడడం అనేది జరుగుతుంది. ఇలా మార్గ నిర్దేశన చేసి, దర్శకత్వ బాధ్యతను తాను పోషిస్తాడు. అందువలన తనను అందరూ పంతులుగా భావించి గురువుగా స్వీకరించడం జరుగుతుంది. ఈ

విధానం తెలంగాణలో పలు జిల్లాలలో, పలు ప్రాంతాలలో ఇంకా కొనసాగుతూనే ఉన్నది.

ఈ కొప్పుల ప్రదర్శన ఎక్కడ జరిగినా కొన్నిచోట్ల కల్లేటి కొప్పలు, శ్రీకృష్ణ కొప్పులు, జడ కొప్పులు..... అనే పేర్లతో పిలుస్తూ, లిఖిత రూపంలో ఉన్న పాటలను కొందరు ఆలపిస్తే, వంత పాడే వారిలో మరికొందరు ఆశువుగా ఆలపిస్తూ, మిగతా వారికి జోష్ ను తెప్పిస్తారు.

**కోలాటం సామాగ్రి :**

కోలాటం ప్రదర్శించే కళాకారుల వేషధారణ, సామాగ్రి కొంత వినూత్నంగా, భిన్నంగా ఉంటుంది.

ఇందులో పెబ్బె ఒక రకమైన వేషధారణతో ఉంటే, ఉద్ది మరొక రకమైన వేషధారణతో కనిపిస్తాడు. వీరికి ప్రత్యేకంగా చేయించిన కోలలు, వాటికి గజ్జలు, అందెలు అలంకరణగా ఉంటాయి. లయబద్ధంగా, పాటకు అనుగుణంగా పల్లవి, అంతే లయబద్ధంగా కోలలు, మరియు కాళ్లకు కట్టుకున్న మువ్వల సవ్వడి వినసొంపుగా ఉంటుంది.

కొన్నిచోట్ల పెబ్బెలు శ్రీకృష్ణుని వేషధారణలో ఉంటే, ఉద్దులు గొల్లభామల పాత్రలు వేసి, ఆ వేషధారణలో చూపరులను అలరింప చేయడం జరుగుతుంది. శ్రీమద్ భాగవతంలో శ్రీకృష్ణుని లీల వినోదాలను వర్ణిస్తూ గోపికలతో శ్రీకృష్ణుడు చేసిన సరస సల్లాపాలు వారితో ఆడి పాడిన విధానమే, ఆ క్రీడా వినోదాలకు సంకేతంగా ఈ కోలాటం ముందుకు కదులుతూ ఉంటుంది.

**ప్రణయ రసభరితమైన పాటలు :**

ఈ తెలుగు నేలపైన కోలాటం అనే ఈ కళారూపం ఎంత మటుకు అయితే వ్యాప్తి చెంది ఉందో, అంత మటుకు కోలాటం పాటలన్నీ శ్రీమద్భాగవతానికి అనుబంధంగా సాగుతూ, శ్రీకృష్ణుడికి, గోపికలకు మధ్య జరిగిన ప్రణయ భావభరితమైన సందేశాన్ని తెలిపే విధంగా ఉంటాయి. ఇందులో ఎంత మాత్రమూ సందేహం లేదు. అలాగే పాటలలో ఎక్కడా కూడా అశ్లీలత కనిపించదు. కేవలం అమలిన శృంగారం మాత్రమే కనిపిస్తుంది. వినేవారికి ఉత్సాహాన్ని, తన్మయత్వాన్ని అందించడమే వీటి యొక్క ముఖ్య ఉద్దేశం.

మచ్చుకు :

శ్రీ వచ్చేనురా కృష్ణ వచ్చేనురా!
నువ్వు యాడికి రమ్మన్న వచ్చేనురా!!... (శ్రీకృష్ణ కొప్పు)

శ్రీ నీళ్లకు పోయేటి నిలువవే నిలజాక్షి - నిలుచుండవే గొల్లభామ! నేను నీకొరాకై వస్తలేమా!!.... (శ్రీకృష్ణుడు) నిలుచుండు మని నిన్ను నిజముతో బలికేవు - నీకేమీ పనిగలిగెనోయీ! కృష్ణ! నిజముగా నాకు తెలుపవోయీ....(గొల్లభామ)

శ్రీ గొల్ల భామలము మేమోయమ్మ! సరసంబున సారా - చల్లాలమ్మేటి వారల మమ్మా!!గొల్లాలు గలిచేరు లెల్లాగలగుసము - పుల్లాయసము జగమెల్లా గలిగిన సుర - గొల్లాభామలము మేమోయమ్మా!!...(గొల్లభామల కొప్పు)

శ్రీ ధర్మము కాదయ్యా కంసా! ధరణి స్త్రీ హింస నీకు!- నిర్మల మతి విభ్రమె కంసా!- నీతివెరసి కావరెకంసా!! ...(కంసకొప్పు)

ఇలా ప్రత్యేకమైన పదజాలంతో, ప్రత్యేకమైన శైలితో శ్రీకృష్ణుని చిన్ననాటి లీలలను కళ్లకు కట్టినట్లు, అలాగే గోపికలతో ఆడే సరస సల్లాపాలతో శ్రీకృష్ణుని లీలా వినోదాలను అన్ని రకరకాల పదాలుగా గానం చేయబడతాయి. ఇది కేవలం కోలాటం పాటలు మాత్రమే ప్రత్యేక. అందులో గోపికలు ఒక రకమైన పదాలను ఆలపిస్తే, శ్రీకృష్ణుని పాత్రలో ఉన్న వారు మరో రకమైన పాటలను ఆలపించడం జరుగుతుంది.

**ప్రముఖ వాగ్గేయకారుల కృషి :**

తెలంగాణ వ్యాప్తంగా ఈ కలను పెంచి పోషించిన మహనీయులు ఎందరో ఉన్నారు. అందులో అటు యక్షగాన రచనలతో పాటు, గ్రామ గ్రామాన వెళ్లి, రాత్రులు మెలకువగా ఉండి ఔత్సాహికులైన వారికి కోలాటాన్ని ప్రదర్శించిన మహనీయులు ఎంతోమంది ఉన్నారు. ముఖ్యంగా.. పనస హనుమద్దాసు, రెడ్డిశెట్టి హనుమద్దాసు, చెర్విరాల భాగయ్య, గడిగే భీమకవి, పెద్దిరాం పోచన్న పంతులు...వంటి మహనీయులు కేవలం వారు నివసిస్తున్న గ్రామానికి కాక పలు గ్రామాలకు వెళ్లి కోలాటం ప్రదర్శనలో శిక్షణను ఇప్పించి, నాలుగు రోడ్ల కూడలి వద్ద, తిరునాళ్లు, జాతరలు, పండగల సందర్భంలో

కోలాటం, జడ కొప్పు ప్రదర్శనను ఇప్పించేవారు. ఇందులో వనన హనుమద్దాను గారు, పెద్దిరాం పోచన్న పంతులుగారు వందల గ్రామాలను తిరుగుతూ ప్రదర్శనలను ఇప్పించడం జరిగింది. నేటికీ వీరిని పంతులు గా భావించి, గురువుగా స్వీకరించి వీరి పేరు మీదుగానే, గ్రామాలలో ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా, లేదంటే తిరునాళ్లు, జాతరల సందర్భంగా కోలాట ప్రదర్శనలో మొదట వారిని గుర్తు చేస్తూ, గురుస్తుతి చేసి ప్రదర్శనను మొదలుపెడతారు.

ఇలా ఇరు తెలుగు రాష్ట్రాలలో ఈ కళ ఇప్పటికీ జనాదరణలో ఉండడమే కాకుండా, ఉత్సవాలను పురస్కరించుకొని ప్రదర్శనలు కూడా ఇవ్వడం జరుగుతూ ఉంది. ఆంధ్ర ప్రాంతంలో కొన్నిచోట్ల కోలలు మాత్రమే వేస్తే, మరికొన్నిచోట్ల ఒంటి తాడుతో ప్రదర్శనను ఇవ్వడం జరుగుతు ఉంది. తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడ చూసినా ముఖ్యంగా, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా...కరీంనగర్, నల్లగొండ, నాగర్ కర్నూల్, వంటి ప్రాంతాలలో కోలాటం ఇంకా ప్రసిద్ధి గానే ఉంది. ఇందులో కోలాటంతో పాటు, జడ కొప్పు ప్రదర్శన ఇవ్వడం కనిపిస్తుంది.

ఇంతటి ప్రశస్త్యమైన కళ ఇంకా కొన్నిచోట్ల మాత్రం నిరాదరణకు గురవుతున్నది అని కచ్చితంగా చెప్పాలి. ఎందుకంటే ప్రాంతాలవారీగా, భేదాలు వచ్చినప్పుడు... రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక... వంటి సంప్రదాయ పద్ధతులలో కేవలం పెళ్లిళ్లు, పేరంటాల్ల సందర్భాలలో ఈ కోలాటమును కాస్త దాండియాగా మార్చి సినిమా పాటలకు, ఇతర జానపద గీతాలు ప్రాధాన్యత ఇచ్చి వాటిపైన స్టెప్పులు వేస్తూ ఆడుతున్న సందర్భం కొన్ని చోట్ల కనిపిస్తుంది. ఇది సరికాదు.

**ముగింపు :**

వేద కాలము నుంచి, పురాణ కాలము నుంచి, ఇతిహాస కాలం నుంచి అనాదిగా వస్తున్న ఈ ప్రక్రియ జీవన స్రవంతిలా ముందుకు సాగాలి అంటే ఈ పాటలను, ప్రదర్శనను మన అస్తిత్వాన్ని నిలబెట్టుకునే విధంగా ప్రదర్శించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. దాని ద్వారా ఈ కళకు ఉన్న గొప్పతనం ఏమిటో మునుముందు తరాలకు గొప్పగా తెలిసే అవకాశం ఉంటుంది. లేనట్లయితే దాండియాగా పిలువబడే ఈ ప్రదర్శనలే అసలైన కోలాటం అనుకునే ప్రమాదం మన తర్వాత వచ్చే తరం పైన ఉంటుంది.

అందువల్ల క్షేత్రస్థాయిలో ఈ కళపట్ల విద్యార్థులకు అవగాహన కల్పించినట్లయితే, దీనిలోని గొప్పతనాన్ని తెలుసుకుని రాబోయే తరాలకు “తెలంగాణ జానపద కళ వైభవం” ఎంత గొప్పదో చెప్పకనే చెప్పే ఒక సదవకాశం ఏర్పడుతుంది. ఈ పరిశ్రమ తెలంగాణలోని అన్ని జిల్లాలలో కచ్చితంగా జరగవలసిన అవసరం ఉంది. ఈ కార్యక్రమాన్ని భాషా సాంస్కృతిక శాఖ పక్షాన జరిగినట్లయితే కళలు కలకాలం వర్ధిల్లుతాయి.

**ఆధార గ్రంథ సూచి :**


1. కల్లేటి కొప్పులు - కోలాటం పాటలు
2. శ్రీకృష్ణ లీలలు యక్షగానం
3. శ్రీకృష్ణ కొప్పులు - జడ కొప్పు కోలాటం పాటలు


★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# ఒగ్గు కథ కళారూపం - బీరప్ప కథ ప్రదర్శన



- బి. పరమేష్

పరిశోధక విద్యార్థి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**పరిచయం :**

తెలంగాణ సంస్కృతిలో ఆశ్రిత కళారూపాలు విభిన్న మైన సంస్కృతిని కలిగి, రక రకాల సాంస్కృతిక వైవిధ్యానికి, గొప్పతనానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ కళలు సంస్కృతిలో భాగంగా సంప్రదాయబద్ధంగా, వంశ పారపర్యంగా తరతరాలుగా సంక్రమిస్తున్నాయి. ఒకప్పుడు కళలు గ్రామాలలోని జనులకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, విజ్ఞానాన్ని అందిస్తూ గౌరవమైన స్థానాన్ని నిలుపుకున్నాయి. కానీ నేటి ఆధునిక కాలంలో అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొని ఉంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ఇటువంటి భిన్నమైన పరిస్థితుల్లో కూడా ఆధునిక పోకడలను అధిగమించి జానపదకళాకారులు తమ జీవితానికి కారణభూతమైన దైవశక్తిని ప్రాచీనకాలంనుంచి ఆరాధిస్తూ వచ్చారు. ఆ ఆరాధనలో ఆత్మానుభూతిని పొందారు. ఈ దేవతారాధనలో పుట్టిన పాట, నృత్యం కాలక్రమేణ కొన్ని దేవతారాధనకోసమే స్థిరపడ్డాయి. మరికొన్ని వినోదం కోసమే మిగిలాయి. ఇంకాకొన్ని జీవనాధారాలు అయ్యాయి. అటువంటి కళారూపాల్లో ఒగ్గుకథ ఒకటి. ఒగ్గు అనే సహకార వాద్యాన్ని ఉపయోగించి చెప్పే కథను ఒగ్గుకథ అంటారు. ఇది శివుని చేతిలోని ఢమరుకాన్ని పోలి ఉంటుంది. ఒగ్గును లయబద్ధంగా మోగిస్తూ కాళ్లకు గజ్జెలు కట్టుకొని అభినయిస్తూ కథాగానం చేస్తారు. వీళ్లను బీరన్నలు, ఒగ్గోళ్లు అని పిలుస్తారు. వీళ్లు యాదవుల్లో ఒకశాఖగా భావించబడే కురుమలు లేదా కురుబలు. వీరు సంప్రదాయంలో అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే దైవం బీరప్ప. ఈయనను శివుని అంశగా, కుల దైవంగా భావిస్తారు. బీరప్ప కథ సాహసం, భక్తి మరియు సామాజిక పోరాటాల కలయిక మొదలైన అంశాలను ఈ వ్యాసం నందు చర్చించాను.

**కీలక పదాలు :**

బీరప్ప కథ, కథ ప్రదర్శన, గొర్రెల మంద, గంగ బోనము, కటార్లు.

**బీరప్పకథ :**

పూర్వకాలంనందు శివలీలాసంభూతుడైన వీరభద్రుడు దక్షయజ్ఞము ధ్వంసం చేసిన తర్వాత నాగుల కొండ పరిపాలకుడైన నరభూపతి గర్వము అణుచుటకై నరభూపతి చెల్లెలు సూరమాదేవి గర్భమునందు మగ పిల్లవాడుగా జన్మించాడు. సూరమాదేవి గర్భమునందు మగపిల్లవాడుగా జన్మించాడన్న సంగతి మేనమామ నరభూపతికి తెలిసి బీరప్పను ఎలాగైనా చంపాలని తలచి పదిమంది భటులను పిలిపించి వారికి బేస్త వేషాలు కట్టించి ఈ విధంగా చెపుతాడు ఒరేయ్ భటులారా! కుచ్చులు తాపిన పచ్చని పల్లకి తీసుకొని చంద్రగిన్నె

పట్టణంలో వున్న మాచెల్లె సూరమాదేవి దగ్గరికి వెళ్ళి అమ్మా! మేము నాగులకొండ పట్టణము నుండి వచ్చి నాము ఈ మీ అన్న నరభూపతి మమ్ముల పంపినాడు. నీ కొడుకు మంచి ఘడియలో జన్మించలేదు మూల నక్షత్రమున జన్మించాడు. కాశీరాజులకు, తల్లిదండ్రులకు గండము అని ఆ భటులు సూరమాదేవికి చెప్పగానే నిజమేయని నమ్మిన సురమాదేవి అయ్యా నేనేమి చెయ్యాలో చెప్పండని అడుగుతుంది. అప్పుడు ఆ భటులు అమ్మా సూరమ్మ! ఈ పిల్లవాడు పన్నెండు సంవత్సరాలు వరకు మేనమామ పట్టణములో పెరిగితే అపుడు మీ గండం తొలగిపోతుంది. ఆ తరువాత నీ కొడుకు మీ ఇంటికి రావచ్చు అని చెప్పగా సూరమాదేవి వెంటనే ఆ భటులకు కడుపు నిండా భోజనము పెట్టి నా కొడుకును జాగ్రత్తగా తీసుకపోయి మా అన్నకు అప్పజెప్పండి అని కొడుకును ఇచ్చి పంపిస్తుంది.ఆ భటులు పన్నెండు రోజుల పసిపిల్లవాడైన బీరప్పను పచ్చని పల్లకిలో తీసుకొనిపోయి మార్గ మధ్యమున మర్రిచెట్టు క్రిందికి తీసుకొని వస్తారు. అప్పుడు బేస్త వాళ్ళు ఆ పిల్లవాని చంపాలని చూడగా ఆ పిల్లవాడు శివలీలసంభూతుడై తండ్రి శంకరుడు చెప్పిన తారక మంత్రం తనువెల్ల చదవి తన హస్తం తీసుకొని నెత్తిన పెట్టుకుంటే ఇరువైనాలుగేండ్ల వీర పుత్రుడు విశ్వరూపమును ధరించి ముప్పై రెండు తల్వార్లు చేతబట్టి పదిమంది తలలను నరుకుతాడు. తర్వాత బీరప్ప మళ్ళి తారకమంత్రం చేత పన్నెండు రోజుల పసి బాలుడుగా మారి మర్రి చెట్టు దగ్గర ఉంటాడు.

ఉజ్జయిని మహంకాళి ఆ పిల్లవాని యొక్క రోదలు గాలిలో గమనించి మల్లికార్జునుడు యిచ్చిన ఏడు గొర్రెలను తీసుకొని ఆ మర్రిచెట్టు క్రిందకు వస్తుంది. ఆ మర్రి వృక్షము మీద వున్న బీరప్ప మహంకాళి పవిట కొంగులో పడగా ఆ పిల్లవాడిని తీసుకొని వీరభద్ర అవతారమని తెలుసుకొని ఆ బీరప్పను అయిదు సంవత్స రాల బాలుడు అయిన వెంటనే గురువుల వద్ద విద్యను నేర్పిస్తుంది. అన్ని విద్యలు నేర్చుకొని పన్నెండు ఏండ్ల బాలుడు అవుతాడు. ఒకరోజు బీరప్పను తీసుకొని గొర్రెల మందను సంబాలించుచున్న భోగన్న దగ్గరకు తీసుకవచ్చి తమ్ముడైన బీరప్పను జాగ్రత్తగా చూసుకోమని చెప్పి గొర్రెలకు ఉండబడిన పద్ధతులను చెప్పి ఆ సౌలక్ష గొర్రెల మంద కాపలబెట్టి ఉజ్జయినికి పోతుంది.

ఒకరోజు బీరప్ప శివనాగగుండంలో స్నానంచేసి విభూతి ధరించి, జమ్మి చెట్టు క్రింద కూర్చొని శివపూజ చేస్తూ గొర్రెల మంద దగ్గర పాలు పెరుగు దానం చేస్తూండగా త్రిమూర్తులు మూడు రకాల వేషాలతో వచ్చి బీరప్పకు పెండ్లికానివారు దానం చేయరాదని హెచ్చరించి వెళ్తారు. బీరప్ప గొర్రెల మందను అడవిలో వదిలిపెట్టి అక్క దగ్గరికి వస్తాడు. అక్క అడవిలో మందను వదలి ఎందుకొచ్చినావని అడుగుతుంది. అక్క పెండ్లికానివాడు దానం చేయకుడదట. ముగ్గురు పెద్దలు చెప్పగానే నీవద్దకు వచ్చినాను. తమ్ముడా! అట్లయితే యాభైఆరు రాజ్యాల రాజుల బిడ్డలను తీసుక వచ్చి అందులో నీకు ఏ పిల్ల నచ్చితే ఆ పిల్లను పెళ్లి చేస్తానని చెప్పగా అక్కా మన పిల్లలుండగా మంది పిల్లలు ఎందుకు? అని బీరప్ప అనగా మహంకాళి తమ్ముడా మన పిల్లలు ఎవరురా? అని అడగా బీరప్ప అక్కా నాగులకొండ పట్టణ పరి పాలకుడైన మన మేనమామ నరభూపతికి ఏడుగురు బిడ్డలున్నారు కదా! అందులో నచ్చిన పిల్లను నాకు పెళ్లి చేయవచ్చు కదా! అని చెప్పుతాడు. అక్క మేనమామ దుర్మార్గుడు కఠినుడు అతని కూతురిని తప్ప మిగిలిన వారినెవరినైన చేసుకొమ్మని మాహంకాళి అంటుంది. అక్కా ఎంతటి పాపాత్ముడైనా మన తల్లికి తమ్ముడు నాకు మేనమామ కదా! అందుకు వారి బిడ్డలనే పెండ్లి చేసు కొంటాను అంటాడు. మహంకాళి బీరప్పకు ఎన్ని బోధనలు చెబుతున్నా వినడు. బలవంతముతో పంచ కళ్యాణి గుర్రం పైన నాగులకొండ పట్టణం బయలు దేరుతాడు.

గుర్రంపై పోవుచుండగా గంగాదేవి అడ్డువస్తుంది. ఆ గంగను దాటలేక బీరప్ప వీరభద్ర రూపం ధరించి అలక కటార్లుతో డొక్కమీద పొడుచుకొని తన రక్తం గంగకు బలి ఇస్తాడు. వెంటనే గంగాదేవి బీరప్ప భక్తికి మెచ్చి నాయానా! నీవు ఎవరు అని గంగ అడగగా అమ్మా

నేను సూరమాదేవి కుమారున్ని మా అక్క ఉజ్జయిని మహంకాళి. నేను మేనమామ నరభూపతి బిడ్డను పెండ్లి చేసుకొనుటకు పోవుచుండగా నీవు అడ్డగించితివి అని బీరప్ప చెపుతాడు. అందుకు గంగ నాయనా బీరప్ప మీ మేనమామ మంచివాడు కాడు. నీపైన అనేక విధము లుగా పగదలచాడు. అందుకు నీకు నాగులకొండ రహస్యం తెలియదు. కాబట్టి రేణుక ఎల్లమ్మ గంగ స్నానానికి వస్తుంది. ఆమెకు నాగులకొండ రహస్యం బాగా తెలుసు మీ మామ బిడ్డల సంగతి బాగా తెలుసు. నీవు పోయి ఆ రేణుకాదేవి శరణు పొందు అని చెప్పగా బీరప్ప గంగమ్మకు నమస్కారం చేసి రేణుకఎల్లమ్మదేవి కోసం చూస్తుండగా మంగళవారం రోజు రేణుకాదేవి జమదగ్ని పూజలు చేయడానికి గంగస్నానానికి వస్తుంది. అప్పుడు బీరప్ప రేణుకాదేవి రెండు పాదముల పట్టి శరణువేడగా రేణుకాదేవి నీవు ఎవరు అని అడగ్గా నేను సూరమాదేవి కుమారున్ని మహంకాళి తమ్ముని నా పేరు బీరప్ప అని చెప్పగా రేణుకాదేవి బీరప్ప ఎక్కడ పోవుతున్నావు అని అడుగుతుంది. బీరప్ప మా అక్క మహంకాళితో సెలవు తీసుకొని నాగులకొండ పట్టణం మా మేనమామ నరభూపతి బిడ్డను లగ్నమాడుటకు పోతున్నాను అని చెప్పగా, రేణుకాదేవి నాగులకొండ పట్టణమున వున్న మీ మామ బిడ్డలకు ఎరుకసాని చెప్పి మీ తాత శివదాంటక మహారాజు తోడించిన కలికి చెంగోళ్ళబావికి స్నానానికి తీసుకవస్తాను. వాళ్ళు బావిలో స్నానము చేస్తుండగా స్త్రీలకు వున్న ముప్పదిరెండు చెడులక్షణములు జాగ్రత్తగా చూసి ఆ ఏడుగురు నరభూపతి బిడ్డలలో నీకు నచ్చిన పిల్లను తెచ్చుకొని పెళ్లి చేసుకొ అని చెప్పి రేణుకాదేవి బీరప్పను గంగ ఒడ్డున వుంచి ఎరుకలసాని వేషం ధరించుకొని నెత్తిన ఎరుకల బుట్ట పెట్టుకొని ఆ బుట్టలో ఏడు గవ్వల ఎల్లమ్మ గద్దె పెట్టుకొని నాగులకొండ పట్టణము వెళ్ళి ఎరుకల పాటలు పాడుతూ ఎరుకల సోది చెప్పుకుంటు నరభూపతి ఏడుగురు బిడ్డలు వున్న మేడకు వెళ్ళి ఆ నరభూపతి ఏడుగురు బిడ్డలకు చెప్పి వారి తండ్రి నరభూపతి వద్దకు వెళ్ళి ఎరుకలసాని చెప్పిన విధాన మంతా చెప్పి స్నానానికి పోవుటకు తండ్రితో సెలవు తీసుకొని తల్లి కమలాంబదేవి వచ్చి లక్కచిత్తారి పెట్టెలో బంగారు సందుకలు తీసుకొని కలికి చెంగోళ్ళబావికి ఆటలు ఆడుకుంటూ పాటలు పాడుకుంటూ కానుం బాక తోటలో పూవ్వులు కోసుకొని బావి దగ్గరకి వస్తారు. బావిలో స్నానమాడుచుండగా రేణుకాదేవి బీరప్ప దగ్గరకి వచ్చి మీ మరదళ్ళు బావిలో స్నానము చేస్తున్నారు పోయి ముప్పైరెండు లక్షణములు జాగ్రత్తగా చూసి నీకు నచ్చిన పిల్లను తెచ్చుకొని మీ అక్క మహంకాళి వద్దకు తీసుకపోయి పెళ్ళి చేసుకొమ్మని చెప్పగా బీరప్ప వెంటనే బయలుదేరి కలికి చెంగోళ్ళ బావి వద్దకు వచ్చి స్నానములాడే మరదళ్ళు చూసి బీరప్ప చేప, కప్ప, గద్ద, పాము అవతారాలు ధరించి ముప్పైరెండు చెడు లక్షణాలు చూసి అందులో కామరతి అనే ఆమెను పట్టుకొనెను. కామరతి ఎవరు నీవు అని అడుగుతుంది. బీరప్ప నేను మీ బావ బీరయ్యను. కామరతి ఓహో మా నాన్నచెప్పినవాడు నీవేనా! బావా బీరయ్య ఇక్కడికి ఎందుకు వచ్చినావని అడగ్గా బీరప్ప మరదలా కామరతి నిన్ను తీసుకపోయి పెండ్లి చేసుకుందామని వచ్చాను అన్నాడు. బావా బీరప్ప నేను పాపపుణ్యములేని పరంజ్యోతిని ముట్టులేని అరంజ్యోతిని పెళ్ళికాకుండ నన్ను ముట్టరాదు. నీవు యీ బావి దగ్గర ఉండు. నేను ఇప్పుడే నాగులకొండ పట్టణం పోయి నా సొమ్ముల సందుకలు, నా బట్టల, ఏడు వారములు ధనం తీసుకొని వస్తాను. నేను నీవు కలిసి మీ ఇంటికి పోయి పెళ్ళి జేసుకొని హాయిగా కాలం గడుపుదాం అని కామరతి తప్పించుకొని నాగులకొండ పట్నం పారిపోయి తండ్రి నరభూపతికి బీరప్ప పట్టుకొని బాధించిన సంగతంతా చెప్పింది. అప్పుడు నరభూపతి మాయలకోరు బీరప్ప వచ్చి నా బిడ్డను తీసుకుని పోతాడు. నేను ఏమి చేయాలి అని బీరప్పకు దొరకకుండా మంగలి కత్తుల మహల్‌లను కట్టించి మేడపైన ఉంచుతాడు.

బీరప్ప కామరతి వస్తా అని ఇంకా రాలేదు ఎందుకు అని కంటికి కాటుక పెట్టి కామరతి మీద అంజనంవేస్తాడు. కామరతి వున్న మంగలి మేడ ఆ అరచేతిలో కనబడు తుంది. బీరప్ప గారడీ వేషంతో అంతఃపురంలోకి ప్రవేశించి కామరతిని గుర్రంపైన కూర్చోబెట్టుకొని వస్తుంటాడు. ఈ

సంగతి నరభూపతిరాజుకు తెలిసి తనసైన్యంతో నివారిస్తాడు. బీరప్ప నారాయణ స్వరూపాన్ని ప్రదర్శించి సైన్యాన్ని హతం చేసి, కామరతి వేడుకోగా వారిని పునర్జీవితులను చేస్తాడు. అక్క దగ్గరకు వచ్చి బీరప్ప కామరతితో పెండ్లి జరిపించమంటాడు. ఆమెతో పెండ్లి జరిపిస్తుండగా నరభూపతి బీరప్ప గొర్రెల అపహరించి తీసుకొనిపోతుంటాడు. బీరప్ప పెండ్లి పీటలపై నుండి లేచి పోయి మేనమామను ఓడించి తన గొర్రెల మందను తెచ్చుకొని కామరతిని పెండ్లి చేసుకొంటాడు. పెళ్ళి తర్వాత మాహంకాళి మరదలుకు తమ కులవృత్తి పనులనన్నింటిని నేర్పించడంతో కథ ముగుస్తుంది. ఈ విధంగా పురాణాల ప్రకారం శివుడు భూలోకంలో కురుమలను రక్షించడానికి బీరప్పగా జన్మించాడని చెబుతారు. ఆయన బాల్యం నుండే అద్భుత శక్తులు కలిగి ఉండేవారు. గొర్రెల కాపరుల కష్టాలను తీరుస్తూ, అడవి మృగాల నుండి మందలను కాపాడుతూ అందరి మన్ననలు పొదుతున్నారు.

**కథా ప్రదర్శన :**

ఒగ్గుకథా ప్రదర్శన సంప్రదాయంలో బీరప్పకథ, మల్లన్న కథ చాలా ప్రధానమైనవి. వీరు ఏ ఇతర కథలు చెప్పినా ఈ రెండు కథలు చెప్పని ఒగ్గుకథా బృందం ఉండదు. బీరప్పకథను చెప్పే బృందంలో ప్రధాన కథకునితో సహా నలుగురు ఉంటారు. ప్రధానకథకుడు స్త్రీ వేషాన్ని ధరించి పాత్రానుగుణంగా అభినయిస్తూ కథచేప్పేవాడు, అతని చేతులకు కడియాలు, కాలివేలికి మట్టెలు, నడుముకు కత్తిని, చేతిలో కట్లకర్రను, భుజంపై వీరతాడును ధరిస్తాడు. ప్రధానకథకునికి కథాకథనంలో వంత సహాయం చేస్తుంటాడు. వీరి ఇద్దరి వెనుక ఒకరు డోలును మరొకరు తాళాలను కొడుతుంటారు. బీరప్ప పండుగ సంవత్సరంలో ఒకసారి చేస్తారు. బీరప్ప కథ లోని ఆచార సంప్రదాయాలను ప్రదర్శిస్తూ చెప్పడమే కాకుండా బీరప్ప కామరతుల వివాహాన్ని వర్ణిస్తూ "లగ్గపు పోలు లేదా ముత్యాల పటం" వేస్తారు. కథతో పాటు బీరప్ప వివాహాన్ని జరిపిస్తారు. ప్రేక్షకులు కట్నాలను చదివిస్తారు. కథలో మాహంకాళి కామరతికి మజ్జిగ చేయడం వెన్నతీయడం నేర్పిస్తుంది అని చెప్పడమే కాకుండా చేసే విధానాన్ని కూడ చూపెడుతారు. కథా ప్రదర్శనంలో కథాకథనం కర్మకాండలతో సమన్వయం చెందడం వల్ల ప్రేక్షకులు తమ కులదేవతలు వివాహోత్సవంలో ప్రత్యక్షంగా పాల్గొన్న అనుభూతిని పొందుతారు. బీరప్ప కథ ప్రదర్శన అనేది శక్తి, భక్తి మరియు కళల అరుదైన సంగమం. ఇది కురుమ జాతి అస్తిత్వాన్ని, వారి ధైర్య సాహసాలను తరతరాలకు అందిస్తున్న సజీవ వారసత్వం.

**బీరప్ప పండుగ విధానం :**

బీరప్ప పండుగలు బీర్లవారు, గొల్ల కురుమ వారు ప్రధాన పాత్ర వహిస్తారు. కురుమలు వీలును బట్టి ఐదు సంవత్సరాలకు ఒకసారి బీరన్నలను పిలిచి ఐదు రోజులు లేదా కొన్ని ప్రాంతంలో ఏడు రోజులు కూడా జరిపిస్తారు. కుల పెద్దలు అందరూ కలిసి మాట్లాడుకుని ముహూర్తం నిర్ణయించుకుంటారు.

మొదటగా ఈ పండుగ గురువారం రోజు పోచమ్మ బోనాలతో ప్రారంభమవుతుంది. ఈ బోనాలలో ఈర బోనం, గంగ బోనం, వాద్యాలుతో ఊరేగింపుగా పోచమ్మకు బోనాలను సమర్పిస్తారు. తర్వాతి రోజున ఉదయమున బీరప్ప గుడి దగ్గర గద్దె బోనం చేసి గొర్రెలు బలిస్తారు.

గుడిలోని లింగాలను గొంగిడిలో కట్టి ఊరేగింపుగా గంగ దగ్గరకి వెళ్తారు. ఇలా ఊరేగింపు సందర్భంలో బీరన్నలు కటార్లు వేసుకుంటూ వస్తారు. ఈ కటార్లు వేయడానికి గల కారణము బీరప్ప కథలో కనిపిస్తుంది. బీరప్ప కామరతి జాడ కోసం వెళ్ళినప్పుడు దారిలో గంగా దేవి ఉప్పొంగుతుంది. అప్పుడు బీరప్పకటారు పైకి ఎగురవేసి ముంచేవు గంగా! నీ చెవులు కోస్తా, ముక్కు కోస్తా అంటూ కటారుతో పొట్ట మీద కాట్లు వేసుకొని తన రక్తాన్ని దోసిలి పట్టి గంగ మీద భలో, భలో అని చల్లితే గంగ శాంతిస్తుంది. ఈ విధంగా కళాకారులు కథకు అనుగుణంగా నడుచుకుంటూ తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు. ఈ సందర్భంలో కళాకారులు నడుముకు నాగబంధం, గజ్జెల లాగు, గంటలు కట్టుకొని బండారి

ఒళ్లంతా పూసుకొని కటార్లు పైకెత్తి పొట్ట మీద చేతుల మీద అలుగులు వేసుకుంటూ ఊరేగింపుగా గంగ దగ్గరకి వెళ్తారు. బోనములోని మూడు ముద్దలను మూడు మారులు గంగ లో వేస్తారు. లింగాలు ఊన్న గొంగడిని పెద్ద కురుమ ఎత్తుకొనగా అతనికి పూనకము వస్తుంది. అతన్ని ఇరువైపుల పట్టుకొని గుడికి వస్తారు. లింగాలను గుడిలో పెట్టి హారతి ఇచ్చి గంగ నుండి తెచ్చిన లింగాలను నూనె, పసుపులతో అలంకరించి మైలపోలును తీసి, దానిపై బీరప్ప విగ్రహాన్ని పెట్టి, పోలుచుట్టు ఐదు మారులు గొర్రెపిల్లను త్రిప్పి బీర్లవారికి ఇస్తారు. ఈ గొర్రెపిల్లను మైలపిల్ల అని అంటారు. బీరప్ప కథ పూర్తైన పిదప లగ్గపు పోలు లేదా ముత్యాల పటమును వేస్తారు. తరువాత బీరప్ప, కామరతులకు లగ్నము చేస్తారు. తర్వాత బీరప్పను గుడిలో పెట్టిన బోనమునుండి మూడు మారులు అన్నము తీసి నైవేద్యమును పెడుతారు. బీరప్పకు ''పాచి బోనము'' పెట్టడము ఆచారము నైవేద్యవు అన్నమును క్రొత్తచాటలో వేసి గొర్రెను కోసి ఆ రక్తమును అన్నములో కలుపుతారు. గొల్లవారు తమ గొర్రెల మందను గుడి దగ్గర పెట్టి మందపైన రక్త పన్నమును, కల్లును చల్లుతారు.

బీరప్ప పెండ్లి అయిన తర్వాత బీరప్ప సోదరి మహంకాళి విగ్రహాలకు పెద్ద కురుమ ఇంటిలో నుండి కొత్త చీర రవిక పెట్టి ఒడిబియ్యం పోస్తారు. నాగవల్లి పోలులో మహంకాళి తమ్మునికి మరదలికి నాగవల్లి చేస్తుంది. ప్రతి ఇంటి నుండి శక్తి కొలది కామరతికి మహంకాళి విగ్రహాలకు ఒడి బియ్యం పోస్తారు. దేవత లకు ఒడి బియ్యం పోయడం వలన పాడిపంటలు అభివృద్ధి అవుతాయని గొల్లవారి విశ్వాసము. ఈ ఒడి బియ్యం కార్యక్రమంతో బీరప్ప పండగ ముగుస్తుంది.

**జానపద గాయకులుగా బీరన్నలు :**

తెలంగాణ సంస్కృతిలో ఆశ్రిత కళాకారులు విభిన్న మైన సంస్కృతి కలిగి రకరకాల సాంస్కృతిక వైవిద్యానికి ఆదర్శంగా నిలుస్తున్నారు అటువంటి వారిలో బీరన్నలు ఒకరు. వీరు కురుమవారికి ఆరాధ్య దైవమైన బీరప్పను కొలుస్తారు. బీరప్ప కథ చెప్పడం ద్వారా వీరికి బీరన్నలు అనే పేరు వచ్చింది. కథలు చెప్పేటప్పుడు గాని బిచ్చ మెత్తునప్పుడు గానీ వీరు ఒగ్గు అనే కళారూపాన్ని వాయిస్తారు కనుక వీరికి ఒగ్గు వారిని అని పేరు వచ్చింది. ఈ ఒగ్గుతో పాటు గొల్ల సుద్దులు ఉపయోగించే పెద్ద డోలు మరియు తప్పెటలు కూడా వాడుతారు. బీరన్నలు కురుమవారికి పౌరోహిత్యము నిర్వహించడం, పెండ్లిళ్ళు చెయ్యడం, కంబళ్ళు నేయుడం వారి వృత్తి. కొమిరెల్లి మల్లన్న కథ, రేణుక ఎల్లమ్మ కథ గానము చేస్తారు. తెలంగాణలో బీరన్నలు, కురుమ వారు అధికముగా ఊన్నారు. కొమిరెల్లి మల్లన్న కథలో అతడు కాపుబిడ్డ అని తెలుసుకున్నాము. మల్లన్న రెండవ భార్య రత్నాంగి బ్రాహ్మణ సంతతికి చెందినది. బహుశా ఈజాతివారు కాపులకు బ్రాహ్మణజాతులకు పుట్టినవారని భావింప వచ్చును.

**ముగింపు :**

తెలంగాణ సంస్కృతికి మకుటంగా నిలిచే జానపద కళారూపాల సాహిత్యం ఎంతో ప్రాచీనమైనదిగా తెలుస్తు న్నది. అంతేగాక విభిన్నమైన ప్రక్రియలతో, భిన్నమైన కథావస్తువుతో పోషక కులాలను ఆశ్రయిస్తూ మనుగడ సాగిస్తున్న కళారూపాలు తెలంగాణాలోనే ఎక్కువగా ఉండటం తెలంగాణా సంస్కృతీ ప్రాచీనత యొక్క గొప్పతనము. వీటి సాహిత్యంలో ఒక సమాజం లేదా ఒక కులం మనుగడకు కావల్సిన, ఆత్మస్థైర్యాన్ని, ఆత్మనూన్యతా భావాన్ని తొలగించేందుకు కావల్సిన పలు అంశాలు ఉన్నవి. అంతేగాక కులాల ఐక్యతకు దోహదం చేసేదిగా ఉంది. అలాగే వృత్తులకు కులాలకు గౌరవాన్ని కలిగించే విధంగా వీరి సాహిత్యం నిర్మింపబడింది. ఇటువంటి సాహిత్య విలువలు కలిగిన వీరి సాహిత్యాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ఎంతైనా ఉన్నది. భవిష్యత్తు తరాలకు వీరి గొప్పదనాన్ని తెలియజేస్తూ వీరి సాహిత్యాన్ని భద్రపరుస్తూ అందిచాల్సిన అవసరం ఉన్నది. ఇప్పటికే కొన్ని కళారూపాలు కనుమరుగయ్యాయి. కొన్ని కను మరుగయ్యే స్థితిలో ఉన్నవి. కావునా పరిశోధనాత్మకంగా కళారూపాలను శోధించి, పరిరక్షించి, తెలంగాణ సంస్కృతీ శోభను నిలపాల్సి ఉంది.

**పాదసూచికలు :**

1. ఆర్. వాసుదేవసింగ్, ఒగ్గుకథ - అభినయసమన్వయం, సాయి పబ్లికేషన్స్, హైదరాబాద్, 2008, పుట సంఖ్య 130.
2. కడప రమణయ్య, (ప్ర సం పా) దక్షిణ భారతీయ జనపద విజ్ఞాన కోశం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం, 2011, పుట సంఖ్య 767.
3. బాసని సురేష్ (మామిడి హరికృష్ణ సం పా), తెలంగాణ జానపద కళా సౌరభాలు, భాష సంస్కృతిక శాఖ, హైదరాబాద్, 2020, పుట సంఖ్య 156.
4. బిరుదు రాజు రామరాజు, తెలుగు జానపద గేయ సాహిత్యము, తెలుగు అకాడమీ, హైదరాబాద్, 2015, పుట సంఖ్య 653.

**ఉపయుక్త గ్రంథ సూచీ :**


1. వాసుదేవసింగ్, ఆర్. 2008. ఒగ్గుకథ -- అభినయసమన్వయం, హైదరాబాద్, సాయి పబ్లికేషన్స్.
2. రమణయ్య,కడప. (ప్ర సం పా) 2011. దక్షిణ భారతీయ జనపద విజ్ఞాన కోశం, కుప్పం, ద్రావిడ విశ్వవిద్యాలయం.
3. సురేష్, బాసని, (మామిడి హరికృష్ణ సం పా).2020. తెలంగాణ జానపద కళా సౌరభాలు, హైదరాబాద్, భాష సంస్కృతిక శాఖ.
4. ప్రేమలత, రావి. 2011. తెలుగు జానపద సాహిత్యం పురాగాథలు, హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం & శ్రీనిధి ప్రింటర్స్.
5. రామరాజు, బిరుదు రాజు. 2015. తెలుగు జానపద గేయ సాహిత్యము, హైదరాబాద్, తెలుగు అకాడమీ.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# చెంచు జానపద సంస్కృతి - ప్రకృతి ఆధారిత జీవనతత్వం మరియు వృత్తి కళారూపాల సమగ్ర అధ్యయనం



- శాంతి ధనావత్

పరిశోధక విద్యార్థి, జానపద గిరిజన విజ్ఞాన పీఠం, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్.

**ఉపోద్ఘాతం**

చెంచు జానపద సంస్కృతి అనేది ప్రాచీన, సహజ, జీవనోపాధి ఆధారిత తత్త్వాల సమాహారం. ఇది నల్లమల అడవుల లోతుల నుండి తెలుగు భూభాగంలో పూర్తిగా ప్రతిఫలిస్తుంది, ఇక్కడ ప్రకృతి, జీవవైవిధ్యం, సామాజిక ఆచారాలు పరస్పర సంబంధంలో సజీవంగా ఉంటాయి. చెంచు జీవన విధానం కేవలం సంప్రదాయాలను మాత్రమే కాదు, జీవనోపాధి, ఆచారాల, నృత్యాల, గీతాల ద్వారా వ్యక్తమయ్యే సాంస్కృతిక జ్ఞానాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. ఈ సంస్కృతి పరిశీలనలో, వ్యక్తి మరియు సమాజం మధ్య సహజ సంబంధం, ప్రకృతికి ఇచ్చే ప్రాధాన్యత, ఆధ్యాత్మిక ఆచారాల సమన్వయం స్పష్టమవుతుంది. చెంచుల కళాకారులు, వృత్తివేదనలతో కూడిన జీవనశైలి, వారి సంప్రదాయాలు భవిష్యత్తుకు మార్గదర్శకంగా ఉంటాయి. అందుచేత, ఈ జానపద సంస్కృతిని అర్థంచేసుకోవడం అనేది సమగ్ర పరిశీలన, లోతైన విశ్లేషణ మరియు తత్త్వవివేకానికి దారితీస్తుంది.

**కీలక పదాలు**

జంతుజాలం, వృక్షజాలం, అడవిసంపద, వనజీవనం, ఆచారాలు, పురాణ కథలు, తలపాక నృత్యం, గోపిక నృత్యం, పత్తి శిల్పకళ, చెరుకుగడ్డి, కొండ వ్యవసాయం, మత్స్య కృషి, వనగీతాలు, వృత్తి గీతాలు, పల్లకి గీతాలు, వనపండుగ, తరువు, ఉత్సవం.

**చెంచు సమాజ పరిచయం - చరిత్రాత్మక, భౌగోళిక మరియు సాంస్కృతిక నేపథ్యం**

చెంచు సమాజం అనేది తెలుగు జానపద సంప్రదాయాల్లో అత్యంత ప్రాచీన, స్థిరమైన, జీవనోపాధి ఆధారిత సమూహం. ఈ సమాజం ప్రధానంగా నల్లమల అడవులు, పాముల, కొండలమధ్య ప్రాంతాలలో నివసిస్తుంది. చరిత్రాత్మకంగా పరిశీలిస్తే, చెంచులు వృత్తి ఆధారిత, వనజీవన, ప్రకృతి అనుబంధ సమాజం; వారి జీవన విధానం అడవి సంపదలను, జంతుజాలాన్ని, నదీ నీటిని సజీవంగా అనుసరించి ఉంటాయి. భౌగోళిక దృష్ట్యా, ఈ ప్రాంతాలు ఎడారి, కొండలు, నదీ పరిమాణాల ఆధారంగా విభజింపబడి, ప్రకృతికి అనుగుణమైన వృత్తులతో కూడిన జీవనవిధానాన్ని సూచిస్తాయి. సాంస్కృతికంగా, చెంచులు తమ ఆచారాల, గీతల, నృత్యాల, పురాణ కథల ద్వారా సంప్రదాయాలను తరతరాలుగా నిలుపుతూ, సామూహిక సమ్మేళనంలో జీవన

విధానాన్ని సమన్వయింపజేస్తారు. వారి కళారూపాలు, వృత్తిపరమైన నైపుణ్యాలు, ఆచారాలు సామాజికక్రమం, ఆత్మపరిరక్షణ, సహజజీవనోపాధి ప్రతిబింబాలుగా ఉన్నాయి. ఈ సమాజం ప్రకృతి, సమాజం, ఆధ్యాత్మికత మధ్య లోతైన సమతుల్యతను, స్థిరత్వాన్ని, జ్ఞానాన్ని ప్రతిబింబిస్తుంది. అందువల్ల, చెంచు సమాజం అధ్యయనం అనేది భౌగోళిక, చరిత్రాత్మక, సాంస్కృతిక విశ్లేషణలో సమగ్రతను, లోతైన తాత్విక అవగాహనను అందించే ప్రామాణిక దృష్టి కోణంగా నిలుస్తుంది.

## ప్రకృతి ఆధారిత చెంచు జీవనతత్త్వం - అడవి, జీవ వైవిధ్యం మరియు సంప్రదాయ జ్ఞానం

చెంచు సమాజం జీవన విధానం పూర్తిగా ప్రకృతిపై ఆధారపడి ఉంది. నల్లమల అడవుల లోతుల్లో, కొండల, నదీతీర ప్రాంతాల్లో విస్తరించి ఉండే ఈసమాజం, ప్రకృతి వనరులను సజీవంగా పరిగణనలోకి తీసుకుంటూ, జీవనోపాధి, ఆహారం, నివాసం మరియు వృత్తి అవసరాలను సమన్వయంగా నిర్వర్తిస్తుంది. అడవి వనరులు, వృక్షజాలం, జంతుజాలం, నదీ నీటి సంపత్తి మరియు మైదాన వనరులను ఉపయోగించే విధానంలో సంప్రదాయ జ్ఞానం అత్యంత ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. చెంచులుపండ్లు, మూలికలు, మత్స్యకళలు మరియు వన్యజీవులను సమాజ అవసరాలకు అనుగుణంగా సేకరించడం, సంరక్షించడం మరియు వాడటం ద్వారా జీవవైవిధ్యాన్ని, సుస్థిరతను పాటిస్తారు. వారి ఆచారాలు, గీతాలు, నృత్యాలు, మరియు పురాణ కథలు ఈ తత్త్వాలను ప్రతిబింబిస్తూ, తరతరాలకి పరిష్కారాత్మక జీవనోపాధి జ్ఞానాన్ని అందిస్తాయి. ప్రకృతికి ఇచ్చే గౌరవం, సహజ సమతుల్యత మరియు సాంఘిక సమన్వయం చెంచు జీవనతత్త్వంలోని ప్రాథమిక గుణాలు. అందువలన, ప్రకృతి ఆధారిత చెంచు జీవనతత్త్వం అనేది ఆధునిక సమాజానికి కూడా జీవ వైవిధ్య పరిరక్షణ, సుస్థిరత, మరియు లోతైన తాత్విక అవగాహనకు మార్గదర్శకంగా నిలుస్తుంది.

## చెంచుల సంప్రదాయ వృత్తులు - జీవనోపాధి మరియు కళల పరస్పర సంబంధం

చెంచు సమాజం తమ జీవనోపాధిని సంప్రదాయ వృత్తుల ద్వారా పూర్తి చేస్తుంది, ఇవి కేవలం జీవనోపాధి సాధనంగా మాత్రమే కాక, కళారూపాల లోతైన ప్రతిఫలాలుగా కూడా నిలుస్తాయి. ప్రధాన సంప్రదాయ వృత్తులలో వనం వేట, పత్తి శిల్పకళ, చెరుకు గడ్డి సేకరణ, మత్స్యకృషి, మరియు కొండల వ్యవసాయం ముఖ్యమైనవి. వీటిలో ప్రతీ వృత్తి వారి జీవన విధానం, ప్రకృతి అనుసరణ, మరియు ఆచార సంప్రదాయాలతో సమగ్రంగా అనుసంధానమై ఉంటాయి.

చెంచుల వృత్తులలో ప్రతీ విధానం కళారూపాలతో నికరంగా పూయబడి ఉంటుంది. ఉదాహరణకు, వన వేట సమయంలో వినిపించే “వనగీతాలు”, పత్తి శిల్పకళలో నాటక గీతాలు, కొండల వ్యవసాయంలో పాడే రైతు గీతాలు వృత్తి మరియు కళలను సమన్వయపరుస్తాయి. మత్స్యకళలో నృత్యాల కలయిక, వన వేట గీతాల గానకళ, మరియు సమూహ గీతాల ద్వారా సమాజానికి ఆత్మగౌరవం, సామూహిక బంధం, మరియు సాంస్కృతిక వారసత్వం నిల్వ చేయబడుతుంది. అందువల్ల, చెంచుల సంప్రదాయ వృత్తులు జీవనోపాధి, కళల, మరియు సాంస్కృతిక విలువల పరస్పర సంబంధానికి మూలాధారం అవుతాయి.

## చెంచు జానపద కళారూపాలు - గీతాలు, నృత్యాలు, ఆచార సంప్రదాయాల విశ్లేషణ

చెంచు సమాజం తమ జీవన విధానం, వృత్తి, ప్రకృతి అనుబంధాన్ని జానపద కళారూపాల ద్వారా ప్రతిబింబిస్తుంది. గీతాలు, నృత్యాలు, మరియు ఆచార సంప్రదాయాలు ప్రతి క్రమంలో సాంస్కృతిక, సామాజిక, ఆధ్యాత్మిక విలువలను ప్రసారం చేస్తాయి. చెంచుల ప్రసిద్ధ గీతాలలో పల్లకీ గీతాలు, వన గీతాలు, వృత్తి గీతాలు ముఖ్యమైనవి; ఇవి వృత్తిపరమైన అనుభవాలను, ప్రకృతి పరిరక్షణా జ్ఞానాన్ని, మరియు వారసత్వ ఆచారాలను ప్రతిబింబిస్తాయి.

నృత్యాలలో తలపాక నృత్యం, గోపిక నృత్యం, వన నృత్యం ప్రసిద్ధి పొందినవిగా ఉంటాయి, ఇవి ప్రకృతి, వన్యజీవ, మరియు సమాజ సమ్మేళనాన్ని సూచిస్తాయి. ఆచార సంప్రదాయాలలో పూర్వీక సంబరాలు, మార్మిక

వ్రతాలు, వార్షిక ఉత్సవాలు చెంచుల ఆధ్యాత్మిక విధానాలను, ఆచార సంప్రదాయాలను, సామాజిక పరస్పర సంబంధాలను ప్రతిబింబిస్తాయి. ఈ గీతాలు, నృత్యాలు, మరియు ఆచారాలు పరస్పర సంబంధం ద్వారా చెంచుల జీవనోపాధి, కళాకార స్వరూపం మరియు సాంస్కృతిక విలువలను తరతరాల వారసత్వంగా నిలుపుతాయి, అవి పరిశోధన, అధ్యయనం మరియు లోతైన తత్త్వవివేకానికి అత్యంత ప్రామాణిక మూలంగా ఉంటాయి.

**చెంచు కళాకారుల జీవన విధానం**

చెంచు సమాజంలో కళాకారుల జీవన విధానం సాంఘిక, ఆర్థిక, మరియు సాంస్కృతిక పరిమాణాలతో పూర్తిగా సమన్వయమై ఉంటుంది. వీరి జీవనోపాధి ప్రధానంగా వృత్తిపరమైన కళలతో నేరుగా సంబంధించింది. ముఖ్య కళాకారుల వృత్తులు మరియు పరిచయాలు: గీత రచయితలు - వనగీత కారులు, నృత్యకారులు - తలపాక నృత్యకారులు, శిల్పకారులు - చెంచు శిల్పకారులు, వన్యకళా సంప్రదాయ శిల్పకారులు - వనశిల్ప కారులు.

సాంఘికంగా, వీరి కళా కార్యకలాపాలు సమాజంలో ప్రతిభ గుర్తింపు, ఆత్మగౌరవం మరియు వన్య వనరుల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయి. ఆర్థికంగా, వృత్తి మరియు కళా ఉత్పత్తులు సామూహిక జీవనోపాధికి, సమూహ ఆదాయానికి, మరియు అవసరాల సాధనకు మార్గం అందిస్తాయి. సాంస్కృతికంగా, వీరి గీతలు, నృత్యాలు, శిల్పాలు మరియు ఆచారాలు సాంస్కృతిక వారసత్వాన్ని, ఆధ్యాత్మిక విలువలను, మరియు తరతరాల కళా సంప్రదాయాన్ని భద్రపరుస్తాయి. అందువల్ల, చెంచు కళాకారుల జీవన విధానం జీవనోపాధి, కళ, మరియు సాంస్కృతిక పరిరక్షణ మధ్య లోతైన సమన్వయాన్ని ప్రతిబింబించే సమగ్ర పరిశీలన అవుతుంది.

**చెంచుల ఆచారాలు, విశ్వాసాలు – ఆధ్యాత్మికత మరియు సాంస్కృతిక విలువల ప్రతిబింబం**

చెంచుల సమాజంలో ఆచారాలు మరియు విశ్వాసాలు వారి ఆధ్యాత్మిక జీవన విధానం, సాంఘిక సమన్వయం, మరియు సాంస్కృతిక విలువల ప్రతిబింబంగా నిలుస్తాయి. ఈ ఉత్సవాలు, వ్రతాలు ప్రతి నెలలో జరుపబడుతూ, సమాజానికి, ప్రకృతికి మరియు తరతరాలకు లోతైన అనుబంధాన్ని అందిస్తాయి. చైత్రం నెలలో పోచం ఉత్సవం జరుపబడుతుంది, ఇది ప్రకృతి, వన్యజీవుల ఆరాధన మరియు కొత్త సంవత్సర ప్రారంభానికి సార్థకంగా ఉంటుందని గుర్తిస్తుంది. ఆషాఢం నెలలో వానపండుగ వర్షపు ప్రార్థనలు, పంటల ఆరోగ్యం మరియు ప్రకృతి కృషికి గౌరవం చూపే విధంగా జరుపబడుతుంది. శ్రావణంలో కొండల వ్రతం జరగడం ద్వారా కొండల మరియు అడవి దేవతలకు ఆధ్యాత్మిక పూజ, ప్రకృతి పరిరక్షణకు ప్రతిబద్ధత వ్యక్తమవుతుంది. భాద్రపదంలో తరువు ఉత్సవం సామాజిక కలయిక, సామూహిక ఆచారాల ప్రదర్శన మరియు జానపద కళల పరిరక్షణలో కీలకంగా ఉంటుంది. ఆశ్వయుజం నెలలో మార్మిక వ్రతాలు నిర్వహించడం ద్వారా కుటుంబ పరిరక్షణ, వ్యక్తిగత నైతికత మరియు ఆధ్యాత్మిక విలువలను కాపాడుతారు.

ఈ విధంగా చెంచుల ఆచారాలు, విశ్వాసాలు నెలల వారీగా జరుపబడటం ద్వారా ఆధ్యాత్మికత, ప్రకృతి పరిరక్షణ, సామాజిక సమన్వయం మరియు సాంస్కృతిక వారసత్వం ఒక సమగ్ర, లోతైన, సుసంపన్న దృక్కోణాన్ని అందిస్తాయి. ప్రతి ఉత్సవం మరియు వ్రతం చెంచుల జీవన విధానం, కళా సంప్రదాయం, మరియు ప్రకృతి గౌరవానికి కీలక భూమికను వహిస్తుంది.

**చెంచు మహిళల పాత్ర – కుటుంబ, వృత్తి, జానపద కళల పరిరక్షణలో ప్రాముఖ్యత**

చెంచు సమాజంలో మహిళలు కేవలం కుటుంబ సంరక్షకులు మాత్రమే కాక, జీవనోపాధి, వృత్తిపరమైన కళలు, మరియు జానపద సంప్రదాయాల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తారు. మహిళలు వన్యజీవుల సేకరణ, పల్లెల వ్యవసాయం, మత్స్యకళ, మరియు వృత్తిపరమైన శిల్పకళలో నైపుణ్యం కలిగి, కుటుంబ ఆర్థిక స్థితిని స్థిరంగా ఉంచుతారు. ముఖ్యమైన వృత్తిపరమైన కళా

కారులుగా, వారు పల్లకీ గీతాలు, వనగీతాలు, వన నృత్యాలు, మరియు ఆచార గీతాల పునరుద్ధరణలో సారథ్యాన్ని వహిస్తారు. ఈ విధంగా, చెంచు మహిళలు కళ, సంప్రదాయం, మరియు జీవనోపాధి మధ్య సమన్వయాన్ని సృజనాత్మకంగా కొనసాగిస్తారు, సమాజంలో స్థిరత్వం మరియు ఆత్మగౌరవాన్ని భద్ర పరుస్తారు.

సాంఘికంగా, మహిళలు సమూహ ఆచారాలలో, ఉత్సవాలలో, మరియు వ్రతాలలో ముఖ్య పాత్రలో ఉంటారు. ఉదాహరణకు, పోచం ఉత్సవం, వాన పండుగ, తరువు ఉత్సవం వంటి ఉత్సవాల్లో మహిళల ప్రదాన పాత్ర ఈ ఉత్సవాల ఆధ్యాత్మికత, సమూహ బంధం, మరియు కళారూపాల స్థిరత్వానికి మూలాధారం అవుతుంది. వారి నైపుణ్యం, కళా ప్రావీణ్యం, మరియు తత్త్వవివేకం తరం తరాల వారసత్వాన్ని, సాంస్కృతిక విలువలను, మరియు ప్రకృతి పరిరక్షణా భావాన్ని కొనసాగించడంలో కీలకంగా నిలుస్తుంది. అందువల్ల, చెంచు మహిళల పాత్ర కేవలం కుటుంబం మరియు వృత్తి పరిమితిలో కాక, జానపద కళల, సంప్రదాయాల, మరియు సమాజ స్థిరత్వం కోసం ప్రాథమిక, అంతర్లీన, లోతైన మూలాధారం గా ఉంటుంది.

## ఆధునికత ప్రభావం – సంప్రదాయ కళలపై సమకాలీన మార్పులు మరియు సవాళ్లు

చెంచు సమాజంలో ఆధునికత ప్రభావం సంప్రదాయ కళలపై గంభీరమైన మార్పులు, అలాగే సవాళ్లను సృష్టిస్తుంది. విద్య, సాంకేతిక పరిజ్ఞానం, భౌగోళిక పరివర్తనాలు, మరియు సమకాలీన ఆర్థిక అవసరాలు చెంచుల వృత్తి, గీతాలు, నృత్యాలు, మరియు ఆచార సంప్రదాయాలపై ప్రత్యక్ష ప్రభావం చూపిస్తున్నాయి. సంప్రదాయ కళలు, ఉదాహరణకు వనగీతాలు, పల్లకీ గీతాలు, వన నృత్యాలు, మరియు వృత్తిపరమైన శిల్ప కళలు, ఆధునిక విధానాల ద్వారా కొత్త రూపాల్లో మార్పులు చెందుతున్నప్పటికీ, అవి మూల తాత్విక, సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక విలువలను కొంతమేర వరకు దృష్టిలో ఉంచుతాయి.

సమకాలీన సవాళ్లలో, యువతలో పూర్వపు సంప్రదాయ కళల మీద ఆసక్తి తగ్గడం, నగరీకరణ, వనరుల కొరత, మరియు జీవనోపాధి మార్పులు ముఖ్యంగా ఉంటాయి. ఇతర వైపు, ఆధునిక మీడియా, ఫొటోగ్రఫీ, మరియు విద్యా అవగాహన సంప్రదాయ కళల ప్రదర్శన, డాక్యుమెంటేషన్ మరియు భద్రతకు అవకాశాలను కూడా సృష్టిస్తోంది. అందువల్ల, చెంచుల సంప్రదాయ కళలు మార్పులను అంగీకరించడం, తత్త్వ వివేకాన్ని ఉంచడం, మరియు సమకాలీన సవాళ్లతో సమన్వయం సాధించడం ద్వారా భవిష్యత్తులో కూడా నిలిచేలా ఉండటానికి దిశానిర్దేశం అవసరం.

## సంక్షిప్త సమీక్ష మరియు ఉపసంహారం

చెంచు జానపద సంస్కృతి అనేది ప్రాచీనత, ప్రకృతి అనుబంధం, మరియు జీవనోపాధి ఆధారిత తత్త్వాల సమాహారం. గీతాలు, నృత్యాలు, వృత్తిపరమైన కళలు, ఆచారాలు మరియు విశ్వాసాలు చెంచుల సాంఘిక, ఆధ్యాత్మిక, మరియు సాంస్కృతిక విలువలను ప్రతిబింబిస్తాయి. మహిళల పాత్ర, కుటుంబ జీవన విధానం, వృత్తి సాధన మరియు కళా సంప్రదాయాల పరిరక్షణలో ముఖ్యమైనది, ఇది సమాజ స్థిరత్వానికి మరియు వారసత్వానికి కీలక మూలాధారంగా నిలుస్తుంది.

సమకాలీన ఆధునికత ప్రభావం వల్ల సంప్రదాయ కళలు మార్పులు ఎదుర్కొన్నప్పటికీ, వీటి శాశ్వతతను, లోతైన తాత్వికతను మరియు సాంస్కృతిక ప్రత్యేకతను పరిరక్షించడం అత్యంత అవసరం. భవిష్యత్ దిశలో, చెంచు జానపద కళలను పాఠశాలలు, సామూహిక కార్యక్రమాలు, డాక్యుమెంటేషన్, మరియు పరిశోధన ద్వారా ప్రాచుర్యం పరచడం, సమకాలీన యువతలో అవగాహన పెంచడం, మరియు ప్రకృతి సంబంధిత విలువలను నిలుపుకోవడం ముఖ్యమైన మార్గాలు. అందువల్ల, చెంచు జానపద సంస్కృతి భవిష్యత్తులో నిలిచే, తరతరాలకు వారసత్వం అందించే, మరియు సమాజానికి లోతైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక పాఠాలను అందించే ప్రామాణిక మూలాధారంగా కొనసాగుతుంది.

**ఫలితాలు**

- చెంచుల గీతాలు, నృత్యాలు, వృత్తిపరమైన కళలు జీవనోపాధి మరియు సంప్రదాయాల లోతైన ప్రతిబింబం.
- మహిళలు కుటుంబ, వృత్తి, జానపద కళల పరిరక్షణలో కీలక పాత్ర వహిస్తారు.
- ఆచారాలు, వ్రతాలు మరియు విశ్వాసాలు ఆధ్యాత్మికత, సామాజిక సమన్వయం, ప్రకృతి గౌరవాన్ని ప్రదర్శిస్తాయి.
- ఆధునికత ప్రభావం వల్ల సంప్రదాయ కళలు మార్పులు, సవాళ్లు, కానీ భవిష్యత్తులో ప్రాచుర్యం కోసం అవకాశాలు పొందుతున్నాయి.
- చెంచు సంస్కృతి శాశ్వత విలువలు, లోతైన తత్త్వవివేకం మరియు భవిష్యత్ తరాల వారసత్వానికి కీలకమైన మూలాధారం.

**సూచనలు**

- చెంచు గీతాలు, నృత్యాలు, వృత్తిపరమైన కళలను పాఠశాలలలో, సామూహిక కార్యక్రమాల్లో, మరియు స్థానిక ఉత్సవాల్లో ప్రాచుర్యం చేయడం.
- యువతలో సంప్రదాయ కళల, ఆచారాల, మరియు వృత్తి నైపుణ్యాల ఆరాధన మరియు అవగాహన పెంచే కార్యక్రమాలను ప్రారంభించడం.
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డాక్యుమెంటేషన్, ఫోటోగ్రఫీ, వీడియోల ద్వారా చెంచు సంస్కృతిక వారసత్వం మరియు కళలను భద్రపరచడం.
- చెంచుల ఆచారాలు, ఉత్సవాలు మరియు వృత్తి సంబంధిత ప్రకృతి పరిరక్షణా విధానాలను సమకాలీన జీవనోపాధితో సమన్వయం చేయడం.

**ఉపయుక్త గ్రంథాలు**

1. ప్రేమలత, రవి. తెలుగు జానపద సాహిత్యం పురాగాథలు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ, 2019.
2. రామరాజు, బి.రామరాజు. తెలుగు జానపద సాహిత్యము. తెలుగు అకాడమీ, హైదరాబాద్, తెలంగాణ, 2015.
3. సుందరం, ఆర్.వి.ఎస్. ఆంధ్రుల జానపద విజ్ఞానం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్.
4. నాయని, కృష్ణకుమారి, ఎడిటర్. తెలుగు జానపద విజ్ఞానం: సమాజంసంస్కృతిసాహిత్యం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.
5. సుందరం, ఆర్.వి.ఎస్. జానపద సాహిత్య స్వరూపం. విశాలాంధ్ర ప్రచురణ హౌస్, హైదరాబాద్, తెలంగాణ.
6. జానపద గేయ వాఙ్మయ పరిచయము. తెలుగు భాషా సమితి / నవ్య విజ్ఞాన ప్రచురణలు, మద్రాస్ (చెన్నై), 1967.
7. శంకరమంచి, సత్యం. అమరావతి కథలు. నోవోడయ పబ్లిషర్స్, విజయవాడ, ఆంధ్ర ప్రదేశ్.
8. రాజు, బి. రామ. ఆంధ్రప్రదేశ్ జానపద సాహిత్యం [Folklore of Andhra Pradesh]. నేషనల్ బుక్ ట్రస్ట్, న్యూ ఢిల్లీ, 2020.
9. భోలా, రచనా. ఆంధ్రప్రదేశ్ జానపద కథలు [Folk Tales of Andhra Pradesh]. డైమండ్ పాకెట్ బుక్స్, న్యూ ఢిల్లీ, 2004.
10. ఓటా, ఏ.బి., మరియు ఇతరులు. చెంచు జాతి [Chenchu]. Scheduled Castes & Scheduled Tribes Research and Training Institute (SCSTRTI), భువనేశ్వర్, 2016.
13. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం. సాంస్కృతిక వార్షిక నివేదిక. హైదరాబాదు, తెలంగాణ, 2020.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# ఆదరణ కరువైన జానపద కళారూపం పిట్టలదొర - హాస్యరసము



- ఏం. వేణుగోపాల్ శర్మ

తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ మరియు రీసెర్చ్ స్కాలర్, భారతీయ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ విశ్వవిద్యాలయం, సత్యసాయి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

**వ్యాస సంగ్రహం :**

విశాల భారతదేశంలో ఎన్నో శతాబ్దాలుగా ఎన్నో కళలు పురుడుపోసుకుని మానవ జీవన వికాసానికి, జీవన విధానానికి బాటలు వేశాయి. రామాయణకాలం నాటికే బుర్రకథ మొదలైన కళలు ప్రాచుర్యంలో ఉన్నట్టు కనిపిస్తుంది. విభిన్న జాతుల వారు, అనేక వర్ణాల వారు, మతాలవారు జీవనాన్ని కొనసాగిస్తున్నారు. మనుషులు ఒక్కటే అయినా ఆచారాలు సంప్రదాయాలు విభిన్నమైనవి మరియు వైవిధ్య భరితమైనవి. భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించడానికి ఎన్నో కళలు దోహదం అయ్యాయి.

కళారూపాలు మానవ సమూహానికి ప్రతిబింబాలు. రకరకాల విన్యాసాలతో తరతరాల జీవన వారసత్వాన్ని వారసులకు అందించాయి, అలరించాయి. పురాణాలను, ఇతిహాసాలను, చరిత్రను, ఉద్యమాలను సంస్కృతిని తరువాత భావి తరాలకు అందించడంలో జానపద కళలు ప్రధాన భూమికను పోషించాయి. తరతరాలుగా వేలాది మంది కళాకారులు తమ జీవితాలను ధారపోసి కళా సంస్కృతిని సుసంపన్నం చేశారు. గంగా ప్రవాహంలా బాహుళ్యం లోనికి చొచ్చుకొని వెళ్లి అందరిని తన వైపు తిప్పుకొని సమాజ వికాసానికి కారణమైంది.

**కీలక పదాలు :**

జానపద కళలు, సామాజిక మాధ్యమాలు, పిట్టలదొర, వేషధారణ, కళాకారులు

**ఉపోద్ఘాతం :**

కళలు మానవ ప్రగతికి, సంస్కృతులను భావితరాలకు అందించడానికి సోపానాలు. కనుకనే దేశాన్ని ఏలిన ఎన్నో రాజవంశాలు కళలను పోషించాయి. ప్రభుత్వ పథకాలను, సంస్కరణలను ప్రజలకు చేరవేయడానికి ప్రధాన భూమికను పోషించాయి. ఇటువంటి కళలలో పగటి వేషాలు 65 కు పైగా ఉన్నట్టు వివిధ పరిశోధనల వలన తెలుస్తుంది. ఇటువంటి కళలకు పుట్టినిల్లు కృష్ణా జిలా కూచిపూడి. ఈ ప్రాంతములో కళలను నమ్ముకున్న కళాకారులకు శిక్షణను ఇచ్చే కేంద్రాలు ఎన్నో ఉన్నాయి. ఇటువంటి కళలలో పిట్టలదొర ఒకటి. ఏ కళ అయినా సృజనాత్మకత కలిగి ఉన్నదే. ఈ కళను ప్రదర్శించే కళాకారునికి మాత్రం మరింత ఎక్కువ సృజనాత్మకత అవసరం. ఎందుకనగా తన కళ ద్వారా నలుగిరిని నవ్విం

సంభాషణలను సృష్టించుకోవలసి ఉంటుంది. సందర్భోచితంగా హాస్య రసాన్ని పండించాలి. చతురతను ప్రదర్శించగలగాలి.

నవ్వడం భోగం, నవ్వించడం యోగం, నవ్వకపోవడం ఒక రోగం. ఎన్ని జోకులు వేసినా తానూ మాత్రం అస్సలు నవ్వకుండా, ఇతరులను నవ్విస్తూ, విచిత్ర వేషధారణతో, టోపీతో, చేతిలో కర్రతో, కళ్ళకు అద్దాలు ఇలా కనబడే పిట్టలదొర పండించే హాస్యాన్ని, కళను నమ్ముకుని బ్రతికి నేడు సామజిక మాధ్యమాల వలన ఆదరణ కోల్పోయిన ఈ కళారూపాన్ని మీముందుంచడమే ఈ వ్యాసము ప్రధాన ఉద్దేశ్యము.

**జానపద వాఙ్మయం :**

మానవ జీవన వికాసంలో విశిష్ట స్థానం కలిగిన జానపద కళలు మనందరి జీవితాన్ని నడిపిస్తూ, తోడుగా నిలిచి ఉంటూ ఉనికిని చాటుకున్నాయి.

**పూర్వ పరిశోధనలు :**

జానపద కళలపై తన జీవితకాలమంతయు వెచ్చించి కళలకు ప్రాణం పోసిన వ్యక్తి నేదునూరి గంగాధరం, బిరుదు రాజు రామరాజు, పాకాల యశోద రెడ్డి, మొదలైన వారు జానపద కళలపై సాహిత్యం పై విస్తృతమైన పరిశోధనలు చేసి మన చరిత్రను, సంస్కృతులను మన ముందుంచారు.

జానపద కళాకారులు కులాలను ఆశ్రయించి ఈ కళలను మరింత సుసంపన్నం చేశారు. కానీ మారుతున్న సామాజిక పరిస్థితులలో ఎన్నో జానపద కళలు క్రమంగా కనుమరుగౌతూ వస్తున్నాయి. ఆధునిక కళారీతులు, జానపద కళల పట్ల నిరాదరణతో పోషణ కనుమరుగై ఎన్నో కళాస్వరూపాలు నేటి తరాలకు తెలవకుండా పోయాయి. ఒకనాడు కచేరీలలో గ్రామస్తులు అందరిని కదలకుండా కూర్చోబెట్టి రంజింపజేసిన జానపద కళారూపాలు నేడు పొట్టకూటి కోసం తిప్పలు పడవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

**జానపద కళలు :**

జానపద వాఙ్మయం మానవ సమూహం ఏర్పడ్డప్పటి నుండి ప్రచారంలో ఉంది. ఇవి అజ్ఞాత కర్తృత్వాలు రచనాకాలం తెలవకపోవడం, మౌఖిక ప్రచారం ఉండడం నియమిత స్వరూపం లేకపోవడం వంటి లక్షణాలు కలిగి ఉన్నాయి. తెలుగు నాట అసలు ఎన్ని కళారూపాలు ఉన్నాయి అనే ప్రశ్నకి సరైన జవాబు దొరకడం చాలా కష్టం. పరిశోధకుల ఊహ ప్రకారం 100 కు పైగానే కళలు ఉన్నట్టు తెలుస్తోంది. చిందు బాగోతం, గొల్ల సుద్దులు, చిరుతల రామాయణం, జడకోలాటం, కోయనృత్యం, కొరవంజి కథలు, ఎరుకలసోది, ఎరుకల దాసరి, హరికథ, బుర్రకథ, చెక్కభజన, తప్పెటగుళ్ళు, పాములవాడు, పిట్టలదొర, బతుకమ్మ పాటలు, బీరన్నలు, భట్రాజులు, యక్షగానాలు, మాలజంగాలు, మాల దాసరులు ఇలా చెప్పుకుంటూ పోతే 100కు పైగానే కళలు అని తెలుస్తుంది. తెలుగు నాట హాస్య రసాన్ని పండిస్తూ, కళలను పోషిస్తూ, కళ ద్వారా కుటుంబాన్ని పోషిస్తూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ఆదరణ పొందిన పిట్టలదొర కళా రూపం గురించి ఈ వ్యాసములో తెలుపనున్నాను.

**ప్రధాన విషయము :**

పగటి వేషాలలో ఒకటయిన పిట్టలదొర వేషము తెలుగునాట ఒక వెలుగు వెలిగిన కళారూపము. పిట్టల దొర వేషము చిరిగినా పాంటు, షర్టు, తలపైన టోపీ, చేతిలో కర్ర బూట్లు, టోపిపైన ఒక ఈక ధరించి తన యొక్క వాగ్ధాటితో హాస్యాన్ని పండించి బ్రతుకును వెళ్లదీసే వారు. ఈతని వేషము దాదాపుగా ఆనాటి బ్రిటిష్ పోలీసు అధికారుల వేషధారణను పోలిఉంటుంది. మెడలో రుమాలు ధరించి తెల్లదొరల దురాక్రమణను ఎత్తిపొడుస్తూ ప్రజానాట్య మండలి ద్వారా శ్రోతలను రంజింపజేసినట్లు ఆచార్య జయధీర్ తిరుమల రావు గారి సాహితీ ప్రత్యేక కళారూపాల సంచికలో పేర్కొన్నారు.

**పిట్టలదొర వేషము :**

పిట్టల దొర వేషం చూస్తేనే నవ్వొస్తుంది. మాటలు వింటుంటే పగలబడి నవ్వాలనిపిస్తుంది. గమ్మత్తైన వేషం, చిత్రవిచిత్రమైన మాటలు మాట్లాడుతూ పైకి డాంబికాలు చెప్పూనే తన వెనుక నున్న కష్టాన్ని గుర్తించక అందర్నీ నవ్విస్తూ ఇంటింటికీ తిరిగి యాచిస్తుంటాడు. పిట్టల దొర.

ఒక పక్క పైకి మడిచిన ఖాకీప్యాంటు, చినిగిన అంగి, తెల్ల ఈకతో కూడిన ఇంగ్లీషు దొరల టోపి, మెడలో రుమాలు, సన్నటి మీసం, కాళ్ళకు బూట్లు, భుజానికి కట్టెతుపాకి, ముఖానికి తెల్లరంగు ఇదీ పిట్టల దొర వేషం.

**పిట్టలదొర ప్రదర్శించిన కొన్ని హాస్య రస గుళికలు :**

చేతిలో కట్టే తుపాకి పట్టుకొని కనిపిస్తూ ఏమండీ మీరు పక్కకు తప్పుకోండి. లేకుంటే పేలిపోతుంది. ముందుకు మూడు కిలోమీటర్లు, వెనక్కి ఏడు కిలోకిలోమీటర్లు పోతుందండి. మా గన్ను ఆపమంటారా, మోపు జేయ మంటారా. ఆపమంటే ఆరువేలు, మోపుజేస్తే మూడువేలు అవుతుందండి. యెనక్కి వెళితే ఎనిమిది వేలు, ముందుకు వెళితే మూడువేలు, పైకి వెళ్తే పదివేలు అవుతుందండి. అని అంటూ అందరినీ నవ్విస్తుంటాడు.

మరో కళాకారుడు ప్రదర్శిస్తూ నేను ఇప్పుడే దుబాయ్ నుండి వచ్చానండి. మీ ఊళ్ళో ఎయిర్ పోర్ట్ లేదని కిటికిలో నుండి దూకి వస్తున్నానండి. వస్తూ వస్తూ కిలో బంగారం మీకు ఇద్దామని తెచ్చానండి. కానీ తోవలో కుక్క తోక తగిలిందండి. కుక్క తోక తగిలితే మీరు తీసుకోరని ఏడుగురు పాలేర్లను పెట్టి ఏరవతల పారేయించానండి. మా ఇంట్లో కోట్లు కుక్కలు తింటాయండి. లక్షలు నక్కలు తింటాయండి. మూడు కోట్లు తీసుకెళ్ళి మురిక్కాలువలో పారేశానండి. మా ఇంట్లో వేలు ఎలకలు తింటాయండి. చిల్లరలు చీమలు తింటాయండి.

ఏమండి అక్కయ్య గారు మీకు దాన ధర్మాలకు డబ్బు లేకుంటే చెప్పండి. ఒక్క ఫోన్ కాల్ చేయండి. మా అసిస్టెంట్‌తో గోనె సంచి నిండా డబ్బులు పంపిస్తానండి. మాకు డబ్బంటే లెక్కే లేదండి. నిన్న ప్రపంచ బాంక్ మేనేజర్ డబ్బులు కావాలంటే ఎడమ చేతితో ఇసిరేశానండి. ఉయ్యూరులో ఉడుతల ఫ్యాక్టరీ మాదేనండి. పాలమూరులో పందికొక్కుల ఫ్యాక్టరీ మాదేనండి. బెంగళూరులో బొంగుల ఫ్యాక్టరీ మాదేనండి. దుబాయ్‌లో దూది ఫ్యాక్టరీ, మలేసియాలో మక్కల ఫ్యాక్టరీ, బ్రెజిల్‌లో బొక్కల ఫ్యాక్టరీ మాదేనండి. మాకు ఇంకా బోలెడంత డబ్బుందండి. మా ఇంటి గోడలు ఇటుకలతో కట్టమండి. బంగారం ఇటుకలతో కట్టేస్తామండి. మా పిల్లలు ఆడుకోడానికి ఆడి కారు, ఇంటికి ఇన్నోవా కారు, బయటికి బెంజి కారు, రోగమొస్తే రేంజర్ కారులో హాస్పిటల్ కి వెళ్తామండి. నేనేమో పొద్దున్న కలకత్తాలో, మద్యాహ్నం బెంగళూరులో, సాయంత్రం హైదరాబాద్‌లో రాత్రికి బొంబాయిలో ఉంటానండి. మా పిల్లలు ఆకలేస్తే అహ్మదాబాద్, కోపమొస్తే కలకత్తాకి, తినాలనిపిస్తే త్రివేండ్రం కి, పడుకోడానికి పంజాబ్ కి వెల్తారండి. ఇలా అందరినీ నవ్వించి చివరికి మనము ఇచ్చే డబ్బులు తీసుకుని వెళతాడు.

ఇప్పుడు ఎక్కడికి వెళతావని అడిగితె స్పెషల్ ట్రైన్‌లో లండన్‌కి వెల్తానండి. అక్కడి ప్రధానమంత్రితో కలసి చాయి తాగి మళ్ళీ మెదక్‌కి వచ్చేత్తానండి. అనగానే అది విన్న పిల్లలందరూ గొల్లున నవ్వేవారు. మీ ఆవిడ ఏది అని అడిగితే జవాబిస్తూ ఆమెనా అండీ కత్తెర కొనుక్కోడానికి కెనడా కెల్లిందండి. మా తమ్ముడేమో సిగిరెట్టు తాగటానికి సింగపూరు కెల్లాడండి. మా అన్న నెమో ఆలుగడ్డలు తీసుకురావడానికి అమెరికాకు వెల్లాడండి. మీలో ఎవరికైనా పిల్ల కావాలంటే చెప్పండి. మాదగ్గర వేల్లేని వెంకమ్మ ఉంది, నడుము విరిగిన నాగమ్మ ఉంది, సొట్ట ముక్కు సాయవ్వ ఉంది, కన్ను కనకవ్వ ఉంది, కాలు లేని కమలమ్మ ఉంది, వీళ్ళందరికీ మంచి అందగాడు కావాలండి. వీళ్ళు మీకు ఇల్లు లేకున్నా ఒప్పుకోరు, కారు లేకున్నా ఒప్పుకోరు. మరి నేనొత్తానండి అని అందరినీ నవ్వించి ఇంకో చోటుకి వెళతాడు. అతని మాటలు విన్న అందరికీ కొద్ది రోజుల పాటు గుర్తుకు చేసుకొనీ మరీ నవ్వే వారు.

ఈ జానపద కళారూపం పేరు తోనే రెండు సినిమాలు కూడా రూపొందాయి. అవి ఆలీ కథానాయకుడిగా నటించిన పిట్టలదొర (1996) సినిమా, తెలంగాణ బిత్తిరి సత్తి నటించిన తుపాకి రాముడు (2019) సినిమాలు. ప్రాంతాన్ని బట్టి పిట్టలదొరను తెలంగాణలో "లత్కోర్ సాబ్", "తుపాకి రాముడు" అని కూడా పిలుస్తారు. హాస్యాన్ని ఆయుధంగా ఉపయోగిస్తూ సమాజంలో జరుగుతున్న మోసాలు, కుతంత్రాలు, దురాచారాలను వ్యంగ్యంగా ఎత్తిచూపడం ఈ కళారూపానికి ముఖ్య

లక్షణం.

'పిట్టల దొర' సినిమాలో వచ్చే ఈ పాట ఈ కళారూప సారాన్ని అద్భుతంగా చూపిస్తుంది:

"ఎయ్ తూటలు లేని తుపాకి బట్టి
మాటలతోనే కోటలు గట్టి
ఒరె ఒరె తూటలు లేని తుపాకి బట్టి
మాటలతోనే కోటలు గట్టి
పూట పూటకు చాటెడు గింజలకు
యాడేడ దిరిగే బాట సారినీ నేనే..
హయ్ మాటలకేమో కుబేరుని..
కూటికి లేని కుచేలుని..
మాటలకేమో నవాబుని..
పూటకు లేని గరీబుని..
నేనే ఎంకట్రాముడ్ని..
నేనే పిట్టల దొరనీ..
ఆఅ.. నేనే ఎంకట్రాముడ్ని..
మారాజ మారాజ నా తుపాకంటే ఏమనుకున్నరు
ఓ సారి అమీన్ సాబు తుపాకీ నా తుపాకీ
పోటీబెట్టుకుని హుస్సేన్ సాగర్ లా పారేత్తే
అమీన్ సాబు తుపాకీ అడుగుబట్టింది
నా తుపాకీ మునుగుతూ తేలుతూ
మునుగుతూ తేలుతూ తూము కాడ తేలింది
గంత నెంబర్ వన్ తుపాకి మారాజా..
గీ తుపాకి కోసం పాకిత్తాన్ ప్రధానమంత్రి
పదిలచ్చలిత్తానని పది సార్లు ఇమానమేస్కుని
నా యింటికొచ్చిండు.. నేనిచ్చిన్నా..
హిహి ఇయ్యలే మారాజా
ఇక నేను పుట్టింది దేవరకొండ
పెరిగింది నల్గొండ ఉండేది గోల్కొండ
అడక్కదినేది హన్మకొండ మారాజా.. హిహిహా..
సికిందరబాదుల ఉన్నదీ - అరవై ఎకరాల్ అంగూర్ తోటా
హైదరబాదుల ఉన్నది - ముప్పై ఎకరాల్ చెరుకు తోటా
సికిందరబాదుల మోటర్లున్నయ్ ఎన్నో - స్టార్ హోటళ్ళున్నయ్ ఎన్నో
స్కూటర్లున్నయ్ ఎన్నో - గాలి మోటర్లున్నయ్ ఎన్నో
మారుతి కంపెని వాటా నేనే - టాటా బిర్లాకు పోటీలే..
హయ్ మాటలకేమో కుబేరుని.. కూటికి లేని కుచేలుని..
మాటలకేమో నవాబుని.. పూటకు లేని గరీబుని..
నేనే ఎంకట్రాముడ్ని.. నేనే పిట్టల దొరనీ..
ఆఅ.. నేనే ఎంకట్రాముడ్ని.. నేనే పిట్టల దొరనీ.."

అంటూ సాగే ఈ పాటలో ప్రదర్శన మాత్రమే కాకుండా, మాటల వెనుక ఉన్న వ్యంగ్యం, సామాజిక సందేశం కూడా ఎంతో చక్కగా వ్యక్తమవుతుంది. మాటల్లో గొప్పగా కనిపించే వ్యక్తి, వాస్తవ జీవితంలో సాధారణ మనిషే అన్న భావాన్ని ఇది బలంగా తెలియజేస్తుంది.

తుపాకి రాముని ఊరబిస్క వేట: తుపాకి రాముడు ఊరబిస్కెను వేటాడి దాన్ని ఊరందరికీ పంచిపెట్టే సంభాషణ అత్యంత హాస్యాన్ని కలిగిస్తుంది. ఇతను తుపాకీతో ఊరపిచ్చుకను కొడితే అది పోయి ఒక ఊరిలోని ఒక వాడలో పడుతుంది. దాన్ని మాంసం తినని కులాలతో పాటుగా రజకులు, నాయీ బ్రాహ్మణులు, దూదేకులవాళ్లు అందరూ కలిసి దాని మాంసాన్ని పోగులు వేస్తారు. ఆ మాంసం ఊరంతా సరిపోగా ఇంకా రెండు సప్పలు మిగిలిపోతాయి. ఆ రెండు సప్పలు వరంగల్ మండిబజార్ కు పంపుతాడు. అక్కడ ఉండే కులాలు వెంకట్రాముడు నాకు 'పోగులు' పంప లేదంటే నాకు పంపలేదంటూ ఒకరికొకరు గుద్దుకొని చని పోయారని అంటాడు. ఊర పిచ్చుక మాంసం కనీసం వంద గ్రాములైనా ఉండదు. అలాంటిది దాని మాంసాన్ని ఊరందరికీ పంచి, చివరికి రెండు సప్పలు మిగిలితే అవికూడా పంచుతాడు. ఈ సన్నివేశాన్ని వెంకట్రాముడు అతని మాటల ద్వారా జానపదులకు పదేపదే ఎన్నిసార్లు చెప్పినా కడుపుబ్బా నవ్వుతారంటే అది అతని గొప్పదనమే అవుతుంది.

"మా తాత తట్టల్దొర. మానాన్న బుట్టల్దొర. నేను

పిట్టల్దొర. నన్నందరూ లత్కోర్ సాబంటరు. మారాజా! నాకేం తక్కువ లేదు. తీసుకు తింటే తరుక్కపోద్దని అడుక్కతింటున్న. నా పెళ్ళికి అమెరికా, సింగపూర్, చైనా, జర్మనీ, జపాన్ అన్ని దేశాల నుండి అందరచ్చిండ్రు. అందరికి తిండి సరిపోవాలని షేర్ల బియ్యం పోసిన తూంకింద మంట బెట్టిన చింతాకిస్తర్లేసి ఇద్దరికిత్తు సొప్పున మస్తుగ వడ్డిస్తే బద్దం తిన్నరు బాంచెను. మీ అందర్ని సూత్తంటే పెండ్లి కొచ్చినట్లే ఉన్నరు. కాని కట్నాల బుక్కులో ఒక్కరి పేరూ లేదు." ఇలాంటి హాస్య సంభాషణలకు నవ్వని వారుంటారా ? ఇదీ పిట్టల దొర ప్రదర్శన.

ఇలా హాస్యరసానికి మారుపేరు పిట్టలదొర అని చెప్పుకునే అతని నిజజీవితంలో చెప్పలేనంత బాధలు ఉన్నా అందరినీ నవ్వించి కళను బ్రతికిస్తూ, ఆ ఆనందంలో అతని నవ్వు వెనుక ఉన్న దుఃఖము కనపడ కుండా దాచేసుకుంటాడు. అతని కళను చూసిన అందరికీ మోదము.

**పిట్టల దొర కళాకారుల జీవన పరిస్థితులు :**

పిట్టల దొర కళారూపాన్ని కొనసాగిస్తున్న కళాకారుల జీవన పరిస్థితులు ప్రధానంగా వారి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులను ప్రతిబింబిస్తాయి. ఇవి కాలాను గుణంగా మారుతూ వచ్చినప్పటికీ, ప్రస్తుతం కొన్ని ముఖ్యమైన సమస్యలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పిట్టల దొర కళాకారులు సాధారణంగా ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందినవారు.ప్రదర్శనల ద్వారా వచ్చే ఆదాయం స్థిరంగా ఉండదు సీజనల్ ప్రోగ్రామ్‌లపై ఆధారపడాల్సి వస్తుంది. ప్రత్యామ్నాయ ఉపాధి కోసం కూలీ పనులు, చిన్న వ్యాపారాలు చేస్తుంటారు.సమాజంలో వీరికి ప్రత్యేక గుర్తింపు ఉన్నప్పటికీ, గౌరవం మరియు ప్రోత్సాహం తక్కువగా ఉంటుంది.గ్రామీణ ప్రాంతాలలో మాత్రమే ఎక్కువగా గుర్తింపు ఉంటుంది. పట్టణాల్లో ఈ కళకు ప్రాచుర్యం తగ్గింది. చాలా మంది కళాకారులు తక్కువ విద్యావంతులు కొత్తతరం పిల్లలు ఈ కళను కొన సాగించేం దుకు ఆసక్తి చూపడం తగ్గింది. ఆధునిక విద్య, ఉద్యోగాల వైపు మొగ్గు పెరిగింది.పూర్వం గ్రామాలలో ఉత్సవాలు, జాతరలు, పండుగలలో విస్తృతంగా ప్రదర్శనలు ఉండేవి. ప్రస్తుతం టీవీ, సినిమా, సోషల్ మీడియా ప్రభావం వల్ల అవకాశాలు తగ్గాయి. సంప్ర దాయ ప్రదర్శనలకు డిమాండ్ తగ్గింది. ప్రభుత్వ సహాయం కొన్ని సందర్భాలలో ప్రభుత్వం మరియు సాంస్కృతిక సంస్థలు ప్రోత్సాహం ఇస్తున్నాయి. కానీ ఇది సరిపడా స్థాయిలో లేదు. కళాకారులకు పించన్, బీమా వంటి సదుపాయాలు అవసరం. ఆధునిక వినోద మాధ్యమాలతో పోటీ, ఆర్థిక అస్థిరత, యువతలో ఆసక్తి తగ్గడం, కళ పరిరక్షణలో లోపం. సాధారణంగా సాదాసీదా జీవనం, కుటుంబంతో కలిసి జీవనం సాగించడం, కళపై ప్రేమతోనే ఈ వృత్తిని కొనసాగించడం. భవిష్యత్ పరిస్థితి, సరైన ప్రోత్సాహం లేకపోతే ఈ కళ మరుగునపడే ప్రమాదం ఉంది. డిజిటల్ మీడియా ద్వారా కొత్త అవకాశాలు ఉన్నాయి. యువతను ఆకర్షించే విధంగా మార్పులు అవసరం.

**ముగింపు :**

ఎన్నో దశాబ్దాలపాటు ఎంతో వెలుగు వెలిగి, కళాకారు లకు ఉపాధినిస్తూ నవ్వించి, వెలిగిన పిట్టలదొర వేషము నేటి తరానికి తెలియకుండా మసకబారి పోయింది. నేటి సామజిక మాధ్యమాల ధాటికి ఈ కళను ప్రదర్శించే కళాకారులు కరువయినారు. ఈ కళాకారులు కూడా వివిధ ప్రాంతాలలో సంచరించి ప్రదర్శించే వీళ్ళు నేడు సామజిక మాధ్యమాలలో మాత్రమే కనిపిస్తున్నారు. దీనికి గల కారణం ఈ కళాకారుల పిల్లలు ఉన్నత చదువులు చదువుకోవటం, ఉద్యోగాలలో స్థిరపడటం ఇలా ఎన్నో కారణాలు ఉన్నాయి. ఏది ఏమైనా మళ్ళీ ఈ కళను ఆధారంగా చేసుకుని బ్రతుకును వెళ్ళదీస్తున్న కళాకారులు ఆదరణ కోల్పోకుండా రేపటి తరాలకోసం నిలబడాలి.

**ఆధార గ్రంధాలు :**

1. తెలుగు జానపద గేయ సాహిత్యం- ఆచార్య బిరుదు రాజు రామరాజు

2. తెలుగువారి జానపద కళారూపాలు - మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
3. తెలుగు జానపద గేయ గాథలు - నాయని కృష్ణకుమారి
4. తెలుగు ప్రజానాట్యాలు - డా. చాగంటి సోమయాజులు
5. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్వీఎస్ సుందరం
6. ప్రజా కళారూపాలు - డాక్టర్ జయధీర్ తిరుమల రావు
7. 8వ తరగతి తెలుగు పాఠ్య పుస్తకం

★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# గొల్లసుద్దులు కళారూపం - కళాకారుల సామాజిక జీవన చిత్రణ



- డా॥. యన్. అరుంధతి

తెలుగు లెక్చరర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్.

**వ్యాస సంగ్రహం**

తెలంగాణ ప్రాంతంలో యాదవ సమాజానికి చెందిన ఒక ముఖ్యమైన జానపద కళారూపం గొల్లసుద్దులు. ఈ కళారూపం ద్వారా యాదవుల చరిత్ర, కృష్ణలీలలు, కాటమరాజు కథలు వంటి పురాణ గాథలను ప్రజలకు వినిపిస్తారు. గొల్లసుద్దులు చెప్పే కళాకారులు ఊరూరు తిరుగుతూ గానం, నృత్యం, హాస్య సంభాషణలతో కథలను ప్రదర్శిస్తారు. వీరు కొమ్ములు, వీరణం, శంఖం వంటి వాయిద్యాలను ఉపయోగిస్తారు. ఈ కళారూపంలో కూనపదాలు అనే చిన్న జానపద పద్యాలు ముఖ్యమైనవి. గొల్లసుద్దుల ప్రదర్శనలో వేషధారణ, సంగీతం, కథావిన్యాసం ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. యాదవుల సామాజిక జీవితం, వారి వృత్తి, దేవతారాధన, మరియు వారి జానపద సంప్రదాయాలు కూడా ఈ కళారూపంలో ప్రతిబింబిస్తాయి. కాలక్రమేణా ఈ కళారూపం సామాజిక, రాజకీయ ఉద్యమాలలో కూడా ప్రధార సాధనంగా ఉపయోగించబడింది. ఈ వ్యాసంలో గొల్లసుద్దుల కళా రూపం, ప్రదర్శన విధానం, వాయిద్యాలు, కూనపదాలు మరియు కళాకారుల సామాజిక జీవన విధానం గురించి సమగ్రంగా వివరించబడింది.

**కీలక పదాలు**

గొల్లసుద్దులు, యాదవులు, జానపద కళారూపం, కృష్ణలీలలు, కాటమరాజు కథ, కూనపదాలు, జానపద గానం, గొల్లల సామాజిక జీవితం, గొల్ల కలాపం.

**ప్రస్తావన**

గొల్ల సుద్దులు అనేది తెలంగాణ ప్రాంతంలోని ప్రజా సాహిత్యంలో ప్రముఖమైన జానపద రూపం. ఇది గొల్ల, యాదవ సమాజానికి చెందిన కళాకారులు గ్రామాల్లో ప్రదర్శించే పాటలు, కథలు, సంభాషణల సమాహారం. గొల్ల సుద్దులు ప్రధానంగా సామాజిక, రాజకీయ, ధార్మిక అంశాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా వినోదంతో కలిపి చెప్పే జానపద కళారూపం. ఇందులో కథనం, హాస్యం, పాటలు, సంభాషణలు ఉంటాయి. కళాకారులు సంప్రదాయ దుస్తులు ధరించి, వాయిద్యాలతో పాటలు పాడుతూ కథలను వివరిస్తారు.

ఈ కళారూపం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించడం, అన్యాయాలపై విమర్శ చేయడం, సమాజంలో మంచి విలువలను ప్రచారం చేయడం జరుగుతుంది. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో కూడా గొల్ల సుద్దులు ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని పెంచడంలో ప్రముఖ పాత్ర వహించాయి. ఇది కేవలం వినోదానికి మాత్రమే కాకుండా, ప్రజలకు నీతి, ధర్మం, సమానత్వం వంటి విలువలను బోధించే సాధనంగా పనిచేస్తుంది. గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే ముఖ్యమైన జానపద సంపదగా గొల్ల

సుద్దులు గుర్తించబడింది. గొల్లసుద్దులు తెలంగాణ జానపద కళల్లో ప్రత్యేక స్థానం కలిగి ఉన్న కళారూపం. ఇది ప్రజల జీవితాలకు దగ్గరగా ఉండి, వారి భావాలు, సమస్యలు, ఆశయాలను ప్రతిబింబిస్తుంది.

**గొల్ల సుద్దులు**

గొల్లసుద్దులంటె గొల్లలు చెప్పే సుద్దులు. సుద్దులు అంటే సంగతులు లేదా మంచి మాటలు. ఇందులో ప్రధాన కథకుడు ఆటపాటలతో ప్రేక్షకులను అలరిస్తాడు. ప్రధాన కథకుడు పాడే పాటను అటు ఇటు పక్కనున్న ఇద్దరు చెవికి చెయికప్పి సాగదీసి వంత పాడుతారు. ఈ ప్రదర్శనలో వీరణాలు (పెద్దడోలు), కొమ్ములను ఉప యోగిస్తారు. ఇద్దరు గాయకులు వెనుక నుండి వంత పాడుతారు. ప్రధాన కథకుడు సాగదీసి వంతపాడుతారు. గొల్ల సుద్దుల ప్రదర్శనలో కథకుడు సరాసరి రంగస్థలం మీదికి రాడు. జనం మధ్య నుండి వస్తాడు. మిగిలిన ఇద్దరు కూడ ఆటను రక్తికట్టించడానికి ఈ మూలనుం డొకరు, ఆ మూలనుండొకరు టు ర్, టుర్ మని గొర్రెలను అదిలించినట్లు, తప్పిపోయిన గొర్రెలను వెతుకుతున్నట్లు, తోడేళ్ళను తరుముతున్నట్లు శబ్దాలు చేస్తూ వస్తారు. యాదవ సమాజానికి చెందిన కళాకారులు ఈ సుద్దులను చెప్పుతూ గ్రామాల నుంచి గ్రామాలకు తిరుగుతూ కథలు వినిపించేవారు. ఈ కళారూపం కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా యాదవుల చరిత్ర, పురాణ గాథలు, సామాజిక విలువలను ప్రజల్లో వ్యాప్తి చేయడంలో ముఖ్య పాత్ర పోషించింది. ముఖ్యంగా కృష్ణ లీలలు, కాటమరాజు కథలు వంటి ఇతిహాసాలను గొల్లసుద్దుల ద్వారా ప్రజలకు చేరవేశారు. గొల్లసుద్దులను చెప్పేవారు సాధారణంగా గొల్లలనే యాచిస్తారు.

అయ్యలరాజు నారాయణామాత్యుడు తన హంస వింశతిలో గొల్లసుద్దులను ఈ విధంగా వర్ణించాడు.

కొమ్ములు దీరణాలు జిగుగుల్కెడు వ్రాతల కృష్ణ లీలలం

గ్రమ్ము గుడార్లు వీరుడగు కాటమ రాజు కాథాను లాపముల్

మ్మిన పుస్తకాలు ముఖ పట్టిడి కట్టురు మాలలున్నెటా

సొమ్ములు నావముల్ వెలయు సుద్దుల గొల్లలు వచ్చి రెంత యున్

ఈ పద్యంలో చెప్పినట్లుగా గొల్లసుద్దుల కళాకారులు వాయిద్యాలను వాయిస్తూ, పుస్తకాలు మరియు బొమ్మ లను ఉపయోగించి కథలను వినిపించేవారు. గొల్లసుద్దుల కథలను పెద్ద వస్త్రాలపై చిత్రించి బొమ్మల సహాయంతో ప్రజలకు వినిపిస్తారు. బొమ్మలను చూపిస్తూ కథను వివరిస్తూ గానం చేస్తారు. ఈ విధమైన ప్రదర్శన విధానం ప్రజలను ఆకట్టుకునేలా ఉంటుంది. జానపద గేయ సాహిత్యంలో డాక్టర్ బిరుదురాజు రామరాజు పేర్కొన్నట్లు తెలంగాణలో పాండవులనే తెగకు చెందిన వారు కూడా భారత కథలను చీరలపై చిత్రించి బొమ్మల సహాయంతో పాడి వినిపించేవారు. గొల్లసుద్దుల ప్రదర్శనలో వివిధ రకాల వాయిద్యాలను ఉపయోగిస్తారు. వీరి గాన శైలి జానపద సంగీతానికి ప్రతీకగా నిలుస్తుంది. గొల్లసుద్దులలో ఉపయోగించే పద్యాలను సాధారణంగా కూనపదాలు అంటారు. కూనపదం అంటే చిన్న పద్యం ఈ పద్యాలకు ప్రత్యేకమైన ఛందస్సు లేకపోయినా జానపద ఛందస్సుతో ప్రసిద్ధి పొందాయి. తాళ్ళపాక అన్నమయ్య, క్షేత్రయ్య వంటి ప్రముఖులు కూడా ఈవిధమైన పదరచనలో ప్రసిద్ధులని పరిశోధకులు పేర్కొన్నారు.

ప్రధాన గాయకుడు పాడిన పదాన్ని వంతలు “ఆ” అంటూ సాగదీసి పాడటం ఈ కళారూపానికి ప్రత్యేక లక్షణం. గొల్లలు గొర్రెలను కాస్తూ రాత్రిళ్ళు వాటిని తోడేళ్ల బారి నుండి కాపాడటానికి కూడా ఈ పాటలను పాడుతూ ఉండేవారు. గొల్లసుద్దులు సాధారణంగా

హరి హరి నారాయణా...

ఆది నారాయణా...

కరుణించి మమ్మేలూ... కమలలోచనుడా...అనే పల్లవితో సాగుతాయి.ఈ విధంగా ప్రారంభించి కృష్ణ గాథలు, దశావతారాలు వంటి పురాణ కథలను పాడుతారు.

ఉదాహరణకు

గొల్లల గోత్రాలు గొట్టెల కెరుక

గొఱ్ఱెల గోత్రాలు గొల్లల కెరుక

వీరి వీరి గోత్రాలు తోడేళ్ళకెరుకో హరి, హరి. అంటూ సమాజంలో ఉన్న చెడును తొలగించడానికి ఈ పద్ధతిలో కొందరు సుద్దులు చెప్తారు.

**వేషధారణ**

మోకాళ్ళదాక మడిచికట్టిన పెద్ద అంచున్న ధోతి, నెత్తికి రుమాలు, చెవులకు దుద్దులు, ముంజేతికి కడియాలు, వెండి బిళ్లల మొలతాడు, భుజంమీద గొంగడి, కాళ్ళకు గజ్జెలు, చేతిల కఱ్ఱతో గమ్మత్తుగుంటారు. వీళ్ళు రక రకాలుగా యాస, భాషతో ఆద్యంతం నవ్విస్తుంటారు. కథను ఎటంటే అటు మలుస్తూ, అందరిని ఆకట్టు కుంటారు. గొల్లసుద్దులు కళారూపం రానురాను ఎన్నెన్నో మార్పులకు గురయింది. ఇప్పటికీ సామాజిక చైతన్యాన్ని కలిగించటానికి ఈ ప్రక్రియల్లో చెపితే సామాన్యులు సులభంగా అర్థం చేసుకుంటారు. ఇప్పుడు ఈ ప్రదర్శనకు డప్పు. డోలక్‌ను వాయిద్యాలుగా ఉపయోగిస్తున్నారు.

**ప్రదర్శన విధానం**

గొల్లసుద్దుల ప్రదర్శనలో కథకులు నేరుగా రంగస్థలం పైకి రావు. వారు ప్రేక్షకుల మధ్య నుంచే ప్రవేశిస్తారు. గొఱ్ఱెలను అదిలించినట్లు, తప్పిపోయిన గొఱ్ఱెలను వెతికినట్లు, తోడేళ్లను తరిమినట్లు నటిస్తూ, హడావిడి చేస్తూ రంగస్థలానికి చేరుకుంటారు. ఈ విధానం ప్రేక్షకు లలో ఆసక్తిని పెంచుతుంది.రంగస్థలానికి వచ్చిన తరువాత కథకులు హాస్య సంభాషణలు, చమత్కారాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటారు. అనంతరం నృత్యం, గానం, సంభాషణలతో కథను కొనసాగిస్తారు.

ముందుగా ప్రధాన కథకుడు వేదిక మీదికి వచ్చి, మిగిలిన ఇద్దరిని పాట రూపంలో పిలుస్తాడు.

ఓరి రంగన్నో...యాడుబోయిండో ఈడు... ఓరి రంగన్న ఇట్ల లాభంలేదు పాటతో పిలుస్త

ఎల్లన్న : రారో రంగన్న- బిరాన ఇటురారో
॥రారో రంగన్న॥

రాజులు మారిన గాని రాజ్యాలు మారిన గాని మారలేదు మన బతుకులు తీరలేదు మన బాధలు ॥రారో రంగన్న॥

**రంగన్న వచనం : వత్తన్న తన్న తన్న .... (పాట)**

ఏందే ఎల్లన్న గిప్పుడేమయ్యింది

ఎంది ఎల్లన్న మనరాతిలిట్లుండ- మార్చేది ఎవ్వరో మన రాతలు॥

పొద్దువోని సుద్దులేల జెపుతావే ఎల్లన్న
॥ఎందే ఎల్లన్న ॥

ఎందే ఎల్లన్న లొట్టిమీది కాకిలెక్క ఒక్కు తీర్గ మొత్తుకొబడితివి ఏమయ్యిందే నీకు? ఎల్లన్న తిట్టేనోరు, తిరిగేకాలు ఉరుకోదన్నట్టు, నాకేదన్న తెలిస్తే మీకు జెప్పందే మనుసునపట్టదురా.

రంగన్న : అయితే గదేందో జెప్పరాదు.

ఎల్లన్న : చెపుతగాని మల్లన్నేడిరా? పిలిచి చూస్త...
॥ రారో మల్లన్న॥

రారో మల్లన్న రాతిరెక్కువైపాయె గొర్ల మంద కాడనే పొద్దుపోతున్నది మాటమాట జెప్పు కుంట మందకాడికి పోదాం ॥రారో మల్లన్న॥

మల్లన్న : (వచ్చి) ఎందే ఎల్లన్న పిలుపుమీద పిలుపెత్తవు సంసారం సంతలోన సింతలెక్కువైపాయె బతుకు మీద తీపిఏమొ గింతన్న లేకపాయె అలుపు సొలుపు లేకుండా పిలుపు మీద పిలుపెత్తవ్ ॥ఏందే ఎల్లన్న ॥

ఇట్ల జెప్పుకుంటూ సమస్యలను, పరిష్కారాలను సుద్దుల్లో చెపుతారు. పాడేటి పాటలలో సమాజంలోని చెడును తొలిగించే ప్రయత్నం కనపడుతుంది. రంగ స్థలానికి వచ్చిన తరువాత కథకులు హాస్య సంభాషణలు, చమత్కారాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటారు. అనంతరం నృత్యం, గానం, సంభాషణలతో కథను కొనసాగిస్తారు. ఈ కళారూపాలు వినోదాన్ని అందించటమే కాకుండా విజ్ఞానదాయకంగా కూడా ఉంటాయి. అనాదిగా ప్రదర్శిస్తున్న ఈ కళారూపాలు ఇటీవలి కాలంలో ప్రజా ఉద్యమాల్లోను, ప్రభుత్వ కార్యక్రమాలైన అక్షరాస్యత, ఆరోగ్యం, పర్యావరణం, ఎయిడ్స్ నిర్మూలన, కుటుంబ

నియంత్రణ, వ్యవసాయం మొదలైన అంశాలను ప్రజల్లోనికి తీసుకెళ్ళినాయి. అంతేకాకుండా తెలంగాణ ఉద్యమంలో ఎన్నో కళాబృందాలు ఈ ప్రదర్శన ద్వారా తెలంగాణ సాధనను సుసంపన్నం చేశాయి.

## గొల్లల సామాజిక జీవన చిత్రణ

గొల్లలు లేదా యాదవులు ప్రధానంగా పశుపోషణ వృత్తిని నిర్వహిస్తారు. ఆవులు, గొఱ్ఱెల మందలను పెంచడం వారి జీవనాధారం. గొల్లలలో అనేక ఉప కులాలు ఉన్నప్పటికీ ఎక్కువ సంఖ్యలో ఎఱ్ఱ గొల్లలు ఉంటారు. గొల్లసుద్దులను చెప్పేవారు కూడా ఎక్కువగా ఎఱ్ఱ గొల్లలే.యాదవులకు ప్రధాన దేవతగా గంగమ్మను భావిస్తారు. గంగమ్మకు జాతరలు, పూజలు నిర్వహిస్తారు. దొనకొండ, అలవలపాడు వంటి ప్రాంతాలలో ఈ జాతరలు జరుగుతాయి. పండితులు ఈ గంగపూజలను వీరపూజలుగా పేర్కొన్నారు. గొల్లలు సాధారణంగా వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించినప్పటికీ కొందరు శైవ సంప్రదాయాన్ని కూడా అనుసరిస్తారు. గతకాలంలో సమాజంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల తరువాత గొల్లలకు ముఖ్యమైన స్థానం ఉందని చెబుతారు.

గొల్లసుద్దులతో ప్రత్యక్ష సంబంధం లేకపోయినా గొల్ల కలాపం అనే మరో జానపద రూపం యాదవుల గొప్ప తనాన్ని తర్కంతో వివరించే కళారూపం. ఇందులో పురాణ కథలను ఆధారంగా తీసుకొని కులవ్యవస్థపై విమర్శ చేయబడుతుంది. ఈ కలాపంలో మనుషులూ ఒకే మూలానికి చెందినవారని పురాణ తర్కంతో వివరిస్తారు. అందువల్ల సమాజంలో కులవివక్ష ఉండకూడదనే భావాన్ని తెలియజేస్తారు.

## యాదవుల ఇతర కళారూపాలు

యాదవ సమాజంలో వివిధ రకాల జానపద కళా రూపాలు ఉన్నాయి. కొందరు కళాకారులు ఆడవేషం వేసుకుని గజ్జెలు కట్టి నృత్యంతో కథలు చెప్పుతారు. వారు ముఖ్యంగా బల్ గురి కొండయ్య కథలను వినిపిస్తారు. మరికొందరు ఎల్లమ్మ కథలను చెబుతూ జీవనం సాగిస్తారు. కుర్మోళ్ళు అనే తెగకు చెందిన వారు బీరప్ప కథలను చెబుతారు. గొల్ల భాగోతులు అనే కళాకారులు వీధి నాటకాలు ప్రదర్శిస్తారు. చిరుతొండ,చంద్రకాంత, మాంధాత, విప్రనారాయణ వంటి నాటకాలను ఆడతారు. మరో తెగకు చెందిన కళాకారులు చెక్క బొమ్మలను ఉపయోగించి కథలు చెబుతారు. పెద్దిరాజు కథ, కాటమ రాజు కథ, గొల్ల కరివెళ్ళ రాజు యుద్ధం వంటి కథలను వారు ప్రదర్శిస్తారు.

సాంప్రదాయ గొల్ల సుద్దులను ఒక శక్తివంతమైన సామాజిక ఆయుధంగా మార్చిన ప్రజాకవి సుద్దాల హన్మంతు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో, నిజాం రజాకార్ల అరాచకాలను ఎండగట్టడానికి ఆయన ఈ కళా రూపాన్ని ఎంచుకున్నారు. ఆయన గొల్ల సుద్దులలో సాధారణంగా దేవతా మూర్తుల (మల్లన్న, కాటమరాజు) కథలు ఉంటాయి. కానీ హన్మంతు గారు ఆ బాణీలను అలాగే ఉంచి, సాహిత్యాన్ని మాత్రం రాజకీయ చైతన్యం, వెట్టి చాకిరి నిర్మూలన, మరియు రైతు పోరాటాల వైపు మళ్లించారు. ఆయన రాసిన సుద్దులు పల్లెల్లో విప్లవ జ్వాలలు రగిలించాయి. వాటిలో నిజాం అరాచకాలపై "వినురా భారతీయుడా.. వీరగాథా వినురా.. నిజాం రాజుల ఆగడాలను కళ్ళకు కట్టినట్లు వినురా.." అంటూ సాగే సుద్దులు అప్పట్లో ప్రతి ఇంట్లో వినిపించేవి. భూస్వాముల దగ్గర బానిసలుగా బతికే ప్రజలను మేల్కొలుపుతూ, వారి హక్కుల కోసం పోరాడమని సుద్దుల రూపంలో పిలుపునిచ్చారు. పల్లెటూరి పిల్లగాడా పాట రూపంలో ఉన్నప్పటికీ, దీని మూలాలు జానపద సుద్దుల శైలిలోనే ఉంటాయి. పశువులు కాసే పిల్లల కష్టాలను ఇందులో వివరించారు. అల్లూరి సీతారామరాజు వీరగాధను గొల్ల సుద్దుల రూపంలో రామాంజనేయులు "మన్యం విప్లవం" అనే పేరులు రచించారు.ఇది ముద్రితం కానప్పటికీ ప్రదర్శనల ద్వారా ప్రజలలో విశేష ఆదరణ పొందింది.

## చలనచిత్రాలలో గొల్ల సుద్దుల ప్రతిబింబం

గొల్ల సుద్దులు పూర్తి స్థాయిలో ప్రధాన కథగా వచ్చిన సినిమాలు చాలా అరుదు. అయితే, అనేక సినిమాల్లో ఈ కళారూపం పాటలు, సన్నివేశాలు, పాత్రల రూపంలో కనిపిస్తుంది. ప్రధానంగా ఈ ప్రభావం కనిపించే సినిమా

లలో మా భూమి ఒకటి. తెలంగాణ గ్రామీణ జీవితం ఆధారంగా తీసిన చిత్రం. ఈ సినిమాలో జానపద కళలు, ప్రజా గీతాలు విస్తృతంగా చూపించబడ్డాయి. గొల్ల సుద్దుల శైలి, భావం స్పష్టంగా ప్రతిబింబిస్తుంది.

ఒసేయ్ రాములమ్మ సినిమాలో జానపద గీతాలు, సామాజిక విమర్శలలో గొల్ల సుద్దుల శైలి కనిపిస్తుంది. రంగస్థలం సినిమాలో గ్రామీణ నేపథ్యం, స్థానిక సంస్కృతి పాత్రల, మాటతీరు, హాస్య శైలి గొల్ల సుద్దులను గుర్తు చేస్తుంది. RRR సినిమాలో కొమురం భీముడో పాటల రూపంలో జానపద శైలి, గొల్ల సుద్దుల లాంటి భావ వ్యక్తీకరణ, ప్రజా ధోరణి కనబడుతుంది. బలగం సినిమాలో తెలంగాణ గ్రామీణ సంస్కృతిని చూపించింది. ఈ చిత్రంలో జానపద కళల భావజాలం, సంభాషణల్లో గొల్ల సుద్దుల ప్రభావం కనిపిస్తుంది.

**ముగింపు**

గొల్లసుద్దులు తెలంగాణ ప్రాంతాల జానపద సంస్కృతిలో ఒక విలువైన సంప్రదాయ కళారూపం, యాదవుల చరిత్ర, పురాణ గాథలు, సామాజిక విలువలను ప్రజలకు చేరవేయడంలో ఈ కళాకారులు కీలక పాత్ర పోషించారు. కథ, గానం, నృత్యం, హాస్యం కలిసిన ఈ కళారూపం గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే అమూల్య సంపదగా నిలిచింది.ఆధునిక కాలంలో గొల్ల సుద్దులు కేవలం భక్తికే పరిమితం కాకుండా, సమాజంలోని మూఢనమ్మకాలు మరియు దురాచారాలను వ్యంగ్యంగా ఎత్తిచూపడానికి ఉపయోగపడుతున్నాయి. కావున ఈ కళారూపాన్ని సంరక్షించడం, పరిశోధించడం మరియు తదుపరి తరాలకు పరిచయం చేయడం మన అందరి బాధ్యతగా భావించాలి.

**ఆధార గ్రంథాలు**


1. జానపద నృత్యాలు- నేదునూరి గంగాధరం
2. కాటమరాజు కథలు - డా. తంగిరాల వెంకట సుబ్బారావు
3. ప్రజా కళారూపాలు డా- జయధీర్ తిరుమలరావు
4. జానపద విజ్ఞానం - ఆర్వీయస్ సుందరం
5. జానపద కళాసంపద - తూమాటి దోణప్ప
6. జానపద నృత్య కళ- డా. చిగిచెర్ల కృష్ణారెడ్డి
7. దశావతార చరిత్ర- శ్రీనాధుడు
8. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతా పరెడ్డి
9. 8వ తరగతి తెలుగు పాఠ్య పుస్తకం


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# పగటి వేషాలు : బహురూప నటనలో దాగి ఉన్న సామాజిక అస్తిత్వం



– బొడ్డు భరద్వాజ

స్కూల్ అసిస్టెంట్ - తెలుగు, ప్రాథమికోన్నత పాఠశాల అంబం (ఎడపల్లి), జిల్లా: నిజామాబాద్.

**వ్యాస సంగ్రహం :**

మన తెలుగు నేల మీద పురుడు పోసుకున్న జానపద కళలు కేవలం వినోదానికి మాత్రమే పరిమితమైనవి కావు. కళారూపాలన్నీ సామాన్యుడి కష్టసుఖాలకు, కళలకు సజీవ సాక్ష్యాలు. జానపద కళలు మన సంస్కృతిలో భాగం. అవి నాలుగు కాలాల్లో మనల్ని నవ్వించేవి మాత్రమే కావు. అవి తరతరాలుగా సామాన్యుడి ప్రాణస్పందనలు. పల్లెల్లో పుట్టిన ఈ కళలు సమాజంలో అట్టడుగు వర్గాలకు గౌరవాన్ని ఇస్తాయి. ఒగ్గుకథ, చిందు యక్షగానం, తోలు బొమ్మలాట, బుర్రకథ , పగటి వేషాలు వంటి కళలు శ్రమజీవుల చెమట నుంచి, కుల వృత్తుల నేపథ్యం నుంచి పుట్టాయి. దళిత, బహుజన సమాజాలు తమ ఉనికిని చాటుకోవడానికి, అణిచివేతను ప్రశ్నించడానికి ఈ కళల్ని సాంస్కృతిక ఆయుధంగా మలిచాయి. ఈ కళలు పురాణాలకే పరిమితం కావు. సామాజిక రుగ్మతలపై సమరం చేశాయి. చాలా జానపద కళారూపాలు మతపరంగానో, కులపరంగానో, వాద్యాలపేరుతోనో పిలువబడితే కేవలం ప్రదర్శనా సమయాన్ని బట్టి పిలువబడేది పగటివేషాలు. పగటి వేషాలలో ఉండే గొప్పతనం ఇతరుల్ని నమ్మించడం. ఒకనాటి పరిపాలకుల దృష్టికి ప్రజల సమస్యలను తీసుకు రావడం, వార్తలను చేరవేయడం కొరకు ప్రధానంగా ఈ ప్రదర్శనలు ప్రచారంలోకి వచ్చాయని ప్రతీతి. అనేకమైన వేషాలు ప్రదర్శింపబడడంచేత, పగటిపూటనే ప్రదర్శింపబడడంచేత ఇవి పగటి వేషలయ్యాయి. పగటి వేషాలనే "పైటేషాలు" అని కూడా అంటారు.

పగటి వేషాలు జానపద కళారూపాల్లో ప్రముఖమైనవి. యక్షగానం, వీధి నాటకాలనుండి "బ్రోకెన్ డౌన్ మిత్" అన్న వాదం ప్రకారం వీధినాటకాలే పగటివేషాలుగా మారాయని పరిశోధకుల అభిప్రాయం. ప్రదర్శించే వేళను బట్టి, సమయాన్ని బట్టి వీటికి పగటివేషాలని పేరు వచ్చింది. కేవలం పగటిపూట మాత్రమే వీటిని ప్రదర్శిస్తారు. జనవ్యవహారంలో ఉన్నకథలను బట్టి పగటివేషాలు రాజు కళింగ గంగుకథ, సంబెట గురవ రాజు కథ, విజయనగర రాజుల కథలు ప్రస్తావన లోకొస్తాయి. కృష్ణా జిల్లాలోని కూచిపూడి భాగవత కథా ప్రదర్శనలకు ప్రత్యేకత అయితే, గడ్డిపాడు పగటి వేషాలకు ప్రసిద్ధిపొందింది. గడ్డిపాడు వారు సుమారు 60 రకాల వేషాలను ప్రదర్శించేవారు. పగటి వేషల గురించి మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, ప్రొ. ఎస్. గంగప్ప గారు పరిశోధించి పగటి వేషాలు, కూచిపూడి భాగవతులు ప్రదర్శించే వారని, ఈ వేషాలను పగటి వేషాలుగా వివరించారు. పగటి వేషాలకు చారిత్రకాధారాలున్నాయి. భిక్షుకవృత్తిగా ప్రారంభమైన ఈ కళ కాలక్రమంలో ఒక సంక్లిష్ట రూపంగా మారింది. శాత

వాహనుల పరిపాలనా కాలము నుండే ఈ కళారూపం ఉందని, హాలుని గాథాసప్తశతిలో దీని ప్రస్తావన ఉన్నట్లు తెలుస్తోంది. మార్గ, దేశి, శిష్ట సాహిత్య లక్షణాలన్ని మూర్తీభవించిన కళ పగటివేషాలు.

భరత కోశంలో, సర్వేశ్వర శతకంలో, పండితారాధ్య చరిత్రలో పగటివేషాల వివరణ కనిపిస్తుంది. భారత దేశంలో స్వతంత్ర, సామంతరాజుల పాలనలో ఈ పగటి వేషాలు చాలా ప్రచారంలోకి వచ్చాయని అంటారు. రకరకాల మారువేషాలు ధరించి గూఢాచారులుగా వీరు సమాచారాన్ని అందించేవారని చరిత్ర చెబుతుంది. పగటి వేషాలద్వారా కాకతీయుల యుగంలో మంత్రి యుగంధరుడు, పిచ్చి యుగందరుడుగా నటించి ఢిల్లీ సుల్తానులను జయించడం పేర్కొనబడింది.

**కీలక పదాలు :**

జానపద కళలు, సాంస్కృతిక వారసత్వం, సామాజిక చైతన్యం, తెలుగు జానపద సంప్రదాయం, సాంస్కృతిక పరిరక్షణ, బుర్రకథ, తోలుబొమ్మలాట.

**పరిచయం :**

పల్లెటూళ్లలో సాయంత్రం అయిందంటే చాలు, గుడి ఉత్సవాలకైనా, కోలాటాలకైనా జనమంతా రాత్రంతా నిద్రను మర్చిపోయి ఒకచోట గుమిగూడి, కళాకారుల ప్రదర్శనలో నిమగ్నమయ్యేవారు. ఒక తరం నుంచి ఇంకో తరానికి నోటి మాటల ద్వారా, ప్రత్యక్ష అనుభవాల ద్వారా ఈ కళలు బదిలీ అవుతూ వచ్చాయి. ఇవి పాటలు, నృత్యాలు, బొమ్మలాటలు లాంటి ఎన్నో రూపాల్లో వ్యక్తమవుతాయి. సామాజిక కోణంలో చూస్తే, నాటి కుల వ్యవస్థ, లింగ వివక్ష, మత విశ్వాసాలు ఇవన్నీ వీటిలో స్పష్టంగా కనిపిస్తాయి. జానపద కళారూపాలు ఒక సమాజంలో పుట్టి, తరతరాలుగా మౌఖికంగా లేదా ప్రత్యక్ష అనుభవం ద్వారా ప్రసారమయ్యే కళాత్మక వ్యక్తీకరణలు. ఇవి పాట, నృత్యం, నాటకం, కథాకథనం, బొమ్మలాట వంటి వివిధ రూపాలలో వ్యక్తమవుతాయి. ఈ కళలను కేవలం వినోదంగా చూడడం సరికాదు. వాటికి లోతైన, విస్తృతమైన అర్థాలు ఉన్నాయి. సామాజిక దృష్టికోణం నుండి చూస్తే, జానపద కళారూపాలు సమాజంలోని అధికార సంబంధాలను, మత విశ్వాసాలను, ఆర్థిక సంఘర్షణలను సూక్ష్మంగా ప్రతిబింబిస్తాయి.

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వందలాది జానపద కళారూపాలు ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి. బుర్రకథ, తోలుబొమ్మలాట, హరికథ, వీధి నాటకం, ఒగ్గుకథ, జముకుల కథ, డప్పు కళ, గుస్సాడి నృత్యం, పగటి వేషాలు. ఇవి కొన్ని ప్రసిద్ధమైన ఉదాహరణలు. ప్రతి కళారూపానికి ఒక ప్రత్యేకమైన భౌగోళిక, సాంస్కృతిక, చారిత్రక నేపథ్యం ఉంది. ఆధునికీకరణ, పట్టణీకరణ, మరియు డిజిటల్ వినోదం వేగంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో ఈ కళలు అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నాయి. ప్రేక్షకుల సంఖ్య తగ్గిపోవడం, కళాకారులకు ఆర్థిక భద్రత లేకపోవడం, తరువాతి తరానికి ఈ కళలు అందించే విద్యా వ్యవస్థ బలహీనపడటం ఇవి ప్రధాన సమస్యలు. అయినప్పటికీ, ఈ కళలు పూర్తిగా అంతరించిపోలేదు. అవి రూపాంతరం చెందుతూ, కొత్త మాధ్యమాలలో తమ స్థానం కనుగొంటున్నాయి.

**సాహిత్య సమీక్ష :**

తెలుగు జానపద కళా ప్రపంచంలో 'పగటి వేషాలు' ఒక విలక్షణమైన ప్రక్రియ. రాత్రివేళల్లో ప్రదర్శించే వీధి నాటకాలకు భిన్నంగా, కేవలం సూర్యరశ్మి ఉన్నప్పుడే ప్రదర్శింపబడటం వల్ల వీటికి ఈ పేరు వచ్చింది. ఇవి కేవలం వినోద సాధనాలు మాత్రమే కాదు, సామాజిక చైతన్యాన్ని, వ్యంగ్యాన్ని మరియు మన సంస్కృతిని ప్రతిబింబించే అద్దాలు. జానపద కళారూపాలు మతపరంగానో, కులపరంగానో, వాద్యాల పేరుతోనో పిలువబడితే కేవలం ప్రదర్శనా సమయాన్ని బట్టి పిలువబడేది పగటివేషాలు. అనేకమైన వేషాలు ప్రదర్శింపబడడంచేత, పగటిపూటనే ప్రదర్శింపబడడంచేత పగటివేషలయ్యాయి. పగటి వేషాలనే పైటేషాలని కూడా అంటారు. పగటివేషాలు కేవలం వేషధారణలు మాత్రమే కాదు, అవి తెలుగు వారి సంస్కృతికి, భాషా వైవిధ్యానికి నిలువుటద్దాలు. రాయల సీమలో 'పగలేసిగాళ్లు' అని పిలవబడే ఈ కళాకారులు సహజత్వమే ప్రాణంగా జీవిస్తున్నారు. పగటివేషాల్లో కొన్నింటిలో సంభాషణలకు ప్రాధాన్యత ఉంటే మరి

కొన్నింటిలో పద్యాలకు, అడుగులకు, వాద్యాలకు ప్రాధాన్యత ఉంటుంది. బుడబుక్కల వేషం, ఎరుకలసాని వేషం, బోడి బ్రాహ్మణ స్త్రీ వేషం వంటి వాటిలో సంభాషణ లకు ప్రాముఖ్యత ఉంటుంది. పురాణ వేషల్లో హార్మోనియం, తబలా వంటి వాద్యాలతో పాటు యక్షగాన శైలిలో ప్రదర్శన ఉంటుంది. కుల సంబంధమైన పగటి వేషాలు సంఘంలోని అనేక కులాల వారి జీవనవిధానాన్ని వ్యంగ్యంగా ప్రదర్శిస్తాయి. ప్రతి కులాన్ని గురించి తెలియచేస్తూ ఆ కులాలపై సమాజం యొక్క అభిప్రాయా లను విమర్శిస్తాయి.

**పగటి వేషాల చారిత్రకత :**

పగటి వేషాల మూలాలు చాలా ప్రాచీనమైనవి. భరతుని నాట్యశాస్త్రం నాటి నుండే ప్రస్తావనలో ఉన్న 'బహురూపుల' విద్యే నేటి పగటి వేషాలకు పునాది. ఒకప్పుడు ఇవి వీధినాటకాలలో భాగంగా ఉండేవి. కాలక్రమేణా, నాటకాల్లోని పాత్రలు విడివడి, స్వతంత్రంగా ప్రజల ముందుకు వచ్చి 'పగటి వేషాలు'గా స్థిరపడ్డాయి. శాతవాహనుల పరిపాలనా కాలమందే ఈ కళారూపం ఉందని, హాలుని గాథాసప్తశతిలో దీని ప్రస్తావన ఉన్నట్లు తెలుస్తోంది. మార్గ, దేశి, శిష్ఠ సాహిత్య లక్షణాలన్ని మూర్తీ భవించిన కళ పగటివేషాలు. విజయనగర సామ్రాజ్య కాలంలో ఈ కళాకారులు గూఢచారులుగా కూడా పనిచేస్తూ, శత్రువుల రహస్యాలను సేకరించడంలో కీలక పాత్ర పోషించేవారని చరిత్ర చెబుతోంది. జన వ్యవహారంలో ఉన్న కథలను బట్టి పగటివేషాలు రాజు కళింగ గంగుకథ, సంబెట గురవ రాజు కథ, విజయనగర రాజుల కథలు ప్రస్తావనలోకి వస్తాయి. పగటి వేషాలకు చారిత్రకాధారాలున్నాయి. భిక్షుకవృత్తిగా ప్రారంభమైన ఈ కళ కాలక్రమంలో ఒక సంక్లిష్ట రూపంగా మారింది.

పురాణకాలంనుంచీ ఈ పగటి వేషాలు వేయటం ఆనవాయితీగా వస్తోందని పెద్దల అభిప్రాయం. దశరథుడు సంతానం కోసం పరితపిస్తున్నప్పుడు విష్ణువు బుడబుక్కల వేషంలో వచ్చి, యాగ రహస్యం చెప్పాడు. ఈ వేషధారణ కోసం డుంబకాసురుడు అనే రాక్షసుని చంపి, ఆతని దేహాన్ని బుడబుక్కల వానీగాను, నరాలు రాళ్ళుగాను, మెడను మైనంగానూ విష్ణువు ఉపయోగించాడని చెపుతూ వుంటారు. ఒకనాడు భారత దేశంలో స్వతంత్ర సామంత రాజుల పరిపాలనలోనూ, చిత్ర విచిత్ర వేషాలు వ్యాప్తి లోకి వచ్చాయని ప్రతీతి. గూఢచారులుగా మారు వేషాలు ధరించి, వర్తమానాలు చేరవేసే బారులుగానూ, రత్నాలు పచ్చలు కెంపులు అమ్మే వ్యాపారులు గాను, రాణులు ధరించే ఖరీదైన చీరల వర్తకులుగానూ చిత్ర విచిత్రమైన మారువేషాలతో కోటల్లో జొరబడి, ఒక రాజు మరొక రాజును వంచించడం, కోట లోని గుట్టుమట్టులూ, బలహీనతలూ తెలుసుకుని యుద్ధం ప్రకటించడం జరుగుతూ వుండేది. ఈ విధంగా బయలు దేరినవే పగటి వేషాలు.

ఇలా ఎన్ని ఉదాహరణల నైనా మన చరిత్రల నుంచి తీసి చూడవచ్చు. కాని పగటివేషాల చరిత్ర మాత్రం మనకు సరిగా లభించడం లేదు. కాని రెండు మూడు వందల సంవత్సరాల క్రితం మైసూరు ప్రాంతం నుంచి పల్లావఝుల వెంకటరామయ్య అనే ఆయన వచ్చి రేపల్లెలో వుండిపోయి కొంత మందికి పగటి వేషాలు నేర్పి, ప్రదర్శించి, ఆంధ్ర ప్రజల మన్నన పొందారట. క్రమాను గతంగా ఆ పగటి వేషధారులకు, తరువాత, గడ్డి పాడు నివాసస్థానమైందని శ్రీనివాస చక్రవర్తి గారు తమ నాట్యకళ గ్రంథంలో వివరించారు.

**గడ్డిపాడు పగటి వేషధారులు :**

వీధి భాగవతాలకు కూచిపూడి ఎలా కేంద్ర మైందో అలాగే పగటి వేషధారులకు గట్టిపాడు కేంద్రమైంది. కృష్ణా జిల్లాలో మైలు దూరంలో వున్న గడ్డిపాడు (హనుమంత రాయపుర అగ్రహారం) ఈ భాగవతులకు కేంద్రం. గడ్డిపాడు భాగవతులుగా ప్రసిద్ధి పొందినవారు పల్లా వఝుల వారు, శ్రీకారం వారు, చూచివారు, కనుపూరి వారు, బెల్లంకొండవారు, బాపట్ల వారు, కవులవారు మొదలైన వారందరూ గడ్డిపాడు భాగవతులే. వీరందరికీ గురువు మైసూరు తెలుగు బ్రాహ్మణుడు. పల్లావఝుల వెంకటరామయ్య. వీరి ప్రతిభ ననుసరించి చూస్తే తెలుగు దేశంలో కంటే మైసూరులో పగటి వేషాలు ఎక్కువగా వ్యాప్తిలో వున్నట్లు తెలుస్తూ వుందని శ్రీనివాస చక్రవర్తి

గారు తమ నాట్యకళ గ్రంథంలో వివరించారు. రెండు శతాబ్దాలకు పూర్వం వచ్చిన పల్లావఝల వెంకట రామయ్యగారు ఆంధ్ర దేశంలో పగటి వేషాలతో సంచారం చేసి చివరకు రేపల్లెలో స్థిరపడి కృష్ణాజిల్లా గడ్డిపాటి వారికి ఈ విద్యను నేర్పి ఆర్యులైనారు. ఆంధ్ర దేశంలో పగటి వేషాలకు భిక్ష పెట్టినవారు గడ్డిపాడు పగటి వేషధారులే. ఆ గ్రామంలో అందరూ పగటి వేషాలు వేయగల సమర్థులుగా వుండేవారు. వారు దాదాపు అరవై రకాల చిత్ర విచిత్ర మైన పగటి వేషాలను ధరించే వారు. ఆ పగటి వేషాలలో నిత్య జీవితానికి సంబందించినవి కొన్ని, హాస్య రసంతో కూడుకొన్నవి కొన్ని మరికొన్ని పౌరాణిక వేషాలు, కల్పనా వేషాలూ, కొన్ని కేవలం హాస్య రసంతో కూడుకున్నవి. మొత్తంమీద సంఘంలో వుండే అన్ని జాతీయ పాత్రలూ వీరి వేషాల్లో మూర్తీభవించి వుండేది.

**వేషగాండ్ల ప్రతిభ :**

వేషం ఊరికే ధరించడం కాక నిజమని ప్రజలను నమ్మించేవారు. గొఱ్ఱెలు కాచే గొల్లల పాత్రలు ధరించి, సుద్దులు చెపితే అక్షరాలా గొఱ్ఱెల కాపరులను గుర్తుకు తెచ్చేవారు. వేషం వెయ్య వచ్చును కాని దానిని నమ్మించడం ఎలా? అదే గడ్డిపాడు పగటి వేషధారుల్లో వున్న ప్రత్యేకత. తెలుగు దేశంలో వర్గాలూ, కులాలూ, జాతులు వున్నాయో ఆయా జాతులకు సంబంధించిన అన్ని భాషలనూ ఆకళింపు చేసుకుని వారు ధరించే ప్రతి పాత్రకూ సాహిత్యాన్ని కల్పించి స్వతంత్రం చేసుకునే వారు. అన్ని మనస్తత్వాలనూ, ఆటనూ, పాటనూ, మాటనూ, ఉచ్చారణనూ, వేషధారణనూ, ఒంపులూ వయ్యారాలనూ విధిగా ఒక విద్యగా అభ్యసించేవారు. అందువల్లనే వారు పగటి వేషాల్లో ప్రఖ్యాతి వహించారు. పగటి వేషధారులు అంటే గడ్డిపాటి వారే ననీ, ఆ ప్రతిభకు వారే అర్హులనీ తేలి పోతుంది.

పగటి వేషాలు ఒకప్పుడు దాదాపుగా 64 ఉండేవని, కాని ఇప్పుడు 32 వేషాలు మాత్రమే వేస్తున్నామని నంద్యాల కళాకారులు అంటారు. ఇతివృత్తం ఆధారంగా పగటి వేషాలను ఐదు విధాలుగా విభజించవచ్చు. మతపరమైనవి: ఆదిబైరాగి వేషం, చాత్తాది వైష్ణవ వేషం, కొమ్ము దాసరి వేషం, హరిదాసు వేషం, ఫకీరు వేషం, సాహెబుల వేషం. బుడబుక్కల వేషం, సోమయాజులు, సోమిదేవమ్మ వేషం, బోడి బ్రాహ్మణ స్త్రీ వేషం, వీరబాహు వేషం, గొల్లబోయిడు వేషం, కోయ వాళ్ళ వేషం, దేవరశెట్టి వేషం, దేవాంగుల వేషం, ఎరుకలసోది వేషం వంటివి. పురాణపరమైనవి: జంగం దేవర వేషం, శక్తి లేదా శూర్పణఖ వేషం, అర్థనారీశ్వర వేషం వంటివి. జంతు ప్రదర్శన పరమైనవి: గంగిరెద్దుల వేషం, పాములోల్ల వేషం, ఇతరములు: పిట్టలదొర వేషం, చిట్టి పంతులు వేషం, కాటికావిళ్ళ వేషం వంటివి.

**ప్రాచీనకాలం నుండి ప్రచారంలో ఉన్న పగటివేషాలు :**

ఎన్నో సంవత్సరాల నుండీ జానపద కళారూపాలు ఎలా ప్రచారంలో వున్నాయో అలాగే ఈ పగటి వేషాలు కూడా ప్రచారంలో వున్నాయి. ఈ నాటి పగటి వేషాలను పూర్వం, బహురూపాలని పిలిచేవారు. బహురూపాల గూర్చి భరత కోశంలో ఈ క్రింది విధంగా ఉంది.

దేశి నృత్య నానావేష ధరం.<br>
యత్తత్ బహురూప మితీరితమ్

(భరత కోశం పుట 418)

యథావాక్కుల అన్నమయ్యచే రచింపబడిన సర్వేశ్వర శతకంలో నాటక ప్రదర్శనాలను గురించి ఈ క్రింది పద్యం ద్వారా నాటకాలు బహురూపాలని వివరించాడు.

అమరంగా నప్పట భక్తి నాటకము భాషాంగ క్రియాంగాభి, ర<br>
మ్యముగాఁ జూపిన మెచ్చి నీ విలబలే యన్నంతకున్ యోనిగే<br>
హములన్ రూపులు నన్నుకొంచును నటుండై వచ్చి సంసార రం<br>
గములోనన్ బహురూప మాడు వెలయంగా జీవి సర్వేశ్వరా!

(సర్వేశ్వర శతకం. 20 వ పద్యం)

నాటకాలు బహురూపాలని పాల్కురుకి సోమనాథుడు కూడా (బసవ పురాణంలో) వివరించాడు.

అటుగాక సాంగభాషాంగ క్రియాంగ
పటునాటకంబుల నటియించువారు.

బహురూపాలంటే ఒకే వ్యక్తి వివిధ పాత్రల్ని ధరించటం. అవి పగటి వేషాలు కావచ్చు. పండితారాధ్య చరిత్ర పర్వత ప్రకరణంలో సోమనాథుడు ఇలా అన్నాడు.

ప్రమథ పురాతన వటు చరిత్రముల
గ్రమంద బహు నాటకములాడు వారు
లలితాంగరస కలంకార రేఖ
లలవడ బహురూప మాడేడి వారు.

అలాగే క్రీడాభిరామంలో, 'అనీ లెస్సగాగ కిరాట యీలేమ చరిత మాడుదురు నాటకంబుగ అవనిలోన' అనీ విస్పష్టంగా చెప్పటం వలన పూర్వం ఏదో ఒక విధమైన నాటకాలు ఆడేవారని తెలుస్తుంది.

శ్రీశైలంలో శివరాత్రి ఉత్సవాలలో ఈ నాటకాలను ప్రదర్శించే వారు, ఆనాడు ఈ రూపకాలకు ఎక్కువ ప్రచారం ఉన్నట్లు సోమనాథుని పండితారాధ్య చరిత్ర వల్ల తెలుస్తూ వుంది. శివాజీకి సింహగడ విజయాన్ని చేకూర్చిన వాడు 'తానాజీ మాల్ సురే'. తానాజీ, మరి కొందరు మరాఠీ సైనికులు గాయకుల వేషాలతో కోటలో ప్రవేశించి దానిని జయించారు. జానపథ గాథల పద్ధతిని రాజకీయాలకు ఉపయోగించిన వారిలో ప్రథముడు తానాజీ. అంతేగాక కళింగ గంగరాజు పగటి వేషాలవారి సహాయంతో శత్రువుల్ని జయించాడనే కథ కూడ వుంది.

కాకతీయ యుగంలో యుగంధరుడు మహామంత్రి పిచ్చి యుగంధరుడుగా నటించి 'ఢిల్లీ సుల్తాన్ పట్టుకపోతాన్ ఆర్నేల్లకు పట్టుకు పోతాన్, వీరణ్ణి రాగణ్ణి మన్ను చేయిస్తాన్, గోతిలో పెట్టించి ఘోరి కట్టిస్తాన్' అంటూ భువనభోంతరాలు దద్దరిల్లగా గర్జిస్తూ పగటి వేషంతోనే ఢిల్లీ పురవీధులను అల్లకల్లోలం చేస్తూ తిరిగినాడు.

**పగటివేషాల విశ్లేషణ :**

పగటిపూట మాత్రమే ప్రదర్శించడం వల్ల వీటికి 'పగటి వేషాలు' అనే పేరు వచ్చింది. రాత్రిపూట ప్రదర్శించే వీధినాటకాల నుండి ఇవి పుట్టాయని చరిత్రకారుల అభిప్రాయం. **రంగస్థలం :** వీటికి ప్రత్యేకమైన స్టేజీ లేదా థియేటర్ ఉండదు. వీధులు, కూడళ్ళు, ఇంటి ముంగిట, రచ్చబండలే వీరి ప్రదర్శనా వేదికలు.

**కళాకారుల జీవనశైలి :**

వీరిని 'బహురూపులు' అని కూడా అంటారు. వీరు ఒక ఊరికి వెళ్తే నెలల తరబడి అక్కడే ఉండి, ప్రతిరోజూ ఒక కొత్త వేషం ప్రదర్శిస్తారు. చివరి రోజున అందరి ఇళ్లకూ తిరిగి 'సంభావనలు' (బహుమతులు,డబ్బు) సేకరిస్తారు. ఇది ఒక సంచార కళారూపం.

**వేషధారణ - వైవిధ్యం :**

పగటివేషాలు ప్రధానంగా ఐదు రకాలు :

**మతపరమైనవి :** సన్యాసి, బైరాగి, వైష్ణవ, ఫకీరు వేషాలు. ఇవి సమాజంలోని భక్తి మార్గాలను ప్రతి బింబిస్తాయి.

**కులపరమైనవి :** సోమయాజులు, సోమిదేవమ్మ, బ్రాహ్మణ, కోయ, ఎరుకలసాని, గొల్లబోయిడు వంటి వేషాలు. ఇవి ఆయా కులాల జీవనశైలిని వ్యంగ్యంగా చూపిస్తాయి.

**పురాణపరమైనవి :** అర్ధనారీశ్వర, జంగం దేవర, శక్తి వేషాలు.

**జంతు ప్రదర్శనలు :** గంగిరెద్దులు, పాములోళ్ల వేషాలు.

**వినోదపరమైనవి :** పిట్టల దొర (అత్యంత ప్రజాదరణ పొందినది), చిట్టి పంతులు.

**సాంకేతిక నైపుణ్యం (అర్థనారీశ్వర వేషం) :**

ఒకే వ్యక్తి ఒకవైపు స్త్రీగా, మరోవైపు పురుషుడిగా మేకప్ వేసుకుని, మధ్యలో ఒక తెరను అడ్డుగా పెట్టుకుని సంభాషిస్తాడు. గొంతు మార్చడం, ముఖ కవళికలు మార్చడంలో వీరి ప్రతిభ అద్భుతంగా ఉంటుంది. సమాజంలోని మూఢనమ్మకాలను, వ్యక్తుల లోపాలను హాస్యం ద్వారా విమర్శించడం వీరి ప్రధాన ఉద్దేశ్యం. ఒకప్పుడు రాజులకు ప్రజల కష్టాలను, గూఢచారిగా సమాచారాన్ని చేరవేయడానికి కూడా ఈ వేషగాళ్లను ఉపయోగించేవారని చారిత్రక ఆధారాలు చెప్తున్నాయి.

పూర్వం 64 రకాల వేషాలు ఉండగా, కాలక్రమేణా ఆదరణ తగ్గి ప్రస్తుతం కేవలం 32 వేషాలు మాత్రమే ప్రదర్శిస్తున్నారు.

'బోడి బాపనమ్మ' వంటి వేషాలు సామాజిక కారణాల వల్ల (అపశకునమనే భావన) కనుమరుగయ్యాయి.

డా॥ జి. భరద్వాజ గారు 'ఆంధ్రభారతి' లో రాసిన పగటివేషాల గురించి రాసిన వ్యాసం కేవలం పరిచయమే కాకుండా, దాని లోతైన సాంస్కృతిక మరియు శాస్త్రీయ మూలాలను విశ్లేషిస్తుంది. భరద్వాజ గారి విశ్లేషణలో అత్యంత విలక్షణమైన అంశం ఏమిటంటే, పగటివేషాలు "స్థల కాల పరిమితులు లేని కళారూపం". మిగతా నాటకాలకు స్టేజీ, లైటింగ్, రాత్రి సమయం కావాలి. కానీ పగటివేషగాడికి వీధే రంగస్థలం, సూర్యరశ్మే లైటింగ్. ప్రేక్షకుడు వెతకాల్సిన పనిలేదు, కళాకారుడే ప్రేక్షకుని గడప వద్దకు వెళ్తాడు.

**ఆహార్యం - ఒక తపస్సు :**

సాధారణంగా పగటివేషాలను వినోదంగా చూస్తాం, కానీ భరద్వాజ గారు అందులోని శ్రమను ఎత్తిచూపారు. **అర్థనారీశ్వర వేషం** : ఇది కేవలం వేషం కాదు, ఒక యోగం. ముఖానికి వేసుకునే రంగులు చెమట పట్టినా చెరిగి పోకుండా ఉండాలి. ఒకే మనిషిలో సగం స్త్రీ, సగం పురుష లక్షణాలను చూపిస్తూ, ఆ ప్రవర్తనను రోజంతా కాపాడు కోవడం సామాన్యం కాదు.

**రంగుల తయారీ :**

అప్పట్లో రసాయన రంగులు లేవు. పగటివేషగాళ్లు వివిధ మూలికలు, రాళ్లు (మనోశిల, తులసిదళం వంటివి) ఉపయోగించి సొంతంగా రంగులు తయారు చేసుకునేవారు.

**సామాజిక ప్రయోజనం :**

ఈ కళాకారులు సమాజంలోని అవలక్షణాలను 'వ్యంగ్యం' ద్వారా ఎండగడతారు. పిట్టల దొర: ఇతని వేషం కేవలం నవ్వు పుట్టించడానికే కాదు, అప్పట్లో దొరల పేరిట సాగిన దౌర్జన్యాలను, అబద్ధపు గొప్పలను వెక్కి రించడానికి పుట్టిన పాత్ర. **బుడబుక్కల** : వీరు భవిష్యత్తు చెప్పే నెపంతో సామాజిక హెచ్చరికలు చేసేవారు.

**కళాకారుల వర్గీకరణ :**

డా॥. భరద్వాజ గారు పగటివేషగాళ్లను వారి సామాజిక నేపథ్యం ఆధారంగా విభజించారు. బ్రాహ్మణ పగటి వేషగాళ్లు: వీరు కూచిపూడి సంప్రదాయం నుండి వచ్చిన వారు. **అబ్రాహ్మణ (జానపద) కళాకారులు** : వీరు సహజ సిద్ధమైన శైలిలో ప్రదర్శనలు ఇస్తారు. వీరిలో ముస్లిం కళాకారులు కూడా ఉండటం విశేషం.

భరద్వాజ గారి వ్యాసం ప్రకారం, పగటివేషం అనేది కేవలం 'యాచక వృత్తి' కాదు, అది ఒక 'బహుముఖ కళా ప్రక్రియ'. ఇందులో సంగీతం, సాహిత్యం, నృత్యం, చిత్రలేఖనం (మేకప్), మరియు ముఖ్యంగా 'మనస్తత్వ శాస్త్రం' కలగలిసి ఉన్నాయి. ఎదుటి మనిషిని నమ్మిం చడమే ఈ కళ పరమావధి. ఆధునిక కాలంలో సినిమాలు, టీవీల వల్ల ఈ కళాకారులు ఆదరణ కోల్పోయి, తమ అద్భుతమైన విద్యను ప్రదర్శించలేక పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పగటి వేషాలను బహుముఖాలుగా ప్రదర్శించిన వారిలో, గోదావరి మండలంలో పాలంకి నారప్ప, రావూరు సూరయ్య, వేముల బాపయ్య, భాగవతుల కోనయ్య, కాలనాథ బట్ట వెంకయ్య, అనకాపల్లి గంగాధరం, విభూతి భవాని లింగం. వీరి ట్రూపు అనేక పగటి వేషాలను ధరించి, ఆంధ్రదేశంలో ముఖ్య కేంద్రాలలో ప్రదర్శనాల నిచ్చారు. క్రిష్ణపాడు జంగాలు నెల్లూరు మూల పేట జంగాలు, కాకినాడ రెడ్లు, నరసరావు పేట ఎర్ర గొల్లలు మొదలైన వారు ఆరాధించారు. ఈ నాటికీ పగటి వేషాల సాహిత్యం కూచిపూడిలో కొల్లలుగా వుంది. ఇటీవల ఆంధ్ర దేశంలో అంధ్రప్రజానాట్య మండలికి సంబంధించిన అనేక దళాలు, ఫకీర్లు, చెంచులు, కోయలు, సుద్దులు, జంతరు పెట్టె, పిట్టలదొర, సోదె మొదలైన వేషాలు ధరించి, తద్వారా రాజకీయ ప్రబోధాన్ని కలిగించారు. సంఘ విద్రోహుల్ని చీల్చి చెండాడే సాహిత్యం ద్వారా, ప్రజా ప్రబోధాన్ని కలిగించారు. ఇలా పగటి వేషాలను

ధరించిన వారిలో కోగంటి గోపాల కృష్ణయ్య, బికోసూరి, మాచినేని, డా॥ మిక్కిలి నేని, డా॥ రాజారామ, బి నాజరు, రామ కోటి మొదలైనవారు ముఖ్యులు.

పగటి వేషగాళ్ళు ఏకపాత్రాభినయంలో సిద్ధహస్తులు. ఒకే వ్యక్తి వేర్వేరు రోజుల్లో వేర్వేరు పాత్రలు ధరిస్తూ, ఆ పాత్రల స్వభావాన్ని బట్టి తన మాట తీరును, నడకను మార్చుకోవడం వీరి ప్రత్యేకత. జాయప సేనాని రాసిన 'నృత్య రత్నావళి'లో బహురూపుల ప్రస్తావన ఉంది. **సిద్ధేంద్ర యోగి ప్రభావం** : కూచిపూడి భాగవతులు కూడా పగటిపూట వినోదం కోసం, ధర్మ ప్రచారం కోసం ఈ వేషాలను వేసేవారు. **గూఢచారి వ్యవస్థ** : ముస్లిం రాజుల కాలంలో మరియు విజయనగర సామ్రాజ్యంలో శత్రువుల రహస్యాలను తెలుసుకోవడానికి ఈ వేషగాళ్లను గూఢచారులుగా వాడుకునేవారు.

**ప్రదర్శన పద్ధతి – 'ఇంటింటి నాటకం':**

మిగిలిన జానపద కళలలాగా ఇది ఒకే చోట జరిగే ప్రదర్శన కాదు. వీరు ఒక గ్రామానికి వెళ్తే, అక్కడ కొన్ని రోజుల పాటు విడతలు విడతలుగా ప్రదర్శనలు ఇస్తారు. సాధారణంగా మొదట శక్తి వేషం లేదా గణపతి వేషంతో ప్రారంభించి, చివరలో 'పిట్టల దొర' వంటి హాస్య పాత్రలతో ముగిస్తారు. ప్రదర్శన అయిపోయిన వెంటనే డబ్బులు అడగరు. అన్ని వేషాలు పూర్తయ్యాక, చివరి రోజున ఊరంతా తిరిగి 'సంభావన' సేకరిస్తారు.

**వైవిధ్యభరితమైన వేషాలు :**

**హాస్య పాత్రలు** : పిట్టల దొర (నమ్మబలికే గప్పాల రాయుడు), బుడబుక్కల, చిట్టి పంతులు.

**స్త్రీ పాత్రలు** : మాలె సాని, కోయ దొరసాని, బోడి బ్రాహ్మణ స్త్రీ (వితంతువు). పురుషులే స్త్రీ పాత్రలు ధరించడం ఇక్కడ విశేషం. వేదాంత, తత్వ పాత్రలు: సాధువులు, జంగం దేవర, ఫకీరు. వీరు సామాజిక నీతిని బోధిస్తారు.

పగటివేషాలు కేవలం ఒక వినోద ప్రక్రియ మాత్రమే కాదు, అవి ఒక 'సంచార విజ్ఞాన సర్వస్వం'. సమాజంలోని అన్ని వర్గాల వారిని ఆచారాలను, భాషలను అనుకరించడం ద్వారా ఇది ప్రజలకు దగ్గరైంది. అయితే, ఆధునిక సినిమా, టీవీ ప్రభావంతో ఈ కళాకారులు ప్రస్తుతం కేవలం జాతరలకు, ప్రభుత్వ సాంస్కృతిక ప్రదర్శనలకే పరిమితమవుతున్నారు. పగటివేషాలు అనేవి కేవలం వినోదం కోసం పుట్టినవి కావు. అవి సామాజిక పరిణామ క్రమంలో భాగం. ఒక కళాకారుడు తనే స్వయంగా డైరెక్టర్, యాక్టర్ మరియు మేకప్ ఆర్టిస్ట్ కావడం ఈ కళలో ఉన్న ప్రత్యేకత. నేటి ఆధునిక కాలంలో ఈ కళాకారుల సంఖ్య తగ్గిపోతున్నప్పటికీ, జానపద కళా చరిత్రలో వీరికి ఒక ఉన్నతమైన స్థానం ఉంది.

విభూతి భవానీలింగం గారి సంకలనం ఆధారంగా, పగటి వేషాలు అనేవి కేవలం కాలక్షేప కళలు కావు. అవి ఒక వ్యక్తి తన బహురూప నటన ద్వారా సమాజంలోని అనేక వర్గాల బాధలను, గాధలను, ఆచారాలను ప్రతిబింబించే 'సాంస్కృతిక దర్పణాలు'.

**కూచిపూడి పగటి వేషాలు :**

కూచిపూడి కళాకారులు వీధి భాగవతాలలో ఎంతటి ప్రసిద్ధులో పగటి వేషాలలో కూడ అంతటి ప్రసిద్ధులే. ఈ పగటి వేషాలను కూచిపూడివారు ప్రారంభం నుండే వీటిని వేయలేదు. వారి వీధి భాగవతాలకూ యక్షగానాలకూ కొంత ప్రచారం తగ్గిపోయిన తరువాత భాగవతులలో చీలిక వచ్చి ఎవరికి వారై ఏదో రకంగా ఉదర పోషణార్థం ఈ పగటి వేషాలను ప్రారంభించారు. ఆనాడు కొన్ని యక్షగాన ప్రదర్శనాల్లోనూ, వీధి భాగవత ప్రదర్శనాలలోనూ మధ్య మధ్య వచ్చే కొద్ది కొద్ది విరామ సమయాలలో ప్రేక్షకుల వినోదం కొరకు పంతుల వేషం, పఠాను వేషం, రెడ్డి వేషం, త్రాగుబోతు వేషం మొదలైన వాటిని ప్రదర్శించేవారు. పగటిపూట అంటే తెల్లవార్లూ ప్రదర్శనం ముగిసిన తరువాత ఆట ముగించి, అదే వేషాలతో ఇంటింటికి యాచనకు బయలు దేరేవారు. వెంటనే బయలు దేరడానికి కూడ కారణం లేక పోలేదు. తెల్లవార్లూ ప్రదర్శనం చూచిన ప్రేక్షకులు ముగ్ధులై ఇంకా ఆనందంలో వారుండగానే వారి నుంచి ఎక్కువ ప్రతిఫలాన్ని రాబట్టేవారు. అలా ప్రారంభించబడిన పగటి

వేషాలే అలా అలా అల్లుకు పోయి కళాఖండాలుగా ప్రచారం పొందాయి.

**సహజ పాత్రలూ, సజీవ భాషా :**

వీరు కూడ అనేక వేషాలు ధరించేవారు. కోమటిసెట్టి పాత్ర ధరిస్తే వైశ్యుల భాష, యాస, మాట తీరు, బొంగురు గొంతు, యుక్తి మాటలు, సునిశిత హాస్యం, వ్యాపార చమత్కారం, ఇతరులకు నొప్పిగలుగని అతిలౌకికమైన నటనా అచ్చు గుద్దినట్లు ఒప్పించేవారు. ఇంద్రజాల మహేంద్ర జాలాన్ని అద్భుతంగా ప్రదర్శించే వారు. బట్టల నేత, బట్టల అమ్మకం, కోడి పోరులో పందెం గాళ్ళ జోరు, వారి వికటాట్టహాసాలు, బైరాగి వేషాలతో ప్రజలను మోసపుచ్చే దొంగ సన్యాసుల వైఖరులు, చమత్కార సంభాషణలూ, అచ్చం అలాగే తెలుపుతారు. సోమివేదమ్మ పాత్రలో వైదిక సంఘంలో వుండే మంచి చెడులనూ లోపాలనూ వెల్లడిస్తారు. తర్క శాస్త్రాన్నీ, వ్యాకరణ శాస్త్రాన్ని, వేద స్వరూపాన్నీ హాస్య పూరితులైన సంస్కృత శ్లోకాలను కలిపి కట్టుదిట్టంగా చర్చించేవారు.

చిట్టిపంతులు వేషంలో, చిట్టిపంతులు వేశ్యాలోలుడై వ్యాపారులనూ, రైతులనూ బాధించి ఏ విధంగా ధన మార్జిస్తారో ఆర్జించిన ధనమంతా వేశ్యులకెలా ధార పోస్తాడో కళ్ళకు కట్టినట్లు చూపిస్తారు. యాచనలో ప్రతి వారినీ పొగడుతూ భట్రాజులు ప్రజలను ఎలా పీడిస్తారో చూపించేవారు. ఖురాన్ చదువుతూ, పాడిపంటల్ సల్ల గుండాలి అల్లాకెనాం, అంటూ ఫకీర్ల వేషంలోనూ, అంబ పల్కు జగదాంబ పల్కు, మాయమ్మా పల్కు, కంచి కామాక్షి పల్కు, అంటూ బుడ బుక్కల వేషంలోనూ, ఆయా పాత్రలకూ, ఆయా వేషాలకూ కా వలసిన అన్ని రకాల సాహిత్యాన్ని ఆకళింపు చేసుకుని, ఆయా వేషాలను సజీవంగా ప్రదర్శించేవారు.

**బహురూప చక్రవర్తి : సున్నపు వీరయ్య పగటి వేషాల వైభవం**

తెలుగు జానపద కళారూపాల్లో పగటి వేషాలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఈ కళలో తనదైన ముద్ర వేసి, 'బహురూప చక్రవర్తి'గా పేరుగాంచిన మహానుభావుడు సున్నపు వీరయ్య. పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు సమీపంలోని అప్పారావుపాలెంలో జన్మించిన వీరయ్య గారు, ఏలూరును తన నివాసంగా మార్చుకుని రాష్ట్ర వ్యాప్తంగా పగటి వేషాల ప్రభంజనాన్ని సృష్టించారు.

విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన వీరయ్య గారు ఆజానుబాహుడు. గంభీరమైన విగ్రహం, నిండైన జరీ అంచు తలపాగా, బొద్దు మీసం, నల్లని లాంకోటు, చేతికి సువర్ణ కంకణాలు, కాలికి అందెలు ధరించి ఆయన నడుస్తుంటే చూసేవారికి ఒక గంభీరమైన రాజసం ఉట్టిపడేది. ఆంధ్రదేశంలో ఆయన వంటి నిండైన విగ్రహం కలిగిన పగటి వేషధారుడు మరొకరు లేరనడం అతిశయోక్తి కాదు.

**ప్రసిద్ధ వేషాలు - అద్భుత ప్రదర్శనలు**

**భీకరమైన శక్తి వేషం :**

వీరయ్య గారి ప్రదర్శనల్లో అత్యంత భయానకమైనది 'శక్తి వేషం'. మధ్యాహ్నం 12 గంటల వేళ, మండుటెండలో తప్పెట్ల వాయిద్యంతో ఈ వేషం బయలుదేరేది. కళ్లకు కోడిగుడ్లు, ముఖానికి నల్ల రంగు, పెద్ద కోరలు, విర బోసిన జుట్టుతో ఆయనను చూసి జనం గడగడలాడే వారు. ఆ సమయంలో ఊరంతా నిశ్శబ్దంగా మారి పోయేది; పిల్లలను ఈ వేషం చూడనిచ్చేవారు కాదు.

**భీతావహమైన బేతాళుని పాత్ర:**

బేతాళుని వేషంలో వీరయ్య గారు కేవలం లంగోటి ధరించి, బుగ్గకు కత్తి పొడుచుకుని రక్తం కారుతుండగా వీరసింహంలా వీధుల్లో నడిచేవారు. ఆయన వేగాన్ని ఆపడానికి ఇద్దరు వ్యక్తులు వెనుక నుండి తాళ్లతో లాగి పట్టుకునేవారంటే ఆ ప్రదర్శన ఎంత ఉధృతంగా ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

**దేవర పెట్టె మహిమలు :**

'తిరుపతమ్మ దేవర పెట్టె' వేషంలో వీరయ్య గారు మంత్ర తంత్రాలను, కనికట్టు విద్యలను ప్రదర్శించేవారు. కుంకుమను రక్తంగా మార్చడం, మజ్జిగను చల్లగా చేయడం, ఇసుకను నీళ్లలో వేసి మళ్లీ పొడిగా తీయడం వంటి హస్తలాఘవ విద్యలతో ప్రేక్షకులను మంత్రముగ్ధ లను చేసేవారు.

అమ్మసత్తెం చూడండీ, మల్లేలా, మల్లేలా
దేవి సత్తెం చూడండీ
సందుగొందులు తిరిగే తల్లి
సన్నపు కోకలు కట్టిందోయ్
మాయమ్మ, మాయమ్మ
ఎన్నో మాయల గల తల్లోయ్
మల్లేలా, మల్లేలా.

అంటూ నెత్తిన వున్న దేవర పెట్టెను క్రిందికి దింపి కుడిచేతిలో వీర భద్ర తాడును పట్టి ఫళ ఫళా అంటు నాదంచేస్తూ చూడండి బాబయ్యా, మా అమ్మోరు సత్తెం, అమ్మోరును ఎక్కడ నుండీ తీసుకు వచ్చాననుకున్నారు.

**అర్థనారీశ్వర వేషం :**

కూచిపూడి భాగవతుల వలె వీరయ్య గారు కూడా 'అర్థనారీశ్వర' వేషంలో అద్భుత ప్రతిభ కనబరిచేవారు. ఒకే మనిషిలో సగం శివుడు, సగం పార్వతిగా కనిపించేలా అలంకరణ చేసుకుని, తెరను అడ్డుపెట్టుకుని క్షణాల్లో పాత్రను మార్చి చూపిస్తూ నవరసాలను పండించేవారు.

ఇంతి యొక్కతె అర్థనారీశ వేష
మూని సాక్షాత్కరించిన మౌని జనులు
భ్రమసి సద్భక్తి జయ జయ పార్వతీశ
యనుచు మ్రొక్కిరి నృపులు నన్గొనుచుననగ
(దశావతార చరిత్ర)

**పిట్టల దొర :**

ఇది పూర్తి వినోదాత్మకమైన వేషం. అబద్ధపు గొప్పలు, కల్పిత గాథలతో ప్రజలను నవ్వించడంలో ఈ పాత్ర సాటిలేనిది. "గుమ్మడికాయంత బంగారం కుక్క మూతి చూసిందని దిబ్బలో పారేయించాం" వంటి హాస్యపూరిత సంభాషణలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించేవి. అయ్యా మాకేం తక్కువయిందని మీ దగ్గిరికి వచ్చా మను కుంటున్నారు. ఏడంతస్తుల మేడ, ఏడు దున్నల పాడి వీపుమీద ఇస్తరి, పిర్రల మీద పీట, బాగా పిట్టల దొర భోంచేసేవాళమే. ఇంతెందుకు గుమ్మడి కాయంత బంగారం కుక్క మూచ్చూసిందని, దిబ్బలో వెయ్యడానికి, మైల బడతాయని ముగ్గురు కూలీలకి మూడు దమ్మిడీల కూలిచ్చి, వూరవతల కోనేట్లో పారేయించాం. ఈ సంగతి తెలిసి పక్కింటి పరమేశం భార్య దాన్ని తెచ్చుకుని, కాళ్ళ కడ్డదిడ్డాలు, నడుముకు నానా తిప్పలు, ముక్కుకు ముంగిర, చెంపకు చెంప సెరాలు. నెత్తికి మూకుడు చిప్ప చేయించు కున్నది. మాకు నీళ్ళకు కూడా ఇబ్బంది లేదు. ఇంట్లో పంపు, వీధిలోపంపు, పొయ్యి గడ్డమీద పంపు, పొయ్యిలో పంపు, అన్నీ వున్న పొయ్యి మీదికి, పై వంట మీదికి రెండు మాత్రమె తక్కువై వచ్చాం.

ఔను మొన్న మా నాయనమ్మ పెండ్లికి విమాన బంపితే రాలేదేమండీ. వూళ్ళొ వుండే ముండ మోపులంతా వచ్చారే. పెళ్ళికి చాటెడు బియ్యం చెరువులో బోసి తూముకు మంట పెట్టి ఆ బియ్యం కల్లపిల్ల వుడుకు తుంటే, చెలకపారల తోడి తిరిగేయించాం, కూరలేమి చేయించామంటే విచిత్రం పచ్చి పులుసు, ఇటుకరాయి ఇగురు, పలుగురాయి పచ్చడి, లోయలో తోటాకు, వేపాకు కూర, ఈగల తాలింపు, నల్లుల తిరగమోత, వంకాయ వరుగేసి, గుమ్మడి కాయ గుడించి, ముగ్గురికి ఒక, మెతుకు, నలుగురికి ఒక బద్ద వచ్చిన వాళ్ళకు వాత, రాని వాళ్ళకు గీత వడ్డించాం. అదీ చాలక పోతే., ఒకరి మూతి ఒకర్ని నాక్కోమన్నాం.

పెళ్ళికి వచ్చిన పేరంటాళ్ళు కాటుక లేదన్నారండీ ఆక్షేపణ పడలేక చాటెడు మిరపకాయలు, కళా పెళా వేయించి, ఇద్దరు కూలీలతో మెత్తగా పొడి గొట్టించి, రెప్ప తప్పించి గుడ్లకతికించాం. అంతె చిర్రున చీది, చర్రున గోడకతుక్కున్నారు. తమల పాకులు లేవండీ, అంటే వెంటనే మునిసిపాలిటీ వాళ్ళకు కబురు పెట్టి, దిబ్బమీది ఇస్తరాకులు తెప్పించాం. ఇలా ఏమీ ఇబ్బంది లేకుండా పెళ్ళి జరిపించాం. మీరు రాకపోవట మొక్కటే లోటు.

నేనూ మా అవిడ మొన్న జరిగిన కృష్ణా పుష్కరాలకు వెళ్ళామండీ. అవిడ స్నానం చెయ్య బోయి, నీళ్ళలో మునిగి పోతుంటే, కొప్పు అయితే చేతి కొచ్చింది కానీ ఆమె రాలేదు. ఆరోజు నుంచి, ఈ రోజు వరకు కుండెడు అన్నం ముందు బెట్టుకుంటే లోపలికి పొయ్యే ముద్దేగాని బయటికి వచ్చే మెతుకే లేదంటే నమ్మండీ.

**సామాజిక విమర్శ – మాదిగ వేషం :**

ఈ వేషం ద్వారా వీరయ్య గారు అంటరానితనంపై,

కుల వ్యవస్థపై తీవ్రమైన విమర్శలు చేసేవారు. "కుక్కను, కోతిని పూజించే సమాజం, తోటి మనిషి ఎదురైతే దూరం జరుగుతుందేంటి?" అంటూ ఆయన పాడే పాటలు మేధావులను సైతం ఆలోచింపజేసేవి.

**సోమయాజులు - సోమిదేవమ్మ :**

ముసలి మొగుడు, పడుచు పెళ్లాం మధ్య జరిగే సరదా సంవాదమే ఈ వేషం. ఛాందస బ్రాహ్మణుల ప్రవర్తనను, వారి వేషభాషలను వ్యంగ్యంగా విమర్శిస్తూ ప్రదర్శించే ఈ వేషం జనరంజకంగా ఉండేది.

ప్రదర్శనలన్నీ పూర్తయిన తర్వాత చివరి రోజున 'శారద వేషం' ధరించి, రామాయణ కథను గేయ రూపంలో చెబుతూ ఇంటింటికీ తిరిగేవారు. ఆయన కళా పిపాసను చూసి జమీందార్లు, శ్రీమంతులు ఘనమైన బహుమతులు, సన్మానాలు చేసేవారు. సున్నపు వీరయ్య గారు పగటి వేషాల ద్వారా కేవలం వినోదాన్ని మాత్రమే కాక, సమాజంలోని రుగ్మతలపై గళం విప్పారు. ఆయన ప్రదర్శించిన మంత్ర తంత్రాలు, గారడీ విద్యలు, భయానక మరియు హాస్య పాత్రలు తెలుగు జానపద కళా చరిత్రలో ఒక మరుపురాని అధ్యాయం. ఏలూరు వాస్తవ్యుడైన ఈ మహనీయుడు 'బహురూప చక్రవర్తి'గా చిరస్థాయిగా నిలిచిపోయారు.

**ముగింపు :**

తెలుగు జానపద కళా సామ్రాజ్యంలో 'పగటి వేషాలు' అనేది కేవలం ఒక వినోద ప్రక్రియ కాదు, అది ఒక సజీవ సాంస్కృతిక వారసత్వం. సున్నపు వీరయ్య వంటి మహానుభావులు తమ నటనతో, ఆహార్యంతో ఈ కళకు ఒక గంభీరమైన గౌరవాన్ని తీసుకువచ్చారు. పగటి వేషాలు అనేవి కేవలం ముఖానికి వేసుకున్న రంగులు కావు, అవి సమాజంలోని వివిధ అస్థిత్వాలకు అద్దం పట్టే జీవన రేఖలు. ఒకప్పుడు రాజుల గూఢచారిగా, జమీందారుల ఆస్థాన వినోదంగా, సామాన్యుల సామాజిక చైతన్య సాధనంగా వెలిగిన ఈ కళ, నేడు ఆధునిక వినోదపు హోరులో తన ఉనికి కోసం పోరాడుతోంది.

సున్నపు వీరయ్య వంటి 'బహురూప చక్రవర్తులు' తమ అభినయంతో సృష్టించిన ఆ భీకరమైన శక్తి వేషం గానీ, పిట్టల దొరలోని ఆ నిష్కల్మషమైన హాస్యం గానీ కేవలం జ్ఞాపకాలుగా మిగిలిపోకూడదు. పగటి వెలుగులో పరకాయ ప్రవేశం చేస్తూ, మనిషిలోని నవరసాలను వీధి గడప వద్దకే తీసుకువచ్చిన ఈ 'సంచార రంగస్థలం' తెలుగు వారి గర్వకారణం.

వేషం మారినా, భాష మారినా ఈ కళాకారుల గుండెల్లోని కళా తృష్ణ మాత్రం నిత్యం ప్రవహించే గోదావరిలా స్వచ్ఛమైనది. మరుగున పడుతున్న ఈ జానపద కళా సంపదను కాపాడుకోవడం అంటే మన మూలాలను మనం గౌరవించుకోవడమే. రంగులు వెలిసిపోవచ్చు కానీ, ఆ రంగుల వెనుక ఉన్న కళాకారుడి శ్రమ, ప్రతిభ తరతరాలకీ స్ఫూర్తిదాయకంగా నిలిచి పోతాయి.

'కళాకారుడు మరణించవచ్చు, కానీ అతను సృష్టించిన కళకు మరణం లేదు!'

**ఉపయుక్త గ్రంథసూచి :**


1. కూచిపూడి - భాగవతులు: రచయిత: విద్వాన్ చింతలపాటి లక్ష్మీనరసింహశాస్త్రి (1983).
2. తెలుగువారి జానపద కళారూపాలు: రచయిత: డా. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి. 1992, తెలుగు విశ్వవిద్యాలయం
3. జానపద కళా సంపద: రచయిత: డా॥ తూమాటి దొణప్ప. 1992, తెలుగు విశ్వవిద్యాలయం, ప్రవర్ధనా పబ్లికేషన్స్, హైదరాబాద్.
4. విలక్షణ జానపద కళారూపం - పగటి వేషం: డా॥ జి. భరద్వాజ (ఆంధ్రభారతి).
5. సర్వేశ్వర శతకం - యథావాక్కుల అన్నమయ్య, వ్యాఖ్యాత డా. ముదిగొండ వీరభద్రయ్య, మార్చి 1999, శ్రీ పావని సేవాసమితి, హైదరాబాద్ ప్రచురణ.

6. పగటి వేషాలు వాటి ప్రాచీనత: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, మార్చి 1999
7. పగటి వేషాలు - సామాజిక విమర్శ: వివిధ సాహిత్య పత్రికలలో ప్రచురితమైన వ్యాసాలు (విశాలాంధ్ర వ్యాసాలు).
8. 'పగటి వేషాలు' - తెలుగు వికీపీడియా వ్యాసం.
9. వికీసోర్స్: 'తెలుగువారి జానపద కళారూపాలు' - మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి రాసిన మూల ప్రతి.
10. ఈనాడు ప్రతిభ పోటీ పరీక్షల కోసం రూపొందించిన జానపద కళారూపాల విభాగం.
11. పత్రికల ప్రత్యేక సంచికలు: సంక్రాంతి, దసరా వంటి పండుగల సందర్భాల్లో వెలువడే ప్రత్యేక తెలుగు పత్రికా సంచికలలో పగటి వేషాల కళాకారుల ఇంటర్వ్యూలు మరియు వారి జీవనశైలి.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# జానపద సాహిత్యము - వీరగాథలు - కళాకారుల జీవన చిత్రణ



- డా॥. పేరాల జ్ఞానానందం
తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్.

**వ్యాస సంగ్రహం**

అక్షరాస్యత లేని గ్రామీణ ప్రజల మౌఖిక రూపంలో వెలువడిన వీరగాథలు తెలుగు జానపద సాహిత్యంలో అత్యంత శక్తివంతమైన ప్రక్రియ. ఇవి కేవలం కథలు మాత్రమే కావు, ఆనాటి సామాజిక చరిత్రకు, వీరుల త్యాగాలకు మరియు తెలుగు జాతి పౌరుషానికి సజీవ సాక్ష్యాలు. పల్నాటి వీరచరిత్ర, కాటమరాజు కథల వంటివి మన సంస్కృతికి మూలస్తంభాలుగా నిలిచి ఉన్నాయి.

**కీలక పదాలు**

జానపద విజ్ఞానం, వీరగాథలు, మౌఖిక సంప్రదాయం, పల్నాటి వీరచరిత్ర, కాటమరాజు కథలు, జానపద కళాకారులు

## పరిచయం

జానపద సాహిత్యం అనేది ఒక జాతి యొక్క అస్తిత్వానికి మూలం. అక్షరాస్యత లేని గ్రామీణ ప్రజల అనుభూతులు, నమ్మకాలు, వీరకృత్యాలు మౌఖిక రూపంలో ప్రచారమై జానపద విజ్ఞానంగా రూపాంతరం చెందాయి. ఇందులో 'వీరగాథలు' అత్యంత శక్తివంతమైన ప్రక్రియ. ఇవి కేవలం కథలు కావు, ఆనాటి సామాజిక చరిత్రకు సజీవ సాక్ష్యాలు.

జానపద విజ్ఞానం అనేది ఒక దేశం యొక్క నాగరికతకు వెన్నెముక వంటిది. ఇది కేవలం పల్లె ప్రజల వినోదం మాత్రమే కాదు, ఒక జాతి యొక్క ఆచారాలు, నమ్మకాలు, నైతిక విలువలు మరియు చారిత్రక పరిణామాలకు ప్రతిబింబాలు.

'Folklore' అనే పదాన్ని 1846లో W.J. Thoms అనే పరిశోధకుడు మొదటిసారిగా ప్రతిపాదించాడు. 'Folk' అంటే నిరక్షరాస్యులైన సాధారణ ప్రజలని, 'Lore' అంటే వారు తరాతరాలుగా సంపాదించుకున్న జ్ఞానమని అర్థం. తెలుగు సాహిత్యంలో జానపద విజ్ఞానానికి విశిష్ట స్థానం ఉంది. అందులోనూ 'వీరగాథలు' (Ballads) జానపదుల ధైర్యసాహసాలకు, త్యాగనిరతికి ప్రతీకలుగా నిలుస్తాయి.

## వీరగాథలు నిర్వచనం మరియు పుట్టుక

తెలుగు జానపద సాహిత్యంలో వీర గాధలు చారిత్రక వీరుల పరాక్రమాన్ని, త్యాగాలను తెలియజేసే అద్భుతమైన మౌఖిక కావ్యాలు. ఇవి పల్లెటూరి ప్రజల ఆచారాలు, నమ్మకాలు, యుద్ధనీతి మరియు సామాజిక జీవనాన్ని ప్రతిబింబిస్తాయి. పల్నాటి వీరచరిత్ర, కాటమరాజు కథ, బాలచంద్రుని కథ వంటివి ముఖ్యమైన వీర గాధలు.

జనపదాలలో పుట్టి, పెరిగి, మౌఖికంగా ప్రచారంలో ఉండే చారిత్రక కథా గేయాలను వీర గాధలు అంటారు.

ఇవి సాధారణంగా యుద్ధం, వీరత్వం, త్యాగం చుట్టూ తిరుగుతాయి.

వీరగాథలను ఆంగ్లంలో 'Ballad' అంటారు. ఈ పదం లాటిన్ భాషలోని 'Battare' (నృత్య గీతం - Dance Song) నుండి పుట్టిందని పరిశోధకుల అభిప్రాయం. కాలక్రమేణా ఇది నృత్యం నుండి వేరుపడి, కథా ప్రధానమైన గేయంగా రూపాంతరం చెందింది.

ప్రపంచంలోని అనేక దేశాలలో వీర గాథలకు సంబంధించిన చరిత్ర ఉన్నట్లు తెలుస్తుంది. పోర్చుగీస్ సాహిత్యంలో వీర గాథలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. సిసిలి ద్వీపమునా సుమారు ఏడు వేలకు పైగా వీర గాథలు ఉన్నట్లు పరిశోధకులు తెలియజేశారు. స్విట్జర్లాండ్, స్పెయిన్ మొదలైన దేశాలలో వీటి ప్రస్తావన కనిపిస్తుంది. మన భారతదేశంలో రాజస్థాన్, మహారాష్ట్ర, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాలలో ఈ వీర గాథలు వెలసిల్లినట్లుగా చారిత్రిక ఆధారాలు తెలియజేస్తున్నాయి.

జానపద గేయ రూపంలో ఉండి, ఒక వీరుని లేదా వీరవనిత యొక్క సాహస కృత్యాలను, త్యాగాలను వర్ణించే కథా గేయమే వీరగాథ. పాశ్చాత్య విమర్శకుల దృష్టిలో ఇది ఒక "చిన్న ఇతిహాసం" లాంటిది.

**తెలుగులో వీరగాథల విశిష్టత :**

తెలుగులో వీరగాథలను 'వీరకథలు' అని కూడా అంటారు. ఇవి కేవలం కల్పితాలు కావు, చారిత్రక సత్యాలకు జానపద కల్పనలు తోడై ఇవి రూపుదిద్దుకుంటాయి. తెలుగులో వీర గాథల ప్రస్తావన క్రీస్తు శకం ఆరు ఏడు శతాబ్దాల నుండి ఉన్నట్లు తెలుస్తుంది. ఆదికవి నన్నయకు పూర్వమే వీర గాథలు ఉన్నట్లు శాసనాలను బట్టి తెలుస్తుంది. ప్రాచీన కవులలో నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు, పాల వేకరి కదిరి పతి, అయ్యల రాజు నారాయణామాత్యుడు మొదలైన వారి కావ్యాలలో జానపద వీర గాథల ప్రస్తావన ప్రస్తావించటం జరిగింది. 12వ శతాబ్దము నాటి సిరియాళుని కథ, 13వ శతాబ్ది నాటి పల్నాటి వీర కథలు, పరశురాముని కథలు ఆనాటి జానపద కళాకారుల నోటిపై నాట్యమాడుతూ ఉండేది. **ఉదాహరణకు** : పల్నాటి వీరచరిత్ర, కాటమరాజు కథలు, అంకమ్మ కథ చక్రము, బొబ్బిలి కథ, దేసింగురాజు కథ, బాలనాగమ్మ కథ, కాంభోజరాజు కథ, ముగ్గురు మరాఠీల కథ, లక్ష్మమ్మ కథ, తిరుపతమ్మ కథ, ఎరుకల నాంచారి కథ, సర్వాయి పాపడు కథ, సదాశివరెడ్డి కథ మొదలైన కథలు తెలుగు నేలపై అనేక తరాల నుంచి తెలుగు నేలపై పాతుకుపోయి నేటికీ చిరస్థాయిగా నిలిచి ఉన్నాయి. ఇవి తెలుగు వారి శౌర్యానికి నిలువుటద్దాలు.

**వీరగాథల వర్గీకరణ - విభజన :**

తెలుగు సాహిత్యంలో వీరగాథలను ప్రధానంగా రెండు విభాగాలుగా గుర్తించవచ్చు. మౌఖిక వీరగాథలు వీటిని సాంప్రదాయక వీరగాథలు అని అంటారు ఇక రెండవది సాహిత్య వీర గాథలు. పాశ్చాత్య విమర్శకులు వీర గాథలను ఇతివృత్తాన్ని ఆధారంగా చేసుకుని వర్గీకరించారు. తెలుగు విమర్శకుల్లో శ్రీపాద గోపాల కృష్ణమూర్తి గారు, హరి ఆదిశేషు గారు, ఆచార్య బిరుదు రాజు రామరాజు గారు, నేదు నూరి గంగాధరం గారు, పింగళి లక్ష్మీకాంతం గారు మొదలైన వారు వీరగాధల వర్గీకరణ చేయడం జరిగింది.

**మౌఖిక వీర గాథలు (Folk-songs) :**

ఇవి కేవలం జానపదుల నోళ్లలో నాని, అక్షర రూపం లేని గేయాలు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేసేటప్పుడు లేదా విశ్రాంతి సమయంలో పాడుకునే పాటలు ఇందులో ఉంటాయి. ఇవి ఇతివృత్తాన్ని బట్టి విభజించబడి ఉంటాయి.

**సాహిత్య వీర గాథలు :**

ఇవి జానపద మూలాలను కలిగి ఉండి, కొంత సాహిత్య స్పర్శను పొందినవి. రామదాసు కీర్తనలు, బ్రహ్మంగారి తత్వాలు వంటివి ఈ కోవలోకి వస్తాయి. ఇవి ఛందస్సును బట్టి ఆధారపడి ఉంటాయి. కామమ్మ కథ, లక్ష్మమ్మ కథ, సర్వాయి పాపడు కథ, గంగా వివాహము, శతకంఠ రామాయణము, హరి హరి పదములు, శారద రామాయణము, వామన విజయము,

దేవయాని చరిత్ర జంగం కథలు మొదలైనవి వీటికి ఉదాహరణలు.

పరిశోధకులు వీరగాథలను వాటి ఇతివృత్తం ఆధారంగా కూడా వర్గీకరించారు :

**ఇతివృత్తాన్ని బట్టి వర్గీకరణ**

కథా వస్తువు లేదా కథలోని ప్రధానాంశాన్ని బట్టి వీటిని మూడు రకాలుగా విభజించవచ్చు :

**పురాణ/పౌరాణిక వీర గాథలు :**

రామాయణ, భారత భాగవతాల్లోని వీరకృత్యాలను జానపదులు తమకు నచ్చిన రీతిలో పాడుకోవడం. (ఉదా: ధర్మరాజు జూదం, పల్నాటి యుద్ధం - ఇతిహాస ఛాయలతో).

**చారిత్రక వీర గాథలు :**

చరిత్రలో జరిగిన యుద్ధాలు, రాజుల సాహసాలను వివరించేవి. **ఉదాహరణ** : పల్నాటి వీరచరిత్ర, కాటమ రాజు కథ, బొబ్బిలి యుద్ధం.

**సాంఘిక వీర గాథలు :**

సమాజంలోని అన్యాయాలపై పోరాడిన వ్యక్తుల గురించి లేదా స్థానిక కథానాయకుల గురించి పాడేవి. ఉదాహరణ: సర్వాయి పాపన్న కథ, బాలనాగమ్మ కథ, సన్యాసమ్మ కథ.

**ప్రదర్శన/గాన పద్ధతిని బట్టి వర్గీకరణ**

వీటిని పాడే కళాకారులు మరియు ఉపయోగించే వాయిద్యాలను బట్టి కూడా వర్గీకరిస్తారు :

**జంగం కథలు –** జంగం వారు తంబూర, అందెలు ధరించి వీర గాథలను చెబుతారు. ఉదాహరణకు - దేసింగు రాజు కథ

**బుర్రకథలు –** ముగ్గురు వ్యక్తులు కలిసి (కథకుడు, ఇద్దరు వంతలు) హృద్యంగా వినిపించే వీర గాథలు. ఉదాహరణకు - అల్లూరి సీతారామరాజు కథ

**పిచ్చుకగుంట్ల కథలు –** వంశావళిని మరియు వీర కృత్యాలను పొగుడుతూ పాడేవి. ఉదాహరణకు - కాటమరాజు కథలు

**శారదకాండ్రు –** శారద అనే వాయిద్యంతో పాడే వీర గాథలు. ఉదాహరణకు - బొబ్బిలి కథ

**స్వభావాన్ని బట్టి వర్గీకరణ**

**వీర రస ప్రధానమైనవి :**

యుద్ధాలు, పౌరుషం, రక్తం చిందించడం వంటి అంశాలు ఉంటాయి. (బొబ్బిలి యుద్ధం)

**కరుణ రస ప్రధానమైనవి :**

వీరుల మరణం లేదా త్యాగం వల్ల కలిగే విషాదాన్ని ప్రతిబింబిస్తాయి. (కుమార రాముని కథ)

**అద్భుత రస ప్రధానమైనవి :**

మాయలు, మంత్రాలు, సాహసాలతో కూడినవి. (బాలనాగమ్మ కథ)

**వీరగాథల లక్షణాలు :**

తెలుగు జానపద సాహిత్యంలో వీరగాథలు (Ballads) ఒక విశిష్టమైన ప్రక్రియ. సామాన్య ప్రజల హృదయాల నుండి పుట్టిన ఈ కథా గేయాలకు కొన్ని ప్రత్యేకమైన లక్షణాలు ఉన్నాయి. ప్రముఖ పరిశోధకులు ఆచార్య తంగిరాల వెంకటసుబ్బారావు వంటి వారు వీటిని శాస్త్రీయంగా విశ్లేషించారు.

**కథా ప్రాధాన్యత**

వీరగాథల్లో పాట కంటే కథకే ఎక్కువ ప్రాముఖ్యత ఉంటుంది. ఒక వీరుని జననం నుండి మరణం వరకు లేదా ఒక విశిష్ట ఘట్టాన్ని క్రమపద్ధతిలో వివరిస్తుంది. ఇందులో ఆరంభం, మధ్యం, ముగింపు అనే స్పష్టమైన కథా గమనం కనిపిస్తుంది.

**గేయ రూపం**

ఇవి పాడుకోవడానికి వీలుగా ఉండే గేయ రూపంలో ఉంటాయి. కథకుడు వాయిద్యాల (తంబూర, డప్పు లేదా శారద) సహాయంతో రాగయుక్తంగా పాడతాడు. ఇందులో లయ, ప్రాస వంటి అంశాలు సహజంగానే కుదురుతాయి.

**మౌఖిక ప్రచారం**

వీరగాథలు గ్రంథస్థం కాకముందు తరతరాలుగా నోటి మాట ద్వారా ఒకరి నుండి మరొకరికి అందుతూ వచ్చాయి. అందుకే కాలక్రమేణా వీటిలో కొన్ని మార్పులు, చేర్పులు జరుగుతుంటాయి.

**అతిశయోక్తి**

జానపద వీరుడి శక్తిని, సాహసాన్ని వర్ణించేటప్పుడు కవులు అతిశయోక్తులను ఉపయోగిస్తారు. ఒకే వీరుడు వందల మందిని ఎదిరించడం, దేవతలతో యుద్ధం చేయడం వంటి అద్భుత రస పోషణ ఇందులో కనిపిస్తుంది.

**పునరావృతం**

కథా గమనంలో కొన్ని ముఖ్యమైన పదాలు, వాక్యాలు లేదా పల్లవి మళ్ళీ మళ్ళీ వస్తుంటాయి. ఇది శ్రోతలకు కథను గుర్తుంచుకోవడానికి, గాయకుడికి విశ్రాంతి నివ్వడానికి ఉపయోగపడుతుంది.

**వీర రస ప్రధానం**

పేరులోనే ఉన్నట్లుగా, ఇందులో వీర రసం ప్రధానంగా ఉంటుంది. పౌరుషం, త్యాగం, ఆత్మగౌరవం వంటి గుణాలు కథానాయకుడిలో కనిపిస్తాయి. అయితే, కథ ముగింపులో తరచుగా కరుణ రసం (వీరుని మరణం) కూడా ఉంటుంది.

**కర్తృత్వం తెలియకపోవడం**

చాలా వరకు వీరగాథలను ఎవరు రచించారో స్పష్టంగా తెలియదు. ఇవి జానపదుల సమిష్టి సంపదగా చలామణీ అవుతాయి. ఒకవేళ రచయిత పేరు ఉన్నా, అది కాలక్రమేణా మారిపోయి ఉంటుంది.

**తెలుగులో ప్రసిద్ధ వీరగాథలు - ఉదాహరణలు**

తెలుగు వీరగాథా సాహిత్యం అత్యంత సంపన్నమైనది. ముఖ్యంగా మూడు వీరగాథా చక్రాలు ప్రసిద్ధి చెందాయి:

**పల్నాటి వీరచరిత్ర :**

శ్రీనాథ మహాకవి రచించిన పల్నాటి వీర చరిత్ర తెలుగు సాహిత్య చరిత్రలో ఒక విశిష్టమైన వీరగాథా కావ్యం. 12వ శతాబ్దంలో పల్నాడు ప్రాంతంలో (ప్రస్తుత పల్నాడు జిల్లా) జరిగిన చారిత్రక యుద్ధ ఘట్టాలను ఈ కావ్యం అద్భుతంగా వివరిస్తుంది.

**చారిత్రక నేపథ్యం**

పల్నాటి యుద్ధం ప్రధానంగా నలగామ రాజు (గురజాల పాలకుడు) మరియు అతని సోదరుడైన మలిదేవ రాజు (మాచర్ల పాలకుడు) మధ్య జరిగిన అధికార పోరు. దీనిని "ఆంధ్రా కురుక్షేత్రం" అని కూడా పిలుస్తారు.

**ప్రధాన పాత్రలు**

**బ్రహ్మనాయుడు** : మలిదేవ రాజు ప్రధాన మంత్రి. కుల వివక్షకు వ్యతిరేకంగా 'చాపకూడు' సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టిన సంస్కర్త.

**నాగమ్మ (నాయకురాలు నాగమ్మ)** : నలగామ రాజు మంత్రి. అసాధారణ తెలివితేటలు కలిగిన స్త్రీ మూర్తి, యుద్ధ తంత్రంలో ఆరితేరిన మేధావి.

**బాలచంద్రుడు** : బ్రహ్మనాయుడి కుమారుడు. అతి చిన్న వయసులోనే యుద్ధంలో అద్భుతమైన వీరత్వాన్ని ప్రదర్శించిన యోధుడు.

**సాహిత్య విశిష్టత**

**ద్విపద కావ్యం** : శ్రీనాథుడు ఈ కావ్యాన్ని పండిత పామరులకు సులభంగా అర్థమయ్యే ద్విపద ఛందస్సులో రచించాడు.

**వీర రసం** : యుద్ధ వర్ణనలు, వీరుల పరాక్రమం చదువుతుంటే రక్తం ఉప్పొంగేలా ఉంటాయి.

**సాంఘిక విప్లవం** : ఆ కాలంలోనే కుల మత భేదాలు లేకుండా అందరూ కలిసి భోజనం చేసే "చాపకూడు" పద్ధతిని ఈ చరిత్రలో చూడవచ్చు.

**కాటమరాజు కథలు :**

కాటమరాజు కథ తెలుగు జానపద సాహిత్యంలోని అత్యంత శక్తివంతమైన మరియు ప్రాచుర్యం పొందిన వీరగాథలలో ఒకటి. ఇది ప్రధానంగా 13వ శతాబ్దంలో నెల్లూరు చోడరాజులకు మరియు యాదవ రాజులకు మధ్య జరిగిన చారిత్రక యుద్ధాన్ని వివరిస్తుంది.

ఈ కథలోని ముఖ్య విశేషాలు ఇక్కడ ఉన్నాయి:

**చారిత్రక నేపథ్యం**

కృష్ణాతీరంలోని కనిగిరి ప్రాంతాన్ని పాలించే యాదవ రాజు కాటమరాజుకు, నెల్లూరును పాలించే మనుమసిద్ధి రాజుకు మధ్య "పుల్లరి" (గడ్డి కోసం చెల్లించే పన్ను) విషయంలో వచ్చిన వివాదం పెద్ద యుద్ధానికి దారి

తీసింది. దీనిని పంచలింగాల కొండ యుద్ధం అని పిలుస్తారు.

**ప్రధాన పాత్రలు**

**కాటమరాజు** : యాదవ వీరుడు, ధర్మ పరుడు. తన ఆవుల మందలను రక్షించుకోవడం కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన నాయకుడు.

**ఖడ్గ తిక్కన** : నెల్లూరు మనుమసిద్ధి సేనాని. యుద్ధంలో వెన్నుచూపక పోరాడి వీరమరణం పొందిన మహా యోధుడు. (ప్రముఖ కవి తిక్కన సోమయాజికి ఈయన బంధువు).

**అగుమంచి** : కాటమరాజు సోదరి. ఈమె పాత్ర జానపద గాథల్లో చాలా కీలకంగా, వీరవనితగా కని పిస్తుంది.

**బ్రహ్మరుద్రయ్య** : కాటమరాజుకు అత్యంత నమ్మకమైన వీరుడు.

**జానపద సాహిత్య విశిష్టత**

**వీరగాథా చక్రం** : పల్నాటి వీర చరిత్ర లాగే, ఇది కూడా ఒక పెద్ద వీరగాథా చక్రం. ఇందులో దాదాపు 32 ఉపకథలు ఉంటాయి.

**మౌఖిక సంప్రదాయం** : వందల ఏళ్లుగా జానపద కళాకారులు (ముఖ్యంగా కొమ్ముల వారు) ఈ కథను గానం చేస్తూ వస్తున్నారు.

**సామాజిక అంశాలు** : పశుపోషణే ప్రధాన వృత్తిగా ఉన్న యాదవుల జీవనశైలిని, వారి ఆచారాలను ఈ కథ ప్రతిబింబిస్తుంది.

**వీరగాథల సామాజిక ప్రయోజనాలు**

వీరగాథలు కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాలేదు. అవి సమాజంలో కొన్ని ముఖ్యమైన విధులను నిర్వహిస్తాయి:

**నైతిక బోధన** : ధర్మం కోసం ప్రాణాలర్పించడం, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం వంటి విలువలను ఇవి ప్రజల్లో నూరిపోస్తాయి.

**చరిత్ర రక్షణ** : లిఖితపూర్వక చరిత్ర లేని కాలంలో, జానపద వీరగాథలే చరిత్రను సజీవంగా ఉంచాయి.

**సాంస్కృతిక వారసత్వం** : జానపదుల ఆచారాలు, కట్టుబాట్లు, వేషధారణ ఈ గాథల ద్వారా మనకు తెలుస్తాయి.

**పాత్రలు - గాయకులు** : ఈ గాధలను వీరముష్టి, వీరభట, భద్ర పాద వంటి వర్గాల వారు పాడుతూ, ప్రజల్లో వీరత్వాన్ని, ఉత్తేజాన్ని నింపుతారు.

**సామాజిక ప్రాముఖ్యత** : ఇవి కేవలం కథలు కావు, ఆయా ప్రాంతాల సంస్కృతిని, న్యాయం కోసం జరిగిన పోరాటాలను, ప్రజల హృదయాలను కదిలించే కన్నీటి గాధలను (ఉదా: గరిబోళ్ళ కన్నీటి గాధలు) తెలియ జేస్తాయి.

ఈ వీర గాధలు తెలుగు ప్రజల చారిత్రక స్పృహకు, జానపద కళాత్మకతకు నిదర్శనాలు.

**వీరగాథా గాయక తెగలు - ప్రదర్శన రీతులు**

వీరగాథలను సజీవంగా ఉంచుతున్న గాయక తెగలు:

**పిచ్చుకుంట్లు** : పల్నాటి కథలను చెబుతారు. వీరు వంశావళులను కూడా భద్రపరుస్తారు.

**కొమ్ముల వారు** : కాటమరాజు కథలను గానం చేస్తారు. వీరి ప్రదర్శనలో వీరత్వం ఉట్టిపడుతుంది.

**శారదకాండ్రు** : బొబ్బిలి కథ వంటి గాథలను తంబుర (శారద) వాయిస్తూ శ్రావ్యంగా పాడుతారు.

**కళాకారుల జీవన చిత్రణ**

నేడు ప్రపంచీకరణ, యాంత్రిక జీవనం మరియు ఆధునిక వినోద సాధనాల ధాటికి ఈ అద్భుతమైన కళా రూపాలు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. గాయక తెగలు ఆర్థికంగా చితికిపోవడం, యువత ఈ విద్యను నేర్చుకోవడానికి ఆసక్తి చూపకపోవడం వల్ల వందల ఏళ్ల నాటి మన మౌఖిక సంపద కనుమరుగవు తోంది.

జానపద వీరగాథలు తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకలు. ఆధునిక కాలంలో సినిమా, టీవీ వంటి మాధ్యమాల ప్రభావం వల్ల ఈ కళారూపాలు అంతరించి పోతున్నాయి. కానీ, మన మూలాలను అర్థం చేసు

కోవడానికి, మన పూర్వీకుల శౌర్య ప్రతాపాలను తెలుసుకోవడానికి వీరగాథల పరిశోధన అత్యంత ఆవశ్యకం. "వీరగాథే జానపదుని ఇతిహాసం" అన్న మాట అక్షర సత్యం.

"ఒక జాతి తన చరిత్రను మర్చిపోతే, తన అస్తిత్వాన్ని కోల్పోయినట్లే." మన సంస్కృతిని, మన వీరుల సాహసాలను సజీవంగా ఉంచే ఈ వీరగాథలను రక్షించుకోవడం ప్రతి తెలుగువాడి బాధ్యత. కేవలం పుస్తకాల్లోని పరిశోధనలకే పరిమితం కాకుండా, ఈ కళాకారులను ప్రోత్సహించడం, వారి విద్యను డిజిటలైజ్ చేయడం ద్వారానే మనం మన 'ప్రాచీన జానపద కళా వైభవాన్ని' భావి తరాలకు అందించగలం.

**ముగింపు**

తెలుగు జానపద సాహిత్యంలో వీరగాథలు కేవలం కాలక్షేపానికి పాడే పాటలు కావు; అవి మన పూర్వీకుల రక్తంతో రాసిన 'సజీవ చరిత్ర పుటలు'. రాజుల ఆస్థాన కవులు రాసిన కావ్యాల్లో కేవలం వైభవాలు ఉంటే, ఈ వీరగాథల్లో సామాన్యుల వీరత్వం, త్యాగం, ఆనాటి సామాజిక వాస్తవాలు దాగి ఉన్నాయి.తెలుగు వీరగాథలు మన జాతి పౌరుషానికి శిఖర సదృశాలు. శ్రీనాథుడి వంటి మహాకవులే వీటి స్ఫూర్తితో కావ్యాలు రాశారంటే వీటి శక్తి అర్థమవుతుంది. నేటి యాంత్రిక యుగంలో కూడా ఈ గాథలు మన సంస్కృతికి మూలస్తంభాలుగా నిలిచి ఉన్నాయి.

**ఆధార గ్రంథాలు**

1. జానపద సాహిత్యము - వీర గాథలు - డాక్టర్ తంగిరాల సుబ్బారావు
2. తెలుగు జానపద గేయ సాహిత్యం - ఆచార్య బిరుదు రాజు రామరాజు
3. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి
4. తెలుగు జానపద గేయ గాథలు - ఆచార్య నాయని కృష్ణకుమారి

★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# నేటి సమకాలీన సమాజంలో జానపద కళా రూపాలు - కళాకారుల జీవన స్థితిగతులు



- డా॥. ఎలిపి రత్న ప్రసాద్

తెలుగు అధ్యాపకుడు, ప్రభుత్వ సిటీ జూనియర్ కళాశాల, హైదరాబాద్.

**వ్యాస సంగ్రహం**

ఆదిమానవుని మాట (కూనిరాగాలు), ఆటలు లయబద్ధత సంతరించుకుని క్రమంగా జానపదుల సాహిత్యం మరియు కళలకు మూలాలయ్యాయన్న విషయం అందరికి తెలిసిందే. ప్రపంచంలో చాలా దేశాలలో జానపద కళా సంపద ఉన్నట్లే మన దేశంలో కూడా జానపద కళా సంపద ఎంతో వుంది. అలాగే మనదేశంలోని ఇతర ప్రాంతాల్లో, రాష్ట్రాల్లో జానపద ప్రదర్శన కళలు ఎలా వున్నాయో మన ఆంధ్రా, తెలంగాణ ప్రాంతంలో కూడా అలాగే వున్నాయి. అయితే గమనించవలసిన అంశం ఏమిటంటే ఈ కళలు ప్రపంచంలో చాలా ప్రాంతాలలో నేటి ఆధునిక కాలంలో కూడా ఆదరణకు నోచుకోకపోవడం విచారించదగ్గ విషయం. కారణం ప్రపంచంలో సాంస్కృతిక పరంగా గాని, నాగరికత పరంగా గాని చోటు చేసుకుంటున్న సరికొత్త మార్పుల ప్రభావం ఈ కళల మీద దుష్ప్రభావం చూపాయని చెప్పవచ్చు.

**కీలక పదాలు :**

1. తప్పెటగుళ్ళు, 2. హరికథ, 3. బుర్రకథ, 4. గంగిరెద్దులోళ్ళు, 5. డప్పు కళాకారులు, 6. పగటి వేషాలు, 7.చిందు భాగవతులు, 8. తోలుబొమ్మలాట.

## పరిచయం

### తప్పెటగుళ్ళు

ఉత్తరాంధ్ర యాదవుల ముఖ్యకళారూపం 'తప్పెట గుళ్ళు' కళారూపం ఈనాటికి ఉత్తరాంధ్ర మొదలుకొని ఉత్తరాంధ్ర జిల్లాలోని చాలా గ్రామాలలో కొంత మంది గొల్ల కులస్థులు నేటికి చెక్కుచెదరకుండా ఈ కళను ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా ఈ కళారూపాన్ని గొల్ల కులస్థులు చేసుకొనే గావుసంబరాలలోను, గంగాదేవి పండగలలోను, గ్రామదేవతల పండుగ, దేవుళ్ళ సంబరాలు, శ్రీరామకొలువులోను ప్రదర్శినలిస్తారు. అప్పుడప్పుడు రాజకీయ నాయకుల, ప్రభుత్వ పథకాల ప్రచారంలోను, ఊరేగింపులోను ప్రదర్శిస్తారు. ఈ కళారూప ప్రదర్శనకు సంబంధించిన పాట మొదటగా శ్రీకాకుళం ప్రాంతంలో పుట్టి క్రమంగా ఉభయగోదావరి జిల్లాలలోని గ్రామాలలోకి వ్యాపించిందంటారు. ఈ కళరూపానికి నాలుగువందల సంవత్సరాల పైబడ్డ చరిత్ర ఉందంటారు జానపద విజ్ఞాన పరిశోధకులు. ఈ కళారూప ప్రదర్శన సందర్భంగా ప్రదర్శన కారులు పాడే పాటలకు సంబంధించిన ఇతి వృత్తాలు ఇలా వున్నాయి. రామాయణం, మహాభారతం, భాగవతం మొదలయిన పురణేతిహాసాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను ఇతి వృత్తాలుగా తీసుకుని ప్రదర్శన కారులు గేయాలు

అల్లుకుంటారు. వాటితోబాటు చెంచులక్ష్మి, సారంగధర పాట, తూర్పుభాగవత దరువులు, లక్షణ మూర్ఛ, తేలు పాట, గాజులోడిపాట, రెల్లివానిపాట, మందులోడి పాట, చుట్టపాట, పాలు, చల్లలమ్మటం మొదలయిన స్థానిక అంశాలను కూడా ఇతివృత్తాలుగా తీసుకుని పాటలుగా అల్లుకుంటారు. ఆ పాటల పరంగా ప్రయోగించే భాష విషయం చూస్తే ఈ కళారూప ప్రదర్శకులు ఎక్కువగా నిరక్షరాస్యులు గావడం వల్ల వీళ్లు వాడే భాష అంతా మాండలిక (స్థానిక) యాసతో కూడి ఉంటుంది.

'తప్పెటగుళ్ళు' కళారూప ప్రదర్శన గురించి పరిశీలిస్తే బృందంలో పదిహేను నుండి ఇరవై వరకూ ప్రదర్శకులు ఉంటారు. ఆ బృందానికి ఒక నాయకుడు ఉంటాడు. సాధారణంగా అతనే గురవై ఉంటాడు. తప్పెట గుళ్ళు కళారూపాన్ని ప్రదర్శించే సమయంలో ప్రదర్శకులంతా రంగురంగుల బనియన్లు ధరిస్తారు. "కాళ్ళకు గజ్జెలు కట్టుకొని ఒకే విధమైన రంగు రంగులనిక్కర్లను తొడిగి, లంగోటి లాంటి గోచీలను ధరించి, రేకుతో గుండ్రంగా తయారు చేసిన తప్పెటగుండెను గుండెకు కట్టుకొని రెండు చేతులతో వివిధ గతులలో ఉధృతంగా వాయిస్తారు. కేకలతో, అరుపులతో కేరింతలు కొడుతూ, ఆనందంగా గుండ్రంగా తిరుగుతూ శాస్త్రీయమైన అడుగులతో అందరూ గంతులేస్తూ, గెంతుతూ సుదీర్ఘ రాగాలతో ఆలాపన చేస్తూ తప్పెటలను కొడుతూ పాటలు పాడతారు!". ఇలా ప్రదర్శన జరుగుతుండగా ప్రదర్శన స్థాయి పెరిగే కొద్దీ బృందంలో ఒకరిని మించి మరొకరు దరువులు వేస్తూ, దరువులకు అణుగుణంగా ఆడుతూ తమ ప్రతిభావిశేషాలను ప్రదర్శిస్తుంటారు. వాయిద్య వరుసల్నీ, గమకాల్నీ వినిపిస్తారు. అలా చేస్తూ ప్రదర్శన పతాక స్థాయికి చేరే సరికి బృందంలో కొంత మంది సర్కస్ ఫీట్లు లాంటి ఫీట్లు కూడా చేస్తారు. నృత్యం చేస్తూనే లయ, వలయాకారం తప్పకుండా చిందులు తొక్కుతూనే ఒక ప్రక్క తప్పెట్లు వాయిస్తూనే నెమ్మదిగా ఒకరిమీదకు మరొకరు అంచెలంచెలుగా గోపురం ఆకారంగా నిలిచి చివరన మరో వ్యక్తి నిలబడి తప్పెట్లు వాయిస్తాడు. తరువాత ఒక్కొక్కరుగా దిగుతారు. కొంత మంది మొగ్గలు వేస్తుంటారు. ఇలా ప్రదర్శిస్తున్న బృందం నుండి ఒక కళాకారుడు వెల్లకిలా కింద పడుకుని కాళ్ళను భూమికి తాకించి వలయాకారంలో తిరుగుతూ దరువు వేస్తాడు. ఒక్కొక్కసారి కుండ మీద కూడా నిలబడి నృత్యం చేస్తారు. ఈ సందర్భంలో తప్పెటలనుంచి వచ్చే శబ్దం ఎక్కువగా ఉంటుంది. అలాంటప్పుడు వాళ్లు పాడుతున్న పాట స్పష్టంగా పైకి వినిపించదు. దీనికి ఒక్కొక్క సారి గజ్జెల శబ్దం కూడా తోడవుతుంది.

ఈ కళారూప ప్రదర్శకులు ప్రదర్శన సమయంలో ఆలపించే సాహిత్యం గురించి పరిశీలిస్తే ప్రారంభ సమయంలో 'శివశివ మూర్తివి గణనాథా, నీవు శివునీ కుమారుడవు గణనాథ' అంటూ ప్రార్థనతో పాట మొదలు పెడుతుంటారు. తరువాత 'గన్నేరుపువ్వులతో గణనాథ, నీకు గనంగా పూజింతు గణనాథ' అంటూ ఏఏ రకాల పూలతో శివుణ్ని పూజిస్తారో ఆ పూల పేర్లు పాటలో కలిపి పాడుతారు. తరువాత ప్రదర్శనలోని ముఖ్యాంశానికి సంబంధించిన పాట పాడుతారు. పైవిధంగా ప్రదర్శన కొన్ని గంటల పాటు సాగిపోతుంది. మొత్తం మీద ఈ కళారూపం కళింగాంధ్రలో పుట్టినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శింపబడుతుంది. ముంబై, ఢిల్లీ, పాట్నా మొద లయిన ప్రాంతాలతో పాటు శ్రీలంక, అమెరికా లాంటి ఇతర దేశాలలో కూడా కొన్ని సందర్భాలలో ఈ కళారూపం ప్రదర్శింపబడింది.

**హరికథ**

హరినామాన్ని కథగా ప్రచారం చేయడమే హరికథ. పూర్వ యుగాలలో నారదుడు మూడు లోకాలలో హరి నామాన్ని ప్రచారం చేసినట్లు, దానివల్ల మొదటి కథకుడు నారదుడే అని కొంత మంది అభిప్రాయం. ఈ ప్రదర్శన కళ ఆంధ్రదేశంలో అన్ని జానపద కళారూపాలతో కలసి ప్రదర్శింపబడుతూ నేటికీ మంచి ప్రజాధారణ పొందిన కళగా చెప్పవచ్చు. ఈ కళారూపం అటు పండితుల్ని ఇటు పామరుల్ని కూడా రంజింప చేయగలశక్తి కలిగినది. ఈ కళకు ఆంధ్ర ప్రాంతాల్లో మంచి వన్నె తెచ్చిన వారు 'ఆదిభట్ల నారాయణ దాసు'.

ఈ కళారూప ప్రదర్శన గురించి పరిశీలిస్తే, హరికథ

కళారూపంలో ఒకే పాత్రధారి రాత్రి పది గంటలు మొదలుకొని తెల్లవార్లూ నాలుగు గంటల వరకు కథాగానం చేస్తాడు. ఇతనికి సహాయకులుగా మృదంగం, వాయులీనం, హార్మోనియం పై ఇతర కళాకారుల సహకారం ఉంటుంది. అయితే ఒకే వ్యక్తి అన్ని పాత్రల లోనూ జీవించి రసవత్తరంగా నటిస్తాడు. నోటితో వాచకం చెబుతూ, మృధుమధురమైన గానం పాడుతూ, ముఖంలో సాత్వికం, కాలితో నృత్యం, చేతులతో ఆంగికం సృష్టిస్తూ ఆకర్షణీయమైన ఆహార్యంతో ఏకకాలంలో అభినయిస్తాడు. హరికథలలో ఉన్న ప్రత్యేకతిదే. అందుకే హరికథ అంటే సర్వకళల 'సమాహారం' హరికథలో సంగీత సాహిత్యాలతో పాటు నాట్యం, నటన, హాస్యం కూడా ఉన్నవి. ప్రేక్షకులు విసుగు చెందకుండా మధ్య మధ్యలో పిట్టకథలు చెబుతూ, జోకులువేస్తూ నవ్విస్తుంటాడు. ఇందులో పురాణప్రవచనమూ ఉంది. హరికథకుడు గొప్ప ఉపన్యాసకుడు కూడా.

హరికథ ప్రదర్శన సందర్భంలో గానం చేసే పాటలకు సంబంధించిన ఇతివృత్తాల గురించి పరిశీలిస్తే ముఖ్యంగా రామాయణం, మహాభారతానికి సంబంధించిన కథాంశాలే ఆధారం. అటు తరువాత నర్తన శాల, భక్త మార్కండేయ, శివలీలలు, భక్త నందన, వీరబ్రహ్మంగారి జీవిత చరిత్ర, భక్త సిరియాల, ప్రహ్లాద చరిత్ర, రుక్మిణి కల్యాణం మొదలయిన వృత్తాంతాలను నేడు కథలుగా చెబుతున్నారు. హరికథ చెప్పే కథకుడు ఎంతో నిష్టగా ఉండాలి. అవసరమయిన సందర్భాలలో ఉపవాసాలు కూడా చేయాలి. హరికథ నేర్చుకుంటే వచ్చే విద్యకాదు. కథకుడికి స్వయంగా ఓ ప్రత్యేకత ఉండాలి. ఆంధ్ర దేశంలో ఈ ప్రదర్శన కళ ఒక్క కోస్తాలోనే కాకుండా, రాయలసీమ తెలంగాణ మొదలగు అన్ని ప్రాంతాలలో చిన్న చిన్న తేడాలతో ప్రదర్శింపడబడుతుంది.

**బుర్రకథ**

బుర్రల సహాయంతో కథ చెప్పబడుతుండడం వల్ల ఈ కళారూపానికి బుర్రకథ అని పేరు వచ్చింది. ప్రదర్శనకు సంబంధించి ప్రధాన కథకుడు వాడేది తంబూరా. అతనికి ఇరువైపులా ఇద్దరు వంతగాండ్లు ఉంటారు. వాళ్లు గుమ్మెట అనే పేరుగల వాయిద్యాన్ని ప్రదర్శన సందర్భంలో ఉపయోగిస్తారు. ఆ గుమ్మెటలను కొన్ని ప్రాంతాలలో బుర్రలు అంటారు. ఇలా బుర్రల సహాయంతో నడిచే కళ కాబట్టి ఈ కథా రూపానికి బుర్రకథ అని పేరు వచ్చింది. మరికొంత వివరంలోకి వెళితే 'వీధి భాగవతం, యక్షగానాలు, బుర్రకథకు జన్మస్థానాలని కొందరంటుండగా, శారదాకాండ్ర కథలు ఆధారంగా, జంగం కథలు ఆధారంగా బుర్రకథలు పుట్టాయని మరికొందరి అభిప్రాయం. శారద కథలలోను, జంగం కథలలోను తంబూర, డిక్కీలు ఉంటాయి. శారదా కాండ్రు ధరించిన తంబూరాకే శారదా (శారదా అనగా సరస్వతి) అనిపేరు. అలాగే జంగాలు దానిని సితార అని, దాసరు తామర అని అంటారు'.

ఈ కళారూపానికి సంబంధించిన ప్రదర్శన వివరాల గురించి పరిశీలిస్తే కథకుడు ఇద్దరు వంతలకు మధ్యలో ఉండి ముఖ్య కథని గానం చేస్తుంటాడు. కథతో పాటు మధ్య మధ్యలో ఇతర విషయాలు చెబుతూ ప్రేక్షకుల్ని రంజింపజేయడానికి చూస్తుంటాడు. మధ్యలో ఇద్దరు వంతలలో ఒకరు కథకుడు పాడుతున్న పాటని వచన రూపంలో వివరిస్తుంటాడు. దానికి కొంత స్థానిక రాజ కీయాల్ని సందర్భాన్నిబట్టి జోడిస్తుంటాడు. అతని తరువాత మరొక వంత హాస్య సంబంధమైన సంభాషణలను జోడిస్తాడు. ఇలా ప్రధాన కథ జరుగుతుంటే అప్పుడప్పుడు కథా వేగాన్ని ఆపి కథను ఇంకా రసవత్తరం చేసి ప్రేక్షకుల్ని రజింపజేయడానికి వంతలు ఇలాంటి ముక్తాయింపులు ఇస్తుంటారు. ముక్తాయింపు అంటే సాగిపోతున్న కథను తాత్కాలికంగా ఆపడం. ఆసందర్భంగా వాళ్లు వాడే ముక్తా యింపు మాటలు ఇలా ఉంటాయి. 'తరికిట ఝుంతరిత, తకిటతకిట తకదరికట దరికటత, తకతకఝుంత తకతక ఝుంట ధింత, తధిమితకిటతక ఝుంతరికిటకత, తధిమిత కిటతక తధిమి తకిట తకత' అనేవి సాధా రణంగా వాళ్ళు ఉపయోగించే ముక్తాయింపులు. మొత్తం మీద ప్రధాన కథకు భంగం కలిగించకుండా ప్రేక్షకుల్ని రంజింపజేస్తుంటారు. బుర్ర కథకు సంబంధించిన సాహిత్యం గురించి సంభాషిస్తే పౌరాణిక అంశాలతో పాటు సామాజిక అంశాలను కూడా ప్రస్తావిస్తుంటారు.

నిజానికి ఈ కళారూపం పుట్టుక గురించి కొన్ని అభిప్రాయాలున్నాయి. ఇవి జంగమ కథల నుండి పుట్టాయని కొంత మంది అంటున్నారు. ఈ బుర్ర కథ కథా రూపాన్ని ఉపయోగించుకుని కొంత మంది వామపక్ష వాదులు తాము చేసే ఉద్యమాలకు అనుగుణంగా కళా రూపాన్ని మార్చుకుని తమ సిద్ధాంతాలను ప్రచారం చేసుకుంటున్నారు. 1942 ప్రాంతంలో గుంటూరు జిల్లా బాపట్ల ప్రాంతానికి చెందిన కాకమాని సుబ్బారావు అనే వామపక్ష ఉద్యమకారుడు ఈ కథ ఆధారంగానే బాబురావు బుర్రకథ అనే పేరుతో ఓ బుర్రకథ రచించాడు. దానిని స్వయంగా ఆయనే గానం చేశాడట. ఈయనే ఆధునిక బుర్రకథలకు ఆద్యుడని కొంతమంది అభిప్రాయం. ఈయన తరువాత షేక్ నాజర్ ఈ కళారూపాన్ని ఖండాంతరాలలో పరిచయం చేసాడు. ఈ స్ఫూర్తితో ఆంధ్ర దేశంలో చాలా చోట్ల అనేక బుర్రకథ దళాలు వెలిసాయి.

బుర్రకథలలో సాంఘికాలు, పౌరాణికాలు, చారిత్రకాలు, ప్రబోధాత్మకాలు అనే నాలుగు రకాలు ఉన్నట్లు జానపద విజ్ఞాన విశ్లేషకుల అభిప్రాయం. ఉత్తరాంధ్ర ప్రాంతంలో విజయనగరం జిల్లాకు చెందిన కుమ్మరి మాష్టారు (బి.ఎ. నారాయణ) ఈ ప్రక్రియకు బాగా వన్నె తెచ్చారు. అటు తరువాత రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది కళాకారులు ఈ కళారూపాన్ని ప్రదర్శిస్తు న్నారు. ఒకప్పుడు స్వాతంత్ర ఉద్యమంతో పాటు సంస్కరణోద్యమాలకు ఎంతగానో చేయూతనిచ్చింది. ఈ కళారూపం. అయితే నేటి సినిమాల, టీవీల ప్రభావం ఈ రూపకానికి కొంత ఆదరణ తగ్గిందని చెప్పవచ్చు.

**గంగిరెద్దులోళ్ళు**

రాష్ట్ర వ్యాప్తంగా అక్కడక్కడ కనిపించే కళారూపం గంగిరెద్దులు. 'గంగిరెద్దోలమయ్యా.. మేము గరీబోల మయ్యా...' అని పాడుతూ గ్రామగ్రామంలో వీళ్లు అప్పుడప్పుడు దసరా, సంక్రాంతి పండగ సమయాలలో కనిపిస్తుంటారు. వీళ్లు ఒక గంగిరెద్దును ఎన్నుకొని దానికి బాగా ముస్తాబు చేసి తీసుకొస్తారు. ఒక్కక్క ఇంటికి వెళ్ళి అయ్యగారికి దన్నం పెట్టు అమ్మ గారికి దన్నం పెట్టు "డూ......డు... డూ..... బసవన్నా" అంటూ గంగిరెద్దు చేత కొన్ని కదలికలు చేయిస్తారు. "గంగిరెద్దులోళ్లు" యాదవులలో ఒక భాగమని చెప్పుకుంటారు. కాని గొల్లలకు వీరికి ఎటువంటి సంబంధాలు లేవు. గంగి రెద్దుల కులస్థులలో మగవారు గంగిరెద్దు పట్టుకొని ఊరంతా తిరిగితే ఆడవారు గ్రామాలలో కరక్కాయలు, దగ్గు మందులు, గిలకలు, అమ్మేవారు. నేడు ఆ పరిస్థితులు కథలో ఉపయోగించే సాహిత్యం గురించి పరిశీలిస్తే, ఇందులో ఎక్కువగా పౌరాణికాంశాల్నే కథలుగా మలిచి పాడుకొంటారని అర్థమవుతుంది. శశిరేఖా పరిణయం, విరాటపర్వం, పురూరవ చరిత్ర, జలగన్న పార్వతి, నాగమ్మ, అలకాదేవి కథ, కాంభోజరాజు, రెక్కలరంభ, సారంగధర, రేణుకా ఎల్లమ్మ మొదలయిన వాటితోబాటు భారత, రామాయణాలకు సంబంధించిన కొన్ని అంశాల్ని కూడా పాటలుగా తయారు చేసుకొని పాడుతుంటారు. ఉదాహరణకు రామాయణానికి సంబం ధించిన ఒక పాట కింది విధంగా ఉంటుంది. సందర్భం సీతాదేవి వనవాస సమయంలో తన కష్టాన్ని తలుచు కుంటూ పాడిన పాట ఇది. "అన్నికాది దేవుడా దేవుడా ఓరి, పాపిష్టి జన్నంబు దేవుడా ఓరి, ఏల యిచ్చినావు దేవుడా ఓరి, ఆడపుట్టు గాకుంటే దేవుడా ఓరి, అడవిలోన నేను దేవుడా ఓరి, రుచ్చమై పుట్టుంటే దేవుడా ఓరి, భగవంతుడా నీకు దేవుడా ఓరి, పగదారినైనాను దేవుడా ఓరి, గోలుమని సీతమ్మ సీతమ్మ ఓరి అది ఘోష పెడతాది సీతమ్మ ఓరి...." అంటూ పాట సాగిపోతుంటుంది. ఈ విధమయిన పౌరాణికాంశాలకు సంబంధించిన పాటలే కాకుండా కొన్ని సమీప, ప్రాచుర్యమున్న అంశాల్ని కూడా ఇతివృత్తులుగా తీసుకొని పాటలు కట్టి పాడుతుంటారు. కథ మధ్యలో ప్రేక్షక సమూహానికి పరిచయమయిన అంశాల్ని గురించి కూడా కథలుగా పాడుతుంటారు. ఇవే కాకుండా ఒకోసారి కొన్ని చారిత్రక ఘట్టాల్ని కూడా గుర్తుకు తెచ్చే అంశాల్ని పాటలుగా పాడడం కనిపిస్తుంది. ఉదాహరణకు రెండో ప్రపంచ యుద్ధాన్ని దృష్టిలో పెట్టుకొని కింది పాటను పాడడం కనిపిస్తుంది. "రంగం జపానోడి బాంబులతో జలది పుట్టింది, అమెరికావోడు ఏసిన బాంబులతో అందరము " వచ్చాము..." అని

పాడడాన్ని బట్టి ఈ పాటలు రెండవ ప్రపంచ యుద్ధం ప్రస్తావన కనిపిస్తుంది. రంగం అంటే రంగూన్ దేశం. నేడు దానిని మయన్మార్ అని పిలుస్తున్నారు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో మయన్మార్ దేశంపై బాంబులు పడ్డట్టు అక్కడ బ్రతుకుదెరువుకోసం వెళ్లిన భారతీయులు వెనుదిరిగి వచ్చిన సన్నివేశాలు, సందర్భాలు ఈ పాటలో చోటు చేసుకున్నాయి.

ఇంకా చెప్పాలంటే కథకులకు గ్రామస్తులు ఎవరయినా డబ్బులిచ్చి తమ గురించి పాడమని అడిగి మరీ పాడించుకుంటుంటారు. ఆ సమయంలో దాతలకు అన్ని విషయాలలో శుభాలు జరగాలన్న ఉద్దేశంతో పాటలు పాడతారు. ఉదాహరణకు "ధనధాన్య సంపదలు కలిగే ఉండాలి, తాళవే బంగారు మేడలుం డాలి, పాడియిచ్చిన పాడి ఆవులుండాలి, రచ్చలో వాళ్ళ మాట ఎచ్చుగుండాలి, ఎప్పటికి వారింట లక్ష్మి ఉ ండాలి.." అంటూ దీవెనలు కురిపిస్తారు. డబ్బులు లేక దానాలు యిచ్చిన వారికి కృతజ్ఞతా పూర్వకంగా పాడే పాటలు పై విధంగా ఉంటాయి. ఇవే కాకుండా అనుదినం సాధారణ జీవితంలో సంభవించే కొన్ని ముఖ్యాంశాల్ని కూడా పాటలు కట్టి పాడుతుంటారు. 'రెల్లి చిన్నది పాట' (ఇది ఒక ప్రేమ గీతం రెల్లి కులానికి చెందిన యువతిని అగ్రకులానికి చెందిన యువకుడు ప్రేమిస్తూ పాడే పాట). 'అమ్మవారు పాట', 'పార్వతమ్మ పాట', 'గొర్రెపోతులు పందెం',. 'కొమ్మల్లో ఆదెన్న', 'కమ్మవారి గణపతి' మొదలయిన పాటలు పాడు తుంటారు. ఆ పాటలలో నవరసాలకు ప్రాధాన్య ముండడం విశేషం.

**డప్పు కళాకారులు**

'డప్పు' కూడా ఒక జానపద వాయిద్య పరికరమన్నది అందరికీ తెలిసినటువంటిదే. కళాకారులు రాష్ట్రవ్యాప్తంగా ఉండడమే కాకుండా నేటికీ ఈ వాయిద్యం సమాజంలో ఉనికి కోల్పోకుండా ఉన్న విషయం కూడా మనం చూస్తున్నాం. డప్పుని కొన్ని ప్రాంతాల్లో 'తప్పెటని' పిలుస్తున్నారు. తెలంగాణా ప్రాంతంలో 'కనక తప్పెటని' ప్రచారం వుంది. రాష్ట్రంలో చాలా చోట్ల చూస్తే డప్పును పయోగించి నృత్యాలు చేసేవాళ్ళు గానీ, డప్పును వాయించేవాళ్ళు గానీ, దళితులలో మాదిగ కులానికి చెందిన వాళ్ళే ఎక్కువగా కనిపిస్తుంటారు. అయితే

ఉత్తరాంధ్ర ప్రాంతం విషయానికొచ్చేనరికి మాదిగలతోబాటు మాల, జగ్గిలి కులస్థులు కూడా కొంతమంది డప్పు వాయించడాన్ని వంశపారంపర్య కళగా చేసుకొని ఉండడం కనిపిస్తుంది.

డప్పు వాయిద్యం నుండి వెలువడే శబ్దం చాలా ఉద్రేకంగా ఉంటుంది. ఈ నాటికీ పలు పల్లెల్లో ఏదైనా ఒక కార్యక్రమాన్ని గానీ, ఒక విశేషాన్ని గానీ ప్రజలందరికీ తెలియజెప్పాలంటే ఒక్క డప్పుతో ఊరంతా ఎటువంటి విషయాన్నయినా చాటిస్తారు. వివాహాలకూ, అమ్మవారి జాతర్లకూ, వీరుళ్ళ పూజలకు ఈ వాయిద్యాన్ని ఎక్కువగా ఉపయోగించడాన్ని, మన గమనించవచ్చు. ఇదేకాకుండా డప్పు వాయిచండంలో కూడా అనేక రకాల నైపుణ్యాలు కనిపిస్తాయి. ఈ వాయింపులూ ఆయా సమయాల్ని బట్టి వరుసలు మారుతుంటాయి కూడా. ఎలా అంటే పెళ్ళి సమయంలో జరిగే ఊరేగింపులకు వాయించే తీరుకీ, దేవుళ్ళ, దేవతల ఉత్సవాలు, జాతర్లలో వాయించే తీరుకీ, పులివేషాలు దగ్గర వాయించే తీరుకీ మనుషులు ఎవరయినా చనిపోయినప్పుడు వాయించే తీరుకీ తేడాలు చాలా స్పష్టంగా కనిపిస్తాయి. ఇక ఏదైనా సమాచారాన్ని గానీ సందేశాన్ని సమాజానికి చేరవేయవలసినప్పుడు వాయించే తీరు కూడా ప్రత్యేకంగా ఉంటుంది. నేటికీ సినిమాలకు సంబంధించిన చాలా పాటలలో ఇతర ఆధునిక సంగీత వాయిద్యాల్ని ఉపయోగిస్తూ అప్పు డప్పుడు ఈ డప్పును కూడా ఉపయోగించడం గమనించవచ్చు.

ఆకారం గురించి పరిశీలిస్తే 'డప్పు' గుండ్రంగా వుంటుంది. వేపచెక్కలతో గానీ, చంద్రపు చెక్కలతోగానీ గుండ్రని చట్రాన్ని తయారు చేస్తారు. గేదెదూడ చర్మాన్ని ఉపయోగించి ఆ చట్రాన్ని ఒక పక్క మూసేస్తారు. వాయించడంలో లావుగా ఉండే కోవులాంటి కర్ర ఒకటి, దానికంటే కొంచెం పొడవుగా ఉండే సన్నని బద్ద ఒకటి ఉపయోగిస్తారు. ఈ డప్పు వాయించడానికి కొంచెం

ముందుగా నిప్పు సెగ కాయించి వాయిస్తే పెద్దగా కణ్ కణ్ మనే శబ్దం వస్తుంది. సాధారణంగా 'దండోరా' సమయంలో ఒకటి లేక రెండు డప్పులుపయోగించబడితే మిగిలిన సమయాల్లో ఎక్కువగా ఉపయోగించ బడతాయి. ఎక్కువగా ఉన్నప్పుడు అవన్నీ కలసి ఒక్కసారి మోగుతుంటే వచ్చే గంభీరనాదం ఒక ప్రళయంగా ఉంటుంది. ఎంతో ఉత్తేజాన్ని కలిగిస్తుంది కూడా. డప్పు కళాకారులకు సంబంధించి ప్రత్యేక సాహిత్యమంటూ ఏమీ లేదు. డప్పు నుండి ఉద్భవించే ధ్వనులు వాళ్ళు నాట్యం చెయ్యటానికి ఇంకా ఇతరులు నాట్యం చెయ్యటానికి ఉపయోగపడతాయి. ఒక్క చిందు నృత్యంతోబాటు ఆ తరహా నృత్యాల సమయంలో డప్పు వాయించడం డప్పు కళాకారులు చేస్తుంటే చిందువేసే వ్యక్తి మాత్రం సందర్భాన్ని బట్టి పాటలు పాడుతుంటాడు. అదే తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలలో అయితే డప్పుల్ని వాయిస్తూ కళాకారులు కోలాటం వేస్తారు. ఆ సమయంలో వాళ్ళు పాటలు పాడుతారు. ఆంధ్రదేశంలో డప్పులు వాయిద్యం ద్వారా ప్రచారం పొందిన పాట "తాలే లిల్లయ్యలో, శివతాలే లిల్లయ్యలో కులమే లాగున్నది, వినుమయ్యలో మూలము గోచర్మ - మైదుకీళ్లు గల, గోలుబొమ్మలట - ఈ జగమే" పాట ఇలా కొనసాగిపోతుంటుంది. ఈ కళలో నైపుణ్యం గల వాళ్ళు కోసాంధ్రలో చాలా మంది ఉన్నారు. శ్రీకాకుళం నుంచి గుంటూరు జిల్లా వరకూ ఉన్న ప్రాంతంలో ఈ కళాకారులు కనిపిస్తారు.

**పగటి వేషాలు**

తెలుగు ప్రజలకు ఉన్న అపూర్వ జానపద కళా సంపదలో పగటి వేషం ఒకటి. సంగీతం, సాహిత్యం మరియు నృత్యం మొదలయిన కళల్ని అభినయిస్తూ పండితుల్ని పామరుల్ని కలగలిపి ఆనందపరుస్తూ మెప్పించే ఈ కళ పగటి వేషకళ. ఈ కళ కొంత చారిత్రక నేపధ్యాన్ని కలిగి ఉన్నట్లు అర్ధమవుతుంది. తెలుగు సాహిత్యంలో పగటి వేషం కళ వేములవాడ భీమ కవి కాలంలో కనిపించిందని కొంతమంది పరిశోధకుల అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే ఈ కళ 19వ శతాబ్దంలో మైసూరు ప్రాంతం నుంచి తెలుగు ప్రాంతంలోకి వచ్చినట్లు మరికొంతమంది పండితుల అభిప్రాయం. సాధారణంగా పగటి వేషాలు గ్రామ దేవతల జాతరలు, దసరా ఉత్సవాల సందర్భంగా వేయబడు తుంటాయి. ఈ కళ ప్రదర్శించే కళాకారులు వివిధ దేవుళ్ళ వేషాలకు ఆధునిక నాగరిక చిహ్నాలు కొన్ని జోడించి ప్రజల్ని ఆనంద పరుస్తుంటారు. ఈ పగటి వేషాల గురించి జానపద ప్రదర్శన కళల గురించి పరిశోధన చేసిన శ్రీ బద్రి కూర్మారావు ఇలా చెబుతున్నారు. 'కృతయుగం, త్రేతాయుగం, ద్వాపర యుగం, కలియుగాలకు సంబంధ మైనవి పగటివేషాలు. కృతయుగంలో దేవతలు, రాక్షసులు సాగర మధనం చేస్తున్నప్పుడు అమృతం పుడుతుంది. ఆ అమృతం రాక్షసుల పాలుకాకుండా చేసేందుకు సాక్షాత్తు మహావిష్ణువే మోహినీ వేషం వేసుకుని అమృతం దేవతలకు పంచి పెట్టడం జరిగింది. త్రేతాయుగంలో శ్రీరాముని ధర్మపత్ని సీతాదేవిని అపహరించుకు పోవడా నికి లంకాధిపతి రావణుడు జంగమ వేషధారియై తన కార్యం నెరవేర్చుకున్నాడు. ద్వాపర యుగంలో రక్తి కట్టించాడు. కలియుగంలో రాజ్యాన్ని కాపాడడానికి ఊర్వశి శాప ఫలితంగా అర్జునుడు బృహన్నల వేషంతో కళింగరాజు గంగరాజు వేషం వేశాడని చరిత్ర చెబుతోంది'. ఈ అంశమే కాకుండా పగటి వేషాలు వేసే కళాకారులు పౌరాణిక పాత్రలతో పాటు కొన్ని చారిత్రక పాత్రలు కూడా వేస్తుం టారు. ఈ సమయంలో సమకాలీన సమాజానికి సంబం ధించిన అంశాలను సంభాషణలను జోడించి ప్రజలను మెప్పిస్తుంటారు. అయితే ఇతర జానపద రూపకాలకు వలెనే ఈ కళా రూపానికి కూడా కళాదరణ తగ్గిందని చెప్పవచ్చు.

**చిందు భాగవతులు**

తెలుగు జాతికి గర్వకారణమే నేడు అంతరించి పోతున్న కళా స్వరూపాలల్లో చిందు యక్షగానం ఒకటి. ఇది అణగారిన అంటరాన్ని కులాన్ని ఆసరాగా తీసుకొని అభివృద్ధి చెందింది. శబ్దరత్నాకరం ప్రకారం నిండైన కళాపాత్ర నుండి రాలిపడిన చిన్న కళారూపం, నేడు ఇది సముద్రమంత అయి, తెలంగాణ ప్రాంతాన్ని అంతా

ఆక్రమించుకొని అలరారారుచున్న గొప్ప కళాఖండం. దీనిని ఆధారంగా చేసుకొని ఎన్నో కుటుంబాలు ఆనాడు జీవనం కొనసాగించాయి. ఆనాడు వృత్తులు చాలా గౌరవింపబడేవి. ఆ వృత్తుల ఆధారంగా కొన్ని జాతులు ఏర్పడ్డాయి. ఆ జాతులను వినోదపర్చడానికి కొన్ని తెగలు ఏర్పడ్డాయి. అలా ఏర్పడిన తెగలే చిందు వారు. మాదిగ కులస్తులపై ఆధారపడి జీవించే కళాకారులు. ఎక్కువగా తెలంగాణ ప్రాంతంలో నివసిస్తున్నారు. వీరు తమ కులపురాణమైన జాంబ పురాణంతో పాటు మిగతా కథలని కూడా ప్రదర్శిస్తారు. మొదట్లో వీరి ప్రదర్శనలు మాదిగలకే పరిమితమై, ఇప్పుడు అందరికీ అందుబాటు లోకి వచ్చాయి. వీరు ఎక్కువగా భగవంతునికి సంబంధించిన కథలనే ప్రదర్శించేవారు. వీరిని చిందు భాగవతులని పిలిచేవారు

**చిందు కళాకారులు - జీవన విధానం**

ప్రదర్శనలు తగ్గడం వల్ల వారికి పూట గడవడమే కష్టమయింది. ఒక్కో ఇంట్లో సుమారు 10 మంది దాకా ఉంటారు. అందుకే తమ కుటుంబాన్ని పోషించు కోవడానికి పొలం పనులకు, కూలిపనులకు వెళ్ళడం, మట్టి మోయడం, కొందరు పట్టణానికి వలసివచ్చి హోటళ్ళలో పనిచేయడం కలదు. కూడు దొరకని రోజుల్లో పిట్టలు, గువ్వలు, కౌంజులు, బురక పిట్టలను పట్టుకొని తిని ఏరోజుకారోజు గడుపుతున్నారు. ముఖ్యంగా చిందు యక్షగానం కుల పురాణానికి సంబంధించినది కావడం వల్ల మాదిగ వారిపై ఆధారపడి జీవించే ఆశ్రితకులం కావడం మాదిగవారు వల్ల సమకాలీన పరిస్థితులలో దాని మనుగడ ప్రశ్నార్థకం అయ్యింది. సమాజంలో రోజురోజుకీ వస్తున్న మార్పుల వల్ల కులాల పట్టింపుల ప్రాముఖ్యం తగ్గిందనే చెప్పవచ్చు. జాంబపురాణం అగ్రకులాలపై సంధించిన అస్త్రం. మాదిగవారు తమ ప్రాబల్యాన్ని గుర్తింపును పెంపొందించుకోవడానికి మరియు సమాజంలో ఒక గుర్తింపు రావడానికి జాంబపురాణాన్ని ఒక సాధనంగా వాడుకున్నారని చెప్పవచ్చు. అయితే మారుతున్న కాలంతోపాటు ఆయా కులస్థులతోపాటు వీరిలో కూడ ఆర్థిక అసమానతలు తొలిగి మిగతా వారితో సమానంగా తమ మనుగడ కొనసాగే పరిస్థితి వచ్చినందు వల్ల వీరి కళారూపాల ఆవశ్యకతను ఇప్పుడున్నవారు గుర్తించటం లేదు. "మీకు రెక్కలున్నాయి-మాకు రెక్కలున్నాయి. మేమే మాదిగతనం యిడిసిపెడుతున్నాం- మీకేంది ఇచ్చేది" అంటుండ్రని స్వయానా ఎల్లమ్మే చెప్పడం వల్ల ఆ కులాల్లో మార్పును గమనించవచ్చు. అలాగే ప్రభుత్వం పేదలకు భూములు ఇవ్వడం వల్ల మాదిగ వారితో పాటు చిందు వాళ్ళకు కూడా భూములు రావడం, వారు కూడావీరిపై ఆధారపడే స్థితిలో లేక పోవడం. అప్పుడప్పుడు మీకు కూడా మాలాగే భూము లున్నాయి కదా అడుక్కోవడం దేనికి అనే మాటలు మాదిగ వారి నుంచి ఎదుర్కొనటం కలదు. పది మందిలో ఒక్కరి దగ్గర నుంచి ఇలాంటి సమాధానాలు వస్తున్నా తరతరాలుగా వస్తున్న తమ సంప్రదాయాన్ని నేటికీ కాపాడుకుంటూనే వస్తున్నారు. జాంబపురాణం కేవలం మాదిగల, చిందుల గొప్పతనాన్ని చెప్పడానికే సృష్టించబడి నందువల్ల బ్రాహ్మణులను నిందించడం, మిగతా కులాల వారిని తిట్టడం, సబ్బండ జాతిలో మాదిగలు చిందులే గొప్పోళ్ళని చెప్పడంతో, కొన్ని ఊర్లలో మిగతా కులాలవాళ్ళు ఎల్లమ్మ ఆట ఆడించటం ఆపేశారు. దాని వల్ల వీరి ప్రదర్శనలు తగ్గి జీవనం కష్టమైందని ఒక వాదన.

**తోలుబొమ్మలాట**

ఆంధ్ర దేశంలో అనేకాకుండా యావద్భారతదేశంలో కూడా ప్రచారం, ప్రసిద్ధి కలిగిన జానపద కళారూపాలలో తోలుబొమ్మలాట ఒకటి. ఇది అతి ప్రాచీన కళ అని పెద్దల అభిప్రాయం. ఇది మరాఠా ప్రాంతంలో పుట్టి తెలుగు ప్రాంతంలోకి ప్రవేశించిందంటారు. ఈ కళ గురించిన విశేషాలు పరిశీలిస్తే ఈ కళ ఇలా ఉంది. ఇందులో వాచకం, ఆహార్యం, ఆంగికం చక్కగా ప్రదర్శించ బడతాయి. 'తోలుబొమ్మలకు మనుషుల గొంతులు జోడించి పాటలూ పద్యాలూ దరువులూ సంభాషణలతో ఆయా పాత్రాలకు వాచికప్రయోగం జరుగుతుంది, మగ బొమ్మలకు పురుషులు, ఆడబొమ్మలకు స్త్రీలు గొంతులు జతచేస్తారు. బొమ్మలకు ఆయా పాత్రల సంభాషణలను

బట్టి చేతులు, కాళ్ళూ మొండెం, శరీరంమీది ఇతర అవయవాలూ కర్రల సహాయంతో కదిలిస్తూ అంగికాభినయాన్ని సృష్టిస్తారు. ఇవి బొమ్మలు గనుక సాత్వికాభినయానికి అవకాశంలేకపోయిన నేపథ్యంలో వారు చేసే సంభాషణలూ, కీర్తనలూ, రాగాలాపనలూ రసస్ఫోరకమై సామాజికులలో రోమాంచకం ప్రస్వేదాదులు కలిగిస్తుంటాయి. వీరికి రంగస్థలం నడివీధిలో పందిరి. ఆ పందిరికి ముందుభాగం వల్చని, తెల్లని చీర యాతముళ్ళతో కుట్టి, కట్టి, మిగతా మూడువైపులా గోనెబరకాలతో మూసేస్తారు. లోపల బొమ్మలనాడించేవారూ, పాడేవారూ, వాయిద్యాలవారూ ఉంటారు. తెరమీద బొమ్మలను కదిలిస్తూ తెల్లవార్లూ ప్రదర్శిస్తారు. యుద్ధ ఘట్టాలలో జరుగుతున్నదా అనిపించేలా చేస్తారు. ఈ బొమ్మలాటలు వేసేవారు ఆరేమరాఠీలే. తెలుగునాట హాస్యానికి పేరెల్లిన గాండోలిగాడూ బంగారక్క కేతిగాడూ జుట్టుపోలిగాడూ వీళ్లసృష్టే.

**ముగింపు**

పైన పేర్కొన్న జానపద కళారూపాలే కాకుండా కోస్తాంధ్ర ప్రాంతంలో యక్షగానాలు, తూర్పు భాగవతాలు, ఎర్రగొల్లల నాటకాలు, కామిక్ వేషాలు చెక్క భజన కోనసంబరాలు, బైటో భజన, బుట్ట బొమ్మలు మొదలయిన ప్రదర్శన కళలు ఉన్నాయి. అయితే దురదృష్టం కొద్దీ, ఇవాళ సరైన ఆదరణ లేక వీటిలో ఎన్నో కళలు అంతరించిపోతున్నాయి. నేడు విశ్వవిద్యాలయాల స్థాయిలో కొందరు పరిశోధకులు సాధ్యమయినంతలో ఈ కళారూపాలను సేకరించి భద్రపరుస్తున్నారు. అయితే ప్రభుత్వం వారు కూడా ఈ కళా రూపాలను ప్రదర్శిస్తున్న కళాకారుల జీవనభృతికి ఏదైనా మార్గం చూపిస్తే ఈ కళలు కొంత కాలమయినా సజీవంగా ఉంటాయి. అలాగే ఈ కళలకే జీవితాలను ధారపోసిన వయోజనులకు తగిన రీతిలో ఫించన్ పథకాన్ని ప్రవేశపెట్టి వృద్ధ కళాకారుల్ని ఆదుకోవడం ఎంతయినా అవసరమని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు**


1. డా. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి (2019) తెలుగు వారి జానపద కళారూపాలు, తృతీయ ముద్రణ, ఆకృతి ఆఫ్ ఆఫ్ సెట్ ప్రింటర్స్, హైదరాబాద్
2. డా. కసిరెడ్డి (1997) జానపద కళా దర్శనం (వ్యాస సంపుటి), ప్రథమ ముద్రణ, ఓం సాయి గ్రాఫిక్స్, హైదరాబాద్
3. ఎల్లోరా- జానపద సాహిత్యం, దీప్తి పబ్లికేషన్స్, హైదరాబాద్
4. జూలూరు గౌరీ శంకర్, పెన్నా శివరామకృష్ణ (2015) తెలంగాణ సంస్కృతి - కళలు, ప్రథమ ముద్రణ - శ్రీ బాలాజీ గ్రాఫిక్స్, హైదరాబాద్
5. డా. జి నాగయ్య - దాక్షిణ్యాత్య జానపద కళారూపాలు (1991)


★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# జానపద వృత్తి కళ - కాటికాపరుల కళా నైపుణ్యం మరియు వారి జీవన స్థితిగతులు



- సందెనబోయిన ప్రభాకర్
తెలుగు అధ్యాపకులు, నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నల్లగొండ.

**వ్యాస సంగ్రహం :**

భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక. ముఖ్యంగా మనదేశపు ఆత్మ గ్రామాలలోనే నివసిస్తుంది. గ్రామీణ భారతీయ సామాజిక నిర్మాణంలో జానపద వృత్తులు కేవలం ఆర్థిక వనరులుగానేకాక, ఆయా జన సముదాయాల అస్తిత్వానికి, సంస్కృతికి వెన్నెముకగా నిలుస్తున్నాయి. అటువంటి విశిష్టమైన వృత్తులలో 'కాటి కాపరుల' వృత్తి అత్యంత ప్రాచీనమైనది. వేద కాలంనాటి గోపాలక సంస్కృతి నుండి నేటి ఆధునిక కాలంవరకు, ఈవృత్తి సమాజానికి మరియు ప్రకృతికి మధ్య ఒక వారధిగా పనిచేస్తోంది. కాటికాపరుల జీవనశైలి ప్రకృతితో మమేకమై ఉండటంవల్ల, వారి ఆచార వ్యవహారాలు మరియు కళారూపాలు అత్యంత సహజసిద్ధమైన శోభను సంతరించుకున్నాయి. కాటికాపరుల కళా నైపుణ్యం కేవలం వినోదానికే పరిమితం కాకుండా, వారి దైనందిన శ్రమ నుండి ఉద్భవించిన ఒక జీవన వేదం. వారి జానపద గీతాలు, స్వయంగా తయారు చేసుకున్న వాయిద్య పరికరాలు మరియు వారి విశిష్టమైన కథన కళ మన మట్టి వాసనను ప్రతిబింబిస్తాయి. అయితే, నేడు మారుతున్న కాలంతో పాటు పట్టణీకరణ, మెట్టభూముల కొరత మరియు ఆర్థిక అనిశ్చితి వంటి అంశాలు వీరి వృత్తిని ప్రమాదంలో పడేస్తున్నాయి. సామాజికంగా మరియు విద్యాపరంగా వీరు ఎదుర్కొంటున్న సవాళ్లు వీరి సాంస్కృతిక వారసత్వాన్ని అంతరించిపోయేలా చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, వారి ఆర్థిక-సామాజిక స్థితిగతులను అధ్యయనం చేస్తూ, వారి అపురూపమైన కళా సంపదను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉంది.

**కీలక పదాలు :**

జానపద కళలు, కాటికాపరులు, పశుసంవర్ధక వృత్తి, గ్రామీణ జీవన విధానం, జానపద గీతాలు, సాంస్కృతిక వారసత్వం, ఆర్థిక పరిస్థితి, సమాజపు ఆత్మకళా వ్యవస్థ, ప్రజ్ఞాపాటవాలు, జాతకాలు చెప్పడం, ఇంద్రజాల విద్య, గొర్రెల మంద, పశుసంవర్ధక వృత్తి, శివ స్వరూపం, ఎముకలు మరియు గవ్వల దండలు, జీవనశైలి.

**జానపద కళలు పరిచయం :**

జానపద కళలు ఒక సమాజపు ఆత్మను ప్రతిబింబించే అద్దంలాంటివి. గ్రామీణ ప్రజల జీవనశైలి, భావోద్వేగాలు, సంప్రదాయాలు ఈ కళల ద్వారా వ్యక్తమవుతాయి. జానపద కళలలో వృత్తి ఆధారిత కళలకు ప్రత్యేక స్థానం ఉంది. కాటికాపరులు అనగా ప్రధానంగా పశువులను, ముఖ్యంగా గొర్రెల మందలను కాపాడే వృత్తిని చేపట్టే వారు. వీరి జీవన విధానం నిరంతరం ప్రకృతితో అను సంధానమై ఉండటం వల్ల, వీరి కళలు కూడా ప్రకృతికి

అత్యంత సహజంగా ఉంటాయి. చారిత్రక కోణంలో చూస్తే, భారతదేశంలో పశుసంవర్ధక వృత్తి వేద కాలం నుండి ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయి. గిరిజన మరియు గ్రామీణ సమాజాలలో అంతర్భాగమైన కాటికాపరులు కాలక్రమేణా తమకంటూ ఒక ప్రత్యేకమైన కళా వ్యవస్థను, సామాజిక నిర్మాణాన్ని ఏర్పరుచుకున్నారు. వీరి వృత్తి స్వరూపం కాలంతో పాటు కొన్ని మార్పులు పొందినా, ప్రాథమికంగా పశువుల పట్ల వీరికి ఉన్న అనుబంధం మాత్రం మారలేదు.

**కాటికాపారుల వృత్తి :**

కాటికాపరులు కేవలం శ్మశాన సంరక్షకులు మాత్రమే కాదు, వారు హిందూ ధర్మ శాస్త్రాల ప్రకారం మృత్యువుకు మరియు స్వర్గ ద్వారాలకు మధ్య వారధులుగా పరిగణించబడే ఒక విశిష్ట సంచార జాతి. వీరు తమను తాము సత్యసంధుడైన సత్యహరిచంద్రుని వారసులుగా చెప్పుకుంటారు. కాశీలో హరిచంద్రుడు కాటికాపరిగా పనిచేసిన పురాణ నేపథ్యం వీరి వృత్తికి ఒక పవిత్రతను, నైతిక బలాన్ని చేకూరుస్తుంది. వీరు శైవ ఆరాధకులు కావడంతో, మృత్యువును శివ స్వరూపంగా భావిస్తూ శ్మశానాలనే తమ నివాసాలుగా మార్చుకున్నారు.

కాటికాపరుల వృత్తి కేవలం అంతిమ సంస్కారాల నిర్వహణకే పరిమితం కాలేదు. వీరిలో బహుముఖ ప్రజ్ఞా పాటవాలు కనిపిస్తాయి. అంతిమ యాత్రలో మృతుల గుణగణాలను కీర్తిస్తూ వీరు పాడే గేయాలు మరణం పట్ల భయాన్ని తొలగించి, జీవిత సత్యాన్ని బోధిస్తాయి. నోటి నుండి పాములు, తేళ్లు, రాళ్లు తెప్పించడం వంటి ఇంద్రజాల విద్యల ద్వారా గ్రామీణ ప్రజలను అబ్బురపరిచేవారు. ఇది కేవలం వినోదం మాత్రమే కాక, వారి జీవనాధారంగా కూడా ఉండేది. గవ్వలు, తాళపత్ర గ్రంథాల సాయంతో జాతకాలు చెప్పడం వీరి అనుబంధ వృత్తి.

వీరి రూపం గంభీరంగా, భీతిగొలిపే విధంగా ఉంటుంది. పంచలోహ కిరీటం, నుదుట పెద్ద బొట్టు, కళ్లకు కాటుక, ఎముకలు మరియు గవ్వల దండలు ధరించడం ద్వారా వీరు ఒక ప్రత్యేక గుర్తింపును పొందుతారు. ఈ వేషధారణ వారిని సామాన్య జనం నుండి వేరు చేయడమే కాక, వారి వృత్తి పట్ల ఒక రకమైన 'అతీంద్రియ' గౌరవాన్ని కలిగిస్తుంది.ఒకప్పుడు సమాజంలో విడదీయలేని భాగంగా ఉన్న కాటికాపరులు, ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. కులాల వారీగా శ్మశానవాటికలు ఏర్పడటం, కనికట్టు విద్యలకు ఆదరణ తగ్గడంతో వీరి ఆదాయ వనరులు దెబ్బతిన్నాయి. నిలకడైన నివాసం లేకపోవడం (సంచార జీవనం), బాల్య వివాహాలు మరియు వ్యసనాల కారణంగా వీరు అభివృద్ధికి దూరమయ్యారు. తమ జీవనశైలి గిరిజన సంస్కృతికి దగ్గరగా ఉండటం వల్ల, తమను ఎస్టీ (ST) జాబితాలో చేర్చాలనేది వారి సుదీర్ఘకాల డిమాండ్. శ్మశానాలనే ఇల్లుగా మలుచుకుని, మరణాన్ని పండుగలా కీర్తించే కాటికాపరుల సంస్కృతి అంతరించిపోతున్న దశలో ఉంది. వీరి కళా నైపుణ్యాలను కాపాడుకుంటూనే, వీరిని ప్రధాన సామాజిక స్రవంతిలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**కాటికాపారుల కళా నైపుణ్యాలు :**

కాటికాపరుల కళా నైపుణ్యంలో జానపద గీతాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఈ గీతాలు ముందుగా రాసుకున్నవి కావు; ఇవి వారి హృదయాల నుండి ఆశువుగా (Spontaneous) వెలువడే భావ వ్యక్తీకరణలు. ప్రకృతి ఒడిలో పశువుల మధ్య గడిపే సమయంలో వారు పాడే పాటలు శ్రమను మర్చిపోయేలా చేస్తాయి. ఉదాహరణకు, పశువులను ఆత్మీయంగా పిలిచే పాటల్లో వాటిపై వీరికి ఉన్న మమకారం స్పష్టంగా కనిపిస్తుంది. వీరి సంగీత పరికరాల నైపుణ్యం ప్రశంసనీయం. వీరు ఖరీదైన పరికరాలపై కాకుండా, ప్రకృతిలో దొరికే వస్తువులతో స్వయంగా తయారు చేసుకునే వేణువు, డోలు మరియు కొమ్ములతో అద్భుతమైన రాగాలను పలికిస్తారు. ముఖ్యంగా ఏకాంతమైన అడవుల్లో లేదా కొండల ప్రాంతాల్లో వీరి వేణుగానం ప్రకృతిని మైమరిపిస్తుంది. కథన కళ వీరి జీవనంలో మరో ముఖ్యాంశం. పశువులను కాపాడే సమయంలో తోటివారితో పంచుకునే కథలు కేవలం కాలక్షేపం కోసమే కాకుండా, నైతిక విలువలను

మరియు వీరగాథలను భవిష్యత్ తరాలకు అందించే సాధనాలుగా ఉపయోగపడతాయి.

జానపద నృత్యాలు వీరి సామూహిక చైతన్యానికి నిదర్శనం. జాతరలు, పండుగల సమయంలో వీరు చేసే సమూహ నృత్యాల్లో ఒక రకమైన ఆదిమ శక్తి, ఉత్సాహం కనిపిస్తాయి.కాటికాపరుల పాటల్లో ఋతువుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా వర్షాకాల గీతాలు పచ్చని గడ్డిని, మేఘాల రాకను ఆహ్వానిస్తూ సాగుతాయి.

"మేఘాల మంటపం ముంచె వేళ..

గడ్డి పెరిగె గోచరంలో" వంటి గీతాలు వీరి ఉపాధికి ఆధారమైన ప్రకృతిపై వీరికి ఉన్న ఆశావహ దృక్పథాన్ని తెలియజేస్తాయి. పశువుల పట్ల వీరికున్న ప్రేమ అనన్య సామాన్యం. ఒక పశువు దారి తప్పినా లేదా అనారోగ్యం పాలైనా, అది తమ కుటుంబ సభ్యుడిని కోల్పోయినంత బాధను కలిగిస్తుందని వీరి 'బాధా గీతాలు' నిరూపిస్తాయి.

"నా గొర్రెలే నా బంగారం.. నా జీవితం మీతోనే" అన్న పంక్తులు వీరి వృత్తి పట్ల ఉన్న నిబద్ధతకు సాక్ష్యాలు.

**జీవన స్థితిగతులు మరియు సవాళ్లు :**

కాటికాపరుల జీవన విధానాన్ని విశ్లేషిస్తే, వీరి నివాసాలు ఎక్కువగా గ్రామాల అంచుల్లో లేదా అడవుల సమీపంలో ఉంటాయి. వృత్తి రీత్యా వీరు తరచుగా వలసలు వెళ్లాల్సి రావడం వల్ల తాత్కాలిక గుడిసెలలో నివసిస్తుంటారు. ఆహారం విషయంలో జొన్నలు, రాగులు, పాలు, పెరుగు వంటి బలవర్ధకమైన దేశీ ఆహారానికే ప్రాధాన్యతనిస్తారు. వీరి వస్త్రధారణ కూడా పని సౌలభ్యాన్ని బట్టి చాలా సరళంగా ఉంటుంది. ఆర్థిక పరిస్థితిని గమనిస్తే, వీరి ఆదాయం ప్రధానంగా పాలు, గొర్రెల విక్రయం మరియు ఇతర పశు ఉత్పత్తులపై ఆధారపడి ఉంటుంది. అయితే, ఈ ఆదాయం ఏ కాలంలోనూ స్థిరంగా ఉండదు. వాతావరణ మార్పులు, పశువుల వ్యాధులు వీరి ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తాయి. మార్కెట్ దళారుల వల్ల కూడా వీరు సరైన లాభాలను పొందలేకపోతున్నారు.

సామాజికంగా వీరు వెనుకబడిన వర్గంగానే పరిగణించబడుతున్నారు. దీనికి ప్రధాన కారణం విద్య పట్ల అవగాహన లోపించడం. నిరంతరం పశువుల వెంట ఉండటం, పేదరికం మరియు వలసల కారణంగా వీరి పిల్లలు పాఠశాలలకు వెళ్లలేకపోతున్నారు. ఇది వీరిని తరతరాలుగా సామాజిక వెనుకబాటుతనంలోనే ఉంచుతోంది. ఆధునికత ప్రభావం ఈ వృత్తిపై తీవ్రంగా ఉంది. పట్టణీకరణ వల్ల మేత భూములు తగ్గిపోవడం, నీటి సమస్యలు పెరగడం వల్ల పశుపోషణ భారంగా మారుతోంది. మరోవైపు, నేటి యువత ఈ కష్టతరమైన వృత్తిని చేపట్టడానికి ఆసక్తి చూపడం లేదు. వారు విద్య మరియు ఇతర ఆధునిక ఉద్యోగాల వైపు వెళ్లడం వల్ల ఈ అరుదైన వృత్తి కళ క్రమంగా క్షీణిస్తోంది. విద్యా స్థితిగతులపై ప్రత్యేక విశ్లేషణ అవసరం. వృత్తి అవసరం కోసం చిన్న వయసులోనే పిల్లలను పశువుల కాపరులుగా పంపడం వల్ల, విద్యాహక్కు వీరికి అందకుండా పోతోంది. తల్లిదండ్రుల్లో ఉన్న అవగాహన లోపాన్ని తొలగించి, వారి కోసం ప్రత్యేక విద్యా పథకాలను రూపొందించాల్సిన ఆవశ్యకత ఉంది.

ప్రభుత్వ చర్యలు వీరి అభివృద్ధికి కీలకం. పశు వైద్య సేవలను అందుబాటులోకి తేవడం, ఆర్థిక సహాయం అందించడం మరియు పశువులకు భీమా సౌకర్యం కల్పించడం వంటి చర్యలు వీరిని ఆర్థికంగా ఆదు కుంటాయి. అలాగే, వీరి జానపద కళలను గుర్తించి, వాటిని ప్రదర్శించడానికి వేదికలను కల్పించడం వల్ల వీరి సాంస్కృతిక వారసత్వం కాపాడబడుతుంది.కాటికాపరుల కళలు మరియు జీవన విధానం గ్రామీణ సంస్కృతికి ముఖ్యమైన భాగం. అయితే ప్రస్తుతం ఇవి సంధి కాలంలో ఉన్నాయి. ఒకవైపు వారసత్వ కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత, మరోవైపు మారుతున్న సామాజిక అవసరాల మధ్య సమతుల్యత దెబ్బతింటోంది.వీరి స్థితిగతులను మెరుగుపరచడానికి విద్యా ప్రోత్సాహకాలు అందించాలి. వీరి జానపద గీతాలను, కళా రూపాలను రికార్డు చేసి భవిష్యత్తు తరాలకు అందించాలి. ప్రభుత్వం నుంచి మార్కెట్ సదుపాయాలు మరియు సబ్సిడీలను పెంచాలి.

**ముగింపు :**

కాటికాపరుల వృత్తి ఒక కేవలం పని మాత్రమే కాదు,

అది ఒక సంపూర్ణ జీవన విధానం. ప్రకృతిని ప్రేమించడం, జంతువులతో కలిసి జీవించడం మరియు కష్టాల్లోనూ పాటలతో సంతోషాన్ని వెతుక్కోవడం వీరి వద్ద నుండి సమాజం నేర్చుకోవాల్సిన పాఠం. వీరి కళలు మన సంప్రదాయ వారసత్వ సంపద.ఈ పరిశోధన ద్వారా తేలిందేమిటంటే, కాటికాపరుల కళా నైపుణ్యం అత్యున్నత మైనది. వారి పాటలు, కథలు మన మట్టి వాసనను కలిగి ఉంటాయి. వారి సామాజిక, ఆర్థిక సమస్యలను పరిష్క రించడం ద్వారానే ఈ సంస్కృతిని సజీవంగా ఉంచ గలము. కాటికాపరుల వృత్తిని మరియు వారి అమూల్య మైన కళలను సంరక్షించడం మనందరి సామాజిక బాధ్యత. సాంకేతికత ఎంత పెరిగినా, ప్రకృతితో ముడిపడి ఉన్న ఈ మానవీయ సంబంధాలు, కళలు అజరామర మైనవి.

**ఆధార గ్రంథాలు :**


1. జానపద విజ్ఞానం - డా. జి. ఎస్. మోహన్
2. తెలుగు జానపద గీతాలు - డా. బి. రామరాజు
3. గ్రామీణ సంస్కృతి అధ్యయనం - కె. వి. రమణ
4. ఫోక్ కల్చర్ ఆఫ్ ఇండియా - పి. సుబ్బారావు
5. పశు సంవర్ధక వృత్తులు - ఎన్. గోపాల్
6. జానపద ప్రదర్శన కళారూపాలు - మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి


★★★

Vol. 23 | Spl. Issue 05 | May 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# బుడగ జంగాలు - వృత్తి జీవన చిత్రణ



- డా॥. ఐండ్ల సంధ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్ (తెలుగు), తారా కాలేజ్ (ఎ) సంగారెడ్డి.

**వ్యాస సంగ్రహం :**

జంగములు, ముఖ్యంగా వీరశైవ జంగములు, హిందూ శైవ సంప్రదాయానికి చెందిన పూజారులు, గురువులు మరియు శివభక్తులు. వీరు తమను శివుని నుంచి పుట్టినవారిగా భావిస్తూ, వర్ణవ్యవస్థకు అతీతంగా జీవిస్తారు. బసవ పురాణం వంటి గ్రంథాలలో వీరిని శివ శిష్యులుగా వర్ణించారు. జంగములు శ్రీశైలం, కేదార్నాథ్, వారణాసి వంటి పవిత్ర క్షేత్రాలలో పూజారులుగా పని చేస్తారు. జంగములలో రెండు ప్రధాన వర్గాలు ఉన్నాయి. చర జంగములు (భిక్షాటన చేస్తూ తిరిగేవారు) మరియు స్థిరంగా దేవాలయాల్లో పూజలు చేసే వీరశైవ జంగములు. జంగమ దేవరలను సాక్షాత్తు శివుడిగా భావించి ప్రజలు వీరిని గౌరవిస్తారు. శైవ సంప్రదాయ ప్రచారంలో వీరి పాత్ర ముఖ్యమైనదిగా చెప్పవచ్చు. సామాజికంగా వీరు గౌరవనీయ స్థానం పొందినా, ఆర్థికంగా వెనుకబడిన వర్గమే. బేడా జంగం, మాల జంగం, మాదిగ జంగం వంటి ఉపవర్గాలు షెడ్యూల్ కులాల్లో చేరాయి. వీరు క్షత్రియులకు గురువులుగా కూడా వ్యవహరించారని చెప్పవచ్చును.

వీరశైవ సంప్రదాయంలో జంగములు బ్రాహ్మణుల స్థానాన్ని అధిగమించి పూజారులుగా మారడం. దీనివల్ల కొంత విభేదం ఏర్పడింది. అయినప్పటికీ, శివభక్తి, ఆత్మ జ్ఞానం కలిగిన బ్రాహ్మణులు వీరశైవాన్ని స్వీకరించడం జరిగింది. జంగములు మతప్రచారకులుగా ఊరూరా తిరుగుతూ భిక్షాటన చేసి జీవిస్తారు. గంట జంగాలు, ముకెబర్ల జంగాలు వంటి వర్గాలు సంగీతం, వేషధారణ, శైవభక్తి ప్రచారంతో ప్రజలను ఆకర్షించడం జరుగుతుంది. వీరి జీవన విధానం సాదాసీదాగా ఉండి, శాకాహార జీవనం, లింగధారణ, విభూతి ధరించడం వంటి లక్షణాలు ప్రధానంగా మనకు కనిపిస్తాయి. సమాజంలో మతసామరస్యాన్ని, శివభక్తిని విస్తరించడమే వీరి ముఖ్య లక్ష్యం.

**కీలకపదాలు :**

జంగములు, వీరశైవం, శైవ మతం, జంగమ దేవర, భిక్షాటన, లింగదారణ, శివభక్తి, బసవన్న పౌరోహిత్యం, చర జంగములు, గంట జంగాలు, ముకెబర్ల జంగాలు, మతప్రచారం, వర్ణవ్యవస్థకు అతీతం, శాకాహారం, ఆత్మజ్ఞానం

**బుడగ జంగాలు :**

బుడగ జంగాలను వీరశైవ జంగములు అని కూడా అంటారు. వీరు హిందు శైవ శాఖ పూజారులు గురువులు మరియు బసవ పురాణాలలో శివ శిష్యులు అని పేరు.

జంగములు శివాలయాలలో అర్చకులుగా కఠిన శేకాహారులు. వీరు శ్రీశైలం, కేదార్నాథ్, కాశీ, వారణాశి వంటి క్షేత్రాల్లో పురోహితులగా పనిచేస్తున్నారు. జంగం సామాజికంగా ఉన్నత కులం అయిన ఆర్థికంగా వెనుకబడిన కులం అని చెప్పవచ్చు. జంగం అనే పదం తమ కులాల చివర పెట్టుకుని అనేక కులాలు వచ్చాయి అందులో బేడా (బుడగ జంగం, మాల జంగం, గంట జంగం, మాదిగ జంగం వంటి కులాలు వచ్చాయి వీటిని షెడ్యూల్ కులాలలో పెట్టారు. క్షత్రియులకు వీరు గురువులు. జంగములలో కొంతమంది జంగమ దేవర వేశంలో ఊరూరికి తిరుగుతుంటారు. జంగందేవరను సాక్షాత్తు శివుడే అని భావించి తమ గృహాలలోనికి ఆహ్వానిస్తుంటారు. రామాయణంలో సీతమ్మను ఎత్తుకు పోవటానికి రావణాసురుడు జంగమ దేవర వేశంలో వచ్చాడు కాబట్టి సీతమ్మ తన దగ్గరికి శివుడు వచ్చాడని భావించి గీత దాటింది. దీనిని బట్టి మనం జంగముల గొప్పతనాన్ని అర్థంచేసుకోవచ్చును. జంగమ దేవరలు మరియు వీరశైవ జంగములు ఒక్కటి కాదు జంగమ దేవరలు చర జంగాములు మరియు భిక్షాటన చేస్తూ ఉంటారు. కానీ ఈ వీరశైవ జంగములు వీరు శివాలయాల్లో పూజారులుగా వున్నారు. జంగములు బ్రహ్మచే నిర్దిష్టమైన వర్ణ వ్యవస్థను పాటించరు ఎందుకనగా వీరు బ్రహ్మచే నిర్దిష్టమైన వర్ణ వ్యవస్థలో ఉండరు. ఎలాగైతే బ్రాహ్మణులు తాము బ్రహ్మ నుంచి వచ్చామని భావిస్తారో, జంగములు తాము శివుడు నుంచి వచ్చామని భావిస్తూ ఉంటారు. వీరశైవులకు బ్రాహ్మణులు పూజారులు కారు, జంగమలు వీరికి పూజ్యులు. అంటే ఇక్కడ బ్రాహ్మణాధిపత్యము ఉంటుంది. పూజ్యత్వము పోయాయి. ఆగమాలు తెలిసిన బ్రాహ్మణులకు ఇది తప్పు కాదని తెలిసినా, ఇతర బ్రాహ్మణులకు నచ్చక పోవడానికి అసలు కారణం ఆధిపత్యం పోవడం. అంత వరకూ ఊరూరా తిరుగుతూ తమ ప్రచారమేదో తాము చేసుకొనే జంగమలు ఉన్నటుండి బ్రాహ్మణుల స్థానాన్ని పొందారు. బ్రాహ్మణులు కూడా ఈ జంగములను ఆరాధించటం మరియు పూజించడము కూడా జరిగింది.

బసవ పురాణంలో జంగమల అధికారము రాజుకన్నాకూడా ఎక్కువగా చూపబడింది. వాళ్ళు తమ ప్రాంతపు రాజునైనా సరే అధిక్షేపించి హింసకాత్మక చర్యలు చేపట్టడం కనిపిస్తుంది. భక్తుడైన బసవన్న కూడా ఒక్కోసారి జంగమల చర్యల వెనక హేతుబద్ధత గ్రహించలేడు. అతడు జంగమల సర్వజ్ఞతను ప్రశ్నించరాదనే నమ్మకాన్ని మాత్రమే ప్రతిపాదిస్తాడు. బండారు తమ్మయ్యగారి ప్రకారము సోమనాథుడు కూడా జంగమ కులానికి చెందినవాడే. జంగములు పండితులు, ఈనాటికి తెలుగునాట బ్రాహ్మణేతర వీరశైవుల కోసం పౌరోహిత్యము చేస్తుంటారు. మతగ్రంథాలకు కర్తలు, శాస్త్ర పండితులు అయిన బ్రాహ్మణుల వల్లెనే జంగములు కూడా బ్రాహ్మణేతర వీరశైవులకు పౌరోహిత్యము చేస్తారు. ఈ కులానికి చెందిన వారు చాలామంది పండితులు, కవులు, గాయకులుగా కూడా ఉన్నారు. బసవన్న పుట్టినప్పుడు అతనిని దీవించాడానికి జంగమయ్య ఇంటికి వస్తాడు. అతనిని బ్రాహ్మణులైన బసవని తలిదండ్రులు ఆరాధిస్తారు. అతని మాటలను శిరసావహిస్తారు. అలా బసవనికి శివదీక్షనిస్తాడు ఆ జంగమయ్య. అంటే ఆనాటి లింగధారులైన జంగమలను బ్రాహ్మణులు గౌరవించి కొలిచేవారని అర్థమవుతుంది. ఇదివరకు చెప్పినట్లుగా బసవన్నకన్నా ముందే వీరు దేశంలో అన్నిచోట్లా ఉన్నారు. వీరి ధర్మాన్ని ఎవరికైనా ఇవ్వడం శాస్త్రం ఒప్పుకుంటుంది. కాబట్టి బసవన్న దాన్ని వాడుకున్నాడు. సామాన్యులకు దీక్షనిచ్చాడు. గుడిలోకి పోనివ్వకపోతే పోనీ మీ ఇష్టలింగానికి పూజించుకోమన్నాడు. ఇది ఘర్షణకు కారణమైనదనే చెప్పాలి. బసవన్న చెప్పాలనుకునే విషయం అంతంలో ఇలా “స్థావరక్కలి వుంటు జంగమక్కలివిళ్ళ” అనే ముగింపును చెప్పారు. దేవాలయంలోని స్థావర లింగంలో మంత్ర సంస్కార ప్రభావంతో శివుడు నివసిస్తాడు. అదే జంగమ రూపములో శివుడు ఎల్లవేళలా ఉంటాడని సిద్ధాంత శిఖామణిలో ఉందని తెలుస్తుంది. అగ్నిష్టోమాది క్రతువులు, యజ్ఞోపవీత నిషిద్ధము, బలి నిషేధం, కర్మకాండ నిషేధం వంటివి ఆగమాలు గ్రహించని బ్రాహ్మణులకు తమ సంప్రదాయాలకు విరుద్ధంగా అనిపిస్తాయి. ఇలాంటి

కారణాలవల్ల బ్రాహ్మణులకు వీరశైవులంటే పడకపోయినా, చాలామంది శివభక్తి కలిగి ఆత్మజ్ఞాన వివేచనము కలిగిన బ్రాహ్మణుల చేత వీరశైవం స్వీకరించడం జరిగిందని చెప్పవచ్చు. బసవన్నలాగా వారు జంగమలను, శరణులను పూజించడము కూడా జరిగింది. ఈ జంగములు ఆది శంకాచార్యులవారు కాలం కన్నా ముందే అన్ని చోట్ల విస్తరించి ఉన్నారు మరియు అప్పటికే వీరు శివాలయాల్లో అన్ని చోట్ల పురోహితులుగా మరియు గురువులుగా ఉన్నారు. అయితే వీరశైవం ప్రపంచమంతా వ్యాపించ టానికి వేరే కారణం, వీరశైవం ప్రపంచమంతా వ్యాపించిన తర్వాత వీరిని వీరశైవ జంగములుగా పిలవటం జరిగింది.

కొందరి వీరశైవ జంగముల ఇంటిపేర్లను మనం గమనించవచ్చును. అందెలిమఠం, బంగారిమఠం, బన్నూరు మఠం, బెనహల్మఠం, బుక్క సాగరమఠం, చందర్గిమఠం, చిక్కొజ్జనిమఠం, ధవళగిమఠం, గాద్గిమఠం, గొలసంగీ మఠం, హంజాగిమఠం, హారతిమఠం, హీరేమఠం, హెుంగళమఠం, కంప్లిమఠం, కెంభవిమఠం, మద్దాపూర్ మఠం మఠంపతి, నాగలోటిమఠం, నడిమఠం, నేర్లగంటి, పాల్కురి, నిషానిమఠం, ఒడిసో మఠం, పారాదిమఠం, పత్రిమఠం, పురాణిక మఠం, సాలిమఠం, శాస్త్రిమఠం, శిశంబ్రిమఠం, సిర్సాలమఠం, సోబారద్మఠం, సుత్తూరు మఠం, తెల్గిమఠం, ఉజ్జయినిమఠం, యవంటూ రిమఠం, వంత్మూరిమఠం. యెరేగంబల్లిమఠం, ఇల్వకర్తి, పిడుపర్తి, స్మరారి, రంగి, గంగపట్టణపు, కపిలవాయి మొదలైనవి.

కవులు కొందరు వర్ణించిన తీరు ఈ క్రింది విధంగా ఉంది దాయాదుల్వలె గుబ్బచన్ను లొలయస్ ధావళ్య నేత్రాంబుజ చ్ఛాయ ల్తాండవ మాడ గేరి పురుష స్వాంతమ్ముల నృన్మథుం డేయం జంగమువారి చంద్రముఖి విశ్వేశార్చనా వేళలస్ వాయంచెం గిరిగిండ్లు బాహు కుశల వ్యాపార పారీణతస్ - శ్రీనాధుడు. రచనలో కనిపిస్తుంది. అలాగే కాళిదాసు రచనలో కూడా చూడవచ్చు.

- "కొత్తెమజంగమబో డిత. కుం గ్రేగంటి చూపుసన్న దనరాక యెరింగింపుచు" అన్నాడు వినుకొండ వల్లభరాయుడు.
- 'గేహే గేహే జంగమా హేమవల్లీ'' అన్నాడు కాళిదాసు.
- "విసపు నాగులను సంక నెత్తుకొని జంగమదేవర (శివుడు) కాలనృత్యం చేస్తాడు."
- "జంగము దేవర శివుడేను సుమ్మీ జంగము దేవర దేవదేవూడు జంగము దేవర నా దేవరన్నా" అని తెలిపిన గౌరిని జంగమదేవర అయిన శివునికిచ్చి పెళ్ళి జరిపిస్తారు.

కూచిమంచి తిమ్మకవి పార్వతీ వల్లభ శతకం, కుక్కుటేశ్వర శతకంలో ప్రస్తావించిన కొన్ని కులాలు

అబ్బబ్బ కిందటే డప్పయ్య తీర్తాన
జోలె జంగమ కిస్తి సోలెడప్పు
సాతాని జియ్యరు సతికితే పోయిస్తి
కొల్లగా గుల్లెడు సల్ల బొట్టు
లంక సత్తెల వాడు పొంకాన పొగిడితే
మాలదాసరి కిస్తి మానెదూడ
లేదాలు వాగితే యెల్లుబొట్టయ్యకు
కొలకుండ దోసెడు కొర్రలిస్తి

వీరిలో మిండ జంగాలు గంట జంగాలు కూడా ఉన్నారు.

మిండ జంగాలంటే వేశ్యాలోలురై వారి ఇండ్లలోనే వదే ప్పూట ఓగిరములు పంపుతుండగా" పన్నెండు వేలమంది మిండ జంగములు వృత్తి. ఉండి భోగించే వారని, గంట జంగాలు శైవ, వీర శైవ మతానికి చెందిన వీర ముష్టులూ, జంగాలూ, వారి వారి కళా. ఉత్తరాంధ్రలో ఉన్న కొంతమంది రాజులకు వీరే గురువులు. రూపాలే కాకుండా ఒంటరిగా జంగం దేవర వేషంలో ఇంటింటికీ తిరిగి యాచిస్తారు. సాంబసదాశివ సాంబ సడాశివ, శంభో శంకరా అంటూ శంఖాన్ని పూరిస్తూ, నందిమకుటంగా గల గంటను వాయిస్తూ, బసవ పురాణంలోని బసవేశ్వరుని సూక్తులను ఉదాహరణలతో కడుచక్కగా వివరిస్తారు.

బసవేశ్వరుడుగా వేషధారణను తీర్చి దిద్దుకోవడమే కాకుండా వారిలో ఎంతో పూజ్యభావం గోచరిస్తుంది. పైనుంచి క్రిందికి అంగరఖాను తొడుగుతారు. తెల్లని

తలగుడ్డనూ చుడతారు. మెడకు పొడవాటి అంగ వస్త్రాన్ని ధరింస్తారు. ముఖానికి గంభీరంగా విభూతి రేఖలను దిద్దుకుంటారు. గంట వాయిస్తూ, శంఖం పూరిస్తూ వచ్చే గంట జంగాన్ని సాక్షాత్తు బసవేశ్వరుడని ఊహించి ఇంట్లో వారంతా భిక్షను వేస్తూంటారు. భిక్షను స్వీకరిస్తూ మంత్రాన్ని ఉచ్చరిస్తూ విభూతిని ఇస్తుంటారు. శంభో శంకర అంటూ, గంట చుట్టూ ఒక పుల్లను త్రిప్పుతూ ఓంకార నాదాన్నీ పలికిస్తారు. పిన్నలూ, పెద్దలూ అందరూ పూజ్య భావంతో విభూతిని స్వీకరిస్తారు. ఈ రకంగా గంట జంగాలు వీర శైవ మతాన్ని ప్రబోధించే ప్రచారకులుగా జీవిస్తూ ఊరూరా తిరుగుతూ వుంటారు. అంతేకాకుండా ముకెబర్ల జంగాలనుచూసినట్లైతే వారిమకుటం

"హైరోసైరో- బిట్రో నిట్రో
జగితగ - బిట్రా నిట్రో" ఇలా

మకుటంగా గల బిట్రో నిట్రో పదం కంచు జాగంట పై హృదయాహ్లాదంగా వినిపింప బడుతుంది. ఈ పదా లను పాడే వారు ముకెబర్ల జంగాలు. ఈ ముకెబర్ల జంగా లనే తెగ వారు, కాకతీయ రాజ్య పరిపాలన కాలంలో వారి ఆస్థానంలో వంది మాగదులుగా వున్న శైవులు, ఈ జంగాలు తెలంగాణా లోనూ అటు శ్రీకాకుళం జిల్లా లోనూ వీరు జీవిస్తున్నారు. ముకెబర్ల జంగాలు బిట్రేశ్వరుడు నిట్టేశ్వరీ దేవి అనే దేవుళ్ళను ఈ నేటికి పూజిస్తున్నారు.

బిట్రేశ్వరుడంటే ఈశ్వరుడని, నిట్రేశ్వరి అంటే పార్వతి అని చెపుతారు. ముకెబర్ల జంగాలు, కాని శివ పార్వతులకు శైవ పురాణాల్లోగానీ, ఇతర ఇతిహాస గ్రంథాల్లోగానీ ఎక్కడా బిట్రేశ్వర, విట్టేశ్వరి పేర్లు ఉన్నా ఉదాహరణ వాఙ్మయములు లేవు. వారు శైవులవడం వల్లా వారి ఇలవేల్పు శివ పార్వతులను స్తుతిస్తూ ఎంతో పసందైన పాటలను పాడుతారు. వారు పాట ప్రారంభించ బోయే ముందు నాంది ప్రస్తావనగా ఇష్ట దేవతల్ని ప్రార్థన చేస్తారు.

**వీరి జీవన విధానం :**

గతంలో జంగాలకు కొన్ని గ్రామాలు మిరాశాలు ఉండేవి. కాని ప్రస్తుతం అవన్ని కాలగర్భంలో కలిసి పోయాయి. భోళాశంకరుడి నిరాడంబరం, బవవేశ్వరుడి మత సామరస్యం పుణికిపుచ్చుకున్న జంగమ కులస్తుల జీవనశైలి మనకు ఇక్కడ విభిన్నంగా కనిపిస్తుంది. భిక్షాటన వీరి సంప్రదాయం. వీరిలో కొందరు శివాలయాల్లో పౌరోహిత్యం చేస్తుండగా, మరికొందరు మఠాల్లో సేవ చేస్తుంటారు. ఎవరేది చేపట్టినా ధర్మప్రచారమే వీరి ప్రధాన ఆశయం. స్త్రీ, పురుషులనే తేడాలేకుండా అందరూ మెడలో లింగాన్ని ధరించి నుదుట వీభూదితో దర్శన మిస్తుంటారు. శాకాహారులైన వీరు మన రాష్ట్రంలో మెదక్, మహబూబ్ నగర్, రంగారెడ్డి, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఎక్కువగా నివసిస్తుంటారు. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, జిల్లాలో కూడా ప్రస్తుతం కనిపిస్తున్నారు. బలిజలకు వీర శైవ లింగా యత్లకు గురువులు. వారి నుంచి బియ్యం, పప్పు, కూర గాయలు భిక్షగా తీనుకుంటారు. శివాలయాల్లో పౌరోహిత్యం చేసేవీరికి డొక్క నిండడంలేదు. రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో శివాలయాలు ఉన్నా, ధూప దీప నైవేద్యాలకు నోచుకున్నవి చాలాతక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే దేవాలయాల్లో అర్చన చేస్తే గ్రామ పెద్దలు నెలకు రెండు నుంచి మూడు వందల రూపాయ లకు మించి ఇవ్వని పరిస్థితి. శ్రీశైల దేవస్థానం నిర్వ హిస్తున్న వేదపాఠశాలలో కూడా వీరు తమ పిల్లలను చదివిస్తున్నారు.

**ఆధార గ్రంథాలు :**


1. బసవ పురాణం - పాల్కురికి సోమనాధుడు
2. పండితారాధ్య చరిత్ర - పాల్కురికి సోమనాధుడు
3. శ్రీ కాళహస్తీశ్వర శతకం - ధూర్జటి
4. పార్వతీ వల్లభ శతకం - కూచిమంచి తిమ్మకవి
5. క్రీడాభిరామం - శ్రీనాథుడు
6. ఆముక్తమాల్యద - శ్రీకృష్ణదేవరాయలు


★★★

# పరిచయం



నా పేరు : **డాక్టర్ యన్. అరుంధతి**

అమ్మానాన్నలు : కీ.శే. రాధాబాయి, రామారావు

జీవన సహచరుడు : డి. రాజు

పిల్లలు : అక్షర, నిథీష్

విద్యార్హతలు : M.A. (Telugu), T.P.T., SET, NET, Ph.D.

విద్యాభ్యాసం

పాఠశాల విద్య : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తలమడ్ల, కామారెడ్డి జిల్లా.

కళాశాల విద్య : ఇంటర్ - బై.పి.సి. - సాందీపని జూనియర్ కళాశాల, కామారెడ్డి.

డిగ్రీ - BA (L) - సాయం ప్రాచ్య విద్యా పరిషత్ ఓరియంటల్ డిగ్రీ కళాశాల, కామారెడ్డి.

పి.జి. : MA (తెలుగు) హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ, హైదరాబాద్.

పరిశోధన : నిజామాబాద్ జిల్లా యక్షగానాలు - సమగ్ర అధ్యయనం అనే అంశంపై పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ నుండి Ph.D. పట్టా పొందారు.